
# గొంతులేని వారి గొంతుక



# అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక


PEPE
గాలి... నీరు... భూమి... అడవి... తీరం... ప్రజలహక్కు
మానవ హక్కుల వేదిక (HRF)

అరుణతార
సాహిత్యసాంస్కృతిక మాసపత్రిక

2009
అక్టోబర్ – డిశంబర్

278

సంపాదకుడు
**సి. ప్రసాద్**

మేనేజర్
**ఎస్. రవికుమార్**
5-1307,
దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు,
కడప జిల్లా – 516 360.
సెల్ : 9866021257

రచనలు పంపవలసిన చిరునామా :
**టి. కృష్ణాబాయి**
9-19-3
CBM కాంపౌండ్
విశాఖపట్నం – 530 003.

# సంపాదక లేఖ

మూడు దశాబ్దాల తెలుగు ప్రజల పోరాట చరిత్ర నుండి విడదీయలేని మూర్తిమత్వం బాలగోపాల్. ఆయన నేతృత్వంలో పౌరహక్కుల సంఘం, మానవ హక్కుల వేదిక ఒక గొప్ప సామాజిక ప్రయోగంగా హక్కుల ఉద్యమాన్ని విస్తరింపజేశాయి. దేశంలో అణగారిన ప్రజల, కులాల, తెగల, జాతుల, మతమైనారిటీల, మహిళల, ప్రాంతాల ఆకాంక్షలకు హక్కుల ఉద్యమ పతిపత్తినందించాయి. ఆ సంస్థల సామూహిక స్వరంగా బాలగోపాల్ పలుకులోని చైతన్యం తెలుగు సామాజిక చరిత్రలో సజీవంగా ఉంటుంది. బాలగోపాల్‌ను దాటి ఆయన అందించిన చైతన్యం ప్రజా జీవితంలో నిత్యం వికసిస్తూనే ఉంటుంది.

విరసం నుండి, విప్లవోద్యమం నుండి, మౌలికంగా మార్క్సిజం నుండే వైదొలగిన వారందరివలె బాలగోపాల్ కూడా వాటన్నింటి మీద తీవ్ర విమర్శలు చేశాడు. మాటలు మాటలకోసమేకాని ఆయన ఆచరణీయ వ్యక్తిత్వం వల్ల విరసం, విప్లవోద్యమం బాలగోపాల్ ప్రతి వ్యాఖ్యను పరిగణలోకి తీసుకున్నాయి. మార్క్సిజానికి, వర్గపోరాటానికి వ్యతిరేకంగా ఆయన చేసిన విశ్లేషణలన్నిటితో తలపడవలసి వచ్చింది.

విప్లవంతో ఉంటూ ఒక క్రమంలో మార్క్సిజానికి వ్యతిరేకంగా తయారైన వారెందరో ఉన్నా బాలగోపాల్‌తో జరిగినంత సంవాదం మరెవరితోనూ జరగలేదు. నేరుగా వాద ప్రతివాదాల రూపంలో కాకపోయినా పౌరహక్కులు, సాహిత్య విమర్శ, విప్లవాచరణ, మార్క్సిస్టు సిద్ధాంతం మొదలైనవాటిలో ఆయన సూత్రీకరణలన్నిటినీ ఎదుర్కొని మార్క్సిస్టు అవగాహన మరోసారి చెప్పాల్సి వచ్చింది. ఆయన ప్రజా ఆచరణను హృదయానికి హత్తుకుంటూనే ఈ పని చేయవలసి వచ్చింది.

అక్టోబర్ 8 వతేదీన అలాంటి ఒక గొప్ప ఆలోచనా జ్వాల అర్థాంతరంగా ఆరిపోయింది. ఆయన మరణం తీరని లోటని, యిక అంతా అంధకారమేననీ అనడం బాలగోపాల్ స్ఫూర్తికి వ్యతిరేకం. ఆయన అవసరాన్ని మనం తీర్చవలసి ఉన్నది. ఆయన అందించిన ప్రజాస్వామిక విలువలను ఉన్నతీకరించవలసి ఉన్నది. అంతకంటే ముందు మనం బాలగోపాల్‌ను పునర్దర్శించ వలసి ఉన్నది. పునర్నిర్మించవలసి ఉన్నది. కేవలం రాసినవాడు, కేవలం పనిచేసిన వాడు కాదాయన. ఆ రెండింటి మేలు కలయిక. చురుకైన మార్క్సిస్టుగా మొదలై ఉదారవాద సిద్ధాంతాలను చేరుకున్నాడు. అందువల్ల ఆయన్ను ఆ మూలాగ్రం విశ్లేషించాలి. ఆయన మార్క్సిజాన్ని కాదనుకున్న తర్వాత చేసిన వాదనల గురించి చర్చ జరిగిందిగాని, అంతకుముందు రోజుల్ల కూడా మార్క్సిస్టుగా ఆయన ఏమిటి? అనేది చాలా ముఖ్యం.

నిజానికి మార్క్సిస్టు అని ఏదో ఒక ప్రమాణాన్నో, కొన్ని ప్రమాణాలనో ఆధారం చేసుకొని నిర్ధారించలేం. బాలగోపాల్‌లాగా బహుముఖీన వ్యక్తిత్వం ఉన్న వ్యక్తుల విషయంలో ఈ పని చాలా కష్టమే. అన్నీ ముఖ్యమైనవే అయినా, పరస్పర సంబంధమున్నవే అయినా మార్క్సిజాన్ని ఒక సామాజిక శాస్త్రీయ సిద్ధాంతంగా బాలగోపాల్ తొలినాళ్ల నుంచి ఎలా అర్థం చేసుకున్నాడు? సామాజిక సిద్ధాంతకారునిగా దానితో ఎలా వ్యవహరించాడు? అనేది చాలా కీలకం. ఈ ప్రశ్నలు ఆనాటి విప్లవ ఆలోచనారంగం మొత్తానికి వర్తిస్తాయని అంగీకరిస్తూనే - నిర్దిష్టంగా 1993 నుంచి మార్క్సిజం మీద బాలగోపాల్ విమర్శలను 1983 నుంచి ఆయన మార్క్సిస్టు చింతనాక్రమంతో వేరు చేసి చూడకూడదు. కోశాంబి ప్రేరణతో మార్క్సిస్టు అయిన ఒక ఆలోచనాపరునిలో చారిత్రక దృక్పథం ఎలా ఉన్నది? చాలా సమస్యలను ఆస్తి సంబంధాల్లో వివరించిన వ్యక్తిలో మార్క్సిస్టు రాజకీయఅర్థశాస్త్ర అవగాహన ఎలా ఉన్నది? ఆయన మార్క్సిజాన్ని తత్వశాస్త్రంగానే చూశాడా? సామాజిక సిద్ధాంతంగా కూడా చూశాడా? అనే వైపునుంచి ఆయన ఆలోచనా పరిణామాన్ని చూస్తే బాలగోపాల్ ఏమిటి? అనే విషయం తేలుతుంది. ఆయన విలువల అభిభాషణకు సిద్ధాంతపరమైన అర్థమేమిటి?విలువల ప్రాతిపదిక అనేది మేథోరంగంలో ఒక పొజిషన్ తీసుకోడానికి పనికి వచ్చినంతగా సామాజిక విశ్లేషణా పద్ధతి అవుతుందా? లేకుంటే విలువలే లక్ష్యాలవుతాయా? బాలగోపాల్ గురించి మాట్లాడుకోవడమంటే ఇవన్నీ పట్టించుకోవడమే.

బాలగోపాల్ సాన్నిత్యాన్ని , ప్రభావాన్ని పొందడమేగాక అంతులేని సంఘర్షణపడిన విప్లవశిబిరం ఈ పని చేయవలసి ఉన్నది . ఈ సంచికలో అదెంత ఉన్నదోగాని ఉద్దేశ్యమైతే ఇదే.

| | | |
|---|---|---|
| ఈ సంచిక వెల | : | 25 రూ. |
| సంవత్సర చందా | : | 100 రూ. |
| జీవితచందా | : | 1000 రూ. |

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి. డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.

## ఈ సంచికలో...


పేజి 3 : **సంపాదకీయం...**

పేజి 5-54

**వ్యాసాలు**

బాలగోపాల్ సాహిత్య విమర్శ : వి.చెంచయ్య
మధ్య తరగతి బుద్ధిజీవుల ఆదర్శం : అరుణ్
కుల సమస్యపై బాలగోపాల్ : కె.సత్యనారాయణ
బాలగోపాల్ చారిత్రక దృష్టి : వకుళాభరణం రామకృష్ణ
మహోన్నత మానవతావాది : మనోరంజన్ మహంతి
అవసరమైన సందర్భంలో లేకుండా పోయారు : నల్లూరి రుక్మిణి
సిద్ధాంత నిరంకుశత్వం తగదన్నవాడు : కె.జి.కన్నబిరన్
బాలగోపాల్ జీవన సందేశం : పాణి
పౌరహక్కుల పోరాట యోధుడు : సారథి
నీ ప్రాభవం మమ్మల్ని వదలలేదు : వరవరరావు
నిన్ను యాది చేసుకుంటూ... : ప్రొ.బుర్రా రాములు
ఒక శిఖరం : పడాల జోగారావు
పీడిత ప్రజల మహా మనిషి బాలగోపాల్ : పి. బిచ్చారెడ్డి
శ్యాం రచనలు విప్లవాచరణ ప్రతి రూపాలు : పాణి

పేజి 55-57

**నివాళి**

కా.పార్వతి (కె.ఎంఎస్)తో గడిపిన రోజులు : యామిని
చిరునవ్వుల సూర్యమన్నకు : యామిని

పేజి 58-59

**సమీక్ష**

అనుభవాల మా తొవ్వ : కాశీం

పేజి 59-64

**విశ్లేషణ**

కవిత్వ నిర్మాణం కొన్ని ఆలోచనలు : కాశీం
కవిసభ కవిత్వం గురించి : కాశీం

పేజి 64-71

**కవిత్వం**

పరిమళ్, ఉదయమిత్ర, తంగెళ్ళ సుదర్శన్ పాటలు,
కెక్యూబ్‌వర్మ, జోస్‌మారియో, జునైద్ ఆలం, జగతి

పేజి 72-75

**కరపత్రం**

వైఎస్ఆర్ నుండి మన కడపను కాపాడుకుందాం
కడపజిల్లా పేరును వై.యస్. రాజశేఖర రెడ్డి జిల్లాగా
మార్చటం పట్ల అభ్యంతరం

పేజి 75

**నివాళి**

ప్రశ్నల జోగారావు ఇకలేరు : కెక్యూబ్ వర్మ

పేజి 76-78

**కోర్ట్ స్టేట్‌మెంట్**

*పాణి, పిన్నిక శ్రీనివాస్ అక్టోబర్ 2009, 5వ తేది ఒంగోలు*
*ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక న్యాయస్థానంలో యిచ్చినది*

పేజి 79-81

**వ్యాసం**

వైఎస్ జిల్లా పేరు వెనుక... : పాణి

పేజి 81-84

గుమ్మెటమోత : పాణి **(నవల)**


**ముఖ చిత్రం :**
బాలగోపాల్

**సంపాదకీయం....**

# ఆలోచనలకూ, ఆచరణకూ సరిహద్దులు చెరిపేసిన మనకాలం బుద్ధిజీవి

తెలుగు ప్రజా జీవితంలో హక్కుల ఉద్యమానికి నిర్వచనం బాలగోపాల్. గణిత శాస్త్ర అధ్యాపన నుండి ఆయన సామాజిక అధ్యయనంలోకి ప్రవేశించేశాడు. తన యావత్ జీవితాన్ని హక్కుల ఉద్యమానికి అనుగుణంగా తీర్చిదిద్దుకున్నట్టే హక్కుల ఉద్యమాన్నీ తీర్చిదిద్దాడు, విస్తృతపరిచాడు. వలసపాలన కాలం నుండి భారతదేశంలో కొనసాగుతున్న హక్కుల దృక్పథానికి నక్సల్బరీ శ్రీకాకుళ పోరాటాలు ప్రజారాజకీయాంశను జోడించాయి. సాయుధపోరాటం రాజకీయరంగంలో సృష్టించిన అలజడి హక్కుల ఉద్యమానికి బలమైన పునాది వేసింది. తెలుగు సమాజంలో హక్కుల ఉద్యమం ప్రబలశక్తిగా ఎదగడానికి, ప్రజా ఆకాంక్షలన్నిటిలో హక్కుల స్పృహ వెల్లివిరియడానికి వర్గపోరాటమే కారణం.

బాలగోపాల్ ఈ ఉద్యమ సన్నివేశంలో పౌరహక్కుల సంఘంలోకి వచ్చాడు. ఒకానొక కాలంలోని సామాజిక సంఘర్షణ, చైతన్యం, ఉద్యమ అవసరం కొందరు వ్యక్తుల్లో ప్రతిఫలిస్తాయనడానికి బాలగోపాల్ మంచి ఉదాహరణ. అందువల్లనే అప్పటిదాకా కొనసాగుతూ వచ్చిన హక్కుల ఉద్యమంలో అవసరమైన మార్పులు అనేకం ఆయన తేగలిగాడు. చరిత్ర, తత్వశాస్త్రం, రాజకీయ అర్థశాస్త్రాల్లో లోతయిన పరిచయం ఉన్నందువల్ల హక్కుల దృక్పథాన్ని అభివృద్ధి చేయగలిగాడు. నిజనిర్ధారణ అనే ప్రక్రియకు సామాజిక అధ్యయన స్థాయిని కల్పించాడు. హక్కుల ఉల్లంఘన, అణచివేత వెనుక ఉన్న సామాజిక కారణాలను హక్కుల దృక్పథంతో ఎలా వెలికితీయవచ్చో బాలగోపాల్ నిరూపించాడు. రైతాంగ, ఆదివాసీ, యువజన, విద్యార్థి ఉద్యమాలు బలంగా కొనసాగుతున్న తరుణంలో రాజ్యహింసా రూపాలను, సామాజిక అణిచివేతలను హక్కుల దృక్పథంలో విశ్లేషించారు. స్వతహాగా చురుకైన ఆలోచనాపరుడు కావడం వల్ల, మార్క్సిస్టు అధ్యయనశీలి కావడం వల్ల, నిబద్ధ ఆచరణ వల్ల పౌరహక్కుల ఉద్యమానికి రాష్ట్రస్థాయి నిర్మాణ రూపాన్ని యిచ్చాడు. హక్కుల ఉద్యమానికి విశ్వసనీయత, గౌరవ ప్రతిపత్తి కల్పించాడు. ఆయన నేతృత్వంలో వందలాది హక్కుల కార్యకర్తలు, ఆలోచనాపరులు తయారయ్యారు. 1980లలో విప్లవ, ప్రజాపోరాటాలకు మధ్యతరగతి నుండి గొప్ప మద్దతు దొరకడంలో వ్యక్తిగా బాలగోపాల్ పాత్ర, ఆయన నడిపించిన పౌరహక్కుల ఉద్యమం పాత్ర విస్మరించలేనివి.

1980లలో విప్లవ ఆలోచనా రంగం సాధించిన విజయాల్లో బుద్ధిజీవిగా బాలగోపాల్ నిరంతర కృషి ఉన్నది. ఆ కాలంలో తత్వశాస్త్రంలో, సామాజిక శాస్త్రాల్లో, సామాజిక అధ్యయన పద్ధతుల్లో విప్లవ శిబిరంలోని పరిణతికి త్రిపురనేని మధుసూధనరావు, సి.వి.సుబ్బారావులాంటి వాళ్ళతోపాటు బాలగోపాల్ చేర్పు ప్రామాణికమైనది. ముఖ్యంగా సాహిత్య విమర్శలోకి రాజకీయ అర్థశాస్త్రాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే. సుమారు పదేళ్ళపాటు విరసం సభ్యుడిగా, ప్రతి విరసం సభలో ఆయన ప్రసంగాలు, అరుణతార - సృజన పత్రికల్లో రచనలు విప్లవ సాహిత్యోద్యమ అవగాహనను విస్తరింపజేశాయి. 'రూపం - సారం' పేరుతో వచ్చిన ఆయన వ్యాసాల సంకలనం విప్లవ సాహిత్య విమర్శ పద్ధతిలో మార్పు తీసుకొని వచ్చింది. డి.డి.కోశాంబి ద్వారా చరిత్ర అధ్యయనం ప్రారంభించిన బాలగోపాల్ మార్క్సిస్టు చారిత్రక దృక్పథాన్ని ఆకళింపు చేసుకున్నాడు. ఒక సందర్భంలో ఆయనే కొడవటిగంటి కుటుంబరావు గురించి అన్నట్టు మార్క్సిస్టు దృక్పథాన్ని తన వ్యక్తిత్వంలో భాగం చేసుకోవడం వల్ల పౌరహక్కుల నివేదికలు రాసినా, సామాజిక - సాహిత్య విశ్లేషణ చేసినా బాలగోపాల్ ముద్ర వైవిధ్యంగా ఉండేది. దృక్పథాన్ని వ్యక్తిత్వంలో భాగం చేసుకోవడం, జీవితాచరణలో సంలీనం చేసుకోవడం, ఆలోచనలకు - పనికి మధ్య యిసుమంతైనా అంతరం లేకపోవడం వల్ల ఏ విషయం మీదైనా ఆయన విశ్లేషణ కోసం తెలుగు సమాజం ఎదురు చూసేది. ఆయనకు మార్క్సిజంలో విశ్వాసం పోయాక కొత్తగా ఏర్పరచుకొన్న దృక్పథం కూడా ఆయన వ్యక్తిత్వంలో అంతే కలగలసిపోయింది. అందువల్లనే ఇటీవల ఆయన సిద్ధాంత, రాజకీయ వైఖరులు అభ్యంతరకరమైనవే అయినా ఆయన ప్రజాస్వామిక విశ్లేషణ సమాజాన్ని చివరిదాకా ప్రభావితం చేస్తూ వచ్చింది.

సోవియట్ యూనియన్ పతనం ప్రపంచ వ్యాప్తంగా ఆలోచనాపరులను సంక్షోభంలో పడేసినట్టే బాలగోపాల్‌లోనూ అనేక సందేహాలను లేవదీసింది. సరిగ్గా అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమం నూతనదశలోకి ప్రవేశించింది. విప్లవోద్యమానికి - మధ్యతరగతి బుద్ధిజీవులకు అంతరం మొదలైంది. అయితే బాలగోపాల్ విప్లవోద్యమ ఆచరణలోని లోటుపాట్ల దగ్గర తన చర్చ ప్రారంభించలేదు. మార్క్సిస్టు రాజకీయ సిద్ధాంతంలోని తప్పొప్పుల దగ్గర కూడా మొదలవ్వలేదు. ఏకంగా సామాజిక సిద్ధాంతంగానే మార్క్సిజాన్ని సందేహించాడు. చరిత్రలో మానవ కర్తృత్వం పట్ల అపనమ్మకాన్ని బైటపెట్టుకున్నాడు. కార్మికవర్గం తనను తాను విముక్తి చేసుకొని సమాజాన్ని విముక్తం చేస్తుందని నమ్మవలసిన పనిలేదని తేల్చేశాడు. ఈ క్రమంలో విరసంపట్ల, విప్లవసాహిత్యం పట్ల, విప్లవోద్యమ ఆచరణ పట్ల అహేతుక, సహేతుక విమర్శలు అనేకం చేశాడు. సిద్ధాంత ఆచరణ రంగాల్లో ఆయన లేవనెత్తిన అంశాలను పరిగణలోకి తీసుకుంటూనే మార్క్సిస్టు మౌలిక సూత్రాలకు ఆయన దూరం జరిగాడని విరసం, విప్లవోద్యమం స్పష్టం చేయవలసివచ్చింది. మార్క్సిజంలోని మార్క్సిస్టు - లెనినిస్టు సంప్రదాయం మీది విమర్శగా మొదలైన బాలగోపాల్ ఆలోచనా పరిణామం క్రమక్రమంగా బూర్జువా ప్రజాస్వామ్యానికి చేరువైంది. సకల ఆధిపత్యాలను వ్యతిరేకిస్తూనే ఆయన చేపట్టిన సిద్ధాంత వైఖరి ఉదారవాద దృక్పథానికి సంబద్ధత చేకూర్చింది. వర్గ దృక్పథాన్ని వదులుకోవడమే ప్రజాస్వామ్యమని ఆయన ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా జరిగిన ప్రచారం తెలుగు రాజకీయరంగానికి నష్టం చేసింది. అయినా నైతికత, సంస్కృతి, ప్రజాస్వామికీకరణ , విలువల కోణంలో ఆయన లేవదీసిన చర్చ మానవ సమాజానికి చాలా అవసరమైంది. సమసమాజాన్ని సాధించే విప్లవానికి అత్యవసరమైనది. పైగా ఆయన కేవలం రాసి, మాట్లాడి సరిపెట్టుకున్నవాడు కాదు. జీవితాన్నే వాటికి అనుగుణంగా తీర్చిదిద్దుకున్నవాడు. అందువల్లనే ఆయన ఏకపక్షంగా విమర్శిస్తూ పోవడం తప్ప ఎవరితోనూ నేరుగా చర్చలోకి రాకపోయినా విలువల రీత్యా ఆయన ప్రతిపాదించిన వాటికి గౌరవం తగ్గలేదు. ప్రాధాన్యత తీరలేదు.

మార్క్సిజంలో, వర్గపోరాటంలో బాలగోపాల్‌కు విశ్వాసం పోవడం వల్ల ఆయన హక్కుల దృక్పథంలో కూడా మార్పు వచ్చింది. ప్రజాస్వామిక హక్కుల స్థానంలో మానవహక్కులు వచ్చి చేరాయి. హక్కుల పట్ల తీవ్రమైన పట్టింపు ఉండి తీరవలసిందేగాని, హక్కులయినా, విలువలయినా వాటికవే పరమం కాదు, రాజకీయార్థిక విషయాలకు అతీతంకాదు. కానీ బాలగోపాల్ మానవహక్కుల దృక్పథంలో వచ్చిన మార్పుకు ఛత్తీస్‌ఘడ్ సంఘర్షణపై ఆయన విశ్లేషణ ఒక మంచి ఉదాహరణ. ఆదివాసుల పట్ల ఆయన హృదయం పెట్టి, వాళ్ల హక్కుల కోసం ప్రాణాలు బలిపెట్టే సంసిద్ధత ఉన్నప్పటికీ సాల్వాజుడుం వెనుక ఉన్న రాజకీయార్థికాన్ని కనీసంగా కూడా పట్టించుకోలేదు.

అయినాసరే ఆయన హక్కులు కోల్పోతున్న ఆదివాసులు, స్త్రీలు, దళితులు, ముస్లింలు, అసంఘటిత కార్మికులు, కాశ్మీర్‌లాంటి జాతులు,.... ఒక్కమాటలో యావత్ భారతదేశంలో హక్కులకు దూరమైపోతున్న ప్రజలందరి తరపున నిలబడ్డ మానవుడు. చైతన్య జీవి. విలువలు, విశ్వాసాలు జీవితమంతా యింకింపచేసుకున్న ఆచరణశీలి. మనకాలంలో..... కల్లోలకాలంలో బుద్ధిజీవి ఏం చేయాలో, ఎవరి పక్షాన నిలబడాలో, ఎలా జీవించాలో నిలువెత్తుగా నిజం చేసిన యోధుడు. ఆయన సామాజిక జీవితంలోని తొలి పదేళ్ల ప్రతి క్షణ ఆచరణను, ప్రతి అక్షరాన్ని విరసం సొంతం చేసుకుంటుంది. ఆ తర్వాత పదేళ్లలో సైతం ఆయన అచంచల ప్రజా ఆచరణను అంతే సమున్నతంగా గౌరవిస్తూ, ఆయన సిద్ధాంత, రాజకీయ అవగాహనల పట్ల విమర్శనాత్మకంగా ఉంటుంది, విభేదిస్తుంది. వీటన్నిటిలో అంతర్లీనంగా బాలగోపాల్ జీవితం అనదగిన విలువల ఆచరణకు విరసం పునరంకితమవుతుంది.

తేది : 20-10-2009

(విరసం కరపత్రం)

# పీడిత ప్రజల ఆప్తమిత్రుడు, విప్లవ శ్రేయోభిలాషి బాలగోపాల్‌కు రెడ్ సెల్యూట్స్ ! రాజ్యహింసకు వ్యతిరేకంగా సాహసోపేతంగా పోరాడే వాళ్ళందరికీ బాలగోపాల్ స్ఫూర్తిదాయకం !

పౌర హక్కుల ఉద్యమానికి సుదీర్ఘ కాలం నాయకత్వం వహించిన గొప్ప ప్రజాపక్ష మేధావి డా. కె. బాలగోపాల్ అక్టోబరు 8న గుండెపోటుతో అర్ధాంతరంగా వెళ్ళిపోవడం దేశంలోని ప్రజాస్వామిక, విప్లవ శ్రేణులందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. మన దేశ పీడిత ప్రజలు మరీ ముఖ్యంగా పోలీసు రాజ్యంలో నలిగే ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ కోసం అహర్నిశలు అలుపు లేకుండా పనిచేసే ఆప్తమిత్రుడ్ని కోల్పోయారు. బాలగోపాల్ తన జీవితాంతం పీడిత ప్రజల పక్షపాతిగా, విప్లవ శ్రేయోభిలాషిగా మెదులుతూ బూటకపు ఎన్‌కౌంటర్లు, పోలీసు అకృత్యాలపైన ప్రజల ప్రాథమిక హక్కుల కోసం దృఢంగా, నిర్భయంగా రాజీలేని పోరాటం చేశాడు. భారత దళారీ భూస్వామ్య, ఫాసిస్టు రాజ్యం కింద నలిగి మూలుగుతున్న ప్రజల ప్రజాస్వామిక హక్కుల నిర్విరామ పోరాట యోధుడు బాలగోపాల్ . అతని ఆకస్మిక మృతి పట్ల పీడిత ప్రజల తరపున, సి.పి.ఐ. (మావోయిస్టు) పార్టీ శ్రేణులన్నింటి తరపున కేంద్ర కమిటి తీవ్ర విచారాన్ని, బాధను వ్యక్తం చేస్తున్నది. బాలగోపాల్ మరణం భారతదేశ పౌరహక్కుల ఉద్యమానికి తేరుకోలేని, పూడ్చుకోలేని ఒక పెద్ద విఘాతం.

నేటి తరం మేధావుల ముందు బాలగోపాల్ ఒక మహోన్నతమైన ఆదర్శం. ఆయన జీవితంలోని ప్రతి అంశమూ ఒక ఆదర్శవంతమైన నమూనాయే. శ్రమ జీవుల పట్ల తిరస్కారం ప్రదర్శించే , వ్యక్తిత్వం లేని నేటితరం మేధావుల పక్కన ఆయన నిరాడంబర జీవనశైలి, కష్టపడి పనిచేసే తత్వం, ముఖ్యంగా అట్టడుగు వర్గాల ప్రజల పట్ల గాఢమైన ప్రేమ ఆపేక్షా అన్నీ అరుదైన లక్షణాలే. స్వార్థం, సంకుచితత్వం, కపటంతో నిండిపోయి అధికారానికి అంటకాగే మేధావులే ప్రధాన రాజకీయ దృశ్యాన్ని నింపేసిన నేటి స్థితిలో ప్రజల హక్కులే లక్ష్యంగా అకుంఠిత దీక్షతో సర్వశక్తులూ ధారపోసిన అతని నిబద్ధత ఒక పెద్ద వైచిత్రి. కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ పోలీసులు చేసిన వందలాది బూటకపు ఎన్‌కౌంటర్లను పరిశోధించి బాలగోపాల్ నిర్భయంగా బట్టబయలు చేసిన నిజాలు, ప్రభుత్వానికి పోలీసు రాజ్యానికి వ్యతిరేకంగా ఆయన చేసిన విమర్శనాత్మక రచనలు పాలకులను, వారి ప్రోత్సాహకాల్ని పొందుతున్న పోలీసులను ఎంత ఆగ్రహోదగ్రుల్ని చేశాయంటే ఆ ధీరోదాత్తమైన కంఠాన్ని నొక్కేయడానికి వాళ్ళ ఎన్నో ప్రయత్నాలు చేశారు. 1980 ల మధ్యలో ఆయనకు అరెస్టు చేశారు. 1989లో ప్రభుత్వ ప్రేరిత హంతక ముఠాలు ఆయనను అపహరించి ఎన్‌కౌంటర్లు, పోలీసుల విషయాల్లో కలగజేసుకోవద్దంటూ బెదిరించాయి. అరెస్టులు, బెదిరింపులు ఆయనను నిలువరించలేక పోయాయి. ప్రజల హక్కుల కోసం అంతే నిబద్ధతతో రాజ్యహింసకు వ్యతిరేకంగా ఆయన పోరాటం చివరి దాకా కొనసాగింది. సమకాలీన సామాజికాంశాలపై ఆయన విశ్లేషణలు చాలా సంక్లిష్టమైన సమస్యల్ని కూడా ప్రజలు సరిగ్గా అర్థం చేసుకునేలా ఉపయోగపడ్డాయి. ఆయన గణిత శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సామాజిక శాస్త్రవేత్త, పౌరహక్కుల నాయకుడు కలగలిసిన వ్యక్తి.

1970ల మధ్య వరంగల్‌లో రీసెర్చ్ చేస్తున్న కాలం నుండే బాలగోపాల్‌కు అప్పటి సి.పి.ఐ (ఎమ్.ఎల్) (పీపుల్స్ వార్) ఆధ్వర్యంలో జరుగుతున్న విప్లవోద్యమంలో దగ్గరి సంబంధం ఉండేది. కాని 1990ల మధ్య కాలం నుండి సైద్ధాంతిక రాజకీయ విభేదాల కారణంగా ఆయన మెల్లగా పార్టీ నుండి దూరమవుతూ వచ్చారు. 1990ల చివరి కల్లా మార్క్సిజం, లెనినిజం నుండే ఆయన దూరం జరిగి పోస్ట్ మాడర్నిజం ప్రభావంలోకి పోయినా, పార్టీ విధానాలు, ఆచరణపై తీవ్రమైన విమర్శలు చేసినా ఆయన ఎప్పుడూ విప్లవం పట్ల సానుభూతితో, మావోయిస్టుల శ్రేయోభిలాషిగానే ఉండేవాడు. పౌరహక్కుల ఉద్యమంలోనైతే ప్రజల కోసం ఎక్కువ పని చేయవచ్చునని, రాజ్యంపై ఆయన చేసే యుద్ధానికి హక్కుల క్షేత్రాన్ని ఎన్నుకున్నాడు. ఆ రంగంలో ఆయన చాలా నిబద్ధతతో చివరి శ్వాస దాకా తొణకకుండా స్థిరంగా నిలబడ్డాడు. బాలగోపాల్ జీవితం, ఆచరణ నుండి మన సమాజంలోని మేధావి వర్గాలు ఎంతో నేర్చుకోవాల్సి ఉంది.

**అజాద్,**

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్), కేంద్ర కమిటీ

10 అక్టోబర్ 2009

వ్యాసం

◆ వి.చెంచయ్య

# బాలగోపాల్ సాహిత్య విమర్శ

"కమ్యూనిజం గూడ మనుషుల్ని రంగూ రుచీ వాసనా లేని మూగ మనుషులుగా మారుస్తుందనే బూర్జువా దూషణ ప్రచారంలో వుంది. అది అబద్ధం కావడానికి ఒకటే కారణం. ప్రజా ఉద్యమాల లక్ష్యం నిర్గుణమయిన తాదాత్మ్యస్థితిని సాధించడంకాదు. ఈ భౌతిక ప్రపంచాన్ని ఇప్పుడున్న దానికంటే అందంగా తీర్చిదిద్దడం. అట్లా తీర్చిదిద్దడంలో ప్రపంచానికి సహజమయిన వైవిధ్యం నశించదు. అందులోని చెడు రాలిపోతుంది గాని మంచి మరింత రాణిస్తుంది. ప్రజల జీవితంలో ఎంత వైవిధ్యం వుందో ప్రజా రాజ్యంలో అంత ఉంటుంది. ప్రజా ఉద్యమంలోనూ అంత ఉంటుంది. ప్రజా ఉద్యమంలోకి వచ్చేవాళ్ల వ్యక్తిత్వాలు ఉద్యమంలో కరిగిపోవు. ఉద్యమం వాళ్ళ వ్యక్తిత్వంలో కరిగిపోతుంది. తమ పూర్వ వ్యక్తిత్వాలను ఉద్యమ వ్యక్తిత్వాలుగా ఒక్కొక్కరు ఒక్కొక్కవిధంగా మలచుకుంటారు. విప్లవోద్యమంలో భాగంగా ఒక రచయితనయినా, ఇతర రంగాలలో పనిచేసే కార్యకర్తనయినా అర్థం చేసుకునేటప్పుడు ఈ అవగాహనతో ప్రారంభించడం ప్రథమం."

'సామాజిక వ్యాఖ్యాత కొడవటిగంటి కుటుంబరావు' అన్న వ్యాసంలో బాలగోపాల్ అన్న మాటలివి. 1983 అక్టోబర్ 'సృజన' సంచికలో అచ్చయిన వ్యాసం ఇది. అప్పటికి బాలగోపాల్ పూర్తిగా మార్క్సిస్టు సంప్రదాయంలో ఉండడమేగాక, విరసం సభ్యుడు కూడా. ఆ తర్వాత 1993లో 'అరుణతార'లో వచ్చిన 'చరిత్ర - మనిషి- మార్క్సిజం' అనే వ్యాసంతో తొలిసారి బాలగోపాల్ మార్క్సిజానికి దూరం అయినట్టు అర్థమయింది. ఆ తర్వాత 2001లో 'ప్రజాతంత్ర'లో వచ్చిన బాలగోపాల్ ఇంటర్వ్యూ దీనిని నిర్ధారించింది. జీవిత మూలాలకు సంబంధించిన సత్యాన్వేషణ ప్రాథమికంగా ముగిసిందనీ, కాకుంటే దానిని ఆచరించడం, అన్వయించడం, మెరుగులు దిద్దడం మాత్రమే మిగిలివుందనీ మన మార్క్సిస్టులు అనుకుంటున్నారని ఆ ఇంటర్వ్యూలో తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పాడు. అంతకు నాలుగేళ్ళముందు 1997లో పర్‌స్పెక్టివ్స్ సంస్థ ప్రచురించిన 'కల్లోల కథాచిత్రాలు' అనే బాలగోపాల్ వ్యాససంపుటికి చివరి మాట రాస్తూ 'హేతుబద్ధమైన తాత్విక మానవతా వాదనను చేర్చుకోకపోతే మార్క్స్ ఆలోచన పరిపూర్ణం కాదు' అని బాలగోపాల్ మార్క్సిజంలోని ముఖ్యమైన 'ఖాళీ'ని పేర్కొన్నాడు. భూస్వామ్య బూర్జువా వ్యవస్థలలో ఉన్న మంచిని ఆహ్వానించాలో, తిరస్కరించాలో తెలియని సందిగ్ధస్థితి ఉంటుందనీ, మార్క్సిజం కూడా దీన్ని స్పష్టం చెయ్యలేదనీ, వ్యవస్థ మీద విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టే విశ్లేషణకు పరిమితమయ్యే మేధావులు ఈ సందిగ్ధం ఉందన్న సందేహం కూడా కలగకుండా వ్యవస్థ మీద పదునైన విమర్శ చేయగలరనీ అంటూ, తన 'కల్లోల కథా చిత్రాలు' అనే సంపుటిలోని వ్యాసాలు దీనికొక ఉదాహరణ అని తీర్మానించుకున్నాడు. ఈ సంకలనంలోని వ్యాసాలలో చివరిది తప్ప తక్కినవన్నీ 1991కి ముందు రాసినవే. కానీ సంకలనం మాత్రం 1997లో వచ్చింది. అప్పటికి తన అభిప్రాయం మారింది కాబట్టి 'చివరిమాట' రాసుకోవలసి వచ్చింది.

ఇది మార్క్సిజం పట్ల బాలగోపాల్‌లో వచ్చిన పరిణామానికి సంబంధించిన సంక్షిప్త కథ. మొన్న అక్టోబర్ 8న బాలగోపాల్ ఆకస్మిక మరణంతో ఆయన ఆలోచనా ధార శాశ్వతంగా ఆగిపోయింది.

సాహిత్యం గురించి బాలగోపాల్ రాసిన ఆరువ్యాసాల సంపుటి 'రూపం - సారం' పేరుతో 1986లో వెలువడింది. ఈ సాహిత్య వ్యాసాలన్నీ మార్క్సిజాన్ని అంగీకరించిన దశలో రాసినవే. ఆ తర్వాత 'రాగో' నవలకు ముందుమాటగా రాసి విడిగా 'అరుణతార' లో అచ్చయిన 'చరిత్ర - మనిషి - మార్క్సిజం' అనే వ్యాసం, 2001లో 'ప్రజాతంత్ర' లో అచ్చయిన ఇంటర్వ్యూ - ఈ రెండూ మార్క్సిజం పట్ల అసంతృప్తి ఏర్పడ్డ దశలో వచ్చినవి. బాలగోపాల్ సాహిత్య విమర్శ ధోరణిని విశ్లేషించడానికి మనకున్న ఆధారాలు ఇవి. అయితే 'కల్లోల కథా చిత్రాలు' సంపుటిలోని వ్యాసాలలాగే 'రూపం -సారం' లోని సాహిత్య వ్యాసాలు కూడా బాలగోపాల్ దృష్టిలో 'వ్యవస్థ మీద విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టే విశ్లేషణకు పరిమిత మయ్యే' మేధావిగా రాసినట్లే భావించవలసి వస్తుంది. ఏమయినా బాలగోపాల్ సాహిత్య విమర్శను రెండు దశలలో పరిశీలించాలి. మార్క్సిజాన్ని అంగీకరించి రాసిన 'రూపం - సారం' మొదటిదశ అయితే, మార్క్సిజంలో ఖాళీలున్నాయని భావించి రాసిన 'చరిత్ర - మనిషి - మార్క్సిజం' ప్రజాతంత్ర ఇంటర్వ్యూ రెండోదశ. ఆయన పౌరహక్కుల దృక్పథంలాగే, సాహిత్య విమర్శ దృక్పథాన్ని అర్థం చేసుకోవడానికి ఈ రెండు దశలలోని సాహిత్య వ్యాసాలనూ పరిశీలించాలి. మార్క్సిస్టు దృక్పథంతో ఎంతో కృషి చేసి, చివరకు తన కృషిని తానే చెప్పుకున్నట్టు తాత్విక స్థాయిలోనే అయినా నిరాకరించుకోవలసి వచ్చిన అరుదైన మేధావి బాలగోపాల్.

❖ ❖ ❖

ఎవరైనా ఒక వ్యక్తి తననుగురించి తాను వేసుకున్న అంచనా సరైనదేనని తక్కిన వారందరూ నమ్మవలసిన అవసరం లేదు. అది అనుకూలమైనదైనా లేదా ప్రతికూలమైనదైనా. బాలగోపాల్ మార్క్సిస్టు దృక్పథంతో రాసిన వ్యాసాలను ఆ తర్వాత తానే నిరాకరించినా, మార్క్సిజాన్ని అనుసరించే వాళ్ళు నిరాకరించాల్సిన అవసరం లేదు. అలా నిరాకరించకూడని వ్యాసాలే 'రూపం - సారం' లోనివి.

ఈ ప్రపంచానికి రూపం ,సారం రెండు ఉంటాయి. అనేక సందర్భాల్లో ఈ రెండూ ఏకీభవించవు. అంటే రూపానికి తగిన విధంగా సారాంశం ఉండదు. రూపం అభ్యుదయకరంగా ఉండి సారం అభ్యుదయ నిరోధకంగా ఉండొచ్చు. ఇలాంటి ఉదాహరణలు సాహిత్యంలో కూడా ఎన్నో దొరుకుతాయి. కథ, నవల, నాటకం, కవిత వంటి సృజనాత్మక ప్రక్రియలలోనేగాక, సాహిత్య విమర్శ వంటి విశ్లేషణ ప్రక్రియలో కూడా ఈ ధోరణి కనిపిస్తుంది. ఉదాహరణకు పురాణాల్లో కూడా ఈ ధోరణి కనిపిస్తుంది. ఉదాహరణకు పురాణాల్లో, ప్రాచీన తెలుగు సాహిత్యంలో 'ధర్మం' అనే మాట తరుచుగా కనిపిస్తుంది. ధర్మం అంటే న్యాయం అన్నట్టుగా ఇవాళ మనకర్థమవుతుంది. ఒక రాజు ధర్మపరిపాలన చేశాడంటే ఇవాళ మనం అనుకునే పద్ధతిలో న్యాయమైన పరిపాలన చేశాడని కాదు. ఆనాటి భాషా రూపం ఈనాటి భావానికి ప్రతిరూపంగా భ్రమింపజేస్తుంది. కానీ దాని సారం వేరు. ప్రాచీన కాలంలో ధర్మం అంటే వర్ణధర్మం అని మాత్రమే. కాబట్టి ధర్మపరిపాలన అంటే వర్ణాశ్రమ వ్యవస్థ ధర్మాన్ని కాపాడ్డం అని అర్థం. ఇది అభ్యుదయకరమైనది కావే కాదు. ఇలాగే ఆధునిక సాహిత్యంలోనూ ఎన్నో ఉదాహరణలుంటాయి. యండమూరి వీరేంద్రనాథ్ నవలలు తులసి, తులసిదళం పైనా, గుంటూరు శేషేంద్రశర్మ కవిసేన మానిఫెస్టో పైనా బాలగోపాల్ చేసిన రూపం, సారం చర్చ శాస్త్రీయమైనదీ, ఆసక్తిదాయకమైనది.

యండమూరి తులసి, తులసిదళం నవలల్లో మంత్రతంత్రాల గురించీ, చేతబడి గురించీ, క్షుద్రశక్తుల గురించీ రాసి, వాటిని వైజ్ఞానిక నవలలుగా భ్రమింపజేశాడు. రూపాన్నీ, సారాన్నీ వేరుచేసి చూపించి ఆ భ్రమను పటాపంచలు చేశాడు బాలగోపాల్. వర్తమాన విజ్ఞానశాస్త్రం గురించి సరైన అవగాహన ఉండి, రాబోయే వైజ్ఞానిక పరిణామాల్నీ, ఆ పరిణామాలు సమాజంపై చూపించే ప్రభావాన్నీ వాస్తవికంగా ఊహించగలిగితే అది వైజ్ఞానికనవల అవుతుందని బాలగోపాల్ నిర్వచించినప్పుడు యండమూరి రాసినవి వైజ్ఞానిక నవలలు కాదన్న ఆలోచన పాఠకులలో కలుగుతుంది. యండమూరికి విజ్ఞానశాస్త్రం గురించిన ప్రాథమిక పరిజ్ఞానం కూడా లేదనీ, అతని ఊహలు అవాస్తవికాలనీ సోదాహరణంగా నిరూపించాడు. యండమూరి

చాలాసార్లు వాడిన బ్రెయిన్ వేవ్ అనే మాట శాస్త్రీయ పదమే కాదన్నాడు. ఎవరికైనా తెలివైన ఆలోచన వస్తే అతనికి బ్రెయిన్ వేవ్ వచ్చిందని అనడం ఇంగ్లీషు వాళ్ల భాషా వ్యవహారంలో ఉన్నదేగాని, సైన్సులో లేదన్న విషయాన్ని స్పష్టం చేశాడు. మెదడు ఇచ్చే ఆజ్ఞలు, నరాలలో ఒక ప్రవాహంలాగా వెళతాయనీ, ఆ ప్రవాహాన్ని 'నర్వ్ కరెంట్' అంటారేగాని, బ్రెయిన్‌వేవ్ అనరనీ వివరించాడు.

అలాగే హిప్నోటిజం గురించి కూడా యండమూరి అబద్ధాలే రాశాడు. నిద్రపోతున్న మనిషిని ఎవరూ హిప్నోటైజ్ చెయ్యలేరు. మేలుకొని ఉన్నా అతనికి తెలియకుండా దూరం నుంచి హిప్నోటైజ్ చెయ్యడం సాధ్యం కాదు. దానికి హిప్నోటైజ్ చేయించుకునే వ్యక్తి సహకారం చాలా అవసరం. యండమూరి ఇవేవీ పట్టించుకోడు. హిప్నోటిజం అనేది మంత్రం కాదు శాస్త్రం. శాస్త్రం అని అతనికి తెలిసినా, పాఠకులకు మాత్రం మంత్రం అనే భ్రమ కలిగిస్తాడు. అందులోనే అతని మోసపూరితమైన రచనా శిల్పం దాగివుంది. సైన్సుకూ మూఢనమ్మకాలకూ తేడా లేదని చెప్పడం అతని ఉద్దేశమనీ, అసలు వైజ్ఞానిక నవల రాయడం అతని ఉద్దేశం కాదనీ అతని అంతరంగాన్ని మార్క్సిస్టు సిద్ధాంత యంత్రంతో ఎక్స్‌రే తీసినట్టు వివరిస్తాడు బాలగోపాల్. సైన్సు పరిజ్ఞానం అసంపూర్ణం కాబట్టి సైన్సునూ, మంత్రతంత్రాలనూ రెండిటినీ సమాన స్థాయిలో చెప్పి నిర్ణయం పాఠకులకు వదిలిపెట్టడమనే 'నిష్పాక్షిక' పద్ధతిని యండమూరి అనుసరించినట్టు భావించే పాఠక వర్గం ఒకటి ఉంటుంది. దీన్ని ఆసరా చేసుకుని యండమూరి లాంటి వ్యాపార రచయితలు తమ వ్యాపార రచనా శిల్పాన్ని అత్యుత్సాహంతో ప్రదర్శిస్తారు.

మానవుడికున్న సైన్సు పరిజ్ఞానం ఎప్పుడూ అసంపూర్ణమేనని మార్క్సిజం చెబుతుందనే వాస్తవాన్ని అంగీకరిస్తూనే బాలగోపాల్ మంత్రాలకు చింతకాయలు రాలవనే సత్యాన్ని నిరూపించే ప్రయత్నం చేస్తాడు. మనిషి ప్రకృతితో ఘర్షణ పడుతూ క్రమంగా జ్ఞాన సంపాదన చేస్తాడు. కొన్ని విషయాలపట్ల అసంపూర్ణ జ్ఞానం పొందుతాడు. మరికొన్ని విషయాలగురించి కేవలం అజ్ఞానమే ఉండొచ్చు. అంత మాత్రాన అన్ని విషయాలలోనూ మనిషి పొందే విజ్ఞానాన్ని సందేహించమని కాదు. మనిషి ప్రయత్నం ఎప్పుడూ 'గెలుపు - ఓటమి-గెలుపు' పద్ధతిలో ఉంటుంది. కాబట్టి అతని జ్ఞాన సంపాదన క్రమం పరిపూర్ణజ్ఞానం వైపే ఉంటుంది. మనిషి సర్వజ్ఞుడు కాడు. దానర్థం దేవుడు సర్వజ్ఞుడని కాదు. దేవుడు సర్వజ్ఞుడనడానికి ఒక బలమైన కారణం ఉంది. లేని దేవుణ్ణి ఉన్నాడనుకోవడంలోనే ఆ బలం ఉంది. ఉన్న మనిషిని వాస్తవికంగా అర్థం చేసుకోవచ్చు. మానవుడు ఊహించుకున్న దేవుడికి ఎన్ని శక్తులయినా అంటగట్టొచ్చు. ఈ సూత్రాన్ని అన్వయించే బాలగోపాల్ మంత్ర తంత్రాల బండారాన్ని ఎండగడతాడు.

సైన్సు మనకిచ్చే విజ్ఞానం అసంపూర్ణం కావచ్చునేగానీ, మంత్ర తంత్రాల నుంచి మనకున్న జ్ఞానం మాత్రం సంపూర్ణమైనదేనంటాడు. మంత్ర తంత్రాలు అబద్ధాలనీ, మూఢ విశ్వాసాలు శాస్త్రీయం కావనీ ప్రయోగాత్మకంగా నిరూపించే అవకాశం ఉన్నా అది వృథా ప్రయాసేనంటాడు. ఎందుకంటే ఎన్నిసార్లు నిరూపించినా మంత్రతంత్రాలను నమ్మేవాళ్లు ఉంటూనే ఉంటారు. అంతేగాదు, కొత్తగా పుడుతూనే ఉంటారు. కాబట్టి మనం చెయ్యవలసింది ఒక్కొక్క మూఢవిశ్వాసాన్ని అబద్ధమని నిరూపిస్తూపోవడం కాదు. అసలు మూఢ విశ్వాసాలూ, మంత్ర తంత్రాలూ ఎలా పుట్టాయో తెలుసుకోవడం. వర్షానికి ముందు ఉరుములు ఉరిమితే అది గమనించిన ఆదిమానవుడు ఉరిమితే వర్షం వస్తుందని అనుకున్నాడు. అందుకని వర్షం లేనప్పుడు వర్షం కోసం తాను ఉరుములాగా అరిచేవాడు. ఇదే మంత్రం. ఆ తర్వాతి కాలంలో దేవుళ్ళను ప్రసన్నం చేసుకోవటం కోసం కూడా ఈ మంత్రాన్ని ఉపయోగించడం ప్రారంభమైంది. కాబట్టి మంత్రం పుట్టుకలో దేవుళ్ళు లేరు. ఆ తర్వాతనే దేవుళ్ళు పుట్టుకొచ్చారు. ఈ విధంగా సమాజ పరిణామ క్రమంలో మానవుడు ఏర్పర్చుకున్న అశాస్త్రీయమైన విశ్వాసాలే మూఢ విశ్వాసాలు. వర్షానికీ, ఉరుముకీ కార్యకారణ సంబంధం ఉందనుకోవడం, వర్షం కోసం ఉరుములా తానే అరవడం మంత్రం అయింది. ఈ చారిత్రక దృక్పథం అర్థం అయితే మంత్ర తంత్రాలన్నీ మానవ పరిణామ క్రమంలో ఏర్పడినవేననే విషయం తెలుస్తుందని బాలగోపాల్ వివరిస్తాడు.

❖ ❖ ❖

రూపం, సారం భిన్నంగా ఉన్న దానికి మరో ఉదాహరణ గుంటూరు శేషేంద్రశర్మ 'కవిసేన మానిఫెస్టో'. ఇది 1970లలో వచ్చింది. కవిసేన ఒక ఉద్యమమనీ, అది సాహిత్యంలో విప్లవం తెచ్చిందనీ, గత సాహిత్యం మీద తిరుగుబాటు చేసి సాహిత్యంలో ఆధునిక దృక్పథాన్ని కలిగించిందనీ చెప్పడం దీని సారాంశం. మార్క్సిస్టు పదజాలాన్ని ఉపయోగిస్తూ విరసం మీదా, మార్క్సిస్టుల మీదా దుష్ప్రచారం చెయ్యడం దీని లక్ష్యం. జీవిత వాస్తవికత మీద సాధారణ పరిజ్ఞానం కూడా లేని ఒక పలాయన వాద మతానే కవిసేన అని ఆ రోజుల్లో త్రిపురనేని మధుసూదనరావు దాని గుట్టు బయటపెట్టే ఉన్నాడు. ప్రాచీన భారతీయ అలంకార శాస్త్రాలకూ, పాశ్చాత్య సాహిత్య సిద్ధాంతాలకూ, మార్క్సిజానికీ సాహిత్యం విషయంలో ఆశ్చర్యకరంగా భావైక్యత ఉందని కూడా కవిసేన చెబుతుంది. అన్ని గ్రంథాలలోని కొన్ని వాక్యాల్ని బయటులాగి, వాటికి పోలికలున్నాయని చెప్పి, దాన్ని ఒప్పించడానికి అన్నిటికీ అక్రమ సంబంధం అంటగట్టడమే కవిసేన చేసిన అత్యాచారం. బాలగోపాల్ తనదైన పద్ధతిలో కవిసేన రూపాన్నీ, సారాన్నీ విడగొట్టి చూపాడు.

కవిత్వం ఒక ఆత్మకళ అనీ, అంటే కవిత్వం ఈ ప్రపంచాన్ని ఆత్మకృతం చేసుకోవడం అనీ, జీవితంలో మూర్ఖునిలాగా మునిగిపోయి తలపైకి తేలకుండా అనుభూతిని ఒక కళగా అభ్యసించాలనీ 'కవిసేన' అంటుంది. అంతవరకు పరవాలేదు, అది ఆయన అభిప్రాయంగా అనుకోవచ్చు. కానీ ఇదే మార్క్సిజం అనడంలో కవిసేన పైత్యం కనిపిస్తుంది. ప్రపంచాన్ని ఆత్మీకృతం చేసుకోవడం- అంటే ప్రపంచాన్ని తన అనుభవంలోకి తెచ్చుకోవడం అనేది కవులకు సంబంధించింది మాత్రమే కాదనీ, అది వ్యక్తులందరకూ సంబంధించిందనీ చెప్పి బాలగోపాల్ మొదట్లోనే కవిసేన నడ్డి విరగొట్టారు. బాహ్య ప్రపంచానికీ, వ్యక్తి చైతన్యానికీ నిరంతరం ఒక అన్యోన్య క్రియ జరుగుతూ ఉంటుందనీ, ఈ క్రమంలో వ్యక్తి చైతన్యం ఎంతో కొంత మారుతుంటుందనీ, మనిషి వ్యక్తిత్వం ఈ క్రమంలోనే ఏర్పడుతుందనీ, అందుకే ఆ వ్యక్తిత్వం మీద సమాజం తాలూకు ముద్ర ఉంటుందనీ సామాజిక మనస్తత్వ శాస్త్రవేత్తలు చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తాడు. సార్వజనీనమయిన ఈ చర్యను కవులకు పరిమితం చెయ్యడం కవిసేన చేసిన మొదటి తప్పునీ, దానికి తమ చాపల్యాన్ని చేర్చి ఆత్మీకరణ అంటే అనుభూతిలో జలకాలాట అని తీర్మానించడం రెండో తప్పునీ, ఇదే మార్క్సిజం అని బుకాయించడానికి మార్క్సిస్టు రచయితల్ని వక్రీకరించడం క్షమించరాని తప్పనీ గుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు. కనీసపు శాస్త్రీయ దృక్పథం లేని కవిసేనకు వైజ్ఞానిక ఉద్యమాన్ని నడిపే శక్తి ఉండదని తేల్చేశాడు. చైతన్యం ఆత్మనుండి పుట్టదనీ, అది పదార్థం నుండి పుడుతుందన్న ప్రాథమిక మార్క్సిస్టు పరిజ్ఞానం కూడా కవిసేనకు లేదనీ అంటాడు.

శేషేంద్రశర్మ వ్యక్తిని ఆత్మ అంటాడు. అధ్యయనాన్ని తపస్సు అంటాడు. వర్తమాన సామాజిక వ్యవస్థను విధి అంటాడు. ఆర్థిక విముక్తిని మోక్షం అంటాడు. చివరకు ధర్మార్థ కామ మోక్షాలను సోషలిస్టు సమాజానికి చెందిన తాత్విక విషయాలుగా వ్యాఖ్యానిస్తాడు. భాషపట్ల ఆయనకు శాస్త్రీయ దృక్పథం లేదు. ఈ సందర్భంలో భాష పుట్టుకను గురించి వివరిస్తూ బాలగోపాల్ - భాష సమాజంలో పుడుతుందనీ, ఆ సమాజానికి సంబంధించిన స్వరూపం భాషలో నిక్షిప్తమయి వుంటుందనీ, సామాజిక వ్యవస్థ మారిస్తే మాటలకు కూడా అర్థం మారుతుందనీ అంటాడు. దీనికి 'సామంతుడు' అనే

పదాన్ని ఉదహరించాడు. భూస్వామ్య వ్యవస్థకు ముందు సామంతుడు అంటే పక్కదేశపు రాజు అనే అర్థం ఉండేదనీ, భూస్వామ్య వ్యవస్థలో అంటే గుప్తరాజుల కాలంనుండి సామంతుడంటే ఒక చక్రవర్తికి గానీ రాజుకుగానీ కప్పం చెల్లించే సంస్థానాధిపతి అనే అర్థం వచ్చిందంటాడు. శబ్దరత్నాకరం అనే తెలుగు నిఘంటువును చూస్తే సామంతుడు అనే పదానికి ఇప్పటికీ పక్క దేశపు రాజనే అర్థం ఉందిగాని, చక్రవర్తికి కప్పం చెల్లించే వాడనే అర్థం లేదు. నాస్తికుడు అంటే వేద ప్రామాణ్యాన్ని అంగీకరించని వాడనే పురాతన అర్థమే నిఘంటువుల్లో ఉన్నదిగాని, దేవుణ్ణి నమ్మనివాడు అని ఇవాళ ఉన్న అర్థాన్ని నిఘంటువులివ్వవు. అందుకే బహుశా శ్రీశ్రీ నిఘంటువుల్ని శ్మశానాలతో పోల్చాడు. 'చరిత్రతో పరచికాలాడే హక్కు ఎవరికీ లేదు' అని ఈ సందర్భంలో తిరుగులేని సూత్రీకరణ చేశాడు బాలగోపాల్.

ధర్మార్థ కామమోక్షలనేవి మన దేశపు భూస్వామ్య వ్యవస్థ భావజాలంలో అతి ముఖ్యమైన భాగం. అది ఏనాడూ సమాజ లక్ష్యం కాదంటాడు బాలగోపాల్. ధర్మార్థ కామమోక్షాలను భూస్వామ్య వ్యవస్థ అప్పట్లో అంగీకరించింది గదా అని చాలామంది అనుకుంటారు. కానీ ఆ సమాజంలో కూడా అవి అందరికీ ఆమోదయోగ్యం కావు. ధర్మం అంటే వర్ణాశ్రమ ధర్మమే కాబట్టి అది ఆనాడూ శూద్రులకూ, పంచములకూ లక్ష్యం కావడానికి అవకాశం లేదు. అందుకే ధర్మాన్ని అనుసరించినవారికి చచ్చిం తర్వాత మోక్షం వస్తుందని చెప్పాల్సి వచ్చింది.

అనేక తెగల రూపంలో ఉన్న హైందవేతర ప్రజలను హైందవ సమాజంలో కలుపుకోవడానికి వారి దేవుళ్ళను, దేవతలను హిందూ దేవుళ్ళుగా అంగీకరించడం చారిత్రకంగా పురాణాలు నిర్వహించిన పాత్రగా చెప్పుకోవచ్చు. దీనివల్ల ఆ తెగల్లో కూడా స్థిర వ్యవసాయం, వర్గ విభజన ఏర్పడ్డాయంటాడు బాలగోపాల్.

శేషేంద్రశర్మ ఇంగ్లీషు కొటేషన్లను ముక్కల ముక్కలుగా కత్తిరించి అసందర్భంగా వాడుకోవడంలో దొర్లిన దారుణమైన తప్పుల్ని బాలగోపాల్ స్పష్టంగా చూపించాడు. The Basic Principle of art is the individualisation of phenomena అని రష్యన్ రచయిత్రి షెర్బినా అన్న మాటల్ని శేషేంద్ర శర్మ వక్రీకరించాడు. పై మాటలకు ఆత్మీకృతం చేసుకోవడం అనీ, ఆత్మకళ అనీ అర్థం చెప్పాడు. అంతటితో ఆగితే పరవాలేదు,ఇదే మార్క్సిజం అన్నాడు. అందువల్ల మార్క్సిజం ప్రకారం కూడా కవిత్వం ఆత్మకళే అవుతుందని తీర్మానించాడు. ఈ ప్రపంచంలోని ప్రతి వస్తువుకూ కొన్ని సామాన్య గుణాలూ, కొన్ని ప్రత్యేక గుణాలూ ఉంటాయి. ఉదాహరణకు చెట్టును కొన్ని ప్రత్యేకతలుంటాయి. ఏ రెండు చెట్లూ ఒక రకంగా ఉండవని మనందరికీ తెలిసిన విషయమే. కవి లేదా కళాకారుడు సామాన్య గుణాల్ని కాకుండా ప్రత్యేక గుణాల్ని చూస్తాడు. అంటే విషయాన్ని వైయక్తీకరిస్తాడని అర్థం. అనేకమైన పచ్చని చెట్లలో ఒక ఎండిపోయిన చెట్టుంటే కవికి ఆ ఎండిపోయిన చెట్టు ముఖ్యం అవుతుంది. ఇది Individulisation లేదా వైయక్తీకరణ దీనికీ, ఆత్మీకరణకూ సంబంధం లేదు. ఆత్మీకరణను ఆంగ్లంలో Internaligation అంటారు. అలాగే Tne Universal existy only in the individual and through the individual అని మార్క్స్ అన్న మాటనూ సరిగ్గా అర్థం చేసుకోలేదనీ, జగత్తుకూ ఆత్మకూ ఉన్న అవినాభావ సంబంధాన్ని జాగృతం చేసుకోవడమే ఆత్మకళ అని పై మాటలకు లేని అర్థాన్ని చెప్పాడని బాలగోపాల్ ఎత్తి చూపాడు. చెట్టు అన్నది యూనివర్సెల్ అయితే, ఒక ప్రత్యేకమైన చెట్టు ఇండివిజ్యువల్ అని అర్థంగాని, యూనివర్స్ అంటే జగత్తు, ఇండివిజ్వల్ అంటే సార్వఆత్మ అని కాదు. యూనివర్స్ అంటే జగత్తు. యూనివర్సెల్ అంటే సార్వత్రికం. గుంటూరు శేషేంద్రశర్మ కవిసేన మానిఫెస్టో ద్వారా వేసుకున్న మార్క్సిస్టు ముసుగును బాలగోపాల్ తన మార్క్సిస్టు పరిజ్ఞానంతో అవలీలగా తొలగించగలిగాడు.

రూపం వేరు సారం వేరు అని చెప్పడానికి బాలగోపాల్ ఎంచుకున్న యండమూరి నవలలు, శేషేంద్ర కవిసేన మానిఫెస్టో మంచి ఉదాహరణలు. కాగా 'రూపం - సారం' పుస్తకంలోని తక్కిన నాలుగు వ్యాసాలు పై రెండు వ్యాసాలకు భిన్నమైనవి. ఈ నాలుగు వ్యాసాలలో బాలగోపాల్ విశ్లేషించినవి రావి శాస్త్రి రచనలు, ఉప్పల లక్ష్మణరావు నవల 'అతడు- ఆమె', కుటుంబరావు రచనలు. వీటిలో రూపం, సారం వేరు వేరు కావు. వీళ్ళు తమ రచనల ద్వారా పాఠకుల్ని మోసం చెయ్యదల్చుకోలేదు. లేదా రచనలతో వ్యాపారం చెయ్యదల్చుకోలేదు. పాఠకులకు మన సమాజం గురించి అర్థం చేయించడానికి ప్రయత్నించారు.

నేరాన్ని అరికట్టడం, నిరోధించడం రాజ్యాంగ యంత్రం చెయ్యవలసిన పని అని అనుకునే వాళ్ళు కొందరైతే, అదపలు నేరాన్నే అరికట్టదని భావించేవాళ్ళు మరికొందరు. అసలు వ్యవహారం అది ఇదీ రెండూ కాదనీ, బూర్జువా రాజ్యాంగయంత్రం నేరాన్ని సంపూర్ణంగానూ అరికట్టదనీ, అలాగని నేరాన్ని పనిగట్టుకుని పోషించనూ పోషించదనీ చెబుతూ బాలగోపాల్ రాజ్యాంగ యంత్రం నేరాన్ని బూర్జువా సమాజపు సంక్షోభాలకు ఒక సేఫ్టీ వాల్వు లాగా చూస్తుందంటాడు. "అవసరమయినప్పుడు దాన్ని తెరవకపోతే ఒత్తిడికి తట్టుకోలేక ఇంజన్ పగిలిపోతుంది. అలాగని సేఫ్టీ వాల్వుని ఎప్పుడూ తెరిచి ఉంచితే ఇంజన్ అసలు పని చేయదు. " ('రూపం సారం' పేజి 47) రావిశాస్త్రి తన రచనల ద్వారా రాజ్యాంగ యంత్రం చేస్తున్న ఈ పనిని అద్భుతంగా చిత్రించారు. అంటే నేరాన్ని కంట్రోల్ చెయ్యడం రాజ్యాంగ యంత్రం ఉద్దేశం కాదనీ, కంట్రోల్ చేస్తున్నట్టు కనిపించడమే అసలు విషయమనీ రావిశాస్త్రి రచనల సారాన్ని బాలగోపాల్ ఒక్క వాక్యంలో చెప్పాడు. రాజ్యాంగ యంత్రంలో పోలీసులు కార్యనిర్వాహకులు వీళ్ళు తమకు పైసలు విదల్చగల పెద్ద దొంగల్ని వదిలి, చిన్న దొంగల్ని పట్టుకుంటారు. అరుదుగా పెద్ద దొంగల్ని కూడా పట్టుకుని శిక్షించినట్టు నటిస్తారు. రాజ్యాంగ యంత్రం శ్రామిక వర్గాన్ని అణచివెయ్యడానికే పనికొస్తుంది. రాజ్యాంగ యంత్రం ఏ వర్గం చేతిలో ఆయుధంగా ఉంటే ఆ వర్గ ప్రయోజనాలకే ఉపయోగపడుతుంది.

ప్రస్తుతం రాజ్యాంగ యంత్రం బూర్జువా పాలకవర్గం చేతిలో ఉంది కబట్టి అది ఆ వర్గ ప్రయోజనాలకే ఉపయోగపడుతుంది. శ్రామిక వర్గ రాజ్యం వస్తే అప్పుడు ఆ వర్గప్రయోజనాలకు ఉపయోగపడుతుంది. మొత్తం మీద రాజ్యాంగ యంత్రం ఒక అణచివేత సాధనంగా ఉండక తప్పదు. అత్యున్నతమైన సమాజం ఏర్పడ్డప్పుడు అంటే కమ్యూనిస్టు వ్యవస్థలో రాజ్యం అదృశ్యం అవుతుందని మార్క్స్ అనడంలోని అంతరార్థం ఇదే.

రావిశాస్త్రి లంపెన్ వర్గాల జీవితం గురించి వాస్తవికంగా చిత్రించినా, అది వాస్తవిక దృక్పథమే అవుతుందిగాని విప్లవ దృక్పథం కాదంటాడు బాలగోపాల్. దుర్భరమైన ఈ జీవన పరిస్థితుల్ని మార్చగలిగింది శ్రామిక వర్గం మాత్రమే. ఆ వర్గం గురించి రావిశాస్త్రి రచనలు చేసి వుంటే బాగుండేదని కూడా అంటాడు. అదే నిజమైన విప్లవ దృక్పథం అని బాలగోపాల్ తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పాడు.

❖ ❖ ❖

జాతీయోద్యమం గురించీ, అందులో గాంధీపాత్ర గురించీ బాలగోపాల్ వ్యక్తం చేసిన అభిప్రాయాలు కూడా ఒక మార్క్సిస్టు విమర్శకుడిగా నిక్కచ్చిగానే కనిపిస్తాయి. జాతీయోద్యమం అనగానే మనకు ఇవాళ గుర్తొచ్చేది కాంగ్రెస్ పార్టీయే. కానీ ఆనాడు జాతీయోద్యమాన్ని నడిపింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ప్రజలు అనుకున్నారా? అనుకోలేదనే బాలగోపాల్ అభిప్రాయం. జాతీయోద్యమం గురించిన స్వాతంత్ర్యానంతర కాలంలో ఆ అభిప్రాయాన్ని మనకు బలవంతంగా కలిగించారని అంటాడు. కాంగ్రెసేతర పార్టీలూ, సంస్థలూ, ఉద్యమాలూ చేసిన కృషిని 'విజేతల చరిత్ర' మింగేసిందంటాడు. ఆనాడు ప్రజలలోని వివిధ వర్గాలు కాంగ్రెస్ గురించీ, గాంధీ గురించీ నిజంగా

ఏమనుకున్నారో ఇవాళ అంతు చిక్కని విధంగా తయారైందంటాడు. చౌరా చౌరీలు ప్రజలు దౌర్జన్యం చేశారని గాంధీ ఉద్యమాన్ని విరమించుకున్నప్పుడు జనం నిజంగా మహాత్ముడనుకున్నారా లేక వెర్రివాడనుకున్నారా అని ప్రశ్నించుకుంటాడు. బహుశా మహాత్ముడనీ, వెర్రివాడనీ అనుకోనుండకపోవచ్చుగానీ, బ్రిటిష్ ఏజెంటేమోనన్న అనుమానం ఎవ్వరికీ కలగలేదంటే నమ్మడం కష్టం అంటాడు. గాంధీ మహాత్ముడవడానికి 1952 తర్వాత కమ్యూనిస్టు పార్టీ కూడా తనవంతు పాత్రను నిర్వర్తించింది. తెలంగాణా పోరాట విరమణ తర్వాత కమ్యూనిస్టు పార్టీ తన వ్యూహాన్ని మార్చుకున్నది. బాలగోపాల్ మాటల్లో చెప్పాలంటే గాంధీనీ, కాంగ్రెస్‌నూ 'బాధ్యతా రహితంగా' తిట్టడం మానేసింది. దాంతో కాంగ్రెస్ పార్టీ జాతీయ శక్తిగా ఎదిగింది. నిజానికి గాంధీకి సామాజిక పురోగమన దృక్పథం లేకపోయినప్పటికీ, ప్రజల్ని కదిలించి జాతీయోద్యమం నడిపిన మహాత్ముడయ్యాడు. ఇటువంటి చారిత్రక శకలాల్ని చిత్రించిన సాహిత్యంలో ఉప్పల లక్ష్మణరావు నవల 'అతడు - ఆమె' ఒకటని బాలగోపాల్ గుర్తించాడు. ఈనవలలో భార్యాభర్తలుగా ఉన్న శాస్త్రి, శాంతం అనే రెండు పాత్రలు కాంగ్రెస్ పార్టీ సామాజిక స్వభావానికి చెందిన రెండు పార్శ్వాలకు ప్రతినిధులంటాడు బాలగోపాల్. కార్మికులు, కూలీలు, రైతులు తమ సంఘాల ద్వారాగానీ, ఏ సంఘాలూ లేకుండాగానీ జాతీయోద్యమంలో పాల్గొన్నారు. ఉద్యమ లక్ష్యంతోబాటు వీళ్ళకు వేతనాలపెంపు, శిస్తుభారం తగ్గింపు వగైరా తమ వర్గాలకు సంబంధించిన ప్రత్యేక ప్రయోజనాలూ ఉన్నాయి. అయితే వీళ్ళెప్పుడూ ఒక వర్గంగా ఐక్యంగా లేదా సంఘటితంగా లేరు. ఆ వర్గానికి ప్రతినిధి పాత్రలు ఈ నవలలో లేవు. విస్తరిస్తున్న బూర్జువా భూస్వామ్యవర్గం ఒకటైతే, మధ్యతరగతి వర్గం మరొకటి. ఈ రెండు వర్గాలకూ వరసగా శాస్త్రి, శాంతం ప్రతినిధులు, బూర్జువా భూస్వామ్య ధనికవర్గం కాంగ్రెస్‌ను పోషించడమే గాదు నడిపింది కూడా. ఆ నడపడంలో తన అవసరాలకు అనుగుణంగా పార్టీని మలచుకుంది. ఇక మధ్యతరగతి కాంగ్రెస్ పార్టీకి సత్యాగ్రహుల్నీ, స్థానిక నాయకుల్నీ, వాలంటీర్లనీ ఇచ్చింది. ఉద్యమగతిని గాంధీరూపంలో నిర్ణయించేది బూర్జువా భూస్వామ్య వర్గం అయితే, వీధుల్లోకి వచ్చి లాఠీ దెబ్బలు తినేది మధ్యతరగతి వర్గం. ఉప్పు సత్యాగ్రహం రోజుల్లో శాంతం ఖద్దరు ధరిస్తే ఇంత తొందరెందుకు, కూతురికి పెళ్ళి చేసిం తర్వాత ఇద్దరం కలిసే ఉద్యమంలో దిగొచ్చు అంటాడు శాస్త్రి. అవసరం వచ్చినప్పుడు ఉద్యమంలో దిగడం అనే మధ్యతరగతి స్వభావం శాంతంలో కనిపిస్తే, కుటుంబ అవసరాలు తీర్చుకోవడం ముఖ్యం అనే భూస్వామ్య బూర్జువా స్వభావం శాస్త్రిలో కనిపిస్తుంది. దీన్నే బాలగోపాల్ ఒక పోలికతో బాగా చెప్పాడు 'కాంగ్రెస్ అనే బ్రహ్మకు ధనికులు వెన్నెముక, గుండె, మెదడు అయితే పెటీ బూర్జువా వర్గం కాళ్ళు, పాదాలు, అంతరాత్మ' అని.

రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమయ్యాక బ్రిటన్ ఒకవైపు జర్మనీ ఇంకో వైపు ఉండడంతో భారత జాతీయోద్యమంలో ఎటువైపు మొగ్గాలనే విషయంలో సందిగ్ధాలూ, సందేహాలూ ఏర్పడ్డాయి. భారతదేశంపై పెత్తనం చేస్తున్న బ్రిటన్‌ను సమర్థించాలా, లేక బ్రిటన్ శత్రువు జర్మనీని సమర్థించాలా లేక మరో మూడో మార్గం ఏదైనా ఉందా అనే సందేహాలు సహజంగానే వచ్చాయి. ఈ అన్ని సందేహాలకూ అన్ని పాత్రలూ 'అతడు - ఆమె' నవలలో ఉన్నాయి. వీటితో బాటు అదీ నిజమే ఇదీ నిజమే అనుకునే తటస్థ పాత్రలు కూడా ఉన్నాయి. గాంధీ గురించీ, కాంగ్రెస్ పార్టీ గురించీ ఇవాళ మనకున్న లేదా మనపై బలవంతంగా రుద్దిన అనుకూల అభిప్రాయాలూ, గొప్ప అభిప్రాయాలూ మాత్రమే ఈ నవలలో ఉండవు. గాంధీ, కాంగ్రెస్‌ల గురించి రాదగిన సందేహాలను కూడా చిత్రించడం ఈనవల విశిష్టతగా బాలగోపాల్ అభిప్రాయపడ్డారు.

❖ ❖ ❖

'రూపం-సారం' సంకలనంలో కుటుంబరావు సాహిత్యం గురించి రెండు వ్యాసాలున్నాయి. ఈ సందర్భంగా బాలగోపాల్ కుటుంబరావు సాహిత్యాన్ని అంచనా వెయ్యడమేగాక, సాహిత్యం గురించి కొన్ని సూత్రీకరణాలు కూడా చేశాడు. వాటిలో, ముఖ్యమైనది గొప్ప రచనకు ఆయన ఇచ్చిన నిర్వచనం. "సమకాలీన సమాజంలో వస్తున్న మార్పులకు, చరిత్రాత్మకమైన పరిణామాలను, ఆ వర్తమానంలో గోచరించే భవిష్యత్తును ఆ తరం వారికీ, తరువాతి తరాలవారికి కళ్ళకు కట్టినట్టు చూపించే రచన గొప్ప రచన" అన్నది ఆ నిర్వచనం. ('రూపం-సారం' పేజి 11.)

ఈ నిర్వచనంలో గొప్ప రచనకు బాలగోపాల్ మూడు లక్షణాలు చెప్పాడు. మొదటిది సమకాలీన సమాజంలో వస్తున్న మార్పులు. వీటిని చాలామంది రచయితలు చిత్రించగలరు. పాఠకులకు కూడా ఇవి తెలుస్తూనే ఉంటాయి. వీటిని మాత్రమే చిత్రించి అదే వాస్తవికత అంటే కుదరదు. రెండోది ఇంతకంటే ముఖ్యమైన లక్షణం. అదే చరిత్రాత్మకమైన పరిణామాలను చిత్రించాలనడం. ఇది అందరికో సాధ్యమయ్యేదికాదు, మనకాలంలో వస్తున్న మార్పులలో ఏవి చరిత్రాత్మకమైనవో, ఏవి కావో గుర్తించడం చాలా కష్టం. దానికి నిశితమైన పరిశీలన కావాలి. ఈ మార్పుల్ని చిత్రించగలిగితే అది నిజమైన వాస్తవికత. ఇక మూడోది అనుకున్నంత సులభం కాదు. దీనికి రచయితకు దూరదృష్టి ఉండాలి. సమాజంలో కలిగే చారిత్రక పరిణామం తెలియాలి. ఈరెండు, మూడు లక్షణాలు ఒక రచనలో కనబడాలంటే ఆ రచయితకు మార్క్సిస్టు పరిజ్ఞానం తప్పనిసరి.

సమకాలీన సమాజంలో వస్తున్న మార్పుల్ని విశ్వనాథ సత్యనారాయణ వంటి తిరోగమన దృక్పథం ఉన్న రచయితలు కూడా చిత్రించగలరు. గ్రామాలకు కొత్తగా కరెంటు సౌకర్యం ఏర్పడుతున్న రోజుల్లో కరెంటు స్థంభాలు నాటడానికి అడ్డంగా ఉన్న ఒక చెట్టును నరికితే, దని కొమ్మపై గూడు కట్టుకొని జీవించే రెండు పక్షులు గూడులేని పక్షులై పోయాయని విశ్వనాథ బాధపడతాడు. జీవరాసుల పట్ల ఆయనకున్న బాధ గౌరవించదగిందే. అయితే ఆ బాధ మనుషుల పట్ల కూడా ఉండాలి. పెంపుడు కుక్కకు రోగం వస్తే విపరీతంగా బాధపడి వందలు వేలు ఖర్చుపెట్టే వాళ్ళు మనుషుల కష్టాల్ని అసలు పట్టించుకోకపోవడం ఆ వ్యక్తుల్లో ఉన్న ఒక వైరుధ్యం. మనిషి, జంతువు ఈ రెండు జీవరాసులను రక్షించే క్రమంలో వైరుధ్యం ఏర్పడినప్పుడు మనిషి మనిషికే ప్రాధాన్యత నివ్వడం తప్పుకాదు. ఇద్దరినీ కాపాడడానికి ఆ మనిషి 'దేవుడు' కాడు. (లేని దేవుడికి మనం ఎన్ని అద్భుత శక్తులయినా అంటగట్టవచ్చు) ఇద్దరినీ కాపాడాలన్న మనిషి కోరిక ఒక ఆదర్శం. అది ఆచరణ సాధ్యం కానప్పుడు మనిషి కర్తవ్యం ఏమిటన్నదే ప్రశ్న. కారు డ్రైవరు కుక్కనో, కోడినో తప్పించబోయి యాక్సిడెంట్ చేసి మనుషుల్ని చంపడం మనిషికి ఆదర్శం కాదు.

విజ్ఞాన శాస్త్ర అభివృద్ధి క్రమంలో కరెంటును కనుక్కోవడం ఒక పెద్ద మలుపు. కరెంటు మనిషి జీవన విధానాన్నే మార్చేసింది. ఉత్పత్తి వేగాన్ని పెంచింది. కరెంటు అనే ఒక ఆధునిక విజ్ఞానశాస్త్ర సౌకర్యాన్ని అడ్డుకోవడం ఎవరి తరమూకాదు. అడ్డుకోవలసిన అవసరమూ లేదు. ఆ కొమ్మ మీద గూడు కోల్పోయిన పక్షులు మరో చెట్టుకొమ్మను సులభంగానే వెతుక్కుంటాయి. పెద్ద పెద్ద ప్రాజెక్టుల వల్ల గూడు కోల్పోయి నిర్వాసితులైన ప్రజలు మరో గూడు వెతుక్కోవడం అంత సులభం కాదు. లక్షలాది ఎకరాల పొలాల్లో పంటలు పండించడం కోసం వేలాదిమంది నిరుపేదలు నిర్వాసితులయితే అటు ప్రభుత్వంగానీ, ఇటు పక్షులపై సానుభూతి చూపించే భూతదయాపరులుగానీ పట్టించుకోవడం లేదు. ప్రాచీన కాలంలో శ్రమజీవులు కనుగొన్న నాగలి, ఆధునిక కాలంలో శాస్త్రవేత్తలు కనుగొన్న కరెంటు ఉత్పత్తిని గణనీయంగా పెంచి వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టినది. స్థిర వ్యవసాయంతో భూస్వామ్య వ్యవస్థ ఏర్పడడానికి నాగలి ఉపయోగపడితే,

పారిశ్రామికీకరణతో పెట్టుబడిదారీ సమాజం ఏర్పడడానికి కరెంటు ఉపయోగపడింది. ఇవి సమాజంలో చారిత్రక పరిణామాలకు దోహదకారులైనవి.

పట్టణాలకూ, గ్రామాలకూ కరెంటు రావడం అనే సమకాలీన సమాజంలో కలిగిన మార్పును విశ్వనాథ సాధారణమైన మార్పుగా చూశాడేగాని, దాని చారిత్రక అనివార్యతను గుర్తించలేదు. పైగా వ్యక్తిగత జీవితంలోనూ, సమాజంలోనూ ఆ కరెంటు వల్ల కలిగిన ఫలితాల్ని విశ్వనాథ కూడా ఏమాత్రం వ్యతిరేకించకుండా అనుభవించగలిగాడు. ఈ ఆధునిక విజ్ఞాన శాస్త్ర అభివృద్ధిని అంగీకరించి, దానివల్ల సమాజంలో రాబోయే ఫలితాల్ని ఊహించగలిగితే విశ్వనాథ కూడా ముందుచూపున్న రచయిత అయ్యుండేవాడు. ఆయన భాషలో చెప్పాలంటే ఆయన లలాట లిఖితం అలావుంది, ఎవరు మార్చగలరు!

ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి' నవలలో తక్కెళ్ళు జగ్గడి పాత్ర ఉన్నవ ముందుచూపుకు నిదర్శనం. ఉన్నోళ్ళను కొల్లగొట్టి పేదోళ్ళకు పంచాలనే అతని అవగాహన మోటుగా కనిపించవచ్చుగానీ, నిజానికి జరగాల్సింది అదేకదా. అయితే ఒక వ్యక్తీ కొద్దిమంది వ్యక్తుల్లో చెయ్యవలసిన పని కాదది. ఒక స్పష్టమైన సైద్ధాంతిక దృక్పథంతో ఉద్యమ రూపంలో నిర్వర్తించవలసిన బృహత్తర కార్యక్రమం అది. 1917లో సోవియట్ యూనియన్‌లో సోషలిస్టు వ్యవస్థకు మార్గం ఏర్పడిన నేపథ్యంలో, భారతదేశంలో ఇంకా కమ్యూనిస్టు పార్టీ కృషి ప్రారంభంకాని దశలో 1920లలో ఉన్నవ ఇలా మోటుగానయినా సరే ఊహించగలగడం, దానికి సాహిత్యరూపం ఇవ్వడం బాలగోపాల్ చెప్పిన వర్తమానంలో గోచరించే భవిష్యత్తును సూచించడమే. కాబట్టి గొప్ప రచనకు బాలగోపాల్ యిచ్చిన నిర్వచనం మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతానికి ఒక ముఖ్య సాధనమే.

మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల కాలంలో మధ్యతరగతిలోని కొందరు క్రమంగా ఒక మోస్తరు పెట్టుబడిదార్లుగా ఎదగడం కుటుంబరావు కథల్లో కనిపిస్తుందని బాలగోపాల్ చేసిన విశ్లేషణ కూడా గొప్ప రచనకు ఆయనిచ్చిన నిర్వచనానికి సంబంధించినదే. మధ్యతరగతి మనుషుల్లాగా ఆర్థిక సంక్షోభాలకుగురై, అప్పులు చేసి, పైరవీకారుల్ని ఆశ్రయించి, ఏవో పర్మిట్లు, కోటాలు, లైసెన్సులు కాంట్రాక్టులు సంపాదించి ధనికులై పెట్టుబడిదారులుగా అవతారాలెత్తిన ఒక వర్గం గురించిన చిత్రణ కుటుంబరావు రాసిన 1940లనాటి కథల్లో కనిపించడం చారిత్రకమైన పరిణామాన్ని సూచించడమే. అయితే వీళ్ళు ఉత్పత్తినిపెంచే పారిశ్రామిక పెట్టుబడిదార్లుకారు, దళారీ పాత్ర నిర్వర్తించే పెట్టుబడిదార్లు, వెళ్ళనే లంపెన్ పెట్టుబడిదార్లు అంటారు. "ఉత్పాదక శ్రమ చేయకుండా ఉత్పాదక శ్రామికులను ఆవరించి జీవించే అథో ప్రపంచ నివారణలు లంపెన్ కార్మికులయితే, ఆ ఉత్పాదక శ్రామికులను దోచుకునే పారిశ్రామిక పెట్టుబడిదార్ల ప్రపంచాన్ని ఆవరించి జీవించే వాళ్లు లంపెన్ పెట్టుబడిదార్లు". (రూపం -సారం' పేజి 13)

భూస్వామ్య విలువలతో ఉన్న ఒక శ్రామికుడు - డబ్బుకు విలువ ఇచ్చే పెట్టుబడిదారీ సమాజ మనస్తత్వాన్ని అలవర్చుకున్న అసలు సిసలైన కార్మికుడుగా మారిన క్రమాన్ని కుటుంబరావు చిత్రించాడని బాలగోపాల్ విశ్లేషించిన 'కొత్త జీవితం' అనే కథ చారిత్రక పరిణామాన్ని సూచించేదే. ఈ కథలోని విఠల్ అనే వ్యక్తి కుటుంబ పోషణకోసం పట్టణం వెళ్ళి ఒక ఫ్యాక్టరీలో కార్మికుడవుతాడు. ప్రతినెలా తాను మిగిల్చి పంపే డబ్బుతో తనతల్లి అప్పుతీర్చేసి ఉంటుందని అనుకుంటాడు. కాని ఆమె అప్పుతీర్చకుండా చాదస్తపు ఆచారాలకు ఖర్చుపెట్టిందని తెలిసి బాధపడతాడు. అంతేగాక తన శ్రమను తన కుటుంబ సభ్యులు గౌరవించలేదని ఆవేదన చెంది కోపపడతాడు. సమ్మె సందర్భంగా తోటి కూలీలు చూపించిన పరస్పర ఆదరాన్ని గుర్తు చేసుకుంటాడు. ఇక నుంచి ఇంటికి ఒక్కపైసా కూడా పంపకూడదని నిర్ణయించుకొని తనగ్రామం నుంచి పట్టణానికి వస్తాడు. ఇప్పుడతను నిజమైన పారిశ్రామికుడని కుటుంబరావు అంటాడు. విఠల్ అనే కార్మికుడు తన కుటుంబంలో ఉన్న భూస్వామ్య విలువలకూ, బూర్జువా విలువలకూ సంఘర్షణ అనే విషయాన్ని గుర్తించలేదంటాడు బాలగోపాల్. ఇష్టం ఉన్నా లేకున్నా ఇలాంటి పరిణామాలు అనివార్యంగా వస్తాయని చెప్పడమే కథ లక్షణం.

విప్లవ సాహిత్య విమర్శకులు కుటుంబరావునుండి నేర్చుకోవలసిన ఒక పద్ధతిని బాలగోపాల్ వివరించాడు. విప్లవ సాహిత్యం అభివృద్ధి చెందాలంటే దాంతోబాటు విప్లవ సాహిత్య విమర్శ అభివృద్ధి చెందాలి. ఈ విషయాన్ని కుటుంబరావు ఇలా చెప్పడు. ఇదేదో విప్లవ సాహిత్యానికి చెందిన విషయం గదా, మనకు సంబంధించింది కాదని సాధారణ పాఠకుడు అనుకుంటాడని ఊహించి కుటుంబరావు ఆ విషయాన్నే ఇలా చెబుతాడు. మంచి సాహిత్యం రాయాలంటే మంచి సాహిత్య విమర్శ రావాలని అంటాడు . 'మంచి' అనే సాధారణ పదాల్నే ఉపయోగించి విషయాన్ని పాఠకులకు ఎక్కించిన తర్వాత మంచి అనేది వర్గస్వభావాన్ని బట్టి ఉంటుందని చివర్లో వివరిస్తాడు. మార్క్సిజం తెలియని పాఠకుల్ని మార్క్సిజం వైపుకు తిప్పడానికి ఈ రకమైన శిల్పం ఉపయోగపడుతుంది. కుటుంబరావులోని వ్యాసరచనా శిల్ప రహస్యాలలో ఇదొకటి.

"శాస్త్రజ్ఞానం అన్న వ్యాసంలో కుటుంబరావు శాస్త్రీయ దృక్పథం ఏర్పడాలంటే చరిత్ర గురించి కూడ శాస్త్రీయంగా ఆలోచించాలి అంటాడు. ఆయన వివరించకుండ గాలిలోకి విసిరేసిన అమూల్యమైన వాక్యాలలో ఇది ఒకటి". ('రూపం-సారం' పేజి 41.) చరిత్ర గురించి శాస్త్రీయంగా ఆలోచించడం నేర్చుకుంటే తక్కిన అన్ని విషయాల గురించి శాస్త్రీయంగా ఆలోచించే శక్తివస్తుందని కుటుంబరావు అభిప్రాయం. అందుకే మార్క్సిజం మూల సూత్రాలలో చారిత్రక భౌతిక వాదానికి అంత ప్రాధాన్యం ఉంది. శాస్త్రీయంగా ఆలోచించలేకపోవడానికి కారణం ఏమిటి? చరిత్ర నుండి మనకు కొన్ని సామాజిక శక్తులు సాంస్కృతిక రూపంలో మన మనసులలో తిష్టవేసి కూర్చుంటాయి. వాటిలో ప్రగతి శీలమైనవీ, ప్రగతినిరోధకమైనవీ రెండూ ఉంటాయి. ప్రగతి నిరోధకమైనవి మన ఆలోచనలకు గుదిబండలుగా తయారవుతాయని బాలగోపాల్ అంటాడు. వాటిని తొలగించాలంటే వాటి మూలాలు తెలుసుకోవాలి. అలాంటి వాటిలో కులతత్వం, మత మౌఢ్యం, శ్రామిక వ్యతిరేకత మొదలైనవి కొన్ని ముఖ్యమైనవి. వీటిని వదిలిపెట్టకుండా దేన్ని గురించయినా శాస్త్రీయంగా ఆలోచించడం కష్టం. అయితే వీటన్నింటినీ వరుస పెట్టి ఒక్కొక్కదాన్ని వదిలిపెట్టే దాకా శాస్త్రీయమైన ఆలోచన ఉండదా? శాస్త్రీయంగా ఆలోచించే క్రమంలోనే ఆ ఆలోచనకు సంబంధించిన ఆచరణ క్రమంలోనే వాటిని తొలగించుకునే శక్తి కూడా తోడవుతుంది.

కుటుంబరావు మార్క్సిస్టు విమర్శకుడయినంత మాత్రాన బాలగోపాల్ ఆయనలోని పరిమితుల్ని చెప్పకుండా వదల్లేదు. అవి మార్క్సిజానికున్న పరిమితులుగా గాక, మార్క్సిస్టు విమర్శకుడనే వ్యక్తికున్న పరిమితులుగా బాలగోపాల్ చూశాడు. అలాంటి పరిమితుల్లో కుటుంబరావుకున్న ఒక పరిమితి మధ్యతరగతి పాఠకులకు వాళ్ళభాషలో చెప్పి వాళ్ళను మార్క్సిజం వైపు తిప్పాలనుకోవడం. ఈ టెక్నిక్ మంచిదేగాని అది శ్రుతిమించకూడదని బాలగోపాల్ అభిప్రాయం. తగిన శాస్త్రీయ పరిభాషలు లేకుండా, సిద్ధాంత చట్రం లేకుండా శాస్త్రీయంగా ఆలోచించడం సాధ్యమేననే అపోహను అది కలిగించే ప్రమాదం ఉందంటాడు.

బూర్జువా హేతువాదులకు వాళ్ళ భాషలోనే చెప్పే ప్రయత్నం 'అనవసరమయిన నమ్మకాలు' లాంటి వ్యాసాలలో ఉన్నట్టు బాలగోపాల్ గుర్తించాడు. మూఢనమ్మకాలను ప్రమాదరకమైనవి కొన్ని అనీ, అంత ప్రమాదకరం కానివి కొన్ని అనీ విభజించడంలో కుటుంబరావు తనకు తాను ఒక పరిమితిని విధించుకుంటున్నాడు. అది ఒక ఎత్తుగడగానే కావచ్చు గాక.

ఆ పరిమితి అంత ప్రమాదకరం కాని మూఢవిశ్వాసాలను కలిగుండవచ్చనే భావన పాఠకులలో ఏర్పడడానికి అవకాశం కల్పిస్తుంది. దీనికన్నా వర్గపోరాటానికి ప్రతిబంధకంగా ఉన్నవీ, ప్రతిబంధకంగా లేనివీ అనే పద్ధతిలో మూఢవిశ్వాసాలను విభజించవచ్చని బాలగోపాల్ భావిస్తాడు. అంటే వర్గపోరాట క్రమంలో ఒక్కో దశలో కొన్ని కొన్ని మూఢవిశ్వాసాలను పట్టించుకోవాలన్నది ఆయన అభిప్రాయం.

లంపెన్ బూర్జువా వర్గాన్ని దానికి సామాజికంగా సన్నిహితమయిన మధ్యతరగతి కళ్ళతో చూపించడంవల్ల కుటుంబరావుకు వ్యంగ్యశైలి అలవడిందనీ, కొందరికది సంతృప్తి కలిగించవచ్చుగాని మార్క్సిస్టు దృక్పథం నుండి అదొక తీవ్రమయిన పరిమితి అంటూ బాలగోపాల్ ఆ పరిమితే బూర్జువా విమర్శకులకు కుటుంబరావు పట్ల ఒక సద్భావం ఏర్పడడానికి కారణమైందన్నాడు. విప్లవ సాహిత్యంలో ఈ శైలికి చాలా తక్కువ ప్రాధాన్యం ఉంటుందనీ, విప్లవ సాహిత్యానికి ఒక రకమైన ఉదాత్త గంభీరమైన శైలి అవసరమవుతుందనీ మొత్తం విప్లవ సాహిత్యాన్ని చూస్తే మనం సులభంగానే అర్థం చేసుకోవచ్చు. అందుకే కుటుంబరావుపట్ల బూర్జువా విమర్శకులు చూపుతున్న ఆదరణ అల్లం రాజయ్య పట్ల చూపరని 1982లోనే 27ఏళ్ళక్రితం బాలగోపాల్ చేసిన ఊహ ఇప్పటికి నిజమే అయింది. కుటుంబరావు ఈ కథలు రాసేనాటికి భారతదేశంలో వర్గపోరాటం తీవ్రంగా లేనిమాట నిజమే అయినా, లంపెన్ బూర్జువా వర్గాన్ని దాని మోసపూరిత వ్యాపారానికి బలయిన పేదవాళ్ళ కళ్ళతో చూపించి ఉంటే మరికొంత న్యాయంగా ఉండేదనీ, ఈ పరిమితిని కుటుంబరావు 1970 తర్వాత అంటే నక్సల్బరీ శ్రీకాకుళ పోరాటాలు ప్రారంభమయ్యాక, విప్లవ రచయితలు సంఘం ఏర్పడ్డాక తన వ్యాసాలలో అధిగమించాడనీ బాలగోపాల్ అన్నమాట వాస్తవం. అయితే ఈ వ్యాసాలు 'విశాలాంధ్ర' వారి చేతిలో సంకలనానికి నోచుకుంటాయా అన్నది అనుమానమేనని ఆనాడు బాలగోపాల్ ఊహించింది కూడా నిజమైంది. విశాలాంధ్ర వారు కథలు, నవలలు, గల్పికలు అచ్చువేశారేగాని వ్యాసాలు వెయ్యలేదు. ఆ బాధ్యతను విరసం నిర్వర్తించింది.

❖ ❖ ❖

రావిశాస్త్రి కుటుంబరావుల విషయాల్లో ఒక చిత్రమైన పోలిక కనిపిస్తుంది. రావిశాస్త్రి చిత్రించిన లంపెన్ శ్రామిక వర్గంగానీ, కుటుంబరావు చిత్రించిన మధ్యతరగతి వర్గంగానీ ప్రత్యక్షంగా విప్లవంలో పాల్గొనేవి కావు. విప్లవంలో పాల్గొనేది ప్రధానంగా రైతాంగ కార్మికవర్గాలు. ఈ వర్గం గురించి రావిశాస్త్రి కుటుంబరావులిద్దరూ రాయలేదు. అలా రాయకపోవడం గురించి వాళ్ళను తప్పుపట్టక్కరలేదు. అది వాళ్ళ పరిమితి. ఈ విషయాన్ని బాలగోపాల్ స్పష్టంగానే గుర్తించాడు. రావిశాస్త్రి లంపెన్‌ల గురించి గాక శ్రామికవర్గం గురించి రాసి ఉంటే బాగుండేదనీ, కుటుంబరావు మధ్యతరగతి కళ్ళతో గాక శ్రామిక వర్గంని కళ్ళతో చూసి రాసి వుంటే బాగుండేదనీ బాలగోపాల్ అనడంలో రావిశాస్త్రి, కుటుంబరావులకున్న పరిమితి ఒక లోపంగానే అర్థమవుతుంది. ఈ పరిమితి లేదా లోపం అన్నది కూడా మొత్తం విప్లవ సాహిత్యంలో ఒక లోటును పూడ్చేదిగానే ఉంటుందని ఎందుకనుకోగూడదు? ఈనాటికి సాహిత్యానికేగాదు, విప్లవ సాహిత్యానికి గూడా పాఠకులు ఎక్కువగా మధ్యతరగతిలోనే ఉన్నారు. శ్రామిక, లంపెన్ శ్రామిక వర్గాలలో విప్లవ సాహిత్యానికున్న పాఠకులు చాలా తక్కువ. ఈ వర్గాలలో పాఠకులకన్నా శ్రోతలు ఎక్కువగా ఉంటారు. చదువుకునే సాహిత్యం కన్నా, వినే సాహిత్యం వారికి అవసరం. ఈ అవసరాన్ని జననాట్య మండలిలాంటి సంస్థలు కొంత తీర్చినా, ఇంకా తీర్చవలసింది చాలానే ఉంది. రావిశాస్త్రి శ్రామిక వర్గం గురించి రాసినా, కుటుంబరావు శ్రామిక వర్గం చూపుతో రాసినా వాళ్ళు చదువుకునే సాహిత్యం రాయగలరేగాని, వినే సాహిత్యం రాయలేరు గదా! మధ్యతరగతి పాఠకులకు విప్లవ భావ చైతన్యం, విప్లవ దృక్పథం, సమాజ పరిణామాల్ని అర్థం చేసుకునే శక్తి, ఈ వ్యవస్థలోని లోపాలను చూడగల దృష్టి కలిగించడంలో ఈ ఇద్దరు రచయితలూ నూటికి నూరుపాళ్ళు విజయం సాధించారనే నేననుకుంటున్నాను. నక్సల్బరీ శ్రీకాకుళ పోరాటాల నేపథ్యంలో విప్లవోద్యమ జీవితాన్ని చిత్రించగల అల్లం రాజయ్యలాంటి రచయితలూ, రాగో, సరిహద్దు, వంటి నవలల ద్వారా విప్లవకారుల జీవితాల్ని చిత్రించిన సాధనలాంటి ఉద్యమంలో ఉన్న రచయితలూ ఎలాగూ వస్తారు. ఈ రెండు సాహిత్యాల విప్లవ సాహిత్యం సుసంపన్నం అయిందనే అనుకోవచ్చు.

❖ ❖ ❖

ఇక బాలగోపాల్ మరో పార్శ్వం సాహిత్య విమర్శపై చూపిన ప్రభావాన్ని పరిశీలించడం మన బాధ్యత కూడా.

"ఏ సిద్ధాంతమూ అన్ని ప్రశ్నలకూ సమగ్రమైన సమాధానం యివ్వదు. ప్రతి సిద్ధాంతమూ కొన్ని ప్రశ్నలకు సంతృప్తికరంగా సమాధానం చెపుతుంది. కొన్నిటికి అసంతృప్తికరంగా చెపుతుంది. కొన్నిటికి అసలే చెప్పదు" ఇవి 'కల్లోల కథా చిత్రాలు' అనే తన వ్యాస సంకలనానికి రాసుకున్న 'చివరి మాట' లోనివి. ఈ సంకలనం లోని వ్యాసాల పరిమితుల గురించీ, మార్క్సిజం పట్లా, మార్క్సిస్టుల పట్లా ఏర్పడ్డ అసంతృప్తి గురించీ చర్చించవలసినవి ఈ చివరి మాటలో అనేకం ఉన్నా, వాటి సారాంశం పైన నేను కోట్ చేసిన మాటలలో ఉంది. అంటే ఇతర అన్ని సిద్ధాంతాలూ ఎలా అన్ని ప్రశ్నలకూ సమాధానం ఇవ్వలేవో, మార్క్సిజం కూడా అలాగే ఇవ్వలేదు. ఇతర అన్ని సిద్ధాంతాలూ ఎలా కొన్నిటికి సంతృప్తికరంగా మరికొన్నిటికి అసంతృప్తి కరంగా సమాధానాలు చెబుతాయో, మార్క్సిజం కూడా అలాగే చెబుతుంది. మార్క్సిజం కూడా ఇతర సిద్ధాంతాల లాంటిదేగాని, దాని విశిష్టత ఏమీ లేదన్నట్టుగా బాలగోపాల్ అభిప్రాయపడినట్టు తెలుస్తోంది.

బాలగోపాల్‌లో ఈ మార్పురావడానికి వ్యక్తిగతంగా సబ్జెక్టివ్‌గా ఏ కారణాలున్నాయో తెలియదుగాని, వస్తుగతంగా ఆబ్జెక్టివ్‌గా చూస్తే ఒక కారణం కనిపిస్తుంది. మార్క్సిజాన్ని నమ్మినదశలో అది సర్వరోగనివారిణి అనుకుంటేనే, నమ్మకం సడలిన దశలో అది సర్వరోగ నివారిణి కాదు అని భావించడానికి అవకాశం ఉంటుంది. శాస్త్ర విషయాలలో దేనికయినా పరిమితులుంటాయనేది ఎంత నిజమో, ఆ పరిమితుల్ని అంగీకరిస్తూనే, ఇతర అన్ని సిద్ధాంతాలకంటే మార్క్సిజం సమాజ గమనాన్ని అర్థం చేసుకోడానికి ఉపయోగపడే గొప్ప సాధనం అన్నదీ అంతే నిజం. అంతేకాదు, సమాజాన్ని మార్చడానికి ఆచరణ సాధ్యమయిన ఒక దిశానిర్దేశాన్ని కలిగించిందన్నదీ అంతే సత్యం. ఏదీ సమగ్రం కాదు, ఏదీ సంపూర్ణం కాదు, నిజమే. అన్నిటికీ పరిమితులున్నాయి. అదీ నిజమే. అయితే? మార్క్స్ కలలుగన్న సమసమాజం పరిపూర్ణమైనదా? ఇప్పటికి పరిపూర్ణమైనదే కావచ్చు. కానీ అప్పటికి అది పరిపూర్ణం కాకపోవచ్చు. పరిపూర్ణం అనేది ఒక ఆదర్శం అనుకుంటే, ఆ ఆదర్శం వైపు వెళ్ళడానికి సహకరించేది మార్క్సిజం. ఎప్పటికప్పుడు మానవుడు అసంతృప్తి చెందకపోతే, ఆ అసంతృప్తిని తొలగించుకుని సంతృప్తిని పొందలేడు, ఎప్పటికప్పుడు అప్పటికంటే ఉన్నతమైన జీవితాన్ని పొందాలనుకుంటాడుగాని, ఒకే సారి సంపూర్ణ జీవితాన్ని పొందలేడు. అందరు తత్వవేత్తలూ ప్రపంచాన్ని రకరకాలుగా వ్యాఖ్యానించారుగాని, ఎన్ని పరిమితులతోనయినా దాన్ని మార్చడానికి మార్గం చూపింది మార్క్స్. ఈ మార్గంలో వెళ్ళే క్రమంలో వచ్చే సమస్యల్ని పరిష్కరించుకునే శక్తిని మార్క్సిజం ఇస్తుందన్న నమ్మకం ఉంటే చాలు. సోషలిస్టు, కమ్యూనిస్టు వ్యవస్థల తర్వాత ఏ సమస్యలు వస్తాయి? వాటికి పరిష్కార మార్గాలేమిటి? వాటిన్నిటినీ ఇప్పుడే తెల్చుకోవాలనుకోవడం సాధ్యం కాదు. అది మార్క్సిజమూ కాదు. ప్రపంచాన్ని మార్చడానికుపయోగపడే మార్క్సిజం, తాను కూడా మార్పులకు లోను కాకుండా ఉండదు. అందుకే మార్క్సిజం జడపదార్థం కాదు, సజీవ నిత్యనూతన చైతన్య పదార్థం.

మార్క్సిస్టుల పట్ల మాత్రమేగాక, మార్క్సిజం పట్ల కూడా అసంతృప్తి కలిగిన దశలో బాలగోపాల్ సాహిత్యం గురించి ఎలాంటి అభిప్రాయాలు వ్యక్తం చేశాడో చూద్దాం.

"జీవితంలోని ఖాళీలను పూర్తి చేయడం సాహిత్యం పాత్ర అని చెప్పవచ్చు. దానికి వేరే ఏ కర్తవ్యాన్ని అప్పగించడంలోనూ అర్థం లేదు".

"సంపూర్ణమైన మంచి, సంపూర్ణమైన సుఖం, సంపూర్ణమైన సౌందర్యం, సంపూర్ణమైన సాహసం మొదలైనవన్నీ పరిపూర్ణతా భావనలో భాగమైనవే.

నిజ జీవితానికీ, ఈ పరిపూర్ణతా భావనకూ మధ్యనున్న అంతరం జీవితంలోని ఖాళీలలో ఒకటి. అది కల్పించే దాహం సాహిత్యానికి గొప్ప దోహదకారి అయింది."

"మానవ అస్తిత్వంలోని ఈ రకరకాల 'ఖాళీలు' సాహిత్యం జన్మస్థలం, దాని కార్యక్షేత్రం. అటువంటి ప్రక్రియ మనిషి అస్తిత్వ నైజం వల్లనే అవసరమయింది. సాహిత్యానికి ఉండే ఈ నైజాన్ని గుర్తించి దానితో సమసమాజ ఆదర్శానికి అనుగుణంగా వ్యవహరించడం నేర్చుకోగలిగితే దానికి ఏమైనా ప్రమాణాలు రూపొందించుకోగలిగితే అది ప్రజా సాహిత్య సిద్ధాంతం కాగలదు. సోషలిస్టు సాహిత్య సిద్ధాంతం కాగలదు. 'కళ ప్రజల కోసం' అనే నినాదానికి వేరే ఏ కార్యరూపం ఇచ్చే ప్రయత్నం చేసినా, అది సాహిత్యానికిగానీ, ప్రజలకుగానీ మేలు చేయదు".

"ఉద్యమాలు మానవ జీవితంలో ఎప్పుడూ ఒక చిన్న భాగం మాత్రమే. సాహిత్యం పాత్ర దానికి పరిమితం కాదు. అది జీవితమంత విస్తృతమైనది".

ఈ మాటలన్నీ **2001**వ సంవత్సరంలో 'ప్రజాతంత్ర' చేసిన ఇంటర్వ్యూలో బాలగోపాల్ చెప్పినవి. సాహిత్యం గురించి బాలగోపాల్ తన అభిప్రాయాన్ని చివరి సారిగా వ్యక్తం చేసింది కూడా ఆ ఇంటర్వ్యూలోనే. వీటికితోడు ఆయన వ్యక్తం చేసిన మరికొన్ని అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

- ప్రజలలో విప్లవోత్తేజం కలిగించడం అనే ఒకే ఒక కర్తవ్యానికి సాహిత్యం పాత్రను పరిమితం చెయ్యకూడదు.

- జీవిత మూలాలకు సంబంధించిన సత్యాన్వేషణ ఇంకా పూర్తి కాలేదు. పూర్తయిందని మార్క్సిస్టులు అనుకుంటున్నారు. తత్వశాస్త్రం రాజకీయాలలోనేగాక సాహిత్యంలో కూడా ఈ రకమైన అధ్యయనం జరగలేదు. సాహిత్యాన్ని శిల్పమే రూపొందిస్తుంది.

జీవితంలోని ఖాళీలను పూర్తి చేయడం సాహిత్యం పాత్ర అని బాలగోపాల్ చెప్పిన అభిప్రాయంతో ఎవరూ విభేదించాల్సిన అవసరం లేదు. అయితే సాహిత్యానికి ఇతర ఏ కర్తవ్యాన్నీ అప్పగించడంతో అర్థం లేదన్న దాన్ని మాత్రం ఏ మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడూ అంగీకరించలేడు.

జీవితంలోని ఖాళీలంటే ఏమిటి? మానవుడు ఊహించగలిగిన ఆదర్శప్రాయమైన పరిపూర్ణ జీవితానికీ, ప్రస్తుతం అతడనుభవిస్తున్న వాస్తవిక జీవితానికీ మధ్య ఎంతో అంతరం ఉంది. ఈ అంతరమే జీవితంలోని పెద్ద ఖాళీ. దీని ఆధారంగా ఇంకా అనేక ఖాళీలను గుర్తించవచ్చు. అవినీతి లేని సమాజాన్ని మానవుడు కోరుకుంటారు. కానీ ఎక్కడ చూసినా అవినీతే. న్యాయంగా ప్రవర్తించాలని మానవుడు కోరుకుంటాడు. కానీ న్యాయాన్ని అనుసరించేవాడు కష్టాల పాలవుతాడు. శ్రమకు తగిన ఫలితం కావాలని మానవుడు కోరుకుంటాడు. కానీ శ్రమకు తగిన ఫలితంరాదు కుల మత బేధాలుండకూడదనుకుంటాడు. కానీ జీవితంలో అణువణువునా అవి కనిపిస్తుంటాయి. అందరూ సమానం అనుకుంటాడు. ఆ సమానత్వం ఎక్కడా కనబడదు. ఇలా జీవితంలో ఎన్నో ఖాళీలు ఉంటాయి. ఈ ఖాళీలను పూర్తి చేసుకోవాలన్న కోరిక, తపన మానవుడిలో ఉంటాయి. యుగ యుగాలుగా ఇవి నెరవేరలేదు. ఇవి నెరవేరడానికి ఇంకా చాలా కాలం పడుతుందని కూడా అతనికి తెలుసు. ఒక్కోసారి అసలు అవి ఎప్పటికైనా నెరవేరతాయా అన్న సందేహం కూడా రావచ్చు. అయినా మానవుడు వాటిని నెరవేర్చుకోడానికి తన ప్రయత్నాన్ని కొనసాగిస్తూనే ఉంటాడు.

ఆదిమానవుడి కాలం నుంచి ఈనాటి వరకు మానవ ప్రస్థానాన్ని పరిశీలిస్తే, అందు ఎన్నో ఖాళీలను పూర్తి చేసుకుంటూ వచ్చిన వైనం అర్థమవుతుంది. ఒకనాడు ప్రత్యక్ష బానిసగా బతికినవాడు కాలక్రమంలో ఆ బానిసత్వాన్ని తొలగించుకోగలిగాడు. అయితే పరోక్షంగా బానిసత్వం ఎంతో కొంత ఉంటుంది. ముందు ముందు దాన్ని తొలగించుకోడానికీ నిరంతర ప్రయత్నం సాగిస్తూనే ఉంటాడు. ఆహార సేకరణ దశలోనుంచి ఆహార ఉత్పత్తి దశలోకి వచ్చి, ఇవాళ, అధికోత్పత్తిని సాధించగలుగుతున్నాడు. తక్కువ ఉత్పత్తికీ, ఎక్కువ ఉత్పత్తికీ మధ్య ఉన్న ఖాళీని కొంతమేరకు అధిగమించగలిగాడు. అయితే ఉత్పత్తికీ, ప్రజలందరికీ న్యాయమైన పంపిణీకీ మధ్యగల ఖాళీని ఇంకా పూర్తి చెయ్యలేదు. ఈ ఖాళీని పూర్తి చెయ్యడానికి సోషలిస్టు వ్యవస్థా, ఆ తర్వాత కమ్యూనిస్టు వ్యవస్థా రావాలి.

సాహిత్యంలో ఊహల ద్వారా, కల్పనల ద్వారా ఈ ఖాళీలను పూర్తి చేసుకుని మానవుడు సంతృప్తి పడవచ్చు. ఇలా సంతృప్తి పడడం మంచిదా కాదా అనే సందేహం ఉండనే ఉంది. సాహిత్యం నిజంగానే జీవితంలోని ఖాళీలను పూర్తి చెయ్యగలుగుతుందా? అలా చెయ్యగలుగుతుందనడం వాస్తవం కాదు. ఎందుకంటే సాహిత్యం దానంతటది సమస్యల్ని పరిష్కరించలేదు. సమస్యల పరిష్కారానికి మానవుడు పూనుకొనే విధంగా ప్రేరణ కలిగిస్తుంది. సిద్ధాంతం సమస్యలకు పరిష్కారం చూపిస్తే, సాహిత్యం ఆ పరిష్కారం వైపు మానవుణ్ణి పురి కొల్పుతుంది. కార్యాచరణకు దిగడానికి అవసరమైన చైతన్యాన్నిస్తుంది. ఎన్ని కష్టాలెదురైనా న్యాయం కోసం నిలబడాలన్న పోరాట స్ఫూర్తిని కలిగిస్తుంది. వ్యవస్థ మార్పుకోసం విప్లవాల అవసరాన్ని గుర్తింపజేసి, వాటిలో పాల్గొనాలన్న కాంక్షను రేకెత్తిస్తుంది. జీవితంలోని ఖాళీలను పూర్తి చేస్తున్నట్టు చిత్రించడమేకాదు, సాహిత్యానికి ఇంతటి బృహత్తరమైన పాత్ర ఉంటుంది.

సాహిత్యం ఈ బృహత్తరమైన పాత్రను నిర్వర్తించడానికి ఉద్యమాలు అవసరం. ఉద్యమం అనేది వ్యక్తులు విడివిడిగా నిర్వహించేది కాదు, సమిష్టిగా నిర్వహించేది. ఉద్యమ రూపం ధరిస్తేనే ఏ సమస్యకైనా పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది. ఈ వ్యవస్థలోని అవలక్షణాలు గొంగట్లో వెంట్రుకల్లాంటివి. ఒక్కొక్కదాన్ని ఏరివేసే కార్యక్రమం వల్ల ప్రయోజనం ఉండదు. గొంగడినే మార్చాల్సిన పరిస్థితి అనివార్యం. విప్లవం రాగానే వ్యవస్థ దానంతటది మారదు. మారడానికి అవకాశం ఏర్పడుతుంది. విప్లవం విజయవంతం కావడం కష్టంకాదు. దాన్నినిలుపుకొని, వ్యవస్థను సమూలంగా మార్చే ప్రయత్నం చెయ్యడంలో కష్టాలున్నాయి. ఈ కష్టాల్ని అధిగమించడంపైనే సోషలిస్టు వ్యవస్థ విజయవంతం కావడం అనేది ఆధారపడి వుంది. అంటే సాహిత్యం ఉద్యమస్ఫూర్తిని కలిగించేదిగా కూడా ఉండాలి. జీవితంలోని ఖాళీల్ని పూరించడమేగాకుండా, వాటిని ఎలా పూరించుకోవాలో అటువైపు ఆలోచింపజెయ్యడం సాహిత్య కర్తవ్యం, కాబట్టి ఉద్యమాలు జీవితంలో చిన్న భాగం కాదు, పెద్దభాగం.

ఉద్యమాలంటే విప్లవోద్యమాలు మాత్రమే కాదు. ఉదాహరణకు 90లలో సారా వ్యతిరేక పోరాటం జరిగింది. సారాను నిషేధింపవలసిన స్థితి ప్రభుత్వానికి ఏర్పడింది. ఆ మేరకు ఆ పోరాటం విజయం సాధించింది. ఆ తర్వాత నిషేధాన్ని ప్రభుత్వం తొలగించి ఉండవచ్చు. అంతమాత్రాన అది విఫలమైందని భావించనక్కర లేదు. ప్రజలు దేనినైనా పోరాడి సాధించగలరనే ఒక వాస్తవం రుజువైంది. ప్రజలు ఉద్యమించడానికి అది ప్రేరణనిస్తుంది. సాహిత్యం ఈ విజయాన్నీ, వైఫల్యాన్నీ రెండింటినీ చిత్రిస్తుంది. అయితే ఈ వైఫల్యం తాత్కాలికమనీ, మళ్ళీ ప్రజలు ఉద్యమించి విజయం సాధించగలరనీ, ప్రజలదే అంతిమ విజయం అనీ ఒక విలువను సాహిత్యం ఎత్తి పడుతుంది. విప్లవోద్యమం ఒక ప్రధాన ప్రవంతి అనుకుంటే, ఎన్నో చిన్న చిన్న ఉద్యమాలు

ఉపపాయలుగా వస్తుంటాయి. ఇవన్నీ గెలుపు - ఓటమి - గెలుపు అనే క్రమంలో సాగుతుంటాయి. ఇది నిరంతర ప్రక్రియ. ఈ మహా ప్రక్రియలో ఒప్పులతో బాటు తప్పులూ జరుగుతుంటాయి. తప్పుల్ని దిద్దుకుంటూ ముందుకు సాగడం తప్ప, అసలు తప్పులే జరగకుండా ఉండడం సాధ్యంకాదు. అది ఆదర్శం మాత్రమే.

ప్రజలలో విప్లవోత్తేజం కలిగించడంకోసం మాత్రమే విప్లవ సాహిత్యోద్యమం పుట్టలేదు. విప్లవోత్తేజం కలిగించడం కూడా విప్లవ సాహిత్యానికి ఒక కర్తవ్యమే. విప్లవోద్యమం కొత్తగా పుట్టినప్పుడు సాహిత్యం - ముఖ్యంగా కవిత్వం విప్లవోత్తేజాన్ని కలిగించేదిగానే ఉంటుంది. ఉద్యమం కొనసాగుతున్న క్రమంలో వచ్చిన సాహిత్యం అలా ఉండదు. ఉద్యమ విస్తృతినీ, సమాజంపై ఉద్యమ ప్రభావాన్నీ ఉద్యమంపై సమాజ ప్రభావాన్నీ సాహిత్యం చిత్రిస్తుంది. నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల కాలం నుండి ఈనాటి వరకు వచ్చిన కవిత్వాన్నీ, కథా నవలా సాహిత్యాన్నీ పరిశీలిస్తే ఈ విషయం స్పష్టం అవుతుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాలలో వస్తున్న మార్పుల్ని ఈనాటి విప్లవ రచయితలూ, రచయిత్రులూ తమ సాహిత్యంలో చిత్రించడం లేదా? వీళ్ళందరూ విప్లవావేశంతోనే కథలూ, కవితలూ రాస్తున్నారా?

జీవిత మూలాలకు సంబంధించిన సత్యాన్వేషణ ఇంకా పూర్తి కాలేదనీ, పూర్తయిందని మార్క్సిస్టులు అనుకుంటున్నారనీ, ఈ రకమైన అధ్యయనం తత్వశాస్త్రం, రాజకీయాలలోనే గాక సాహిత్యంలో కూడా జరగలేదనీ బాలగోపాల్ చేసిన ఆ రోపణలలో ఒక ముఖ్యమైన అంశం.

ఇది మార్క్సిజంపైన ఉన్న అసంతృప్తి, మార్క్సిస్టులపైన ఉన్న కోపం వల్లా చేసిన ఆరోపణలాగా కనిపిస్తుందేగాని, శాస్త్రీయమైన విమర్శగా కనిపించదు. ఏ విషయంలోనైనా సత్యాన్వేషణ ఎంతవరకు సాగుతుంది? ఇంతటితో సత్యాన్వేషణ పూర్తయిందని ఎవరైనా చెప్పగలరా? చెబితే మాత్రం ఎవరైనా దాన్ని నమ్మే అవకాశం ఉందా? జీవితానికి సంబంధించిన పరమ సత్యమేదో కనుక్కొన్న తర్వాతనే మానవుడు దాన్ని సాధించడానికి పూనుకోవాలా? ఇంతవరకు మానవజాతి సాధించుకున్న హక్కులూ, అవకాశాలూ, సుఖాలూ మొదలైనవి సత్యాన్వేషణ పూర్తయింతర్వాత సాధించుకున్నవేనా? కొన్ని వేల సంవత్సరాల భవిష్యత్తులో ఉండే సత్యం మానవుడికి ఇవాళ ఎలా అర్థమవుతుంది? అర్థమయిందని ఎవరైనా అంటే అది నిజమౌతుందా? అసలు ఆచరణతో సంబంధం లేకుండా మానవాతీత సత్యం ఉంటుందా? ఇలాంటి ఆలోచన రేపటి ఆచరణ గీటురాయిపై నిలబడితేనే గదా అందులోని సత్యం తేలేది? మనం ఏ లోపాలూ లేని ఒక ఆదర్శ మానవుణ్ణి ఊహించగలం. ఆ ఆదర్శ మానవుడు ఏదో ఒకనాటికి రూపొందితే, అతను అంతకంటే ఆదర్శ మానవుణ్ణి ఊహించగలడేమో! దీనికి అంతం ఎక్కడ?

జీవితాన్ని అన్ని కోణాల నుండీ పరిశీలించి విశ్లేషించడం సాహిత్యం చెయ్యాల్సిన పనే. అంతమాత్రాన ఆ విశ్లేషణ పూర్తయిందనీ, సమగ్రమైన విశ్లేషణ అనీ, అందులో ఇంక తెలుసుకోదగిన సత్యం ఏదీ ఉండదనీ అనుకోవడం అశాస్త్రీయం. బూర్జువా వ్యవస్థ దుర్మార్గాన్ని కొడవటిగంటి కుటుంబరావుగారు మధ్యతరగతి దృష్టితో గాకుండా, శ్రామిక వర్గందృష్టితో చూసి రచనలుచేస్తే బాగుండేదని సలహా ఇచ్చిన బాలగోపాలే, ఆ తర్వాత కాలంలో కార్మిక రాజ్యం అవగాహననే తప్పుబట్టాడు. "సిద్ధాంత రీత్యానే సకల చారిత్రక సద్గుణాలు, విజ్ఞత కార్మిక రాజ్యానికి ఆమోదించబడ్డాయి. కాబట్టి ఆ రాజ్యానికి వెలుపల సత్యం ఎక్కడిది, జ్ఞానం ఎక్కడిది? ఆ రాజ్యానికి వెలుపల ఉండేదంతా తిరోగమనమే అయినప్పుడు దానికి స్వేచ్ఛ ఎక్కడిది?" ('శాక్కో - వాంజెట్టి' చివరి మాటలో బాలగోపాల్) అదే చివరి మాటలో ఇలా కూడా అన్నాడు. - "రాజ్యం అంటేనే హింస అనే సిద్ధాంతం కమ్యూనిస్టు పాలిత రాజ్యాలలో సర్వత్రా అలుముకున్న అనాగరికమైన హింసను సమర్థించుకోవడానికి పనికొచ్చింది".

పై రెండు అభిప్రాయాలకూ ఒక వైరుధ్యం కనిపిస్తుంది. సకల సద్గుణాలూ కార్మిక రాజ్యానికి ఆపాదించబడ్డాయంటూనే మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం రాజ్యం అంటేనే హింస అంటున్నాడు. నిజానికి రెండో అభిప్రాయమే వాస్తవం. మార్క్స్ దృష్టిలో రాజ్యం అంటే హింసే. అంతేగాని సకల సద్గుణాలనూ ఆయన రాజ్యానికి ఆపాదించలేదు. రాజ్యం అన్నప్పుడు ఎంతో కొంత హింస ఉంటుంది. కాబట్టే మార్క్స్ రాజ్యరహిత సమాజం ఉన్నతమైందని అన్నాడు. రాజ్యరహిత సమాజంలో ఉన్నత మానవుడు ఆవిర్భవిస్తాడని అన్నాడు. బూర్జువా వ్యవస్థలో శ్రామిక వర్గంపైనేగాక, బూర్జువాయేతర ప్రజలందరిపై హింస ఉంటుంది. శ్రామిక రాజ్యంలో బూర్జువాలపైనా, వారిని సమర్థించే వారిపైనా ఎంతో కొంత అణిచివేత ఉంటుంది. సోషలిస్టు వ్యవస్థలో బూర్జువా వర్గం వెంటనే అదృశ్యం అయిపోదు. బూర్జువా శక్తులు ఓడిపోయి, అవకాశం కోసం ఎదురు చూస్తుంటాయి. బూర్జువా వ్యవస్థలో ఎన్నో కొన్ని సుఖాలనుభవించే మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి ప్రజలు కూడా సోషలిస్టు వ్యవస్థలో కొన్ని సుఖాలను త్యాగం చెయ్యవలసి వస్తుంది. అందుకని వారిలో కూడా కొంత మేరకు సోషలిస్టు వ్యవస్థపై వ్యతిరేకత ఉంటుంది. దీన్ని బూర్జువా శక్తులు తమకనుకూలంగా మల్చుకొని మళ్ళీ తలెత్తే అవకాశం లేకపోలేదు. ఈ కార్మిక రాజ్యాన్ని కూల్చడానికి బయటి పెట్టుబడిదారీ రాజ్యాలు ఎలాగూ గోరీకాడ నక్కలలాగా కాచుకొని ఉంటాయి. బూర్జువా వ్యవస్థలో ఎలాగయితే శ్రామిక వర్గం పైన బూర్జువా హింస ఉంటుందో, సోషలిస్టు రాజ్యంలో బూర్జువా వర్గంపైన హింస తప్పదు. సమసమాజాన్ని వ్యతిరేకించి, దోపిడీ వ్యవస్థను పునర్నిర్మించాలనుకునే వాళ్ళపై ఏ మాత్రం హింస, అణచివేత లేకుండా, మంచి మాటలతో శాంతియుతంగా వారి మనసుల్ని మార్చి వెయ్యగల మహిమ మార్క్సిజంలో ఉండదు. బూర్జువాలలో కూడా సోషలిస్టు వ్యవస్థను సమర్థించేవారు కొద్దిశాతం ఉంటే ఉండొచ్చుగాక. అధికశాతం చేత సోషలిస్టు వ్యవస్థ తొలిదశలో కాస్త బలవంతంగానే ఆమోదింపజెయ్యాల్సి వస్తుంది. నిజానికి దీన్ని హింస అనకూడదు. దుర్మార్గాన్ని తొలగించడంకోసం దుర్మార్గుడిపై ప్రయోగించే అణచివేత, తమ స్వార్థం కోసం బూర్జువాలు ప్రయోగించే హింసలాంటిది కాదు.

'శాక్కో - వాంజెట్టి'కి రాసిన చివరిమాటలో "రేపు రాబోయే ప్రజారాజ్యంలో రాజ్యమే సమాజాన్ని విప్లవీకరించే సాధనం కాబట్టి అప్పుడు జరిగే రాజ్యహింసను విప్లవం అనాలి. ఆ తరువాత రాజ్యమే అదృశ్యమయిపోతుంది" అని వ్యంగ్యాస్త్రాన్ని ప్రయోగించాడు. ఇక్కడ కాస్త జాగ్రత్తగా ఆలోచించి అర్థం చేసుకోవలసిన అంశం ఒకటుంది. ప్రజారాజ్యం కూడా రాజ్యమేకాబట్టి ఎంతో కొంత రాజ్యహింస అనివార్యం అన్న విషయాన్ని పైన చెప్పుకొన్నాం. అదే సమయంలో కార్మిక రాజ్యాన్ని అదుపులో ఉంచడానికీ, సక్రమమార్గంలో నడిపించడానికి కార్మిక వర్గ పార్టీ - అంటే కమ్యూనిస్టు పార్టీ ఉంటుంది. ఆ కమ్యూనిస్టు పార్టీపైన కూడా బాలగోపాల్‌కు నమ్మకం లేదు. నిజమే, కమ్యూనిస్టు పార్టీ కూడా చెడిపోవడానికి అవకాశం ఉండొచ్చు. రష్యా, చైనాలలో అదే జరిగింది గదా. పారిస్ కమ్యూన్ ఓడిపోయినంత మాత్రాన రష్యా, చైనాలలో విప్లవాలు రాకుండా ఆగిపోలేదు. రష్యా, చైనాలలో తిరోగమనం వచ్చినంత మాత్రాన మిగతా దేశాలలో విప్లవాలు పురోగమించకుండా ఉండవు. రష్యా చైనాలలో కూడా ఇప్పుడున్న స్థితి పోయి ఇంకా ఉన్నత స్థాయిలో సోషలిజం రాక మానదు. చెడు ఉన్నంత కాలం మంచి ఎప్పుడూ గెలుస్తూనే ఉంటుందని ఎలా అనుకోగలం? మంచి చెడుల మధ్య నిరంతరం జరిగే సంఘర్షణ ద్వారానే అంతిమంగా మంచి గెలుస్తూ ఉంటుంది. బాలగోపాల్ వాదనను కొనసాగిస్తే అంతిమంగా మాత్రం మంచి గెలుస్తుందన్న నమ్మకం ఏమిటి అని ప్రశ్నించడానికి అవకాశం ఉంది. అప్పుడి[illegible] ఆ దేవుడు కూడా రక్షించలేడు!

ఎవరు ప్రజలో, ఎవరు ప్రజాద్రోహులో, ఏది సత్యమో, ఏది అసత్యమో, ఏది కార్మిక వర్గ దృక్పథమో, ఏది కార్మిక వ్యతిరేక దృక్పథమో తేల్చేదెవరని కూడా బాలగోపాల్ ప్రశ్నిస్తున్నాడు. ప్రతిదశలోనూ రాజ్యాన్నీ, ప్రభుత్వాన్నీ ధిక్కరించే స్వేచ్ఛ ప్రజలకుండాలని కూడా నిర్ధారిస్తున్నాడు. మరి ఆయన అభిప్రాయం ప్రకారమే ఎవరు ప్రజలో తేల్చేదెవరు?

కార్మిక రాజ్యానికి మంచి గుణాలు ఆపాదించినప్పుడు ఆ రాజ్యానికి వెలుపల ఉన్నదంతా తిరోగమనమే అయినప్పుడు దానికి స్వేచ్ఛ ఎక్కడిదని బాలగోపాల్ అడుగుతున్నాడు. స్థూలంగా చెప్పాలంటే కార్మిక రాజ్యానికి వ్యతిరేకంగా ఉన్న వారికి కూడా స్వేచ్ఛ కావాలని ఆయన అభిప్రాయం. అందుకే కార్మిక వర్గ నియంతృత్వం అనే మాట ఆయనకు నచ్చదు. అంటే మార్క్సిజం ఆయనకు పడచన్నమాట. మార్క్సిజంలో ఆ లోపం ఉంది, ఈ లోపం ఉంది అంటాడేగాని మార్క్సిజాన్ని నేరుగా వ్యతిరేకించడు. బూర్జువా నియంతృత్వం ఎలాంటిదో కార్మిక వర్గ నియంతృత్వం కూడా అలాంటిదే అనుకుంటాడు. స్వేచ్ఛ అనే మాట బాలగోపాల్ [illegible] పవిత్రమైనదిగా కనిపిస్తోంది. వర్గ వ్యవస్థలో స్వేచ్ఛ అనే దానికి వర్గస్వభావం లేకుండా ఉండదు. ఈ స్వేచ్ఛను నిజమైన స్వేచ్ఛగా [illegible]కి వీల్లేదు. ఏ దశలో కూడా హింసా ప్రయోగం లేకుండా వ్యవస్థను మార్చాలన్నది బాలగోపాల్ అభిప్రాయంగా అర్థమవుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే బాలగోపాల్‌ది అహింసా వాదం. అహింస ఒక ఆశయమేగాని, ఆయుధం ఎన్నడూ కాదని, ఆశయాన్ని సాధించాలంటే ఆయుధం అవసరమేనని, ఆశయాలు సంఘర్షించే వేళ ఆయుధం అలీనంగా ఉండదని మార్క్సిస్టు మౌలిక సూత్రాన్ని శ్రీశ్రీ తన కవిత్వంలో చెప్పారు. బాలగోపాల్ ఈ మౌలిక సూత్రంతోనే విభేదిస్తున్నాడు.

చివరగా సాహిత్య శిల్పం గురించి. సాహిత్యాన్ని శిల్పమే రూపొందిస్తున్నాడు బాలగోపాల్. నిజమే, శిల్పం లేకపోతే అది సాహిత్యం కాదు. అయితే సాహిత్యాన్ని శిల్పమే రూపొందిస్తుందనడం ఎంతవరకు నిజం? ఈ మాట అనడం ద్వారా సాహిత్య సృష్టిలో శిల్పానికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టు కనపడుతుంది. గొప్పశిల్పంతో సాహిత్య సృష్టి చెయ్యాలని రచయిత అనకొని, అడుగడుగునా జాగ్రత్తలు తీసుకుంటూ ఒక రచయిత రచనలు చేస్తాడని దీనిని బట్టి అర్థమవుతుంది. సాహిత్య సృష్టిలో శిల్పంతోపాటు వస్తువుకూ ప్రాధాన్యం ఉంటుంది. వస్తుశిల్పాలు పతాకస్థాయిలో సమపాళ్ళలో కలిస్తేనే గొప్ప సాహిత్యం వస్తుంది. ఎప్పటికప్పుడు వస్తువులోనవ్యతా, దానికనుగుణమైన శిల్పమూ రెండూ సమసిస్తే సాహిత్యం పరిపక్వమౌతుంది. రచయిత అనుభవించే అనుభూతి కేవలం శిల్ప సంబంధమైనదే కాదు, వస్తు సంబంధమైనది కూడా. వస్తువు పట్ల గాఢమైన ఆసక్తి, శిల్పం పట్ల ప్రగాఢమైన అనురక్తి - రెండూ ఉంటేనే ఉత్తమ సాహిత్యం అవుతుంది.

సాహిత్య సృష్టి సమయంలో రచయితకు శిల్పం పట్ల ప్రత్యేక దృష్టి ఉంటుందో లేదో తెలియదుగాని, ఒక వేళ ఉన్నా, ఉన్నట్టు కనబడకుండా ఉండడమే బాగుంటుంది. శిల్పం పట్ల ఉన్న శ్రద్ధ పాఠకులకు కొట్టొచ్చినట్టు కనబడగూడదు. అలా కనబడితే వస్తువు మీదకి దృష్టి మళ్ళదు. ఎంత గొప్ప శిల్పమైనా వస్తువు పైకి పాఠకుల దృష్టి మళ్ళించడమే దాని కర్తవ్యంగా ఉండాలి. అలా ఉండాలంటే రచయితకు వస్తువు పట్ల గాఢమైన అనుభూతీ, ఆసక్తీ ఉండాలి. ఆ వస్తువు తనకవసరమైన శిల్పాన్ని తానే వెతుక్కున్నదా అనిపించాలి. దీనికి మంచి ఉదాహరణలు శ్రీశ్రీ జాషువాల కవిత్వం. తాము తీవ్రంగా అనుభవించి, ఆ అనుభూతిని అదే స్థాయిలో పాఠకులలో కలిగించ గలిగిన శక్తి ఈ కవులలో ఉంది.

తెలుగు సాహిత్యంపై ప్రగతిశీల రాజకీయాల ప్రభావం వస్తువుకు ఉపయోగపడిందిగానీ, అభివ్యక్తికి పరిమితులు పెట్టిందనే బాలగోపాల్ అభిప్రాయం. తొలిదశలో అంటే అభ్యుదయ సాహిత్యోద్యమ దశలోనూ, విప్లవ సాహిత్యోద్యమం తొలిదశలోనూ కొంతవరకు నిజం కావచ్చుగానీ, 1980ల తర్వాతి విప్లవ సాహిత్యం విషయంలో నిజం కాదు. అభ్యుదయ సాహిత్యోద్యమ దశలో కూడా ఒక్క శ్రీశ్రీని మినహాయిస్తే కవిత్వం విషయంలో అభివ్యక్తిలో పరిమితులు కనిపిస్తాయిగానీ, కథ, నవల వంటి సృజనాత్మక రచన సాహిత్యం విషయంలో అభివ్యక్తికి పరిమితులు లేవు. కొడవటిగంటి కుటుంబరావు, మహీధర రామమోహనరావు, రావిశాస్త్రి లాంటి రచయితల వచన సాహిత్యంలో అభివ్యక్తిలో ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది.

ఎవ్వరికీ ఏ అన్యాయం చేయనివాళ్ళు కష్టాలకు లోనుకావడం అనేది ఎన్ని కర్మసిద్ధాంతాలు నమ్మినా, ఎంత సైన్సు చదివినా అర్థం చేసుకోలేమనీ, జీవితంలో అర్థం కానిది ఎప్పుడూ ఎంతో కొంత ఉంటుందనీ (ఏదో సారాకథకు ముందుమాటలో) బాలగోపాల్ అభిప్రాయపడడానికి మార్క్సిజం విషయంలో ఆయనకున్న అనుమానాలే కారణం. శిల్పం రీత్యా అర్థరహితం అనిపించే సాహిత్య శైలి మాత్రమే దీన్ని వ్యక్తం చెయ్యగలదనే నిర్ధారణకు రావడానికి అదే కారణం. ఎవరికీ అన్యాయం చెయ్యనంత మాత్రాన వాళ్ళు కష్టాలకు లోను కారనే అభిప్రాయం కర్మసిద్ధాంతానికి సంబంధించిందే తప్ప శాస్త్రీయ దృక్పథానికి సంబంధించింది కాదు. ఈ దోపిడీ సమాజంలో కష్టాలపాలు కావడానికి వాళ్ళ మంచి చెడ్డలతో సంబంధం లేదు. ఇది అర్థం చేసుకోలేనంత బ్రహ్మపదార్థం కాదు. దీన్ని సాహిత్యంలో వ్యక్తీకరించడానికి అర్థరహితం అనిపించే శిల్పమూ అవసరం లేదు. మార్క్సిస్టు రచయితలు అధివాస్తవిక సాహిత్య శిల్పాన్ని తిరస్కరించడానికి ఇదే కారణం. అర్థంగాని జీవితాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడేదే మార్క్సిజం. ఇతర సిద్ధాంతాలకూ, మార్క్సిజానికీ ఉన్న తేడాలలో ముఖ్యమైనది ఇదే. మార్క్సిజాన్ని అన్వయించి జీవితాన్ని అర్థం చేసుకునే క్రమంలో కొందరు పొరబాటు పడితే పడొచ్చుగానీ, అవి మార్క్సిజాన్ని అర్థం చేసుకోవడంలో ఉన్న పరిమితులేగానీ, జీవితాన్ని అర్థం చేసుకోవడానికి మార్క్సిజంలో ఉన్న పరిమితులు కాదు. 'అధి వాస్తవికుల ప్రవేశం' పేరుతో 1950లో 'కాగడా' పత్రికలో శ్రీశ్రీ పద్యాలు అచ్చయినప్పుడు వాటి కింద శ్రీశ్రీ రాసిన వ్యాఖ్యతో "సర్రియలిజమ్‌కు స్ఫాటిక స్వచ్ఛమైన [illegible]" అని ఉంది. 1940 - 60ల మధ్య కాలంలో వివిధ ప్రయోగాలపై ఆసక్తి చూపిన శ్రీశ్రీ అధివాస్తవిక కవితా ప్రయోగం కూడా చేశాడు. కానీ అది తెలుగు పాఠకుల్ని ఆకర్షించలేదు. ఏదో సరదాకు రాసినట్టు అనిపించిందేగాని పాఠకులపై అది బలమైన ముద్ర వెయ్యలేకపోయింది. వస్తువులోను, శిల్పంలోనూ అర్థరహితం అనిపించే లక్షణమే దీనికి కారణం. అందువల్ల ఈ ఈ అధివాస్తవిక సాహిత్యాన్నీ, శిల్పాన్నీ మార్క్సిస్టు రచయితలతోబాటు, పాఠకులూ తిరస్కరించారు.

తన అభిప్రాయాలు చెప్ప వదిలెయ్యడం తప్ప, బాలగోపాల్‌కు వాదోపవాదాలు, చర్చలు చెయ్యడం అలవాటు లేదు. 1993లో 'అరుణతార'లో వచ్చిన 'చరిత్ర - మనిషి - మార్క్సిజం' అన్న వ్యాసంపై ఎంత చర్చ జరిగినా, ఆయన ఆ చర్చలో పాల్గొనలేదు. 2001లో 'ప్రజాతంత్ర' పత్రిక ఇంటర్వ్యూలోనూ, రెండు మూడు ముందు మాటలూ, చివరి మాటల్లోనూ మార్క్సిజంతో పేచీపడ్డాక సాహిత్యం గురించీ తన అభిప్రాయాలు చెప్పాడు తప్ప, ఆ తర్వాత వాటిని వదిలేశాడు. గత దశాబ్దంగా మానవహక్కుల కోసం కృషి చెయ్యడం, అనేక సామాజిక సమస్యలపైన విశ్లేషణలు రాయడం కొనసాగించాడు గానీ, వివాదాస్పద అంశాల జోలికి పోలేదు.

మార్క్సిజంతో విభేదించినా, బాలగోపాల్ ప్రజల్ని వదిలి పెట్టలేదు. ప్రజలతో మమేకమై వారి హక్కుల కోసం ఆయన తపన పడడం, ఆ క్రమంలో తన వ్యక్తిగత జీవితాన్నీ, సుఖాల్నీ వదులుకోవడం మొదలైన అంశాలు అటు మేధావుల్నీ, ఇటు ప్రజల్నీ ఆకర్షించాయి. నిజాయితీతో కూడిన అతవి కార్యకలాపాలూ, నిరాడంబర జీవితమూ బాలగోపాల్ వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా నిలిపాయి.

ఒక వ్యక్తిలోని చిత్తశుద్ధీ, ప్రజల పట్ల గల ప్రేమా మాత్రమే అతని అభిప్రాయాలలోని శాస్త్రీయతను నిర్ణయించలేవు.

❖

వ్యాసం

◆ అరుణ్

# మధ్యతరగతి బుద్ధిజీవుల ఆదర్శం - బాలగోపాల్

సమాజం తాను మార్పు చెందే సమయంలో, తనకవసరమైన వ్యక్తులను రూపొందించుకుంటుంది. ఆ వ్యక్తులూ తాము మార్పు చెందుతూ, తామున్న సమాజ మార్పునకు దోహదం చేస్తారు. వారు పనిచేస్తున్న రంగాలు భిన్నమైనవి కావొచ్చు, అవి సమాజ మార్పుకు నేరుగా దోహదపడుతున్నట్టు కన్పడక పోవచ్చు. అదే సమయంలో ఆ వ్యక్తులూ, శక్తులూ భిన్న మార్గాలలో పయనించనూ వచ్చు. ఆ మార్పు నాడున్న వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేసి నూతన వ్యవస్థ ఆవిష్కరణకై సాగుతున్న ఉద్యమాల పథంగానో, లేక నేడున్న వ్యవస్థలోనే మరింత మెరుగైన జీవితాల కోసం, వెసులుబాటు కోసం జరిగే ఉద్యమాల రూపంలోనో జరుగుతూ వుండవచ్చు. అలాంటి మార్పులకై ఉద్యమించే వ్యక్తులు, ఎవరు యే మేరకు అవసరం అనేది మన ప్రాపంచిక దృక్పథం బట్టి వుంటుంది. అయితే, వ్యవస్థ రథచక్రాల కింద నలుగుతున్న పీడితులకు రెండూ అవసరమే.

కాని వ్యవస్థలో మార్పులకై జరుగుతున్న భిన్న పంథాల ఉద్యమాల పట్ల వ్యవస్థ వైఖరి యెలా వుంటుంది? వ్యవస్థ విధించే నియమ నిబంధనలు వ్యతిరేకిస్తూ, వ్యవస్థ చక్రాన్ని బద్దలు కొడుతూ, పూర్తిగా నూతన వ్యవస్థ నిర్మాణానికై కొనసాగే ఉద్యమాలను, నేడున్న వ్యవస్థను కాపాడే రాజ్యం, తన ఉక్కుపాదాలతో అణచి వేయాలనుకుంటుంది. అలాగాక, వ్యవస్థ విధించిన పరిమితులలో పని చేస్తూ, కొంత వెసులుబాటుకై జరిపే, ఉద్యమాలపట్ల కొంత మెతకవైఖరి వహిస్తుంది. అలా వహించడమూ, ఆ వ్యవస్థ ప్రయోజనాలకే అని మాత్రం మనం మరువకూడదు. నేటి వ్యవస్థ (రాజ్యం) ద్వంద్వ వైఖరి తెలుగు రాష్ట్రంలో జరిగిన, జరుగుతున్న ఉద్యమాలలో పాల్గొన్న వారికేగాక, ఆ ఉద్యమాలతో దగ్గరి సంబంధమున్న వారి కందరికీ స్వీయానుభవమే. బాలగోపాల్, ఒక ఉద్యమకారుడిగా, రాజ్యం యొక్క పై రెండు పార్శ్వాలు చూశాడు.

ఒక వ్యక్తిని అంచనా వేసేటప్పుడు, ఆనాటి సమాజంలో అతనికున్న స్థాయి, పేరు ప్రతిష్టలు, సామాజిక వారిద్దరి మధ్యనున్న సాన్నిహిత్యం ఆ అంచనాపై ప్రభావం చూపుతాయి. అదీ మరణించాక, భావోద్వేగాల కతీతంగా బాలగోపాల్ లాంటి ఉద్యమకారునిపై రాయడం, అదీ నాలాంటి సాధారణ కార్యకర్త పూనుకోవడం సాహసమే అవుతుంది కూడా. అయినా బాలగోపాల్‌తో నాకున్న రెండు దశాబ్దాల సాన్నిహిత్యం, అతనిపై నాకున్న అభిమానం, అతన్ని గురించి రాసేందుకు పురిగొల్పాయి.

ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించి, అదీ ఈ కుల వర్గ సమాజంతో అన్ని రకాల సామాజిక గౌరవాలను పొందగలిగే పరిస్థితులలో పెరిగి, ఉన్నత విద్యనభ్యసించి కూడా, ఈ వ్యవస్థ అందించే అన్ని రకాల సౌకర్యాలను పరిత్యజించి, వ్యవస్థ పీడితుల హక్కుల కోసం ఉద్యమించిన వాడు బాలగోపాల్. అయితే ఆయన్ను అందరూ నడిచే దారి నుండి - ప్రభుత్వం తరచూ చెప్పే "జనజీవన స్రవంతి" నుండి పక్కదారి పట్టించిన శక్తులేవి? ఒక సాధారణ ప్రొఫెసర్‌గా మిగిలిపోవాల్సిన బాలగోపాల్, మధ్యతరగతి బుద్ధి జీవులకు ఆదర్శనీయుడుగా మారేందుకు దోహదపడ్డ, ప్రభావితం చేసిన పరిస్థితులేమిటి? పై ప్రశ్నలకు మనం సమాధానం వెదకకపోతే, 1993ల తర్వాత బాలగోపాల్‌లో వచ్చిన మార్పునుగాని, గతంలో ఆయన్ను శత్రువుగా పరిగణించిన పోలీస్ ఆఫీసర్ అరవిందరావు నుండి, అతని పట్ల శత్రుపూరి వైఖరి నవలంభించిన అనేక మంది మధ్యతరగతి మేధావులు అతని మరణానంతరం అతన్ని ప్రశంసించడానికి కారణాలుగానీ కన్పడవు.

1980ల నుండి 90ల దాక, దాదాపు ఒక దశాబ్దం, మనరాష్ట్రం ప్రజా ఉద్యమాలతో దద్దరిల్లింది. విద్యార్థి, యువజన, కార్మికోద్యమాలతోపాటు, భూమి, భుక్తి, విముక్తి పోరాటాలు ఈ వ్యవస్థ రక్షకుల గుండెల్లో రైళ్ళను పరుగెత్తించాయి. పీడిత ప్రజలు, తామొక నూతన సమాజ ఆవిష్కరణకు దగ్గరలో వున్నామని భావించిన కాలమది. ఆంగ్లకవి వర్డ్స్ వర్త్ ఫ్రెంచి విప్లవకాలం గురించి "Bliss was it in that down to be alive (to be young was very heaven" వ్యాఖ్యానించినట్టుగా, ఉత్తర తెలంగాణలో సామాన్య ప్రజలు, మేధావులు ఆ ఉద్యమాల కాలం గురించి తన్మయత్వం చెందినకాలం. ఫ్రెంచి విప్లవం గురించి కేవలం చదివి విని వర్డ్స్‌వర్త్, పై మేరకు ఇట్లా స్పందించాడంటే ఇక ఉద్యమాల గుండెకాయ 'పోరుగల్లు'గా పిలువబడే ఓరుగల్లులో, యవ్వనతేజంతో బడుల నుండి, గనుల నుండి నిరుద్యోగ జడత నుండి, ఉద్యమాలకు ఊపిరినందిస్తున్న విద్యార్థులతో, యువకులతో అత్యంత సాన్నిహిత్యంతో మెలిగే ఉపాధ్యాయుడిగా వుండిన బాలగోపాల్ యెలా స్పందించ కూడా ఉండగలడు? అదీ తను పనిచేస్తున్న కళాశాలలోని అత్యంత మేధావులుగా, చురుకైన విద్యార్థులుగా పరిగణించబడిన యువకులు అక్రమ అరెస్టులకు గురవుతూ, చిత్ర హింసల పాలవుతూ, ఎన్‌కౌంటర్ల పేరుతో హత్య చేయబడుతుంటే 'హృదయమున్న' యే వ్యక్తి స్పందించడు? ఆ నేపథ్యంలోనే బాలగోపాల్ పౌరహక్కుల సంఘంలో సభ్యుడయ్యాడు. తన నిబద్ధత, కార్యదక్షత, త్యాగనిరతి వల్ల అనతికాలంలోనే నాయకత్వ స్థానానికి ఎదిగాడు కూడా.

బాలగోపాల్ అంతర్ముఖి, నెమ్మదస్తుడు, నిశిత పరిశీలకుడు, ఆలోచనాశీలి. ప్రజలు తమ పీడనకు వ్యతిరేకంగా ఉద్యమించే హక్కులను గుర్తించాడు. పౌరహక్కుల ఉల్లంఘనను ప్రతిఘటించే సమయంలో జరిగే హింస అనివార్యమని చెప్పాడు. 1990లో అనుకుంటాను, ఏపిటిఎఫ్ అనంతపురం. జిల్లా శాఖ నిర్వహించి అధ్యయన తరగతులకు ఉపాధ్యాయునిగా ఆయన హాజరయినపుడు ఆయనను అక్కడి కార్యకర్తలు ఆయన్ను ఇలా అడిగారు. విప్లవపార్టీ కార్యకర్తలు బస్సులు తగలేయడాన్ని, టెలిఫోన్ ఎక్ఛేంజ్‌లను తగలబెట్టడాన్ని తానుయెలా భావిస్తున్నదీ చెప్పమని ఆయన్ను సూటిగా ప్రశ్నించారు. అందుకు సమాధానంగా, తమ సహచరుల్ని రహస్యంగా ఎత్తుకెళ్ళి బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపుతున్నపుడు ఆ అరాచకాన్ని ప్రజల ముందు బయట పెట్టే నిరసనలు ఊరేగింపులు, ధర్నాలలాంటి మార్గాలన్నింటిని ప్రభుత్వం మూసివేసినపుడు ప్రజాస్వామ్య యుతంగా నిరసన తెలిపే మార్గాలు లేక ప్రభుత్వ చిహ్నాలయిన వాటిని తగులబెట్టి, తద్వార సభ్య సమాజ దృష్టికి ప్రభుత్వ అరాచకాలను తెచ్చే యత్నమే ఆ చర్యలని చెప్పాడు బాలగోపాల్. పౌరహక్కుల సంఘంలో పనిచేస్తున్న క్రమంలో, ఈ వ్యవస్థ దోపిడీ స్వభావాన్ని నిరంకుశత్వాన్ని అర్థం చేసుకున్న బాలగోపాల్, దోపిడీ, పీడన, ఆధిపత్యం లేని సమసమాజాన్ని కోరాడు. మార్క్సిస్టుగా మారాడు. అందుకే 1980ల నుండి 90ల దాకా అతను చేసిన రచనలన్నింటిలోనూ మార్క్సిస్టు దార్శనికత స్పష్టంగా కన్పడుతుంది. బాలగోపాల్ మెజారిటీ మధ్యతరగతి బుద్ధి జీవుల్లాగా, ప్రజల హక్కుల పట్ల సానుభూతి చూపించడంతో ఆగలేదు. వారి కష్టాలతో సహానుభూతి పొందాడు. వారి హక్కుల పోరాటంలో స్వయంగా పాల్గొన్నాడు. అందుకు దేశం నలుమూలలా కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఎక్కడ పౌరహక్కులకు భంగం కల్గినా, అక్కడ ప్రత్యక్షమయ్యాడు. కాశ్మీరీ ప్రజల 'విడిపోయే హక్కును' సమర్థించాడు. 'స్వయం నిర్ణయాధికారాన్ని' గుర్తించాడు. గుజరాత్‌లో ప్రభుత్వ యంత్రాంగ మద్దతుతో జరిగిన మైనారిటీల (ముస్లింల) ఊచకోతను గుర్తించాడు. దానికి వ్యతిరేకంగా ప్రజల మద్దతును సమీకరించాడు కూడా. ఇక, ఆంధ్రప్రదేశ్‌లో అతడు అడుగిడని ఊరు లేదు. అవి గిరిజనుల, కార్మికుల, రైతు కూలీల హక్కుల భంగం కావొచ్చు, లేక ఉపాధ్యాయ ఉద్యోగ వర్గాలకు జరిగిన అన్యాయాలు కావొచ్చు, బాలగోపాల్ తనదైన రీతిలో

ప్రశ్నించాడు. ఎదిరించాడు కూడా.

అయితే, బాలగోపాల్‌ది మన అంచనాలను అంత సులభంగా అందే వ్యక్తిత్వం కాదు. అందుకే 1993లకు ముందు అతన్ని ద్వేషించినవారు, అతన్ని 'శవాల పై వాలే గద్దలతో' పోల్చిన పోలీసు అధికారులు, నేడు అతని మరణానంతరం పొగుడుతున్నారంటే, 'ఆధునిక గాంధీ' అంటూ నీరాజనాలు పల్కుతున్నారంటే, సామాన్యుల కర్థం కావడం లేదు. నేడు, బాలగోపాల్ దృక్పథాల కతీతంగా అందరి మెప్పు పొందడానికి, సామాన్య ప్రజల పట్ల అతనికున్న అపార ప్రేమను, మానవహక్కుల ఉద్యమంలో అతడు నిర్వహించిన పాత్ర అతని కార్యదక్షత కొన్ని కారణాలుగా చెప్పవచ్చు. కాని, 93ల వరకు అతని పట్ల శత్రువైఖరి వహించిన మధ్యతరగతి, పాలకవర్గాలు, ప్రభుత్వ యంత్రాంగం, ఆ తర్వాత అతని పట్ల సానుకూల వైఖరిగాని కనీసం అతడు నిర్వహించిన ఉద్యమం పట్ల ఉదాసీన వైఖరి అవలంభించడానికి అతని తాత్త్విక దృక్పథంలో వచ్చిన మార్పు అని చెప్పడంలో మొహమాటం అక్కర్లేదేమో.

1980ల తర్వాత ఒక దశాబ్దకాలంగా మనరాష్ట్రంలో కొనసాగిన ప్రజా ఉద్యమాలు, విప్లవ పోరాటాలు అప్పటికింకా వినిమయ సంస్కృతిలో నిండా మునగని మధ్యతరగతిని గాఢంగా ప్రభావితం చేసాయి. పట్టణాల్లో విద్యార్థి, యువజన ఉద్యమాలు, పల్లెల్లో రైతు కూలీ పోరాటాలు, కార్మికోద్యమాలు యే మాత్రం సామాజిక స్పృహ కల్గిన వ్యక్తికైనా వాటి పట్ల యేదో ఒక ధోరణి అవలంభించక తప్పని పరిస్థితి కల్పించాయి. అదేకాలంలో సాహిత్యరంగంలో ప్రగతిశీల - తిరోగమన దృక్పథాల మధ్య ఘర్షణ వుండేది. దాంతో, ఆ దశాబ్ద కాలంలో మధ్యతరగతి దాదాపు రెండు శిబిరాలుగా విడిపోయింది. తటస్థులుగా మిగిలినవారు నాడు కొందరే (అదీ ఉద్యమ ప్రాంతాలలో). ప్రగతిశీల మేధావుల్లో కూడా ఈ వ్యవస్థ చట్రంలో సామాజిక రుగ్మతలకు, పీడనలకు పరిష్కారం కోరేవారు కొందరైతే, మరికొందరు ఈ దోపిడీ వ్యవస్థ సంపూర్ణ విధ్వంసం కోరుతూ, నూతన సమాజ ఆవిష్కరణకై ఉద్యమిస్తున్న శక్తులను బలపరిచేవారు కొందరుగా తమ కార్యకలాపాలు కొనసాగించారు. నూతన సమాజ ఆవిష్కరణకై జరుగుతున్న విప్లవోద్యమాలపై వాటికి బాసటగా నిలిచిన విద్యార్థి, యువజన, రైతు కూలీ సంఘాలపై ప్రభుత్వ దమనకాండ తీవ్రంగా ప్రారంభమయింది. అరెస్టులు, చిత్రహింసలు, కిడ్నాపులు, బూటకపు ఎన్‌కౌంటర్లు నిత్యకృత్యమయి చివరకు పై ఉద్యమాలకు మద్దతునిస్తున్న మేధావుల, పౌరహక్కుల సంఘాల ప్రతినిధులను, కవులను, కళాకారులను వదలలేదు. దీంతో సహజంగానే రెండవ రకపు మధ్యతరగతి మేధావుల శిబిరంలో ఆందోళన మొదలైంది. మధ్యతరగతికి విప్లవం ఒక ఆదర్శమే గాని, అవసరం కాదు గదా! అదే సమయంలో 1990లలో చాలా మంది 'మరో ప్రపంచం'గా భావించిన సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం, తూర్పు యూరోప్ దేశాల పతనం అంతవరకు మార్క్సిజం పట్ల, విప్లవోద్యమం పట్ల సానుకూల వైఖరి వహించిన వారిని నిరాశ నిస్పృహలలో ముంచాయి. ఒక వైపు ప్రభుత్వ తీవ్ర నిర్బంధకాండ, ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమం క్రమంగా బలహీనపడటం మరోవైపు నూతన ఆర్థిక సంస్కరణలు మధ్యతరగతికి లబ్ది చేకూర్చడం, దాంతో ఆ వర్గం పూర్తిగా వస్తు వినిమయ సంస్కృతికి, వ్యక్తివాదానికి లోనవడం జరిగింది. అదే సమయంలో తమ మార్క్సిస్టు తాత్త్విక విశ్వాసంలో నమ్మకం కోల్పోతున్న వారికి ఆధునికానంతర సిద్ధాంతాలు ప్రత్యామ్నాయంగా కన్పించాయి. దళిత ఉద్యమాలు, ఫెమిస్టు ఉద్యమాలు, మైనారిటీ హక్కుల ఉద్యమాలు లాంటి గుర్తింపు ఉద్యమాలలో పై తరహా మేధావులు తమ అస్తిత్వాన్ని చూసుకోవడం మొదలెట్టారు. వ్యవస్థ మార్పును కోరకుండా, ఈ వ్యవస్థ నియమ నిబంధనల చట్రంలో చేసే యే పోరాటాలకైనా వ్యవస్థ అనుమతినిస్తుంది. ఆ పోరాటాలకు వెసులుబాటు వుంటుంది. పోగా వ్యవస్థ మార్పుకై జరుగుతున్న పోరాటాల నుండి పీడితులను వికర్షించడానికి, తాత్కాలిక ఉపశమనాలుగా ఈ పోరాటాలను వ్యవస్థ కొండొకచో ప్రోత్సహిస్తుంది కూడా. దీనికి దాఖలాగా మన ప్రభుత్వం "కుల నిర్మూలన పోరాట సమితి", "కుల వివక్షత వ్యతిరేక సంఘాల' పట్ల వహిస్తున్న ద్వంద్వ వైఖరే. మొదటి సంఘం కుల వివక్షతకు మూలాలు పునాదిలో వెదికుతే, రెండవది సంస్కరణలలో, ఉపరితలంలో పరిష్కారాలు కోరడమే. మొదట సంఘంపై తీవ్ర నిర్బంధం, అరెస్టులు, చిత్రహింసలు, రెండవ సంఘం పట్ల సానుకూల వైఖరి కాకపోయినా, ఉదాసీన వైఖరి మనకు కన్పడుతూనే వుంది. పాలకవర్గాలు 'దళితగోవిందం' నెత్తుకుంటాయి. ఆ అవసరం వాటికుంది. భూమి సమస్యను పైకెత్తనంతకాలం మాయమవుతున్న ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ల పోరాటాలకు పాలక వర్గ పార్టీలన్నీ ఒకే గొంతుతో వత్తాసు పలుకుతాయి. లక్షలాది ఎకరాల మిగులు భూముల పంపిణీ విషయమై ఉద్యమాలు నిర్వహిస్తే యిక లాఠీలు, తూటాలే. అంటే ఉపరితలంలో పీడితుల యిక్కట్లకు పరిష్కారం కోరే వారి పట్ల సానుకూల, ఉదార వైఖరులు పునాదిలో పరిష్కారం డిమాండ్ చేసే వారి పట్ల తీవ్రనిర్బంధాలు, ఎన్‌కౌంటర్లు; ఇదీ 1990ల నాటి ఆంధ్రప్రదేశ్‌లో ముఖచిత్రం.

పై నేపథ్యంలో బాలగోపాల్‌లో, అతనిపై నేడు ప్రశంసలు కురిపిస్తున్న అతని మాజీ వ్యతిరేకుల్లో వచ్చిన మార్పును పరిశీలించవలసి ఉంటుంది. 1990-91లలో బాలగోపాల్ మార్క్సిజాన్ని, కమ్యూనిస్టు వ్యవస్థను సమర్థిస్తూ, సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపాదేశాల ప్రభుత్వాల పతనాలపై సహేతుక కారణాలను వివరిస్తూ అది కమ్యూనిజపు వైఫల్యంకాదని, రివిజనిస్టుల పతనమని అనేక ఉపన్యాసాలు చేశారు కూడా. 1990లో విరసం అనంతపూర్ జిల్లా శాఖ కన్వీనర్‌గా నేనున్న కాలంలో, అదే అంశంపై ఉరవకొండ, అనంతపురం, కదిరి పట్టణాలలో సభలు నిర్వహించాం కూడా. ఆనాటికి, ఆయనలో మార్క్సిజంపై నమ్మకం సడలలేదు. ఆ తర్వాతి కాలంలో ఆయనలో వచ్చిన మార్పుకు కారణలేమిటి? నిర్దిష్టంగా చెప్పలేముగాబట్టి నాడు ఆంధ్రప్రదేశ్‌లో మధ్యతరగతి బుద్ది జీవులెదుర్కొన్న సంశయాలనుకోవడంలో తప్పులేదనిపిస్తుంది. ఆయనకు మార్క్సిజంలో 'ఖాళీలు' కన్పడ్డాయి. విప్లవ కార్యాచరణంలో 'అరాచకత్వం' 'అమానుషత్వం' కన్పడ్డాయి. వ్యవస్థీకృత హింస యెంత తీవ్రమైనదో, విస్తారమైనదో, అంతే తీవ్రమైనదిగా, విస్తారమైనదిగా ఆయనకు 'ప్రతిహింస' ద్యోతకం కావడం మొదలైంది. 'ప్రైవేట్ హింస'ను వ్యతిరేకించడంతో మొదలయిన ఆయన ధోరణి చివరకు, పీడనకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజల 'ప్రతిహింస'ను ఖండించే వరకు దారి తీసింది. ఇక్కడ ఒక విషయం స్పష్టం చేయాలి. విప్లవోద్యమంలోనూ 'అమానుషత్వాన్ని', 'అనవసర హింస'ను ఎవరూ సమర్థించనవసరం లేదు. దాన్ని విమర్శించాల్సిందే. కాని విమర్శించే తీరును ప్రశ్నించాల్సి ఉంది. గొర్రెల మందపై బడి జీవాలను కబళించే తోడేళ్ళ హింసను, వాటికి ఎదురు తిరిగి దెబ్బ తీసే క్రమంలో జరిగే హింసను ఒకేగాట కట్టడమనేది గాంధీ అహింసా వాదమవుతుందేమోగాని, సహేతుక హక్కుల వాదం కాబోదు. అక్కడక్కడ విప్లవోద్యమ కార్యకర్తలు చేసిన తొందరపాటు చర్యలను, అనవసర హింసను, మొత్తం విప్లవోద్యమానికే ఆపాదించి, ఆ ఉద్యమ లక్ష్యాన్ని ప్రశ్నించడం, ఎవరి ప్రయోజనాల కుపయోగపడుతాయో బాలగోపాల్ లాంటి మేధావికి తెలియదనుకోవడం మన అమాయకత్వమేగాక అజ్ఞానమవుతుంది. శత్రువును బహిరంగంగా విమర్శించి, అతని తప్పులను బహిరంగంగా ఎండగట్టు మిత్రుని తప్పులను ఏకాంతంలో ఎత్తి చూపించి సవరించమనే విషయాన్ని విస్మరిస్తే శత్రువును, మిత్రుడినీ ఒకే గాట కట్టడమవుతుంది కూడా.

బాలగోపాల్‌లో వచ్చిన పై మార్పు, అటు ప్రభుత్వ యంత్రాంగానికేగాక, ఇటు అంత వరకు విప్లవోద్యమాన్ని, మార్క్సిజాన్ని విమర్శించే వ్యతిరేకులకు ఆనందం కల్గించింది. 'మార్క్సిజంలో ఖాళీలు'న్నాయని బాలగోపాల్ లాంటి మేధావి చెప్పడంతో, అంతవరకు మార్క్సిజం పట్ల సంశయాలతో కొట్టుమిట్టాడుతున్న వాళ్ళకు, ఆధునికానంతర వాదులకు తమ ప్రశ్నలకు

జవాబు దొరికినట్టయింది. ఆయన ప్రతిపాదించిన వర్గాతీత మానవహక్కుల రక్షణ, మార్క్సిజాన్ని వ్యతిరేకించేవారికి, మార్క్సిజంపై నమ్మకం సడలిన వారికి ఆలంబన అయింది. అంతవరకు బాలగోపాల్‌ను వైరి వర్గంగా చూసినవారికి బాలగోపాల్ ఆదర్శనీయుడయ్యాడు.

ఇక విరసం విషయానికొస్తే, మనలో చాలా మందిమి బాలగోపాల్‌ను మనకు సన్నిహితుడుగా భావిస్తున్నాం. అయితే ఆయన ఎంతమందిని సన్నిహితులుగా భావించారో చెప్పలేం. ఆయన స్వభావాన్ని పరిశీలిస్తే ఆయనతో హృదయం విప్పి మాట్లాడిన అత్యంత సన్నిహితులుండరేమో నన్పిస్తుంది. అవసరమయినప్పుడు తప్ప ఒక్కమాట కూడా అదనంగా మాట్లాడేవాడు కాదు. నేను చురుకుగా విరసం కార్యకలాపాలలో పాల్గొన్న రోజుల్లో విరసం బాలగోపాల్‌ను తన సభ్యునిగా భావించేది. ఆయనెన్నడు విరసం 'జనరల్ బాడీ'కి హాజరుకాలేదు. వివిధ అంశాలపై జరిగిన చర్చలలో, వాదోప వాదాలలో పాల్గొన లేదు కూడా. అప్పుడు తను ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘానికి ప్రధాన బాధ్యుడు. నాకు తెలిసి అతడెన్నడూ 'విరసం' ను తనదిగా పరిగణించకోలేదు. పోతే, విరసం బాలగోపాల్‌ను తనవానిగా పరిగణిస్తూ వచ్చింది. (అతని సభ్యత్వ రుసూం ఎవరో ఒకరు చెల్లించేవారు కూడా.) ఆయన విరసం సభ్యునిగా వుండటం, విరసంకు ప్రతిష్ఠగా కొందరు భావించారేమో? ఏదో తెలియని 'ఆరాధనా భావం' ఆనాడు కొందరిలోనైనా వుండింది. అందువల్లనేనేమో, ఆయన 'మార్క్సిజం'పై విమర్శలు చేసినడప్పుడుగాని, విరసం కవులపై, విప్లవోద్యమంపై వ్యంగ్యక్తులు, తీవ్ర విమర్శలు చేసినప్పుడుగాని, ఆయనకు సూటిగా మనం జవాబు చెప్పలేదు. తెలుగు రాష్ట్రంలోని మార్క్సిస్టు మేధావుల్ని, ముఖ్యంగా విరసం సభ్యుల్ని "వినికిడి పాండిత్యం" కల్గిన వారని హేళన చేసినా, వేంపెంట దారుణ కాండ సందర్భంలో, అసందర్భంగా విరసం కవులను ఎలిజీలు రాసుకునే వారని విమర్శించినా విరసంవైపు నుండి వెంటనే స్పందన లేకపోవడానికి, మనలో గల మధ్యతరగతి 'మర్యాదస్థుల' నైజమే ననిపిస్తుంది. బాలగోపాల్‌కు అటువంటి శషభిషలు లేవు, కాబట్టే తను వ్యతిరేకించిన వాటిపై అవకాశమొచ్చినప్పుడల్లా విమర్శ చేశాడు. హేళన చేశాడు. వేంపెంట మారణకాండ జరిగాక, ఆయన ఆ సంఘటనపైన రాసిన వ్యాసం పోలీసు యంత్రాంగానికి విరసం, సభ్యులపై, విప్లవోద్యమంపై విమర్శకు పరికరమయింది. ఆ సంఘటన తర్వాత వేంపెంట బాధితుల సంఘీభావకమిటీ తరపున, కర్నూలు జిల్లా ఆత్మకూర్‌లో బహిరంగ సభ జరపాలనీ, విరసం, పౌర హక్కుల సంఘ సభ్యులం, పోలీసు అనుమతికై వెళ్ళాం. అక్కడున్న పోలీసు అధికారి మాకు బాలగోపాల్ వ్యాసాన్ని చూపుతూ బాలగోపాల్‌కున్న ఇంగిత జ్ఞానం మీకు లేదని చెప్పి అనుమతి తిరస్కరించాడు.

నాటినుండి నిన్నటి లాల్‌ఘర్ వరకు ఆయన విప్లవోద్యమాన్ని, విరసాన్ని అవకాశం వచ్చినప్పుడల్లా విమర్శిస్తూనే వున్నారు. దీన్ని బాలగోపాల్ నికచ్చితనానికి, నిర్మొహమాటానికిగా తార్కాణంగా చెప్పవచ్చు, అంతిమంగా ఆయన విమర్శలు ఎవరికుపయోగపడ్డాయి అనేది ప్రాధాన్యత సంతరించుకోవల్సివుంది. బాలగోపాల్‌లోని మరో తత్వం ఎదుటివారి విమర్శలనుగాని, జవాబులను గాని పట్టించుకోకుండా, వారిపై పదే పదే చేసిన విమర్శలే చూస్తూ వుండటం. బాలగోపాల్ లేవనెత్తిన 'మార్క్సిజంలో ఖాళీల' అంశంపైగాని, తాను రాసిన యెన్నో వ్యాసాలపై ఆయన లేవనెత్తిన సందేహాలకు, ప్రశ్నలకు, విరసం, ఇతర మార్క్సిస్టు మేధావులతో పాటు విప్లవ పార్టీలు కూడా స్పష్టంగా జవాబిచ్చాయి. అయితే, వాటిని చదివేందుకు ఆయనిష్టపడలేదంటే ?ఆయన స్వభావాన్ని మనమెలా అర్థంచేసుకోవాలి. హరగోపాల్ గారు అభిప్రాయపడినట్టు ఆయన విమర్శలన్నీ విప్లవ శిబిరంలో మార్పుకు, అంతర్గత చర్చలకుద్దేశించినవైతే, ఆయన వాటిని ఆయా శిబిరాల్లోని బాధ్యులకు పంపివుండవచ్చు. బాలగోపాల్ ఉద్దేశ్యం ఆయన లేవనెత్తిన అంశాలు బహిరంగంగా అందరికీ తెలియచేయడమే తప్ప మరేమీ కాదు. మరి బాలగోపాల్, తను లేవనెత్తిన అంశాలపై వివరణలు, విమర్శలు వచ్చినప్పుడు ఎందుకు మౌనం వహించాడు. మౌనం వహించడమే గాక, పదే పదే అవే సందేహాలను, విమర్శలను తిరిగి ఉద్ఘాటిస్తూ వచ్చారు. ఈ స్వభావాన్ని మనం యే విధంగా విశ్లేషించుకోవాలి. తన అభిప్రాయాలు తప్ప ఇతరులవన్నీ తప్పని, వాటికి పరిగణలోని తీసుకొనే అర్హతలేదని భావించారని అనుకోవడానికి ఆస్కారముంది. అలా అనుకున్నా తప్పేమికాదు.

బాలగోపాల్ తాననుకున్న మార్క్సిజపు ఖాళీలను పూరించివుండినా, లేక తన విమర్శలకు వచ్చిన జవాబులతో చర్చలకు దిగినా మార్క్సిజం మరింత సంపన్నమయ్యేది. తాను లెవనెత్తిన ప్రశ్నలకు తానే సమాధానాలు వెతికి ఉంటే మార్క్సిస్టు మేధావిగా పేరు ప్రతిష్టలు, సామాజిక గౌరవం ఉన్న బాలగోపాల్ లేవదీసిన ప్రశ్నలకు సాధికారత చేకూరేది. కాకపోగా అది మేధావుల సందేహాలకు గురిచేసింది. అందువల్ల విప్లవోద్యమానికి నష్టమే జరిగింది. మధ్యతరగతి ప్రజా పోరాటాలకు మరింత దూరమయ్యారు. బాలగోపాల్ నిబద్ధత, కార్యదక్షత, వర్గాతీత మానవ హక్కుల పట్ల అతనికున్న ప్రగాఢ విశ్వాసం ఎవరూ ప్రశ్నించలేనివి. అందరిమన్ననలను పొందాయి. అంతేగాక, అతని నిరండంబరత, ముక్కుసూటితనం, భావాల్లో స్పష్టత, ఆచరణలో నిజాయితీ వివిధ రంగాల్లో పనిచేసే కార్యకర్తలకు ఆదర్శనీయం. మధ్యతరగతి భేషజాలకు దూరంగా వుండటం విప్లవోద్యమ కార్యకర్తలకు, సానుభూతిపరులకు ఆచరణీయం కూడా. బాలగోపాల్ తాత్త్వికతను, ఆచరణను భావోద్వేగాలకు లోనుకాకుండా విశ్లేషించడం వల్ల అందరికీ మేలు జరుగుతుంది. ❖

# స్వీకారం

1. **జీవశాస్త్ర విజ్ఞానం - సమాజం**
   రచన : కొడవటిగంటి రోహిణి ప్రసాద్ వెల : రూ.50/-
   జనసాహితి ప్రచురణ
   ప్రతులకు : మైత్రి బుక్ హౌస్,
   జలీల్ వీధి, కారల్ మార్క్స్ రోడ్, విజయవాడ - 520 002.

2. **నదీ నదరా మనిషి**
   వెంకటకృష్ణ దీర్ఘ కవిత
   స్ఫూర్తి ప్రచురణ వెల : 10/-
   ప్రతులకు : 57-1287-1,
   సోమిశెట్టి నగర్, కర్నూలు - 2.

3. **జాత్యహంకారి హిట్లర్**
   రచన : రమాదేవి చేలూరి వెల : రూ. 80/-
   స్వేచ్ఛా సాహితి ప్రచురణ

4. **మానవ పరిణామం**
   కొడవటిగంటి రోహిణి ప్రసాద్ వెల : రూ. 75/-
   స్వేచ్ఛా సాహితి ప్రచురణ

5. **కుట్రాజకీయం**
   అమెరికా దుర్మార్గాల శతాబ్ది
   రచన : స్టీఫెన్ కింజర్, తెలుగు : కొణతం దిలీప్
   వీక్షణం పబ్లికేషన్స్,

**పై మూడింటి కోసం :** మైత్రీ రెసిడెన్సీ, స్ట్రీట్ నం. 3, హిమాయత్ నగర్, హైదరాబాద్ - 29

వ్యాసం

◆ కె.సత్యనారాయణ

# కులసమస్యపై బాలగోపాల్

1990లో మండల్ వ్యతిరేక ఆందోళనలపై 'మండల్ వ్యతిరేక ఉన్మాదం' అనే శీర్షికతో బాలగోపాల్ ఇపిడబ్ల్యులో వ్యాసం రాశారు. చాలా మంది అభ్యుదయ, కాషాయ, గాంధేయ వాద శిబిరాలకు చెందిన మేధావులంతా ఒకే గొంతుతో అగ్రకుల కోణం నుంచి మండల్ కమీషన్ ప్రతిపాదించిన ఓబిసి రిజర్వేషన్లను వ్యతిరేకించిన తీరుని తీవ్రంగా నిరసిస్తూ సాగిన వ్యాసం దళిత విద్యార్థుల దుఃఖాన్ని, వేదనను, కోపాన్నీ వ్యక్తీకరించినదని విద్యార్థులుగా వున్న మేం ఆ రోజుల్లో భావించాం. బాలగోపాల్ అలా పరిచయం నాకు. దళిత, పీడిత కులాల హక్కుల గురించి మాట్లాడే, రాసే పౌరహక్కుల నాయకుడిగా, వివిధ సామాజిక, రాజకీయ అంశాల్ని విశ్లేషించి, వివరించే మార్క్సిస్టు మేధావిగా బాలగోపాల్ గురించి తెలుసు.

కుల సమస్య, దళిత, పీడిత కులాల హక్కులు బాలగోపాల్ తన కార్యాచరణలో చాలా ముఖ్యమైన అంశాలుగా భావించారు. దళితులపై జరిగిన మారణకాండలపై, రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనపై, దళిత యువకులకు విధించిన ఉరిశిక్షలకు వ్యతిరేకంగా, వర్గీకరణ సమస్యకు అనుకూలంగా, ఇంకా దళిత, పీడిత కులాల ప్రజలపై నిరంతరం జరుగుతున్న అనేక రకాల వివక్షలపై, అణచివేతపై బాలగోపాల్ మాట్లాడారు, రాశారు. ఆయన ఇపిడబ్ల్యుకి రాసిన చివరి వ్యాసం ఓబిసి రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు అగ్రకుల స్వభావాన్ని ఎండగడుతూ రాసినదే. అలాగే, హిందూత్వ రాజకీయాలు దళిత, పీడిత కులాల, మైనారిటీ మతాల ప్రజల హక్కుల ఉల్లంఘనకి, ప్రజాస్వామ్య విలువల ధ్వంసానికి కారణమని విశ్లేషించారు. సమాజంలో పీడిత కులాలు, మైనారిటీ ప్రజల హక్కుల కోసం బాలగోపాల్ చేసిన ప్రజాతంత్ర కృషి ఒక ఎత్తయితే, ఆయన రచనలు, ఆచరణ ద్వారా అందించిన అవగాహన, పౌరహక్కుల ఉద్యమంలో వ్యవస్థీకరించిన విలువలు ఈ రోజు మనకి చాలా అవసరం. కారంచేడులో దళితుల మారణకాండ (1985) జరిగిన సందర్భంలో పుట్టిన దళిత ఉద్యమం బాలగోపాల్ పై తీవ్ర ప్రభావం వేసింది. ఈ ప్రభావమే ఆ తరువాత కాలంలో కుల సమస్యని పౌరహక్కుల సమస్యగా గుర్తించడానికి, రిజర్వేషన్లని ప్రజాస్వామిక హక్కుగా గుర్తించడానికి దోహదం చేసింది. బాలగోపాల్ కృషిని, అవగాహనను అంచనా వేసే చర్చలో ఆయన కులసమస్యపై చేసిన ఆలోచనలు, కార్యాచరణ గురించి పెద్దగా ప్రస్తావనకు రాకపోవడం ఒక లోపంగా భావించి ఈ నాలుగు మాటలు రాస్తున్నాను.

కారంచేడు ఘటన తర్వాత బాలగోపాల్ ఒక మార్క్సిస్టు మేధావిగా ఆత్మ విమర్శనా ధోరణితో స్పందించారు. కోస్తా జిల్లాల్లో శూద్ర అగ్రకులాల భూస్వాములు, రైతులు కమ్యూనిస్టు పార్టీల్లో, దళితులు కాంగ్రెస్‌లో వుండటం గురించి కమ్యూనిస్టు పార్టీలు సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరముందన్నారు. కులసమస్యపై మార్క్సిస్టు విశ్లేషణ అసమగ్రంగా వుందని, కులాన్ని ఉపరితల సమస్యగా మాత్రమే కాకుండా, పునాదిలో ఉత్పత్తి సంబంధాల్ని నిర్ణయించేదిగా చూడాలని ఆయన అన్నారు. 1990లో 'సృజన'లో రాసిన 'కుల సమస్య రాజకీయ దృక్పథం' వ్యాసం మార్క్సిస్టు శిబిరంలోని, ముఖ్యంగా విప్లవోద్యమంలోని ప్రజలను, మేధావులని ఉద్దేశించి రాసినది. దళిత ఉద్యమం లేపిన ప్రశ్నల్ని చాలా నిజాయితీతో, సీరియస్‌గా అర్థం చేసుకునే ప్రయత్నంలో భాగంగా రాసినది. ఆ వ్యాసంలో "ప్రజా ఉద్యమాల అగ్రశ్రేణుల్లో కులంరీత్యా ఆధిక్యత స్థానాలలో వున్న వారే ఎక్కువ వుంటే, అది కుల సమస్య పరిష్కారానికి అవరోధం అనే ప్రశ్న వస్తుంది" అంటూ ఈ ప్రశ్న "న్యాయమైన ప్రశ్న" అన్నారు. ఉద్యమాల్లో నాయకత్వం అన్ని కులాల నుంచి సమపాళ్ళలో లేకపోవడం ఒక లోపంగా గుర్తించాలనీ, ఆచరణలో ఎదురైన సమస్యల్ని సిద్ధాంత స్థాయిలో చర్చించి, వర్గపోరాట అవగాహనకు జోడించ లేకపోవడం వైఫల్యమేననీ అన్నారు. కులం వర్గాన్ని చీల్చి పీడితుల మధ్య శత్రుత్వాన్ని పెంచుతుందని, ప్రజల్ని సంఘటితం కాకుండా అడ్డుకుంటుందనే అవగాహన సరైంది కాదని ఆయన విమర్శించారు. కఠినమైన సమస్యల్ని నేరుగా ఎదుర్కోవటం అవసరమని, చర్చించడం అవపరమని ఆయన వాదించారు. మార్క్సిస్టు శిబిరంలో ప్రజా ఉద్యమ నాయకత్వంలో కులాల ప్రాతినిధ్యం గురించి మాట్లాడడమే తప్పుగా భావించేవారు. 'డీక్లాసిఫై' అయిపోయి, తన కులాన్ని, వర్గాన్ని వదులుకున్న మేధావుల్ని, నాయకుల్ని కులం పేరుతో గుర్తించడం కులతత్వమని వాదించిన వారు వున్నారు. ఈ దేశంలో పీడితుల్ని గుర్తించటానికి కులం ఒక ప్రాతిపదికగా బాలగోపాల్ భావించారు. కొన్ని కులాలు సామాజికంగా, ఆర్థికంగా అణగారిన కులాలైనపుడు, ఆ కులాల ప్రజలు ప్రజాసంఘాలలోకి, వాటి నాయకత్వంలోకి రాకుండా, "పీడితులు ప్రతిఘటనను స్వంతం చేసుకోకుండా", కులసమస్య లాంటి జటిలమైన సమస్యకు పరిష్కారం దొరకదని బాలగోపాల్ అభిప్రాయం. సమాజంలో కులం పాత్ర గురించి విశ్లేషిస్తూ, పాలక వర్గాల తమ గొడవల్లో, రాజకీయ సమీకరణల్లో కులాన్ని సాధనంగా వాడుకుంటున్నారనీ, పాలక వర్గాలకు - ప్రజలకు మధ్య ఘర్షణల్లో కులాన్ని వాడుకుని పాలకులు కారంచేడు, చుండూరులాంటి నరమేధాల్ని సృష్టిస్తున్నారనీ, ప్రజలలోని భిన్న సమూహాల మధ్య విభేదాలకు, పీడితులు ఐక్యం కాకుండా ఉంచటానికి కులం ఒక సాధనంగా ఉపయోగపడుతుందని బాలగోపాల్ అన్నారు. సమాజంలో కులం పాత్రని గుర్తించి, పోరాడడం అవసరమని బలంగా ప్రతిపాదించారు. అలా పోరాడకపోతే కులం ప్రజా చైతన్యానికి ప్రతిబంధకమే కాకుండా, ఈ అసమానతలు ప్రజా ఉద్యమాల్లో పునరావృతమయ్యే అవకాశం వుంది అని బాలగోపాల్ ప్రజా ఉద్యమాల్ని హెచ్చరించారు.

మార్క్సిస్టు మేధావిగా కుల సమస్యపై ఆయన రాసినవి తక్కువే అయినా, ఆ రచనల్లో ఆయన చేసిన విశ్లేషణ చాలా కీలకమైనది. కోశాంబిని తెలుగు పాఠకులను పరిచయం చేస్తూ రాసిన పుస్తకం ఈ రోజుకీ భారతదేశంలో కుల వ్యవస్థ పుట్టుక, పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవటానికి చాలా అవసరం. 1980ల నుంచి, ముఖ్యంగా బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత బాలగోపాల్ హిందూత్వ రాజకీయాలపై చేసిన విశ్లేషణాత్మక వ్యాసాలు పాలక వర్గ రాజకీయాలను అర్థం చేసుకోవటానికి నేటికీ ఉపయోగపడతాయి. 'హిందూత్వం' ఒక మత రాజ్యంగా కాకుండా పాలక వర్గాలు ముందుకు తెస్తున్న భావజాలంగా అర్థం చేసుకోవాలని, సామ్రాజ్యవాదశక్తులతో మిలాఖతై ఇది ముందుకొస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. 'హిందూత్వ' దళిత, మైనారిటీ ప్రజల వ్యతిరేకమైనదని వివరించారు. దేశంలో క్రైస్తవులపై, ముస్లింలపై ఎక్కడ దాడి జరిగినా ఆయన ఆ దుర్మార్గాలకు వ్యతిరేకంగా మాట్లాడారు, రాసారు. కారంచేడు మారణకాండపై, ఆ తరువాత దళితులపై దాడులపై జరిగిన ఘటనల్ని కోస్తా ఆంధ్రలో వ్యవసాయ ఆధునీకరణ క్రమంలో బలపడిన రాజకీయ, ఆర్థిక వ్యవస్థ నుంచి ఎదిగిన శూద్ర అగ్రకులాలు గ్రామీణ ప్రాంతాలలో నయాధనిక రైతాంగ వర్గంగా ముందుకొచ్చారు. ముఖ్యంగా కమ్మ పెత్తందారీవర్గం, వారికి అండగా తెలుగుదేశం సందర్భంలో కారంచేడుని చూడాలని అన్నారు. దళితులపై మూకుమ్మడి దాడులు ఆధునిక హింసగా, ఆధునిక రాజ్యం సృష్టించిన అసమానతలు, బలపరిచిన కుల సంబంధాల నేపథ్యంలో జరిగిన హింసగా చూడాలని ఆయన విశ్లేషించారు.

ఈ దాడుల్లో కులం పాత్రని నిర్దిష్టంగా గుర్తించారు. Probings in the political Economy of Agranian Classes and Canflict అన్న పుస్తకంలో బాలగోపాల్ మార్క్సిస్టుగా రాసిన వ్యాసాలు వున్నాయి. ఈ రచనల్ని మళ్ళీ పరిశీలించాల్సి అవసరం వుంది.

1992 తర్వాత బాలగోపాల్ కుల సమస్యని ప్రధానంగా హక్కుల ఉద్యమ ఆచరణలో భాగం చేసే ప్రయత్నం చేసారు. బహుశా భారతదేశంలో సమకాలీన ఉద్యమంలో కులసమస్యని ఒక ప్రధాన హక్కుల ఉల్లంఘన అంశంగా చేర్చడంలో బాలగోపాల్, ఆయన కార్యదర్శిగా వున్న ఎపిసిఎల్‌సి సంస్థ కృషిని మొట్టమొదటి గట్టి ప్రయత్నంగా గుర్తించాల్సిన అవసరముంటుంది. హక్కుల ఉద్యమ కోణం నుంచి బాలగోపాల్ చేసిన విశ్లేషణల్ని చూద్దాం. పౌరహక్కుల ఉద్యమంలో కులసమస్యని ఒక హక్కుల సమస్యగా దళిత ఉద్యమ ఆవిర్భావం వరకు గుర్తించకపోవటాన్ని బాలగోపాల్ పెద్ద వైఫల్యంగా భావించారు. 1996లో బాలగోపాల్ బెంగుళూరులో పిడిఎఫ్ సమావేశంలో "కులం - పౌరహక్కులు" అనే అంశంపై మాట్లాడుతూ దళిత ఉద్యమ ఆవిర్భావ నేపథ్యంలో ఎపిసిఎల్‌సి కులసమస్యని పౌర హక్కుల సమస్యగా గుర్తించి, తన ప్రణాళిక ఈ అవగాహనను పొందుపరుచుకున్న సందర్భాన్ని వివరించారు. కారంచేడులో దళితుల ఊచకోత ఘటనపై నిజ నిర్ధారణకు వెళ్ళి, పత్రికల్లో ప్రకటన ఇచ్చి బాలగోపాల్ వరంగల్ వచ్చేసారు. కాకతీయ యూనివర్శిటీలో కొందరు రెడ్డి కుల విద్యార్థులు "మా వూర్లో రెడ్డి కులస్తులపై దాడి జరిగింది. మీరు నిజనిర్ధారణకు రావాలని" బాలగోపాల్‌ని కావాలనే అడిగారు. దానికి జవాబుగా "హరిజనులు (ఆనాటికి ఈ మాటే వాడుకలో వుంది) పేదలు కాబట్టి వారికి ప్రభుత్వం, పోలీసులు అండ వుండదు. అగ్రకులాల భూస్వాములకి ప్రభుత్వ యంత్రాంగం అంతా వారికి రక్షణగా వుంటుంది. కాబట్టి ఎపిసిఎల్‌సి పేదలైన హరిజనుల పక్షమే మాట్లాడుతుందని" అన్నారు. రెడ్డి కులస్తులకు మద్దతుగా ఎపిసిఎల్‌సి రావాల్సిన అవసరం లేదని చెప్పారు. అయితే ఈ జవాబు సమగ్రమైనది కాదని కారంచేడు ఘటన గురించి జరిగిన లోతైన చర్చ క్రమంలో తెలిసింది. ఎపిసిఎల్‌సి పౌరహక్కుల గురించి మాట్లాడుతుంది. పౌరహక్కుల ఉల్లంఘనకు రాజ్యాన్ని నిలదీస్తుంది. రాజ్యమే హక్కుల ఉల్లంఘనకు కేంద్రంగా భావిస్తుంది. కానీ, కారంచేడులో జరిగిన మారణకాండకు కులవ్యవస్థ, దానిని వ్యవస్థీకరించిన బ్రాహ్మణీయ భావజాలం కారణమని దళిత ఉద్యమం ఎలుగెత్తి నినదించింది. కులవ్యవస్థ కారణంగా కొన్ని ప్రజా సమూహాల ప్రజలు ఊరికి దూరంగా, కులవృత్తులకు, సేవలకు పరిమితమై, అంటరానివారుగా ముద్రవేయబడి అణచివేతకు గురవుతున్న వాస్తవాన్ని కారంచేడు చర్చకు తెచ్చింది. సమాజంలో కులం పాత్రపై పార్లమెంటు వరకు కారంచేడుపై చర్చ కారణమయింది. ఎపిసిఎల్‌సిలో ఈ నేపథ్యంలో కులసమస్యపై విస్తృత చర్చ జరిగింది. బాలగోపాల్ మాటల్లో "ఈ దేశంలో పౌరులుగా కాదు కదా, కనీసం మానవులుగా గుర్తింపు లేని ప్రజలకు పౌరహక్కులు కాదుకదా, కనీసంగా మనిషిగా గుర్తింపు, గౌరవం లేవు. అందుకే దళితుల హక్కుల నిరాకరణకు కారణమైన కుల సమస్యను పౌరహక్కుల సమస్యగా" గుర్తించాలనే అవగాహన ముందుకొచ్చింది. 1991లో ఎపిసిఎల్‌సి ప్రణాళికలో కుల సమస్యను పౌరహక్కుల సమస్యగా చేర్చడం జరిగింది.

1986లో తెలుగుదేశం ప్రభుత్వం బి.సి. రిజర్వేషన్ల శాతాన్ని 25 నుంచి 40 శాతం వరకు పెంచింది. మురళీధరరావు కమీషన్ నివేదిక సిఫార్సుల ఆధారంగా అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు నిర్ణయం తీసుకున్నారు. దీనికి వ్యతిరేకంగా పెద్ద యెత్తున రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు చెలరేగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వం తమ ఊరేగింపుని అనుమతించలేదని, ఇది పౌరహక్కుల ఉల్లంఘన కాబట్టి ఎపిసిఎల్‌సి కలగజేసుకోవాలని కొందరు అగ్రకుల విద్యార్థులు అడిగారు. దీనికి జవాబుగా బాలగోపాల్ అగ్రకుల విద్యార్థుల ఊరేగింపు ప్రభుత్వ వ్యతిరేకమైనదే అయినప్పటికీ, సారాంశంలో రిజర్వేషను వ్యతిరేక ఆందోళనలు దళితులపై దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ఈ ఆందోళనలు అగ్రకుల విద్యార్థులు తమ గుత్తాధిపత్యాన్ని, అధికారాన్ని కొనసాగించటానికి ప్రదర్శిస్తున్న అగ్రకుల అహంకార ఊరేగింపులుగానే చూడాలని అన్నారు. ఈ క్రమంలోనే రిజర్వేషన్లు రాయితీలు కాదని, దళితుల ప్రజాస్వామిక హక్కనే అవగాహన ఏర్పడింది. ఎపిసిఎల్‌సి రిజర్వేషన్లని సమర్థిస్తూ బుక్‌లెట్ ప్రచురించింది. ముఖ్యంగా తన రచనల ద్వారా రిజర్వేషన్లపై చర్చ అగ్రకులాలు నిర్దేశించిన "విద్య, ఉద్యోగావకాశాల" చట్రంలో కాకుండా కులవ్యవస్థ ఏర్పరచిన అసమానతలు, అణచివేత సందర్భంలో చూడాలని బాలగోపాల్ గట్టిగా వాదించారు. అందుకే ఆయన రిజర్వేషన్లు కుల ప్రాతిపదికపై వుండాలని వాదించారు. కుల ప్రాతిపదికను నీరుగార్చే ఆర్థిక ప్రాతిపదిక, అలాగే 'క్రిమిలేయర్' లాంటి ప్రతిపాదనల్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.

1990 మండల్ కమీషన్‌పై జరిగిన మండల్ వ్యతిరేక అనుకూల ఆందోళన సందర్భంలో బాలగోపాల్ సమాజంలో కులం పాత్ర గురించి కొన్ని సూత్రీకరణలు చేసారు. అప్పటి వరకు కులాన్ని కులం సామాజిక రుగ్మతగా, గాంధీ అయితే పాపంగా భావించేవారు. అభ్యుదయ శ్రేణులు కూడా కులం ఒక సంప్రదాయ వ్యవస్థని, దానిని నిర్మూలిస్తేనే ఆధునిక సమాజం సాధ్యమని భావిస్తాయి. ఈ అవగాహనలో కులం సమాజంలో ఆధునీకరణ చెంది మన ఎన్నికల వ్యవస్థ నుంచి, నిత్య సంబంధాల్లో పోషిస్తున్న పాత్ర గురించి గుర్తింపులేదు. కులం ఒక పాత వ్యవస్థకు చెందిన కూలిపోతున్న సాంస్కృతిక రూపంగా చూడడం వల్ల దాని సమకాలీన ఆర్థిక, రాజకీయ, సామాజిక పాత్ర మనం పట్టించుకోలేదు. కులానికున్న ఈ సమకాలీన రూపాన్ని దళిత ఉద్యమం వెలుగులోకి తెచ్చింది. బాలగోపాల్ రూపాంతరం చెంది కొత్త పాత్ర నిర్వహిస్తున్న కులం గురించి- కులం కేవలం ఆధిపత్యానికి, అహంకారానికి సాధనం మాత్రమేకాదు, కులం సామాజిక వెనుకబాటుతనానికి, ఆత్మగౌరవ చైతన్యానికి, గుర్తింపుకు సాధనంగా పనికొస్తుందని దళిత ఉద్యమ ఉధృతి సందర్భంగా వ్యాఖ్యానించారు. మండల్ వ్యతిరేక ఉన్మాదాన్ని నిరసిస్తూ రాసిన వ్యాసంలో ఈ దేశంలో పీడిత కులాలవారు కుల ప్రాతిపదికన సంఘటితం కావడం వారి రాజకీయ బాధ్యత అని బాలగోపాల్ వ్యాఖ్యానించారు. అస్తిత్వ ఉద్యమాల్ని కొత్తగా ప్రజాస్వామిక చైతన్యాన్ని ముందుకు తెచ్చిన ఉద్యమాలుగా బాలగోపాల్ భావించారు. ఇదే సమయంలో అంబేద్కర్ గురించి ఆయన చేసిన విశ్లేషణ నుంచి ఎంతో నేర్చుకున్నాం. ఈ దేశంలో సంపద, జ్ఞానం, అధికారాలు కులం ఆధారంగా నిర్ణయింపబడతాయని, కాబట్టి సంపద, జ్ఞానం, అధికారాల్లో దళితులకు వాటా ఇవ్వాలని అంబేద్కర్ విశ్లేషించారని బాలగోపాల్ చాలా సరళమైన భాషలో సూటిగా వివరించేవారు. అలాగే అంబేద్కర్ హిందూమతం అన్ని మతాలకంటే అప్రజాస్వామికమనీ, ఆ మతం పుట్టుకతోనే మనుషుల్లో అసమానతల్ని దేవుడే సృష్టించాడనిచెపుతుందనీ, ఇతర మతాలలో (క్రైస్తవం, ఇస్లాంలలో) సూత్రప్రాయంగానయినా మనుషులంతా దేవుడి దృష్టిలో సమానమనే భావం వుంటుందని విశ్లేషించిన తీరును బాలగోపాల్ మాలాంటి వారందరికి పరిచయం చేసారు. అంబేద్కర్ ప్రతిపాదించిన 'ఒకే మనిషికి ఒకే విలువ' అన్న భావనను బాలగోపాల్ చివరి రోజుల్లో బాగా ప్రచారం చేసారని ఆయన సన్నిహితులు చెపుతున్నారు. బాలగోపాల్ ఎపిసిఎల్‌సి నుంచి బయటకు వచ్చిన తరువాత 'మానవ హక్కుల' భావనను ప్రతిపాదించారు. ఆయనలో ఈ అవగాహన మార్పుకి ప్రధానంగా ఆయనకు విప్లవోద్యమంపై వున్న విమర్శలు, మార్క్సిజంలో లోపాలున్నాయనే ఆయన అభిప్రాయాలు

కారణమనే కోణం నుంచి చాలా చర్చ జరిగింది. పోరాడే హక్కుతోపాటు, ఆధునిక రాజ్యం ద్వారా అమలులోకి తేబడిన సార్వజనీన సూత్రాలు, సామాజిక ఆచరణ ఆయా ప్రజలకు అణచివేతను, అసమానతల్ని వ్యతిరేకించటానికి ఉపయోగపడతాయని దళిత, స్త్రీవాద, పర్యావరణ ఉద్యమాలు అందించిన హక్కుల అవగాహనను విస్తృత పరచుకునే దిశలో మానవ హక్కుల వేదిక ఏర్పడిందని బాలగోపాల్ అన్నారు. 'మానవ హక్కుల' భావనని అంతర్జాతీయ చర్చలో భాగంగా వచ్చిన భావనగానే కాకుండా దళిత ఉద్యమం, ఇతర అస్తిత్వ ఉద్యమాల ప్రభావం నుంచి వచ్చినదేమో పరిశీలించటం అవసరం.

దళిత ఉద్యమం 'దళిత ఐడెంటిటీ' (దళిత అస్తిత్వం) ప్రాతిపదికన అంటరాని కులాల ప్రజల్ని సంఘటితం చేసి పోరాటాలు నడిపింది. ఈ క్రమంలోనే వివిధ ఉద్యమాల్లో, ముఖ్యంగా ప్రజా ఉద్యమాల్లోని నాయకత్వంపై వారి 'కుల ఐడెంటిటీ' గురించి ప్రశ్నించింది. ప్రజా ఉద్యమ నాయకత్వ శ్రేణుల్లో ఎక్కువ అగ్రకులాల నుంచి వచ్చిన వారే వున్నారని, అందులోనూ బ్రాహ్మణులే ఎక్కువగా వున్నారనే వాదనలు దళిత ఉద్యమం చేసింది. ప్రగతిశీల శక్తులుగా వున్న మేధావుల్ని 'బ్రాహ్మణులు'గా నిందించి, విమర్శించిన సందర్భాలు వున్నాయి. అదే సమయంలో అగ్రకుల మేధావులకు సామాజిక మార్పుకోసం జరిగే కృషిలో స్థానం లేదా? అని అంటే దానికి జవాబుగా దళిత నాయకత్వం అగ్రకుల మేధావులు దళితీకరణ చెందాలనీ, తమ తమ కులాల్ని Disown చేసుకొని, విమర్శించే పని చేపట్టాలని కొత్త ఎజెండా సూచించింది. ఈ ప్రతిపాదనలకు కొందరు మార్క్సిస్టు మేధావులు, ప్రగతిశీల శిబిరంలోని నాయకులు తీవ్రంగా స్పందించారు. "మేం కమ్యూనిస్టు పార్టీల్లో వున్నాం. మేం "డీక్లాస్సిఫై" (తమ వర్గాన్ని వదులుకున్నాం) అయ్యామని మమ్మల్ని కులం పేరుతో గుర్తించడం. కులతత్వం తప్ప మరేమీ కాదని" అన్నారు. తమకు కులం, వర్గం, మతం లేవని అనుకోవడం కుల సమాజంలో కులం పాత్రను తక్కువగా అంచనా వేయడం, దాని లోతుపాతుల్ని అర్థం చేసుకోకపోవడమే అవుతుంది. కులాన్ని వ్యతిరేకించే వ్యక్తులుగా, ప్రజాస్వామిక వాదులుగా వున్న వారికి కూడా సమాజంలో కుల గుర్తింపు వుంటుంది. ఈ అర్థంలో బాలగోపాల్‌ని కూడా సమాజం బ్రాహ్మణ కులం నుంచి వచ్చిన వ్యక్తిగా చూస్తుంది. కొన్ని సందర్భాల్లో, ముఖ్యంగా బాలగోపాల్ ఒక రాష్ట్ర స్థాయి మేధావి, నాయకుడుగా ఎదిగిన తర్వాత బ్రాహ్మణ కులస్థులు ఆయన్ని 'తమవాడి'గా భావించే వీలుంది. అంత మాత్రాన బాలగోపాల్‌ని బ్రాహ్మణుడని ఒక దళితనాయకుడు వాదించడం ఎంతవరకు సబబు? బాలగోపాల్ కులాధిక్యతను ప్రశ్నించలేదనడం వాస్తవమేనా?

బాలగోపాల్ తన కులాన్ని, కుల సంబంధాల్ని పక్కన పెట్టారు. ప్రజలకోసం, ముఖ్యంగా ఆదివాసీలు, దళితులు, ఓబిసిలు, మైనారిటీల కోసం, వారి హక్కుల కోసం కృషి చేసారు. తన విద్యని, ఆ విద్య ద్వారా వచ్చే ఉద్యోగాల్ని, ప్రతిష్టను వదులుకున్నారు. సంపదను, అధికారాన్ని తిరస్కరించారు. ఒక సాధారణ వ్యక్తిగా జీవించారు. ఒక కొత్త సమాజంలో భాగంగా తనను తాను ఊహించుకుని, తనను తాను ప్రజల్లో ఒకడిగా, దళితుల్లో దళితుడిగా, పీడితుల్లో పీడితుడిగా మలుచుకునే ప్రయత్నం చేసాడు. బ్రాహ్మణ సంస్కృతిని తెగనాడాడు. ఇలాంటి ప్రయత్నాన్ని, ప్రయోగాన్ని చేసిన మేధావుల్లో బాలగోపాల్ చాలా అరుదైన వ్యక్తి. కులానికీ, వర్గానికీ, మతానికీ అతీతంగా తన అస్తిత్వాన్ని మార్చుకునే ప్రయత్నంలో లోపాలు వుండవచ్చు. అంత మాత్రాన లౌకికవాదిగా, ప్రజాస్వామిక వాదిగా జీవించిన బాలగోపాల్‌ని బ్రాహ్మణునిగానే గుర్తించడం, విమర్శించటం అంటే జన్మరీత్యా వివిధ కులాల్లో జన్మించిన వారు తమ ఆచరణ ద్వారా ఆకుల సమాజపు సంస్కృతిని దాటటం అసాధ్యమని చెప్పడమే అవుతుంది. బాలగోపాల్‌ని దళితునిగా, ఆదివాసీగా పరిగణించలేకపోవచ్చు. కానీ ఆయన్ని కులానికీ, మతానికీ, వర్గానికీ అతీతంగా జీవించే గొప్ప ప్రయత్నం చేసిన మనిషిగా గుర్తించకపోతే, మనం సామాజిక మార్పునే వ్యతిరేకించినవాళ్లవుతాం. దళిత ఉద్యమశక్తులు బాలగోపాల్‌ని 'బ్రాహ్మణుడి'గా ముద్రవేసి, ఆయన్ని 'కులానికి' కుదించటంలాంటి ప్రయత్నాలవల్ల ప్రజాస్వామిక వాదుల్ని మనం అగ్రకుల శిబిరంలోకి నెట్టే యథాతథవాదాన్ని బలపరచడానికి తోడ్పడతాం. దళిత ఉద్యమ శక్తులు ఒక కొత్త సమాజాన్ని కావాలనుకుంటూ వుంటే, ఆ సమాజంలో బాలగోపాల్‌లాంటి అరుదైన ప్రజాస్వామిక శక్తుల స్థానం ఏమిటో స్పష్టం చేయాలని నేను అడుగుతున్నాను. ప్రజాస్వామిక శక్తుల కృషిని గుర్తించకపోవడం, గౌరవించకపోవడం సమాజ పురోగతికి తోడ్పడదు. దళిత, పీడిత కులాలకు సమాజంలో సమాన స్థాయి సాధించే కృషికి తీవ్ర నష్టం జరుగుతుంది.

బాలగోపాల్ న్యాయ వ్యవస్థని విమర్శిస్తూ చేసిన ప్రచారం, రాసిన వ్యాసాలు చాలా లోతైనవి. ఇది చాలా ప్రత్యేకమయిన కృషి. చలపతి, విజయవర్ధనం అనే దళిత యువకుల ఉరిశిక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాట క్రమంలో న్యాయవ్యవస్థకు కూడా కులం వుందని, న్యాయ వ్యవస్థ నేరాల్ని సామాజిక నేపథ్యంలో పరిశీలించాలని వాదించిన వారిలో బాలగోపాల్ ఒకరు. చుండూరు మారణకాండపై చుండూరు ప్రత్యేక కోర్టులో విచారణ ప్రారంభం కావటానికి, ప్రారంభమయినాక ఆ విచారణ కొనసాగటానికి హైకోర్టులో బాలగోపాల్, కన్నాభిరాన్‌లు ఎన్నో కేసులు వాదించారు. ఈ కేసు ప్రత్యేకతరీత్యా, ఒక పుస్తకమే ఈ న్యాయ విచారణపై, రెడ్డి హంతకులకి 13 ఏళ్ళ తర్వాత శిక్షలు పడ్డ తీరుపై రాయాల్సి వుంది.

ఎస్సీ రిజర్వేషన్లు సమానంగా పంచుకొనే విషయంలో వర్గీకరణ న్యాయమైన చర్యగా బాలగోపాల్ సమర్థించారు. సుప్రీంకోర్టు వర్గీకరణ చట్టాన్ని కొట్టివేస్తే, ఆయన ఆ తీర్పుని ఘాటుగా విమర్శిస్తూ వ్యాసం రాసారు. సుప్రీంకోర్టు సమాజంలో అసమానతల్ని చూడ నిరాకరించడం అన్యాయమని వాదించారు. సుప్రీంకోర్టు చట్టపరిధిలో దళిత కులాల మధ్య అసమానతల్ని, అంతరాల్ని పరిశీలించి, రిజర్వేషన్లు పంచుకునే వీలుగా తీర్పు ఇచ్చే అవకాశం వుందని ఆయన వాదించారు. అలాగే ఓబిసి రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు వైఖరి న్యాయపత్రాలకు, రాజ్యాంగ సూత్రాల్ని తుంగలో తొక్కి, అగ్రకులాలకి 100 శాతం కంటే ఎక్కువ సీట్లనే వారికి రిజర్వు చేయడం వెనుక న్యాయమూర్తుల భావజాలమేమని చేసిందని వ్యాఖ్యానించారు బాలగోపాల్ ఇపిడబ్‌లో రాసిన తన చివరి వ్యాసంలో ఆదివాసీల భూమి హక్కుల విషయంలో, 'ఎన్‌కౌంటర్' హత్యల విషయంలో న్యాయపరంగా ఆయన చేసిన వాదనలు ప్రజలకు చట్టాల్ని ఎలా వాడుకోవచ్చో, వాటి పరిమితులని ఎంత వరకు పరీక్షించవచ్చో తెలుసుకోవటానికి ఉపయోగపడతాయి.

బాలగోపాల్ దళిత ఉద్యమం ముందుకు తెచ్చిన ప్రశ్నల్ని, కొత్త ఆలోచనల్ని సృజనాత్మకంగా విశ్లేషించి, వ్యాఖ్యానించిన మేధావిగా చెప్పుకోవచ్చు. మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబాల నుంచి, అగ్రకులాల కుటుంబాల నుంచి వచ్చిన ఈ ప్రగతిశీల మేధావులు ప్రజా ఉద్యమాలకు, పీడితులకు ఇచ్చిన గొంతుని, బలాన్ని తక్కువగా అంచనా వేయడం, గుర్తించకపోవడం అప్రజాస్వామికం, అన్యాయమని ఖచ్చితంగా చెప్పవచ్చు. మనరాష్ట్రంలో ఒక గుజరాత్ మారణకాండ, బీహార్ తరహా దళిత ఊచకోతలు, చత్తీస్‌ఘడ్‌లో భారతసైన్యపు గ్రీన్‌హంట్‌లు జరగకపోవటానికి వామపక్ష, దళిత, స్త్రీవాద, ఆదివాసీ, తెలంగాణా, మైనారిటీ ప్రజల ఉద్యమాల ఉధృతితోపాటు, ఈ పోరాటాల వారసత్వం నుంచి పుట్టిన అగ్రకుల ప్రజాస్వామిక మేధావుల కృషి కూడా వుంది. బాలగోపాల్ చేసిన కృషిని ఈ కోణం నుంచి చూడాల్సి వుంది.

❖

**వ్యాసం** ◆ వకుళాభరణం రామకృష్ణ

# బాలగోపాల్ చారిత్రక దృష్టి

చరిత్రకారుడిగా బాలగోపాల్‌ను అంచనా వేయడాన్ని మనకున్న ఆధారాలు స్వల్పమే. అయినా అవి బాలగోపాల్ చారిత్రక దృష్టిని విశ్లేషించడాన్కి ఉపకరిస్తాయి. రూఢార్థంలో బాలగోపాల్‌ను చరిత్రకారుడిగా పరిగణించలేము. వృత్తిరీత్యానేగాక, ప్రవృత్తిగా గూడ చరిత్రలను ఆయన చేపట్టలేదు. వివిధాంశాలపై - రాజకీయ, ఆర్థిక, సాహిత్య, సామాజిక వర్తమానాంశాలపై చేసిన రచనలు పరిశీలిస్తే, వీటిలో అంతర్లీనంగా సాగే నిర్దిష్ట చారిత్రక దృక్పథం స్పష్టమవుతుంది.

చారిత్రక నేపథ్యంలేనిదే పై చెప్పిన అధ్యయనాంశాలపై సమగ్రంగా రాయడం సాధ్యంకాదు. చరిత్ర చొరబారని అధ్యయనాలు, చరిత్రను, గణనలోకి తీసుకొని పరిశోధనలు వుండవని చెప్పలేంగానీ, వున్నా అవి అరుదుగానే వుంటాయి. పైగా శాస్త్ర అనుబంధ దృక్పథం సామాజిక శాస్త్రాల పరిశోధనల్లోకి ప్రవేశించాక, వీటి మధ్య వుండే సాంప్రదాయిక సరిహద్దులు పూర్తిగా చెరిగిపోకున్నా, మసకబారాయని చెప్పచ్చు. బాలగోపాల్ తన రచనల్లో యీ పద్ధతిని పాటించాడని స్పష్టంగా అర్థమవుతుంది.

1980 దశకంలో బాలగోపాల్, ప్రాచీన భారతదేశ చరిత్ర, డి.డి.కోశాంబీ పరిచయం అన్న మకుటంతో ఒక గ్రంథం (1986), 'భారత చరిత్ర - పరిచయ వ్యాసాలు - డి.డి.కోశాంబీ (1987) మరొక గ్రంథం (అనువాదం) రాసినట్టు దాఖలాలున్నాయి. రెండవ గ్రంథంపై ఆయన పేరు లేకపోవడం ఎందుకు జరిగిందో తెలీదు. కోశాంబీ అనుసరించి చారిత్రక పద్ధతి ఆంధ్ర దేశంలోకి ప్రముఖంగా 1970 దశకం దాకా రాలేదు. అంతకు పూర్వం అడపా, దడపా, ఏవో ఒకటి రెండు వ్యాసాలు వచ్చాయని విన్నాం. అది ప్రాచుర్యంలోకి రాలేదు. అఖిల భారత స్థాయిలో గూడ కోశాంబీ గ్రంథాలు 1960 దశకంలోనే పూర్తిగా అందుబాటులోకి వచ్చాయని గుర్తుంచుకోవాలి. 1970 దశకంలో, ఢిల్లీల్లో జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఏర్పడ్డం, భారతీయ చరిత్ర పరిశోధనా మండలి స్థాపన (ICHR), పాఠశాల స్థాయిలో, NCERT, దేశవ్యాప్తంగా ప్రముఖ చరిత్రకారులతో (ఆర్.ఎస్.శర్మ, రొమిలా థాపర్, బిపిన్ చంద్ర, తారాచంద్, ఎస్.గోపాల్, నీలకంఠ శాస్త్రి మున్నగువారు) పాఠ్యగ్రంథాలు రాయించడంతో కోశాంబీ రచనలు, సిద్ధాంతాలు అఖిల భారత స్థాయిలో ప్రాచుర్యంలోకి వచ్చాయి. 1970,80 దశకాల్లో కంభంపాటి (సీనియర్) ఆంధ్రుల చరిత్రపై రాసిన రెండు సంపుటాలు మార్క్సిస్టు సిద్ధాంతపు వెలుగులో రాశారు. (బాలగోపాల్, కంభంపాటి గ్రంథాలను విమర్శించాడు). 1970 దశకంలోనే ఆంధ్రప్రదేశ్ నుండి కొందరు జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (ఢిల్లీ)లో చరిత్ర పరిశోధనలో కొత్త మెళుకువలతోపాటు, కోశాంబీ చరిత్ర రచనా పద్ధతులను అభ్యసించి, 1980 దశకానికి తిరిగి వచ్చి, తమ పరిశోధనల్లోనేగాక, తాముపర్యవేక్షిస్తున్న పరిశోధనల్లోనూ కోశాంబీ పద్ధతుల్ని పాటించసాగారు. సరిగ్గా యిదే సమయంలో, తెలుగు మేధావులకు, పరిశోధకులకు, సామాన్య పాఠకులకు కోశాంబీని పరిచయం చేసే సదాశయంతో హైదరాబాద్ బుక్‌ట్రస్టు పూనుకొని, బాలగోపాల్‌ని అడగడం, వారు అంగీకరించి రాయడం జరిగింది. (మొదటి గ్రంథానికి ముందుమాట నా చేత రాయించారు)

మొదటి గ్రంథంలో (కోశాంబీ పరిచయం) కోశాంబీ అనుసరించిన చారిత్రక పద్ధతిని బాలగోపాల్ విశదీకరించాడు. ఆ పద్ధతిని తాను పూర్తి ఆమోదాన్ని, అంగీకారాన్ని తెలియజేసే విధంగా సాగింది పరిచయం. శాస్త్రీయ పద్ధతుల్ని కోశాంబీ అనుసరించాడని చెపుతూ, మార్క్సిస్టు సిద్ధాంతాల ఆధారంగా చరిత్ర రచించామని చెప్పుకున్న వారిలోని అసమగ్రతలను ఎత్తిచూపడానికి వెనుకాడలేదు. (శ్రీ పా... ...దాంగ్, ఉదాహరణకు) కోశాంబీ రచనల్ని తెలుగు పాఠకులకు ఎందుకు పరిచ... ...ంబీ అని ప్రశ్నించుకొని, యీ విధంగా సమాధానం చెప్పాడు.

"దేశభక్తి, సంప్రదాయికత, అగ్రవర్ణ ఆధిక్యత, విశృంఖలమైన ఊహా తత్పరత మొదలయిన అనేక అవలక్షణాల నుండి మన దేశ చరిత్రను కోశాంబీ రక్షించాడు... శాస్త్రీయంగా ప్రాచీన భారతదేశ చరిత్రనువెవ్వరు అధ్యయనం చేయదల్చుకున్నా కోశాంబి ప్రతిపాదించిన భౌతిక చోదక క్రమాన్ని ప్రాతిపదికగా తీసుకోక తప్పదేమో" (చూడు ముందుమాట పుటలు 1,2).

ఇదే సందర్భంలో మరో ప్రశ్న గూడ వేసుకొని, తానే సమాధానం చెప్పుకొన్నాడు. 'ఎవరికోసం యీ గ్రంథ పరిచయం' అంటూ సమాజంలో కొత్తగా అక్షరాస్యులవుతున్నవారు వెనుకబడే వర్గాలకు చెందినవాళ్లు కాగా, వారిపై ప్రభావం చూపే,

"భావ ప్రచార సాధనాలు, 'యెల్లో జర్నలిజం,' వార్తా పత్రికల సీరియల్ కథలు, వాటితోటయిన సినిమాలు - అశ్లీలతనూ, అశాస్త్రీయతనూ అమ్మకానికి మేళవించి అంగట్లో పెట్టిన సరుకు. వీటి పోటీని తట్టుకొని నూతన తరంలో శాస్త్రీయ భావాలను ప్రచారం చేయాల్సిన బాధ్యత అభ్యుదయ కాముకులందరి మీదా వుంది" అని వక్కాణించాడు. ఇక్కడే, కొడవటిగంటి కుటుంబరావు మాటలను గుర్తుకు తెస్తాడు. 'చరిత్రను గూర్చి శాస్త్రీయంగా ఆలోచించడం నేర్చుకొంటే జీవితంలో అన్ని విషయాలనూ శాస్త్రీయంగా అర్థం చేసుకోగలం' అంటాడు. కోశాంబీని పరిచయం చేయడంలో ఆత్మాశ్రయత చోటు చేసుకొండా, స్వంత అభిప్రాయాలు (వ్రాయునని చెప్పి, 'అభిప్రాయాలెప్పుడూ సమిష్టివేననీ, తనవని చెప్పి సొంతం చేసుకోవడం, నైతిక బాధ్యతకోసమేనని' అంటాడు. బాలగోపాల్ వెలిబుచ్చిన యీ అభిప్రాయంతో ఏకీభవించడం కష్టం. కేవలం నైతిక బాధ్యతకోసమేకాదు. రచయితలు లేక చరిత్రకారులు తమ భావాలకు (Subjective feelings) కట్టుబడి వుండాల్సిన మాట అవసరమేగానీ, ముఖ్యంగా చరిత్రను రచనలో స్వంత భావాలు తెలిసో, తెలియకో చోటు చేసుకోక తప్పదు. ఇదే విషయాన్ని EH Car తన What is history అనే గ్రంథంలో విపులీకరించాడు. గతాన్ని గూర్చి రాస్తున్న నేటి చరిత్రకారునిపై ఇప్పటి సమాజం, మేధో పరభావాలు, చరిత్రకారుని అస్తిత్వం - తమ ప్రభావాన్ని చూపుతాయన్నది దాదాపు అందరూ అంగీకరించేదే!

కోశాంబీ చరిత్ర రచనను, సిద్ధాంతాలను సదృశ్యాలను బాలగోపాల్ ఏమన్నాడో వివరించేముందు వారు చెప్పినదే మరొక ముఖ్యమైన ఉటంకింపు చూద్దాం.

"కోశాంబీ భగవద్గీత మీద రాసిన వ్యాసాన్ని 1976లో మొట్టమొదటిసారి చదివి నేను మార్క్సిస్టునయ్యాను".

చరిత్ర రచనకు ఆధారాలు కావాలి కదా! అవి ఎలాంటివి? ప్రధానమైనవి రెండు - సాహిత్య, పురావస్తు ఆధారాలు. భారత దేశ చరిత్ర రచనలో పురావస్తు పరిశోధన ఆలస్యంగా జరిగింది కాబట్టే సాహిత్య ఆధారాలనే పలువురు చరిత్రకారులు ఎక్కువగా వుపయోగించు కొన్నారు. ముఖ్యంగా వేదాలు, పురాణాలు, ధర్మశాస్త్రాలూ, కావ్యాలూను. ఇవన్నీ మత, సాంస్కృతిక గ్రంథాలు. పురాణాల్లో పొందు పర్చిన రాజవంశాల పట్టికలను, కథనాలనూ ఏమాత్రమూ విమర్శనా దృష్టితో పరిశీలించకుండా, యిష్టం వచ్చిన రీతిలో ఉటలింపులిచ్చి, చరిత్రను నిర్మించే పద్ధతిని కోశాంబీ తీవ్రంగా దుయ్యబట్టాడు. (ఈ సందర్భంలో, డాంగేనేగాక, తిలక్ రచనల్ని కూడా వక్రీకరణలన్నాడు) రాసిన సాహిత్యాధారాలను, పురావస్తు పరిశోధనల్లో లభించిన అవశేషాలతో, సమాచారంతో సమన్వయం చేసినప్పుడే అది శాస్త్రీయమవుతుందని పేర్కొన్నాడు. ఇక్కడ బాలగోపాల్ ఒక చక్కని ఉదాహరణ యిచ్చాడు. ప్రముఖ తెలుగు రచయిత్రి తెన్నేటి హేమలత తాను రాసిన 'లతారామాయణం'లో ఋగ్వేదంలో ఏనుగుల ప్రస్తావన లేదు కాబట్టి, ప్రపంచంలో ఏనుగులకు పూర్వమే వేదాలున్నాయని రాశారు.కానీ జీవశాస్త్రం ప్రకారం ఏనుగులు దాదాపు కోటి సంవత్సరాల నుండే ఉన్నాయి వేదాలు కాదు కదా, అప్పటి మానవజాతే లేదన్నారు. పురాణగాథలు, జానపదుల మత

విశ్వాసాలు, అనాది పూజా విధానాలు - వీటన్నిటి నుండి కోశాంబి ఎన్నో విలువైన ఆధారాలను గ్రహించినా, వాటినన్నింటినీ పురావస్తు ఆధారాలతో, అవి అమల్లో వున్న కాలంనాటి నైసర్గిక స్థితిగతులలోనూ పోల్చి చూశాడు. వాటి మధ్య సమన్వయం వుంటేనే యదార్థమైనవిగా అంగీకరించాడు. అయితే సాహిత్య, పురావస్తు ఆధారాలు కూడా సంపూర్ణ చరిత్ర నిర్మాణానికి దోహదం చేయకపోవచ్చు. అందుకే, ఆయన మరో పద్ధతిని సూచించాడు. భారతదేశ చరిత్ర యావత్తూ నడిచిన, నడుస్తున్న తీరును, (Continuity and Change) 'అవిచ్ఛిన్నత - మార్పు' అనే సూత్రీకరణ వెలుగులో చూడాలన్నాడు. భారతీయ సంస్కృతిని 'భిన్నత్వంలో ఏకత్వం'గా తరచూ అభివర్ణించడం మనకు తెలుసు. మన సంస్కృతి సంప్రదాయాలు అనాది నుండి నేటి వరకూ అవే రూపాల్లోనూ, లేదా మార్పు చెందిన రీతిలోనూ, యిప్పటి సమాజ పొరల్లో యే విధంగా నిక్షిప్తమై వున్నాయో పరిశీలనా దృష్టిలో చూడమంటాడు. చాలా ముఖ్యమైన సూత్రీకరణ యిది. జానపదుల గాథల్లో, జీవన విధానంలో, మత కర్మకాండల్లో, స్త్రీల పండుగల్లో, పాటల్లో అప్పటి అవశేషాలు సంస్కృతీకరణ క్రమంలో మార్పులకు గురయినా, నేటికీ మనకు లభ్యమవుతున్నాయనీ, వాటిని నిశితంగా పరిశీలించాలి, విశ్లేషించాలన్నాడు. ఈ పద్ధతి చరిత్ర రచనకు కోశాంబి గావించిన మౌలిక ఆవిష్కరణగా చెప్పుకోవచ్చు అని బాలగోపాల్ అభిప్రాయపడ్డాడు. సమాజపు పొరల్లో నిక్షిప్తమై వున్న చారిత్రక అవశేషాలను గుర్తించి, వెలికి తీయాలని చెప్పడం, వాటిని తిరిగి పురావస్తు, సాహిత్యాధారాలతో బేరీజు వేసుకొని సమన్వయ పరచాలన్నాడు.

చరిత్ర పరిశోధనా పద్ధతిలోని లోపాలను (సాహిత్య, పురావస్తుపర అసమగ్రతల వల్ల చక్రవర్తుల, రాజుల పరిపాలనా కాలాల్ని నిర్ణయించడం, చారిత్రక ఘటనలు జరిగిన ప్రదేశాలు ఎక్కడివో ఇదమిద్ధంగా చెప్పలేకపోవడం - అశోక్‌డి శిలా శాసనాలు వీటికి మినహాయింపు) సరిదిద్దడం కోసం కౌశాంబి అనుసరించిన పద్ధతిని బాలగోపాల్ ప్రశంసా పూర్వకంగా వివరించాడు. చరిత్ర రచనా పద్ధతి నుండి ఇక చర్చ కోశాంబి అనుసరించిన సిద్ధాంత చర్చగా మారేది యిక్కడ నుండే. చరిత్ర అంటే రాజుల మహారాజుల, మహా సంగ్రామాల వివరాలు లేక పట్టిక కాదంటూ, అలా భారతదేశ చరిత్రను రాయడం అసాధ్యమంటాడు. "ఒక ప్రాంతానికి రాజెవ్వడు అనే ప్రశ్న కంటె ఆ ప్రాంతం ప్రజలకు నాగలి వాడకం తెలుసునా లేదా అనేది ముఖ్యమైన ప్రశ్న" (కోశాంబి) రాజుల ప్రస్తావన గూర్చి కోశాంబి భావాల్ని బాలగోపాల్ ఉటంకించిన తీరు చూద్దాం. "వ్యవసాయానికి వుపయోగించిన పద్ధతి మీద రాజ్యాధికార స్వభావం ఆధారపడి వుంటుంది గాని, రాచరికం వ్యవసాయ విధానాన్ని నిర్ణయించదు.... ఈ రాజు ముందా, ఆ రాజు ముందా అనేది అక్కరకు రాని ప్రశ్న. అయితే ఇనుము వాడకం ఫలానా రాజు కాలంలో మొదలయిందా లేక మరొక రాజు కాలంలో మొదలయిందా అనేది అందుకు భిన్నమైన ప్రాముఖ్యాన్ని కలిగిన ప్రశ్న. అప్పుడు ఆ యిద్దరిలో ఎవరి ముందు నిర్ణయించడం అవసరం అవుతుంది". (బాలగోపాల్, కోశాంబి పరిచయం, పుట 6).

చరిత్ర అంటే "ఉత్పత్తి శక్తులలోనూ, ఉత్పత్తి సంబంధాలలోనూ క్రమానుసారంగా వచ్చే మార్పులను కాలానుగతంగా వివరించడం చరిత్ర" అని కోశాంబి నిర్వచనాన్ని బాలగోపాల్ తన మాటల్లో చెప్పాడు. చరిత్ర గమనంలో ఉత్పత్తికి వినియోగించే సాధనాలు, పద్ధతులు, అదనపు ఉత్పత్తిని పాలక వర్గాలకు చేరవేసే సామాజిక ఏర్పాట్లు కాలక్రమంలో మారుతూ వస్తున్న తీరును వివరించడం చరిత్ర. చరిత్రలో సంస్కృతి పెరుగుదలకు అదనపు వుత్పత్తి అవసరమవుతుంది. కోశాంబి అనుసరించిన దృక్పథం గతి తార్కిక భౌతికవాదం. దాన్నే మార్క్సిజం అంటారు. కానీ, అది ఆర్థిక నియతి వాదం కాదన్న విషయాన్ని కోశాంబి బల్లగుద్ది చెప్తాడు. ఒకానొక చారిత్రక సన్నివేశంలో జరిగే పరిస్థితులు, సంఘటనలు ఒకే రకమయిన మార్పుకు దోహదం చేయవు. చరిత్ర పురోగామి స్వభావాన్ని కలిగి వుంటుందని మార్క్సిజం నమ్ముతుంది. దీన్నే(ఇహెచ్ కాఌర్ (...) అంటాడు. గతకాలపు చరిత్ర ఆనవాళ్ళు నేటి సమాజంలో మన చుట్టూ వున్నాయి. వాటిని వెదికి పట్టుకోవాలి. చరిత్ర రచనకు ఉపయోగించుకోవాలి. "కోశాంబి దృష్టిలో చరిత్ర గతంలోనే కాదు. వర్తమానంలోనూ వుంది". (J.D.Bernall)

కోశాంబి చరిత్ర రచనా పద్ధతిని విశ్లేషించాక, ప్రాచీన భారత దేశ చరిత్రను క్రీ.శ. 1000 దాకా, కోశాంబి రచనల ఆధారంగా బాలగోపాల్ వివరించాడు. అవసరమైన చోటల్లా అధో జ్ఞాపికలు యిచ్చాడు. ఈ క్రమంలో బాలగోపాల్ కుతమ చరిత్రపై వున్న స్పష్టత, పూర్తి అవగాహన తెలుస్తాయి. అతిక్లిష్టమైన భావాలకు నేర్పుగా, సరళంగా వివరిస్తాడు. బాలగోపాల్ గణిత శాస్త్రవేత్తగానే ఆగిపోలేదు. సాహిత్య, తత్వశాస్త్రాలతోపాటు సామాజిక శాస్త్రాల్లోనూ విశేషకృషి సల్పాడు. అధ్యయన రంగంలో ఒక విలక్షణమైన స్థానాన్ని సాధించాడు. ఆర్థిక శాస్త్రవేత్తలతో, చరిత్రకారులతో, గణిత శాస్త్రజ్ఞులతో, సాహితీవేత్తలతో - అందరితోనూ ధీటుగా భావపూరిత చర్చలు చేయగల సామర్థ్యాన్ని సాధించాడు.

కోశాంబి చరిత్ర గ్రంథాలను పరిచయం చేయడంలో బాలగోపాల్ చారిత్రక దృక్పథం వ్యక్తమైన తీరు పైన పరిశీలించాం. కోశాంబిలో పరకాయ ప్రవేశం చేసి తానే ఆ చరిత్రకు కర్తేననిపించేంతగా పరిచయం చేశాడు. చరిత్ర రాయడానికి కావలసిన విషయ సేకరణ చేశాకే, వ్యాఖ్యానం చేయాలనీ, లేక, "ముందే ఒక చారిత్రక సిద్ధాంతంలో మొదలు పెడితే సిద్ధాంత పరిమితుల వల్ల చరిత్రను చరిత్రకారుడు పాక్షికంగా మాత్రమే చూస్తాడు. విషయసేకరణ అసమగ్రంగా వుండి పోతుంది". (సమీక్ష ప్రారంభ సంచిక, మే నెల 1987). ప్రతి చరిత్రకారుడికి ఒక సిద్ధాంతం వుంటుంది. దాని కనుగుణంగానే విషయసేకరణ చేస్తాడు. దాని ఆధారంగానే చరిత్ర రాస్తాడు. తాను సేకరించిన విషయాలు తన సిద్ధాంతానికి సరిపోలేదనుకుంటే, సిద్ధాంతాన్ని సవరించుకొని తిరిగి విషయసేకరణ చేస్తాడనీ, "ఈ విధంగా సిద్ధాంత అవగాహన, విషయ సేకరణ పరస్పర గతి తార్కిక చర్యలో సాగుతాయి. అంతేగాని ముందు విషయసేకరణ అంతం చేసేసి ఆ తరువాత సిద్ధాంత నిరూపణ ఏ చరిత్రకారుడూ చేయడు" (చూడు పైన యిచ్చినదే) అనడంలో బాలగోపాల్ సిద్ధాంతానికున్న ప్రాముఖ్యాన్ని వివరిస్తూ, అది విషయ సంపన్నతతో ఫలప్రదమవుతుందంటాడు. సిద్ధాంతాలు భిన్నంగా వుంటే, భిన్నమైన చరిత్రలుంటాయి గదా అన్న సందేహానికీ, అసలు నిజమైనచ చరిత్ర ఉండదా అన్న ప్రశ్నకు "మార్క్సిజం మాత్రమే సమగ్రమన సమాధానాలు ఇవ్వగలదు" అని చెప్పాడు. ఈ సందర్భంలో బాలగోపాల్, "నిజమైన రసాయనిక శాస్త్రం అంటూ ఏదీ లేనట్టే 'నిజమైన' చరిత్ర అనేది కూడా వుండదు. అన్ని విజ్ఞాన శాస్త్ర విషయాలలాగ చరిత్ర కూడ అవిచ్ఛిన్నంగా సాగే పరిశోధనా ఫలితం. గతాన్ని గూర్చి మన అవగాహన మారుతూ వుంటుంది". (చూడు పైన యిచ్చినది) లభించిన, లభిస్తున్న ఆధారాలు, వాటిని వివరించే తీరు, సిద్ధాంతాలను బట్టి చరిత్ర మారుతూ వుంటుంది. 50 సంవత్సరాల క్రితం ఆర్యుల గూర్చి మనకున్న పరిజ్ఞానం కంటె యివ్వాళ మనకు తెలిసింది ఎక్కువే కాక భిన్నమైనది కూడ. ఇదే క్రమంలో మధ్యయుగాల గల, వలస పాలన చరిత్రలు కూడ వస్తాయి. ఇదే విషయాన్ని, "నిజమయిన చరిత్ర' అనే పదార్థం ఒకటి వుండదుగాని, నిజమయిన చారిత్రక సిద్ధాంతం ఉంటుంది. మార్క్సిజం దానిని చారిత్ర భౌతిక వాదమంటుంది. మార్క్సిస్టు చరిత్ర రచన యీ చారిత్రక సిద్ధాంతం వెలుగులో విషయసేకరణ చేస్తుంది. రాజుల వ్యక్తిత్వం గూర్చి కాక సామాజిక నిర్మాణంలోని వైరుధ్యాల గురించి, వాటి నుండి పుట్టే సంఘర్షణల గురించి సమాచారాన్ని సేకరిస్తుంది" అని వివరిస్తాడు బాలగోపాల్ (చూడు పైన పేర్కొన్నదే). చరిత్ర గమనంలో చోటు చేసుకొనే దశలు, వైరుధ్యాలు, సంఘటనలు సంఘర్షణాలు ఎప్పుడు ఎలా వుండాలో ముందే నిర్ణయించుకొని, ఒక మూస తయారు చేసి ఆ మూసలోకి చరిత్రను బలవంతంగా నెట్టే ప్రయత్నం చేయవద్దనీ, ప్రారంభంలో మార్క్సిస్టు చరిత్రకారులు యీ 'పొరబాటు' చేశారనీ, కోశాంబి రచనల మూలంగా చరిత్ర రచనా పద్ధతి విముక్తమయిందంటాడు.

❖

**వ్యాసం** ◆ మనోరంజన్ మహంతి

# మహోన్నత మానవతావాది

బాలగోపాల్ ఇక లేరన్న విషయాన్ని నమ్మలేకపోతున్నాను. ప్రభుత్వం, మావోయిస్టుల మధ్య శాంతి చర్చలకు చొరవ తీసుకొనేందుకు నిర్వహించిన ఒక సమావేశంలో ప్రసంగించేందుకు గత నెలలోనే ఆయన ఢిల్లీ వచ్చారు. ఆయన మరణంతో భారతదేశంలోని ప్రజాస్వామ్య హక్కుల కార్యకర్తలు ఒక గొప్ప మార్గదర్శిని కోల్పోయారు. భారతదేశపు ప్రగతిశీల ప్రజాస్వామ్య ఆలోచనా స్రవంతిని సమున్నతం చేసిన ఒక అరుదైన మేధావిని భారతీయులు కోల్పోయారు.

మానవ హక్కుల ఉద్యమంలో పనిచేస్తోన్న నాలాంటి ఎంతో మందికి బాలగోపాల్ ఒక స్ఫూర్తిదాయక మార్గదర్శి. కణ్ణబీరన్, హరగోపాల్‌లతో కలిసి ఆయన ఉదారవాదుల, మార్క్సిస్టుల ప్రధాన స్రవంతి భావాలను సవాల్ చేస్తూ మానవ హక్కుల అర్థాన్ని నిర్వచించారు. పౌర స్వేచ్ఛ అంటే అన్నిటికీ మించి చట్టబద్ధమైన పాలన కనుక భద్రతా దళాలు చేసే బూటకపు ఎన్‌కౌంటర్లను చట్ట విరుద్ధమైనవిగా పరిగణించాలని బాలగోపాల్ డిమాండ్ చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఉన్న హక్కుల సంఘాలు ఈ అంశానికి ఇచ్చిన ప్రాధాన్యం వల్లే నేడు బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం పటిష్టమయింది. ఇప్పటికీ బూటకపు ఎన్‌కౌంటర్లు ఆగిపోలేదు. అయితే భద్రతా దళాలు గతంలో మాదిరిగా నిర్భయంగా వాటికి పాల్పడడం లేదు. పాల్పడితే ప్రజలు నిలదీస్తారనే భయం వారిని వెంటాడుతోంది. బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని ప్రోది చేయడానికి, పౌరహక్కులను పటిష్టం చేయడానికి బాలగోపాల్ చేసిన కృషిని ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరు.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో పనిచేస్తున్నప్పుడుగానీ, మానవ హక్కుల వేదికలో పనిచేస్తున్నప్పుడుగానీ, బాలగోపాల్ పౌరహక్కులను ఒక సంకుచితార్థంలో పరిగణనలోకి తీసుకోలేదు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక స్వాతంత్ర్యాలకు సామాన్య మానవులకు గల హక్కులే పౌరహక్కులు అని ఆయన నిండుగా విశ్వసించారు. పౌరహక్కుల ఉద్యమంలో భాగంగానే దళితులు, మహిళలు, మైనారిటీలపై జరిగిన దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా ఎన్నో కేసులలో ఆయన వాదించారు. పౌరహక్కుల ఉద్యమాల మూలంగా గత మూడు దశాబ్దాలలో ఆంధ్రప్రదేశ్ సమాజంలో గొప్ప సృజనాత్మక పరివర్తనలు సంభవించాయి. ఈ పరిణామాలకు బాలగోపాల్ చేసిన దోహదం చాలా విశిష్టమైనది. ఆయన నిశిత మేధాశక్తి, నిష్పాక్షిక, నిస్వార్థ నాయకత్వం నుంచి విశాల భారతదేశపు పౌర, మానవ హక్కుల ఉద్యమాలు ఇతోధికంగా లబ్ధి పొందాయి.

బాలగోపాల్ గురించిన ఎన్నో జ్ఞాపకాలు నన్ను ఇప్పుడు ముప్పిరిగొంటున్నాయి. ఒక అనుభవాన్ని వివరిస్తాను. 1985లో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో జరిగిన ఒక స్మారక సభలో పాల్గొనడానికి వెళ్లిన బృందంలో నేనూ ఒక సభ్యుడిని (బాలగోపాల్ అప్పుడు ఏపిసిఎల్‌సి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.) పోలీసులు మా వాహనాన్ని ఆపి మమ్మల్ని అరెస్ట్ చేశారు. రెండు రాత్రులు మేము లాకప్‌లోనే ఉన్నాము. మొదటి రాత్రి నేను నా జోకులతో అందరినీ నవ్వించడానికి ప్రయత్నించాను. అయితే బాలగోపాల్ నా జోకులకు పెద్దగా ప్రతిస్పందించలేదు. నవ్వు వచ్చినా బలవంతంగా ఆపుకున్నారు. మర్నాడు ఉదయం నేను షేవింగ్ చేసుకున్నా ఆయన చేసుకోలేదు. ఎందుకు చేసుకోవడం లేదని అడగగా అణచివేతలో ఉండగా షేవింగ్ చేసుకోవడం ఇష్టం లేదని ఆయన సమాధానమిచ్చారు. ఆ రోజు రాత్రి మమ్మల్ని అడవి గుండా ఒక పట్టణానికి తీసుకెళ్ళారు. ఆ మరునాడు ఉదయం మమ్మల్ని మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచవలసి వుంది. అర్ధరాత్రి దాటిన తరువాత దట్టమైన అడవిలో గుండా వెళుతుండగా నేను ఆయన చెవిలో మెల్లిగా ఇలా అన్నాను : 'మనలను ఏ క్షణంలోనైనా ఎన్‌కౌంటర్ చేయవచ్చునేమో, ఏమైనా ఈ అంతిమ క్షణాల్లో మీతోపాటు ఉన్నందుకు నేను గర్విస్తున్నాను'. బాలగోపాల్ పెద్దగా నవ్వి ఇలా అన్నారు: 'మీకు ఆశాభంగం కలుగుతుంది. ఎందుకంటే మనల్ని తీసుకెళుతున్న పోలీసులు శాంతిభద్రతల పోలీసులు కాదు కోర్టు పోలీసులు, కాసేపు వేచి చూడండి. వారు మనకు టీ ఇస్తారు'. నిజంగానే ఒక అరగంట తరువాత మమ్మల్ని తీసుకెళుతున్న వాహనాన్ని ఒక దాబా వద్ద ఆపి, మాకు మసాలా టీ ఇప్పించారు. మరునాడు మాకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మేధావులు చేసిన ఒత్తిడి వల్ల ఆ తరువాత ఎన్.టి.రామారావు ప్రభుత్వం మా పై కేసును ఉపసంహరించుకొంది. అణచివేతను ఎదుర్కోవడంలోను, మానవ హక్కులను పరిరక్షించడంలోను బాలగోపాల్‌తోపాటు ఇటువంటి అనుభవాలు పొందినవారు ఎంతో మంది ఉన్నారు.

మానవ హక్కుల ఉద్యమం మానవ విలువలను పరిరక్షించే స్వతంత్ర రాజకీయ శక్తిగా ఉండాలనే విషయమై బాలగోపాల్ ఏపిసిఎల్‌సి నుంచి వైదొలగి 'మానవ హక్కుల వేదిక'ను ఏర్పాటు చేశారు. రాజ్యాంగం, చట్టాలకు కట్టుబడి తమ చట్టబద్ధమైన విధులన్నిటినీ కచ్చితంగా నిర్వర్తించేలా రాజ్యాంగ సంస్థలన్నింటిపై మానవ హక్కుల ఉద్యమం ఒత్తిడి తీసుకురావాలని ఆయన విశ్వసించారు. జమ్మూ - కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఒరిస్సా మొదలైన రాష్ట్రాల్లో సైనిక దళాలు, పోలీసుల చట్ట విరుద్ధ చర్యలను బహిర్గతం చేయడానికి ఆయన నిరంతరం శ్రమించారు. అలాగే మావోయిస్టులు అమాయకులను ఊచకోత కోసిన సంఘటనలను కూడా ఆయన తీవ్రంగా ఖండించారు. ఇది మావోయిస్టులకు కోపకారణమయినప్పటికీ పలు సందర్భాలలో వారు తమ తప్పును బహిరంగంగా ఒప్పుకోవడం జరిగింది. కొద్ది రోజుల క్రితం జార్ఖండ్‌లో ఒక పోలీసు అధికారి తలను నరికివేసిన ఘటన కూడా ఇటువంటిదేనని చెప్పవచ్చు. పౌరహక్కుల సంఘాలన్నీ మావోయిస్టుల ఆ చర్యను తీవ్రంగా ఖండించాలి.

అణచివేతకు గురవుతున్న ప్రజలే ఆ అణచివేత వాస్తవాలను అంగీకరిస్తుండగా మానవహక్కుల పరిరక్షణ పేరిట చేస్తున్న కృషి అమూర్త మానవ విలువలను రక్షించడమే కాదా అని మాలో చాలా మందిమి బాలగోపాల్‌తో వాదించడం జరిగింది. అయితే ఆయన ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు. రాజకీయ, ఆర్థిక పరిస్థితులను నిశితంగా విశ్లేషించి, నాగరికతల చరిత్రను లోతైన తాత్విక దృక్పథంతో సమీక్షిస్తూ ప్రతి ఒక్కరూ మానవ హుందాతో కూడిన జీవితాన్ని పొందేందుకు మానవాళి చేసిన కృషిని మాకు ఉత్తేజకరంగా వివరించారు. మానవ విలువలకు మన నిబద్ధతే మానవ హక్కులను పరిరక్షించడంలో మన కృషి తీరుతెన్నులను ప్రతి స్థాయిలోనూ నిర్ణయిస్తుందని బాలగోపాల్ విశ్వసించారు. ప్రజాస్వామిక హక్కుల కోసం నిరంతర పోరాటం చేసిన ఈ మహోన్నత మానవతావాది వారసత్వం ఆ నిండు విశ్వాసమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఆంధ్రజ్యోతి, 10 అక్టోబరు, 2009

*

వ్యాసం ◆ నల్లూరి రుక్మిణి

# అవసరమైన సందర్భంలో లేకుండా పోయారు

బాలగోపాల్ చనిపోయిన దగ్గర నుండి ఆయన అభిమానులూ, ఆప్తులూ చాలా రాస్తున్నారు, మాట్లాడుకుంటున్నారు. అవి వింటూ చదువుతూ వుంటే "అంతటి మనిషిని పోగొట్టుకున్నామే" అని బాధయింది. అయితే నిన్న సాయంకాలం (గుంటూరు - 31-10-09) అబూజ్‌మడ్ అణిచివేతకు వ్యతిరేకంగా జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాత్రం ఇప్పుడు బాలగోపాల్ లేకపోయెనే! అవసరమయిన సందర్భంలో లేకుండా పోయాడేమిటీ అనిపించింది. ఇప్పుడు ఆయన అవసరం ఎంత వుంది. ఆయన లేని లోటు తీర్చడానికి ఒక్కరు లేరుగదా! అనిపిస్తే - ఆ వ్యథ మరింత ఎక్కువయింది.

చనిపోవటానికి ముందు బహుశా పది పదిహేను రోజులకు ముందనుకుంటాను. 'ఆ వేటను ఆపమని నినదాం' అనే టైటిల్‌తో ఆంధ్రజ్యోతిలో ఓ వ్యాసం రాశారాయన. ఆ వ్యాసంలో ఓ ప్రశ్న వేశారు. "ప్రజల పక్షాన ప్రజల ఆకాంక్షలను తీర్చడానికి పోరాడే వారివైపే న్యాయంవుండేమాట నిజమేగానీ ప్రజల క్షేమంకంటే తమ రాజకీయ లక్ష్యాన్ని ప్రధానంగా ఎంచినప్పుడు ఒక్కోసారి ప్రజలకు అన్యాయం కూడా జరుగుతుందనేది" ఆయన వాక్యాల అర్థం ఇదేనని నాకు గుర్తున్నంత వరకు అనుకుంటున్నాను.

ఈ మాట నిన్న సాయంత్రం ఆ సమావేశంలో కూర్చున్నంతసేపూ పదే పదే నా మనసులో తొలచసాగింది. 'అబూజ్‌మడ్'లో పరిణామాలు ఈ రకంగానే వుండబోతాయని ఎవరికైనా తెలిసిన విషయమే. ముఖ్యంగా ఎల్‌టిటిఈ అపజయం తరువాత ఈ అభిప్రాయం మరింత బలపడింది. పాలకవర్గాలు, బహుళజాతి కంపెనీలు వాళ్ల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వుండే దేన్నీ మిగలనివ్వరన్నది సత్యం. సద్దాంహుస్సేన్ మార్క్సిజమూ చెప్పలేదు - సోషలిస్టు రాజ్యం కావాలనీ అనలేదు. పైగా అమెరికన్ పాలకులు పెంచి పోషించిన వాడు. అయినా 'ఇరాక్'ను విధ్వంసం చెయ్యందే అమెరికా వదిలిపెట్టలేదు. అలాంటిది ఆసియాలో అపారమైన సహజ సంపదలు వుండగా, వ్యూహాత్మకంగా నేపాల్, చైనా భూభాగంతో లింకుల్లో వున్న భారత్‌లో వామపక్ష సాయుధపోరాటాన్ని సహించుతారనుకోలేం.

కనక భవిష్యత్తులో ఈ పోరాటం ఏ మలుపు తిరు - అని ప్రశ్న వేసుకుంటే... మనం ఏం చెయ్యాల్సి వుంది? అన్న ప్రశ్న మనసులో పొడచూపింది. 1925 ప్రాంతాల్లో అల్లూరిగానీ, కొమరంభీంగానీ, బిర్సాముండాగానీ ఆదివాసీల స్వయం ప్రతిపత్తికోసం వలసపాలకులకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్నప్పుడు ఆ కాలంలో దేశవ్యాప్తంగా బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలు తరతమ బేధాల్లో జరుగుతున్నాయి. అయినప్పటికీ పై ముగ్గురినీ ఆ గిరిజనుల ముందే కాల్చి చంపారు. ఆ జనాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఆదివాసీ స్త్రీలను అత్యాచారం చేశారు. దేశంలో జరుగుతున్న ఆందోళనలను ఖాతరు చెయ్యనేలేదు. ఇదంతా చరిత్రే కావచ్చు. కానీ మనం ఆ గత చరిత్రను వర్తమానానికిగతి తార్కికంగా ఏట్లా అర్థం చేసున్నట్టు? అని సందేహం కలిగింది.

ఆదివాసీల స్వయం ప్రతిపత్తినే సహించలేని వ్యవస్థ, రాజ్యాధికారాన్ని కూలదోసే.... తమ లాభాలకు అవరోధంగా వుండే విప్లవ పోరాటాలను ఎట్లా సహించగలదు? పైగా ఇప్పుడు బహుళజాతి సంస్థలు రాజకీయ వ్యవస్థను కంట్రోల్ చేసే స్థితిలో వున్నప్పుడు?

ఇక్కడే బాలగోపాల్ ప్రశ్నకు రిలెవెన్స్ వుందనిపించింది. రాజకీయ లక్ష్యమా? ప్రజల క్షేమమా? ఈ ప్రశ్నకు ఎవరి చైతన్య స్థాయి బట్టి వాళ్ళం జవాబులు చెప్పుకోవచ్చుగానీ.... బాలగోపాల్ మాత్రం ప్రజల క్షేమానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. అందుకే ఈ రోజు ఆయనే వుంటే 'అబూజ్‌మడ్' యుద్ధానికి వ్యతిరేకంగా కాలికి బలపం కట్టుకుని తిరిగి వుండేవారు గదా అనిపించింది. ఆ 'అబూజ్‌మడ్' గిరిజనులను తలచుకుంటుంటే మనసు ఖాళీగా అయిపోయింది. అబూజ్‌మడ్‌కు మద్దతుగా మేధావులెంతో మంది స్పందిస్తున్నారు. కానీ ఆ ప్రాంతాలకు వెళ్లి వాళ్ళ భుజం తట్టి, వారి మీద జరిగే అక్రమాలను, అన్యాయాలను ప్రపంచానికి చెపాలిగదా! భవిష్యత్తులో ఇట్లాంటి వాళ్ళు ముందుకు రారా? అంటే తప్పకుండా వస్తారనేదే, నా జవాబు.... జన సామాన్యం నుండే పుట్టుకొస్తారు. అయితే ఈ అవసరమయిన సందర్భంలో ఓ ఓదార్పు లేకుండా పోయిందనే నా విచారం.

ఇక్కడే మనం మధ్యతరగతిని గురించి ఓ మాట అనుకోవాలనిపిస్తోంది. ఈ రోజు 'అబూడ్‌మడ్'కు మద్దతుగా బయట ప్రపంచంలో సానుకూల వుద్యమాలు లేకుండా ఎందుకు పోయాయి. . కనీసం భావ ప్రచారానైనా ముమ్మరంగా చెయ్యలేక పోవడమేమిటి?... ఆ పోరాటంలో వున్న పరిమితితో పాటు మారిపోయిన మధ్యతరగతి కూడా కారణం కదా! ఒకప్పుడు చరిత్రలో ప్రగతిశీల పాత్ర పోషించిన మధ్యతరగతి గ్లోబలైజేషన్ తరవాత ఏమైపోయింది?సంస్కరణోద్యమ కాలం నుండి పురోగామి దృక్పథాన్ని వ్యక్తం చేసిన ఆ వర్గం ఈ రోజు మొత్తంగా పాలకవర్గం వైపు భావజాలాన్ని ఎట్లా మార్చుకుంది? దాని ఫలితం ఎలా వుద్యమం మీద వుంటుందో అంచనా వేసుకోవాలిగదా? అలా అయినప్పుడు మధ్యతరగతి మీద మన భావ ప్రచారాన్ని ఎందుకు కేంద్రీకరించలేకపోయాం. ఆ తరగతి విద్యా విధానంమీద, ఆర్థిక వనరుల మీద, జీవనశైలి మీద ఎందుకు విమర్శను ఎక్కుపెట్టలేదు? అసలు భావజాల రంగమైన విద్యా వ్యవస్థ మీద కాపలా ఎందుకు కాయలేదు?.... ఇవన్నీ ప్రశ్నలే. చాలా మంది అడిగేవే?

అయితే నేనిక్కడ ఇదెందుకు గుర్తు చేస్తున్నానంటే, ఈ ప్రశ్నలను తనకు తాను వేసుకుని వాటికి జవాబుగా బతికినవాడు బాలగోపాల్. ఇప్పటి మధ్యతరగతి బుద్ధిజీవులు అవకాశాలు ఆయన ముందుండే వాటిని ఖాతరు చెయ్యని వ్యక్తిత్వం ఆయనది. అందుకే ఆయన ? అవసరం చాలా వుందనిపిస్తోంది.బాలగోపాల్ చిన్ననాటి మిత్రుడు ఆంధ్రజ్యోతితో రాసిన 'నివాళి' చదివాను. నేననుకుంటున్న మాట ఎంత నిజం.... విదేశాల్లో వుద్యోగం ఇప్పిస్తానని ఆశపెట్టిన ప్రొఫెసర్‌ని తిరస్కరించిన వ్యక్తిత్వం ఆయనది! అంత చిన్ననాడే. ఆ ప్రొఫెసర్ పేరు తన థీసిస్ పేపర్లో పెట్టడానికి ఒప్పుకోలేరు. అంటే ఆయన జీవన విధానం ఎట్లా వుండాలో అప్పుడే నిర్ణయించుకున్నారు. నిజానికి అంత చిన్న వయసులో అట్లా నిజాయితీగా వుండాలను కున్నాడనుకుంటే అతనికి పూర్తిగా లౌకిక జీవితం మీద సమగ్రమైన అవలోకనం వుందనుకోవాలి. ఇట్లాంటి వాళ్ళకు కొందరికి మాత్రమే సాధ్యమయ్యే జీవన శైలి అది.

అయితే నిరాడంబరంగా బతికే వాళ్లు చాలా మందే వుండవచ్చు. కానీ అది నిర్వాపకం నుండో, నిస్తేజం నుండో కాక - సమగ్రమైన తాత్విక చింతన నుండి రావాలి. తను ఏ ప్రజల దగ్గరకు వెళ్ళాలనుకుంటున్నాడో వాళ్ళు 'తమవాడి'గా తనను భావించాలనుకున్నారు. అందుకే ఆ జనం కూడా ఆయన్ను తమ వాడనుకొన్నారు. ఆయన్ను గురించి అంతగా పట్టించుకున్నారు.

దాదాపు 1986-87దాకా మా ఇంటికి అప్పుడప్పుడూ వస్తుండేవాడు. ఆయన కిడ్నాప్ తర్వాత కూడా వచ్చారు. నేనప్పుడు పౌర హక్కుల సంఘంలో పనిచేస్తుండేదాన్ని. ఆయన వచ్చినప్పుడల్లా చొక్కా గుండీ పగిలి 'పిన్ను' పెట్టుకునో... పట్టీలు కుట్లు ఊడిపోయి వేళ్ళాడుతూనో వుండేవి. మాకు ఎన్నిసార్లు ఆ చొక్కా కుట్టిద్దామా? అనిపించేది. కానీ ఆయన్ను చొరవచేసి అడిగే వాళ్ళు ఎవరూ లేకపోయారు. అయితే ఇదేం పెద్ద గొప్ప విషయమా? అట్లా తన డ్రస్సు గురించీ, దేహం గురించీ పట్టించుకోకపోవడం - అనుకోవచ్చుగానీ -

నిజానికి అతనికి వాటి గురించి అనుకోవడానికి తీరిక లేనంతగా పనిలో మునిగిపోయారు. ప్రజల కోసమే బతకాలనుకున్నాడు. అంతే, అది తప్ప మరింకే లౌకిక విషయాలు అతన్ని కదల్చలేదు.

జీవితమంటే పోసుకోలు కబుర్లతో 'గిరీశా'ల్లాగా గడపాలనుకోలేదు. మీరిట్లాలేరేంటీ? అని ఒక్కర్ని కూడా 'వ్యక్తుల్ని' అడగలేదు. కానీ తను నమ్మిన విశ్వాసాలను ఎంతటి వారినైనా నిశితంగా, వ్యంగ్యంగా విమర్శించకుండా వుండనూ లేదు.

అయితే ఇక్కడ వసంతలక్ష్మి గురించి ఒక్క మాటైనా చెప్పుకోవాలి. బాలగోపాల్‌ను నిబద్ధత ఎవరూ అతన్ని మార్చజాలరు. నిజమే గాని అతని అచంచల విశ్వాసాలను పక్కకు లాగే ప్రయత్నంగానీ, అతని విలువలను సడలించే సహజీవనంలోని సాన్నిహిత్యాన్నిగానీ ఒక్క సెకను కూడా వుపయోగించుకోని వ్యక్తిత్వం - చైతన్యం ఆమెది. తను నమ్మిన ప్రజాస్వామిక విలువలకు కట్టుబడి వుండే పట్టుదల ఆమెది. ఆమె జీవనశైలివేరైనప్పటికీ.... అది బాలగోపాల్ దినచర్యలకు ఎన్నటికీ ఆటంకం కలించకపోగా ఆయన నిరాటంకంగా పని చేసుకోవడానికి ఆమె ఎంతో దోహద పడింది.

ఇంకో చిన్న సంఘటన చెప్పాలనిపిస్తోంది. నేను ఎప్పుడూ మనసులో జ్ఞాపకం చేసుకునే విషయం.మృణాళిని రాసిన జ్ఞాపకాలు చదివాక రాయాలనిపించింది. నాకు గోరింటాకు చాలా యిష్టం. అప్పట్లో ఆకు కోసుకొని రుబ్బి మరీ పెట్టుకునేదాన్ని. ఆ రోజు ఆయన ఏదో పని మీద ఆ రాత్రి మా ఇంట్లో ఉండిపోయారెందుకో! నేను శ్రద్ధగా గోరింటాకు పెట్టుకుంటుంటే అట్లా చూశారు చాలాసార్లు. అంతా పాతచింతకాయ వ్యవహార మనుకుంటున్నా రేమిటోనని చాలా బిడియ పడిపోయాను. అయితే ఆయనేం మాట్లాడలేదు. పొద్దుటే లేవడం ఆయన అలవాటు. నేను హాల్లో మంచం వేసుకున్నాను. సియస్ఆర్, బాలగోపాల్ గదిలో పడుకున్నారు. అలవాటు ప్రకారం ఆయన లేచి లైటు వేసుకుని తన పని చూసుకోసాగారు. ఆ అలికిడికి నాకు మెలకువ వచ్చింది.అయితే లేవకుండా ఇంకా మంచం మీదే వున్నాను. ఆయన ఏదోరాసుకుంటూ కూడా తలతిప్పి 'గోరింటాకు బాగా పండిందా?' అన్నారు. నాకు ఎంత ఆశ్చర్యమేసిందో? ఆ మాటకు ఇక సంతోషం పట్టలేనట్టు గబగబా లేచి చేతులు కడిగేసుకుని ఆయనకు చూపించాను. ఇది నాకు ఎన్నాళ్ళో గుర్తుండిపోయింది.

నాకేమనిపిస్తుందంటే ఆయన నిరాడంబరంగా వుండాలనుకుంది జీవితం మీద ఆసక్తి లేకకాదు. లేదూ 'పోతే పోనీ' అన్న చందమూ కాదనుకుంటున్నాను. జీవితం మీద అపారమైన ఆసక్తి వుండబట్టే - జీవితం విలువ నిశితంగా తెలుసు కనకనే! అలా వున్నారు. అట్లా ఉండగలిగే ఇతరులను చూసి మనసులోనే సంతోష పడేవారు. ఏది జీవికకు అవసరం, ఏది కాదు అన్న స్పష్టత వుండబట్టే 'గోచిగుడ్డ కూడా నోచుకోని వాడి తరపున పోట్లాడటానికి' ఆర్భాటంగా బతికే వారితో కూడా కలిసి సని చేయించుకున్నారు.

ఆయన ముభావంగా వుండే మాట నిజమేగానీ... ఒకరిద్దరే వుంటే మాత్రం బాగానే మాట్లాడేవారు. 'కోశాంబి' గురించి ఆసక్తిగా అడిగేదాన్ని. నిజానికి నేనప్పుడు అడిగినవన్నీ ప్రాథమిక విషయాలేనని నాకిప్పుడనిపిస్తుంది గానీ.... అయితే ఆ ప్రశ్నలడిగిన నన్ను 'ఏమిటో' అన్నట్లు చూసిన గుర్తు కూడా లేదు. అందుకే ఆయన్ను చనువుగా అడగగలిగే దాన్ననుకుంటా. నిజానికి ఆయనకు కార్యకర్తలంటే ఎంత గౌరవమంటే - మాలాంటి వారి పట్ల ఆయన చూపించిన గౌరవం 'పని' నుండి వచ్చిందే. ఇది ఆయనకు దగ్గరగా వుండే వారందరికీ తెలసిన విషయమే. అందుకే ఏ వూరు వెళ్ళినా - ఆ సంస్థలో పనిచేస్తున్న కార్యకర్తల ఇంటికే పోయేవారు. ఆ వూళో ఎంత గొప్ప స్నేహితులున్నా సరే.

నేను పౌరహక్కుల సంఘంలో పని చేయడం మానివేశాకనే 'లా' చేశాను. ఆ తరువాత 96 ప్రాంతాలనుకుంటా మదనపల్లి హార్సిలీ హిల్స్‌లో 'లాయర్ల'కు క్లాసులు పెట్టారు. ఆ క్లాసులకు నన్నూ పిలిస్తే వెళ్ళి మూడు రోజులూ వున్నాను. అక్కడే ఆయన పెద్ద చెల్లెలు 'మాధవి'ని కలిశాను. అప్పుడు మళ్ళీ సంస్థలో చేరమని అడిగారాయన! చేరాలని నాకూ వుండేదిగానీ! కానీ స్థానికంగా వుండే పరిస్థితుల వల్ల తటపటాయిస్తూ వుండగానే సంస్థలో ప్రైవేట్ హింస మీద చర్చలు ప్రారంభమయ్యాయి. ఆ హడావిడిలో నా చేరిక అలా ఆగిపోయింది. ఎక్కడైనా ఆయన విలక్షణత ఎంత ప్రస్ఫుటంగా కనిపించేదంటే, ఆ కొండమీదకు ఎప్పుడోగానీ బస్సురాదు కిందికి పోవడానికి. ఆ హార్స్లీ హిల్స్ మీద గుడికి ఆరోజు బాగా భక్తులు వచ్చారు. బస్సు ఎక్కడం కష్టమనిపించింది. దానితో ఆయన వెంటనే కిందికి నడుద్దామని (దాదాపు ఎనిమిది మైళ్ళనుకుంటా) మరో మాటకు తావు లేకుండా చక చకా దిగడం ప్రారంభించారు. అప్పుడు ఆయనతోపాటు మరి కొంతమందీ కారుదిగారు. మేం బస్సు వచ్చేదాకా ఆగి - ఎక్కి కిందికి వచ్చేటప్పటికి - వాళ్ళు కిందకు దిగనే దిగిపోయారు. అట్లా ఏది చెయ్యాలనుకుంటే అది చెయ్యడమే.... నిజానికి మేం కిందికి దిగుదామని, వద్దనీ చర్చించుకుంటుంటే - అక్కడ జనం 'అయ్యో' అడవి దారిలో 'చిరుతపులి' వుంది అని భయపెట్టారు కూడా.

అంతగా ప్రాణం కూడా లెక్క లేనట్టుండే మనిషి... సంస్థ విషయంలో ఎంతో చిన్న వినిపించే విషయాలు కూడా చాలా శ్రద్ధగా పట్టించుకుంటారనిపిస్తుంది. 'చింతపల్లి' గిరిజన గూడేలను తగలబెట్టినప్పుడు గిరిజనులంతా నిరాశ్రయులయ్యారు. కావాలని తగలబెట్టింది పోలీసులే గనక ప్రభుత్వం పట్టించుకోదుగదా! కనక ఆ గిరిజనులకు సహాయం చెయ్యాలనుకున్నారు. దానితో కె.వి.ఆర్, బాలగోపాల్, (ఇంకెవరున్నారో నాకు తెలియదు) కొంత డబ్బు తెలిసినవాళ్ల దగ్గర సేకరించి... వాళ్ళకు ఇచ్చారు. ఆ వివరాలు నాకు తెలియవు. ఆ సందర్భంగా ఆయన ఓ ఫోను చేస్తే సరిపోయేదానికి.... ఆయన స్వయంగా మా ఇంటికి వచ్చి... రేపు ఈ డబ్బు మీద వివరం చెప్పాల్సి వస్తే మీపేరు చెబుదామనుకుంటున్నాం అన్నారు. దీనికి మీరు రావాలా? ఫోను చేస్తే సరిపోదా? అన్నాను. ఆయన నవ్వాడంతే, నిజానికి ఆ డబ్బు చిన్న మొత్తమే. అప్పట్లో ఇప్పటిలాగా డబ్బు ఎక్కడ పుట్టేదీ! (ఇప్పుడంటే మనుషుల దగ్గర వద్దంటే డబ్బు వుండి - దయాగుణం వాగుల్లో ప్రవహిస్తోందిగానీ) ఎంత మందినో చెయ్యి చాస్తే గానీ పదివేలు వసూలయ్యేవి కావు. అయినా సరే! కొద్ది మొత్తమైనా సరే లెక్క సరిగా వుండాలనేదే! ఆయన దృష్టి. ఆయన ఖర్చు పెట్టిన ప్రతిపైసాకు లెక్కలు చూపించే నిజాయితీపరుడు. అది ఆయన న్యాయవాద వృత్తిలోనూ నిరూపితమైంది. కేసు గెలవలేకపోతే వారి డబ్బు వారికి తిరిగి ఇచ్చే ఏకైక వ్యక్తి ఆయన. ఇప్పటి కోర్టులూ, లాయర్లనూ చూశాక ఇటువంటి వారు అద్భుతంగానే అనిపిస్తారు మరి.

అప్పట్లో అనేకసార్లు కారంచేడు, మాచర్ల ధనలక్ష్మి కేసు, ఫిలిప్స్ లాకప్‌డెత్ - అమరావతిలో స్త్రీలను బజార్లో చీరలు లాగివేసిన ఘటన వంటి అనేక కేసుల్లో ఆయనతో కలిసి పనిచేశాం. ఇట్లా చెప్పుకుంటూ పోతే ఇలాంటి సంఘటన ఎన్నో గుర్తుకొస్తాయి అందరికీ. అయితే వాటివల్ల ఆయన పని చేసిన పౌరహక్కుల సంఘంలో వచ్చిన మార్పులేమిటో? అవి సంస్థకు ఎట్లా దోహదపడ్డాయని చెప్పుకోవడం నిజంగా సమాజానికి వుపయోగపడే విషయాలు.

బాలగోపాల్ పౌరహక్కుల రంగంలో పని ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే... పౌరహక్కుల సంఘం అంటే ఎన్‌కౌంటర్లను ఖండించడమొక్కటే కాదు అని సంస్థ పరిధిని పెంచే ప్రయత్నం చేశారు. లాకప్ డెత్‌లు, కుల సమస్య, స్త్రీల సమస్యల మీద అన్ని ఆధిపత్యాలకు వ్యతిరేకంగా విస్తృతంగా పనిచేసి సంస్థకు విశాల దృక్పథాన్ని తెచ్చింది మాత్రం ఆయన కృషే.

నిజానికి పోలీసుల దగ్గరకు వెళ్ళి ధైర్యంగా అడిగే హొరవడి ఆయన్నుండి నేర్చుకున్నదేనని చెప్పాలి. ఆ అనుభవంతో తరవాతి కాలంలో 'మహిళా సంఘం'లో పని చేసినపుడు - అవసరమయినప్పుడు పోలీసులతో ఘర్షణ పడటానికి కూడా వెను తీసే వారం కాదు. ఎస్.పి. ఆఫీసు - అది హక్కుల సంఘం ఇచ్చిన హొరవడే.

బాలగోపాల్ ఆధ్వర్యంలో - ఎన్‌కౌంటర్లేనా? అత్యాచారాలేనా! కుల సమస్యలేనా! ఎన్నటికి ఎంక్వయిరీ కమిటీలు, డిమాండ్ చేసి వేయించగలిగారో! ఆయన రాసినవి కాక ఈ పాతికళ్ళుగా తిరిగి, నిజనిర్ధారణ చేసిన సంఘటనలు రాయాల్సి వస్తే ప్రతి ఏటా ఓ పుస్తకం రాయొచ్చు. అంతగా ఆయన ఆచరించారు. చెప్పే దానికి, చేసే దానికి తేడా లేకుండా బతికారు.

ఇంతగా ఆయన్ను పొగొడుతున్నారు. ఆయనేం నిర్విమర్శకుడా? అనొచ్చు. నిజమే ఉద్యమం మీద ఆయన సంధించిన ప్రశ్నలు చిన్నవేంకాదు. పైగా ఆయనకున్న ఇమేజ్ వల్ల ఆయన చేసిన విమర్శలకు మధ్యతరగతిలో ఆమోదం కనబడింది. ఆ మేరకు ఉద్యమం మీద విమర్శలూ వచ్చాయి. అది కొంత నష్టాన్ని కలిగించింది. అయితే ఉద్యమం ఆ నష్టాన్ని పూరించుకోగలిగేది దాని ఆచరణ ద్వారా మాత్రమే.

మార్క్సిజంలో ఖాళీలున్నాయని 'రాగో' ముందుమాటలో రాశారుగానీ - అయితే ఆయనకు అటువంటి ఆలోచనలు అప్పటికప్పుడు రాలేదని భావిస్తున్నాను. నేను మొదటి సారి 1984లో చిత్తూరు అనుకుంటాను. మార్క్సిజం మీద క్లాసుల్లో ఆయన ఉపన్యాసం విన్నాను. (అప్పటికి త్రిపురనేని విరసంలో వున్నారు) ఆ సందర్భంగా 'మార్క్సిజం కూడా మార్పుకు గురవుతుంది. అలా కాకపోతే అది మార్క్సిజమే కాదు. అది ఫిలాసఫీ విరుద్ధం' అన్నారు. అప్పటికే మార్క్సిస్టు ఫిలాసఫీని యథాతథంగా ఆమోదించనక్కర లేదన్నది ఆయన అవగాహనలోకి వచ్చిందని - నేను అర్థం చేసుకున్నాను. మార్క్సిజం మీద కొంత లోతైన ఆలోచన వుందని, మార్క్స్ చెప్పిందే తుది ఫిలాసఫీ కాదని ఆయన నమ్ముతున్నట్లుగా నా కనిపించేది.

ఈ నా ఆలోచనకు మరోసారి కూడా రుజువు కనిపించినట్లయింది. 1987లో విరసం నిర్వహణలో కావలి దగ్గర ఆలూరులో కోశాంబి మీద రెండు రోజులు క్లాసు చెప్పారు. అప్పటికి 'కోశాంబి పరిచయం' వచ్చిందో రాలేదో గుర్తులేదు. ఆ క్లాసుల్లో చాలా చర్చ జరిగింది. కొంత హీటెడ్‌గా జరిగిందని నా గుర్తు. ఆ చర్చల్లోగానీ, ఆ తరవాతగానీ భారతీయ చరిత్ర ఆధారంగా మార్క్సిజాన్ని బేరీజు వేసుకున్నారా? అనిపించేది. ఎందుకంటే 'మన సమాజానికి విలీనం చేసుకునే సంస్కృతి ఎక్కువని - ఒక దాని పక్కనే మరో సమాజపు అస్తిత్వం కొనసాగుతూనే వుంటుందని' - డి.డి.కోశాంబి నిర్ధారణ మీద ఆయనకు విశ్వాసం ఎప్పుడు కలిగిందో - అప్పటి నుండే 'పూర్తి సోషలిస్టు పరివర్తన' మీద ఆయనకు వచ్చిందేమోనని నేను ఇన్నాళ్లుగా అనుకుంటూ వున్నాను. నాకు ఫిలాసఫీ మీద అంత అవగాహన లేకపోవడం వల్ల కూడా ఈ మాట అనుకున్నానేమో అయితే ఏ మార్పులయినా, సంచలనం కోసం కాక ఆయన నమ్మి మరీ చెప్పాడు, ఆచరించి చూపాడు. వీసమెత్తుపని చెయ్యకుండా వీరోచిత ప్రకటనలు చెయ్యలేదు. అందుకే సమాజపు ఆమోదం పొందారు. ఎంత గంభీరంగా ప్రకటనలు, ఉపన్యాసాలు చేసినా శత్రువుకు చిటుక్కుమని కూడా అనదు. వాడికి అట్లాంటివారి వల్ల నష్టమేమీ లేదు. ఆచరణకు దిగినప్పుడే వాడికి శివాలెత్తేది. అదిగో ఆ శివాలెత్తించే పనులే అందరికంటే ముందుండి చేశారు బాలగోపాల్. అందుకే జనం ఆయన్ను గురించి ఇంతగా ఆక్రోశించడం.

ఇట్లాంటి తలపోతలు ఎన్నైనా చెప్పుకోవచ్చు. నా కంటే ఎక్కువ కాలం బాలగోపాల్‌తో కలిసి పనిచేసిన వాళ్ళు మరెన్నో చెప్పగలరు.

చివరగా - ఆ సారి ఎందుకో చాలా ఏళ్ళ తరవాతే కలిసినట్టు గుర్తు. ఆ మధ్య గుంటూరులో ఏదో మీటింగు వుంటే వెళ్ళాను. నా నవల చదివారా? అని అడిగితే! చూడలేదు - అని; మీ దగ్గరుంటే కాపీ యివ్వమని అడిగితే ఆ రోజు సాయంత్రం నవల తీసికెళ్ళి యిచ్చాను. చదివి, ఈసారి కలిసినపుడు తప్పకుండా చెప్తానన్నారు. నేను ఆయన ఏదో రోజు కలుస్తాడని - ఆ కలిసే రోజు కోసం ఎప్పటి నుండో ఎదురు చూస్తూ వున్నాను.

పౌర హక్కుల సంఘంలో ఉన్నా, ఆ సంఘంలో లేకపోయినా మీటింగుల ఏర్పడ్డక వెళ్ళేదాన్ని. అట్లా కరీంనగర్ కూడా వెళ్ళాను. హెచ్.ఆర్.ఎఫ్ చీలాక కూడా మా వూళ్ళో జరిగే మీటింగులకు వెళ్ళాను. ఆ తరువాత మా వూళ్లో ఆయనతో జరిగిన మీటింగులే తక్కువ. లోకల్‌గా హెచ్.ఆర్.ఎఫ్‌కి కార్యకర్తలు లేకపోయారు.

ఆయన ఎన్ని రోజులకు కలిసినా, ఎన్నాళ్ళకు కలిసినా... తప్పనిసరిగా మాట్లాడే వారు. ఒక్కోసారి నేను దూరంగా వుండిపోయినా, ఆయనే తప్పక దగ్గరకు వచ్చి పలకరించేవారు. ఆ స్నేహార్ధ్రత మా మధ్య ఎప్పుడూ చెదరలేదు. చివరిసారి కలిసినపుడు ఆయన్ను ఈసారి ఛత్తీస్‌ఘడ్ వెళ్ళే పని వుంటే మాత్రం నన్ను పిలవండి - నాకు ఆసక్తిగా వుంది! అన్నాను. 'ఛత్తీస్‌ఘడ్' పర్యటన అక్కడ పరిస్థితి గురించి చెప్పారాయన.

సాల్వాజుడుం వల్ల అక్కడికి పోవడానికే ఇబ్బందిగా వుందని కూడా అన్నారు. పీస్ కమిటి ప్రయత్నాలూ జరుగుతున్నాయన్నారు. ఇట్లా బాలగోపాల్‌ని ఛత్తీస్‌ఘడ్ వెళ్ళడం గురించి అడిగానని ఒకరిద్దరు మిత్రులతో కూడా అని వున్నాను, వెళ్తాననే ఉత్సాహంతో నిజానికి 'అబూజ్‌మడ్' వివరాలు వింటూ ఆయన అక్కడికి తప్పక వెళ్ళతారు.... అడుగుదాం - నేనూ వస్తానని అని ఎదురు చూస్తూ వున్నాను.

ఇక 'నర్రెంక చెట్టు కింద' నవల మీద ఆయన అభిప్రాయం కోసం - ఛత్తీస్‌ఘడ్ వెళ్ళాలన్న కోరికతోనూ ఎదురు చూడక్కరలేదు. ఆయనతో కలసి ప్రయాణం చేసే అవకాశం అందరికీ రావాలి గదా! ❖

# స్వీకారం

1. **మానధనులు (నవల)**
   రచన : హోవర్డ్ ఫాస్ట్
   తెలుగు : రమణా రెడ్డి, వెల : రూ. 80/-
2. **సోషలిజం (ప్రథమ పాఠాలు)**
   రచన : లియో హ్యూబర్ మన్, సిబిల్. హెచ్. ఎమ్.
   తెలుగు : వి.వి.లు వెల : 25/-
3. **అజ్ఞాత వీరుడు**
   రచన : మిస్త్రి స్లావస్కీ
   తెలుగు : శ్రీనివాస చక్రవర్తి వెల : 100/-

పై మూడు పునర్ముద్రణ తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్
**ప్రతులకు :** మైత్రీ బుక్ హౌస్, విజయవాడ.

4. **సమైక్య శాపం**
   వడ్డెబోయిన శ్రీనివాస్ దీర్ఘ కవిత
   వరంగల్ రచయితల ఐక్యవేదిక వెల : రూ. 5/-
   **ప్రతులకు :** మెట్టు రవీందర్,
   1-386/3, చాణక్యపురి, బీమారం, హనుమకొండ, వరంగల్ జిల్లా
5. **మహా ప్రస్థానం నుండి మరో ప్రస్థానం దాకా**
   రచన : వి. చెంచయ్య వెల : రూ.15/-
6. **తెలుగు సాహిత్యంలో భక్తి ఉద్యమం**
   రచన : వి. చెంచయ్య వెల : రూ.10/-

పై రెండూ విరసం నెల్లూరు యూనిట్ ప్రచురణ
**ప్రతులకు :** సాహితీనిలయము
10-40-15ఏ/1,
జనతా పేట నార్త్, కావలి, నెల్లూరు జిల్లా.

**వ్యాసం** ◆ కె.జి. కన్నబిరన్

# సిద్ధాంత నిరంకుశత్వం తగదన్నవాడు

బాలగోపాల్ గురించి రాయడం అంటే మానవహక్కుల ఉద్యమ చరిత్ర గురించి రాయడం. మానవులకు హక్కులు స్వతసిద్ధమైనవని, జాతీయ, అంతర్జాతీయ శాసనాలు, ప్రకటనలు వాటిని ప్రకటించి ప్రస్ఫుటం చేస్తాయని ఆయన నమ్మారు. బాలగోపాల్ గురించి రాయడమంటే నక్సల్బరి ఉద్యమానికి నిబద్ధుడైన మేధావి నుంచి మానవ హక్కుల యోధుడిగా రూపాంతరం చెందడం గురించి రాయడం. తన మార్పు ఏ దిశగా, ఏ సూత్ర ప్రాతిపదికగా జరగాలో స్వయంగా నిర్ణయించుకుని పురోగమించిన మేధావి ఆయన.

నక్సలైట్ ఉద్యమం 1967లో మొదలైంది. ఆ ఉద్యమంతో వ్యవహరించేందుకు ప్రభుత్వాలకు సుపరిచితమైన ఒకే ఒక పద్ధతి అణచివేత. జాతీయోద్యమాన్ని అణచివేసేందుకు బ్రిటీషువారు రూపొందిన దండనా శాసనాలను రాజ్యాంగానంతర భారతదేశంలోనూ యథాతథంగా కొనసాగించారు. 1969లో శ్రీకాకుళానికి నక్సలైట్ ఉద్యమం విస్తరించే నాటికి దాదాపు 18 ఏళ్ళుగా భారత రాజ్యాంగం అమలులో ఉంది. కానీ రాజ్యాంగ స్ఫూర్తి పాలనలో కరువైంది. మనకు వారసత్వంగా సంక్రమించిన 'స్థిరాస్తి' నెహ్రూ 1964లో కన్నుమూశారు. కొంత జాప్యం తర్వాత అనువంశిక పాలనే మేలైనదని కనుగొన్నట్టుగా ఇందిరాగాంధీ అధికారంలోకి వచ్చింది. రాజ్యాంగ అమలుపై మరిన్ని సందేహాలు తలెత్తాయి. ఆ సంక్షుభిత కాలంలో వచ్చిన మార్క్సిస్టు - లెనినిస్టు ఉద్యమం రాజ్యాంగానికీ అది ప్రవచించిన విలువల చట్రానికే పెనుసవాలు విసిరింది. శ్రీకాకుళం నుంచి ఆదిలాబాద్ వరకూ అటవీ ప్రాంతాలను 'కల్లోలిత ప్రాంతాలు'గా ప్రకటించారు. క్రూరమైన అణచివేతను ప్రయోగించారు. రాజ్యహింసకు ఎదురు లేకుండాపోయింది. వందల మందిని అరెస్టు చేస్తూ వేల మందికి పైగా కార్యకర్తలను పోలీసులు కాల్చి చంపారు. ఇదేకాలంలో ఈ అణచివేతను ప్రశ్నించిన గొప్ప మేధావులెందరికో వరంగల్ పట్టణం జన్మనిచ్చింది. అది విప్లవ కార్యకలాపాల తుఫాను కేంద్రం అయింది. ఈ ఉద్యమంలో వరవరరావు ప్రధానపాత్ర వహించారు. కార్చిచ్చులా వ్యాపించిన ఉద్యమానికి ఉపాధ్యాయులు నాయకులయ్యారు.

ఎమర్జెన్సీలో అక్రమాలకు పాల్పడిన పోలీసు అధికారులను శిక్షింపచేయాలనే లక్ష్యంతో జయప్రకాష్ నారాయణ్ 'తార్కుండే కమిటీ'ని నియమించాడు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ భార్గవ కమిటీని నియమించింది. చెన్నారెడ్డి మంత్రివర్గం దాన్ని అర్ధాంతరంగా రద్దుచేసింది. ఇదే కాలంలో బాలగోపాల్ వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కళాశాలలో చేరాడు. నక్సలైట్లపై పోలీసుల క్రూరత్వాన్ని చూశాడు. అది అతని భవిష్యత్తు దిశానిర్దేశం చేసింది. సిపిఐ (ఎంఎల్) పీపుల్స్ వార్ (నేటి మావోయిస్టు పార్టీ) రాజకీయాలను గాఢంగా నమ్మాడు. తరువాత ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో చేరాడు. 1983లో ప్రధాన కార్యదర్శి అయ్యాడు. తరువాత ఏడాది పోలీసు ఎస్సై యాదగిరి రెడ్డి హత్యకేసులో ఇరికించారు. 'నాసా' కింద ఖైదు చేయబడ్డాడు. తరువాత ఆయనపై కొంతకాలానికి నాసాను ఉపసంహరించారు.

**తొలి రచనలు**

బాలగోపాల్ తొలి రచనలు లోతైనవి, సునిశితమైనవి. ఆయనకు పీపుల్స్ వార్‌తో అనుబంధాన్ని నిరూపించేవి. ఆయన మార్క్సిస్టు తార్కిక రచనా శైలిని తనతోపాటు పౌరహక్కుల ఉద్యమంలోకి తెచ్చాడు. ఎ.ఆర్. దేశాయి రైతాంగ పోరాటాల మీద రాసిన రచనలపై, తెలంగాణ పోరాటం మీద, ఎన్‌కౌంటర్ల మీద, ఫెమినిస్టుల రచనల గురించి ఆయన రాసిన సమీక్షలలో ఈ అసహనశైలిని గమనించవచ్చు. ఆయన ఎం.ఎల్.పార్టీలో కొనసాగితే మావోయిస్టుల ఉద్యమానికి చెందిన గొప్ప మార్క్సిస్టు - లెనినిస్టు సిద్ధాంతవేత్త అయ్యుండేవాడు. లేకపోతే పట్టుబడి కాల్చి చంపబడేవాడు. ఎర్రెర్రని జెండా ఎన్నియలో పాటలో గద్దర్ గానంచేసిన మృతుల జాబితాలో చేరేవాడు. పౌరహక్కుల ఉద్యమంలో ఎం.ఎల్ పార్టీకి ఒక గొప్పమేధస్సు అవసరమైంది. రాజ్యాన్ని ఎదిరించేందుకూ, పార్టీ వారిపై జరిగే అత్యాచారాలను ప్రచారం చేసేందుకూ. అలాంటి ప్రచారం ఉద్యమవ్యాప్తికి దోహదం చేస్తుంది.

సామాజిక మార్పు గురించిన రాజకీయాల్లో బాలగోపాల్ ఏనాడూ విశ్వాసం కోల్పోకపోయినప్పటికీ, ఎంఎల్ పార్టీల నిరంకుశ రాజకీయ కార్యాచరణలు అభ్యంతరకంగా భావించారు. పీపుల్స్‌వార్ పార్టీ రాజకీయాలతో తెగతెంపులు చేసుకున్నాక వారి ఆశయానికి, వారి నిరంకుశ కార్యాచరణకు మధ్య వైరుధ్యాన్ని ఆయన మరింతగా దర్శించగలిగాడు. కార్యాచరణలోని వికృత చర్యలన్నింటినీ ఆమోదించాలని ఆశయం కోరుకుంటుంది. బాలగోపాల్ మార్పును తిరస్కరించాడు. ఎందుకంటే మార్క్సిస్టు సిద్ధాంత ప్రాతిపదికన ఏర్పడిన వ్యవస్థలు వికృత రూపాలను ప్రదర్శించాయి. సోవియెట్, తూర్పు - ఐరోపా అనుభవాల తర్వాత కూడా చైనాలో కూడా అది కొనసాగింది. హక్కుల ప్రచారోద్యమంలో శిక్షితులైన ప్రజలు ఉత్ప్రేరకంగా పనిచేసి తెచ్చే సామాజిక మార్పు గురించి అపరిపక్వ భావనలు బాలగోపాల్ మదిలో ఉన్నట్టున్నాయి. టామ్ పెయిన్ 'రైట్స్ ఆఫ్ మాన్' గ్రంథంలో చెప్పిన భావనలకు ఆయన దగ్గరౌతున్నట్టుగా నాకనిపించింది. ఏడమ్ ఈవలు దుస్తులు వేసుకొని అమాయకత్వాన్ని కోల్పోయారు. ప్రభుత్వం కూడా ప్రజలు కోల్పోయిన అమాయకత్వ చిహ్నామే (దుస్తులాగా) అని టామ్ పెయిన్ రాశారు. ప్రజలందరి సాధికారతను బాలగోపాల్ నమ్మారు. గ్రామ పంచాయితీల గురించిన 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా పటిష్ట పర్చబడిన ప్రజాప్రాతినిధ్య వ్యవస్థ బహుశా ప్రజాసాధికారత ప్రదర్శితమయ్యే నిర్మాణం అని అలాంటి వారి నమ్మకం.

ప్రజాతంత్ర పత్రిక ప్రత్యేక సంచికలో (2001 మార్చి) తెలుగు నవలపై ఇచ్చిన ఇంటర్వ్యూలో మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం గురించి బాలగోపాల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన తాత్విక పరిశోధనలు సంతృప్తికరమైన దశకు చేరుకున్నాయని చెప్పారు. అయినప్పటికీ తన దృక్పథం ఏమిటో వివరించే కర్తవ్యాన్ని ఆయన పరిపూర్తి చేయలేదు. మార్క్సిజం మీద సందేహాలు లేవనెత్తినవాళ్ళలో బాలగోపాల్ మొదటివాడు కాదు. కొమింటర్న్ నుంచి బహిష్కృతుడైన ఎంఎన్‌రాయ్ మార్క్సిజాన్ని అధిగమించాలని భావించాడు. తనదైన సిద్ధాంతాన్ని తయారు చేశాడు. రాడికల్ హ్యూమనిజం తలెత్తేందుకు బాటలు వేశాడు. రాజకీయాల్లో ఆయన బృందం పెద్దగా సాధించిందిలేదు. పౌరహక్కుల ఉద్యమంలో అది బాగా ప్రాచుర్యమైంది. తార్కుండే, న్యాయవాది సిటి ధారు (గుజరాత్), ఎంవి రామ మూర్తి (ఆంధ్రప్రదేశ్) గుర్తుకొస్తారు.

విమర్శ పట్ల, బేధాభిప్రాయం పట్ల అసహనం అనేది అన్ని కమ్యూనిస్టు పార్టీలలో కొనసాగుతున్న సంప్రదాయం, పార్టీ పట్ల ఎలాంటి మినహాయింపులు లేని విమర్శవల్ల బాలగోపాల్ పార్టీ నుంచి వైదొలగవలసి వచ్చింది. తెలుగులో 1998లో 'మూడు దశాబ్దాల నక్సల్బరి' పేరిట ఒక వ్యాసం రాశాడు. దాన్లో మొదటి వాక్యం ఇలా : "నక్సలైట్ ఉద్యమాల వల్ల జరిగిన మేలు గురించి చెప్పేవాళ్ళు, రాసేవాళ్లు చాలామంది ఉన్నారు. కాబట్టి నేను ఆ ఉద్యమం చీకటి కోణాల గురించే చెబుతాను".

ఆ పుస్తకం అంతటిలో ఉద్యమ నిరంకుశ రాజకీయ చర్యలపై నిర్మొహమాట విమర్శ ఉన్న వ్యాసం అదొక్కటే. (అందులో మనోరంజన్ మొహంతి, జి.హరగోపాల్, ఎన్.వేణుగోపాల్. వరవరరావు వ్యాసాలు కూడా అచ్చయ్యాయి). అలాంటి విమర్శ చేసేందుకు అత్యున్నత మేధోధైర్యం కావాలి. ఆయన శైలిలోని నిష్కపటత్వం మావోయిస్టుల రాజకీయ కార్యాచరణలోని అభ్యంతరకర పార్శ్వాన్ని ధైర్యంగా బహిర్గతం చేసింది. బాలగోపాల్ వ్యాసం రిచర్డ్ క్రాస్‌మన్ సంపాదకత్వంలో వెలువడిన 'ద గాడ్ దట్ ఫెయిల్డ్' పుస్తకాన్ని

గుర్తుకు తెచ్చింది. సంచలనం సృష్టించింది. 'ది గాడ్ దట్ ఫెయిల్డ్' 1950లలో చేసిన విధంగానే ఉద్యమంపై ఆశలున్న కొందరు సానుభూతిపరులలో విశ్వాసాన్ని సన్నగిల్లేలా చేసింది. బాలగోపాల్ వ్యాసంగానీ, విప్లవ ఉద్యమంనుంచి ఆయన నిష్క్రమణగానీ ఉద్యమంపై చెరగని ముద్ర వేయలేకపోయాయి. ఆయన ఏ ప్రజలతోనైతే పని చేశాడో వారి వైఖరిలో మావోయిస్టులపట్ల గమనించదగ్గ మార్పులు తేలేకపోయాయి. 'చీకటి కోణాలు' వ్యాసం ప్రతులను పోలీసులు పంచిపెట్టారు. కానీ మానవహక్కుల కార్యకర్తల మీద దాడులను మాత్రం వారు ఆపలేదు. సామాజిక మార్పుకు హింస మంత్రసానిత్వం వహిస్తుందని చెప్పే మార్క్సిస్టు సూత్రాల ప్రాతిపదికపై విప్లవాత్మక సామాజిక పునర్నిర్మాణం భావనకు బాలగోపాల్ దూరమయ్యాడు. మార్క్స్ వాడిన సృజనాత్మక పదప్రయోగం (హింస మంత్రసాని) నుంచి జనరంజక నినాదస్థాయికి చేరిన 'తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం ప్రవహిస్తుంది' అనే మావో ఆలోచనా విధానానికి కూడా ఆయన వీడ్కోలు చెప్పారు.

హింస ద్వారా సామాజిక మార్పును బాలగోపాల్ ఎంచుకోలేదు. హక్కుల ద్వారా సామాజిక మార్పును ఎంచుకున్నాడు. సమస్య ఏమిటంటే హక్కుల పోరాటాలు వాటికవే సామాజిక మార్పుకు దోహదం చేయవు. మానవ హక్కుల గురించి మాట్లాతున్నామంటే హక్కుల భావనను రాజ్యాధికారానికి, కులాధిపత్యానికి వ్యతిరేకంగా వాడుతున్నామని.

'చీకటి కోణాలు' వ్యాసానికి రాజకీయపార్టీ స్పందన ఆత్మావలోకనం, దిద్దుబాటు చర్యలు కావు. అసహనంతో కూడిన విమర్శ. పార్టీ నుంచి అలాంటి దాడివల్ల ఆయన ఘర్షణ లేకుండా, గౌరవ ప్రదంగా ఏపిసిఎల్‌సిలో కొనసాగడం అసాధ్యం అయింది. కానీ మానవ హక్కుల యోధుడిగా ఆయన తన ప్రస్థానం ఆపలేదు. 1998లో మానవ హక్కుల వేదికను స్థాపించాడు. మరణించే నాటికి దేశంలో గొప్ప మానవ హక్కుల యోధులలో ఒకడిగా ప్రసిద్ధుడయ్యాడు. హక్కుల మీద ఆయన అభిప్రాయాలను సమగ్రంగా పొందుపరచిన ఏ రచనా నా దృష్టికి రాలేదు.

హక్కులు వాటికవే సామాజిక మార్పుకు దారితీసే లక్షణాలు కలవికావు. 'నిరంకుశత్వానికి, పీడనకు వ్యతిరేకంగా చివరి ప్రయత్నంగా మనిషి తిరుగుబాటును ఎంచుకునేలా బలవంత పెట్టబడకుండా వుండాలంటే శాసనాయుత పాలన ద్వారా మానవ హక్కులు కాపాడబడాలి' అన్నది మాత్రం అన్ని మానవ హక్కుల కార్యకలాపాలకు కేంద్రబిందువయ్యింది. విశ్వమానవ హక్కుల ప్రకటన (1948) పీఠికలోని ఈ హెచ్చరిక అంతరార్థం స్పష్టమైనది. హక్కులను విస్మరిస్తే పరిపాలన నిరంకుశమౌతుంది. దీనికి స్పందనగా తిరుగుబాట్లు తలెత్తుతాయి. కాబట్టి మానవ హక్కులు ఒక సుస్థిర ప్రభుత్వానికి దోహదపడతాయి. ఇందులో దాపరికంలేని రాజకీయసారం ఇమిడి ఉంది. రాజ్యాల రాజకీయ సుస్థిరత్వానికి అవసరమైన చర్యలు సూచించడం హక్కుల పని. రెండవ ప్రపంచ యుద్ధం నుంచీ రాజ్యంలో దాని పాలనా రీతులలో మెల్లగా, క్రమక్రమానుగుణంగా గుణాత్మక మార్పు అనేది ప్రధాన బోధనాంశమైంది. హక్కుల ప్రచారోద్యమం సామాజిక మార్పును తేలేదు. సామాజిక మార్పుకోసం జరిగే ఉద్యమాలను బలోపేతం చేసే హక్కుల పట్ల, న్యాయం పట్ల స్పృహను మానవ హక్కుల ప్రచారోద్యమం సృష్టిస్తుంది. ఒక ఉన్నతాశయం దృష్టి కోణం ఉన్న పార్టీతో అనుసంధానించి చేసే మానవహక్కుల కార్యాచరణ చాలా సజీవంగా వుంటుంది. లేదా ఒక నిరంకుశ పాలన వ్యతిరేకంగా ఉదారవాద ప్రజాస్వామ్యం కోసం చేసే మానవ హక్కుల కార్యాచరణ ప్రకంపనలను సృష్టిస్తుంది.

## న్యాయవాదిగా

బాలగోపాల్ నాకు బాగా సన్నిహితుడు. ఏపిసిఎల్‌సి ప్రధాన కార్యదర్శిగా ఆయన ఎన్నికైన 1983లో మా సంబంధం మొదలైంది. 1993 వరకూ నేను సంస్థ అధ్యక్షుడిగా ఉన్నాను. అధ్యక్షుడుగా అప్పటికి పదిహేనేళ్ళున్నాను. పదేళ్ళపాటు మేం దాదాపు రోజు కలిసేవాళ్ళం. నేను 1994లో పియుసిఎల్ అధ్యక్షుడిగా ఎన్నికైన నాటి నుంచి మేం ఇద్దరు ఒకే రంగంలో పనిచేస్తూ వచ్చాం. తరచుగా కలిసేవాళ్ళం. అభిప్రాయాలూ, అనుభవాలూ కలబోసుకున్నాం. ఏపిసిఎల్‌సిలోకి ఆయన మేం మానవ హక్కుల ఉల్లంఘనలపై మరింత దృఢనిశ్చయంతో పోరాడాం. ఆయనకు గొప్ప మేధస్సుంది. అది ఆయన కలాన్ని పదునెక్కించింది. కొందరు ప్రజాప్రతినిధులపై పోలీసు దురాగతాలకు వ్యతిరేకంగా వరంగల్ ఎంక్వైరీ కమీషన్ దగ్గర ఆయన లాయర్ అప్రెంటీస్‌గా నాకు తోడ్పడ్డాడు. అది 1997 అనుకుంటాను. ఆయన అప్పటికి బెంగళూరు నుంచి న్యాయశాస్త్ర పట్టభద్రుడయ్యాడు. నా పక్కన కూర్చొని నాకు తోడ్పడేందుకు వీలుగా వరంగల్‌లోనే ఆయనకు తన తొలి నల్లకోటును కొనిచ్చాను. ఆ తర్వాత న్యాయవాదిగా ఆయన బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసేందుకు నేను ప్రతిపాదించాను. నక్సలైట్లపై బెంగుళూరు కుట్ర కేసు (1992-1999) విచారణలో నాకు సహాయకుడిగా పనిచేశాడు. ఆ కేసు కొట్టేశారు. దీన్‌దార్ అంజుమన్ నిషేధానికి వ్యతిరేకంగా ట్రిబ్యునల్ ఎదుట మేం హాజరయ్యాం. హైదరాబాద్, బెంగుళూరు, ఢిల్లీల్లో విచారణలో పాల్గొన్నాం. హైకోర్టులో ఆ వివాదం ఇంకా పెండింగ్‌లో ఉంది.

## దాడులకు వెరవలేదు

పలుమార్లు బాలగోపాల్‌ను పోలీసులు కొట్టారు. ఆయనపై క్రూరంగా దాడి చేశారు. కానీ అలాంటి చర్యలు ఆయన నైతిక స్థైర్యాన్ని ఏ మాత్రం దెబ్బతీయలేకపోయాయి. జాతీయ మానవ హక్కుల కమీషన్ ఛైర్మన్ జస్టిస్ రంగనాథ మిశ్రా, జస్టిస్ ఫాతిమా బీవీ హైదరాబాద్‌లో 1995లో నాలుగు ఎన్‌కౌంటర్ హత్యలపై విచారణ చేపట్టారు. ఒక రోజు వరంగల్ వెళ్ళారు. ఒక గదిలో వారు విచారణ జరుపుతుంటే మరో గదిలో ఉన్న బాలగోపాల్‌ను ప్రజల సమక్షంలో మఫ్టీ పోలీసులు బాగా కొట్టారు. పాత్రికేయులు ఆ విషయాన్ని మిశ్రా దృష్టికి తెచ్చినప్పటికీ ఆయన పట్టించుకోలేదు. ఆ సాయంత్రం నేను ఆయనకు ఫోన్ చేసి మాట్లాడినా తాను ఘటనను చూడలేదు కాబట్టి పోలీసులపై చర్యలు చేపట్టబోనని చెప్పాడు. పోలీసుల దౌష్ట్యాన్ని కమీషన్ ఎదుటే నిరూపిద్దామనుకొన్నాను. మరు రోజు నల్గొండ వెళ్ళాం. నన్ను వేదికపై కూర్చొనమని మిశ్రా, ఫాతిమా ఆహ్వానించారు. కానీ నేను వేదికపై కూర్చొనడాన్ని కొందరు వ్యతిరేకించారు. నేను వేదిక దిగివచ్చాను. మానవ హక్కుల కమీషన్ ఛైర్మన్ ముందే నన్ను మఫ్టీ పోలీసులు చుట్టుముట్టారు. పిడి గుద్దులు గుద్దారు. ఛైర్మన్ నిస్సహాయంగా ఆగ్రహోదగ్రుడై వెళ్ళిపోయాడు. తర్వాత హైదరాబాద్‌లో పూర్తి స్థాయి విచారణ జరిగింది. మూడు ఎన్‌కౌంటర్లలో మన పోలీసులే దోషులని తేలింది. దర్యాప్తుకు కమీషన్ సిఫార్సు చేసింది. ఒక కేసును మేం నిరూపించలేకపోయామని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ఆ నివేదికను ఖాతరు చేయలేదు. ఎన్‌కౌంటర్ పేరిట మనుషులను చంపడాన్ని మేం సవాలు చేస్తూ వచ్చాం. అని నరహత్యలనీ, నేర పరిశోధన అవసరమని 1997లో రాష్ట్ర హైకోర్టు తీర్పు సంపాయించాం. తర్వాత, నిస్సారమైన కారణాలతో ఫుల్‌బెంచ్ ఆ తీర్పును కొట్టేసింది. విస్తారమైన ధర్మాసనం ముందు ఇతర న్యాయవాదులతో కలిసి 2008లో మేం వాదించాం. మా అభిప్రాయాలు నివేదించాం. ఏకగ్రీవ తీర్పు వెలువడింది. పోలీసుస్టేషన్‌లో ప్రతి ఎన్‌కౌంటర్ మరణాన్ని కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయాలని తీర్పు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో చేసిన అప్పీలు పెండింగ్‌లో ఉంది. ఈ కేసుల్లో నేనూ బాలగోపాల్ వాదించాం.

తన తరానికి చెందిన సమర్థుడైన ఏకైక న్యాయవాదిగా బాలగోపాల్ పేరుగాంచాడు. జీవించేందుకు తమకున్న హక్కులో అపారమైన నమ్మకమున్న ఏకైక న్యాయవాదిగా ఆయన ప్రజలకు సుపరిచితుడు. వాదనలు వినదల్చుకోని న్యాయమూర్తులను సైతం తన వాదనలతో ఆకర్షించి పేద ప్రజల గొంతుకను వినిపించిన న్యాయవాది. సమర్థతలో సంపన్నుల లాయర్లతో సమానస్థాయిలో పేద ప్రజలకు న్యాయవాద సేవలందించాడు. రాజ్యాంగం ఎవరికోసం

వ్యాసం

◆ పాణి

# బాలగోపాల్ జీవన సందేశం

బాలగోపాల్ అపురూపమైన మానవుడు.

ఆయన మరణానంతరం నివాళి వ్యాసాల్లో ఆయన్ను పరిపూర్ణ మానవుడిగా, అతీత మానవుడిగా, రుషితుల్యుడిగా, చివరి మనిషిగా రాశారు. మనిషి చేరుకోవలసిన గమ్యం గురించి చాలా తాత్వికంగా ఆలోచించిన బాలగోపాల్‌ను ఉద్దేసించి ఈ అవగాహన తగినదేనా? అని అనుమానం. జీవితంలో అర్థం కానిది ఎంతో కొంత ఉంటుందనీ, అసలు జీవితం అపరిపూర్ణమనీ భావించిన వ్యక్తి గురించి యిలా వ్యాఖ్యానించడంలో కొంచెం భావోద్వేగం పాలు కనిపిస్తుంది. జీవితం భావోద్వేగాల మయమే. పుట్టుక, పెరుగుదల, స్నేహాలు, సహజీవనాలు, ఉమ్మడి విశ్వాసాల వల్ల సాటి మనిషితో కలిగే బంధం భావోద్వేగ రూపంలో ఉనికిలో వుంటుంది. బంధమే అయినా, ఎడబాటయినా, అసలు మనిషి గురించిన ఏ తలపోతయినా భావోద్వేగాల రూపంలోనే ఉంటుంది.

అయితే జీవితాన్ని బాలగోపాల్ భావోద్వేగ రహితంగా చూసినట్టుంది. చైతన్యంతో, విలువలతో, విశ్వాసాలతో ఆయన జీవితం గురించి మాట్లాడ్డమే అందరూ ఎరిగి ఉంటారు. జీవితం గురించిన ఆయన ఆరాటమంతా అట్లాగే సాగిందని కూడా గమనించి ఉంటారు. ఉద్వేగంతో కూడిన జీవిత వ్యాఖ్యలు చాలా అరుదుగానే చేసి ఉంటాడు. వ్యవస్థల గురించి, వాటి పని తీరు గురించి, అది సృష్టించిన భావజాలాలతో మెలిగే మనుషుల వైఖరుల గురించి తీక్షణంగా, వ్యంగ్యంగా మాట్లాడి వుండవచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఆయన సునిశిత మేథకు వ్యంగ్యం తోడుకావడం వల్ల ఆయన విశ్లేషణల్లో అపారమైన పదును కనిపించేది. అక్కడ కూడా భావోద్వేగ జనితమైన వ్యాఖ్యలు వినిపించేవాడు కాదు. మనిషి గురించి, మానవత గురించి తాదాత్మ్య స్థాయిలో ఆలోచించిన వ్యక్తికి యిది ఎలా సాధ్యం అయింది? అన్నదే ప్రశ్న. ఎందుకంటే మనుషుల కష్టసుఖాల గురించి పట్టింపు పెరిగే కొద్ది అది క్షణక్షణం భావోద్వేగాల్లోకి తర్జుమా అవుతుంటుంది. ఆయనలో ఈ ప్రక్రియను నిలువరించిన శక్తి ఏమిటి?

జీవితం గురించిన తాత్విక దృష్టి అని ఒక సమాధానం చెప్పుకోవచ్చు. ఈ మాట కొంచెం అమూర్తమైనది. దీన్నే సామాజిక అభివృద్ధి చరిత్ర గురించిన అవగాహన అని నిర్దిష్టంగా చెప్పుకోవచ్చు. మానవ జీవితాన్ని దాని సకల వైవిధ్యాల్లో, క్లిష్టతలతో అర్థం చేసుకోవడానికి ఇది దోహదపడింది. జీవిత అన్వేషణలో మార్క్సిస్టు తాత్విక దృక్పథం ఒక సామాజిక చారిత్రక సిద్ధాంతంగా ఆయనలో వ్యక్తమైన కాలం ఒకటి ఉన్నది. అయితే ఈ పద్ధతిలో ఆయనకు సంతృప్తి కలుగలేదు. కొత్త మార్గంలోకి ప్రయాణించాడు. అయితే అక్కడ కూడా జీవితాన్ని అంతే హేతు పద్ధతిలో అన్వేషించాడు. కాకపోతే పైన చెప్పిన చట్రంలో కాదు, ఆ తలం నుండి కాదు. ఇదొక పెద్ద షిఫ్ట్ . అయినా సరే ఆయన జీవితం గురించి తర్కబద్ధంగానే ఆలోచించాడు. జీవితంలో అర్థంకానిదీ, వివరించలేనిదీ ఎంతో కొంత ఉంటుందనే అభిప్రాయాన్ని కేవల భావనగా, అలంకారిక వ్యాఖ్యగా ఆయన చెప్పలేదు. దాన్ని అందరూ ఆమోదించడం కష్టమైనాసరే దాని గురించి ఆయన తర్కబద్ధంగానే ఆలోచించాడని అంగీకరించక తప్పదు. మార్క్సిస్టుగా ఉన్న రోజుల్లోనైనా ఆ తర్వాతయినా బాలగోపాల్ ఆలోచనల గుండెకాయ హేతు తర్కం. ఇలా ఆలోచించేవాళ్లు మార్క్సిజానికి సమీపంలోనే ఉండాలనే

---

రాయబడిందో వారి కోసం, నిస్సహాయ పౌరుల కోసం లేదా ఒక పేద సమూహం కోసం తను వాదిస్తున్నాడన్న విషయాన్ని న్యాయస్థానం గుర్తించేలా చేశాడు.

## మా భిన్నాభిప్రాయాలు

రాజ్యాంగం పట్ల బాలగోపాల్‌ది రాడికల్ దక్పథం. కానీ సంస్థా గత నియమాలకు ఆయన బద్ధుడు. కోర్టుల దృష్టాంత పూర్వక న్యాయ సూత్రాలను ఆయన ఆమోదించాడు. కానీ ఆ సూత్రాల పరిధులను విస్తరించేందుకు ప్రయత్నించలేదు. పేదల న్యాయతత్వశాస్త్రాన్ని ముందుకు తీసుకుపోయే కొత్త సూత్రాలు కనుగొనే కొంగొత్త భూమికను సృష్టించేందుకు ఆయన పూనుకోలేదు. నా అభిప్రాయం అందుకు భిన్నం. పేదవాళ్ళ తరఫున వాదించే, సామాజిక మార్పుకోసం ప్రయత్నించే న్యాయవాదులుగా కొత్త భూమికను సృష్టించేందుకు మనం ఎల్లప్పుడూ కృషి చేయాలంటాను. ఆ భూమికను కనుగొని దానిని ఆమోధింప జేసేందుకు మనం ప్రయత్నించాలి. మనం కనుగొన్న కొత్త న్యాయసూత్ర భావనలను న్యాయమూర్తులకు సుపరిచితం చేయాలి. అలా వారు వాటిని మెల్లగా ఆమోదించేలా పని చేయాలి. యథాతథ వాదానికి న్యాయస్థానాలు పట్టుగొమ్మలు. సామాజిక మార్పుకు వ్యతిరేకత వాటిలో బాగా పాతుకుపోయి ఉంటుంది. కాబట్టి పేద ప్రజల తరపున వాదించే న్యాయవాదులు సామాజిక మార్పు వ్యతిరేకులతో తలపడే సమర్థతను సాధించాలి. సంపన్నులు పెట్టుకొనే న్యాయవాదుల కంటే మరింత నిబద్ధులైన, సమర్థులైన న్యాయవాదులను పేద ప్రజలు పెట్టుకొనగలగడం ప్రధానం, బాలగోపాల్ విశ్వసనీయత న్యాయమూర్తుల గౌరవాన్ని పొందింది. సామాజిక స్పృహ ఉండి, దాన్ని చేతల్లో చూపేందుకు వెనుకాడే న్యాయమూర్తులను ఇబ్బందిపెట్టేలా ఆయన వాదించాడు. ఆయన గొప్ప భౌతిక, నైతిక ధీశాలి, నైతిక ఔన్నత్యం వల్ల, నిర్భీతి వల్ల మాత్రమే ఆయన బూటకపు ఎన్‌కౌంటర్లకు చలించలేదు. ఆయన హఠాన్మరణం ఈ సంప్రదాయానికి గొడ్డలిపెట్టు. రాజ్యాంగాన్ని రాడికల్‌గా చూడడాన్ని మేం ప్రారంభించాం. బాలగోపాల్ దానిని ముందుకు తీసుకెళ్ళాడు. ఇన్‌సర్జెంట్ జ్యూరిస్ ప్రుడెన్స్‌గా అది సుపరిచితం. అలాంటి సంప్రదాయం పురోగమనానికి ఆయన అకాల మరణంతో విఘాతం కలిగింది. పియుడిఆర్ నేత సివి సుబ్బారావు జీవించి ఉన్న రోజుల్లో నాకు ఢిల్లీలో మైకేల్ టైగర్, మెడలీన్‌లెవీ విరచిత లా అండ్ ద రైజ్ ఆఫ్ కాపిటలిజం గ్రంథాన్నిచ్చాడు. ఇన్‌సర్జెంట్ జ్యూరిస్‌ప్రుడెన్స్ గురించి అందులో చదివాను. క్యూబాలో బటిస్టా సైనిక తిరుగుబాటును ముందే ఊహించిన ఫిడెల్‌కాస్ట్రో బటిస్టా అరెస్టుకోసం కోర్టులో పిటీషన్ దాఖలు చేశాడు. కానీ కోర్టు అంగీకరించలేదు. వారం తిరగ్గానే బటిస్టా తిరుగుబాటు చేసి అధికార పగ్గాలు చేపట్టి కాస్ట్రోను ఖైదు చేశాడు. కుట్ర కేసులో ముద్దాయిగా కోర్టు ముందుంచాడు. తనపై పలు హత్యా ప్రయత్నాలను తప్పించుకొని ప్రపంచంలోని ఏకైక సోషలిస్టు దేశానికి కాస్ట్రో నాయకుడిగా మనతో ఉన్నాడు.

చాలా కాలం క్రితం **1978-79**లో వశిష్ట భార్గవ అధ్యక్షతన ఏర్పాటైన ఎంక్వైరీ కమీషన్ పనిలో నేను తీరుబాటు లేకుండా ఉన్నప్పుడు నా దగ్గరకు సుందరయ్య వచ్చేవాడు. కమ్యూనిస్టు ఉద్యమ రాజకీయాలు ఆయతో చర్చించేవాడిని. మీ జీవితం ముగింపుకొస్తోంది.

జీవితపు కూడికలు, తీసివేతల పట్టీ (బాలెన్స్, షీట్) తయారు చేస్తే ఏమని రాస్తారు. అని ఒక రోజు అడిగాను. ఉద్యమంలో చీలికవల్ల మావోయిస్టులైన చాలా మంది యువ మేధావులు కాల్చి చంపబడుతున్నారని ఆయన కన్నీళ్ళు పెట్టుకున్నారు. అలాంటి ఒక నేత తయారు కావాలంటే వందేళ్లు పడుతుంది అని గద్గద స్వరంతో చెప్పారు. అది ఉద్యమం ఎదుర్కొంటున్న ఒడిదుడుకు అని చెప్పారు. కామ్రేడ్ సుందరయ్య చెప్పించి నా మనోఫలకంలో మెలుగుతుంది. మరో బాలగోపాల్ రావాలంటే మరో వందేళ్ళు పట్టవచ్చు. ప్రకాశవంతమైన కొవ్వొత్తి తన కాలానికి ముందే ఆరిపోయింది. నేను బాలగోపాల్ కోసం విలపిస్తాను. అతను మరణించాడు.

**(డిశంబర్ 2,3 2009 వార్త దినపత్రిక)**

❖

నియమం ఏమీ లేదు. ఆయన హేతుబుద్ధి ఎంత తీక్షణమైనదంటే, తాను పరిశీలించే జీవితం భావోద్వేగాల పుట్ట అయినా సరే ఆయన వాటికి లొంగిపోలేదు. మార్క్సిస్టు - మార్క్సిస్టేతర సంప్రదాయాల్లో నుండి ఆయన హేతుబుద్ధిని దాని సహజ సిద్ధ స్వభావంతో సొంతం ఆకళింపు చేసుకున్నాడు.

ఈ సందర్భంలో దీని గురించి ఇంతగా మాట్లాడుకోగలిగే అవకాశం ఉన్నందు వల్లేకాదు...ఏ రకంగా చూచిసి ఇది చాలా ముఖ్యమైనది. ఎందువల్లంటే ...జీవితం భావోద్వేగాల మయమేగాని జీవితాన్ని అర్థం చేసుకోవడానికి భావోద్వేగాలు సరిపోవు. అదొక జీవిత వ్యక్తీకరణ మాత్రమే. ఈ ఎరుక లేకపోతే జీవిత సంబంధమైన వాటిని, వాటి చుట్టూ ఉండే చారిత్రక ప్రపంచ విషయాలను సైతం భావోద్వేగాలతో వెతుకుతూ ఉంటాం. ఇది ఎన్నటికీ ఆలంకారిక పరిధిని దాటి శాస్త్రస్థాయికి మనల్ని ఎదగనివ్వదు.

మనిషి అంటే ఏమిటి? మానవత అంటే ఏమిటి? చరిత్ర నిర్మాణంలో మనిషి పాత్ర ఏమిటి? అని బాలగోపాల్ మొట్టమొదట సందేహాలు బైట పెట్టుకున్నప్పుడు కూడా అందులో మనకు ఏమాత్రం భావోద్వేగ కంఠస్వరం వినిపించలేదు. ఆ ప్రశ్నల తార్కిక పర్యవసానంగా ఆయన ఎక్కడికి చేరుకున్నాడనేది పూర్తి సిద్ధాంత చర్చగాని.. ఆ సందర్భంలో కూడా హేతుబద్ధతను విడనాడలేదు. అంటే .. మనిషి చేరుకోవలసిన గమ్యం ఒకటి ఉన్నదని, చరిత్ర ప్రమేయం లేకుండా దాని గురించి తర్కించలేమని, చరిత్రతో మనిషికి ఉండే సంబంధం ఏమిటనే ప్రశ్నలు ఆయనలోని హేతుబుద్ధికి నిదర్శనం.

దీని కొనసాగింపుగా ఆయన మానవత అనేది వెల్లివిరియడం జీవితానికి చరిత్రకు సంబంధించిన తుదిమెట్టు అనే స్థూలమైన అభిప్రాయానికి వచ్చాడు. అక్కడే ఆయన మానవతావాద మార్క్సిజం అనీ, సాంస్కృతిక రాజకీయాలనీ చాలా నిర్ధారణలు చేశాడు. ఇప్పుడు అవి ప్రస్తుతం కాదుగాని మానవత గురించి, జీవితంలో అర్థం కాకుండా మిగిలిపోయే ఖాళీ గురించిన వ్యాఖ్యలు చరిత్రమయమైనవే...అంటే చరిత్రలో సాధ్యం కావలసినవే అనే అర్థంలో ఈ చర్చ అంతా చేశాడు. అదే చరిత్ర వల్ల ఇప్పుడు సాధ్యం కాలేదనే అంతరార్థం కూడా దానిలో ఉన్నది.ఈ చర్చాక్రమంలో ఆయనకు నూతన మానవుడు, పరిపూర్ణ మానవుడు అనే భావనల పట్ల నమ్మకం పోయింది. ఒకపక్క చరిత్ర ప్రమేయంగా మనిషి తుది మజిలీని అర్థం చేసుకోవాలనే వరకు సవ్యంగానే అలోచించినా ఆ తుది మజిలీ నూతన మానవుడు అనే విశ్వాసం నుండి, ఆశావాదం నుండి వైదొలిగాడు. దీనికోసమే మానవత ఎంత వెల్లివిరిసినా, జీవితంలో అర్థం కానిది కొంత ఉంటుందనే నిశ్చితాభిప్రాయానికి వచ్చాడు. పదేపదే జీవితంలోని ఖాళీల గురించి మాట్లాడేవాడు. దాని ఎట్లా భర్తీ చేస్తాం? ఎప్పటికైనా భర్తీ అవుతుందా? అనే ప్రశ్నలకంటే అసలు ఆ ఖాళీయే మానవ ఆచరణకు ప్రేరకం అని చెప్పి వదిలేశాడు. సాహిత్యం పాత్రను కూడా అక్కడే గుర్తించాడు.

మనిషి గురించి తనదైన తర్కబద్ధ అభిప్రాయాలున్న వ్యక్తిని పూర్ణ మానవుడనడం సరైందేనా? అయితే ఆయన చెప్పినట్లు జీవితంలోని ఖాళీయే మానవ ఆచరణకు ప్రేరణ అనే మాట బాలగోపాల్ ఆచరణకు, వ్యక్తిత్వానికి గొప్పగా అతుకుతుంది. ఆయన స్వచ్ఛందంగా ఎంచుకున్న ఆచరణ సమాజంలో, జీవితంలో ఉన్న ఖాళీల గురించి చాలా మందికి చైతన్యం కల్గించింది. ఈ స్పృహ ఆయనకు మార్క్సిజాన్ని వ్యతిరేకించే క్రమంలో కలిగిందని, దానికోసం ఇలాంటి ప్రతిపాదనలు చేశాడనే విమర్శ చేయవచ్చు. నిజానికి అంతకముందు కూడా ఆయనకు ఈ దృష్టి ఎంతో కొంత ఉన్నట్టుంది. బహుశా దాని వల్లనే ఆ కాలంలో నిర్మాణమవుతున్న చరిత్ర గురించి, ఉద్యమాల్లో కొత్త వ్యక్తిత్వాల వికాసం గురించి, వీటన్నింటినీ వివరించే సాహిత్య రూపాల గురించి ఆయన అప్పటికి మార్క్సిస్టు శిబిరంలోని ఆనవాయితీ కంటే కొంచెం భిన్నంగా ఆలోచించాడు.

జీవితంలో ఖాళీలు ఉంటాయనీ, జీవితం ఎన్నటికీ పరిపూర్ణం కాదనే ఆయన ప్రతిపాదనలు సాహిత్య, సిద్ధాంత రంగాల్లో ఎలాంటి పర్యవసానాలకు దారితీసినా జీవితం గురించి బాలగోపాల్ తుది నిర్ధారణలేవీ ప్రకటించకపోవడానికి అదే కారణం అయినట్టుంది. ఇంత వరకు మంచిదే. అయితే ఆయన ఇక్కడితో ఆగలేదు. నిజమైన చరిత్ర అంటే ఏమిటి? అది ఎందుకు నిజం అవుతుంది? అనే విషయాల్లో మార్క్సిస్టు మౌలిక సూత్రాలను శంకించాడు, తిరస్కరించాడు.

మార్క్సిజం(చారిత్రక భౌతికవాదం) చరిత్రను దాని దీర్ఘ కాలావధుల్లో వివరిస్తుంది. ఆ విషయంలో అది తిరుగులేని సామాజిక సిద్ధాంతం. అయితే జీవితాన్ని అట్లా స్థూల దృష్టితో వివరించి సరిపెట్టుకోలేం. చారిత్రక దశ జీవితాన్ని నిర్దేసించే మాట నిజమే అయినా ఆ దశ గురించి చెప్పినంత వివరంగా జీవితం గురించి చెప్పి వొప్పించడం కష్టమే. బాలగోపాల్‌కు ఈ అప్రమత్తత ఉన్నది. దీనివల్ల కలిగిన మేలు ఏమంటే... జీవితాన్ని యింకా యింకా అర్థం చేసుకోవాలనే స్పృహ చివరిదాకా ఉండటం. జీవితం సొంతం అర్థమైపోయిందని ఎవరూ అనబోరుగాని 'అర్థం చేసుకోవలసి ఉన్నది' అనుకోవడానికి ఏదో ఒక తాత్విక భావన నిరంతరం ప్రేరేపిస్తుండాలి. ఉద్యమాలన్నిటిలో యిదొక సాధారణాంశంగా ఉండేదే. కానీ అది జీవిత పరిశీలనకు, మన అనుభవాల విశ్లేషణకు దారి చూపేదిగానే మిగిలిపోకుండా వాటి వెనుక ఏమున్నది? అనే తర్కబద్ధ అన్వేషణగా మారాలి.

అట్లా మారకపోతే వచ్చే అతిపెద్ద చిక్కు ఏమంటే.. చిన్న అనుభవాల నుండి నిర్ధారణలు పుట్టుకొస్తుంటాయి. ఒకానొక వ్యక్తి అనుభవం ఆధారంగా పెద్ద సూత్రీకరణ చేయడానికి సంకోచం లేకుండా సాహసిస్తారు. 'నేను' కేంద్రంగా అపారమైన సామాజిక చర్చ నడుస్తుంది. సందర్భశుద్ధిలేని అలంకారిక వ్యాఖ్యలు, భావోద్వేగ ప్రకటనలు హేతుచింతనను నిత్యం బలితీసుకుంటుంటాయి.

ఆలోచించ వలసిన చోట, ఉమ్మడి అన్వేషణ సాగవలసిన చోట ఒక్క భావోద్వేగ ప్రకటన అన్నిటినీ తుత్తునియలు చేస్తుంది. సంవాదాల్లో భావాద్వేగాలు అవతలి పక్షాన్ని నిరాయుధులను చేయడానికి... కొండొకచో బ్లాక్‌మెయిల్ చేయడానికి ఎలా కారణమయ్యేదీ ప్రగతిశీల శిబిరంలో ఉన్నంతగా పామర జీవితంలో కూడా చూడలేం.

బాలగోపాల్ మార్క్సిజం పట్ల, విప్లవోద్యమాలపట్ల అపనమ్మకాన్ని , వ్యతిరేకతను బైటపెట్టుకున్న కాలానికి విప్లవ శిబిరంలో పైన చెప్పిన ధోరణి బాగానే విస్తరించింది. దీని ప్రతిక్రియగా ఆయన ఇట్లాంటి ఆలోచనలు చేపట్టాడనడం ఆయనకూ గౌరవం కాదు, విప్లవ శిబిరానికీ గౌరవం కాదు. ఆ సమస్య ఉన్నదంటే ఇంకే ఆలోచనాత్మక ధోరణీ లేదని నిర్ధారించడం పూర్తి అన్యాయమవుతుంది. ఎందుకంటే బాలగోపాల్ మనిషి, చరిత్ర, మార్క్సిజం అనే వ్యాసం నాటికే తెలుగు మేథోరంగంలో వినికిడి మేథావులున్నారనే దుబారా వ్యాఖ్య కూడా చేసేశాడు.

అయినా సరే బాలగోపాల్ తెలుగు సమాజంలో కొత్త ఆలోచనలను ప్రవేశపెట్టిన వారిలో ముఖ్యుడు. హృదయంపాలు కన్నా మేథ, వ్యక్తిత్వం ఆలోచనా రంగంలో ప్రధానంగా ఉండాలనుకున్న వ్యక్తి. ఆయన దేన్నయినా యింత హేతుబద్ధంగా ఆలోచిస్తాడు కాబట్టే హృదయలౌల్యం ఆయన మాటల్లో, రాతల్లో ఎక్కడా కనిపించదు. ఏ కారణం వల్లనో ఒక వ్యక్తి నచ్చకపోతే యిక అతనితో మాట్లాడేవాడు కాదని సన్నిహితులు చెప్తున్నారు. యిలాంటివి ఉంటే ఉండవచ్చుగాని.... అదీ హృదయ వ్యాపారంగా ఉంటుందా? అనుమానమే. ఆయన ప్రసంగాల్లో వ్యక్తవ్యాంశానికే పరిమితం కావడం ,రాతలో క్లుప్తత, నిరలంకారమైన సరళత (అప్పుడప్పుడు కొన్ని మినహాయింపులు ఉండొచ్చు, వ్యంగ్యం సరేసరి....) మొదలైన సుగుణాలకు హృదయాంశ

ఉండకపోవడమే కారణం. దీనివల్ల మామూలుగా ప్రగతిశీల శిబిరంలోలాగా బాలగోపాల్ ప్రసంగాలు అంత మధురంగా ఉండేవి కాదు.ఆలోచనాత్మకంగా ఉండేవి.

2

బాలగోపాల్‌లో హక్కుల ఉద్యమం - మార్క్సిస్టు చింతన అనే రెండు ముఖ్యమైన పార్శ్వాలు ఉన్నాయని, ఈ రెంటికీ రెండు దశలున్నాయనీ అందరికీ తెలిసిందే. హక్కుల ఉద్యమానికి సొంత నుడికారం, తనదైన కార్యరంగం ఉండాలని తొలినాళ్ల నుండి ఆయన అభిప్రాయం. అయినా సహజంగానే హక్కుల దృక్పథం, మార్క్సిజం అనేవి వేరు చేయలేని అంశాలుగా ఆయనలో కలగలసిపోయాయి. ఇది కేవలం పౌరహక్కుల ఉద్యమానికి వర్గపోరాట నేపథ్యం ఉన్నందు వల్లే కాదు. తొలి రోజుల్లో ఈ పని ఆయన మార్క్సిస్టుగానే చేశాడు. మార్క్సిజం పట్ల అసమ్మతి మొదలయ్యాక కూడా స్పష్టమైన ఉద్దేశ్యంతోనే మానవ హక్కుల పరిధిని, పనిపద్ధతిని, పరిభాషను తీర్చిదిద్దే పని చేశాడు. ఈ మొత్తం క్రమంలో ఆయన వల్లనే సాధ్యమయిన ఒకటి రెండు మంచి సంప్రదాయాల గురించి చెప్పుకోవాలి.

బహుశా నలభై ఏళ్ళ పైబడిన విప్లవోద్యమ చరిత్రలో.... ఉద్యమ ప్రభావంలో ఏర్పడిన ప్రజాసంఘాల్లో ఫలానా సంఘం సమాజంలో నిర్వర్తించవలసిన పాత్ర ఏమిటి? ఆ పని చేయడానికి ఆ సంఘం కంఠస్వరం ఎలా ఉండాలి? ఏఏ పనులు ఏ రూపంలో చేయాలి? అనే కీలకమైన చర్చకు ఆయనే ఆద్యుడు. అలాంటి ఆలోచనలు యింకొందరికీ ఉండొచ్చు. కానీ బాలగోపాల్ పౌరహక్కుల ఉద్యమ దృక్పథానికి - పనితీరుకు సొంత వ్యక్తిత్వాన్ని సంతరించి పెట్టాడు.

మార్క్సిజంతో పేచీ రావడంతో అప్పటిదాకా తను అభివృద్ధి చేసిన హక్కుల దృక్పథంతో కూడా ఆయనకు ఘర్షణ మొదలైంది. మార్క్సిస్టు చైతన్యంతో ఈ అవగాహన రూపొందిందనీ, అది సంతృప్తికరమైంది కాదనే ఆలోచనకు వచ్చాడు.

అయితే ఈ మొత్తం ప్రయాణంలో బాలగోపాల్ నిర్మాణం, ఆచరణ అనేవాటికి అత్యంత కీలకమైన స్థానం యిచ్చాడు. మార్క్సిస్టు నిర్మాణం - ఆచరణ పట్ల ఉన్నవీ లేనిదీ చాలా రాసేసినా, సాధారణంగా మానవ సమాజ వికాసంలో, వ్యక్తిత్వ వికాసంలో అంతర్నిహితంగా ఉండే ఆచరణ గురించి; అది నిర్మాణాత్మకమై ఉండాలనే మార్క్సిస్టు సూత్రం గురించి మార్క్సిజాన్ని కాదనుకున్న తర్వాత కూడా ఆయనకు అచంచలమైన నమ్మకం ఉన్నట్టు తెలుస్తుంది. అందుకే ఆయన మార్క్సిజంపట్ల అసంతృప్తి బైటపెట్టుకుంటూనే - పౌరహక్కుల ఉద్యమంలో ఆలోచన - ఆచరణ - నిర్మాణం అనేవాటికి దృఢంగా కట్టుబడి ఉన్నాడు.

మామూలుగా మన విప్లవ సంప్రదాయం ప్రకారం అభిప్రాయ బేధాలు వచ్చాక తట్టాబుట్టా సర్దుకోవడం అలవాటు. తమ అభిప్రాయాలు స్వీకరించకపోయినా, తాము ఎత్తిచూపే లోపాలు అవతలివాళ్లు గ్రహించి సరిదిద్దుకోకపోయినా యిట్లాంటి ముగింపు మన వొరవడిలోనే వున్నదే. అసలు అభిప్రాయ బేధాలు నిజమైన అభిప్రాయ బేధాలు కావడమే చాలా అరుదు. అసంతృప్తులు, కోపతాపాలు, వ్యక్తుల మీద అయిష్టాలు, వ్యక్తుల లోపాలు, అవతలి వాళ్ల లోపాల గురించి స్వయం పరిశుద్ధాత్ముల తుది తీర్పులు, తమ అభిప్రాయమే, తామెరిగిందే, వ్యక్తుల గురించైనా ..వ్యవస్థ గురించైనా స్వీయానుభవమే పరమ సత్యమనే ధోరణి ప్రగతిశీల శిబిరంలో ఉన్నంత మరెక్కడా ఉండవు. విప్లవ శిబిరం నుండి బైటికి వెళ్లిన వాళ్లలో ఈ ధోరణి వేలంవెర్రిగా, అదే ఒక అస్తిత్వ సిద్ధాంతంగా చెలామణి కావడానికి విప్లవ శిబిరంలోని శిక్షణ పాత్ర తక్కువేమీ కాదు.విప్లవ శిబిరంలో ఈ తరహా సమస్యలు విలువల స్థాయికి చేరేవి. అటునుండి రాజకీయ సిద్ధాంత చర్చలుగా మారి విభేదాలుగా ప్రచారంలోకి వచ్చేవి. వాటి ఆధారంగా తెల్లారేసరికి వ్యక్తులు వెళ్లిపోవడం, లేదా వుండలేని స్థితి ఏర్పడ్డం, పంపించెయ్యడం, కొన్ని సందర్భాల్లో చీలిపోవడం... యిదీ ఆనవాయితీ. వీటన్నిటి మధ్య కొంచెం రాజకీయ చర్చ కూడా ఉంటుంది. అన్నింటినీ రాజకీయ చర్చగా మలచడం కూడా రాజకీయ సంస్కృతిలో భాగమే. ఉద్యమాలకు అది చాలా చాలా అవసరమైంది. దాని ప్రయోజనాలు గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. యిక్కడ చెప్తున్నది - రాజకీయ చర్చ ఒక పలుచని పొరగానే మిగిలి ఉంటుందని. అందువల్లే 'అభిప్రాయ బేధాలు' అనే పేరుతో సంస్థల్లో చర్చించేవన్నీ చర్చించి, లేదా భిన్నాభిప్రాయాలను సైతం మనసులో దాచుకొని.. మాట్లాడే అవకాశమే లేదని, మొత్తం మీద తామనుకున్నట్టు సంస్థలు లేవని, తమ అభిప్రాయాలకు చోటు లేదని తీవ్ర అభినివేశంతో వెళ్లిపోయినవాళ్లు లేదా పంపించబడిన వాళ్లు తమ ఆలోచనలకు అనుగుణంగా నిర్మాణాలు చేసి పని చేయడం చాలా అరుదు. అసలు పబ్లిక్‌లైఫ్ అనే పార్శ్వమే గల్లంతయిపోయినవాళ్లూ ఉన్నారు.కొందరప్పుడప్పుడూ తన స్వజీవితమనే బొరియ నుంచి బైటికి తల నిక్కించి లోకమ్మీద, విప్లవాల మీద పలు విలువైన వ్యాఖ్యలు చేసిలోపలికి జారుకొంటుంటారు. ఉద్యమాల్లో అభిప్రాయ బేధాలు ఏకంగా నిర్మాణాల్లో చీలికకు దారి తీసినప్పుడు వేరే నిర్మాణాలుగా కొనసాగడం సరే. మళ్లీ చెప్తే అతిగా ఉంటుంది గాని - వీటన్నింటిని నడిపించిన శక్తి ఏమిటి? మనిషిలోని శాస్త్రీయ దృక్పథమూ, హేతు చింతనా? లేక వ్యక్తులనూ, చారిత్రక అభివృద్ధి క్రమాన్ని సైతం చూసే భావోద్వేగాల, భావజాల ప్రాబల్యమా?

ఈ చర్చ ఇప్పుడెందుకంటే.. బాలగోపాల్ వీటి కంటే కొంచెం మెరుగైన పద్ధతులను పాటించాడు. మొట్టమొదట చెప్పుకోవలసింది ఆయన తన మార్క్సిస్టేతర, వ్యతిరేక ఆలోచనలు పంచుకొనే క్రమంలో అనివార్యంగా పౌరహక్కుల ఉద్యమానికి, సాహిత్యోద్యమానికి సంబంధించిన తీవ్రమైన చర్చ లేవదీశాడు. ఆయన లేపిన తీరు ఎలా వున్నది? అనే వాటి గురించి యిప్పటికే చాలా చర్చ జరిగింది. మళ్లీ అక్కర్లేదు .

అయితే విప్లవ పార్టీల మధ్య విభేదాలు - చీలికలతో సహా తెలుగు ఉద్యమ ప్రపంచంలో ఎన్నడూ జరగనంత లోతయిన చర్చకు ఆయన ఆద్యుడయ్యాడు. దాని పర్యవసానంగా జరిగిన నష్టాల గురించి తర్వాత చెప్పుకుందాం. కానీ ఒక రకంగా 1990లలో ప్రగతిశీల శిబిరంలో సిద్ధాంత తీక్షణత పెరగడానికి పరోక్షంగా దోహదపడిందది. ఈ చర్చ పౌరహక్కుల నిర్మాణంలో సుదీర్ఘంగా సాగడం చాలా అపురూపమైన సంగతి. మార్క్సిజం గురించిన చర్చలో ఆయన ఏక పక్షంగా రాస్తూ పోయాడు కానీ పౌరహక్కుల గురించి అయితే ఆయన నిర్మాణంలో తన అభిప్రాయాలను ఏడేళ్లపాటు చర్చించాడు. నిర్మాణంలోని ఫంక్షనల్ ఏరియాలో ఈ చర్చల పర్యవసానాల మీద ఆయన వ్యవహారం ఏమిటో మనకు తెలియదుగాని, తన అభిప్రాయాలు మైనారిటీ అని తెలిశాక కూడా అంత కాలం మాట్లాడుతూ కొనసాగడం అరుదైన విషయం.

ఆ కాలంలో ఆయన రాసినవి ఇప్పుడు చదివితే అంత వొత్తిడి మధ్య కూడా ఏ కొంచెం భావోద్వేగాలతో రాయలేదుగదా? అనిపిస్తుంది. వ్యక్తుల గురించి , వ్యక్తుల్లో తనకు నచ్చని ధోరణుల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. తమ విభేదించే ధోరణులు హక్కుల ఉద్యమ అవగాహనకు సంబంధించినవి కాబట్టి ఆయన వాటిని అవగాహన స్థాయిలోనే చర్చించాడు. మామూలుగా అయితే అవీ ఇవీ కలిపి మాట్లాడ్డం, డాక్యుమెంట్లలో రాసెయ్యడం అలవాటు. హక్కుల ఉద్యమంలో, దాని నిర్మాణంలో చర్చించే విషయాలు సమాజ ప్రజాస్వామికీకరణకు సంబంధించినవి, మొత్తంగా చరిత్ర గమనానికి సంబంధించినవి అనే స్పృహ ఉన్నందు వల్ల తన అభిప్రాయాలను చెప్పడంలో , యితరుల అభిప్రాయాలను ఖండించడంలో హేతుతర్కం తప్ప మరేదీ చొరబడలేదు.

అందువల్ల ఆయన తన అభిప్రాయాల కోసం నిర్మాణంలో చీలికకు పాల్పడలేదు. యిది చాలా చైతన్యవంతమైన వైఖరి. తన అభిప్రాయాలు మైనారిటి అయినా కలసి ఉండొచ్చుగాని ఎందుకో నిశ్చయించాడు. అయితే తన అభిప్రాయాల పట్ల ఆయనకు ఎంత నమ్మకమంటే అవి సమాజంలో ఆచరణకు నోచుకోవాలి, దానికి ఒక నిర్మాణం కావాలి అనే స్పృహ ఉన్నందువల్లనే మానవ హక్కుల ఉద్యమాన్ని నిర్మించాడు.ఈ క్రమంలో ఆయన అభిప్రాయాలు మరికొందరి అభిప్రాయాలుగా మారడం వల్లే ఇది సాధ్యమైంది.

ఇట్లా యింకెవరైనా వ్యవహరించి ఉండొచ్చుగాని బాలగోపాల్ ప్రభావశీలంగా ఆ పని చేశాడు. అది కేవలం ప్రతిభకు సంబంధించిన విషయం కాదు. తనకున్న గుర్తింపు వల్ల తాను చేయాలనుకున్నవన్నీ విడిగా చేసుకుంటూ పోవచ్చు. విప్లవం వల్ల లోపలి నుండి, బైటి నుండి అట్లాంటి వాళ్లు అనేకమంది తయారయ్యారు. వారి కృషి గౌరవనీయమే. అయితే మాట్లాడే నైపుణ్యం పట్టుబడుతుంది కాబట్టి వారు...'నిర్మాణాల్లో ఉంటేనే ఉద్యమాల్లో ఉన్నట్టా ?' అని ఎదురు ప్రశ్న వేయవచ్చు. కానీ నిర్మాణం వల్లనే ఏ విజయమైనా సాధ్యం అనే స్ఫూర్తి బాలగోపాల్‌ను నడిపించింది. నిర్మాణాల్లో అభిప్రాయాల మీద పట్టుబట్టి చర్చించి ఆ తర్వాత మౌనంగా ఉండిపోయే వాళ్లకు బహుశా నిర్మాణంలో ఉన్నప్పుడు కూడా దాని మీద అంత గురి లేనట్టే. లేదా ఇప్పుడిక నిర్మాణం అక్కర్లేకుండా వ్యక్తిగా కూడా కార్యకలాపాలు చేసుకొనగలిగే జ్ఞానం, సొంత ఆవరణ ఉండటం కారణం కావచ్చు. నిర్మాణాల నుండి జ్ఞానం, గుర్తింపు, మాటకారితనం పొందడం తప్ప (చాలానే పని ఉంటారు) నిర్మాణ ఆవశ్యకతను తొలి నుంచీ గుర్తించకపోవడం అన్నిటికన్నా ముఖ్యమైన కారణం కావచ్చు.

బాలగోపాల్ నిర్మాణాన్ని, ఆచరణను చాలా విశాలమైన దృష్టితో ఆలోచించాడు. కార్మిక వర్గం యొక్క పాత్రను తిరస్కరించినా, ఆ అర్థంలో చరిత్రలో మానవ కర్తృత్వాన్ని సందేహించినా ఆయనకు మనిషిపట్ల అచంచలమైన నమ్మకం. మనుషులు ఆలోచిస్తే, ఆచరణలోకి వస్తే.... యిదంతా సమిష్టిగా నిర్మాణయుతంగా సాగితే తప్పక ఫలితం ఉంటుందని దృఢంగా నమ్మాడు. ఇలాంటి పనులవల్ల విప్లవాన్నే సాధించవచ్చని మార్క్సిస్టులు అంటే.... విప్లవమా? అది అయ్యే పని కాదుగాని ఈ పనుల వల్ల ఈ దుర్మార్గమైన సమాజంలో కొంత మార్పు తేవచ్చు. దీన్ని ప్రజాస్వామికరించవచ్చు అంటాడు. దీన్ని ఆయన అవగాహనలోని వైవిధ్యమా? వైరుధ్యమా?

నిర్మాణంలో పేచి వచ్చినప్పుడు ఎలా వ్యవహరించాలి? అనే దానికి ఎన్ని గీటురాళ్లయినా చెప్పుకోవచ్చుగాని దృఢంగా నిలబడి సమస్య గురించిన లోతయిన సిద్ధాంత చర్చను ప్రేరేపించడం అన్నిటికన్నా గొప్ప గీటురాయి. బాలగోపాల్ ఈ పని చాలా శక్తివంతంగా చేశాడు. అదే సమయంలో మార్క్సిజం గురించి చర్చలో మాత్రం ఆయన ఏకపక్షవైఖరే పాటించి తన చర్చా పద్ధతి పట్ల కొన్ని చెడు సంకేతాలు వెళ్లడానికి తానే కారణం అయ్యాడు.

ఈ క్రమంలో బాలగోపాల్ వాదనలతో ఏకీభవించినవారు, మార్క్సిస్టేతర ఆలోచనల వైపు మొగ్గినవారు పెరిగిపోయారు. అయితే ఆ మొత్తం వివాదాన్ని కేవలం రాజకీయంగా ఫలానా పార్టీకి వ్యతిరేకమని భావించిన వాళ్లూ వున్నారు. ఒక వేళ ప్రారంభంలో అలా అనిపించినా, తర్వాత్తర్వాత యిది లోతయిన సిద్ధాంత సమస్య అనే గ్రహింపుపొందినవాళ్లు బాలగోపాల్ వాదనలు తిరస్కరిస్తూనే ఆయన రచనలను పట్టించుకున్నారు. వాళ్ల మెదడు కొంచెం ఎదిగింది.

1993 తర్వాత బాలగోపాల్ రాసిన వ్యాసాల్లో 'చీకటి కోణాలు' తప్ప మిగిలావన్నీ సిద్ధాంత స్థాయి ఉన్న రచనలే.ఆ తర్వాత అప్పుడప్పుడు పత్రికల్లో, కాలమ్స్‌లో సందర్భం ఉన్నా లేకున్నా విప్లవ రాజకీయాల మీద విసుర్లు విసిరేవాడుగాని సిద్ధాంత విమర్శలు మాత్రం కనిపించేవి కాదు. మారిన తన సిద్ధాంత అభిప్రాయాలు చెప్పడానికి వెనుకాడకపోవడమేగాక, చాలా వరకు అలాంటి వాటికి తగిన మంచి పద్ధతులు పాటించడం ఆయన సీరియస్‌నెస్‌ను తెలియజేస్తుంది. ఇరవై ఏళ్లు ముప్పై ఏళ్లు సంస్థల్లో, పార్టీల్లో పని చేసి బైటికి వచ్చిన వాళ్లలో కొందరైనా పత్రికల ముందు గబగబ లోపలిదంతా కక్కేయడం చూస్తున్నాం. కొంత కాలం పాటు అదే పనిలో ముమ్మరమై పోతారు. పత్రికలు మూగేంత 'ఆకర్షణ' లేనివాళ్లు ఊరక గుసగుసలు పోతుంటారు. తమ అభిప్రాయాల పట్ల విశ్వాసం లేకపోవడమో, లేక కొత్త ఆలోచనలేమిటో... పాత ఆలోచనలేమిటో తేడా తెలియకపోవడమో ఈ గుసగుసలకు కారణం కావచ్చు. 1980ల నుండి అస్తిత్వఉద్యమాలకు సమర్థనగా చర్చలు చేసినవారిలో కొందరైనా తమ వాదాల పట్ల లోతయిన అభినివేశం ఉన్నవాళ్లు కాదు. మౌలికంగా సిద్ధాంతస్థాయి ఉన్నవాళ్లు కాదు. ఈ మాట ఆరోపణ కాదు, తక్కువ చేయడం కాదు. ఇవాళ తిరిగి చూస్తే ఎంత చిలువలు పలువలుగా మాట్లాడిందీ తెలుస్తుంది. భావోద్వేగాల రూపంలో తీవ్రవ్యాఖ్యలు చేయడంలో యిటీవలి కాలంలోఅస్తిత్వ ఉద్యమ సమర్థకులను మించిన వారు లేరు.

బాలగోపాల్ కూడా కొన్నిసార్లు ఆధారాలు సవివరంగా ఎత్తి చూపకుండా తాననుకున్న వాటిని మార్క్సిజానికి ఆపాదించిన సందర్భాలు ఉన్నాయి. మార్క్సిజంలో ఉన్నవాటిని లేవనడం, తాను చెప్తున్నది మార్క్సిజానికి అనుకూలమైనవే అయినా కొత్తగా చెప్తున్నట్టు ప్రకటించడం, అవి సంప్రదాయ మార్క్సిజంలో భాగం కాజాలవనడం... లాంటి కొన్ని వ్యవహారాలు చేశాడు.

మార్క్సిజాన్ని తిరస్కరించాక బాలగోపాల్ ఏమవుతాడు? అనే సందేహానికి ఆయన ఏ కొంచెం కూడా ఆస్కారమివ్వలేదు. తన అభిప్రాయాల మేరకు శ్రమించే గుణం ఆయనలో గొప్ప నైతిక శక్తిని అందించింది. దానికి తోడు నిర్మాణాత్మకంగా పని చేయడం ఆయనకు తిరుగులేని బలమైంది.విప్లవోద్యమాల్లోనుంచి బైటికి వెళ్లినవాళ్లలో, అస్తిత్వ ఉద్యమ సమర్థకులు చాలా మందిలో నిర్మాణాత్మక ఆచరణ లేకపోవడం గమనించవచ్చు. ఆచరణకు ఎంత విశాలమైన అర్థం చెప్పుకున్నా ఈ వ్యాఖ్య తప్పేమీ కాదు. బాలగోపాల్ ప్రతిష్ట వల్లనే ఆయన ఆలోచనలు సిద్ధాంత స్థాయిని పొందాయనుకోవడం సబబుకాదు.

తన నమ్మకాలపట్ల తార్కిక విశ్వాసం ఉండటంతోపాటు వాటి కోసం పని చేయగల సంసిద్ధత వల్ల ఆయనకు ఇంత పెద్ద చర్చ చేయగల నైతిక శక్తి ప్రాప్తించింది. దీనివల్లే నిర్మాణ స్పృహ అనేది అంతా సానుకూలంగా ఉన్నప్పటి పరమ భావన కాకుండా ఆలోచనలో, ఆచరణలో నిత్య సంఘర్షణ ద్వారా రాటుదేలవలసిన విషయమని బాలగోపాల్ నిరూపించాడు. బహుశా ఆలోచనలకు ఉండే శక్తిని ఆయన ఆచరణతలంలోనే గుర్తించాడు. దానివల్లే ఉబుసుకొని కబుర్లు ఆయన నోటి వెంట ఎవ్వరూ విని ఉండరు. ఆయన అభిప్రాయాల మీద వాదవివాదాలు ఎన్నయినా సాగించవచ్చుగాని వాటి మూలతలం పనిక్షేత్రం అనే సత్యాన్ని ఆయన్నుండి నేర్చుకోవలసి ఉన్నది. ఇది లేకపోతే ఎంత అద్భుతమైన ఆలోచనలైనా ఉత్తుత్తిగా మిగిలిపోతాయి. బాలగోపాల్ మార్క్సిజాన్ని వదిలేశాక కూడా ఆయన అభిప్రాయాల కోసం సమాజం ఎదురు చూడ్డానికి ఇది ఒక కారణం. ఇంకా ఇతర కారణాలూ ఉన్నాయి. వాటి వల్ల జరిగిన నష్టాలూ ఉన్నాయి.

బాలగోపాల్ ఆలోచన, ఆచరణల సంబంధాన్ని మౌలిక స్థాయిలో జీవితంలోకి స్వీకరించాడనవచ్చు. మనుషులతో ఆయన సంబంధాలు, ముఖ్యంగా మాటలు పనితో ముడిబడి వుంటాయి. శ్రమ చేసే క్రమంలో ఆలోచనలకు నిర్ధారణ రూపం యివ్వడం, శ్రమ సందర్భాల్లో ఆలోచనల

వినిమయం చేయడం, మనుషులతో సంబంధాలు నెరపడం.... ఆయన స్వభావం. అందువల్లనే బాలగోపాలతో ఏదో ఒక పని నిమిత్తమైన సంబంధాలే అందరికీ ఉంటాయి. ఆ క్రమంలోనే ఆయనతో మాట్లాడిన సందర్భాలుంటాయి. దీన్ని బట్టే కొందరు ఆయన ముభావి అనీ, అంతర్ముఖంగా ఉంటాడని చెప్తుంటారు. ఈ మాటల ద్వారా ఆయన్ను అర్థం చేసుకోవడం కుదరదు.

శ్రమతో కూడిన ఆలోచనలు చేయడానికి ఎక్కువ శ్రమించాల్సి ఉంటుంది. బాలగోపాల్ రాతల్లో, మాటల్లో సూటినం, క్లుప్తత, గాఢత, అమూర్తంగా లేకపోవడం (నిజానికి మార్క్సిజానికి అనుకూలంగా, వ్యతిరేకంగా సిద్ధాంత స్థాయిలో రాసిన వాటిలో ఈ సుగుణాలేం లేవు. పౌరహక్కుల నివేదికల్లో, ప్రధాన స్రవంతి పత్రికలకు రోజువారీ సమస్యలపై రాసిన వ్యాసాల్లో నే ఈ లక్షణాలుంటాయి) అనేవి శైలికి సంబంధించినవే కావు. భావాలు రూపొందే క్రమంలోని ఘర్షణ పర్యవసానమే శైలిగా వ్యక్తమయి ఉంటుంది.

నిర్మాణాల్లో, ఉద్యమాల్లో తన భావాలను వినిపించడానికి కూడా ఆయన అంతే ఘర్షణాత్మక సంబంధాన్ని నెరపాడు. పౌరహక్కుల ఉద్యమంలో పదేళ్లపాటు తవ అభిప్రాయాలు ప్రవేశపెట్టడానికి చేసిన ప్రయత్నమంతా సంబంధాలు ఘర్షణాత్మకంగానే ఉంటాయనే ఎరుకవల్లనే సాధ్యమైంది. అసలు ఆలోచనల్లో, జీవితంలో 'విలువలు'గా చెప్పబడే చాలా వాటికంటే ఘర్షణాత్మకంగా సంబంధాలు నెరపాలనుకోవడమే అసలు విలువ. ఒక వ్యక్తితో, నిర్మాణంతో, ఉద్యమంతో, సిద్ధాంత ప్రపంచంలో ఘర్షిస్తూ - ఏఏ తలంలో ఎలాంటి ఘర్షణ పడాలో గుర్తించడానికి మించిన జీవవ విలువ లేదు. మేధోరంగంలో, సామాజిక జీవితంలో అత్యంత విలువైన విషయమిది.ఘర్షణపట్ల విముఖతతో ఎంత ఉదాత్తమైన విలువల ప్రవచనాలు చేసినా శుష్కప్రాయమే. భద్రజీవితాలకు, బద్ధకపుజీవితాలకు గొప్ప సంకేతంగా మిగిలిపోతాయి.

అయితే విలువల పేరు తలవగానే ఓ పెద్ద జాబితా మనకు ప్రత్యక్షమవుతుంది. వీటిలో సాధు సంతులు పాటించేవి కూడా ఉంటాయనే గ్రహింపు మనకు ఉండదు. ఏ కారణం వల్లనో తమ జీవితంలో అనుకూలించడం వల్ల కొన్నిటిని సునాయాసంగా పాటిస్తున్నామనే స్పృహ కూడా ఉండదు. వాటిలో కొన్ని కేవలం అలవాట్లలాంటివనే గ్రహింపు లేకుండా అన్నిటినీ విలువల గోదాములో పడేస్తుంటాము. సర్వత్రా విలువల రాహిత్యం పెరిగిపోతున్న చోట్ల విలువల సంఖ్య పెరిగిపోవడం, అన్నీ 'విలువల' రూపమెత్తడం కూడా గతి తర్కమే.

ఘర్షణను అనుభవించేందుకు, పాటించేందుకు, తద్వారా కలిగే నొప్పికి సిద్ధమయ్యేందుకు చేసే ప్రయత్నం వల్ల ఘర్షణ ఒక విలువగా మారుతుంది. అది నిరంతరం సత్యాన్వేషణలో నిలబెడుతుంది. హేతుబద్ధత మాత్రమే కొత్తవాటిని తెలుసుకోవడానికి దారి చూపుతుంది. నిర్మాణంపట్ల, సిద్ధాంతం పట్ల, ఆచరణ పట్ల యిలాంటి వాళ్ళ వైఖరి తప్పక సొంత యునిట్ అయిన కుటుంబం దగ్గరి నుండి అన్ని సాంఘిక, రాజకీయ వ్యవస్థలన్నిటిలో గొప్పగా ప్రతిఫలిస్తుంటుంది. బాలగోపాల్ పౌరహక్కుల ఉద్యమానికి వచ్చిన తొలి రోజుల్లో దాన్ని ఎలా తీర్చిదిద్దాలి అనే దగ్గరి నుండి .. తనదైన దారి వెతుక్కున్న చివరి రోజుల దాకా ఆయన తన ఆలోచనల్లో, పని రూపాల్లో ఘర్షణాత్మక వైఖరిని కావాలని ఎంచుకున్నాడు. యితర వ్యవస్థలన్నింటి పట్ల , వాటి భావజాలాలు , ఆధిక్యాలపట్ల యింకా తీవ్రంగా, నిష్కర్షగా ఉన్నాడు.

బాలగోపాల్‌కు మొహమాటం ఉండేది కాదని చాలా మంది అంటుంటారు. మొహమాటమే అయితే చాలా మందికి ఉండదు. ఆయనలోని సుగుణం మొహమాటం లేకపోవడం కాదు. దేనితోనైనా ఘర్షణాత్మక వైఖరి, సంబంధమే ఉంటుందనే ఎరుక ఉండటం. అందులో కచ్చితత్వం ఉంటుంది. తక్షణ, తాత్కాలిక ప్రయోజనాలకు, మనుషుల మీది కోపతాపాలకు, తమ ఎరుకలోకి వచ్చిన ఒకానొక (లేదా కొన్ని) అంశం పట్ల పట్టింపుకూ పరిమితమైంది కాదిది. కొంచెం పై స్థాయి వ్యవహారం . నేలబారు సమస్యల నుండి పై స్థాయికి వెళ్లి అన్నింటినీ కలిపి ఆలోచించడమన్నమాట. అక్కడి ఘర్షణ చాలా ప్రయోజనకరమైనది. బాలగోపాల్‌కు అక్కడ వ్యవహరించగల శక్తి ఉన్నది. మామూలుగా అయితే ఉద్యమాలో, సంస్థల్లో కీచులాటలు, గుసగుసలు, నిత్య ఆరోపణలు, అసంతృప్తులు ,అల్పత్వ ప్రదర్శన అనే వాటికి ఘర్షణ అనే రూఢి అర్థం వచ్చేసింది. బాలగోపాల్ అప్పుడప్పుడు ఈ తలంలోకీ వచ్చి ఉంటాడేమోగాని ఆ ఛాయలు చాలా తక్కువ అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

3

బాలగోపాల్ తెలుగు మేథో ప్రపంచంలో, ఉద్యమాల్లో సమ్మోహన శక్తి. ఇదొక కాల్పనిక వ్యాఖ్యగా వినిపించవచ్చు . దీన్ని కొంచెం వివరించుకోవాలి. ఆయన ఉద్యమాల్లోకి వచ్చాక కనీసం రెండు తరాల యువతీ యువకులను ప్రభావితం చేశాడు , అనేక మందికి ఆయన ఒక నమూనా అయ్యాడనడంలో ఏ రకమైన ఆలంకారికతా లేదు. ఇప్పుడు దీని గురించి కాదు. ఆయన ప్రభావాన్నీ, ప్రత్యేకతను చెప్పుకొనేటప్పుడు ఆయన గడిపిన సాధారణ జీవితం గురించి ఎక్కువగా చెప్తుంటారు. రాత్రింబవళ్లు ప్రజలకోసం పనిచేశాడనేది సరేసరి. రెండోదానికి మొదటిది తోడైతే ఫర్వాలేదు. కానీ ఆయన మనలను ఆకర్షించడంలో మొదటిదే ప్రధానమైనట్టుంది.

అయన తలదువ్వుకోడు, మంచి బట్టలు వేసుకోడు. కంటి నిండా నిద్రపోడు.... అంటుంటారు. ఆయన విషయంలో యివన్నీ నిజాలే. చాలా అపురూపమనిపిస్తుంది.

అంతేనా? యింకేమీ లేదా? ఈ నాలుగు మాటలతో బాలగోపాల్ అర్థమై పోతాడా? వీటి ఆధారంగా మనకు కలిగే గౌరవం వెనుక ఉన్న భావన సరైందేనా? వీటికంటే కూడా 'వదులుకోవడం' అనే భావన గురించి ఆలోచిస్తే బాలగోపాల్‌లాంటి వాళ్లు యింకా బాగా అర్థమవుతారు. అప్పుడు పైన చెప్పిన - ఆయన అలవాట్లను వాటికవిగా గొప్ప చేయనవసరం ఉండదు. ప్రతి మనిషికీ కొన్ని అలవాట్లు, అభిరుచులు ఉంటాయి. తలదువ్వుకోవడం పట్ల ఏ మాత్రం ఆసక్తిలేని వ్యక్తి నున్నగా రోజా గడ్డం గీక్కోవచ్చు. ఇలాంటివి మాట్లాడుకోవడం కంటే 'వదులుకోవడం' అనే భావన గురించి ఆలోచించడం ఉత్తమం.

మన దగ్గర మొదటి నుండి ప్రాణాలొడ్డే ఉద్యమాలు ఉన్నందువల్ల త్యాగం అనే భావన సామాజిక వాస్తవంగా జీవితంలో భాగమైపోయింది. ప్రాణత్యాగానికన్నా ఉన్నతమైనది ఏముంటుంది? దాన్ని కేవలం విలువగానేగాక ..ఒక మనిషి సామాజిక అభివృద్ధి క్రమం కోసం త్యాగం చేయడం ఎలా సాధ్యమైంది? మానవజీవితాన్ని, సమాజాన్ని, చరిత్రను మిగితావాళ్ల కంటే చాలా భిన్నంగా చూడటం వల్లనే సాధ్యమవుతుంది. ఆ చూపు ఎట్లా రూపొందుతుంది? అనే ప్రశ్నల దాకా విస్తరిస్తే త్యాగం ఒక విలువగానే కాక ఒక దృక్పథమవుతుంది. ఇప్పుడీ అవగాహన లేదనికాదు, దాన్ని విలువగా చూచి సరిపెట్టుకోవడమే ఎక్కువ. దాన్నిదృక్పథంగా గుర్తిసే ప్రాణత్యాగంగానేగాక వ్యక్తిగత, సామాజిక జీవితంలో వేర్వేరు రూపాల్లో అది వికసించాల్సిన, నిలదొక్కుకోవలసిన అవసరం గురించి మాట్లాడుకోడానికి దారి దొరుకుతుంది.

ప్రాణత్యాగం గురించేగాక సాధారణ జీవితం మొత్తంలో ఈ అప్రమత్తతకు 'వదులుకోవడం' అనే భావన వెలుగు చూపుతుంది. బాలగోపాల్ జీవితంలో చాలా వాటిని వదులుకొని ఉండవచ్చుగాని ఆయన అతి

ముఖ్యమైన దాన్ని వదులుకోవడం గమనించాలి. ఆయన మధ్యతరగతి విశ్రాంత జీవితాన్ని సంపూర్ణంగా వదిలేశాడు. దాన్నాయన తృణప్రాయంగా కాలదన్నాడు.

జీవితం అర్థవంతం కావడం అంటే ఏమిటి? సుఖవంతం కావడం అంటే ఏమిటి? సౌకర్యవంతంగా ఉండటం అంటే ఏమిటి? అనే ప్రశ్నలన్నిటికీ ఆయన మధ్యతరగతిలోని విశ్రాంతిని వదులుకోవడం ద్వారా ఆచరణాత్మకమైన, గొప్ప తాత్వికమైన అర్థాన్ని చెప్పాడు. దీన్ని విలువగా గుర్తించినా గుర్తించవచ్చు. విలువకన్నా దృక్పథంగా అర్థం చేసుకుంటే చాలా విషయాలు మాట్లాడుకోవచ్చు. దేన్నయినా విలువగా గుర్తించడం వల్ల పొరపాటున అది పరమంగా మారిపోయే ప్రమాదం ఉంటుంది. ఎప్పటినుండో ఊహిస్తున్న ఈ ప్రమాదం బాలగోపాల్ మరణ సన్నివేశంలో మరింత ఎక్కువగా కనిపించింది. ప్రపంచంలో అన్నిటికన్నా జటిలమైన బోధనాంశం విలువలు. దాన్ని విడమర్చడంలో, వివరించడంలోని బోధనాపరమైన సమస్యలకంటే కష్టతరమైనవి అనేకం లోపలికి వెళ్లేకొద్దీ మనలను కకావికలం చేస్తాయి. అసలు విలువలు బోధనాంశమేనా? చర్చనీయాంశమేనా? అనే సందేహం కలుగుతుంది. సాహసించి ఆ గోదాములో దిగినా పదే పదే దృక్పథం గురించిన చర్చగా అది మారిపోతుంటుంది. లేదా వదులుకోవడం అనే రూపంలో త్యాగం గురించిన చర్చగా పరిణమిస్తుంది. జీవితంలో చాలా ముఖ్యమైన విలువల చర్చ ఇంత కష్టం కావడమంటే మనం ఎక్కడినుండి విలువలను చూస్తున్నామో ఆ తలమే సంశయాత్మకమైనట్టు.

వీటి కంటే ముఖ్యమైన చిక్కు గురించి చెప్పుకుంటే సరిపోతుంది. ఏదైనా విలువగా నిర్ధారణ అయిపోయాక అదొక కొలమానంగా స్థిరపడిపోతుంది. సర్వ మానవులకూ అది కొలమానం అయితే (దాన్ని అందరూ పాటించవలసిందనే విషయంలో రెండో మాట లేదు) యిక కొలవడం మాత్రమే మిగిలి ఉంటుంది. దీనికన్నా దృక్పథం అనుకున్నామంటే అది వ్యక్తుల్లో రూపొందడానికి, రూపొందకపోవడానికి సంబంధించిన నిజజీవితం పునాది మీది వాస్తవిక చర్చ అవుతుంది. దాన్ని ఎలా సాధించాలి? అనే అన్వేషణ మనిషిని నడిపిస్తుంది. విలువల చర్చ దానికదిగా విలువలు పాటించేవారు, పాటించనివారు అనే విభజన తెచ్చిపెడుతుంది. అప్పుడు కొందరు మహాత్ములవుతారు. మరికొందరు తుచ్ఛులవుతారు. అందువల్ల దృక్పథం అనుకొని బయల్దేరడమే ఉత్తమం. అది ఎలాగూ ఆచరణలో ప్రతిఫలిస్తేనే సజీవమవుతుంది.

విలువల చర్చ అంటే సమాజాన్ని మొత్తంగా ఉన్నతీకరించడంలో ఎదురయ్యే సాదకబాధకాల గురించిన చర్చ. అక్కడ విలువలంటే సామాజిక విలువలనే అర్థం. కానీ విలువల గురించిన అభిభాషణ ఎప్పుడు సామాజిక విలువల అర్థంలో సాగుతుందో ,ఎప్పుడు నైతిక విలువ అర్థంలో సాగుతుందో చెప్పడం కష్టం. ఈ విభజన గురించి ...వాటి మధ్య సంబంధం గురించి ఎంత తెలిసినా అటూ ఇటూ కలగాపులగమైపోవడం విశ్లేషకుల పొరబాటు కాజాలదు. విలువల భావనలోనే ఈ సమస్య ఉన్నదని గుర్తించడం మంచిది. సమాజం, వ్యక్తి గురించి చాలా శాస్త్రీయంగా ఆలోచించే వాళ్లలో చాలా మంది విలువల పునాది మీద రాజకీయాలను , రాజకీయాల ఇష్టాయిష్టాలను-వైఖరులనుబట్టి సిద్ధాంతవిశ్లేషణలను ఇవ్వడం మనకు తెలుసు. అంతిమంగా సిద్ధాంత విశ్లేషణలు విలువలపట్ల మన అనురక్తినిబట్టి ఉంటాయన్నమాట. శాస్త్రవేత్తల కృషిని, ఆవిష్కరణలను అర్థం చేసుకోడానికి, స్వీకరించడానికి విలువలు గీటురాయి అయితే ఎలా ?అనే సందేహం కూడా మనకు కలగదు. సామాజిక శాస్త్రవేత్తల కృషి సామాజిక జీవితంలో భాగం కాబట్టి విలువల ప్రాధాన్యత ఉండొచ్చు. అయితే విలువల వైపు నుంచి సామాజిక విశ్లేషకులను, సామాజిక సిద్ధాంతాలను, రాజకీయ ఉద్యమాలను చూసినప్పుడు కలిగే విపత్తు గురించి మనకు స్పృహ ఉండదు. అంటే చరిత్ర పురోగమనాన్ని విలువల కోణంలో చూడటం లోపభూయిష్టమనే అవగాహన ఉండదు. ఉద్యమాలు విలువల స్థాపనే లక్ష్యంగా జరగవని చెబితే విలువల రాహిత్యానికి పట్టం కట్టడం కోసమే ఈ వాదన అని విరుచుకపడవచ్చు. ఉద్యమాల్లో, రాజకీయాల్లో, సిద్ధాంతంలో విలువల కోణం బలంగా ఉంటుంది. నిన్నటిదాకా ఉన్న విలువలను కాపాడుకొని, ఉన్నతీకరించడం, నూతన విలువలను సాధించడం అనే కీలకమైన అంశం ఉంటుంది. కానీ ఫలానే విలువల సాధనే తన తక్షణ, దీర్ఘకాలిక లక్ష్యంగా చరిత్రలో ఏ ఉద్యమం జరగలేదు. సామాజిక చరిత్ర విలువల స్థాపన అనే మాధ్యమం ద్వారా పురోగమించదు. నిజ జీవితంలోని సమస్యల పరిష్కారానికే ఉద్యమాలు జరుగుతాయి. వాటికి ఎంత బలమైన విలువల కోణం ఉంటే అంతగా వాటి ఆశయాలను అవి నిజం చేస్తాయి. ఆ విలువల కోణం భంగపడ్డప్పుడు తప్పక ఆ ఉద్యమాలను విమర్శించాల్సిందే.

బాలగోపాల్ సందర్భంలో విలువల చర్చకు చాలా ప్రాధాన్యత ఉన్నది. బాలగోపాల్ విలువల గురించి మాట్లాడి సరిపెట్టుకున్నవాడు కాదు, జీవితంలో భాగం చేసుకున్నవాడు. ఆచరించినవాడు. అంత వరకైతే సిద్ధాంత సమస్యలుండవు. ఆయన అన్నిటినీ విలువల కోణంలో చూశాడు. విలువల పట్ల ఆయనకెంత పట్టింపు ఉన్నదంటే తాననుకున్న విలువలు (అవి తప్పక ఉండాల్సినవే) లేనప్పుడు సమాజం మీద, ముఖ్యంగా అధికార వ్యవస్థల మీద, వాటిని నిర్వహించే వ్యక్తుల మీద ఎంత తీక్షణమైన విమర్శలు పెడతాడో, సమాజాన్ని మార్చాలనుకుంటున్న ఉద్యమాలనూ అదే స్వరంతో విమర్శిస్తాడు. ఆయన వైఎస్ రాజశేఖర రెడ్డి గురించి, మావోయిస్టుల గురించి దాదాపు ఒకేలాగా విమర్శించడం కొందరైనా గమనించి ఉంటారు.

ఆయన విలువల చట్రం సామాజికమైనది. ప్రతి మనిషికీ ఒకే విలువ అనే భావన దీనికి మంచి ఉదాహరణ. దీని నుండే సర్వానికీ విలువల విశ్లేషణ ఇవ్వవచ్చు. అసలు ఆయన విలువలను పరమంగా భావించాడు. దాని ఫలితమే ఈ విమర్శా వైఖరి. బహుశా చాలా మంది ఆయన్ను రుషితుల్యుడని అనడానికి విలువల పట్ల ఆయన తీసుకున్న వైఖరే కారణం. విలువలరీత్యా ఆయన ఆరాధనాపరులు ఆయన వ్యక్తిగత జీవితంలోని విలువల ఆచరణను గౌరవిస్తున్నారా( ఎవ్వరైనా పాటించాల్సిన నైతిక విలువల చట్రం బాలగోపాల్‌కు ఉన్నది) , లేక సామాజికవిశ్లేషణలో, ఆచరణలో, లక్ష్యాల్లో ఆయన ప్రకటించే విలువల చట్రానికి ముగ్ధులవుతున్నారా? తెలియడం లేదు. అసలు రెండూ వేర్వేరనే అవగాహన ఉన్నా చాలు. మార్క్సిస్టు సంవిధానంలోని పూర్ణత్వభావన ఎంత అభాసుపాలయిందంటే- మొత్తంగా చూడాలనే పేరుతోఅన్నిటినీ కలిపిపారేయడం వ్యసనమైంది. అసలు ఏది ఎన్ని రకాలుగా ఉంటుంది? వాటి మధ్య తేడాలు ఏమిటి? అనే పట్టింపే లేకుండా పోయింది. ఆయన విలువలుగల పెద్దమనిషి కాబట్టి ఆయన చెప్పే విలువల సిద్ధాంతంలోని మంచి చెడ్డల గురించి స్పృహలేకుండా పోయింది. గాంధీతో బాలగోపాల్ పోలిక కూడా కేవలం సింప్లిసిటీ నుండి వచ్చింది కాదు. విలువల పరమ భావన నుండి పుట్టింది. ఆ భావన ఆయనలో ఉండటమే కాదు , దాన్నలాగే ఇతరులూ స్వీకరించడం దీనికి కారణం. అయితే బాలగోపాల్‌కు ఏవి సామాజిక విలువలు? ఏవి సమాజంలో సాధించవలసినవి? అనే విషయంలో తనదైన స్పష్టత ఉన్నది.

బాలగోపాల్ ఒక చోట సమాజాన్ని భోజ్యవస్తువుగా భావించడం గురించి అద్భుతంగా చెప్తాడు. సమాజం మానవుల కోసమే. అయితే మనుషుల సొంతానికి కాదు. సమాజాన్ని నాగరికం, మానవీయం చేసే చైతన్యవంతమైన కర్తవ్యం కూడా మనిషికి ఉంటుంది. ఏకకాలంలో అది తనను తాను ఉన్నతీకరించుకోవడం కూడా. ఈ అవగాహన ఉంటే సమాజం, సంపద అంతా మనిషి కోసమేగాని - మనిషికి అది భోజ్యవస్తువుకాదనే అవగాహనకు చేరుకుంటారు. దీన్నుండి తలెత్తిన సింప్లిసిటీ అనే భావనకు మన సమాజంలో

ఫ్యూడల్ అర్థం ఉన్నది. మనిషి సర్వం విసర్జించడం ఒక జీవన విలువగా గుర్తింపు ఉన్నది. ఇది చాలా పెద్ద సమస్య. అలాంటి వాళ్ళను సమాజం గౌరవిస్తుంది. సర్వ సంగపరిత్యాగులకు, సాధుసంతులకు మన దేశంలో ఎనలేని గౌరవం దక్కేది ఈ భావన వల్లనే. సకల సంపదలను కొందరు వ్యక్తులు భోజ్యం చేసే చోట సర్వసంగ పరిత్యాగులకు ఎక్కడలేని గౌరవం దక్కడం ఒక వైరుధ్యం. ఇది సారాంశంలో తరతరాల భూస్వామ్యంలోని సజీవ ఊట. ఏ కారణం వల్ల కూడా యిది గౌరవ పాత్రం కాదు. ఆమోదనీయం కాదు. ఒక వేళ ప్రజలకు ఆ దృష్టి ఉన్నా దాన్ని మనం అంగీకరించడానికి లేదు. వాడుకోవడానికీ వీల్లేదు. దాని మీద తీవ్రమైన విమర్శ పెట్టాలి. ఎందుకంటే అందులో ఏ రకమైన హేతుబద్ధత లేదు. కేవలం విశ్వాసం, భావజాలం అంతే . సర్వసంగపరిత్యాగం ఒక ఆదర్శనీయ విలువైనట్టే లోకాన్ని భోజ్య వస్తువుగా చూడటం కూడా ఒక తప్పుడు విలువ అయిపోతుంది. లోకాన్ని భోజ్యవస్తువుగా చూడటం, సకల సంపదలు హక్కుభుక్తం చేయడం 'తప్పుడు విలువ'గా మిగిలిపోతే ఎంత పెద్ద అనర్థమో చెప్పనవసరం లేదు. దాని ఆధారంగా దోపిడీని వివరించ లేం. దోపిడీని నిర్మూలించలేం.

ఆధునిక జీవితంలో మన చుట్టూ పోగయ్యే సకల సంపదలు, వస్తువులు, అవి యిచ్చే సౌకర్యాలు మొదలైన వాటిలో ఏవి అవసరం, ఏవి అనవసరం అని తేల్చుకుంటే - సమాజం నుండి తీసుకోవడం, వదిలేయడం అంటే ఏమిటో స్పష్టమవుతుంది. వదులుకోవడం అనేది ఉన్నప్పుడు తీసుకోవడం కూడా ఉంటుంది. ఇవి రెండు హేతుబద్ధమైన దృక్పథం నుండి ఆచరణలో ప్రతిఫలించే వాస్తవాలు

సామాజిక అభివృద్ధిని సాధించే ప్రయత్నంలో అవసరమైతే ప్రాణాన్ని త్యాగం చేయడం అనే సంసిద్ధత మామూలు జీవితంలో సమాజం నుండి ఏం తీసుకోవాలి? ఏది వదిలేయాలి? అనే సూత్రంగా మారాలి.

బాలగోపాల్ సమాజం నుండి ఏం తీసుకున్నాడనేది వేరే విషయంగాని, తన మధ్యతరగతి విశ్రాంతిని శ్రమకాలంగా వెచ్చించాడు. సమాజంలో మార్పుకోసం వినియోగించాడు.

విశ్రాంతిని వదులుకోవడం, దాన్ని సామాజిక ప్రగతికి వెచ్చించడం అనేవి సర్వంగపరిత్యాగం కాదు. మానవాతీత లక్షణం కాదు. రుషి తత్వం కాదు. ఆధునిక మానవుడి చైతన్యవంతమైన నిర్ణయం అది. దీన్ని యిలా అర్థం చేసుకోకపోతే ఆధునిక జీవితాన్ని అర్థవంతం చేయాలనుకొనే ఆచరణను 'కొలవడం' సమస్య అవుతుంది. ఎవరైనా ఉద్యమకారుడు ఏ పూటకాపూట పువ్వుల చొక్కాలు తొడుక్కుంటూ అవకాశం దొరికితే నదీతీరంలోనో, సముద్ర తీరంలో కాసేపు షికారు కొడితే అతణ్ణి గౌరవించడం మనకు కష్టమైపోతుంది. మిగతా వాళ్లలాగే ఇతనూ నిబద్ధతతో కష్టపడి ప్రజల కోసం పని చేసినా, ప్రాణత్యాగానికి వెరవకపోయినా అతణ్ణి కొలవడానికి వేరే కొలబద్దలు అవసరమవుతాయి. అతను ఆదర్శప్రాయుడుకాడని మనకెక్కడో అనిపిస్తుంటుంది. సమాజంలో మంచి గురించి ఆలోచించేవాళ్లు సాధుసంతుల్లాగా ఉండాలనే మూఢాచారం తీవ్ర భావజాలంగా వ్యాపించడం దీనికి కారణం. దాన్నొక జీవన విలువగా కూడా తీర్చిదిద్ది దానికి మన హేతుబుద్ధిని బలిపెట్టడం కారణం. ఆధునిక జీవితాన్ని అర్థవంతం చేసుకోడానికి మన సొంత జీవితంలో నుండి ఏం వదులుకుంటాం? మన చుట్టూ ఉండే వాటిలోంచి మన అవసరాలకు తగినంత ఏం తీసుకుంటాం అనేదే గీటురాయి కావాలి.

పైనచెప్పిన మూఢాచారం వెనుకబడిన సమాజంలో ఉండటం సహజమే. అయితే దాన్ని కమ్యూనిస్టు ఉద్యమం యథోచితంగా పెంచి పోషిస్తోంది. ఫ్యూడల్ సమాజంలో నుండి అప్పుడప్పుడే తలెత్తుతున్న బూర్జువా శక్తుల మేలైన ప్రతినిధిగా గాంధీ చూపిన ఒరవడిని కమ్యూనిస్టు ఉద్యమంలోకి సుందరయ్యగారు తీసుకొని వచ్చారు. అప్పటి నుండి విలువలు, సంస్కృతి గురించిన మన బోధనల్లో, సూత్రీకరణల్లో గాంధేయవాదం పదేపదే తొంగి చూస్తున్నది. దీని వల్ల ఇలాంటి విషయాల్లో కమ్యూనిస్టుల వైఖరులు సర్వసాధారణంగా గాంధీకి దగ్గరగా ఉంటాయి. దీన్ని సమర్థించుకోడానికి ప్రజల్లో విశ్వసనీయత అనే వాదన చేస్తారు. ఇవన్నీ ఆధునికపూర్వ వాసనకొడుతుంటాయి. సామ్రాజ్యవాదం గురించి విరివిగా మాట్లాడే వాళ్లంతా తరచూ విమర్శలకు గురికావడం యాదృచ్ఛికం కాదు. ఆ వ్యక్తుల మంచి చెడుల సమస్య కాదు. వాటి గురించి మన బోధనే లోపభూయిష్టం . విలువలు, సంస్కృతి అనే గోదాములో కమ్యూనిస్టులు చిక్కుకపోయినట్లు విలువలను విధ్వంసం చేసే సంఘపరివార్ ఎన్నడూ చిక్కుకపోదు. విలువలకు ఆధునికత గీటురాయి అయితే వెనుకబడిన ప్రజలు కోరుకొనే నమూనాల నుంచి, గాంధీ ఛాయ నుంచి విముక్తి దొరుకుతుంది. అప్పుడే ఎవరిని ఎందుకు స్వీకరిస్తున్నామో , ఎందుకు పక్కన పెట్టేస్తున్నామో కనీసంగా తెలుసుకోగలుగుతాం. అంతకు మించి సంస్కృతి, విలువలు అనే వాటికి సంబంధించిన భావవాద ఊబి నుంచి బైటపడతాం.

## 4

బాలగోపాల్ తన జీవన విధానాన్ని, ఆచరణను, పనిని పూర్తిగా తను స్వీకరించిన విలువలు ప్రాతిపదికపై నిర్మించుకున్నాడు. ఏ పనీ ఎవరి మెప్పు కోసమో చేయలేదు. పైన చెప్పిన వికార భావనల నుండి ఆయన్ను శ్లాఘించడం అంత మంచిది కాదు. అయితే ఆలోచనాపరుడిగా ఆయన విలువల దృక్పథం గురించి చర్చించుకోవడం బాగుంటుంది. బాలగోపాల్ విలువలను ఒక సామాజిక దృక్పథంగా గుర్తించిన కాలంలో కూడా ఆయనలో ఆదర్శవాదం బలంగా ఉన్నది. రెండో దశలోనైతే అది శుద్ధ నైతిక విలువలుగా మారిపోవడం కూడా గమనించవచ్చు . సమాజాన్ని, జీవితాన్నీ, ఆ రెంటినీ బాగుచేసే ప్రయత్నాలనూ, మొత్తంగా చరిత్ర పురోగమనాన్ని ఆదర్శం, విలువల కోణంలో, సంస్కృతీ కేంద్రంగా చూడటం ఆయనకు అలవాటు. ఆయన తొలి రచనల్లోని బలమంతా ఇదే. ఈ దృష్టి కోణం తెలుగుసీమ కమ్యూనిస్టు ఉద్యమంలో మొదటి నుండీ ఉన్నా దానికి ఒక ఆకృతిని..సంవిధానాన్ని ఇచ్చింది బాలగోపాలే కావచ్చు. అందుకే ఆ కాలంలోని మేధో ప్రపంచంపై ఆయన ముద్ర మిగిలిపోయింది.

ఈ కారణం వల్ల బాలగోపాల్ విలువల ఆచరణను సమున్నతంగా గౌరవిస్తూనే 'విలువల దృక్పథాన్ని' విమర్శనాత్మకంగా చూడాల్సి ఉంది. సమాజ పురోగమనానికి పోరాటాలూ, ఉద్యమాలూ చాలా ముఖ్యమంటూనే పౌరహక్కుల ఉద్యమాలైనా, మరే ఉద్యమమైనా సమాజంలో సాధించవలసింది విలువల స్థాపన అనీ ( ఉద్యమాల ఇతరేతర పాత్రను, కర్తవ్యాలను గుర్తిస్తూనే), ఇప్పటికే ఉన్న విలువలను మరింత అర్థవంతం చేసి కాపాడటం అనీ ఆయన పదేపదే చెప్పేవాడు. యిందులో ఆదర్శ వాదం ఉందని చెప్పకపోతే నష్టం చేసినవాళ్ళం అవుతాం. విలువలను వాస్తవాలను వేరు చేయలేం, విలువలు లేకుండా వాస్తవికత ఏదీ ఉండదు. కాని వాస్తవికతలో మార్పు అనేది విలువల లక్ష్యంగానే జరుగుతుందనడం భౌతికవాదానికి సొసగదు. ఈ రెంటికీ తేడా చూడకపోతే ఆదర్శవంతమైన విలువల సిద్ధాంతం తయారు చేసుకొన్నట్టవుతుంది. దాని ద్వారా సామాజిక ఆచరణ రూపాలను, ఫలితాలను నిర్దేశించుకున్నట్టవుతుంది.

బాలగోపాల్ బలం, బలహీనత రెండూ ఇక్కడే ఉన్నాయి. అయితే ఆయనకివి సంక్రమించడానికి మార్క్సిస్టు సంప్రదాయం కొంత కారణం. మార్క్సిజాన్ని వదులుకున్నాక వీటి మీద శ్రద్ధ మరింత పెరిగిన మాట వాస్తవం. దానికీ మార్క్సిస్టుగా ఉన్న రోజుల్లోని ఆలోచనలు, పరిశీలనలు, అనుభవాలు ప్రేరణ అయ్యాయి. అట్లా చూస్తే ఈ చర్చ కేవలం బాలగోపాల్ గురించే కాక మన మార్క్సిస్టు - లెనినిస్టు సంప్రదాయానికి సంబంధించిన చర్చ అవుతుంది. సిద్ధాంతం - నిర్మాణం - ఆచరణ అనే వాటిని ఆయన తొలి రోజుల నుండి విలువల దృష్ట్యా చూశాడు. ఫలానా ఆశయం ప్రకటించుకున్న

ఉద్యమాలు, పోరాటరూపాలు, వ్యక్తులు తప్పనిసరిగా ఆ ఆశయంలోని అంతర్లీన విలువలకు నూరు శాతం లోబడి ఉండాలనే నమ్మకం ఆయన్ను తొలి పదేళ్లపాటు నడిపించింది. ఆయనకు సామాజిక శాస్త్రాలతో , మార్క్సిజంతో ఉన్న పరిచయం వల్ల ఏ విశ్లేషణలోనైనా, సంవాదంలోనైనా, అన్వేషణలోనైనా వాటిని బాగా వాడుకున్న మాట వాస్తవమే గాని, ఇవాళ వెనక్కి తిరిగి ఆనాటి రచనలు చూస్తే వాటన్నింటి కేంద్ర స్థానం విలువలే. విలువల చట్రంలో భాగంగా ఆయన మార్క్సిస్టు ఆలోచనా రీతి సాగింది. ఆ విలువలను సామాజిక సిద్ధాంతంగా మార్క్సిజం ప్రకటించుకున్నదనీ, దాని వెలుగులో సాగే ఆచరణ వాటిని పుణికి పుచ్చుకున్నదనీ నమ్మినంతకాలం అవతలి పక్షాన్ని కత్తివాదరతో ఎదిరించే సైనికుడిలా వ్యవహరించాడు.

దీనికోసం చాలా ఆసక్తికరమైన సూత్రీకరణలు చేశాడు. ఉద్యమాల్లో వ్యక్తుల వ్యక్తిత్వాలు అదృశ్యం కావడంకాదు. ఉద్యమ విలువలే వ్యక్తుల్లో కరిగిపోతాయి.... అని నూతన మానవుడి ఆవిర్భావానికి సంబంధించిన వ్యాఖ్య చేశాడు. ఇలాంటివి ఎన్నో కనిపిస్తాయి. అయితే జీవితమనే చారిత్రక వాస్తవంలో విలువల ప్రాంగణం చాలా ఉన్నా విలువల వల్లనే ఆ వాస్తవికత ఉనికిలో ఉండదు. విలువల ఆధారంగా చలనంలో ఉండదు. స్వయం స్వభావంతో, చలనంతో ఉనికిలో ఉంటుంది. దాని నిజ స్వరూపం ఆయనకు దిగ్భ్రాంతి కలిగించింది. ఆయన ఇతరులతో తలపడి మార్క్సిజాన్ని నిలబెట్టాలని చేసిన ప్రయత్నంలో చాలా సార్లు మార్క్సిస్టుకన్నా ఆదర్శవాది కనిపిస్తాడు. లేదా ఆదర్శవాది అయిన మార్క్సిస్టు చింతనాపరుడు కనిపిస్తాడు. మంచి ఆదర్శవాది అయిన మార్క్సిస్టు భంగపాటుకు బాలగోపాల్ పరిణామం మంచి ఉదాహరణ. తానేర్పరచున్న విలువలు చట్రానికీ - ఈ సిద్ధాంతానికి, ఆచరణకు పొసుగుతుందా? అనే సంఘర్షణకు గురయ్యాడు.

సామాజిక రాజకీయ ఉద్యమాలు నిత్యం విలువలకు బద్ధమై ఉండవలసిందే, కొత్త విలువల ఆవిష్కారానికి పూనుకోవలసిందేగాని అదే కేంద్ర కర్తవ్యంగా ఉండజాలదు. రాజకీయ ఉద్యమాల దశ మారినప్పుడు లేదా సమాజ వాస్తవికతలో కీలకమైన మార్పు జరిగినప్పుడు ఉద్యమాలు తీసుకొనే ఎత్తుగడల్లో, వైఖరుల్లో అంతకముందు అదే ఉద్యమం వ్యవస్థీకరించిన విలువ తుడిచిపెట్టుకపోవచ్చు. ఆ విలువకు పూర్తి భిన్నమైన స్వభావంలోకి ఉద్యమం వెళ్లిపోవచ్చు. మళ్లీ దానికి వ్యతిరేకంగా అదే ఉద్యమంలో తీవ్ర అంతస్సంఘర్షణ జరిగి పాత విలువ కంటే ఉన్నత విలువను స్థాపించవచ్చు. మధ్యలో విలువల పరంగా దారి తప్పినట్టనిపించినా అప్పుడు తీసుకొన్న వైఖరి ఉద్యమానికి మరో రూపంలో ఎంతో కొంత మేలు చేసేదై ఉండొచ్చు. కొత్తగా ఏ విలువా స్థాపించకుండానే ఒక ఉద్యమం ఆగిపోవచ్చు. సామాజిక ఉద్యమాల లక్ష్యసాధనా జయాపజయాల క్రమమే కాదు, విలువల స్థాపన- ఆచరణ కూడా ఇట్లాగే ఉంటుంది. దీన్ని విమర్శనాత్మకంగా చూడాల్సిందేగాని ఇట్లా ఉంటుందని అంగీకరించలేకపోవడం ఆదర్శవాదమవుతుంది.

విలువల దృక్పథానికి లేదా చట్రానికి- మార్క్సిస్టు సంవిధానానికి పొసుగుతుందా? అనేది మరోసారి వోపిగ్గా ఆలోచించాల్సి ఉన్నది. మార్క్సిస్టు పద్ధతి దీర్ఘ అవధి ఉన్న యుగపరివర్తనను చరిత్ర అనే మొత్తంలో భాగంగా వివరిస్తుంది. సామాజిక శాస్త్రంగా మార్క్సిజం సామాజిక అభివృద్ధి క్రమంలో విలువల గురించి చర్చిస్తుంది. కానీ విలువల ప్రాతిపదిక మీద సామాజిక పురోగమనం అనే భావనను అంగీకరించదు. సామాజిక శక్తుల అభివృద్ధి..సామాజిక సంబంధాల మార్పు అనే చట్రంలో విలువల పరిణామాన్ని వివరించవచ్చనుకుంటాను. దీంతో సంబంధం లేకపోతే ప్రతి మనిషికీ ఒకే విలువఅనే విషయాన్ని ఎలావివరిస్తాం? బూర్జువారాజ్యాంగం ఇప్పటికే ప్రతి మనిషికీ ఒకే విలువ అనేదాన్ని అనేక రకాలుగా చెప్పింది. మనం అదనంగా ఏం చెప్పదలుచుకున్నాం? దాన్ని సాధించడమే అనుకుంటే వేరే విషయం.ఆ లక్ష్యం చాలా విలువైనదే. ఇంతకూ దాన్ని విలువల సమస్యగా చూడ్డం మంచిదా? సామాజిక సంబంధాల సమస్యగా చూడటం మంచిదా? ఇలాంటి ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయిగదా! బాలగోపాల్ పదేళ్లపాటు అన్వేషణ సాగించి చివరికి రస్సెల్ నుంచి రస్సెల్‌ను చేరుకున్నాని ఎక్కడో చెప్పాడు. తనకిప్పుడు సంతృప్తికరమైన తాత్విక దృక్పథం ఉన్నదని కూడా చెప్పుకున్నాడు. ఆయన తొలినాళ్ల రస్సెల్ భావనలకు రచనా ఆధారాలేవీ ఉన్నట్టు లేదు.అయితే ఈ విలువల చట్రం అనేది ఆయన మార్క్సిస్టుగా ఉన్న రోజుల్లో ఎలా కొనసాగింది? అప్పటి ఆయన మార్క్సిజం బుద్ధిజీవిగా బాలగోపాల్ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మలుపు. కీలకమైన మజిలీ.

5

బాలగోపాల్‌తో అత్యంత సన్నిహితంగా, ఆయన ప్రభావంలో ఉత్తేజం పొంది, ఆయన వైఖరులతో సంఘర్షించిన కాలం యిక ముగిసిపోయింది. ఇప్పుడు ఆయన గురించిన ఏ మాట అయినా బాలగోపాల్ పునర్దర్శనమే. బాలగోపాల్‌ను మన అంచనాల మీద హేతుబద్ధంగా పునర్నిర్మించడమే. ఈ రెండూ భౌతికంగా దూరమైపోయిన వాళ్లందరి పట్లా పాటించాలి. లేకపోతే ఒక సామాజిక, చారిత్రక జీవి మనకు వ్యక్తిగా, భావోద్వేగ సంబంధిగా మాత్రమే మన జ్ఞాపకాల్లో ఉండపోతారు. బహుశా ఇప్పటికే ఆ వ్యక్తులు మనలో ఎలా పోగుబడి ఉన్నారో దానికి యింకొంచెం మంచి , ఉదార్తత, ప్రేమ, ఎడబాటు, ఔన్నత్యం తోడవుతుంది. ఇవన్నీ తప్పక ఉండేవే.

కానీ ఏవ్యక్తి అయినా చారిత్రక వ్యక్తే అవుతాడు. సమకాలీన చరిత్ర నిర్మాణంతో నిమిత్తంలేని మానవుడు ఉండబోడు. ఆ నిర్మాణంలో పాలుపంచుకోనివారు ఉండరు. కాబట్టి ఆ వ్యక్తులు భౌతికంగా దూరమై పోయాక మిగిలి ఉన్నవాళ్ళలో (సమాజంలో, సామాజిక సంబంధాల్లో) పునర్నిర్మాణం అవుతారు. బాలగోపాల్‌ను అలా పునర్నిర్మించుకోవలసి ఉన్నది. ముఖ్యంగా ఆయన పరిణామం, ఆయన విలక్షణత నిష్కర్ష కావలసి ఉన్నది. ఈ క్రమంలో గతంలో ఆయన గురించి మనలోని నిర్ధారణలన్నిటినీ పున: సమీక్షించుకోవాలి. మార్క్సిస్టుగా , మార్క్సిజాన్ని తిరస్కరించినవాడిగా ఆయన రెండు దశలను, వాటి గురించి అప్పటి నిర్ధారణలను సైతం ఇప్పుడు అంచనా వేయవలసి ఉన్నది.

మొట్టమొదట మార్క్సిస్టుగా బాలగోపాల్....

పౌర హక్కుల ఉద్యమానికికి, మార్క్సిస్టు సిద్ధాంత రంగానికి, సాహిత్య విమర్శకు, సామాజిక శాస్త్రాల అధ్యయనానికి ఆయన చేర్పును గుర్తిస్తూనే తొలి పదేళ్లలో బాలగోపాల్ మార్క్సిజాన్ని ఎలా అర్థం చేసుకున్నాడు? ఏ పద్ధతిలో విశ్లేషణ అందించాడు ? వాద వివాదాల్లో ఎట్లా వ్యవహరించాడు? వాటి మూలం ఎక్కడ వున్నది? అనేవి చాలా ముఖ్యమైన ప్రశ్నలు .

బాలగోపాల్ మార్క్సిజాన్ని సర్వ సమగ్ర సిద్ధాంతంగా భావించాడు.(ఆ సర్వసమగ్ర భావనకు - ఆ తర్వాత మార్క్సిజంలోని ఖాళీల అన్వేషణకు ఒక సంబంధం ఉన్నది). అందువల్ల మార్క్సిజం సమాజం గురించి చెప్పినవన్నీ దాని తార్కిక బలం వల్ల నిరూపణ అయ్యేవేనని విశ్వసించి అట్లాగే వివరించేశాడు. మార్క్సిజం చెప్పిన యుగ పరివర్తనకు మానవ ఆచరణ చోదకమని, దాని మీద ఎంతో నమ్మకం ఉండేది. అది విలువల స్థాపనకు దారి తీస్తుందని ప్రగాఢంగా విశ్వసించాడు. మార్క్సిజంతో, 1980ల నాటి ప్రజా సంచలనాలలో ఆయన మమేకత అంతా తాననుకున్న విలువ స్థాపనకు అవి దారి చూపుతాయనే. ఈ ఆకాంక్ష న్యాయమైనది, తప్పక ఆశించవలసిందీ.

కానీ ఇట్లా ఆలోచించడంలో లోపం ఏమీ లేదా? చారిత్రకభౌతికవాదాన్నివిలువలచట్రం మీద అర్థం చేసుకోవడమే మార్క్సిస్టుగా బాలగోపాల్ పరిమితి .

1983 నుండి 1993 దాకా పదేళ్లపాటు ఆయన విప్లవం పక్షాన అవతలి శక్తులతో చేసిన పోరాటంలో ఇది కనిపిస్తుంది. మార్క్సిజంలోని అతి ప్రాథమికమైన భావనల ఆధారంగా ఆయన ఇదంతా చేశాడు. ఇది ఆ

కాలంలో విప్లవ శిబిరంలోనే ఉన్న పరిమితి అనుకున్నా పొరబాటు కాదు. దాన్ని అధిగమించేందుకు కృషి చేసిన యిద్దరి ముగ్గురిలో ఆయనా ఒకరు. అయితే ఆ పరిమితి వారికీ తప్పదలేదని అంగీకరించాలి. త్రిపురనేని మధుసూధనరావు యింకోవైపు నుండి దీనికి మంచి ఉదాహరణ. ఆ బృందంలో ఎక్కువ ఆచరణ శీలి కావడం వల్ల, ఆకర్షణీయమైన వాదన చేసే నేర్పు ఉన్నందువల్ల బాలగోపాల్ ప్రత్యేకంగా కనిపించాడు. చాలా ప్రభావం వేశాడు. చరిత్ర, రాజకీయ అర్థశాస్త్రం, తత్వశాస్త్రం మొదలైనవాటి పరిచయం వల్ల ఆయన సిద్ధాంత కృషిలో వైవిధ్యం, అప్పటికి కొత్తదనం కనిపించిన మాట వాస్తవమేగాని మార్క్సిస్టు మౌలిక సూత్రాలను అతి సరళంగా , యథాతథంగా వాడి అవతలివాళ్ల నోరు మూయించే పద్ధతి కనిపిస్తుంది. మనకు తెలియని మన చరిత్ర, సాంస్కృతిక విప్లవం మొదలైన చర్చల్లో ఇట్లాంటి ధోరణులు కనిపిస్తాయి. ఆయన పౌరహక్కులు- అణిచివేత చాలా విరివిగా రాసినా, వాటిలో పౌరహక్కుల వ్యాఖ్యాతగా, మార్క్సిస్టు పరిశీలకుడిగా, అన్వయకారుడిగా కనిపిస్తారు. 1990లో సృజన పత్రికలో కులసమస్య-రాజకీయ దృక్పథం అనే వ్యాసం అప్పటికి చాలా మంచి రచనే . కాని అందులో కూడా ఈ పరిమితి ఉన్నది. అది దళిత ఉద్యమం నుంచి వస్తున్న ప్రశ్నలను దృష్టిలో పెట్టుకొని రాశాడు. పై రచనల్లో వలె ప్రాథమిక స్థాయి నిశ్చితాభిప్రాయాల ప్రకటనలా కాకుండా కులం విషయంలో మార్క్సిస్టుల రాజకీయ అవగాహన ఎలా మెరుగుపరుచకోవలసి ఉన్నదో ఓపన్‌గా ఆలోచించాడు. అంతకు మించి కులమనే సాంఘిక వ్యవస్థ దాని జన్మకారణమైన ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు వస్తున్నా సజీవంగా ఉండటానికి కారణమేమి? అని మార్క్సిస్టు సిద్ధాంత పద్ధతిలో భాగంగా చూచే ప్రయత్నం చేయలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే మార్క్సిస్టు సిద్ధాంత చట్రంలోని వైశాల్యం గురించి మొదటి నుంచీ ఆయనకు ఎంత స్పృహ ఉన్నదీ సందేహమే. ఒక క్రమంలోనైనా దాన్ని గుర్తించాలనే ప్రయత్నమేదీ చేసినట్టులేదు. కులం గురించి రాసినప్పుడైనా మార్క్సిస్టు పద్ధతిలోకి వెళ్లి ఆలోచించి ఉండొచ్చు. దళిత ఉద్యమాల ఆకాంక్షలను రాజకీయ దృష్టితో చూచి అందులోని విలువలను గుర్తించాడు. ఆ తర్వాత్తర్వాత ఇట్లా రాజకీయ దృష్టితో చూడ్డం కూడా మానేశాడు. హక్కుల వ్యాఖ్యాతగా విలువల వైపు నుంచి చూచి విలువల విశ్లేషణతో సరిపెట్టుకొన్నాడు.

ఆయన విలువలనే కాదు, మార్క్సిజాన్నీ పరమంగా చూశాడు. ఆమేరకు అప్పట్లో ఆయనకు ఏరకమైన సమస్యా తలెత్తలేదు. అప్పటి సామాజిక మేథో వాతావరణం అట్లా చూడ్డానికి అనుమతిచ్చింది. ఆనాటి సమస్యలకు ఆ పద్ధతి సరిపోయింది. ఇంత పరమంగా చూడటానికి మార్క్సిస్టు ప్రాథమిక సూత్రాలే ఆయనకు సరిపోయాయి. మార్క్సిస్టు ప్రాథమిక పాఠాలకు ఆయన మంచి వ్యాఖ్యాత, ఉపాధ్యాయుడు. సోవియట్, చైనా విప్లవాలనే చారిత్రక యుగంలోభాగంగా మన స్థలకాలాల్లోని ఆలోచనారీతికి బాలగోపాల్ ఉదాహరణ.ఆయన ఆ కాలం రూపొందించిన మార్క్సిస్టు . అయితే 1990ల్లో కొత్త చారిత్రక పరిస్థితుల్లోకి సమాజం తోసివేయబడింది. దాని గురించి మరో చోట చూద్దాంగాని, బాలగోపాల్ భాగస్వామి అయిన వాదవివాదాల్లో కొన్నిచోట్లయినా వెటకారం, వేళాకోళం వల్ల కూడానేమో యాంత్రికత కనిపించేది. మార్క్సిజంపట్ల అవిశ్వాసం కలిగాక ఆయన వాదపద్ధతిలోని లోపాలు మార్క్సిస్టుగా ఉన్నప్పుడు కూడా ఆయనలో ఉన్నవే. మార్క్సిజాన్ని వ్యతిరేకించే క్రమంలో ఆయన వాదశైలిపట్ల అభ్యంతరపెట్టినవాళ్లు ఆయనకిది మార్క్సిస్టు పూర్వజీవితం నుండి సంక్రమించినదని చెప్పి ఉండాల్సింది.

1990 తర్వాత మన విప్లవోద్యమంలో చాలా మార్పులు వచ్చాయి. విచిత్రమేమంటే ఈ మార్పుల గురించి ఉద్యమ నాయకత్వంతో సహా సమగ్రమైన విశ్లేషణ ఎవ్వరూ ఇవ్వలేదు. కొన్ని మినహాయింపులుంటే ఉండవచ్చు. తెలుగు సమాజంలో 1980 కాలం విప్లవోద్యమపరంగా స్వర్ణయుగమనీ, ఆ తర్వాత దారి తప్పిందనీ అనే వాళ్లెవరూ దాని గురించి సాధికార విశ్లేషణ ఇవ్వలేదు. బాలగోపాల్ రాసిన కల్లోల కథా-చిత్రాలు మొదలైనవి చదివితే ఆ కాలంలో సమాజం ..విప్లవమూ కలగలసిన దృశ్యమూ , దానిలోని సంక్లిష్ట పరిణామాలూ అద్దంలో వలె కనిపిస్తాయి. 90ల తర్వాతి మార్పుల పట్ల నిరసన , అసంతృప్తి తప్ప విశ్లేషణ ఏ వైపు నుండీ రాలేదు. బాలగోపాల్ ఎదుర్కొన్న సంక్షోభం ఇదే. ఉద్యమంలో లోపాలు, ఆచరణలోని సమస్యలు, వ్యక్తుల - వ్యక్తిత్వాల వ్యవహారాలు, వాటి పర్యవసానమైన ఘటనలు విలువల రీత్యా ఆయనకు అపనమ్మకాన్ని పెంచాయి. తన ఆదర్శవాద మార్క్సిస్టు చట్రం ఏరకంగానూ సమాధానం చెప్పలేని ప్రశ్నలు పెరిగిపోయాయి. సోవియట్ యూనియన్ పతనం గురించి ఆయన 1992 దాకా అద్భుత విశ్లేషణ ఇచ్చి ఆ తర్వాత ఆర్నెల్లకే మనిషి, చరిత్ర, మార్క్సిజం వ్యాసం రాశాడు. అంటే బైటికి సోవియట్ యూనియన్ పతనం గురించి రాస్తూ, మాట్లాడుతూ ఉన్నా ఆయనలో మౌలిక సందేహాలు రగులుతూ వచ్చిన ఫలితమే ఆ వ్యాసం. ఉన్నత మానవీయ విలువల స్థాపనకు ఈ మార్గం సరిపోతుందా? ఈ సిద్ధాంతం తగిందేనా? అనే సందేహం బయల్దేరింది. అప్పటికి కూడా ఆయన చారిత్రక భౌతికవాదపు ప్రాథమిక సూత్రాల నుండి లోపలికి వెళ్లే ప్రయత్నం చేయలేదు. తానంత వరకు వినియోగించిన మౌలిక సూత్రాల మీదనే సందేహాలు పెంచుకున్నాడు. బాలగోపాల్ విమర్శించింది పదేళ్లుగా ఆయన సాధన చేసిన మార్క్సిజాన్నే అని గుర్తించకపోతే అసలు ఆయన్ను అర్థం చేసుకోవడం సాధ్యంకానేకాదు. ఆయన పదేపదే చేసిన విమర్శే ఎట్లా చేసుకుంటూ పోయాడో అట్లా ఆయన మీద మళ్లీ అవే ప్రాథమిక సూత్రాల ఆధారంగా ప్రతివిమర్శపెట్టి సంతృప్తి చెందుతాం. అప్పట్లో చాలా మంది అదే పని చేశారు. దీని వల్ల ఏ ఫలితం కలగలేదని ఇప్పటికైనా అర్థం చేసుకోగలిగితే మంచిది. ఆయన విమర్శిస్తున్న మార్క్సిజం మనందరం ఎంతో కొంత సాధన చేసిందేనని ఒప్పుకోకపోతే మార్క్సిజం అంత మాత్రమేకాదని ఎన్నటికీ తెలుసుకోలేం. ఈ ధోరణి ఆయనలో ఏ స్థాయిలో ఉండేదంటే ఫలానాది మార్క్సిజంలో లేదని, ఫలానాది మార్క్సిజం అంగీకరించదని చెప్పేవాడు. నిజానికి వాటిలో కొన్ని మార్క్సిజం అంగీకరించేవే. కొన్నిటికి కువ్యాఖానం చేశాడు.

మార్క్సిజాన్ని ఒక రాజకీయ సిద్ధాంతంగా చూసే అలవాటే మనలో ఎక్కువ. చరిత్ర గమనానికి వర్గపోరాటమే చోదకశక్తి , బూర్జువా రాజ్యాన్ని కూలదోసి కార్మికవరక్గ రాజ్యాన్ని స్థాపించడం, కార్మికవర్గ నియంతృత్వాన్ని నిర్వహించడం అనే రాజకీయ సిద్ధాంత విషయాలే మార్క్సిజంలోనిప్రధాన విషయాలుగా(మార్క్సిజంలో ఇది కీలక విభాగం) ఉంటూ వచ్చాయి. రాజకీయ, సిద్ధాంత, సాహిత్య సంవాదాలన్నిటికీ ఈ సూత్రాలే మార్గదర్శకత్వం వహించాయి. బాలగోపాల్ కూడా తొలిపదేళ్ల కృషి అంతా ఈ చట్రంలో సాగింది. ఆయన మార్క్సిజాన్ని సామాజిక సిద్ధాంతమని చెప్పి ఉండవచ్చు, ఆ వెలుగులో కొంత ఆలోచించి ఉండవచ్చు, రాసి ఉండవచ్చు. కానీ మార్క్సిజాన్ని ఆయనరాజకీయ సిద్ధాంతంగా, తత్వశాస్త్రంగా గుర్తించినంత సామాజిక సిద్ధాంతంగా చూడలేదని ఆయన ప్రాతినిధ్య రచనల ఆధారంగానే చెప్పవచ్చు. విప్లవోద్యమం పట్ల ఉండే మమేకత వల్లనైతేనేమి, అప్పటికే తానే నిర్వచించి ఆచరిస్తున్న పౌరహక్కుల ఉద్యమం వల్లనైతే నేమి సామాజిక రంగాలపై రాజ్యం పాత్ర గురించి,ప్రజాస్వామిక, మానవ విలువల విధ్వంసం గురించి, ప్రత్యామ్నాయ ఉద్యమాల్లో నూతన విలువలప్రయత్నం గురించి ఆయన చాలా సుబోధకంగా రాశాడు. కానీ మార్క్సిజంలో ఒక అద్భుతమైన సామాజిక శాస్త్రీయ సిద్ధాంతం ఉన్నదని ఆయనకు తెలిసి ఉండొచ్చుగాని ఆ దిశగా ఆయన మేథో కృషి చేయలేదు. మార్క్సిజంలోని చారిత్రకభౌతికవాదం గురించి ఆయన ఏమనుకున్నది ప్రత్యేకంగా ఎక్కడా రాయలేదు. మార్క్సిస్టు

తత్వశాస్త్రం గురించైతే కొంత రాశాడు. ఇది ఒక్క బాలగోపాల్‌కు సంబంధించిన సమస్యే కాదు. 1980ల నాటి ప్రజా ఉద్యమాల ఉత్తేజంతో మార్క్సిస్టు శిబిరంలోకి వచ్చిన ఆలోచనాపరులందరికీ, అట్లా వచ్చి ఉద్యమ వ్యాఖ్యాతలయిన వారందరికీ సంబంధించిన విషయం. బాలగోపాల్ రూపొందిన వరంగల్ , కరీంనగర్ , ఆదిలాబాద్ ప్రజా సంచలనాల నేపథ్యంలో ముందుకు వచ్చిన వారందరికీ వర్తిస్తుంది. ఆ ఉద్యమాల వ్యాఖ్యానంలో, సమర్థనల , వాటి వెంటనడవడంలో కాళోజీ , కేతవరపు రామకోటి శాస్త్రి లాంటి వాళ్లకు బాలగోపాల్‌లాంటి వాళ్లకు మార్క్సిస్టు సామాజిక సిద్ధాంతం విషయంలో మౌలికమైన తేడా ఎంత ఉన్నది? అనేది చాలా ఆసక్తికరమైన విషయం. ఆ ఉద్యమాలను విలువల చట్రంలో చూచి సంభ్రమానికి గురికావడం వీరందరిలోని సామ్యం. మార్క్సిస్టులనిపించుకున్నవారిలో కొందరైనా తర్వాత్తర్వాత తామూహించని విలువల చట్రంలో ఒదగని అనూహ్యమైన ఉద్యమపరిణామాలు సంభవించి దిగ్భ్రాంతికి గురికావడం గమనించవచ్చు. దీని వల్ల అంతదాకా తాను మార్క్సిజం అనుకున్నదాని మీద విమర్శపెట్టవలసి వచ్చింది. తెగతెంపులు చేసుకోవలసి వచ్చింది.

1993 తర్వాత ఆయన మార్క్సిస్టు రాజకీయ సిద్ధాంత మూల సూత్రాలను ప్రశ్నించడమేగాక, సామాజిక సిద్ధాంతంగా మార్క్సిజానికి సంబంధించిన అనేక ప్రశ్నలు సంధించాడు. నిజానికి ఆయన విమర్శలకు గురైన కేంద్ర అంశం చారిత్రకభౌతికవాదం. అంటే అంత వరకు ఆయన పెద్దగా పట్టించుకోని దాని గురించే ఎక్కువ సందేహాలు, వ్యతిరేకతలు పుట్టుకొచ్చాయి. అయితే ఆయన తన ఆలోచనల చారిత్రక సందర్భాన్ని కనీసంగా కూడా గుర్తించలేదు. గుర్తించి ఉంటే మార్క్సిజం గురించి ఆయన అధ్యయన, అన్వేషణా దృష్టితో వ్యవహరించి ఉండేవాడు. ఆయన కనీసం తన మేలుకొలుపు సన్నివేశాన్ని చెప్పడానికి, వివరించడానికి నిరాకరించాడు. దీంతో బాలగోపాల్‌ను, పనిలో పనిగా మార్క్సిజాన్ని విమర్శించడానికి స్త్రీవాదులకు అవకాశం దొరికింది.కానీ వాస్తవానికి బాలగోపాల్ వాదనలైనా, స్త్రీవాదుల అభిప్రాయాలైనా మార్క్సిజాన్ని సామాజిక సిద్ధాంతంగా డిస్ ప్రూవ్ చేసే ప్రయత్నమేగాని దాని బలమేమిటో ముందు తేలుద్దామని సాగలేదు. సిద్ధాంత అన్వేషణలో ఏకపక్షంగా ఉండకూడదనే పరిశోధనా నియమాన్ని ఇరువురూ పాటించలేదు.సిద్ధాంతకారునిగా బాలగోపాల్ అక్కడ దారి తప్పాడు. దాన్నాయన తర్వాత్తర్వాత 'సంప్రదాయ మార్క్సిజం' మీది విమర్శగా, 'మార్క్సిస్టు లెనినిస్టు' సంప్రదాయం మీది విమర్శగా అభివృద్ధి చేశాడు. మార్క్సిజంలోనే ఉండే ఇతర సంప్రదాయాల అన్వేషణలోకి వెళ్లిపోయాడు. ఈ అన్వేషణ చాలా మంచిదేగాని మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌ల తిరస్కారానికి వాటిని వాడుకోవడం కూడా గమనించాలి.

వీటన్నింటికీ కారణం బాలగోపాల్ మార్క్సిస్టు సంవిధానాన్ని చాలా సింపుల్‌గా అర్థం చేసుకోవడమే. మామూలుగా ఒక నిజనిర్ధారణకు వెళ్లినప్పుడు పైకి కనిపించే ఘటనను అర్థం చేసుకోవడానికి దాని చుట్టూ వ్యక్తావ్యక్తంగా పని చేసిన కారణాలన్నింటినీ శోధించి, అవన్నీ కలిపి ఒక క్రమంలో వ్యక్త ఘటన దగ్గరికి చేరుకున్నాయని అద్భుతంగా ఆయన వివరించేవాడు. మొదట్లో ఈ దృష్ట చాలా ఎక్కువగా ఉండేది. సమగ్రంగా చూడటం... అనేదానికి ఆయన నిజనిర్ధారణ నివేదికలు మంచి ఉదాహరణ. కానీ మార్క్సిజాన్ని ఒక సామాజిక సిద్ధాంతంగా, సంవిధానంగా గుర్తించే విషయంలో మాత్రం ఆయన అంత సమగ్ర దృష్టిని ప్రదర్శించాడని చెప్పలేం.

అయితే 1993 తర్వాత బాలగోపాల్‌లో అంతక ముందుకన్నా తాత్విక సిద్ధాంత లోతు బాగా పెరిగింది. అది అంత దాకా తాననుకున్న మార్క్సిస్టు పద్ధతి మీదికి ఎక్కుపెట్టబడ్డప్పటికీ అందులో ఒక సంకేతం ఉన్నది. రష్యా, చైనా విప్లవాలు, వాటి పతనాల తర్వాత మానవసమాజం చేరుకున్న ఒక కొత్త చారిత్రక దశనూ, అది సృజించిన కల్లోలాన్నీ , దాన్నుండి తలెత్తే అన్వేషణా అవసరాన్నీ బాలగోపాల్ పరిణామంలో చూడవచ్చు. అప్పటిదాకా 20వశతాబ్ది విప్లవాల గురించి, సోషలిస్టు ప్రయోగాల గురించి మనకున్న అనుభవాలు, అవగాహనలు సరిపోవనే వెతుకులాట ఆ సంకేతంలో ఉన్నదనుకుంటే తప్పేమీలేదు. అయితే అందులో ఆయన చారిత్రకభౌతికవాదాన్ని దారి దీపంగా తీసుకోలేదు.

మార్క్సిస్టు పద్ధతి మీద ఆయన ఈ విమర్శలు పెట్టడానికి మన దగ్గర నడుస్తున్న ఉద్యమాలు తాననుకున్న విలువల స్థాపనకు దారితీస్తాయా? అనే సందేహం కలగడంతోపాటు తూర్పు యూరప్ పరిణామాలు కూడా కారణమని చాలా మంది అభిప్రాయపడ్డారు. ఆ పరిణామాలు రాత్రికి రాత్రికి జరిగినవికావని, కూలిపోయింది రివిజనిజమని బాలగోపాలే చాలా సోదాహరణంగా వివరించి ఉన్నాడు. కానీ దానిలో ఒక ముఖ్యమైన సమస్య ఉన్నది. సోషలిస్టు వ్యవస్థకు బైటా, లోపలా( స్వీయాత్మక) ఉన్న శత్రువుల పాత్రను, కుట్రలను వివరించడానికే పరిమితం అది. అదంతా నిజమే. సోవియట్ పరిణామాలును వివరించడానికి సరిపోతుంది. కానీ చరిత్రలో తర్వాత రాబోయే సోషలిస్టు విప్లవాల గురించి, సోషలిస్టు వ్యవస్థల గురించిన ప్రశ్నలను సోవియట్ పరిణామాలు రంగం మీదికి తెచ్చాయి. ఏ చారిత్రక పరిస్థితుల్లో, ఏ సమాజాల్లో ఆ విప్లవాలు, సోషలిస్టు నిర్మాణాలు జరిగిందీ దృష్టిలో లేకపోవడం వల్ల రాబోయే విప్లవాల గురించిన సందేహాలు తలెత్తడం సహజమే. ఇలాంటి ప్రశ్నలయితే ఉదయించాయి గాని వాటి గురించి అన్వేషణ చేయడానికి అవసరమైన మార్క్సిస్టు సంవిధానం బాలగోపాల్ దగ్గరలేదు. కొత్త చారిత్రక ప్రపంచంలో విప్లవాల గురించి, మార్క్సిజం గురించి ఆలోచించి సోషలిజాన్ని సాధించవలసి ఉన్నదనే ఎరుక మార్క్సిస్టు శిబిరం ఇంకా పొందవలసే ఉన్నది. పైన చెప్పిన సందేహాలకు గురికానంత మాత్రాన అలాంటి ఎరుక ఉన్నదనీ, దానికి తగిన సంవిధానం, విశ్లేషణ ఉన్నాయనుకోవడం కూడా అత్యాశే. ఉండింటే తప్పక ఏఏ మారిన చారిత్రక పరిస్థితుల్లో రేపటి విప్లవాలు ఎట్లా జరగబోతాయో చెప్పి సోషలిజం గురించి బాలగోపాల్ ఆరోపణలు నిజం కాదని చెప్పే వీలుండేది. ఎందుకంటే సోషలిజం మీద బాలగోపాల్ విమర్శ అంతా ఆ సమాజంలో విలువల స్థాపన జరగలేదనే. సమస్య విలువల గురించేకాదు, ఆ విప్లవాలు జరిగిన సామాజిక, చారిత్రక స్థితిగతుల అనివార్యత .అయితే విప్లవాల గురించిన మన విశ్లేషణలో భావజాల విశ్వాసం ఉన్నంతగా సామాజిక సిద్ధాంతం పాలు తక్కువే. మన దగ్గర మార్క్సిస్టు అవగాహన విలువల చట్రం మీద నిర్మాణమైనది. దానికి మనకాలం ప్రతినిధి బాలగోపాల్!. ఆ పద్ధతిలో ఎంత లోతుగ విప్లవాల (నడచిన, నడుస్తున్న ) స్వభావాలను తరిచి చూస్తే అంతగా బాలగోపాల్ తరహా సందేహాలు కలుగుతాయి. అందుకే ఆయన రాగో గురించి రాస్తూ సోవియట్ యూనియన్ గురించి కూడా రాశాడు.

ఆయనలో అంతులేని వైరుధ్యం యిక్కడే మొదలైంది. విప్లవం ద్వారా సాధ్యంకాని విలువల స్థాపన బూర్జువా ప్రజాస్వామ్యం ద్వారా సాధ్యమవుతాయని నమ్మేదాకా వెళ్ళిపోయాడు. సోషలిస్టు ఆధునిక విలువల నుండి బూర్జువా ఆధునిక విలువల దాకా ఆయన ప్రయాణం సాగింది. పెట్టుబడిదారీ విధానంతో, సోషలిజంతో నిమిత్తం లేని ఆయన విలువల ఆకాంక్షకు మనం విస్తుపోవలసిందే. పెట్టుబడిదారీ విధానంలోని సకల దుర్మార్గాల పట్ల ఆయనకు విపరీతమైన ద్వేషం ఉంటుంది. వాటిని తిరస్కరిస్తూ ప్రజాస్వామికీకరణకు, విలువల స్థాపనకు చైతన్యవంతంగా కృషి చేయాలన్నది ఆయన ఉద్దేశ్యం. బూర్జువా వ్యవస్థలోని, రాజ్యంలోని మంచిని కాపాడాలని, వీలైనంతగా దాన్ని మానవీయం చేయాలని, విలువలతో కూడిన వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది ఆయన ఉద్దేశ్యం. ఉద్యమాల ద్వారా వొత్తిడి తెస్తే అది సాధ్యమవుతుందని ఆయన నమ్మకం. కానీ సోషలిజమైన, కేపిటలిజమైనా

వాటి వాటి స్వయం నియమాల ప్రకారం నడిచే సజీవ వ్యవస్థలని, మానవ కర్తృత్వం వల్ల వాటిలో నిరంతర మార్పు జరుగుతుంటుందని అర్థం చేసుకోకపోతే కేవలం విలువల చర్చ మాత్రమే మిగిలుతుంది. అసలు విలువలు గురించిన పరమ భావన ఆయనలో మొక్కగా ఉండి మార్క్సిజాన్ని తిరస్కరించే క్రమంలో మహా వృక్షమైంది. అందువల్ల ఆయన దేన్నయినా అత్యంత సరళంగా అర్థం చేసుకున్నాడు. సోవియట్‌విప్లవానికి, చైనా విప్లవానికి అనుకూలించిన భౌతిక పరిస్థితులను, సోషలిస్టు నిర్మాణంలోవి సామాజిక, చారిత్రక అననుకూలతలను కనీసంగా కూడా ప్రస్తావించపోగా ఆ పరిస్థితుల్లో విప్లవానికి, సోషలిజానికి మార్గదర్శకత్వం వహించించిన మార్క్సిజాన్ని, విప్లవానంతర వర్గపోరాట ఆచరణను విమర్శించి సరిపెట్టుకున్నాడు.

ఆ తర్వాతే ఆయన బూర్జువా ఆధునికతలోని సకల వ్యవస్థల గురించి, వాటి మంచి చెడ్డల గురించి వాటి లోపభూయిష్టమైన పని తీరు గురించి, ముఖ్యంగా విలువల లేమి గురించి చాలా ఎక్కువగా ఆలోచించాడు, రాశాడు. ఆ చట్రంలోపల మంచి సాధించడానికి, విలువలను నిలబెట్టడానికి ఉండే అవకాశాల గురించి ఆలోచించాడు. చివరి పదేళ్ళ ఆయన కృషి అంతా ఈ కోణంలో సాగిందే. తాను నిర్దేశించుకున్న హక్కుల కార్యరంగం వల్లనో, మరెందువల్లనో గాని - బూర్జువా సంస్థలను మానవీయం కావాలంటే పోరాటాలు తప్పనిసరి అంటూనే అదంతా హక్కుల పరిభాషలో రాజకీయ వ్యవస్థ మీద విమర్శకే పరిమితమయ్యాడు. బూర్జువా సమాజాన్ని, అందులోని సంస్థలను సంస్కరించాలన్నా రాజకీయపోరాటాలే మార్గం అనే పట్టింపు బాలగోపాల్‌లో రానురాను పలుచన అవుతూ వచ్చిందా? అని అనుమానం!

అయితే బూర్జువా ప్రజాస్వామ్యాన్ని ఆయన ఏనాడూ యథాతథంగా అంగీకరించలేదని మర్చిపోరాదు. అందువల్లనే ఆయన ఏ అధికార వ్యవస్థనూ అంగీకరించలేదు. రాజ్యలక్షణాలుండే భావనలను ఒప్పుకోలేదు. నిరంతరం రాజ్యయంత్రాంగం పట్ల అసమ్మతిని తెలియజేసేవాడు. ఏ వ్యవస్థకూ లొంగకపోవడం, భ్రమలకు లోనుకాకపోవడం, దేన్నయినా తాను విశ్వసించే విలువల ప్రమాణంలో చూచి విమర్శించడం మొదలైనవన్నీ ఆయన తాత్విక దృక్పథం వల్లనే సాధ్యమయ్యాయి.

బాలగోపాల్ విలక్షణత సారాంశం ఏమంటే - నిత్య ఆచరణ శీలిగా, విలువలకు నిలువెత్తు రూపంగా ఉదారవాద భావనలను తిరుగులేని విధంగా వ్యవస్థీకరించాడు. వర్గపోరాట సంప్రదాయం వల్ల మార్క్సిస్టులు, మార్క్సిస్టు వ్యతిరేకులు అనే స్పష్టమైన విభజన ఉన్న తెలుగు సమాజంలో బాలగోపాల్ ఉదారవాద క్షేత్రాన్ని స్థాపించాడు. 80లలో విప్లవ శిబిరంలోని అవగాహనను, ఆచరణ రూపాలను (పౌర, ప్రజాస్వామిక ఉద్యమాలకు సంబంధించి) వివరించి, విస్తరించిన వ్యక్తి చివరి పదిహేనేళ్లలో ఉదారవాద ఆవరణను, ఆచరణను సృజించి, విస్తరించి దానికి అనుగుణమైన పరిభాషను ,పోరాట రూపాలను అంతకంటే శక్తివంతంగా తీర్చిదిద్దాడు. బాలగోపాల్‌కు ఉన్న ఆచరణ బలం వల్ల , తద్వారా సంక్రమించిన నైతికశక్తి వల్ల, భావోద్వేగ రహిత కంఠస్వరం వల్ల, సంఘర్షణా పూరిత వైఖరి వల్ల ఆయన వ్యాఖ్యల కోసం సమాజం ఎదురు చూసేది. ఒక్కోసారి ఆయన ప్రదర్శించే ఉదారవాద వ్యాఖ్యలు విప్లవకారులు కూడా అంగీకరించటట్లు ఉండేవి. న్యాయాన్యాయ వివేచనలో ఆయన పాటించే విలువల ప్రమాణానికి అందరూ ప్రభావితులయ్యేవారు. అందుకే తెలుగులో ఒకప్పుడు విప్లవ శిబిరంలోను, దాని చుట్టుపక్కల ఉండేవాళ్ళంతా ఈ ఉదారవాద స్థానంలోకి వచ్చి చేరారు. అట్లాగే పూర్వ మార్క్సిస్టు వ్యతిరేకులు సైతం ప్రజానుకూల వైఖరితో ఉదారవాద ఆవరణలోకి వచ్చి చేరారు.

దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒక భావన వ్యాప్తిలోకి వచ్చింది. వర్గపోరాటాన్ని, మార్క్సిజాన్ని వదులుకోవడమే ప్రజాస్వామికంగా వ్యవహరించమనీ, ప్రజాస్వామికీకరణలో భాగం కావడమనే సంకేతం ఎల్లెడలా విస్తరించింది. మార్క్సిజం, ప్రజాస్వామ్యం పరస్పరం పొసగని వ్యవహారాలనే వాదన తెలుగు మేథావుల మనో ప్రపంచంలో భాగమైంది. దీని వల్ల జరిగిన నష్టం ఏమంటే - తటస్థ వైఖరికి ఎక్కడలేని ప్రతిపత్తి దొరికింది. ప్రభుత్వం - రాజకీయ పోరాట సంస్థల మధ్యలో ఈ ఉదారవాద క్షేత్రం ఎంత క్రియాశీలంగా తయారై కూచున్నదో ఆశ్చర్యం కలుగుతుంది. సమాజంలో ప్రజల పక్షాన నిలబడే ఉదారవాద బృందానికి చోటు పెరగడం మంచిదే. దాన్ని ఆహ్వానిస్తూనే అది వర్గపోరాటం పట్ల, మార్క్సిజం అనే సామాజిక సిద్ధాంతం పట్ల తీసుకున్న వైఖరి తటస్థ వాదంగా మారిందని చెప్పక తప్పదు. మార్క్సిజం పట్ల, విప్లవోద్యమాలపట్ల తటస్థవాదమే ఇవ్వాల్టి ప్రజాస్వామిక దృక్పథం . బాలగోపాల్ చేసిన తాత్విక ప్రయాణం ఈ ఉదారవాదం పెచ్చరిల్లడానికి దారి తీసింది. మార్క్సిజం స్థానంలో ఉదారవాద బూర్జువా సిద్ధాంతాలకు ఆయన పట్టం కట్టాడు.

దీని వల్ల తెలుగు సమాజం డీ పొలిటిసైజ్ అయిపోయింది. అస్థిత్వవాద ధోరణులు, బూర్జువా రాజకీయాల సరికొత్త వ్యక్తీకరణలు, ప్రపంచీకరణలాంటి అంతర్జాతీయ పరిణామాలన్నిటితో సహా తెలుగు సమాజంలో ఉదారవాద, తటస్థ వైఖరి విస్తరించడంలో, డీ పొలిటిసైజేషన్ పెరగడంలో బాలగోపాల్ పాత్ర లేకపోలేదు. 1980లలో విప్లవ, ప్రగతిశీల చైతన్యం తెలుగు సమాజంలో విస్తరించడానికి, రెండు తరాల యువతీయువకులు ఉద్యమకార్యాచరణలోకి, అవగాహనలోకి రావడానికి, మధ్యతరగతి నుండి ఉద్యమాలకు గొప్ప సంఘీభావం దొరడానికి బాలగోపాల్ పాత్ర ఉన్నదని సగౌరవంగా చెప్తూనే ఈ మాట కూడా చెప్పక తప్పదు.1990లలో వచ్చిన మార్పుల వల్ల విపరీతంగా సంపద పెరగడం, సంపద- అవకాశాలు- అధికారం పునఃసంపిణీ కావాలనే ఆకాంక్ష తలెత్తడం, అదీ ఈ పరిణామాల్లో విడుదలయిన నూతన సామాజికశక్తుల నినాదంగా మారడం వల్ల ( ఇందులో ప్రగతిదాయకమైన అంశం లేకపోలేదు) సమాజంలో ఉదారవాదక్షేత్రానికి భూమిక ఏర్పడింది. ఇది విముక్తి అనే భావనలో ఉండవలసిన రాజకీయ తీక్షణతను పలుచన చేసింది. బాలగోపాల్ పరిణామం ఈ రంగస్థలం మీద జరిగింది. అందుకే ఆయన అలాంటి న్యాయమైన ఆకాంక్షలపట్ల ఆ సమూహాలకంటే దృఢంగా నిలబడి మాట్లాడాడా అనేంతగా వాటిలోని హక్కులభావనను వివరించాడు. వాటికి భిన్నమైనవాటిపట్ల , వాటికి నష్టం కలిగించేవాటి పట్ల చాలా కచ్చితమైన వైఖరి ఏర్పరచుకున్నాడు. విప్లవంలోని విముక్తిభావనకు అంతకంతకు దూరం కావడం దీనివల్లే. అట్లాగే వాటికి నష్టం కలిగించే పెట్టుబడిపట వ్యతిరేకత సరేసరి. తదుపరి కాలంలో బూర్జువా రాజ్యం పట్ల ఆయన విమర్శ ఇక్కడి నుంచి వచ్చిందే. ఈ వ్యతిరేకత ఆయన మార్క్సిస్టుగా ఉన్నప్పటి వ్యతిరేకత కాదని గుర్తించడం తేలికే.సమాజంలో ఇన్నిరకాల మార్పులు జరిగిపోతోంటే విప్లవోద్యమం ఏం చేసింది? అనే ప్రశ్న ఎవరైనా వేయవచ్చు. విప్లవోద్యమాల్లోని ప్రాప్తకాలజ్ఞత, మార్క్సిస్టు దృక్పథాన్ని విస్తరించలేకపోవడం, ఆచరణ సంబంధమైన లోపాలు కూడా కారణం కాదా? అంటే వాటినీ ఒప్పుకోడానికి జంక కుండానే బాలగోపాల్‌పై ఈ విమర్శపెట్టవచ్చు.

నిజానికి వర్గపోరాటం మీద, మార్క్సిజం మీద 1980ల మధ్య నుండే అసంతృప్తులు, విమర్శలూ ఉన్నా వాటికి అంత సాధికారత చేకూరలేదు. కారణం ..ఆ వాదనలకు తగినంత సిద్ధాంత స్థాయి, ఆచరణ బలం లేకపోవడమే. బాలగోపాల్‌లాంటి జనరంజకత్వం, జనామోదం లేకపోవడం వల్ల వారి వాదనలు విస్తరించి నిలదొక్కుకోలేకపోయాయి. బాలగోపాల్ విప్లవాన్ని, చారిత్రకభౌతికవాదాన్ని ఎట్లా, ఏ భూమిక నుంచి విమర్శించాలో ఒక దారి చూపినవాడయ్యాడు.

ఉదాహరణకు ప్రజాస్వామిక హక్కుల కంటే, పౌరహక్కుల కంటే మానవహక్కులు సర్వామోదం పొందే , మెప్పుపొందే భావనగా తీర్చిదిద్దే క్రమంలో హింసాహింసల విషయంలో తటస్థ వైఖరి తీసుకొనే చాలా మంది

తయారయ్యారు (ఆయన విప్లవ పోరాటాల మీది అణచివేతను విప్లవాభిమానుల కంటే తీవ్రంగా వ్యతిరేకించిన సందర్భాలున్నాయి. సమస్యల్లా - హింసాహింసలపట్ల ఆలోచనా వైఖరే). మానవత అంటే ఏమిటి ? అనే తాత్విక ప్రశ్న గొప్ప మానవతావాదంగా మారిపోయింది. మానవతావాదానికి చారిత్రక స్పృహ ఉండదు. వాస్తవికతలోని క్లిష్టత గురించి పట్టించుకోదు. వర్గపక్షపాతం ఉండదు. దీని వెలుగులో మానవహక్కుల అవగాహన అత్యున్నత పరమ భావనకు దారితీసే అవకాశముంది. యిదేదో విప్లవకారుల పక్షాన నిలబడేవాళ్ల సంఖ్య తగ్గిందనే ఆందోళన వల్ల చేస్తున్న విమర్శకాదు. తెలుగు సమాజంలోని బహుముఖీన సంక్లిష్ట పరిణామాల్లోని, పోరాట క్రమాల్లోని వాస్తవికతను గుర్తించడానికి ఉదారవాదం, మానవతావాదం, తటస్థవైఖరి ఎందుకూ పనికి రావని చెప్పడానికే.రోజువారీ ప్రజా సమస్యలపట్ల తగిన వైఖరి తీసుకోడానికి , పోరాడటానికి సరిపోవచ్చు. కానీ ఆ సమస్యలన్నీ దేనికది విడిగా ఏదో ఒక కారణం వల్ల తలెత్తినవి కావని అందరికీ తెలుసు. అంటే ఒక మొత్తంలో భాగంగా ఉంటాయి. ఆ మొత్తాన్ని దాని సంక్లిష్టపరిణామాల్లో చూడటానికి పై వాదాలేవీ సరిపోవు.

కానీ మార్క్సిస్టు పద్ధతిలో అన్ని సమస్యలనూ వివరించలేమనే అభిప్రాయం బాలగోపాల్ వ్యక్తం చేసేవాడు. దానికి ప్రతిగా- ఏ విషయంలోనైనా ప్రజలకు ఏది మేలు చేస్తుంది, ఏది కీడు చేస్తుంది అని తేల్చగలిగే పద్ధతిని తయారు చేసుకొని దాని ప్రకారం పని చేయడం ప్రారంభించాడు. దీనివల్ల ఆయనలో పూర్ణత్వ భావన పూర్తిగా ఆవిరైపోయింది.

ఈ అవగాహన ప్రకారం పీడిత సమూహాల కష్టాల గురించి, హక్కుల గురించి ఎంత మాట్లాడినా (ఇవి చాలా అవసరమైనవీ, ప్రజలకు మేలు చేసేవీ) ఈ విశ్లేషణలు వర్గదోపిడీని వివరించగలిగేవి కావు. అట్లా ఉండాలని అట్లా మాట్లాడేవారు కోరుకోరు కూడా. బాలగోపాలైతే అనేక రకాలుగా పీడిత ప్రజలపై అమలవుతున్న దోపిడీ దౌర్జన్యాల గురించి చెప్తూ కూడా వర్గం అనేమాట వాడకుండా చాలా జాగ్రత్త తీసుకొనే వాడు. వాళ్లే భాష వాడుతారనే దానికంటే ..వారి పద్ధతి మీద మార్క్సిస్టు వైఖరి ఏమిటనేది చాలా ముఖ్యం.

పీడిత సమూహాల న్యాయమైన సమస్యల, ఆకాంక్షల గురించిన విశ్లేషణ వర్గవిశ్లేషణ కాజాలదు. దళితులు, మహిళలు, మత మైనారిటీలు, ఆదివాసులు, జాతులు పీడిత ప్రజలే కావచ్చుగాని వారిని ఆ పేరుతో వ్యవహరించడమంటేనే అస్తిత్వ సమూహాలుగా గుర్తించినట్టు. వీరందరి కూడిక కార్మికవర్గంకాదు. ఈ గుర్తింపు ప్రాతిపదిక మీద అణచివేతను, వివక్షను వివరించేమే వర్గ విశ్లేషణ కాదు. ఈ అస్తిత్వ సంబంధమైన సమస్యలు తప్పక పరిష్కారం కావలసినవే. అటాంటి ప్రయత్నమే వర్గపోరాటమనే భ్రమ విప్లవ శిబిరంలో సైతం ఎంతో కొంత వ్యాపించింది. ఆయా గుర్తింపు సమూసమాలను సమూలంగా తుడిచిపెట్టేసే దుర్మార్గపరిణామాలొకవైపు జరిగిపోవడం, వాటి మీద బాలగోపాల్‌లాంటి వ్యక్తి అంకిత భావంతో పని చేయడం వల్ల ఆ వ్యవహారమే వర్గ ఆచరణ అనీ, వర్గపోరాటమనీ, బాలగోపాల్‌తో పరిభాష విషయంలో తప్ప అవగాహనలో ఏ సమస్యా లేదనీ, ఆయన ఇంకో రకమైన మార్క్సిస్టు అనే సమర్థనా స్వరం సరికాదు. ఇందులో బాలగోపాల్ సాధించిన విజయం కనిపిస్తుందిగాని మార్క్సిస్టుల బలం కనిపించదు. మొదటి నుంచి బాలగోపాల్లయినా, మరెవరినైనా వారివారి సిద్ధాంత అవగాహనలపై లోతయిన విమర్శనాత్మక విశ్లేషణ ఇవ్వకపోవడం, వారిలోని బలహీనతలు , పరిమితులు మొత్తం విప్లవోద్యమాల్లో సైతం కొనసాగడం గమనించవచ్చు. దీనివల్ల విప్లవం స్థానంలోకి ప్రజాస్వామ్యం, హక్కులు, సమాన అవకాశాల్లాంటివి పోటీగా వచ్చిచేరాయి.

బాలగోపాల్ రెండోదశ ప్రయాణం మార్క్సిస్టు మూల సూత్రాలమీది అనుమానంగా, విప్లవాచరణపట్ల సందేహంగా మొదలై మార్క్సిస్టు లెనినిస్టేతర మార్క్సిస్టు సంప్రదాయాల అన్వేషణలోకి మళ్లి అక్కడి నుంచి బూర్జువా ప్రజాస్వామ్యాన్ని చేరుకోవడంతో ముగిసిపోయింది. అట్లని ఆయనను బూర్జువా మేధావి అనడానికి మనసొప్పదు.ఆయన మార్క్సిజం నుండి వైదొలగే క్రమంలో చేసిన అన్వేషణను తాను నిర్ధారించుకున్నంత గాఢంగా బైటికి చెప్పలేదు. పూర్తి స్థాయిలో మానవ హక్కుల వ్యాఖ్యాత అయ్యాక గత ఏడెనిమిదేళ్లలో ఆయనలో సిద్ధాంత విముఖత తోడవుతూ వచ్చింది. బహుశా తన ప్రతిపాదనల పట్ల తెలుగు మేథో రంగం తాననుకున్నట్లు సంభాషణ సాగించలేదనే విసుగు కూడా కారణం కావచ్చు. ఆయన తాత్వికంగా బూర్జువా ఉదారవాదానికి, అరాచకవాదానికి మధ్యలో మిగిలిపోయాడు. ఈ రెండింటి ఛాయలు కలగలిసిపోయాయి. ఆయన చేసిన తుది ప్రయాణమిది. దేనికంటే బూర్జువా ప్రజాస్వామ్యంలోని అవలక్షణాలను ఆయన విప్లవకారుల కంటే తీవ్రంగా విమర్శించాడు. దానిలోని ఏ ఆకర్షణకు వ్యక్తిగత జీవితంలో లొంగిపోయిన ఛాయలు కనిపించకపోయినా దృక్పథపరంగా ఆయనకు బూర్జువా ప్రక్రియలపట్ల నమ్మకం పెరిగింది. వాటిని అర్థవంతంగామలుచుకోవాలనే లక్ష్యం ఏర్పడింది. అధికారం, ఆధిపత్యం ఎక్కడ ఉన్నా వ్యతిరేకించాడు. ముఖ్యంగా రాజ్యాన్ని.

చారిత్రకంగా మానవజాతి ముందున్న పెట్టుబడిదారీ విధానం, సోషలిజం అనే రెండు వ్యవస్థల్లో సోషలిజం పట్ల విశ్వాసం పోవడం వల్ల ఆయన కోరుకున్న మానవత, సమానత, విలువలస్థాపన అనేవి పెట్టుబడిదారీ వ్యవస్థలో సాధించవలసిన కర్తవ్యాలుగా మిగిలిపోయాయి. ఆయన చివరి రోజు దాకా అట్టడుగు మనిషి గురించి, వారి హక్కుల ఉల్లంఘన గురించి, పాలకవర్గాలు- ఆధిపత్యశక్తులు -సామ్రాజ్యవాదం కడగట్టు మనిషిని దగా చేయడం గురించి ఆలోచించాడు. సమస్యల్లా ఆయన ఆ అట్టడుగు మనిషిని శ్రామిక వర్గంగా గుర్తించడానికి సిద్ధంగా లేకపోవడమే. ఉత్పత్తి సాధనాల మీది యాజమాన్యం, అదనపు విలువ దోపిడీ అనే వైపు నుండి పీడితులను ఒక వర్గంగా గుర్తించే మార్క్సిస్టు సంవిధానాన్ని ఆయన పూర్తిగా తిరస్కరించడమే. అందువల్లనే కార్మిక వర్గం చరిత్రలో నిర్వహించే పాత్ర పట్ల కూడా సందేహం కలిగింది. సామాజిక సిద్ధాంతకారుడిగా బాలగోపాల్ రెండు దశల ప్రయాణాన్ని , ఆరెంటి మధ్య మొదటి నుండి ఉన్న పోలికలను నిగ్గుదేల్చినప్పుడు ఆయన ఉదారవాది అని తేలుతుంది. మార్క్సిజంలోని పలు సంప్రదాయాల గురించి ఆయనే వివరించి తాను వాటిలో దేనికీ చెందనని కూడా తన భావాల ద్వారా పరోక్షంగా చెప్పుకున్నాడు.సోవియట్ విప్లవం వెలుగులో ప్రపంచమంతా విస్తరించిన మార్క్సిస్టు అవగాహన, పద్ధతులపట్ల, రాజ్యం పాత్ర పట్ల, దాని సారథ్యంలో సాగిన ప్రయోగాల పట్ల తీవ్ర విమర్శ, వ్యతిరేకత చూచినప్పుడు రాజ్య భావనను పూర్తిగా తిరస్కరించినట్టు తేలుతుంది.

ఆయన ఆలోచనా వ్యక్తిత్వం ఇప్పుడున్న సమాజంలో చిన్న చిన్న మార్పులు ఎందుకు, ఎలా అవసరమో, వాటినెలా సాధించుకోవచ్చో స్ఫూర్తినిస్తుంది. అలాంటివేవైనా సాధించే మనుషులు ఎలాంటి విలువలతో ఉండాలో కూడా ఆయన ఒక నమూనాగా నిలిచాడు. మనిషి పరిపూర్ణుడవుతాడా? అసలు పరిపూర్ణ మానవుడు కావడమంటే ఏమిటి? జీవితంలోని ఖాళీలను మనిషి చైతన్యవంతంగా ఎట్లా నింపుకుంటాడు? దీనికి చరిత్రకూ ఉండే సంబంధం ఏమిటి ? అనే తాత్విక ప్రశ్నలు వేసుకొని బహుశా చివరిదాకా కూడా అలాంటి అంతరన్వేషణలో ఉన్న బాలగోపాల్ పెట్టుబడిదారీ సిద్ధాంత చట్రాలను, పరిష్కారాలను తిరస్కరించలేకపోవడం మన కాలంలోని అతి పెద్ద విషాదకర వాస్తవం.

వ్యాసం ◆ సారథి

# పౌరహక్కుల పోరాట యోధుడు

పౌరహక్కుల వుద్యమ నేత కామ్రేడ్ బాలగోపాల్ యిటీవల తీవ్ర అనారోగ్యం పాలై కన్నుమూశారు. ఆయన మరణం ద్వారా ప్రజాతంత్ర విప్లవోద్యమం ఒక ఉత్తమ నాయకున్ని కోల్పోయింది. భారత విప్లవోద్యమానికి యిది తీరని లోటు. ఆయన కార్యరంగం పౌరహక్కులకు మాత్రమే పరిమితం కాలేదు. అది ఆదివాసులపై దోపిడీ, మైనారిటీలపై మతోన్మాదుల దాడులు, 'సెజ్' నిర్వాసితుల దీనస్థితి, హోటల్ కార్మికుల పని పరిస్థితులు వంటి అనేక సమస్యలకు విస్తరించింది. విస్తృత ప్రజాబాహుళ్యపు సమస్యలపై స్పందించి వాటి సాధనకోసం ఆయన తాను యేర్పరిచిన 'మానవ హక్కుల' వేదిక సభ్యుల్ని సమాయత్తపరచటంలో కీలకమైన పాత్ర నిర్వహించారు.

ఆయన మరణం ఎంతో మందిని కృంగదీసింది. మరెంతో మందిని కంటతడి పెట్టించింది. హైద్రాబాద్ వీధుల్లోని హోటల్ వర్కర్ మొదలుకొని కొండకోనల్లోని గిరిజనుడివరకు, ఫాక్టరీ కార్మికుని నించి ప్రభుత్వోద్యోగి వరకు, భూములు కోల్పోయిన నిరుపేద రైతు నించి విప్లవాభిమానుల దాకా వేలాదిమంది ఆయన అంతిమ యాత్రలో పాల్గొని ఘనమైన నివాళులర్పించారు.

బాలగోపాల్ గురించి, ఆర్ఇసిలో చదివి విశాఖ ఇంజనీరింగ్ కాలేజిలో చేరిన రాడికల్ విద్యార్థి నాయకుడు అజాద్, భారత కమ్యూనిస్టు రాజకుమార్ చెప్పగా మొదట విన్నాను. బాలగోపాల్ బాగా చదువుతాడనీ, గణితశాస్త్ర ప్రావీణ్యుడనీ, మేధావి అనీ, ఆయన పాల్గొనటం వల్ల వరంగల్ వుద్యమం ఇంకా బలపడగలదనీ చెప్పారు. ఎమర్జెన్సీ తదనంతర కాలంలో జగిత్యాల జైత్రయాత్ర నాంది పలుకగా రైతాంగ పోరాటాలు అలలు అలలుగా విస్తరించాయి. రాష్ట్రవ్యాప్తంగా రాడికల్ విద్యార్థి యువజన వుద్యమాలు వెల్లువలా పెల్లుబికాయి. ఫ్యూడల్ దోపిడీ పీడనలను ఎదిరించిన రైతుకూలీలు పోరాటాలతో విస్తృతంగా సమీకృతులయ్యారు. వివిధ తరగుతులకు చెందిన ప్రజలు ప్రజాసంఘాలతో సంఘటితపడ్డారు. ఈ రైతాంగ, విద్యార్థి యువజన వుద్యమాలే బాలగోపాల్‌ను బలంగా ప్రభావితం చేశాయి. ఆనాటినుంచి ఆయన ఆ పోరాటాలను బలపరిచి వాటికి అండగా నిలిచి వాటికి మద్దత్తు కూడగట్టే అవిశ్రాంతి కృషిలో నిమగ్నమయ్యారు. ఇక వెనుతిరిగి చూడలేదు.

పల్లెలకు తరలివెళ్ళిన విద్యార్థి యువజనలందరూ ఎంతో ఆసక్తితో అధ్యయనం చేసినటువంటి బహుళ ప్రజాదరణ పొందినటువంటి "వ్యవసాయ విప్లవం" పుస్తకాన్ని ఆయన ఎనభయ్యవ దశకం ప్రారంభంలోనే ఇంగ్లీషులోకి అనువదించారు. ఆ పుస్తకం ప్రధానంగా చిత్రించిన తెలంగాణ గ్రామసీమల సాంఘిక ఆర్థిక జీవితంతో బాలగోపాల్‌కు అంతగా పరిచయం లేనందున అనువాదంలో ఇంకా సమగ్రత తీసుకురావాల్సిన అవసరం రీత్యా అది ఇంగ్లీషులో ప్రచురించబడలేదు. ఆ పుస్తకంతోపాటు వుద్యమ తొలిరోజుల్లో వచ్చిన పుస్తకాల ఆధారంగా ఆయన ఇంగ్లీషులో కొన్ని వ్యాసాలు రాశారు. అవి 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' ఆంగ్ల పత్రికలో ప్రచురితమయ్యాయి. పీడిత ప్రజల వుద్యమాల పట్ల ఆయన కనబరిచిన శ్రద్ధాసక్తులకూ, ఉత్సాహానికీ యివి ఒక ప్రబల నిదర్శనం.

కాంగ్రెసు ప్రభుత్వ హయంలోనూ, ఆ తరువాత ప్రత్యేకించి ఎన్టీఆర్ తెలుగుదేశం ప్రభుత్వ హయంలోనూ అమలయిన తీవ్ర నిర్బంధకాండను ఎదిరించడం ద్వారా బాలగోపాల్ కొద్ది కాలంలోనే పౌరహక్కుల వుద్యమ నాయకుడిగా యావత్ ఆంధ్ర ప్రజానీకానికి పరిచితులయ్యారు. ఆంధ్ర రాష్ట్ర పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఆయన వుద్యమానికి అగ్రభాగాన నిలిచి దానిని ముందుకు తీసుకుపోయారు. రామనాథం, లక్ష్మారెడ్డి వంటి పౌరహక్కుల సంఘ నాయకులు పోలీసుల హత్యాకాండలో నేలకొరిగినా చలించకుండా మరింత పట్టుదలతో ఆయన పోరాడారు. ఆయన లేని నిర్ధారణ కమిటీ లేదు. పరిశీలించని ఎన్‌కౌంటర్ స్థలం లేదు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఆగడాలను పత్రికా ప్రకటనల ద్వారా నిమిషాల మీద వెలుగులోకి తీసుకువచ్చేవారు. అంతేగాక వరంగల్ జిల్లా వుద్యమంతో సన్నిహిత సంబంధాలు యేర్పరచుకుని వుద్యమ అవసరాల కనుగుణంగా పౌరహక్కుల రంగంలో గణనీయమైన కృషిచేశారు. బాలగోపాల్ రాజకీయ జీవితం ఉత్తర తెలంగాణ విప్లవోద్యమంతోనూ ప్రత్యేకించి వరంగల్ విప్లవోద్యమంతోనూ విడదీయరాని విధంగా పెనవేసుకొని పోయింది. ఈ క్రమంలో ఆయన తీవ్ర నిర్బంధాలకూ, అనేక కష్ట నష్టాలకు గురయ్యారు.

ఇరవై ఏళ్ళకింద 1989లో అనుకుంటాను. రహస్య జీవితం గడుపుతున్న కాలంలో నేను ఆయనను ఒకమారు మాత్రమే కలుసుకున్నాను. ఆయనను చూడటం అదే మొదటిసారి. ఎదురుకాల్పుల హత్యాకాండతోపాటు రైతుకూలీలు విద్యార్థి యువజనులు, కార్మికులు తీవ్రమైన నిర్బంధకాండకు గురికాగా యావత్తు రాష్ట్రం అట్టుడికిపోతున్న సమయమది. పౌరహక్కుల సంఘం, విరసం, జననాట్యమండలి మొదలగుసంస్థలన్నీ పీపుల్స్‌వార్ పార్టీ అనుబంధ సంస్థలేననీ పాలకవర్గాలు అదే పనిగా ప్రచారం చేస్తూ ఆయా సంఘాల సభ్యులను, కార్యకర్తలను అక్రమ కేసులో యిరికించి నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. విప్లవోద్యమానికి నాయకత్వం వహించే కార్మికవర్గ పార్టీ వివిధ ప్రజాసంఘాలను విప్లవ లక్ష్యం దిశగా నడిపించటం తన కర్తవ్యంగా భావిస్తున్నప్పటికీ పాలకవర్గాలు చేస్తున్న ప్రచారంలో యధార్థమేమీలేదు. ప్రజా సంఘాల నాయకులకు బహిరంగ సభల గురించి ఉత్తరాలు పంపాలన్నా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సివచ్చేది. అవసరమైన ముఖ్య విషయాలు సైతం నోటిమాట ద్వారా కబురుపెట్టక తప్పేదికాదు. ఇక నేరుగా కలవటమంటే ఎంతో వ్యయప్రయాసలతోనూ, రిస్కుతో కూడిన పని. విషయం బయటపడితే ప్రజా సంఘాల నాయకులకు మరిన్ని వేధింపులు, మరిన్ని అక్రమకేసులు తప్పవు. ఇలాంటి పరిస్థితులలో పౌరహక్కుల సంఘానికి సంబంధించిన లీడింగ్ టీమ్ రాష్ట్ర కమిటీ నాయకత్వాన్ని కలుసుకోవాలనుకుంటున్నట్టు కబురు వచ్చింది. ఆనాటి నిర్బంధ పరిస్థితులు అననుకూలంగా వున్నా వారితో సమావేశం అవసరమని భావించి తదనుగుణమైన యేర్పాట్లు చేశాం. బాలగోపాల్‌ను రిసీవ్ చేసుకోవటానికి నేను వెళ్ళాను. కాలికి మామూలు హవాయి స్లిప్పర్స్, మాసిపోయిన దుస్తులు, చింపిరి జుత్తు, పెరిగిన గడ్డంతో వున్న ఆయనను చూసినప్పుడు ఒకింత ఆశ్చర్యపోయాను. ప్రజలతో మమేకం కావటం కోసం కృత్రిమ వేషధారణకు పూనుకున్న మా కాలేజి రోజులు గుర్తొచ్చాయి. అలాంటి కృత్రిమ పద్ధతులనే ఇతను ఆశ్రయించటం లేదుకదా అనే సందేహం. దీనినే ఆ తరువాత ఒక మిత్రుని దగ్గర ప్రస్తావించినప్పుడు, "లేదండీ! ఆయన నిజంగానే తన దుస్తులు గురించిగానీ, తన వ్యక్తిగత అవసరాల గురించిగానీ పట్టించుకోరు" అని సమాధానమిచ్చారు. ఇక ఆయనతో పరిచయం యేర్పడగానే తాను గత పదిరోజులుగా ఏయే సమావేశాల్లో, ఏయే పట్టణాల్లో వరుసగా పాల్గొంటూవచ్చిందీ, ఆ సమావేశాల్ల ఏ యే చర్చలు, తీర్మానాలు జరిగాయో ఏకధాటిన అరగంటకు పైగా మాటాడారు. తీరిక లేని ఆ వరుస కార్యక్రమాల్లో ఆయన కనబరిచిన ఉత్సాహం, కార్యదీక్ష ఎన్నటికీ మరువలేనిది.

ఆ సమావేశానికి పౌ.హ.సంఘం నించి బాలగోపాల్‌తో పాటు ఇద్ద

డాక్టరు , ఒక లాయరు, మరో ఇద్దరు ప్రొఫెసర్లు మొత్తం అయిదుగురు హాజరయ్యారు. పార్టీ రాష్ట్రకమిటీ నించి కామ్రేడ్ కె.ఎస్.నేనూ మరొక కామ్రేడ్ హాజరయ్యాం. చాలా ఏళ్ళు గడిచిపోయాయి గనుక సమావేశం చర్చలు వివరంగా చెప్పలేను. పౌ.హ.సంఘం నాయకులు వెలిబుచ్చిన అభిప్రాయాల సారాంశం ఒకటే. ఆంధ్రరాష్ట్ర విప్లవోద్యమంలో ,టెలిఫోన్ ఆర్టిసి బస్సుల విధ్వంసం వంటి దుందుడుకు పద్ధతులు చోటుచేసుకోవడం వల్ల ప్రజల నించి పార్టీ దూరమయ్యే ప్రమాదం యేర్పడింది. పార్టీ దీనిని సమీక్షించుకుని సవరించుకోవాలి అని. వారి అభిప్రాయాలు విన్న కామ్రేడ్ కె.ఎస్. ఉత్తర తెలంగాణ, దండకారణ్యంలో కొనసాగుతున్న రైతాంగ విద్యార్థి యువజన వుద్యమాల గురించీ, వాటి పూర్వరంగం గురించీ, అప్పటికప్పుడు యాదృచ్ఛికంగా వుద్యమక్రమంలో ఉద్భవిస్తున్న పోరాట నిర్మాణ రూపాల గురించీ వివరించారు. కె.ఎస్. వివరణకు విన్న తరువాత కూడా పౌ.హ. సంఘం నాయకులతో వున్న సందేహాలు తొలగిపోలేదు. అందుకు పరిష్కార మార్గంగా కె.ఎస్. ఒక సూచన చేశారు. "పౌ.హ.సంఘం నాయకులు తమ అభిప్రాయాలను ఒక డాక్యుమెంటు రూపంలో పార్టీలో చర్చకు పెట్టాలి. ప్రతిపార్టీ సభ్యునికి దానిని అందజేసి విస్తృతంగా చర్చించిన తరువాత భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకుని సమిష్టిగా ముందుకుసాగాలి". ఇదీ ఆయన చేసిన సూచన. బాలగోపాల్ గారు యీ ప్రతిపాదనకు వెంటనే సానుకూలంగా స్పందించారు. . మూడు రోజులు జరుపాలనుకున్న సమావేశం కొన్ని అనివార్యకారణాల వల్ల ఒక రోజుకే ముగించాల్సి వచ్చినా, ఆ ఒక రోజు చర్చ అంతటిలో బాలగోపాల్ చొరవతోనూ, చురుకుగానూ పాల్గొన్నారు. బాలగోపాల్ నిర్దిష్టమైన ఖచ్చితమైన అభిప్రాయాలు కలిగిన కామ్రేడ్ అనే భావం యేర్పడింది. ఆ తరువాత కొంత కాలానికే పార్టీ తీవ్ర అంతర్గత సంక్షోభంలో కూరుకుపోవడం వల్ల ఆ డాక్యుమెంటును డ్రాఫ్ట్ చేయించడంలో పార్టీ నించి ప్రయత్నం జరుగలేదు. వారు కూడా అలాంటి ప్రయత్నం చేసినట్లులేదు.

బాలగోపాల్ ప్రజల సమస్యలపై విస్తృతంగా వ్యాసాలు రాశారు. ఆయన రచనల్లో సమకాలీన సాహిత్యాన్ని విశ్లేషిస్తూ రాసిన విమర్శనాయుత వ్యాసాలు అనేకం వున్నాయి. నేను కొన్ని వ్యాసాలు రాసాను. అవి 'సృజన' 'అరుణతార' పత్రికలలో ప్రచురితమయ్యాయి. ఆ వ్యాసాలు యివి:1. శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం సమీక్షా వ్యాసంలో కొన్ని సూత్రీకరణలు సరైనవేనా? (సృజన జూన్ 1985) 2. మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతం ఒక పరిశీలన (అరుణతార జూన్ 1994, ఇదే వ్యాసం జనసాహితి ప్రచురణగా కూడా వెలువడింది) 3. దశాబ్దాల నాటి ఫ్రాయిడిజానికి తిరోగమనం (అరుణతార జనవరి 1995). చివరి వ్యాసం కొనసాగింపుగా నేను రాసిన "త్రిపురనేని వ్యాసం-దొడ్డివారిలో ఫ్రాయిడిజం" వ్యాసం అరుణతార మూడు సంచికలలో వరుసగా ప్రచురితమయింది (సెప్టెంబర్ 1995 నించి డిసెంబర్ 1995సంచిక వరకు). కారణాలేమైనప్పటికీ బాలగోపాల్ యీవ్యాసాలకు సమాధానమివ్వలేదు. ఒక రోజు ఆయనను కలిసి ఇవన్నీ చర్చించాలనుకున్నాను. కానీ అది తీరని కోరికగానే మిగిలిపోయింది. బాలగోపాల్ వ్యాసాలను పరిశీలిస్తే మార్క్సిస్టు సిద్ధాంత రాజకీయ అంశాలను అధ్యయనం చేయటంలో ఆయన గట్టి కృషి చేశారనేది స్పష్టమవుతుంది. ఆయనలోని అధ్యయనాసక్తి ప్రశంసనీయమైనది. విప్లవోద్యమం నిర్మాణంలోగానీ, దాన్ని పురోగమింపచేయటంలోగానీ మార్క్సిస్టు సిద్ధాంత, రాజకీయ అంశాల అధ్యయనానికి వున్న ప్రాముఖ్యత గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు.

మానవ హక్కుల విషయంలోనూ, సమసమాజం సాధించే క్రమంలో రష్యా, చైనా, కమ్యూనిస్టులు ఎలాంటి తప్పులు చేసారనే విషయంలోనూ బాలగోపాల్ గారికి కొన్ని బలమైన అభిప్రాయాలున్నా, వాటిని అందరు అంగీకరించలేకపోయినా, పీడిత ప్రజలకు, కష్టజీవులకు బాసటగా నిలవటంలో ఆయన చేసిన కృషి అద్వితీయమైనది, అనన్యసామాన్యమైనది. సరైన సిద్ధాంతంతోపాటు సరైన పనిపద్ధతులు రూపొందించుకోలేకపోతే లక్ష్యాన్ని చేరుకోలేం. పని పద్ధతులలో అత్యున్నతమైన ప్రావీణ్యత, సమర్థతలతోపాటు దీక్షాదక్షతలు చాలా అవసరం. ఈ దీక్షాదక్షతలనే 'మిషనరీ జీల్' అంటాం. నిర్దిష్టమైన అర్థంలోగాకపోయినా సాధారణంగా 'బోల్షివిక్ స్పిరిట్'గా కొనియాడుతాం. అలాంటి సడలని దీక్షకు ప్రతీక బాలగోపాల్. అలాంటి దీక్షే లేకపోతే పొరుగున వున్న కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రాలలో క్రిష్టియన్ మైనారిటీలపై సంఘ్ పరివార్ జరిపిన పైశాచిక దాడులను వెలుగులోకి తీసుకురావటం సాధ్యమయ్యేదికాదు. అంతేగాదు పంద్రాగస్టు నాటినించి మన దేశ రాజకీయ రంగంలో రావణాకాష్టంలాగా కాశ్మీరు రగులుతూనే ఉంది. దానిమీద దృష్టిసారించారు బాలగోపాల్. కాశ్మీరు పుర్వాపరాలు విస్తృతంగా పరిశీలించి, లోతుపాతులు ఆకళింపు చేసుకున్నాడు. అక్కడ దినపత్రికలు కూడా వదలలేదు. 'కల్లోలలోయ' అని ఆయన రాసిన పుస్తకం చాలామందికి కాశ్మీరు గురించి గొప్ప కనువిప్పు.

రష్యా స్టోలిపిన్ నిర్బంధకాలాన్ని తలిపిస్తున్న నేటి ఆంధ్ర రాష్ట్ర రాజకీయ పరిస్థితులలో బాలగోపాల్ పీడిత ప్రజలతో మమేకమై వారితో సన్నిహిత సంబంధాలు యేర్పరుచుకుని వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేయటం విశేషం. అంతేగాక సమగ్రమైన విషయ పరిజ్ఞానంతో ఆయన వివిధ సభల్లో యిచ్చిన వుపన్యాసాలు, చేసిన నిశితమైన విశ్లేషణలు పాలకవర్గాలు నిజ స్వభావాన్నీ, చట్టాల డొల్లతనాన్నీ, రాజ్యాంగంలోని హక్కుల బూటకత్వాన్నీ అవగతంచేసుకోవటానికి తోడ్పడ్డాయి. బాలగోపాల్ పనిపద్ధతులు పీడిత ప్రజల సేవకు అంకితమయిన ప్రతి కార్యకర్తకూ, ప్రతి సభ్యునికీ ఆదర్శంగా నిలుస్తాయి. కష్టజీవులకు బాసటగా నిలిచి ఆయన చేసిన నిర్విరామమైన కృషి కొనసాగింపుగా ఎవరు ఏ రంగంలో వున్నా ప్రజలతో సజీవమైన సంబంధాలు పెంపొందించుకోవాలి. పీడిత ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం తన జీవితాన్నే అర్పించిన విప్లవ మేధావి కార్యశీలి బాలగోపాల్‌కు అదే నిజమైన విప్లవ నివాళి.

❖

## రచయితలకు విజ్ఞప్తి

అరుణతారకు రచనలు పంపండి.

కథలు, కవిత్వం, పుస్తక సమీక్షలు, విమర్శా వ్యాసాలు, సామాజిక రాజకీయ సిద్ధాంత వ్యాసాలు, యితర భాషల్లోనుండి తెలుగు పాఠకులకు అవసరమైన అనువాదాలు పంపించండి.

అరుణతారలో అచ్చవుతున్న రచనలపై ఉత్తరాలు రాయండి. రచనలను మెచ్చుకునే ఉత్తరాలకంటే గుణదోషచర్చలు చేయగల ఉత్తరాలు పత్రిక ప్రమాణాలు పెంచుతాయి. పాఠకుల విమర్శనాత్మక ఉత్తరాలు పత్రికా నిర్వహణకూ తోడ్పడుతాయి.

మీ రచనలు అరుణతార సాహిత్య, సిద్ధాంత స్థాయిని పెంచుతాయని నమ్ముతూ - - సంపాదకవర్గం

వ్యాసం

◆ వరవరరావు

# 'నీ ప్రాభవం మమ్మల్ని వదలలేదు'

'మనం ఒకర్నొకరం ఎక్కువగా అర్థం చేసుకున్నాం. ఈ మనుషులిట్లా పరస్పరం ఎందుకింత అర్థం చేసుకుంటారో కదా - ఈ దుఃఖానికి, క్షోభకు అంతటికీ ఇదే కారణమేమో' అంటాడు 'కాగజ్ కే ఫూల్' సినిమాలో గురుదత్.

ఐదు రోజులుగా బాలగోపాల్ జ్ఞాపకాలతో నాకు ఎంత ప్రయత్నించినా దుఃఖం ఉపశమించడం లేదు. ముప్పై ఏళ్ల క్రితం ఇదే అక్టోబర్ నెలలో చిన్నాలు హత్య తర్వాత మా ఇంటికి వచ్చి పరిచయం చేసుకున్న బాలగోపాల్ '80 ఆరంభానికే మా హృదయాల్లో చోటు చేసుకున్నాడు. అప్పటి నుంచి '92 దాకా మమ్మల్ని ప్రభావితం చేసిన, ఫాసినేట్ చేసిన వ్యక్తిత్వం బాలగోపాల్‌ది. సృజన, విరసం, రాడికల్ విద్యార్థి ఉద్యమం, కాకతీయ విశ్వవిద్యాలయం, ఎపిసిఎల్‌సి, ప్రజాసంఘాలు, ఉద్యమాలు - అన్నిటి సమాహారమైన వరంగల్, జైలు, బాగ్‌లింగంపల్లి - మా కమిట్‌మెంట్‌కు నిరుపహతి స్థలాలు.

1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో ఆదివాసులపై కాల్పుల తర్వాత సృజన 'సాహితీ మిత్రులు'లో ఇంద్రవెల్లి ప్రత్యేక సంచిక రూపొందించడంలో బాలగోపాల్ చాలా కృషి చేసాడు. ఆయనకు సామాజిక బృందాల్లో ఆదివాసుల పట్ల ఉన్న ఆసక్తికి ఇంద్రవెల్లి ఒక తక్షణ సందర్భమైంది. ఇంద్రవెల్లి గిరిజన సహాయ నిధి ఏర్పాటు చేసాం. '82 జనవరిలో ఆ డబ్బు మా దృష్టికి వచ్చిన మృతుల కుటుంబాలకు అందించడానికి నేను, ఆయన, సీతారామరావు పిట్టబొంగరం, పిప్పల్‌దరి, పాండుపురం మొదలైన గ్రామాలు రెండు రోజులు తిరిగాం. రాత్రిళ్లు చలిలో గోండులైనా గొంగళ్లు కప్పుకొని చలి మంటలు వేసుకుని కూర్చున్నారు. కానీ ఆయన బనీను కూడా వేయని షర్టు - చలిమంటలకు దూరంగా బాధితులను అడిగి రాసుకుంటూ. నేను, సీతారామరావు మేం తీసుకువెళ్లిన స్వెటర్లు, షాలులు చాలనట్లు గోండులిచ్చిన గొంగళ్లు కప్పుకొని రాత్రంతా చలిమంటల దగ్గర కూర్చున్నాం. మొదటిసారి ఈయనింత మొండివాడే అనుకున్నాం.

ఇంద్రవెల్లి స్థూపావిష్కరణ సభలో ఆయన అల్లం రాజయ్య, సాహు రాసిన కొమురం భీం నవల ఆవిష్కరించి, వలసవాద, నైజాం వ్యతిరేక ఆదివాసీ స్వతంత్ర సాయుధ పోరాటాల చరిత్ర వివరించాడు. ఇంకో సంవత్సరం నిర్బంధం పెరిగి ఇంద్రవెల్లి సంస్మరణ సభ పెట్టడమే కష్టమైనపుడు ఎం.పి.గా ఉన్న జార్జి ఫెర్నాండెస్‌ను పిలిచాం. వందలాదిమంది పోలీసుల పహరా మధ్యన సభ. జార్జి ఫెర్నాండెస్‌ను నాగపూర్‌లో ఫ్లైట్ దించుకొని పంకజ్ తీసుకొచ్చాడు. తిరుగు ప్రయాణంలో పంకజ్ కారులో ఫెర్నాండెస్, బాలగోపాల్, నేను గుడిహత్నూర్ మీదుగా నిర్మల్‌కు వెళ్లాం. ఫెర్నాండెస్‌ను నాందేడ్‌కు పంపించడానికి. గుడిహత్నూర్ దాటి ఘాట్‌రోడ్ ఎక్కగానే కొండల మీంచి ధోతులు కట్టుకొని చొక్కాలు వేసుకున్న (గోండు ఆహార్యంలో) పోలీసులు మా కారుపై బండరాళ్లు దొర్లించారు. కారు ముందు అద్దాలు పగిలాయి గానీ పంకజ్‌దత్ తెలివిగా పక్కగా తప్పించాడు. కాని ఆ స్థితప్రజ్ఞుడు బాలగోపాల్ ఘాట్‌రోడ్ దాబాలో రొట్టె, పప్పు బాగుంటాయని ఫెర్నాండెస్‌ను ఊరించి, ఇంక చావు గండం తప్పింది కనుక తిని వెళ్దామని దింపాడు. మరో సంవత్సరం మనోరంజన్ మొహంతీతో పాటు అరెస్టయిన అనుభవాలు మొహంతీ రాయనే రాసాడు. ఆ తర్వాత కరువు సందర్భంగా గానీ, మలేరియా, అతిసార వ్యాధుల సందర్భంగా గానీ, ఎన్‌కౌంటర్ల సందర్భంగా గానీ ఆయన ఆదిలాబాదు జిల్లాకు ఎన్నిమార్లు వెళ్లాడో లెక్కేలేదు.

మా కళ్లముందే జరిగే విషయాలను ఆయన వలె కొత్త చూపుతో చూడలేకపోవడం, ఆయన చెప్పిన తర్వాత అట్లా నాకు ఎందుకు తోచలేదు అనిపించడం ఇప్పటికీ ఉన్నదే. అట్లని మేం ఎల్లవేళలా ఏకీభవించామని కాదు. నాకు రాజకీయ విధేయత వ్యసనమైన కొద్దీ ఆ తేడా నాకు తెలుస్తూనే ఉన్నది. 'మీమీ రాజకీయ ప్రాతినిధ్యాలతో కాదు మీరు ఎపిసిఎల్‌సిలో పని చేయాల్సింది' - అన్నాడు '83లో ఖమ్మంలో కార్యదర్శి అయ్యాక. నేను కన్విన్సు అయి ఇంక కార్యవర్గ సమావేశాలకు వెళ్లడం మానేసి డాక్టర్ రామనాథం గారికి చెప్పాను - నేనింక ఎపిసిఎల్‌సిలో కొనసాగను- అని. ఆయన కన్విన్సు కాలేదు. 'బాలగోపాల్ పౌరహక్కుల ఉద్యమంలో తనదయిన మార్గాన్ని వేస్తాడు' అన్నాడు ఎన్.కె. పీపుల్స్ వార్ పని చేస్తున్న ప్రాంతాల్లో జరుగుతున్న నిర్బంధం గురించి ముందుగా నిజనిర్ధారణకు వెళ్లాలన్న నా ప్రతిపాదనపై కూడా మా మధ్య '82లో కొంచెం నిష్ఠురంగా చర్చ జరిగింది. మళ్లీ '93 అక్టోబర్ దీపావళి ముందు బెంగళూరులో అరెస్టు చేసి పులి అంజయ్య, భాగ్యలను వరంగల్ జిల్లా పీచరకు తీసుకువచ్చి 'ఎన్‌కౌంటర్' చేసినపుడు ప్రెస్‌క్లబ్‌లో కలిసి నేనాయనతో నిజనిర్ధారణకు వెళ్లాలని సూచించాను. బయటి రాష్ట్రంలో కదా అన్నాడు. ఎన్‌కౌంటర్ చూపుతున్నది పీచరలో కదా అన్నాను. ఇక్కడ అరెస్ట్ ఆధారాలు ఏమి దొరుకుతాయన్నాడు. ఇక్కడి నుంచి బయల్దేరి అక్కడికో, అక్కడి నుంచి మొదలుపెట్టి ఇక్కడికో శోధిస్తే ఏమయినా తేలవచ్చు కదా అన్నాను. ఆయన విసుక్కోలేదు. కన్విన్స్ అయినట్లు కనిపించాడు. డైరీ చూడాలి. ఎపుడెట్లా వీలవుతుందో అన్నాడు. అయితే అప్పటికే ఆయన కొన్ని ప్రాథమ్యాలు నిర్ణయించుకున్నాడు - సాయుధ పోరాటాన్ని ఎంచుకొని రాజ్యాధికారం కోసం తుపాకులు చేపట్టిన వాళ్లు 'ఎన్‌కౌంటర్' సమయంలో ఎట్లా దొరికారన్నది విచారించడం పౌరహక్కుల సంఘం పరిధియే గానీ, రాజ్యానికీ, విప్లవ పార్టీకీ మధ్యన సాయుధ సంఘర్షణ కారణంగా నిరాయుధులు, అంతకు ముందు కూడా ఏ ఆరోపణల కేసులు కూడా లేనివాళ్లు, బహుశా నక్సలైటు రాజకీయ విశ్వాస, విధేయతలు కూడా లేనివాళ్లు (మామూలు భాషలో వీళ్లను 'అమాయకులు' అంటుంటాం) కూడా 'ఎన్‌కౌంటర్' అయినపుడు అదే పౌరహక్కుల సంఘం చేపట్టవలసిన అంశం అని ఆయన భావించినట్లున్నాడు. జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఎపిసిఎల్‌సి ప్రధాన కార్యదర్శిగా ఆయన రూపొందించి ఇచ్చిన మూడువందల పై చిలుకు ఎన్‌కౌంటర్ల జాబితాలో ఈ అవగాహనతో కూడిన వింగడింపు కనిపిస్తుంది. మానవ హక్కుల కమిషన్ కూడా సరిగ్గా అటువంటి ఐదు కేసుల్లోనే విచారణకు సిఫార్సు చేసింది.

1984 డిసెంబర్‌లో రాడికల్ యువజన సంఘం కార్యకర్త కొడవటి సుదర్శన్‌ను పోలీసులు అరెస్ట్ చేసి కాజీపేట పోలీసు స్టేషన్‌లో చిత్రహింసలు పెట్టి చంపేసారు. ములుగు అడవుల్లోకి తీసుకవెళ్లి దహనం చేసారు. కానీ 'ఎన్‌కౌంటర్' ప్రకటించలేదు. ఇది మొట్టమొదటి 'మిస్సింగ్' కేసు. ఈ విషయంలో నేను ముందుగా వెళ్లి కాజీపేట, సోమిడి, కడిపికొండలో నిజానిజాలు తెలుసుకుని, ప్రజలకు చెప్పడం కూడ బాలగోపాల్‌కు సరియైన పద్ధతి అనిపించలేదు. ఈ 'మిస్సింగ్'కు నిరసనగా రాడికల్స్ 18 జనవరి 1985న 'బంద్' పిలుపు ఇచ్చారు. ఆ రోజు మిల్ కాలనీ పోలీసు ఇన్‌స్పెక్టర్ ఇంటిపై రాడికల్స్ బాంబువేసారు. వెంటనే నన్ను, డాక్టర్ రామనాథం, సీతారామరావులను పోలీసులు అరెస్టు చేసారు. మా ముగ్గురినీ జైల్లో నక్సల్స్ బారక్‌లోనే పెట్టారు. ఆ రోజు నుంచి 21 దాకా ఊళ్లో లేని బాలగోపాల్‌ను 21న అరెస్టు చేసి జైల్లో సాధారణ ఖైదీలతోపాటు పెట్టారు. డాక్టర్ గారికి గుండెపోటు రావడం వల్ల ఆసుపత్రికి వెళ్లి అక్కడి నుంచి బెయిల్‌పై విడుదలయ్యాడు. ఫిబ్రవరి 8న మా ఇద్దరికి బెయిల్ వచ్చింది గానీ పోలీసులు మళ్లీ అరెస్టు చేయడానికి బయట కాపు కాస్తున్నారని తెలిసి మేం మా వ్యక్తిగత పూచీలు పెట్టలేదు. అప్పుడొక వారం రోజులు జైల్లో ఆయనతోపాటు సాధారణ ఖైదీల బ్యారక్‌లో ఉన్నాను. అక్కడాయన జబ్బులతో ఉన్న వాళ్లకు, వృద్ధులకు తాను స్వయంగా సేవ చేయడం చూసాను. శ్రీశ్రీ 'చరమరాత్రి' కథలు

అనువదించాడు. కాని ఆ తర్వాత ఆయన గదిమీద పోలీసులు రెయిడ్ చేసినపుడు ఆయన టైపు రైటరు, రచనలు, పుస్తకాలు అన్నీ ఎత్తుకపోయారు. చైనా శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం పై ఆయన వ్యాసానికి రంగనాయకమ్మ గారు ఇచ్చిన జవాబు కూడ అందులోనే పోయింది.

నేను '84 జనవరిలో మాకివలసలో విరసం కార్యదర్శిగా ఎన్నికయ్యానని తెలిసి ఆయన కొంచెం ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే అప్పటివరకు విరసం కార్యదర్శులుగా ఎన్నికయిన వాళ్లందరూ రాజకీయ విశ్వాసాల గురించి కన్నా రచయితలుగా ఎక్కువ ప్రసిద్ధులు. ఆయన విరసంకు రాజకీయ విశ్వాసాలు బలంగా ఉన్నప్పటికీ రచయితలుగా ప్రసిద్ధులైన వారు కార్యదర్శిగా ఉండాలని కోరుకున్నాడు.

నేను మిల్ కాలనీ పోలీసు స్టేషన్ కేసులో మళ్లీ అరెస్టయ్యాను. ఎందుకంటే బాంబులు కలిగి ఉండడం, పంచదం, వేయడం - అని మూడు వేరు వేరు కేసులు పెట్టారు. ఒక్కొక్కదానికి ఒక్కొక్కసారి అరెస్టు చేసే పద్ధతి ఎంచుకున్నారు. ఆయనకిదంతా అబద్ధం అని తెలుసు గనుక ఇంక నన్ను డిఫెండ్ చేయాలని ఎంచుకున్నాడు. 'బాంబులు నేను పంచలేదు. భావాలు పంచలేదు' అని నేను రాసిన 'రిఫ్లెక్షన్' అనే కవితను, అంతకు ముందే '84లో రాసిన 'కసాయి' కవితను ఇంగ్లిష్‌లోకి అనువాదం చేసి 'ఇలస్ట్రేటెడ్ వీక్లీ' వాళ్లు అడిగితే ఇచ్చాడు.

1985 సెప్టెంబర్ 2న ఎస్.ఐ. యాదగిరి రెడ్డిని పీపుల్స్‌వార్ దళం చంపినపుడు పోలీసులు బాలగోపాల్ హనుమకొండలో లేడనుకున్నారు. ఆ రాత్రి ఆయన హనుమకొండ బస్‌స్టాండ్ ఎదురుగా తన గదిలో చదువుకుంటూ, రాసుకుంటూ ప్రశాంతంగా ఉంటే బయట మెట్ల మీద ఇల్లు గలామె ఆయనకు తెలియకుండానే కాపలా కాసింది. ఆ మర్నాడు ఆయన యథావిధిగా ఎదురుగా ఉన్న ఏనుగుల గడ్డ మీద చాయ్ తాగడానికి పోయాడు. అది ఎం.జి.ఎం.కు ఎగువన హనుమకొండలో ఉంది. యాదగిరి రెడ్డి మృతదేహం పోస్ట్‌మార్టమ్ జరిగిన ఎం.జి.ఎం.కు దిగువన ఇల్లు, క్లినిక్ ఉన్న డాక్టర్ రామనాథం గారిని ఊరేగింపు మిషతో చంపడానికి ఎంచుకున్నారు పోలీసులు. వాళ్లే ఇప్పుడు బాలగోపాల్ సహజ మరణం చెందాడు గనుక ఆయనపై అపార గౌరవ భావాన్ని ప్రదర్శిస్తున్నారు. వాళ్లే బాలగోపాల్ గురించి 'ఎక్కడ శవం కనబడితే అక్కడ వాలే రాబందు' అని వ్యాఖ్యానించినపుడు నేను ఒక కవిత రాసాను.

*ప్రాణాన్నంటి*
*ప్రాణాన్ని నిలుపుకునే గుణమూ*
*పరిరక్షించుకునే గుణమూ ఉంటాయి*
*ప్రాణాన్ని హరించే వ్రణమూ*
*మోహరించే రణమూ ఉంటాయి*
*జీవితం రాటుదేలే కొద్దీ*
*మృత్యువును నిర్జించే కొద్దీ*
*అమరత్వానికి చేరువవుతాడు మనిషి*
*మృత్యువుకు శత్రువవుతుంటాడు మనిషి*
*మనుషుల్ని కాల్చుక తినే వ్యవస్థ*
*శవాల కోసం*
*శ్మశాన భద్రతను కనిపెట్టుకొని ఉంటుంది*
*అక్కడ రాబందుకు*
*మనిషి బంధువూ*
*రాబందుగానే కనిపిస్తాడు*

ఎస్.ఐ. యాదగిరి రెడ్డి హత్య కేసులో కూడా మా ఇద్దరినీ ముద్దాయిలుగా చూపారు. అక్కడి నుంచీ రాంనగర్ కుట్ర కేసులో నన్ను ముద్దాయిగా చూపుతూ, 'భవిష్యత్ చిత్రపటం' కవితా సంకలనాన్ని నిషేధించడాన్ని రాజ్యం చేస్తున్న ఒక దురాలోచనగా ఆయన భావించాడు. రచయితను కేవలం ఒక నేరస్తునిగా సమాజం ముందు నిలబెట్టే ఈ ధోరణిపై మౌనం సరికాదనుకున్నట్టున్నాడు. అందుకే 1968లో నా 'చలినెగళ్లు' కవితా సంకలనాన్ని రాచమల్లు రామచంద్రారెడ్డి ప్రోత్సహించినంత ఔదార్యంతో బాలగోపాల్ 'భవిష్యత్ చిత్రపటం' నిషేధం గురించీ టాడా కింద రాంనగర్ కుట్ర కేసులో నన్ను జైల్లో ఉంచడం గురించీ ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ఒక విశ్లేషణాత్మకమైన వ్యాసం రాసాడు. అప్పటికీ ఇప్పటికీ అది నేనాయన నా కవిత్వానికిచ్చిన ఉదారమైన సర్టిఫికెట్‌గా అపురూపంగా హృదయంలో పదిలపరుచుకున్నాను.

'86-89 నేను సికింద్రాబాద్ జైల్లో ఉన్నకాలం నాకాయనను మరింత దగ్గర చేసింది. ఊళ్లో ఉంటే ప్రతి వాయిదాకు వచ్చి నన్ను కలిసేవాడు. నా ఒంటరితనాన్ని, సంక్షోభాన్ని పంచుకొని ఆశ్వాసం ఇచ్చేవాడు. తాను కూడా వరంగల్‌కు వెళ్లలేని భయంకర పరిస్థితులున్నా ఎప్పటికప్పుడు నా కుటుంబ యోగక్షేమాలను పట్టించుకునేవాడు. 1986 నవంబర్‌లో ఎపిసిఎల్‌సి కరీంనగర్ నాయకుడు జాపా లక్ష్మారెడ్డిని మఫ్టీలో వచ్చిన పోలీసు అధికారి చంపిన తర్వాత నా కేసు వాయిదా రోజు కోర్టు ఆవరణలో నా ఎస్కార్ట్ వ్యాన్ దగ్గరికి బాలగోపాల్ వచ్చాడు. 'ఎందుకిట్లా తిరుగుతున్నారు? పైగా ఒక్కరు' అన్నాను ఎంతో ఆందోళనగా. 'నాకేమవుతుంది. నేనీ మధ్యన జస్టిస్ కృష్ణయ్యర్ మాట్లాడిన సభకు అధ్యక్షత వహించాను. తెలుసా?' అన్నాడు. 'పత్రికలో చదివాను. కాని జస్టిస్ కృష్ణయ్యర్ కూడ గౌరవించే వ్యక్తి విలువేమిటో తుపాకి గుండుకు తెలియదు కదా' అన్నాను. దువ్వని నెత్తిలోకి పొడవాటి వేళ్లు దూర్చుకొని నవ్వి ఊరుకున్నాడు.

'87 చివరి రోజుల్లో చింతపెల్లి అడవుల్లో నక్సలైట్లకు ఆశ్రయమిస్తున్నారనే నెపంతో, కక్షతో గ్రేహౌండ్స్ ఆరువందల గుత్తికోయల గుడిసెలు తగులబెట్టారు. బాలగోపాల్ ఈ దురంతాన్ని పీపుల్స్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి ప్రపంచం దృష్టికి తేవాలని అక్కడికి ఎన్నోసార్లు తిరిగాడు. ఆ కమిటీ అధ్యక్షుడు మృణాల్‌సేన్‌ను కలవడానికి కలకత్తాకు పోయినపుడే విశాఖపట్నంలో చలసాని ప్రసాద్‌కు కనిపించకపోవడం వల్ల మొదటిసారి 'కిడ్నాప్' ఆందోళన కలిగింది. చింతపల్లి అడవులకు నిజనిర్ధారణకు వెళ్లివస్తుంటే రోడ్డు వేస్తున్న రోడ్డు రోలర్ నుంచి సలసల కాగుతున్న తారు వి.ఎస్. కృష్ణ నడుపుతున్న స్కూటర్ వెనుక కూర్చొని వస్తున్న ఆయన భుజం నుంచి పిడికిలి వరకు ధారకట్టింది. అట్లే తారు అంటిన ప్రకటన కాగితాలు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఇస్తూ పత్రికా విలేకరులను అట్లా ఇవ్వాల్సి వచ్చినందుకు క్షమించమన్నాడట. విశాఖపట్నం చేరుకొని, హైదరాబాద్‌కు వచ్చాడు. చెయ్యి బొబ్బలెక్కి చర్మం కమలడం కృష్ణక్క చూసింది. వెంటనే ఒక ఇంటర్వ్యూలో మా వాళ్ల ద్వారా నాకిది తెలిసింది. కోర్టు వాయిదా రోజు నన్ను కలవడానికి వచ్చాడు. పోలీసులు ఎస్కార్టు వ్యాన్ దగ్గరికి రానివ్వలేదు. కోర్టులో అనుమతి దొరకలేదు. అసలు మేం మాట్లాడుకునే, సరిగా చూసుకునే అవకాశం కూడా లేకుండా పోలీసులు ఆయనను అడ్డగించి, నన్ను జైలుకు తీసుకువచ్చారు. ఆ రాత్రి ఆయన కోసం రాసిందే ఈ 'బరువు దించుకున్న గీతం' -

*గోదావరి కన్నీరు పెట్టుకొని*
*సముద్రంతో చెప్పుకున్న కడుపు చిచ్చుముచ్చట లేపో*
*చెప్దామని నాకు నువు తూర్పుగాలిలా వచ్చావు*
*ఆ ప్రాణ వాయువుల కోసమే ఆర్తిగొన్న*
*చెట్టువలె కదలలేక నోరు తెరిచాను*
*మన మధ్య ఏ అదృశ్య హస్తం వచ్చి నిలిచింది*
*మనమీద మనమే నిషేధాలు విధించుకొని*
*మౌనం వహిస్తున్నామా*
*నీకు కనిపించకూడదని నా కనుల గోదారులను*
*కంఠంలో మింగాను*
*దినమంతా గొంతులో కన్నీళ్లు కుచ్చుకుంటున్నాయి*
*ఇంక ఈ రాత్రి సముద్రం గోదావరిని*

*తన ఒడిలోకి తీసుకొని ఓదారుస్తున్న రాత్రి*
*సరం తప్పిన స్వరాలను వెక్కిళ్లతో సవరించుకొని*
*అదిమిపట్టిన హార్మోనియం లాంటి హృదయాన్ని*
*రెండు చేతులా ఊదుకొని*
*తలచుకొని తలచుకొని వచ్చిన దుఃఖగీతంతో*
*మొహమంతా కడుక్కున్నాను*
*ఇపుడింక కంఠంలో కంటకాలు లేవు*
*కళ్లల్లో లేవు*
*నోళ్లు తెరచుకొని మాట్లాడుకోలేకపోయిన*
*మన మధ్య అగాధ కాల వారధిపై*
*ఇదిగో ఈ బరువు దించుకున్న గీతాన్ని దించాను*
*ఇది నీ దగ్గరికి పక్షి అయి వస్తుందో పువ్వయి వస్తుందో*
*పిచ్చిగాలిగానే వస్తుందో*
*మృదువుగా పలకరిస్తావు కదూ*

చింతపల్లి గృహదహనాలపై ఇద్దరు రిటైర్డ్ జడ్జీలతో పీపుల్స్ ట్రిబ్యునల్ నిర్వహించాడు. పోలీసులు మఫ్టీలో వచ్చి నానా బీభత్సం సృష్టించి భగ్నం చేసారు. 'అంకురం' సినిమాలో ఈ సంఘటనను, డాక్టర్ రామనాథం గారి హత్యను సృజనాత్మకంగా కలిపి తీసిన దృశ్యం కన్నా మించి రాయలేం. చింతపల్లి గృహదహనాలపై బాలగోపాల్ రాసిన నిజనిర్ధారణ రిపోర్టు ఎంత సాధికారికంగా ఉన్నదంటే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ తరపున వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో పరిచ్ఛేదాలకు పరిచ్ఛేదాలే ఎస్. రామచంద్రరావుగారు ఎత్తి రాసారు.

పన్నెండేళ్లు గడిచిపోయినవి. 'ముక్తకంఠం'లో ఉన్న ఈ కవిత తనకొరకు రాసిందేనని నేను ఎప్పుడూ ఆయనకు చెప్పలేదు. ఇప్పుడెట్లాగూ చెప్పలేను. కాని అప్పుడూ ఇప్పుడూ అన్ని విధాల ఒకటే మానసిక స్థితి. ఇపుడు దేశంలోని అడివంతా ఇంద్రవెల్లే, చింతపల్లే. బాలగోపాల్ నడకంతా విస్తరించిన అదే అడవిలో.

నిజామాబాద్ జిల్లాలో ఒక ఇన్‌ఫార్మర్‌ను చంపబోయి పీపుల్స్‌వార్ సభ్యుడొకరు కండక్టర్‌నో మరొకరినో చంపాడు. అది ఆయన ఖండించాడు. ఆ తర్వాత కోర్టుకు వచ్చినపుడు 'ఉద్దిష్ట వ్యక్తి కానపుడు ఇక నుంచి ఖండించాలనుకున్నాను' అన్నాడు. 'పొరపాట్లు జరుగవచ్చును కదా' అన్నాను. 'ప్రాణం విలువ తెలువాలి గదా' అన్నాడు. 'వీళ్లు తమ ప్రాణాలు ఎంత తృణప్రాయంగా ఇవ్వగలరో, ఎదుటి వారి ప్రాణాల పట్ల కూడ అంత నిర్లక్ష్యంగా ఉండగలరు' అన్నాడు. నేను పొడిగించలేదు. కానీ ప్రాణి అస్తిత్వానికి, మనిషి ఆలోచనలు, అనుభూతికి, కమ్యూనిస్టు చైతన్యానికి కమ్యూనిస్టులు అత్యంత విలువ ఇస్తారే, ఇది నిజమా అని ఆందోళన చెందాను. ఆ తర్వాత కాలంలో చర్చలు ముగిసి ఎన్‌కౌంటర్లు, ప్రతిఘటన మొదలయ్యాక ఇన్‌ఫార్మర్ల రహస్య హత్య గురించి తన పేరుతో వచ్చిన ప్రకటన పోలీసులు ఇచ్చిందేనని రామకృష్ణ 2005 ఏప్రిల్ 9న ఇచ్చిన ప్రకటన స్పిరిట్ కె.ఎస్. వ్యవసాయ విప్లవం అంటే సర్పయాగం కాదని చెప్పిన దాని సాంద్ర వ్యక్తీకరణ కాదా. 'ప్రజలకు, విప్లవానికి హాని చేయని వారికెవరికైనా, వాళ్లు పోలీసులయినా సరే హాని చేయడం విప్లవాచరణ కాదని, అది విప్లవానికి నష్టమ'ని పార్టీ కార్యదర్శి స్వయంగా ప్రకటించాడే.

ఇందిరాగాంధీ హత్య తర్వాత సిఖ్ఖుల ఊచకోత, గృహదహనాలపై పియుడిఆర్ వేసిన 'హూ ఆర్‌ది గిల్టీ' పుస్తకం రెండో ముద్రణలో పంజాబ్ మిలిటెంట్లు చేస్తున్న చర్యలను కూడ ఖండిస్తూ ఒక ముందుమాట చేర్చారు. ఆ రోజుల్లో పియుడిఆర్ కార్యదర్శి సుదేష్ వైద్ వరంగల్‌కు వచ్చింది. డాక్టర్ రామనాథం గారి క్లినిక్ పైన ఎపిసిఎల్‌సి యాక్టివిస్టుల మీటింగు కోసమే నిర్మించిన హాల్‌లో సమావేశం జరిగింది. అపుడామెతో ప్రైవేట్ హింసకైనా కారణం రాజ్యహింసనే అనే వాదానికి నాయకత్వం వహించిన వాళ్లు బాలగోపాల్, రామనాథం గార్లు. అట్లే కరీంనగర్ జిల్లా గూడూరుకు చెందిన భూస్వామి ఎం.ఎల్.సి. కేశవరెడ్డిని పీపుల్స్‌వార్ దళం చంపినపుడు కూడా నిజనిర్ధారణ చేయాలన్న పియుసిఎల్ రామమూర్తి గారితో విభేదించింది కూడా బాలగోపాలే. 'చీకటి కోణాలు' వ్యాసం రాసేనాటికి ఆయన అవగాహనలో మార్పు వచ్చింది.

సృజన ప్రచురణలు సాధన 'రాగో' నవలకు ఆయనను ముందుమాట రాయమని అడిగాను. అది రాసి పంపుతూ ఒక కవరింగ్ లెటర్ పెట్టారు. 'నా 'ముందుమాట' రచయిత విశ్వాసాలకు పూర్తిగా భిన్నంగా ఉన్నట్లున్నది. ముందుమాటగా వేయడం భావ్యం కాదనిపిస్తోంది. అందుకని విడిగా వ్యాసంగా అచ్చువేయదలుచుకుంటే వేయండి' అని. అట్లా ఆయవ సూచన మేరకే అది 'అరుణతార' కిచ్చాను. '93 సెప్టెంబర్ అరుణతారలో 'చరిత్ర - మనిషి - మార్క్సిజం' గా అచ్చయిన వ్యాసంలో ఆయన ప్రతిపాదించిన మానవ స్వభావ నిర్ణాయకతపై ఈనాటికీ చర్చ జరుగుతోంది.

అట్లే 'ఏడోసారా కథ' కు ముందుమాటలో కూడ ఆయన అవగాహనలో మార్పు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

'89 మార్చిలో నేను విడుదలయిన రాత్రే నన్ను ఆర్.కె. ఇంట్లో కలవడానికి వచ్చిన బాలగోపాల్ బహుశా నా జీవితంలో తొలిసారిగా అనేక విషయాలపై మనసువిప్పి మాట్లాడాడు. ఎపిసిఎల్‌సి నిర్మాణ విషయాలు కూడా పంచుకున్నాడు. ఆ రాత్రే ఆయన నెల్లూరులో జరిగే ఎపిసిఎల్‌సి మహాసభలకు పోతున్నాడు. బొజ్జాతారకం, హరగోపాల్‌లను సంస్థలోకి తేదల్చుకున్నామని చెప్పాడు. ఎందువల్లనో ఇపుడు చెప్పలేను గానీ ఆ రాత్రి కొన్ని గంటలు నా ముందు ఆయన తెరిచిన పుస్తకమై పరుచుకున్నాడు. అప్పుడే 'సృజన సంపాదకీయాలు' పుస్తకంగా వేయాలని చాలాకాలంగా కోరుతున్న ఆర్.కె. అభ్యర్థనను అంగీకరించమని 'ఆదేశించాడు'. ఇంక సృజన ఎప్పటికీ రాదనుకున్నప్పుడు, నా తర్వాతగానీ అచ్చు కావడానికి వీలు లేదనుకున్న సృజన సంపాదకీయాలు అట్లా 'పర్‌స్పెక్టివ్స్' ప్రచురణలుగా వచ్చాయి.

కొద్ది రోజులకే ఖమ్మం జిల్లాలో ఆయన కిడ్నాప్ అయ్యాడు. దేశమంతా అట్టుడికి పోయింది. కిడ్నాప్ అయిన ఎపి ఎస్పీ ఐదుగురు పోలీసులను వదలమని విజ్ఞప్తి చేయవలసిందిగా వాళ్లాయనను బలవంత పెట్టారట. 'ఏ పనయినా స్వేచ్ఛలో చేస్తాను తప్ప నిర్బంధించి చేయించలేరు' అన్నాడట. కళ్లకు గంతలు కట్టి వెహికల్‌లో తీసుకుపోతుంటే ప్రతి పల్లె ప్రతిపాట ఖమ్మం జిల్లాలో తాను పోల్చుకున్నానన్నాడు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఆఫీసు ముందు వదిలి పెట్టినాక ఆ సాయంత్రం బాగ్‌లింగంపల్లిలో మా యింటికి వచ్చాడు. మా ఇంట్లోనే ఉండి పొమ్మన్నాం. ఆ తర్వాత కాలంలో అమరుడయిన వీరన్నను ఆయన ఎక్కడికి వెళ్లినా తోడుగా పొమ్మన్నాం. ఒకటి రెండు రోజులు భరించి 'నాకు బాడీగార్డును పెట్టారా' అని కోపగించుకొని అసలు మా ఇంటికే రాకుండా పోయాడు. ఆ కిడ్నాప్ మర్నాడు ప్రెస్ క్లబ్‌లో ఆయన ప్రసంగం ఆయన అవగాహన పరిణతిని తెలియ చేస్తుంది. '86 ఆరంభంలో మీసా కింద అరెస్టయి విడుదలయ్యాక 'జెంటిల్మన్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'నా పేరుకు ముందు డాక్టర్ అనే మాట చేర్చడం ఎవరి అక్రమ అరెస్టునయినా ఖండించడానికి పనికొస్తుందనుకుంటే, ఐ ఆమ్ ఫర్ ఇట్' అన్నాడు. ఇండియా టుడే పియుసిఎల్ ఇచ్చిన ఇరవై వేల రూపాయలు తన 'సాహస ప్రజాస్వామిక కృషి'కి గుర్తింపుగా కన్న చింతపల్లి గృహదహనాలపై ట్రిబ్యునల్ నిర్వహించే ఖర్చుల కోసం తీసుకున్నాడు.

'నా పుట్టుక, రంగు, చదువు కూడా నేను విముక్తం కావడానికి దోహదం చేసాయంటేనే ఈ దేశంలో రాజ్యాంగస్ఫూర్తి అమలు కాకపోడమే కాదు, సమాజానికి కూడా ప్రజాస్వామ్య సంస్కృతి మనం అందించలేకపోయామనడానికి నిదర్శనం. ఇంతకు ముందూ, ఇక ముందూ కిడ్నాప్‌కు గురయిన, గురయ్యే అనామకులు కూడా విముక్తం కాగలిగిననాడు మనం మన వీపు చరచుకోవచ్చు.' ఇవే మాటలు కాకున్నా, ఇదే స్పిరిట్.

1990 ఏప్రిల్‌లో జన నాట్యమండలి వాళ్లతోపాటు నేను, నా సహచరి హేమలత, బాలగోపాల్, వసంతలక్ష్మి బస్సు తీసుకొని ఇంద్రవెల్లి, బెల్లంపల్లి, గోదావరి ఖని సభలకు తిరిగాం. పల్లీలు, జామపండ్లు కొనుక్కుని తింటూ నేలమీదనే పడుకుంటూ, ఎంతో సరదాగా కబుర్లు చెప్తూ. '90 మేలో తలపెట్టిన రైతు కూలీ సంఘం సభల ముందు రాష్ట్రంలో 'మిస్సింగు' కేసుల వివరాలు సేకరించడానికి బాలగోపాల్, వసంతలక్ష్మి, హేమలను తోడు తీసుకొని తెలంగాణ అంతటా తిరిగాడు. జస్టిస్ టి.ఎల్.ఎన్. రెడ్డి 'మిస్సింగు' కేసుల మీద చేసిన విచారణ సందర్భంగా ఆయనతో కలిసి తిరిగాను. తమ రక్త బంధువులు అదృశ్యమైన వాళ్లు కనీసం కూడు గుడ్డ గూడుకు నోచుకొని గౌరవంగా బతకగలిగితే బాగుండునని ఆయన ఆశించాడు. ఆయన 1987లోనే ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో 'మిస్సింగ్' అని ఒక వ్యాసం రాసాడు. (ఆ తర్వాత కాలంలో లాటిన్ అమెరికన్ నవల 'విడోస్' తెలుగులో 'మిస్సింగ్' పేరుతో వెలువడినపుడు బాలగోపాల్ అద్భుతమైన ముందుమాట రాసాడు). తమ 'మనిషి అదృశ్య'మయితే ఆ ఆందోళన ఎలా ఉంటుందో 'మిస్సింగ్'లో ప్రపంచ భాషలో (సం)గ్రహించిన బాలగోపాల్‌కు అని నేను '87 ఫిబ్రవరిలోనే 'అదృశ్యం' అని ఒక కవిత రాసాను. (చాల ప్రచారాన్ని పొంది, భారతీయ భాషలన్నింట్లోకి అనువాదమైన నా 'డార్ఘావు' కవిత కూడ 'ఈ మాటతో పాటు నేనిన్నాళ్లూ చెప్పలేకపోతున్న భావాలకు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లేఖ, ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో వ్యాసం ద్వారా ఒక స్పష్టత నిచ్చిన బాలగోపాల్ ప్రేరణ' వల్ల రాసిందే. ఆ తర్వాత కాలంలో ఆయన ఢిల్లీకి వెళ్తూ రైల్లో ఇంగ్లిష్ చేసి జెఎన్‌యు విద్యార్థులకు ఇచ్చి వచ్చాడట.) 1980-90 ఒక దశాబ్దకాలం ఆయన ప్రజా ఉద్యమాలలో చేసిన కృషికి గుర్తింపుగానే ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం వరంగల్ మహాసభలకు మే 1990లో ఆయనను ప్రధాన అతిథిగా పిలవాలని ఏకగ్రీవంగా నిర్ణయించాం.

1991 ఆగస్ట్‌లో మా సహజ పెళ్లికి మా కుటుంబం కాక ఒకే ఒక్క అతిథి బాలగోపాల్. ఆయన అతిథే గాని గెస్ట్ కాదు. ఆశ్చర్యమేమిటంటే 1991 డిసెంబర్‌లో మేము మలక్‌పేట లక్ష్మి అపార్ట్‌మెంట్స్‌కు మారాక బాలగోపాల్ ఒక్కసారి కూడా మా ఇంటికి వచ్చినట్లు లేదు. నేను కూడ రెడ్‌హిల్స్‌లో ఆయన ఉండగా ఒకటి రెండుసార్లు ఆయన ఇంటికి వెళ్లానేమోగానీ ఎప్పుడూ సభల్లోనో, కోర్టులోనో కలుసుకోవడం, లేదా పనుల మీద ఫోన్లో మాట్లాడుకోవడం.

1993లో ఎపిసిఎల్‌సి కర్నూలు మహాసభల కన్న ముందు మా ఇంట్లో అప్పుడు ఎపిసిఎల్‌సి లో పనిచేస్తున్న రవిశర్మ, ప్రొఫెసర్ లక్ష్మణ్‌లను చూసిన ఒక వ్యక్తి ఆయనను ఎపిసిఎల్‌సి కార్యదర్శి పదవి నుంచి తొలగించడానికి మా ఇంట్లో కుట్ర జరుగుతున్నదని ఆయనకు చెప్పినట్లున్నాడు. ఆయన మనసు కష్టపెట్టుకున్నాడు. నేనెప్పుడూ ఆ అపోహ తొలగించే ప్రయత్నం చేయలేదు. బాలగోపాల్ సంస్కృతి సంజాయిషీలను, వివరణలను ఇష్టపడదని తెలుసు. ఆయన 1998 దాకా ఎపిసిఎల్‌సి కార్యదర్శిగా కొనసాగాడనుకుంటాను.

2005 మేలో నేను తీవ్ర సంక్షోభానికి గురయినపుడు 1975 నుంచీ ఆత్మీయుడయిన ఒక కామ్రేడ్‌కు లేఖ రాస్తూ ఇట్లా ముగించాను -

*మన ఆకాంక్షలే కాదు*
*అప్పుడప్పుడు మన భయాలూ రుజువవుతుంటాయి*
*ద్వేషం చీకటి కాదు చుక్కల రాత్రి అనుకున్న చోట*
*అది స్నేహాకాంక్షలో కరిగిపోయినా*
*మళ్లీ గడ్డకట్టి*
*మన హితం మనకే ఒప్పజెప్పగలదు*
*ఆకాశాన్ని విభజించగలదు*
*విజయం కోసం చేసే యజ్ఞం కన్నా మనిషికి*
*విలువల కోసం చేసే పోరాటం గీటురాయి*
*యుద్ధాలు జయాపజయాలతో ముగుస్తాయి*
*పోరాటాలు హృదయస్పందనలున్నంత కాలం ఉంటాయి*
*వైరుధ్యాల సంఘర్షణలో విలువలు లయించి*
*మళ్లా కొత్త విలువలు పుడతాయి*
*విలువలు కొండవాలులో కనిపించని*
*సెలఏరు వంటివి*
*ఉద్యమ జలపాతంలా అవి*
*విద్యుత్తేజంతో నిను ఆవహించవు*
*సూర్యాస్తమయం తర్వాత*
*చీకట్లో నీ చూపులతో ఊదుకొని*
*నీ చైతన్య తైలంతో వెలిగించుకునే దారి లాంటివి*
*విలువలు*
*మాట చాటున దాగిన మనసులాంటివి*
*పనిలో ప్రతిఫలించే సృజనలాంటివి*
*ప్రభావమే గీటురాయి తప్ప*
*ఉత్సవాలు చేసుకునే గెలుపు విలువలకుండదు*
*నిరంతర ఘర్షణే తప్ప*
*ముగింపు లేని జీవిత సత్యం విలువలు*

దీనికి జవాబుగా ఆ కామ్రేడ్ నిర్మాణం ఉద్యమం విలువల అంతస్సంబంధాన్ని నేనిట్లా చూడడం బాలగోపాల్ వలె ఆలోచించడమేనని కొట్టిపారేసాడు. నిజానికి 1975 నుంచీ బాలగోపాల్ ఆయనకు కూడా ఆత్మీయుడే. ఇద్దరూ సూరపనేని జనార్దన్ ఉత్తేజంతో ఉద్యమంలోకి వచ్చినవాళ్లే.

అవును కదూ - మనకు ఒకరికొకరం అర్థం కావడం వల్ల కాదు, పీడితవర్గ పక్షపాతం, చైతన్యం ఉండి కూడ అపార్థాలకు గురికావడం కూడా దుఃఖానికి, క్షోభకు కారణమవుతుంది.

❖

# స్వీకారం

1. **ఇప్పపూలు**
   గిరిజన సంచార తెగల కథలు
   సంపాదకులు : ప్రొ. జయధీర్ తిరుమల రావు
   జీవన్
   ప్రతిభా ప్రచురణలు, ఖమ్మం, వెల : రూ.150/-
   ప్రతులకు : జీవన 4-1-25, రోటరీ నగర్
   ఖమ్మం - 507 002.
2. **భావ విప్లవకారుడు కొడవటిగంటి**
   సాహిత్య సమాలోచన
   పునర్ముద్రణ విరసం వెల : రూ.10/-
   అన్ని పుస్తకాల షాపుల్లో దొరుకుతుంది.
3. **శిఖామణి కవిత్వం**
   తాత్విక సౌందర్యం
   రచన : సౌభాగ్య వెల 95/-
   నందిని పబ్లికేషన్స్
   అన్ని పుస్తకాల షాపుల్లో దొరుకుతుంది.

**వ్యాసం**

◆ ప్రొ. బుర్రా రాములు

# నిన్ను యాది జేసుకుంటూ- నీ దారిలో నడుస్తాం!

**బాలగోపాల్....**

నిన్ను స్మరించుకొనే పరిస్థితి ఎందుకొచ్చిందయ్యా?

నీవు విమర్శను వ్యతిరేకించలేదు, పొగడ్తను స్వీకరించలేదు. నీవు చేసిందాన్నే నీకు చెప్పినా కూడా 'పొగడ్తలువద్దు, మనం చేయాల్సిందే చేశామంటివి'.

గాంధీ విలువలను ఆచరించిన అసాధారణ వ్యక్తి నరేన్ చావు ద్వారా మనకి దూరమయ్యాడని బాధపడితివిగదా? అలాంటి అసాధారణ వ్యక్తుల, శక్తుల కూడికైన నిన్ను స్మరించుకునే సరిపోల్చుకునే మాకు తెలియజేయకుండానే వెళ్ళిపోతివి. మాకు నీవు నడిచిన పథం తప్ప నిన్ను వర్ణించే పదం లేదాయె.

బాలగోపాల్! నీకు యాది మరుపులేదు, అయినా గుర్తుచేస్తాము. మహదేవపూర్ అడవిలోని బొర్లగూడెం గ్రామంలోని ఓ గిరిజన రైతు ఎద్దుని చంపిన రాజ్యసాయుధ బలగాల సంఘటనపై నిజనిర్ధారణ కోసమని ప్రశ్నించే నీ అడుగు మొదలై మొన్నటి దసరా నాడు సిరోంచ-సోమన్ పల్లి ఆదివాసీల ఎన్‌కౌంటర్ దాకా సాగె. సిరోంచకు ఆ పక్కన గోదావరిలో ఇంద్రావతి దునుక్కుంటూ కలిసే దగ్గర దమ్మూర్‌కి వెళ్ళి గాయపడ్డవాళ్ళని ఈ దీపావళి నాడు కలిసి ఆ ఎన్‌కౌంటర్ ఎలా జరిగిందో నిర్ధారణ చేయాలంటివి. అట్లా కల్పిస్తివి. నువ్వు మొదటిసారి మాట తప్పితివి కదా!

ప్రజా ఉద్యమాలపై రాజ్యం చేసే దమనకాండ రూపాలను ఎత్తిచూపే, ప్రశ్నించే పౌరహక్కుల సంఘాన్ని జనజీవితంలోని అన్నిరకాల ఆధిపత్యాలను ప్రశ్నించే సంఘంగా విస్తరించితివే. ఒక్క రాజ్యహింసనే కాదు, కుటుంబ, లింగ, కుల,మత, ప్రాంత ధోరణులను, సందర్భాలను పట్టించుకోవాలంటే ఇంత పనిభారం పౌరహక్కుల సంఘం మోయలేదన్న వారితో దూరం జరిగి 'మానవ హక్కుల వేదిక' ను ఏర్పాటు చేసితివే. ఆధిపత్యం ఏ రూపంలో ఉన్నా, సారంలో ఏ రుచిలో ఉన్నా, పాలకుల విపరీతమైనా, ప్రకృతి వైపరీత్యమైనా జోక్యంచేసుకోవడం మానవహక్కుల వేదిక కార్యక్రమమంటివి! పాలకవర్గాల అభివృద్ధి ప్రక్రియ విధ్వంస ప్రక్రియేననీ, అది ప్రజాస్వామ్య స్థాపన కాదు, ప్రజా జీవిత విస్థాపనకు, ప్రకృతిని విధ్వంసం చేసి భవిష్యత్ తరాల జీవన అవకాశాలను నాశనం చేయ పూనుకున్నదని, దాన్ని ఎదుర్కోవటం కూడా హక్కుల కార్యక్షేత్రమని అనంతపురం మహాసభలో మానవహక్కుల ఎజెండాలో చెప్పి నాలుగురోజులు కాకముందే నాలుగు దిక్కుల్లో కలిసిపోతివే!

బాలగోపాల్, నీవెన్నిసార్లు చెప్పలేదు, మనం ఒకరిని మెప్పించడానికో నొప్పించడానికో లేదా ఒప్పించడానికో ఈ తొవ్వను ఎంచుకోలేదని? మనకి వ్యక్తిగత కాంక్షలు, కక్షలు ఉండవు, ఉండకూడదనీ, మనం ఏ ఒక్కరి పక్షమోకాదనీ, మనం 'మనుషులుగా జీవించలేని స్థితి' పైన్నే పోరాటం చేస్తున్నామనీ, అందుకు మనకు విలువల సంబంధమే కాని ప్రయోజన సంబంధం లేదని చెప్పితివే!

నీ మీద రాజ్యం ఎన్నిరూపాల్లో నిర్బంధం మోపినా, అక్రమ కేసులు పెట్టి ఒంటరి సెల్‌లో బంధించినా, దాడులు చేసి, చేయించి చంపాలనుకున్నా ఒక్కక్షణం కూడా ఈ హక్కుల తొవ్వను విడిచిపెట్టకుండా ఉన్నావే!

వరంగల్‌లో మొదలైన నీ హక్కుల పోరాట యాత్ర భారతదేశ ఎల్లలు దాటేసింది. భారత ప్రజల గుండెల నిండా నీవేనే!

మనం ఎలా సహజీవనం గడపాలో చెప్పితివి. మానవీయ సంబంధాలకోసం మనం ఇప్పుడు సాహసంగా నిలువాలని చెప్పితివే! నీ సహచర్యం మాలో సహనాన్నీ, సాహసాన్ని పెంచినా గాని నీవులేని నిజాన్ని ఎలా సహించమంటావ్? నీవు లేకుండానే సహనంతో సాహసాన్ని చేసే సందర్భాన్ని ఊహించలేకున్నామే, భరించలేకున్నామే! అయినా నీ సహచర అనుచరబంధాలు ప్రజాస్వామ్య శక్తిగా మాలో ఆవిష్కరించి, సహనం సాహసం పెనవేసుకుని, నీ మార్గాన్నే సహజంగానే ముందుకి పోతామని చెబుతున్నాం బాలగోపాల్!

నీ గురించి ఎవరేమనుకుంటున్నారో నువ్వు ఊహించి ఉండలేవు. అయినా నీ గురించి నువ్వు ఎప్పుడయినా పట్టించుకున్నావా? 'తన-పర' లేరనీ, 'చాటు-నేటు' లేవని, నువ్వు జీవించింది నీ కోసం కాదని ప్రతిక్షణం ఆచరణ అద్దంలో చూపిస్తూనే ఉంటివి. జనం కోసమే ఇంత చేసినవాడివి, కనీసం ఒక్కక్షణమన్నా 'నీ' గురించి ఆలోచించి ఉంటే మాకు కనబడకుండా పోదువా?

బాలగోపాల్

"ఓ చారిత్రక అవసరానికోసం పుట్టించబడినవాడివా?"

"ఓ చారిత్రక పరిస్థితి నిన్ను పుట్టించిందా?"

"నీలోని ఓ సహజలక్షణం ఈ చారిత్రక అవసరాన్ని తీర్చిందా?" అని ఈ నేలని నమ్ముకున్నవాళ్ళు, ఈ నేలని అమ్ముకునేవాళ్ళు సంభాషించుకుంటున్నారు. వాళ్ళకి ఏం చెప్పమంటావ్?

బాలగోపాల్,

నీకిదీ తెలిసిందో లేదో- స్వప్రయోజనం కోసం స్వాభిమానాన్నీ, నేలనే కాదు జాతినీ తాకట్టుపెట్టే మేధావులు నువ్వు బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినావు కాబట్టే మార్క్సిజంలో వెలుతులున్నాయని చెప్పి అవి తేల్చకుండా పోయావని అంటున్నారు.

బాలగోపాల్,

ఏదేని సంఘటన జరిగితే అందులో హక్కుల ఉల్లంఘనను నిర్ధారణ చేయకుండా కనీసం అంచనా కూడా ప్రకటించడానికి ఒప్పుకోని నీ నైజం తెలిసికూడా ఈ ఇజాల కబ్జాదారులు నిన్ను శంకించి వారి పరనింద - ఆత్మస్తుతి తీరుని మరోసారి ప్రకటించుకున్నారనుకోవాలా? చెప్పు, బాలగోపాల్, చెప్పు... నువ్వెలా చెబుతావ్? మేమే చెబుతాం. శరీరాన్ని విస్మరించి జీవించిన నిన్ను తూచడానికి బ్రాహ్మణీయ భావజాల కుల తరాజులు, పాలకవర్గ కాంటాలు పక్కనపెట్టి మానవీయ విలువల ప్రజాధర్మ కాంటా దగ్గరకి రమ్మని అంటాం. ఇది అత్యంత సహనంతో అంటున్నదే సుమా!

❖

**వ్యాసం** ◆ **పడాల జోగారావు**

# ఒక శిఖరం

బాలగోపాల్! ఏమిటీ ఇతని ప్రత్యేకత?

మేధావులు అందలాలెక్కి సంపద పోగేసుకొనే అవకాశాలుండి కూడా పాలక పక్షం వహించకుండా ప్రజల పక్షం వహించి నిబద్ధతతో నిలవడంలోనే ప్రత్యేకత ఉంది.

బాలగోపాల్‌ను మొదటి సారి చూసి, ఆయన మాటలు విన్నది ఇలికిపురంలో ఒకప్పుడు వున్న ఒరియక్కలు గడ్డపాకల్లో అనుకుంటాను. అప్పటికి శ్రీకాకుళ సాహితి ఏర్పడింది. ప్రసారం పేరుతో కార్యక్రమాలు జరుగుతున్నాయో గుర్తులేదు. ఆ వేళ మాట్లాడింది రాజ్యహింస గురించే అనుకుంటాను. యిప్పటికి ఆయనది మూడు పదులు దాటిన వయసు. (ఆయన 52లో పుట్టారని ఇప్పుడే తెలిసింది కాబట్టి ఇలా ఊహించగలిగాను. కానీ అప్పటికి నాకుంటే పెద్దవాడిగనే భావించాను. నిజానికి నాకంటే ఆయన అయిదారు మాసాలు చిన్న) ఏపిసిఎల్‌సి జిల్లా శాఖ ఏర్పడవలసిన అవసరం గురించి ఆరోజే మాట్లాడినట్లున్నారు. మాట్లాడడం పూర్తయిన తర్వాత అందరం బయటకొచ్చేసి, రోడ్డుమీద నడుస్తున్నాం. తనని గొప్పగా ప్రభావితం చేసిన గురువుగారితో కలిసి వినమ్రంగా ఎడంచేత్తో ఒద్దికగా పుస్తకాన్ని వొడిసి పట్టుకొని రొమ్ముల‌కు హత్తుకొని నడుస్తున్న వినయశీలి అయిని విద్యార్థిలా కనిపించారు నాకానాడు. కాలికిందపడి ఏ జీవాలు కలిగిపోతాయేమో అన్నంత నెమ్మదిగా పడుతున్న అడుగులు... నడుస్తున్నప్పుడు తల ఎత్తి నడిచిన సమయంకంటే తలవొంచుకొని నడిచే సమయమే ఎక్కువ. ఆయన్ని చూసిన చాలాసార్ల తర్వాత రోజుల్లో నాకు బుద్ధుడు గుర్తుకొచ్చేవాడు. బహుశా బుద్ధుడు ఇలాగే నడిచి వుండాలి అనిపించింది. ఆయనతో అడుగులు కలిసినడవడం ప్రపంచానికి గొప్ప విషయం కాదుగానీ నాకు లభించిన అమూల్య వరంగా భావిస్తున్నాను.

టౌన్‌హాల్‌లో శ్రీకాకుళ సాహితి సమావేశం జరుగుతున్నది. అధ్యక్షులు కారా మాష్టారు. విశాఖపట్నంనుంచి వచ్చిన ప్రొఫెసర్ ఒకాయన పత్రికల్లో వార్తలు వచ్చే విధానాన్ని వివరిస్తూ వ్యంగ్యంగా హాస్యపాత్ర అభినయిస్తున్నట్టు చేతులు తిప్పుతూ మాట్లాడారు. సభికులు నవ్వుతున్నారు. ఏదో ఆనందించవలసిన విషయంలాగా. విషయం ప్రజల హక్కులకు, జీవితాలకు సంబంధించిన సీరియస్ విషయం. మాట్లాడుకున్న పద్ధతి మాత్రం విదూషకుడిలా వుంది. తర్వాత మాట్లాడవలసిన వంతు బాలగోపాల్ గారికి వచ్చింది. ఉపోద్ఘాతం ఏమీ లేకుండా ఎత్తుకోవడంలోనే "నేను కొంత సీరియస్‌గా మాట్లాడదలుచుకున్నాను" అని మొదలుపెట్టారు. ఆ ఒక్క వాక్యంతోనే సభ అంతవరకు ఏ తెన్ను పట్టిందో అర్థమైపోయింది. తన ధోరణిలో ప్రజలు కోల్పోతున్న ప్రజాస్వామిక హక్కుల గురించి మాట్లాడుకుంటూ పోయారు. ఆ సభలో బాలగోపాల్ మాట్లాడడం తనను పోలీసులు ప్రశ్నలతో వేధించుకు తిన్నారని రామారావు నాయుడుగారు తర్వాత చెప్తే తెలిసింది.

అప్సర లాడ్జిలో (ఇప్పుడది లేదు. కేంద్ర సహకార బ్యాంకు ఇప్పుడున్న స్థలానికి తూర్పు దిక్కున ఉన్న స్థలంలో ఉండేది) రాత్రంతా క్లాసులు నిర్వహించిన రోజులున్నాయి. ఎంత రాత్రయినా అలసట లేకుండా మాట్లాడేవారు. నలిగిన బట్టలు చెదిరిపోయిన జుట్టు. అప్పటి నుండి ఇప్పటికి ఆ ఆహార్యం ఏమీ మారలేదు.

1992లో టెక్కలిలో ఏపిసిఎల్‌సి జిల్లా మహాసభలు జరిగాయి. సభల అనంతరం రాత్రి ఆ కళ్యాణ మండపం మీద కూర్చుని ఆయనతో సహా అందరూ ఏవో మాట్లాడుతున్నారు. మండపం మీద కాలు కిందకు వేలాడేసి కూర్చుని, అలసిపోయిన ఆయన శరీరాన్ని అలాగే వెనక్కి వాల్చేశారు. బహుశా ఒకయిదు నిమిషాలు అలా వున్నారు. వెంటనే లేచి నిటారుగా కూర్చుని రాయడం మొదలు పెట్టారు. పిల్లలు బలపం పట్టుకొన్నంత శ్రద్ధగా పెన్ను పట్టుకొని రాసుకొని పోయారు. అక్షరాలు కుదురుగా వుంటున్నాయి. ఎక్కడా కొట్టివేతలు కనిపించలేదు. ఎక్కడా అపడం కానీ, తలెత్తి ఆలోచించడం కానీ లేదు. రాయడం పూర్తయిన తర్వాతే వంచిన తల ఎత్తి పెన్ను ముడిచేశారు.

టెక్కలిలో ఒక తాపీపని కుర్రవాడిని దొంగతనం అనుమానం మీద పోలీసులు లాకప్పులో పెట్టి కొడితే చనిపోయాడు. అది తెలిసి నేను వణికిపోయాను. అప్పటికి నేను ఏపిసిఎల్‌సిలో వున్నాను. చనిపోయిన వ్యక్తిని చూసి, పోలీసుల దుశ్చర్యని ఖండించడం నా బాధ్యత. అవసరమైతే పోస్టుమార్టం సజావుగా జరిగేటట్లు వత్తిడి తేవాలి. టెక్కలి నుండి వెళ్లే రోడ్డు మీద రైలు పట్టాలకు దగ్గరలో శవం వుంది. చేతుల మీద పక్కల మీద లాఠీ దెబ్బలకి కమిలి, పోయి వున్నాయి. చనిపోయిన మనిషి బంధువులు ఏడుస్తున్నారు. గ్రామస్తులతో పోలీసుల మంతనాలు జరుగుతున్నాయి. గుండె దడదడ లాడుతుంటే నోరు మెదపకుండా అక్కడ్నించి వచ్చేశాను.

ఇది జరిగిన ఒకటి రెండు రోజుల్లో టెక్కలి ఆఫీసులో కూర్చుని నేను పని చేసుకుంటూ వుండగా, సుంకిరెడ్డి నారాయణరెడ్డి గారితో కలిసి బాలగోపాల్ వచ్చారు. రావడం అంతదూరంలో చూసి, ఆఫీసులో ఎవరో మనుషులు ఉండడం వల్ల బాలగోపాల్ వాళ్ళు లోపలికి రావడం ఇష్టంలేక నేను లేచి ఆఫీసు బైటకొచ్చి నమస్కరించాను. లోపలికి రమ్మనలేదు నేను. లాకప్పు మరణం గురించి అడిగారు. చూశానుగానీ భయంతో మరేమీ చెయ్యలేదని చెప్పాను. సాధారణంగా అయితే అంత భయపడిపోతే ఎలాగా....? అనాలి. కానీ కించపరుస్తూ ఒక చూపుగాని, ఒక మాటగాని ఆయన నుంచి రాలేదు. చనిపోయిన మనిషి గురించి నాకు తెలిసిన వివరాలు చెప్పాను. రండి టీ తాగుదాం అన్నారు సుంకిరెడ్డి. అప్పటికి అక్కడున్న స్టేటుబ్యాంకు ఎదురుగా ఉన్న టీ పాకలో కూర్చుని టీ తాగాం. టీ గ్లాసుని బొటనవేలితో, చూపుడు వేలుతో పట్టుకొని టీ తాగడం బాలగోపాల్ అలవాటు. ఒక్క చుక్క నీళ్ళు తాగేవారు కాదు. టీలు ఎన్నయినా తాగేసేవారు. ఈయన శరీరానికి ఇటువంటి అలవాట్లకు తట్టుకొనే శక్తి వుందేమో అనుకునే వాడిని. ఇప్పుడు అల్సర్ వుందని తెలిసింది.

నేను ఆఫీసు నుండి బైటకు వచ్చేయడంగానీ, వాళ్ళనులోనికి రమ్మననీక పోవడంగానీ, లాకప్పుడెత్ గురించి నేనేమి పట్టించుకోకపోవడంగానీ నా పిరికితనాన్ని, చేతగానితనాన్ని పట్టిస్తాయి. నాలాంటి వాళ్ళని ఈ హక్కుల ఉద్యమంలో ఎందరినో చూసి వుంటారాయన. పిరికివాళ్ళని హేళన చెయ్యడంగానీ, ధైర్యంతో ఫలానా పని చెయ్యమని ఆదేశించడంగానీ ఆయన చేసి వుండరు. ఎవరి సంసిద్ధత బట్టి వాళ్ళు ముందుకు రావాలిగానీ ఎవరి వొత్తిడి వల్లో వస్తే ఉపయోగం ఉండదని ఆయన అవగాహన అయి వుంటుంది.

నేను పౌరహక్కుల ఉద్యమానికి దూరమైన తర్వాత 'టౌన్‌హాల్' కాంపౌండ్ లోపల జరిగిన ఒక సమావేశంలో ఆయన్ని కలిసే వీలయింది. అప్పటి వరకు నేను ఏనాడూ ఆయనతో పెద్దగా మాట్లాడింది ఏమీ లేదు. నాకున్న బిడియం వల్ల నేను అమితంగా ప్రేమించి, ఆరాధించే వ్యక్తిత్వాలు కలిగిన ఉన్నతులతో ఏమీ మాటలు కలపలేకపోవడం వల్ల పరిచయాలు ఏర్పడే అవకాశాలు జారవిడుచుకున్నాను. కొందరితో అయితే మరి ఆ అవకాశమే లేదు. వారి భౌతిక జీవితాలు ముగిసి పోయాయి. కనుక బాలగోపాల్‌గారితో ఆ వేళ మాట్లాడాలనుకున్నాను. ఆయన మానవ హక్కుల వేదిక పుస్తకాల దగ్గర కూర్చుని వున్నారు.

చాలా ప్రజా సంఘాల్లో చూశాను. వాళ్ళ ప్రచురణలు అమ్మే దగ్గర దిగువ స్థాయి కార్యకర్తలే వుంటారు కానీ పై స్థాయి వాళ్ళు ఏమీ కనిపించరు. వాళ్ళు ఉపన్యాసాలు మాత్రమే ఇస్తారు. బాలగోపాల్ గారికి నైతిక ప్రమాణాలకు భంగం కలగనంతవరకూ ఏ స్థాయి పనీ అస్పృశ్యం కాదు. నేను చాలా సేపు గుంజాటన పడి పోస్టుమాడర్నిజం మీద ఆయన ప్రకటించిన అభిప్రాయాల గురించి ప్రశ్నించాను. ఆయన స్వరంలో సన్నిహితుడితో మాట్లాడే ధోరణితో మాటలు

**వ్యాసం**

◆ పి. బిచ్చారెడ్డి

# పీడిత ప్రజల మహామనిషి డాక్టర్ కె. బాలగోపాల్

బాలగోపాల్ అకస్మిక మరణ వార్త విన్న తరువాత బాలగోపాల్‌తో పరిచయం ఉన్న ప్రజల మేధావులు కన్నీరు పెట్టనివారు ఉండరు. దీనికి కారణం ఉన్నది. బాలగోపాల్ దాదాపు మూడు దశాబ్దాల పాటు పౌర ప్రజాస్వామికి హక్కుల అమలకోసం రాష్ట్రంలో పల్లె పల్లె తిరిగినాడు. మారుమూల ప్రాంతాలను మొదలుకొని అడవి ప్రాంతాలవరకు ఆయన తిరుగని రహదార్లు లేవు. (ఆకాశ మార్గాలు తప్ప) ప్రజల అన్నిరకాల హక్కులను ఆయన జీవితాంతం కంటికి రెప్పలాగా కాపాడడానికి, నిరంతరం వాటి అమలకోసం తీవ్ర ప్రయత్నం చేసిన గొప్ప హక్కులనేత. మానవత్వం నిండిన మహామనిషి. ఎందరికో స్ఫూర్తి దాయకుడు, గొప్ప విద్యావంతుడు, ప్రజల మనిషి. బాలగోపాల్ ప్రపంచ ప్రజా మేధావులలో ఒకరుగా ప్రపంచానికి పరిచయమయ్యారు. న్యాయం కోసం న్యాయమైన చట్టాల అమలుకోసం రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా పల్లెల నుండి పట్టణాల వరకు మైదానాలనుండి అడవి ప్రాంతాలవరకు ఇంద్ర వెల్లి కొండలనుండి నల్లమల అడవులవరకు కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు ప్రజా సంబంధాలు, మేధావుల సంబంధాలు దండిగా మెండుగా ఉన్న మన మహామేధావి, ప్రజల మనిషి బాలగోపాల్. ఈయనకు ఉన్న ప్రజా సంబంధాలు రాష్ట్రంలోగాని, దేశంలోగాని ఏ ప్రజానాయకునికిగాని, ఏ పాలకునికీగాని, ఏ మేధావునికి ఉండకపోవచ్చును. ప్రజాస్వామ్యం పేరుతో ఓట్ల పాలన ప్రారంభమై నేటికి 6 దశాబ్దాలు గడిచినా ఓట్లను నోట్లతో వెలగట్టి ధనవంతులు బలవంతులుగా మారి రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకొని చట్టాలన్నిటిని డబ్బున్న వాళ్ళ చుట్టాలుగా మార్చి ప్రజల హక్కులను తమ పద ఘట్టనల క్రింద కాలరాచి ప్రజలకు జవాబు దారితనం లేకుండా తమ యిష్టానుసారంగా నియంతృత్వపాలనలు తుపాకి పాలనలు కొన సాగిస్తున్నారు. ఇలాంటి సందర్భంలో ప్రజలకు హక్కుల చైతన్యం కల్గించి ప్రజలను సంఘటితంగా హక్కుల పోరాటాలకు సిద్ధం చేసి బాలగోపాల్ ప్రజలకు మిత్రుడుగా రాజ్యానికి శత్రువుగా మారినాడు. ప్రజలు వివిధ సమస్యల సాధన కోసం విద్యార్థుల నుండి రైతు కూలీల వరకు ఆదివాసులవరకు ప్రజలు సంఘటితంగా ఉద్యమాలు నిర్మించుకుని న్యాయంగా చట్టబద్ధంగా పోరాడుతుండగా పాలకులు న్యాయంగా చట్టబద్ధంగా పోరాడే హక్కు ఉన్నదని, హక్కులు పోరాడి సాధించుకున్న హక్కులని, పాలకులనుండి హక్కులకు భంగం కల్గినప్పుడు ప్రజలు

---

వచ్చాయి. గంభీర స్వరంతో ఆయన మాట్లాడగా నేను చూడలేదు. 'వాళ్ళకొక సిద్ధాంత భూమిక ఉన్నట్టు కనిపించదుగానీ, వాళ్ళు లేవనెత్తిన ప్రశ్నలు గురించి పట్టించుకోవలసిన అవసరం ఉంది అనుకుంటున్నాను' అన్నారు.

89లో ఒక పత్రిక వస్తువుండేది. వార పత్రిక అని గుర్తు. వంగవీటి మోహనరంగాని హత్యచేసినప్పుడు ముఖచిత్రం మీద రక్తపు ధారలు వేసి ఘోరంగా, క్రూరంగా అవి శీర్షిక పెట్టింది. ఆ పత్రికలో కూడా బాలగోపాల్‌గారి వ్యాసాలు వస్తూ వుండేవి. చలసానిగారు బాలగోపాల్ వ్యాసాలన్నీ జాగ్రత్త చేసి వుంచమని నాతో అంటే చాలా నాళ్ళు ఆ కటింగ్సు నా వద్ద వుండేవి. ఇప్పుడవి ఇంట్లో ఎక్కడున్నాయో తెలీదు. ('ప్రజాతంత్ర'లో వచ్చిన శ్రీశ్రీ గారి అనంతరం వ్యాసాలు కొన్ని భద్రపరచి ఇచ్చినందుకే విరసం ప్రచురించిన శ్రీశ్రీ అనంతరం పుస్తకంలో నా పేరు వేసి నాకు అనవసర ప్రచారం తెచ్చి పెట్టారు, చలసాని కృష్ణాబాయి గార్లు).

బాలగోపాల్ మీద రాజ్యం ఎంత దాడి చెయ్యాలో అంతా చేసింది. ఆయనకు నక్సలైట్లతో సంబంధాలను ఆపాదించగలిగిందిగానీ ఆయన నైతికత మీద వీసమంత దాడి చేయలేకపోయింది. విప్లవ శ్రేణుల్లోని హింస మీద ఆయన రాస్తే, దాన్ని తన కనుకూలంగా ఉపయోగించుకుంది. అలాగని ఆయన ఏనాడూ రాజ్యానికి అనుకూలంగా వ్యవహరించలేదు. ప్రజల ప్రయోజనాలే ఆయనకు గీటురాయి. జీవించే హక్కు గురించి భద్రమైన, మానవీయమైన జీవితం గురించి ఆయన ఆరాటపడినంతగా ప్రజాసంఘాలలో మరొకరు కనపించరు. కాలికి బలపం కట్టుకొని ఆయన నిరంతరం ప్రజల మధ్య తిరగడమే దానికి రుజువు. అయినా ఆయన దాచుకోకుండా నిర్మొహమాటంగా ప్రకటించిన అభిప్రాయాల మీద ప్రజాస్వామిక వాదుల నుండి దాడిని కూడా ఎదుర్కోవలసి వచ్చింది. తనని విమర్శించిన వాళ్ళ మీద విరుచుకుపడే తత్వం చాలా మంది మేధావుల్లో వుంది. కానీ బాలగోపాల్ తనని విమర్శించిన వాళ్ళని పరుషంగా ఒక్కమాట ఆడలేదు. తనను విమర్శిస్తున్న వాళ్ళు కూడా ప్రజల పక్షం వహిస్తున్నవాళ్ళేనని, అభిప్రాయ బేధాల్ని గౌరవించడమే ప్రజాస్వామిక విలువ అని బాలగోపాల్ భావించినట్టుగా ఆచరణలో రుజువు చేసినట్టుగా మరొకరు చేసి వుండరు.

నేను చివరిసారిగా కలిసింది - హరిపురం మార్పు గ్రంథాలయంలో కోస్టల్ కారిడార్ మీద బాలగోపాల్‌గారు మాట్లాడినప్పుడు. ఉపన్యాసం పూర్తి అయిన తర్వాత కెవి జగన్నాథం కారులో బాలగోపాల్‌గారితో పాటు కాశీబుగ్గ వరకు ప్రయాణించాను. ఆయన ప్లీడరు కాబట్టి, నేను ప్లీడరుగుమస్తాగా కొన్నాళ్ళు పని చేశానని చెప్పుకున్నాను. మాటల సందర్భంలో ఏపిసిఎల్‌సిలో గట్టిగా పనిచేసే ఒకాయన ప్రస్తావన తెచ్చారు. సంఘాల్లో ఎవరో ఒకరు గట్టిగా నిలబడి పనిచేస్తే, మిగతా వాళ్ళు కూడా సహకరించి పనిచేస్తారు అన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. నిజానికి ఆ మాట ఆయన రుజువు చేసి చూపించారు. అయితే ప్రజాసంఘాల్లో ప్రజాస్వామ్య విలువలు తప్పనిసరిగా వుండాలని ఆయన నమ్మినట్టే తనని శాశ్వతంగా ప్రధానకార్యదర్శిగా వుంచడాన్ని వ్యతిరేకించి, ఆ బాధ్యత మరో బాధ్యునికి అప్పగించి, తన ఉపాధ్యక్ష బాధ్యత, స్వీకరించి, ప్రధానకార్యదర్శి స్థానం నించి తొలగినంత మాత్రాన బాధ్యతల నుంచి తొలిగిపోనని అనంతపురంలో అన్నారని జగన్నాథం చెప్పారు. జిల్లా హక్కుల ఉద్యమ బాధ్యుల్లో ఒకరు ఆ ఉద్యమస్ఫూర్తికి భిన్నమైన స్వభావంలో ఉండడం నేను గమనించాను. సంస్థల్లో చేరేవారికి ఆ సంస్థకు సంబంధించి కొన్ని యోగ్యతలు ఉండాలని భావిస్తాను. కొన్నేళ్ల పాటు ఆ సంస్థల్లో పనిచేసిన తర్వాత కూడా వాళ్ళకు ఆయోగ్యత సమకూరకపోతే వాళ్ళ సంస్థల్లో వుండడం ఆ సంస్థకు నష్టదాయకమని నేను భావిస్తాను. వాళ్ళు నిజాయితీగా ఆ సంస్థల నుంచి తొలిగి పోవడమే మంచిది.

నేనెప్పుడు బాలగోపాల్‌గారిని కలిసినా నేను పరిశీలించి చూసేది నెమ్మదిగా అడుగు వేసే ఆయన పాదాల్ని. దళసరిగా, వేళ్ళు కొంకర్లు తిరిగి మట్టికొట్టుకుపోయిన కష్టజీవి పాదాల్లా కనిపించేవి. నిజంగా ఆయన మట్టి మనిషి.

10.102009, 12.25 గం.లకు

**(బాలగోపాల్ మరణించిన రెండోరోజు ఈ నివాళి వ్యాసం రాసిన జోగారావు ఆ సాయంకాలమే ఆత్మహత్య చేసుకున్నారు)**

❖

మరలా అలాంటి అట్టి హక్కులను పోరాడి నిలబెట్టుకోవలసిన అవసరమున్నదని ఆయన గుర్తించినాడు. వరంగల్‌లో కాకతీయ యూనివర్సిటిలో గణిత అధ్యాపకుడుగా ఉన్న బాలగోపాల్ బాధలుపడుతున్న ప్రజలకు తోడుగా నిలిచి ఆయన సమాజం నుండి సంపాదించిన జ్ఞానాన్ని ప్రజలకు ధారపోయడానికి ప్రయత్నించి పూర్తికాలం ప్రజలకు సేవలు అందించడానికి, ప్రజలతో కలిసిపోరాడడానికి ముందుకు వచ్చాడు. యూనివర్సిటిలో అధ్యాపక వృత్తికి స్వస్తి చెప్పాడు. ప్రజల న్యాయమైన సమస్యల సాధనకోసం స్పందించిపోరాడే ప్రజలపక్ష పాతిగా మారి వారి పోరాటాలవైపున అండగా నిలిచినాడు. అవినీతి పాలకులకు బాలగోపాల్ సవాలుగా మారినాడు. పాలకులు కుట్రబుద్ధితో శత్రువుగా చూసినారు. చాలసార్లు హత్యా ప్రయత్నాలకు వివిధరకాల దాడులకు పాల్పడినారు. ఆశేష ప్రజానీకానికి మిత్రుడిగా మిగిలి నిరుపేదల ప్రజల మనిషిగా గుర్తింపు పొందినాడు.పౌర ప్రజాస్వామిక హక్కుల ఆమలుకోసం బాలగోపాల్ తిరిగినంత ప్రయాణం ఆయన తిరిగినన్ని ప్రాంతాలు ఎవ్వరు తిరిగి ఉండకపోవచ్చు. బాలగోపాల్ ప్రయాణించని ప్రాంతాలు తిరుగని రహదార్లు రాష్ట్రంలో లేకపోవచ్చును.

పౌరహక్కుల సాధనకోసం పోరాడే కార్యకర్తలకు అడుగడుగున అండదండగా ఉండి తనవంతు కర్తవ్యంగా ప్రజలను చైతన్యపరుచుటకు పోటీ పడి నిలబడిన నిరాడంబరుడు నిజాయితీ పరుడు బాలగోపాల్. ప్రజలను ఆదుకోవడానికి ప్రజాసమస్యల సాధనకోసం అండదండగా ఉండడానికి బాలగోపాల్‌లాంటి మేధావి ప్రజల ముందుకు వచ్చేవరకు ప్రజలు బాలగోపాల్‌ను మరువలేరు. ఏ దిక్కులేనివారికి పెద్ద దిక్కుగా ఉన్నాడు బాలగోపాల్. దిక్కులేని నిరుపేదలు బాలగోపాల్ లాంటి మేధావి కోసం ఎదురుచూస్తున్నారు.

అన్ని రకాల నిర్బంధ విధానాలకు వ్యతిరేకంగా, పోలీసు దాడులకు లాకప్పు హత్యలకు, ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా ఉరిశిక్షలకు వ్యతిరేకంగా కల్తీకల్లు మరణాలకు, ఆకలి చావులకు, అప్పుల చావులకు వలస చావులకు, వరకట్నపు హత్యలకు, సెజ్‌లకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలబడి అవినీతి రాజ్యాన్ని, నీతిలేని రాజ్యాన్ని నిలదీసి పోరాడిన పౌరహక్కులనేత, మహనీయుడు మన ప్రియతమనేత డాక్టర్ కె. బాలగోపాల్. దళితుల పక్షాన ఆత్మగౌరవ పోరాటాలకు వారికి మద్దతు పలికి మాల మాదిగలు కూడ మనుషులేనని చాటి చెప్పి వారి పక్షపాతిగా నిలిచినాడు. ముస్లిమ్‌లు పాకిస్థాన్ పౌరుల కాదని, ముస్లిమ్‌లుకూడ భారతీయ పౌరులేనని మత కలహాల సందర్భంగా హిందూ మతోన్మాదులకు వ్యతిరేకంగా వారి పక్షాన నిలబడి మద్దతుగా ఉండి వారి న్యాయమైన హక్కులకు అండదండగా ఉన్నాడు.పురుషాధిపత్యానికి వ్యతిరేకంగా నిలబడి పోరాడే మహిళలకు మద్దతుగా ఉండి స్త్రీలు, పురుషుల సమాన పౌరులేనని చాటిచెప్పాడు.

ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా, టాడా, పోటా చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి రాజ్యానికి సవాలుగా నిలిచిన ప్రజల మేధావి బాలగోపాల్. ఒక సందర్భంలో టాడా చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్ర రాజధాని నుండి దేశ రాజధాని ఢిల్లీ వరకు వ్యతిరేకంగా నిలబడి పోరాడిన హక్కుల నేత బాలగోపాల్.

దాదాపు దశాబ్దం క్రిందట ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా పోరాట ప్రాంతాల్లో మొదలుకొని రాష్ట్ర రాజధాని వరకు పౌరహక్కుల ఉద్యమం తరపున బూటకపు ఎన్‌కౌంటర్లపై ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా పాదయాత్రలు జరిపించి ప్రజల మెప్పును పొందిన మేధావి. పౌరహక్కుల ఉద్యమంలో ప్రజలను మరింత సంఘటిత పర్చడానికి ప్రయత్నించి ప్రజల భాగస్వామ్యం పెంచడానికి ప్రయత్నించి రాజ్యాన్ని నిలదీయాలని ప్రజలకు పిలుపు యిచ్చాడు.

దాదాపు ఒక దశాబ్దం కాలం క్రిందట రాష్ట్రంలో ప్రతి నిత్యం ఎన్‌కౌంటర్ల జరుగని రోజంటూలేని సమయంలో ఎన్‌కౌంటర్ సంఘటనలు అవార్డుల కోసం రివార్డుల కోసం ఎన్‌కౌంటర్లు కొనసాగుతుండగా, వీటిని ఎలాగైనా ఆపాలని ప్రయత్నించి ప్రభుత్వాలకు జవాబుదారితనం పెంచడానికి ప్రయత్నించి, ఎన్‌కౌంటర్ సంఘటనలను జాతీయ మానవ హక్కుల కమీషన్ దృష్టికి రాష్ట్ర పౌరహక్కుల సంఘం తరపున కమీషన్‌కు పిర్యాదు చేసినాడు. ఆయన చేసిన ఫిర్యాదుపై మానవ హక్కుల కమీషన్ స్పందించి ఎన్‌కౌంటర్ సంఘటనలపై ప్రజల కాళ్ళ దగ్గరికి రప్పించి పోలీసుల నేరాలన్నింటిని బయట పెట్టించిన ఘనుడు. ఈ విచారణలకాలం అప్పట్లో దేశమంతా మారుమోగింది. అప్పట్లో అవార్డులకోసం రివార్డులకోసం ఎన్‌కౌంటర్లకు పాల్పడిన పోలీసుల గుండెల్లో వణుకుపుట్టింది. ఆ వణుకును పుట్టించినవాడు బాలగోపాల్.

హింసకు తావులేని సమాజం కావాలని, ఎవ్వరు కన్నీరు కార్చని సమాజం కావాలని, ప్రజలందరి జీవించే హక్కులకు ప్రభుత్వాల జవాబుదారితనంగా ఉండాలని, ధనిక పేద వర్గాలు ఉన్నంత కాలం పేదల న్యాయమైన పోరాటాలు తప్పవని, పోరాటాలు ఉన్నంతకాలం పాలకుల అణచివేతల తప్పవని ఆయన నినదించాడు. అందరు సమాన హక్కులతో జీవించాలని, దానికి ఉద్యమాలే ఆధారమని చెప్పాడు. ఈ హక్కుల సాధనకోసం నిరంతరం ప్రజల తరపున నిలబడి పోరాడిన హక్కులనేత, మహామనిషి డా. బాలగోపాల్.

దాదాపు ఒక దశాబ్దం కాలం క్రిందట నలమల్ల అడవిలో ఉన్న చెంచులు నక్సలైట్లకు సహాయ సహకారాల అందిస్తున్నారనే అనుమానంలో కోపంతో పోలీసులు చెంచుపెంటలపై దాడులు జరిపి అడవినుండి బయటకు వెళ్ళగొడుతున్న క్రమంలో చెంచులందరిని కొల్లాపూర్ పట్టణమునకు సమీపంలో ఉన్న మొలచింతల పల్లికి తరలించి అక్కడనే చెంచులందరికి యిండ్లు కట్టించి అందరికి భూములు యిస్తామని పోలీసుల మాయమాటలతో నమ్మించి అదిరించి బెదిరించి అక్కడికి చేర్చారు. చెంచులకు ఎలాంటి పునరావాస చర్యల చేపట్టక వారి జీవించే హక్కులకు పోలీసులు అడుగడుగునా అడ్డు తగులఉతుండగా, ఈ సంఘటనలు తెలిసి అప్పట్లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం పురుషోత్తం బాలగోపాల్‌కు ఈ సంఘటనల విషయం గురించి తెలియజేయగా, అడవిలోని చెంచులను కలిసి వచ్చుటకు నిజనిర్ధారణలకు వెళ్లడానికి బాలగోపాల్ సమయం యిచ్చినాడు. సరియైన తేదికి పెబ్బేరు వస్తున్నట్టు పురుషోత్తమ్‌నకు బాలగోపాల్ తెలియజేసినాడు.

అడవికి వెళ్ళె సమయంలో పురుషోత్తం చెయ్యినొప్పితో బాధపడుతున్నందు వల్ల ఆ సమయంలో బాలగోపాల్ వెంట అడవికి వెళ్లడానికి ఒక రోజు ముందే పురుషోత్తం కబురు అందుకొని ఒక రోజు ముందే ఆ రోజు రాత్రి నేను పెబ్బేరుకు చేరుకున్నాను. బాలగోపాల్ పెబ్బేర్ బస్టాండ్‌కు తెలవారుజామున 4 గంటలకు వస్తానని చెప్పినాడు. పురుషోత్తమ్ చెప్పిన ప్రకారం నేను తెలవారుజామున పెబ్బేరు బస్టాండ్‌కు వెళ్ళి బాలగోపాల్‌ను పురుషోత్తమ్ రూమ్‌కు తీసుకురావడానికి వెళ్ళినాను. ఆ సమయంలో పెబ్బేరు బస్టాండ్‌కు వెళ్ళినప్పుడు బాలగోపాల్ ఒకచోట వార్త పత్రికలు అడుగున వేసుకుని లుంగీకప్పుకొని నిద్ర పోతుండటం కళ్ళారా చూచి ఆశ్చర్య పోయినాను. నిద్రలో ఉన్న బాలగోపాల్‌ను లేపుకొని పురుషోత్తం యింటికి యిద్దరం వెళ్ళినాము. అప్పట్లో పెబ్బేరు బస్టాండ్ నూతనంగా నిర్మాణంలో ఉన్నది. నిర్మాణం పనులు కూడ

అప్పుడప్పుడే పూర్తవుతున్నవి. ఒక రాయలసీమ బస్సుకు వచ్చి తెల్లవారుజామున 2 గంటలకు దిగినానని, మీ పెబ్బేర్ బస్టాండ్‌ను ప్రారంభించినానని చెప్పాడు .ఆయన మాటలకు నేను ఆశ్చర్యపోయినాను. ఆయన జీవనవిధానం చాలా గొప్పది.

పురుషోత్తం యింటికి వెళ్ళి టీ త్రాగి ఉదయం 6 గంటలకు పెబ్బేరు నుండి కైనటిక్ హోండా నేను బాలగోపాల్ నలమల్లకు బయలుదేరి చెంచులతో కలిసి మాట్లాడి వచ్చినాము. చెంచులతో కలిసి మాట్లాడుతుండగా వారు తమకు యిండ్లు, భూములు ఏవీ వద్దని తమను మరల అడవిలోని గూడాలకు వెళ్ళనిస్తే చాలన్నారు.తమను ఏ ఇబ్బందులు పెట్టకుండా , ముఖ్యంగా పోలీసులు తమను స్వేచ్ఛగా తిరగనిస్తే చాలని , అడవిని వదిలి బైటికి రాలేమని , తమను అట్లా ఉండనిచ్చేలా చూడమని చెంచులు బాలగోపాల్‌ను కోరినారు. అడవినుండి యింటికి వస్తున్న తిరుగు ప్రయాణంలో బాలగోపాల్ మాట్లాడుతూ చెంచుల గొప్ప నిజాయితీపరులు అని, వీరికి ఉన్న నిజాయితి మరెవ్వరికి ఉండదన్నాడు. ప్రభుత్వాలను ఒక పైసా ఆశించకుండా జీవిస్తారని, తమ కష్టము మీద బతుకుతారని బాలగోపాల్ అన్న మాటల మరువలేనివి. ఈ చెంచులకు ఎవరు ఎన్ని సేవల అందించిన తక్కువేనన్నాడు.

బాలగోపాల్ ఆకస్మిక మరణ వార్త తెలిసి నిద్రలో ఉన్న నేను ఉలికి పడినాను. మొదట్లో నమ్మశక్యం కాలేదు. తర్వాత టివి. చూసి నమ్మినాను. మొదట్లో సహజ మరణం కాదని అనుకున్నాను. ఆయన ఆకస్మిక మరణం వెనుక ఏమైనా రాజ్యం కుట్ర దాగి ఉందా మొదట అనుమానపడినాను. మరునాడు హైదరాబాదు వెళ్ళి యింటి దగ్గర శవాన్ని చూచిన తర్వాత ఆయన ఆకస్మిక మరణం గూర్చి కొందరి మిత్రుల ద్వారా తెలిసికొనగా, ఆయన అనారోగ్యం పట్ల, నిర్లక్షంగా వ్యవహరించడం మరణానికి కారణమయిందని తెలిసి బాధపడని వారులేరు. దేశంలో, రాష్ట్రంలో ఎందరెందరో ప్రజల జీవించే హక్కులను కోరిన బాలగోపాల్ తన జీవించే హక్కును కాపాడుకోలేకపోయాడని తన గురించి తెలిసిన ప్రజలు, మేధావులంతా బాధపడ్డారు. ఆయన శవాన్ని చూచిన వారంతా కన్నీరు కార్చారు. ఆయన మరణం నాకు తీవ్రమైన బాధ కలిగించింది. బాలగోపాల్‌తో పరిచయం ఏర్పడినప్పటినుండి చివరి శ్వాస విడిచేవరకు దాదాపు ఒక దశాబ్దం పైగా మాయిద్దరి అనుబంధం కొనసాగింది. ఆయనతో కలిసి హక్కుల ఉద్యమంలో పనిచేసిన అవకాశం కలిగినందుకు గర్వపడుతున్నాడు. ఆయన నుండి ఎన్నో పాఠాల నేర్చుకున్నాను. మంచి అనుభవాన్ని సంపాదించుకున్నాను. ప్రజా ఉద్యమంలో పని చేసే ప్రతి కార్యకర్త ఆయనను ఆదర్శాన్ని తీసుకొని స్పందించాలని కోరుకుంటున్నాను. చివరి శ్వాస విడిచేవరకు నిస్వార్థంగా ప్రజల వెంట ఉన్న మేధావి. ప్రజల పక్షపాతిగా, ప్రజల మనిషిగా జీవించిన మహామేధావి డా. కె. బాలగోపాల్.

యిప్పుడిప్పుడే ప్రజా ఉద్యమాలు సంఘటితంగా బలపడి ప్రభుత్వాలను నిలదీసి ప్రశ్నించుతున్న క్రమంలో న్యాయమైన ప్రజా ఉద్యమాలపై అణచివేత మొదలుపెట్టి ఉగ్రవాద ముద్రలు వేసి నిషేధాలు విధించుతున్న సమయంలో రాజ్యంతో రాజీపడని బాలగోపాల్ లాంటి మేధావులులేని లోటు తీరదు. ఈ మాట ప్రజల గురించి ఆలోచించేవాళ్ళ , పనిచేసేవాళ్లు అంతా గుర్తిస్తున్నారు. ఆ లోటు తీరేదెప్పుడని ప్రజలు దిగులుతో, విచారంతో అనుకుంటున్నారు. వాళ్లకు తిరిగి ధైర్యం కలిగించేలా ప్రజా ఉద్యమాలు కొనసాగాలి.

హైదరాబాదులో న్యాయవాద వృత్తిని చేపట్టి బాలగోపాల్ ప్రజాన్యాయవాదిగా గుర్తింపు పొందినాడు. ఏ కేసు విషయంలోనైనా, ఎవ్వరివద్దనైనా కాగితాల ఖర్చులకు మాత్రమే ఫీజులు తీసుకొని, తీసుకున్న కేసులను సరియైన అధ్యయనం చేసి ఆ కేసుల్లో న్యాయం చేయడానికి నిరంతరం అధ్యయనం చేసి కోర్టుకు వెళ్ళేవాడు. అడుగడుగునా అతని నిస్వార్థ సేవలు అందించడానికి ప్రయత్నించేవాడు.

మహబూబ్‌నగర్ జిల్లాలో రెండునదులు జల జల పారుతున్నా పంటపొలాలకు సాగునీరు దక్కక ప్రజల ఉన్నచోట జీవించే హక్కులు కోల్పోయి ఒక మట్టి దేశంగా మిగిలింది. వలస చావులు, ఆకలి చావులు, అప్పులచావుల జిల్లాగా మారుతుంటే జిల్లాలో వివిధ హక్కుల సాధనకోసం ప్రజలను చైతన్యపరచడానికి ముందుకు వచ్చి అన్ని రకాల ఆందోళనలకు వెన్నుదన్నుగా నిలబడ్డాడు. అడిగిన వెంటనే సమయం యిచ్చి జిల్లాలో కొనసాగే న్యాయమైన ప్రజా ఉద్యమాలను సజీవ ఉద్యమాలుగా నిలపడానికి తన వంతు కృషిచేశాడు బాలగోపాల్. పాలమూరు సాగు జలాల హక్కులకు సంబంధించి కృష్ణానది జలాలలో పాలమూరు జలాల వాటా ఎంతోతేల్చి చెప్పేవరకు పాలమూరు సమస్య పరిష్కారం కాదని, సాగునీరు దక్కాలంటే ప్రజలను సంఘటితపరిచి ఉద్యమించడమే ఏకైక మార్గమని చాటి చెప్పిన మేధావి బాలగోపాల్ పాలమూరుకు సాగు జలాల విషయంలో జరిగిన ప్రతి ఆందోళనలో పాల్గొని ప్రజల చైతన్యం అభివృద్ధికి ,సంఘటిత శక్తికి ఎంతోతోడ్పడ్డాడు. భవిష్యత్‌లో జిల్లాలో సాగు జలాల దక్కేవరకు ప్రతి ఎన్నికల వేళలలో రాజకీయ నాయకులను నిలదీయాలని చాటి చెప్పాడు. హక్కులనేతగా పాలమూరు ప్రజల ప్రియమిత్రుడయ్యాడు బాలగోపాల్. జిల్లాలో పోలేపల్లి సెజ్‌ల విషయంలో పాల్గొని సెజ్‌లకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రజల దగ్గరికి వెళ్ళి తనవంతు కర్తవ్యంగా మద్దతు యిచ్చి వారికి అండగా ఉండి వారి పక్షాన నిలబడ్డాడు.

బాలగోపాల్‌ను మొదటిసారి చూసి పరిచయమైనప్పుడు ఆయన ధరించే దుస్తులు ఆయన తిండి ప్రజల నుండి ఆయన పాటించే సరియైన వేళలు యితరుల పట్ల వ్యవహరించే వారు. ఆయన జీవించే విధానం ఆయన నిరాడంబరత్వం, నిజాయితీ చూచి ఆయన ఒక నిజమైన గొప్ప కమ్యూనిస్టు నాయకుడై ఉండవచ్చునని అనుకున్నాను.

ఆయన సంపాదించిన జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని వ్యక్తిగత సంపాదనకు, సుఖాలకు వెచ్చించకుండా ప్రజా ఉద్యమాలకు కేటాయించాడు. ఆయన మేధాశక్తికి విలువకట్టేవారు ఎవ్వరు లేరని చెప్పవచ్చు. నిజాయితీ పరులలో గొప్పనిజాయితీపరుడు బాలగోపాల్. ప్రజా ఉద్యమాలలో పనిచేయాలంటే ముందు నిజాయితీ ఉండాలని ఆయన కోరుకునేవాడు. మన నిజాయితీ శత్రువు చేతిలోని ఆయుధం కంటే బలమైనదని చెప్పినాడు. ప్రజా ఉద్యమంలో పనిచేసే చాలమంది కార్యకర్తలు బాలగోపాల్‌ను చూచి నేర్చుకోవలసినవి, ఎన్నయినా ఉన్నాయి.

అవినీతి పాలకులు దేశాన్ని అప్పులపాలు చేసి రాజ్యాధికారాన్ని రాజ్యాంగాన్ని ప్రపంచ బ్యాంకు తాకట్టుపెట్టి సామ్రాజ్యవాదుల ఏజెంట్లుగా మారి ఆదేశాల ప్రకారం రాజ్యాం చేస్తున్నారు. ప్రజలను ఏ హక్కులు లేని వారుగా బానిసలుగా చూడటం వల్ల సామ్రాజ్యవాదుల దోపిడి వల్ల ప్రజల హక్కులు అణిచివేకు గురవుతున్నాయి. ప్రజలపై ఆర్థిక దోపిడీ పెరిగి దేశాల మధ్య యుద్ధాలు జరుగుతున్నాయి. ప్రజా ఉద్యమాలను మారణ హోమంలో ముంచెత్తుతున్న తరుణంలో హక్కుల నేత లేనిలోటు తీరనిది. ఆయన లోటును అందరు ఐక్యంగా ఉద్యమించి భర్తీ చేయవలసిన అవసరం ఉందని భావిస్తున్నాను.

వ్యాసం

◆ పాణి

# శ్యాం రచనలు - విప్లవాచరణ ప్రతిరూపాలు


లెనిన్ మౌలిక రచనలన్నీ రాజకీయ ప్రత్యర్థుల సంవాదంలో , నిరంతర రాజకీయ కార్యాచరణలో భాగంగా రాసినవే. విప్లవోద్యమ సైద్ధాంతిక అవసరాల పట్ల ఆయన చాలా జాగరూకతతో ఉండి పార్టీ లోపలా బైటా ప్రతి సందర్భాన్నీ మార్క్సిస్టు సిద్ధాంత కృషికి వాడుకున్నాడు.

పార్టీని సరైన పంథాలో నడిపి విప్లవోద్యమాన్ని వేగవంతం చేయడం - సిద్ధాంత సంఘర్షణను పదునెక్కించడం అనే జమిలి సన్నివేశాల్లో లెనిన్ అద్భుతమైన దక్షత ప్రదర్శించాడు. దీన్ని లెనిన్ అనే ద్రష్టకు మాత్రమే సాధ్యమయ్యే అరుదైన నైపుణ్యమనుకుంటే ప్రయోజనం ఏమీ లేదు. ఏ సమాజ మౌలిక పరివర్తన అయినా తప్పక అలాంటి దార్శనికత మీద, ఆచరణ మీద ఆధారపడి ఉంటుంది. లెనిన్ లాంటి శక్తులనో, బృందాలనో ఆ సమాజం కోరుకుంటుంది. రూపొందించుకుంటుంది. అలాంటి మౌలిక పరివర్తన జరుగుతున్న సమాజ ఆవరణలో జీవించిన వ్యక్తులు దానికి ఎట్లా ప్రతిస్పందించారు? అనేది కూడా చాలా ముఖ్యమైన విషయమే.

ఈ దృష్టితో ఏ దేశ విప్లవాలనైనా, విప్లవకారులనైనా చూడవచ్చు. ఆనాటి పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ సభ్యుడు నల్లా ఆదిరెడ్డి అలియాస్ శ్యాం సంకలిత రచనల పుస్తకం చూస్తే ఇలాంటి ఆలోచనలు మెదిలాయి. సుదీర్ఘ విప్లవ జీవితంలో ఆయన అఖిల భారత నాయకుడిగా ఎదిగి 1999 డిసెంబర్ 2న మహేష్, మురళితోపాటు కొయ్యూరు బూటకపు ఎన్‌కౌంటర్లో అమరుడయ్యాడు. ఆయన వేర్వేరు సందర్భాల్లో రాసిన వ్యాసాల సంకలనం యిది.

విప్లవ నిర్మాణంలో భాగంగా రాసిన వ్యాసాలు, సర్క్యులర్లు, తీర్మానాలు ఉద్యమానివేగాని వ్యక్తుల పేర్లతో విడిగా గుర్తించే అలవాటు ఇప్పటిదాకా లేదు. ఆ వ్యక్తి తన పేరు మీదే ఇతర పత్రికల్లో రాసిన వాటికే ఈ గుర్తింపు ఉండేది.అదీసృజనాత్మక సాహిత్య సంబంధమైన వాటికి. దీనికి భిన్నంగా ఈ పుస్తకం ఒక కొత్త సంప్రదాయాన్ని ప్రారంభించింది. ఇది అభ్యంతరకరమేమీ కాదు. కాకపోగా ఉద్యమ నిర్మాణంలో ఆ వ్యక్తి ఆలోచనా రీతిని, స్థాయిని అంచనా వేయడానికి ఉపయోగపడుతుంది. ఈ కృషి అంతా ఆ ఉద్యమం నుండి రూపొంది, అందులో భాగమైపోయినదే అయినా ఆలోచనాపరులుగా ఉద్యమాలలో తయారై మొత్తం పార్టీకి మార్గదర్శకత్వం వహించడంలో ఆ వ్యక్తుల పాత్రను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. అట్లాగే ఫలానా నాయకుని ఆలోచనలు, అవగాహన స్థాయి మొత్తం ఉద్యమ అవగాహనగా మారిందా? ఆచరణలో ప్రతిఫలిస్తుందా? ఆ వ్యక్తి నిర్మాణంలో ఉన్నత స్థాయిలో ఉన్నా ఆ నాయకుడి లేదా నాయకురాలి అవగాహన నిర్మాణమంతా పరివ్యాపించడానికి అవరోధాలు ఏముంటాయి? అతన్ని లేదా ఆమెను ఎంతో గౌరవిస్తూ నిరంతరం సహచరిస్తూ కూడా వారి అవగాహన నిర్మాణంలోని ఇతర వ్యక్తులకు, నిర్మాణానికి ఎందుకు సొంతం కాలేకపోయింది? అనే అత్యవసరమైన చర్చ చేయడానికి ఇలాంటి పుస్తకాలు సందర్భమవుతాయి. కాలక్రమంలో ఆ వ్యక్తి అవగాహనను ఉద్యమ నిర్మాణం యింకా ముందుకు తీసికెళ్ళి ఆచరిస్తూ ఉంటే దాన్ని కూడా వివరించుకోవడానికి వీలు దొరుకుతుంది.

ఈ పుస్తకంలోని రచనల గురించి మాట్లాడుకోవడానికి ముందు యింకో ముఖ్యమైన పరిశీలన కూడా చేయవచ్చు. భారతదేశ విప్లవోద్యమంలో లేదా శ్యాం గురించిన సందర్భం కాబట్టి ఆయన ప్రాతినిథ్యం వహించిన విప్లవ పార్టీలో జరిగిన సిద్ధాంత కృషికి ఉదాహరణ అనదగిన పుస్తకాలేవైనా వచ్చాయా? కె.ఎస్.రాసిన వ్యవసాయక విప్లవం అట్లాంటి ఒక మౌలిక రచన. అసలు యిలాంటి రచన 1969 నుండి 1977దాకా రాలేదు. మిగితా విప్లవపార్టీల్లో కూడా ఈ అంశం మీద రచనలు ఉన్నాయిగాని కెఎస్ రచనకు ఉన్న స్థాయి కనిపించదు. కెఎస్ అవగాహన ఆ పుస్తకంలో ఎంతగా వ్యక్తమైందో అంతకంటే శక్తివంతంగా ఆయన నిర్మించిన




పార్టీ ఆచరణలో వ్యక్తమైంది. భావాలు ప్రజలకు పరిచయమైనప్పుడే భౌతిక శక్తిగా మారుతాయి అనే సూత్రీకరణ అక్షరాలా ఆ పార్టీలో, సమాజంలో నిరూపణ అయిందని ఆ పుస్తకం ఆధారంగా చెప్పవచ్చు.

అయితే ఇప్పుడు మళ్ళీ ఆ వ్యాసాన్ని చదివితే ఎవరికైనా ఒక అభిప్రాయం తప్పక కలుగుతుంది. మావో హునాన్ వర్గ విశ్లేషణ స్థాయిలో ఉన్న కె ఎస్ వ్యాసం గ్రామీణ సంబంధాల గురించి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ గురించిచాలా లోతుగా వివరించింది. ఆయన అవగాహన వెలుగులో సాగిన మహాద్భుతమైన ప్రజా ఆచరణ ఆనాటి గ్రామవ్యవస్థను కదలబార్చిందని, ఇప్పుడది శిథిలమైపోయి అరుదుగా మాత్రమే అక్కడక్కడా ఊపిరి తీసుకుంటున్నదనీ అనిపిస్తుంది - ఆయన చెప్పిన 'దున్నే వారికే భూమి' అని మౌలిక సమస్య యింకా అపరిష్కృతంగా ఉన్నప్పటికీ. ఇక్కడ ముఖ్యమైన అంశం ఏమంటే - ఆయన అవగాహన యావత్ పార్టీ అవగాహనగా రూపాంతరం చెందింది, ఆచరణలో గొప్ప శక్తిగా పరిణమించింది. ఎంతగానంటే - ఆయన చూపించిన సమాజ చిత్రాన్ని కరిగింప చేసే స్థాయిలో ఆయన అవగాహన సమూహంలో వ్యక్తమైంది. ఆ రచన కెఎస్ సొంత రచనగా గుర్తింపు పొందక పోయినా, పార్టీ అంతర్గత పత్రమే అయినా కెఎస్ రాశాదని అందరికీ తెలిసిందే. 'వ్యవసాయక విప్లవం' పార్టీకి రాజకీయ కార్యక్రమాన్ని నిర్దేశించి, ఆచరణలోకి తీసికెళ్ళిన రచన మాత్రమే కాదు. అంటే కేవలం రాజకీయ ప్రాధాన్యత ఉన్నదేకాదు సిద్ధాంత స్థాయి ఉన్న రచన కూడా.

మళ్ళీ అలాంటి రచన చాలా కాలం దాకా రాలేదు. విప్లవోద్యమం నుండి మార్క్సిస్టు సిద్ధాంతానికి కానుక అనదగిన పుస్తకం రాకపోవడం చాలా ఆశ్చర్యం కలిగించే విషయమే. ఐవి సాంబశివరావు, మహేష్, అనూరాధ గాంధి, సాకేత్‌లాంటి అపార అధ్యయనపరులు, సిద్ధాంత జ్ఞానం గల వాళ్ళు పార్టీలో ఉన్నారు. ఉద్యమ కార్యకలాపాలతోపాటు సిద్ధాంత వ్యవహారాల్లో సైతం తలమునకలైనవాళ్లే. 2000 సంవత్సరంలో 'బాలగోపాల్ తాత్విక గందరగోళం' అనే పుస్తకం ఈ మొత్తానికి ఒక చిన్న మినహాయింపు. సాకేత్ ఇంగ్లీషులో రాసిన 'మేకింగ్ హిస్టరీ' రెండు సంపుటాలు కర్నాటక సామాజిక చరిత్రకు సంబంధించిన అత్యంత ప్రామాణిక రచన అని అకడమిక్ పండితులు సైతం అంగీకరిస్తారు. అనూరాధ గాంధీ పితృస్వామ్యం గురించి, మహిళా ఉద్యమాల గురించి కొన్ని రచనలు చేసింది.

ఇవిగాక యింకా ఒకటి అరా ఉన్నాయేమో తెలియదు. సామాజిక శాస్త్ర పరిజ్ఞానం అపారంగా గల వాళ్లు ఉద్యమంలో ఉన్నా వాళ్ళకు రోజువారీ సాధారణ సమస్యలను సిద్ధాంత పరంగా కేడర్‌కు బోధించే పనితోనే సరిపోయినట్లుంది. యిది చాలా అవసరమైందే గాని మిగిలిపోయిన పని కూడా ముఖ్యమైనది. మార్క్సిస్టు తత్వశాస్త్రం, రాజకీయ అర్థ శాస్త్రం వగైరాల మీద వచ్చిన కొన్ని టెక్స్ట్ పుస్తకాలు కేడర్‌ను దృష్టిలో పెట్టుకొని రాసినవేగాని ఉద్యమంలో తలెత్తిన

సిద్ధాంత సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి రాసినవికాదు. ఆ దష్టి వాటిలో కనిపించదు.

శ్యాం పుస్తకంలో కూడా ఈ లక్షణం కనిపిస్తుంది. యిందులో దిగజారుడు సమస్యపై ఒక కామ్రేడ్‌కు రాసిన ఉత్తరం, బాలగోపాల్ 'మనిషి - చరిత్ర - మార్క్సిజం'పై ఖండన మినహా మిగతా అన్నీ కమిటీల పేరుతో అచ్చయిన పత్రాలు, సర్క్యులర్లు. బాలగోపాల్‌కు సమాధానంగా రాసింది మినహాయిస్తే మిగతా రచనలన్నీ పార్టీ ఆచరణాత్మక సమస్యల మీద రాజకీయ సిద్ధాంత స్పర్శతో కేడర్‌కు సుబోధకంగా రాసినవే. అందులో కూడా ఆర్థిక వాదం గురించి రాసిన వ్యాసం పార్టీ ఆలోచనల మీద, ఆచరణ మీద ఆయనకు ఉన్న అపారమైన పరిశీలనా శక్తిని తెలియజేస్తోంది. ఆర్థిక వాదం అనే సమస్యను సాధారణ సిద్ధాంత స్థాయిలో నిర్ధారిస్తూ దాని పలు రూపాలను అత్యంత నిశితంగా, సూక్ష్మంగా విమర్శించాడు. అలాంటి రచనే పౌరస్పందన వేదిక గురించిన సర్క్యులర్. 'ప్రజా పంథా' పార్టీ మీద రాసిన వ్యాసం నలభై ఏళ్ళుగా విప్లవ పార్టీల మధ్య కొనసాగుతున్న తగాదాల గురించి సమాజంలో స్థిరపడిపోయిన సంవాద దృశ్యానికి తగినట్టే ఉన్నది. నిజానికి మళ్లీ లెనిన్ దగ్గరికే వెళ్ళితే - మెన్షివిక్కులతో ఆయన ఎదుర్కొన్న సమస్యల కంటే మన విప్లవ పార్టీలు అవతలి పక్షంతో ఎక్కువ ఇబ్బందులేం పడలేదు. లెనిన్ చక్కగా వాటిని ఆచరణాత్మక స్థాయి నుండి సిద్ధాంత స్థాయికి తీసికెళ్లాడు. ఆ లక్షణం మన దగ్గర తక్కువే.

ఈ వ్యాసంతో సహా అన్నీ ఒక తరహాకు చెందినవి. బాలగోపాల్ అభిప్రాయాల మీద రాసిన రచన మరో తరహాకు చెందినది. చాలా విచిత్రంగా, విషాదకరంగా శైలి దగ్గరి నుండి వాద పద్ధతిదాకా అన్నిట్లో 'బాలగోపాల్ మాయాజాలం' వ్యాసంలో శ్యాం విఫలమయ్యాడు. విపరీతమైన ఉటంకింపులతో, వెటకారంతో, ఎత్తిపొడుపులతో బాలగోపాల్‌ను ఖండించాడు. నిస్సందేహంగా బాలగోపాల్ అభిప్రాయాలు ఖండనార్హమే. కానీ మిగతా రచనల్లో శ్యాం కనబరచిన సునిశితత్వం, లోతయిన పరిశీలన, ముఖ్యంగా ఒప్పించే గుణం ఈ రచనలో లేవు . ఇవి కేవలం శైలీ వ్యవహారాలు కావు. మిగతా రచనలన్నీ పార్టీ ఆచరణలో తలెత్తిన సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు సూచించడానికి అవసరమైన మేరకు సిద్ధాంత స్పర్శతో రాసినవి. అంటే ఒక రకంగా అది ఆంతరంగిక సంభాషణ. అక్కడి విషయాల మీద పట్టు ఎక్కువ కాబట్టి ఆ పద్ధతే ఆంతరంగికం కాబట్టి అందులో చాలా సునిశితత్వం మంచి సంవిధానం చోటుచేసుకున్నాయి. శ్యాం బాగా తెలిసిన ఓ ఫ్రెండ్ ఈ పుస్తకం చదువుతూ 'పార్టీ తప్పొప్పుల గురించి, వాటిని అర్థం చేసుకోవలసిన తీరు గురించి శ్యాం ఎదుట కూర్చొని మాట్లాడుతున్నట్టే ఉంది' అన్నది. ఆలోచనాపరుడిగా, నాయకుడిగా శ్యాంకున్న బలం యిది.

ఈ ఆవరణ బాలగోపాల్ లేవనెత్తిన అభిప్రాయాల ఆవరణ వేర్వేరు. అక్కడ పూర్తిగా మార్క్సిస్టు చింతనాపరుడిగా మనిషి చరిత్ర గురించి, మార్క్సిజం గురించిసామాజిక సిద్ధాంతకారుడిగా మాట్లాడాల్సి ఉంటుంది. పైగా శ్యాం ఉటంకించిన మార్క్స్ - ఎంగెల్స్ మౌలిక రచనలు బాలగోపాల్ తప్పక చదివే ఉంటాడు. ఆయన వాటిని మర్చిపోతున్నాడని, వక్రీకరిస్తున్నాడని మాత్రమే (అది కూడా ఉండొచ్చు) అనుకుంటే సాగే వాద పద్ధతి ఇట్లాగ ఉంటుంది. శ్యాం రచన ఆద్యంత్యం యిలా నడిచిందే.

దీని గురించి యింత ఎక్కువగా ఎందుకు రాయడమంటే - బాలగోపాల్ అభిప్రాయాల మీద ఖండన రాయడంలో శ్యాం ఎదుర్కొన్న సమస్యకు - జనరల్ మార్క్సిస్టు సిద్ధాంత విషయాల్లో విప్లవోద్యమం కృషి తక్కువగా ఉండటానికి ఎక్కడో సంబంధం ఉన్నది. సిద్ధాంతం ఆచరణకు మార్గదర్శి అనే మౌలిక విషయం పట్ల సందేహమే కూడదు గాని ఆ ఆచరణ - మార్గదర్శకత్వం ఫలానా పార్టీ ఆధ్వర్యంలోనే కాకుండా మానవ సమాజం యావత్తూ పెట్టుబడిదారీ విధానం అనే చారిత్రక దశ నుండి సోషలిజంలోకి సాగే పరివర్తన మొత్తానికి సంబంధించింది కూడా అవుతుంది. ఆలాంటి ఆచరణ నుండి ఇవ్వాల్టి నిర్దిష్ట ఆచరణకు సవాళ్ళు ఎదురవుతుంటాయి. వాటికి ఇవ్వాళ కొనసాగుతున్న ఆచరణే సమాధానం చెప్తుందనుకోవడం వల్ల కొత్తగా నేర్చుకొనేది ఉండదు. సమస్య ఏ తలం నుండి తలెత్తిందో అక్కడి నుండే దాని అన్వేషణ మొదలవ్వాలి. దీనికి ఇవ్వాళ సాగుతున్న ఆచరణ స్ఫూర్తినిస్తుందే కాని, అదే పరిష్కారం కాజాలదు.

బాలగోపాల్ లేవనెత్తిన విషయాలనుగాని, యింకా అలాంటి విషయాలనుగాని ఈ చట్రంలో చూడటానికి మన ఉద్యమాలకు మొదటి నుండి కొంచెం యిబ్బంది ఉన్నదని ఒప్పుకోవాలి. శ్యాం వైఫల్యం కేవలం వ్యక్తిగా ఆయనది కాదు. మన మార్క్సిస్టు పద్ధతికి ఉన్న పరిమితి. మనం శిరసావహించే మన ఉద్యమ నేతల అందరిలో ఎంతోకొంత ఈ సమస్య ఉంటుందనుకోవడం తప్పేమీ కాదు. అందువల్లే సమకాలీన సామాజిక పరిస్థితుల్లో ఉద్యమాలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల, వాటి పరిష్కారాల పట్ల సైద్ధాంతిక అంతర్దృష్టి అందించే రచనలు విప్లవోద్యమం నుండి రావడం లేదు.

దీన్ని బట్టి విప్లవపార్టీలో సిద్ధాంత అధ్యయనం మీద చిన్న చూపు ఉన్నదని దురభిప్రాయానికి రావడం తప్పు. పార్టీలో తరతమ స్థాయిల్లో ఈ సమస్య లేకపోలేదుగాని శ్యాం ఈ రచన రాసిన 1999 నాటికి నాయకత్వానికి సిద్ధాంత విషయాల పట్ల ఎంత అప్రమత్తత ఉన్నదో ఈ రచన ద్వారా తెలుస్తుంది. ఆర్థిక వాదాన్ని గురించిన శ్యాం చర్చ ప్రారంభ బిందువే చాలా విశిష్టమైనది, ఆసక్తికరమైనది. 'సైద్ధాంతిక, రాజకీయాల పట్ల అయిష్టత, సంకుచిత కార్యకలాపాల పట్ల వ్యామోహం' అనే ఉప శీర్షికతో ప్రారంభించి ఉద్యమ ఆచరణలో, వైఖరుల్లో అడుగడుగునా కనిపించే అతి సూక్ష్మమైన ఆర్థికవాద ఛాయలను ఎత్తి చూపాడు. యింకా అనేక ఉప శీర్షికలు ఉన్నా అన్నిట్లో పూసల్లో దారంలా పై విమర్శా వ్యాఖ్య దాగి ఉన్నది. ఆర్థిక వాదాన్ని కత్తివాదరతో నరుక్కుంటూ వెళ్ళాడంటే అతిశయంకాదు. విప్లవ ప్రజల ప్రయోజనాలకు ఆటంకం కావడం దగ్గరి నుండి విప్లవానికే ఆటంకంగా, చివరికి మార్క్సిస్టు మౌలిక సిద్ధాంత ఆవగాహనకే వ్యతిరేకంగా ఆర్థికవాదం ఎట్లా పేట్రేగిపోతున్నదో అత్యద్భుతంగా వివరించాడు.'ఈ పార్టీ ఏం విప్లవం చేస్తుంది?' అనే పందేహం పీడిస్తున్నవారు (సహేతుకంగానే ఈ సందేహం ఉన్నా సరే) ఈ వ్యాసం చదివితే విశ్వాసం కలుగుతుంది. ఉద్యమ అవగాహన, ఆచరణ లోతట్టు పొరల్లో నుండి తప్పుడు ధోరణులను వెలికి తీసే సిద్ధాంత సామర్థ్యం , నిశిత దృష్టి గల నాయకత్వం ఉన్నది కాబట్టి వీళ్ల వల్ల విప్లవం సాధ్యమే అనిపిస్తుంది.

ఆర్థికం యొక్క గాఢమైన వ్యక్తీకరణే రాజకీయాలు అని నమ్మే మార్క్సిస్టు - లెనినిస్టు విప్లవాచరణలోని ఆర్థిక వాదాన్ని ఎండగట్టిన వ్యాసం యిది. దీన్ని కొంచెం విస్తరిస్తే సైనికవాదానికి కూడా అన్వయమవుతుంది. ప్రజా రాజ్యాధికారం కోసం పనిచేసే ఉద్యమంలో సైనికపంథా బదులు సైనిక వాదం పొడసూపే ప్రమాదం పొంచి ఉంటుంది. సైనిక కార్యకలాపాల ప్రాధాన్యతను గుర్తిస్తూనే అదేమైనా సైనికవాదానికి దారితీసే ప్రమాదం ఉన్నదా? అని అప్రమత్తత అవసరం. ఆర్థికవాదానికైనా, సైనికవాదానికైనా శ్యాం చెప్పినట్లు సైద్ధాంతిక రాజకీయాల పట్ల అయిష్టత, సంకుచిత తక్షణ కార్యకలాపాల పట్ల వ్యామోహమే కారణం.

ఉద్యమ నాయకత్వం, కేడర్ ఈ వ్యామోహానికి బలిగాకపోవడం విప్లవ విజయానికి షరతు. శ్యాం ఈ వ్యాసంలో విప్లవ చైతన్యానికి అత్యంత ప్రాధాన్యత యివ్వడమేగాక, ప్రజల విప్లవ చైతన్యాన్ని అడ్డుకొనే ధోరణులు ఉద్యమంలోనే తలెత్తుతాయని అంటాడు. మామూలుగా చైతన్యం అనే మాటను శ్యాం చాలా విస్పష్టంగా ప్రజల విప్లవ చైతన్యం అంటాడు. చైతన్యం-ఆచరణ అనే ద్వంద్వాల పట్ల ఆచరణ నుండి చైతన్యం అనే ధోరణి ఉంటుంది. శ్యాం ఎక్కడా అలాంటి తాత్విక చర్చ నేరుగా చేయలేదుగాని ఆ రెంటి సంబంధాన్ని అంత ఏకముఖంగా, సరళంగా చూచినట్టులేదు. ఆచరణలో తలమునకలైన ఉద్యమ ప్రతినిధి ఈ సంబంధాన్ని ఆచరణలో వస్తున్న

తలనెప్పుల నుండే చాలా సంక్లిష్టమైన సంబంధంగా చూడటం ఒక రకంగా సహజమే.

ఈ పుస్తకంలోని మరో అద్భుత రచన పౌరస్పందన వేదిక గురించి శ్రేణులకు రాసిన వ్యాసం. వేదిక గురించి కేడర్‌కు తెలియజేయడం అనేది ఏకకాలంలో ఇటు వేదికతో - అటు పార్టీ శ్రేణులతో సాగిన సంభాషణగా ఉంటుంది. ముఖ్యంగా వేదిక లేవనెత్తిన ప్రశ్నలను విప్లవోద్యమ ఆచరణ నుండి పరిశీలించి ఆ ఆచరణను మెరుగుదిద్దే ఆత్మవిమర్శనాత్మక అంతరంగిక శైలిలో సాగింది . ఈ శైలి కేడర్‌నేమో అప్రమత్తం చేస్తుంది, బైటి వాళ్ళకేమో విశ్వాసాన్నిస్తుంది. ఈ తరహా సంభాషణే చర్చలదాకా ఒక విశ్వసనీయమైన రాజకీయ ప్రక్రియగా ఉద్యమం లోపల, ఉద్యమం బైట వేదిక సభ్యుల్లాంటి ప్రజాస్వామిక శక్తుల మధ్య విస్తరించింది. ఈ వ్యాసం 1998లో రాశాడు.

దీర్ఘకాలిక ప్రజా ఉద్యమాల్లో ఎంత కాదనుకున్నా ఆచరణ-అవగాహవలకు ఒక నిర్దిష్ట చట్రం ఒకటి రూపొంది ఉంటుంది. ఆచరణ దీర్ఘకాలిక లక్ష్యం అనే వాటి నుండే అది రూపొందుతుంది. ఒక రకంగా ఆంధ్రప్రదేశ్‌లో అనేక ఉద్యమాలు వెల్లువలా వచ్చి చల్లారిపోవడానికి, ప్రారంభంలోని మౌలిక అవగాహనకు విరుద్ధంగా తయారుకావడానికి ఇలాంటి చట్రం లేకపోవడమే. ఒక్క విప్లవోద్యమానికే నిత్య ఆచరణ - దీర్ఘకాలిక లక్ష్యం వల్ల అలాంటి చట్రం రూపొంది స్థిమితమైన వైఖరులు, అవగాహనలతో కొనసాగగలుగుతోంది.

అదే సమయంలో ఆ చట్రమే ప్రతిబంధకంగా మారడానికీ అవకాశం ఉన్నది. ఇది గతితర్కమే గానిబలహీనత కాదు. యాదృశ్చికం కాదు. పైన చెప్పిన చట్రంలోపల తలెత్తే బలహీనతలను, అపధోరణులను గుర్తించడానికి ఆ చట్రం అనుమతించకపోవడం, అదే దుర్భేద్యంగా మారిపోవడం అనే విపత్తు పొంచి ఉంటుంది. దీన్న గుర్తించే నాయకత్వం లేకపోతే చాలా సునాయాసంగా ఉద్యమాలు గిడసబారిపోతాయి.

శ్యాం రచనలు చదువుతుంటే - 1996లో 'నిజామాబాద్ జిల్లా ఉద్యమంలో సమస్యలు - పరిశీలన' అనే వ్యాసం , అదే సంవత్సరంలో' ఉత్తర తెలంగాణ వర్గపోరాటం - నూతన కర్తవ్యాలు, ప్రతిపాదన' పేరుతో రాసిన వ్యాసం, ఆర్థికవాదం, పౌరస్పందన వేదిక వ్యాసాలు సుమారుగా 1994 - 1999 మధ్యకాలంలో మొత్తం విప్లవోద్యమ అవగాహనను తెలియజేస్తాయి. అంతకు మించి పైన చెప్పిన చట్రానికి నాయకత్వం బలికాకుండా అందులోని లోపాల పట్ల లోతయిన ఆత్మ విమర్శనాత్మ దృష్టిని ప్రదర్శించిందని నమ్మకం కలిగిస్తాయి. ఆ చట్రంలో భాగంగా సాగే విప్లవాచరణను బైటి సమాజ ప్రతిస్పందనల సంబంధంలో చూచే సుగుణం కూడా ఉన్నదనిపిస్తుంది. అంటే గొంతుదాకా వర్గపోరాటంలో నిలబడి ఉన్నపార్టీ తన ఆచరణ, అవగాహనల గురించి ఇప్పటి దాకా రూపొంది ఉన్న చట్రానికి కొంచెం ఎడం జరిగి, దాన్ని విమర్శనాత్మకంగా చూడటం చిన్న విషయం కాదు. మామూలు విషయాల్లోనే తమ కుందేలుకు ఒకటో, రెండో కాళ్లున్నాయని, అసలే లేవని వాదించడం చూస్తుంటాం. తెలుగు మేధావుల్లో ఇలాంటి తర్క ప్రభువులు అసంఖ్యాకం. అయితే సమాజాన్ని మౌలికంగా మార్చే విప్లవోద్యమాలకు అప్పటికే అనేక చారిత్రక కారణాల రీత్యా కూడా రూపొంది ఉన్న చట్రానికి కొంచెం ఎడం జరిగి మాత్రమే కాదు, అవసరమైతే వాటిని సమూలంగా పరీక్షకు పెట్టే సాహసం కూడా ఉండాలి. ఆ సాహసం ఉన్నదా? లేదా? అనే పరీక్షను విప్లవ నాయకత్వం ఎదుర్కోవలసిన కాలం కూడా వస్తుంది.

శ్యాం రచనల్లో అంత పెద్ద సాహసిక దృష్టి లేకపోయినా విమర్శనాత్మక దృష్టి చాలా వరకు ఉన్నదని చెప్పవచ్చు. విప్లవాచరణకు ప్రజాస్వామ్య విలువలకు ఫలానా ధోరణి అభ్యంతరం అని పౌరస్పందన వేదిక సూచిస్తే.... శ్యాం దాని అనుపానులేమిటో కనుక్కొనే దిశగా ఆలోచించాడు. ఆ సమస్య అవగాహనకు, ఆచరణకు సంబంధించిందని విశ్లేషించాడు.

మొత్తంగా ఈ రచన ఆధారంగా ఒక స్థూల నిర్ణయానికి రావచ్చు. 1990ల ప్రారంభంలో విప్లవ పార్టీ అంతర్గత సంక్షోభం నుండి బైటపడి కొత్త నాయకత్వాన్ని తయారు చేసుకొని ముందుకు సాగిన దశాబ్దకాలంలోని పరిణతికి ఈ వ్యాసాలు సాక్ష్యం. ముఖ్యంగా కొత్త నాయకత్వం తను వేర్చుకోవడం, నేర్పించడం, సరిదిద్దుకోవడం అనే వాటికి చాలా ప్రాధాన్యత యిచ్చిందని అర్థమవుతుంది. కేవలం రాజకీయ కార్యకలాపాల విస్తరణ నాణ్యతగానేగాక, సిద్ధాంత అవగాహన విస్తృతిగా, విప్లవాచరణలోని ప్రజాస్వామిక విలువల ప్రాధాన్యతగా సాగిందని నమ్మవచ్చు.

అయితే ఈ పుస్తకం వచ్చిన సందర్భం వల్ల కూడా ఇదంతా పదేళ్ల కిందటి చరిత్ర అనిపిస్తుంది. ఈ వ్యాసం ప్రారంభంలో రెండు విషయాలు ప్రస్తావనకు వచ్చాయి. ఒకటి నాయకత్వానికి ఉన్న అవగాహవ మొత్తం నిర్మాణంలో కరిగిపోవడానికి అవరోధాలుంటాయా? ఫలానా నాయకుడి అవగాహనను తర్వాతి కాలంలో ఉద్యమం మరింత ముందుకు తీసికెళ్ళిందా? లేక అసలే విస్మరించిందా? అని చర్చించకపోతే కేవలం సదరు నాయకుడి జ్ఞానానికి మనం పులకించిపోయినట్లవుతుంది. దీని వల్ల ఏ మాత్రం లాభం ఉండదు. కాబట్టి కొంచెం కష్టమే అయినా పై ప్రశ్నలను కనీసంగానైనా వంటబట్టించుకోవాలి.

శ్యాం రచనల్లో ఒక ముఖ్యమైన అంశం కేంద్రంగా ఉన్నది. అది ప్రజా కార్యాచరణ. ప్రజల మధ్య వైరుధ్యాలు పరిష్కరించడం, ప్రజలకూ పాలక వర్గానికి మధ్య వైరుధ్యాన్ని పదునెక్కించడంలో వారిని చైతన్యవంతంగా భాగం చేయడం. అంటే కార్మిక వర్గాన్ని సంఘటితం చేయడం . ఈ రాజకీయ కర్తవ్యం వెనుక లోతయిన సైద్ధాంతిక సమస్యలుంటాయనే అవగాహన ముఖ్యం. పాలక వర్గానికి ప్రజలకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని తీవ్రం చేయడంలో మితవాద వైఖరి తీసుకుంటే ప్రజల్లో విప్లవ చేవ నశిస్తుంది. అతివాద వైఖరి వల్ల విప్లవం దుందుడుకు చర్యల మయమైపోతోంది. ముఖ్యంగా కార్మిక వర్గాన్ని సంఘటితం చేయడమనే కర్తవ్యం విస్మరణకు గురవుతుంది. అందులో వున్న సిద్ధాంత సమస్యలూ మరుగునపడిపోతాయి.

అదనపు విలువ దోపిడీ అనే విషయంలో ప్రజలు శ్రామిక వర్గం అయినా అనేక సామాజిక వ్యవస్థల్లో వేర్వేరుగా మనుగడ సాధిస్తుంటారు. సామాజిక వ్యవస్థలు చారిత్రకంగా ఉనికిలోకి వచ్చినవి కాబట్టి అవి సజీవమైన నియమాలతో ఫంక్షన్ అవుతుంటాయి. ప్రజలను సామాజిక జీవులుగా తయారు చేయడంలో వీటి పాత్ర గణనీయమైనది. దీనివల్లే ప్రజలు సామజిక మానవులుగా వ్యవస్థల ప్రతిరూపాలుగా వ్యవహరిస్తుంటారు. ప్రజల ఆకాంక్షలు, అవసరాలు ఈ వ్యవస్థల ద్వారానే వ్యక్తమవుతుంటాయి. మౌలిక ఉత్పత్తి వ్యవస్థ ప్రాధాన్యతను ఇసుమంతయినా విస్మరించకుండానే ఈ అభిప్రాయానికి రావచ్చు. శ్రామిక వర్గ ఐక్యతకు - పలు సామాజిక వ్యవస్థల వల్ల ప్రజల్లో ఉండే వేర్వేరు సామాజిక మనస్తత్వాలకు, ఆలోచనా రీతులకు, ఆకాంక్షలకు మధ్య సమస్యలు తలెత్తుతుంటాయి. ప్రజలు అనే విస్తృతార్థంలో భాగమైన వారందరి పట్ల బాధ్యతతో, సానుకూల వైఖరితో వ్యవహరించడమనే రాజకీయాంశం మాత్రమే పై సమస్యను పరిష్కరించజాలదు. మావో చెప్పిన మిత్ర వైరుధ్యం అనే భావన మనలో ఒక స్థూల వైఖరిని మాత్రమే నిలిపి ఉంచుతుంది. రోజువారీ వ్యవహార తలంలో ఆ భావవ గొప్పగా ఉపయోగపడేదే. ఆ తాత్విక భావన ఆధారంగా రోజువారీ కలాపాల వెనుక వ్యవస్థల పనితీరును సామాజికంగా విశ్లేషించుకోవాలి. ఇదొక సామాజిక సిద్ధాంత సమస్య.

విప్లవం ఒక రాజకీయ కార్యకలాపం కాబట్టి అందులోని వొత్తిళ్లు సామాజిక సిద్ధాంత సమస్యలను వాయిదా వేయిస్తుంటాయి. విప్లవంలో అనూహ్యవేగంతో సాగిపోయే పరిణామాలుంటాయి. ఒక చిన్న ఘటన మొత్తం పరిస్థితినే తారుమారు చేయగల ప్రకంపనలను సృష్టిస్తుంది. దీవి వల్ల మొట్టమొదట బలైపోయేది సిద్ధాంత ప్రాధాన్యత. చేజారిపోయిన పరిస్థితిని మళ్లీ అదుపులోకి తేవడానికి వేసే రాజకీయ పథకాల్లో సిద్ధాంత మార్గదర్శకత్వం ఎల్లెడలా

పనిచేస్తుందనే నమ్మకం లేదు. అవి పూర్తి స్థాయి రాజకీయ ఎత్తుగడలయినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఆ సమయంలో అవి అత్యవసరం అవుతాయి. అసలు అలా రాజకీయాలు నెరపగలవారే నిజమైన ప్రజానాయకులవుతారు. అయితే విప్లవ ప్రయోజనాలకు ప్రజా ప్రయోజనాలు గీటురాయి కావాలి.

యిదంతా ఎందుకంటే శ్యాం అవగాహనలో సిద్ధాంత స్పర్శ లేదనలేం గాని అది ఎక్కువ రాజకీయాంశంగానే మిగిలిపోయింది. తప్పక రాజకీయంగా చూచి తీరవలసిందే. కానీ ఉద్యమం మొత్తంలో దాన్నిసామాజిక సిద్ధాంత విషయంగా కూడా యింకింపచేస్తే రాజకీయ పరిస్థితులు, అనుకూలతలు తారుమారయినప్పుడు సొంతం తుడిచిపెట్టకపోకుండా మిగిలి ఉంటుంది. ఉదాహరణకు విప్లవంలో హింస పట్ల అవగాహన ప్రత్యేక రాజకీయ పరిస్థితుల్లో ఏర్పరచుకున్న వైఖరిగానే మిగిలిపోతే ఆ పరిస్థితి మారిపోయినప్పుడు సునాయాసంగా ఆ అవగాహన అదృశ్యమవుతుంది. దృఢమైన అవగాహనే ఉంటే ఫలానా సందర్భంలో ఏ వైఖరి తీసుకోవాలి? అనే సమస్య తలెత్తదు. అవగాహనకు భిన్నమైన చర్యలు జరిగే అవకాశమూ ఉండదు. పరిస్థితి మారినప్పుడు హింసాత్మక చర్యలే చేపట్టాల్సి రావచ్చు. అవి విప్లవంలో హింస పట్ల ఉండే మార్క్సిస్టు అవగాహనకు పూర్తి లోబడి ఉంటాయి.

ఇట్లా చూచినప్పుడు శ్యాం విశ్లేషణలు, మార్గదర్శకత్వం , వైఖరులు 1994-99 మధ్య ఉద్యమ దశ, రాజకీయ పరిస్థితులు అనే చట్రం నుండి రూపొందినవి. ఆ పరిస్థితుల్లో మాత్రమే నిలిచి ఉండగలిగినవి. రాజకీయ పరిస్థితి మారాక కూడా నిలబడి ఉండగల సిద్ధాంత బలం శ్యాం రచనల్లో తక్కువే. అదే ఉండి ఉంటే, అది ఉద్యమమంతా స్వీకరించి ఉంటే మారిన రాజకీయ పరిస్థితుల్లో సహితం అది వ్యక్తమయ్యేది. శ్యాం అమరత్వం తర్వాత గడచిన పదేళ్ల ఉద్యమ పరిణామం దృష్ట్యా చూస్తే ఆయన రచనల్లోని విషయాలన్నీ గతానికి సంబంధించినవని అనిపిస్తుంది. మళ్లీ అలాంటి రాజకీయ పరిస్థితి వచ్చినప్పుడు పనికి వస్తాయేమోగాని ఇప్పుడు వాటి వల్ల ప్రయోజనం ఏముంటుంది? అనే సందేహం తలెత్తవచ్చు.

ప్యారిస్ కమ్యూన్ మీద , దాని ఓటమి మీద మార్క్స్ యిచ్చి విశ్లేషణకు మనం కేవలం చారిత్రక ప్రాధాన్యతను మాత్రమే ఆపాదించం. అంతకంటే లోతయిన విషయంగా గుర్తిస్తున్నాం. ఈ తేడా ఎందువల్ల? నిజానికి ప్యారిస్ కమ్యూన్ అనుభవం నుండి మార్క్స్ కార్మిక వర్గ రాజ్యం, రాజ్యాంగయంత్రం మొదలైన రాజకీయ విషయాలనే చర్చించాడు. మార్క్సిజంలో రాజకీయ సిద్ధాంతం అభివృద్ధికావడానికి ప్యారిస్ కమ్యూన్ అనుభవాలు మార్క్సును ఎంత ప్రేరణనిచ్చాయో చెప్పలేం.

ఉద్యమంలో ప్రజాస్వామిక పద్ధతుల గురించి, విలువల గురించి శ్యాం చేసిన విశ్లేషణను - ప్రజల మధ్య వైరుధ్యాలకు కారణాలను, వాటి పరిష్కారాలను సామాజిక సిద్ధాంత స్థాయికి అభివృద్ధి చేయవలసి ఉన్నది. వాటికి ఆ బలమున్నది. కాని ఆ పని పూర్తి కాలేదు. అందువల్ల ఆ స్థాయిలో ఉద్యమంతా ఆయన భావనలు వ్యాపించడానికి సహజంగానే ఒక పరిమితి ఏర్పడింది. ఇది మొదటి కారణం. శ్యాం, మహేష్, మురళి ఎన్‌కౌంటర్ ద్వారా రాజ్యం అనుసరించిన దుర్మార్గమైన అణచివేతను ప్రతిఘటించడం ఉద్యమానికి తప్పనిసరి కావడంతో రాజకీయ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఈ ఒక్క ఎన్‌కౌంటరే కాదు , ఇంకా అనేక కారణాలున్నాయి. యివన్నీ కలిసి ఉద్యమంలో తెచ్చిన మార్పులు అత్యవసరమైనవే. కానీ ఈ రాజకీయ కార్యకలాపం దీర్ఘకాలికంగా ఉద్యమంలో పాదుకోవలసి అంశాలను పక్కన పెట్టేసింది. శ్యాం భావనలు ఉద్యమంతా వ్యాపించకపోవడానికి ఇది రెండో కారణం. పదేళ్ల ఉద్యమాచరణలో దీనివల్ల కలిగిన నష్టం నిష్కర్ష చేయవలసిందే.

ఈ రెండు కారణాల వల్ల ఆయన ఆలోచనలను ఆ తర్వాతి కాలంలో ఉద్యమం ముందుకు తీసికెళ్ళే అవకాశమే లేకుండా పోయింది. ఉదాహరణకు ఉత్తర తెలంగాణలో ఉద్యమ కర్తవ్యాల గురించి శ్యాం ప్రతిపాదనలు ఈ పదేళ్లలో ఆచరణకు నోచుకోలేదు. బహుశా అది ఉద్యమంలో భాగమై ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. ఇవాళ ఉత్తర తెలంగాణ ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్ల రీత్యా ఈ అభిప్రాయం ఉచితమైందే. ఒక వ్యక్తిగాని, ఉద్యమంగాని వెనుకబడిపోవడం కూడా చలనంలో భాగమే. కానీ ఒక చోట శ్యాం అన్నట్టు 'వెనుకబడటం అనేది సుదీర్ఘకాలం కొనసాగితే అది అయిష్టతయినా కావాలి లేదా నిర్లక్ష్యం అయినా కావాలి' అనే మాటలో చురుకైన అర్థం ఉన్నది. ఆయన ఆ మాట వ్యక్తుల గురించే కాదు, సిద్ధాంత విషయాల పట్ల అలసత్వాన్ని విమర్శిస్తూ అన్నాడని ఎర్రసిరాతో గీతలు గీచి గుర్తించుకోవాలి.

❖

## ఫినెక్స్ కవిత : సూరీడు మరణించడు - అస్తమిస్తాడు

సూరీడా!
ఏంటయ్యా
పొద్దు గుంకే వేళ కానే లేదు
మిట్ట మధ్యాహ్నమే
హఠాత్తుగా అస్తమించావెందుకని ?
ఇలా అర్థాంతరంగా మమ్మల్నొదిలి
అంతర్ధానం అవడం నీకు తగునా?
నిన్ను నమ్ముకుని పనుల్లోకి దిగిన
ప్రపంచం ఏం కావాలి ?
నా జననం మరణం
నా ఇష్టం అంటావా?
నేడు నీ మరణం
నీ ఒక్కడి మరణంగా లేదు
సమస్త పీడిత ప్రజల
జీవన్మరణంతో పెనవేసుకుని వున్నది
నీ అస్తమయం ప్రజల బతుకుల్లో
ఎంత చీకట్లు నింపుతుందో ఆలోచించావా ?
బాధ్యత లేకుండా ఒక్కొక్కరూ
నిష్క్రమించడం బాగుందంటావా?
ఇంతకూ
నిన్ను మాకు దూరం చేసిన రాహు-కేతులెవరు?
గ్రహణం వీడాకయినా
కలలోకి వచ్చి చెప్పి పోతావు కదూ!
నీ ఆత్మ విమర్శ కిరాణాల్లో నిక్షిప్తం చేసి పంపు
మేము నిర్వహిస్తున్న దిద్దుబాటు ఉద్యమంలో
దాన్నొక గుణపాఠంగా చేర్చుకుంటాం
సూరీడు అస్తమిస్తాడేగానీ మరణించడు
గ్రహణం వీడిన సూరీడు
మరింత తేజోవంతంగా ప్రకాశిస్తాడు
మీ అమరత్వాల నుండి
గుణపాఠాలు నేర్చుకుని
తప్పులు దిద్దుకుంటాం
ప్రజాయుద్ధాన్ని పరవళ్లు తొక్కిస్తాం
గ్రహణం వీడిన సూర్యుడిలా ప్రజ్వరిల్ల చేస్తాం

సూర్యమా !
నీ అమరత్వం సాక్షిగా
వాగ్దానం చేస్తున్నాం
నువ్వు కలలు గన్న ఇంటలిజెన్స్‌ను పటిష్టం చేస్తాం
నిన్నొక 'జెర్‌జెన్‌స్కీ'గా మా మదిలో
చిరస్థాయిగా నిలుపుకుంటాం
నువ్వందించిన ఎత్తుగడల్తో
ఎస్ఐబి ఎత్తులు చిత్తు చేస్తాం
వాడి పాపాల చిట్టాను
పట్టుకుని ఇంటరాగేట్ చేస్తాం
ప్రజాకోర్టులో మీ నెత్తుటి బాకీని
వడ్డీతో తీర్చుకుంటాం

(అమరుడు కా. పటేల్ సుధాకర్ రెడ్డి (సూర్యం) స్మృతిలో) జూలై 26, 2009. ❖

**నివాళి** ◆ యామిని

# కా. పార్వతి (కెఏఎంఎస్) తో గడిపిన రోజులు

పార్వతి. మా పార్వతిని ఎప్పుడైనా చూశారా మీరు? మా పార్వతి ఆదివాసీ అమ్మాయినా అచ్చం తెలుగమ్మాయిలాగా కనిపిస్తుంది. తెల్లగా, బక్కగా చలాకీగా వుంటూ ప్రతి పనిలో చురుకుగా వుండింది. మాట్లాడటం తక్కువేకానీ మాట్లాడితే మాత్రం ఇట్టే కలియ తిప్పుతుంది.

కా. పార్వతి మార్చి 10వ తారీఖున వడిగో గ్రామంలో ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో వచ్చిన పోలీసులు నిరాయుధంగా, సివిల్‌లో వున్న కామ్రేడ్స్ కమల (సన్‌కీ, బార్సా కమాండర్)ను, పార్వతిని పట్టుకొని కిరాతకంగా కాల్చిచంపి 'ఎన్‌కౌంటర్' కట్టుకథ బొంకింది రమణ్‌సింగ్ ప్రభుత్వం.

బీజాపూర్ నుంచి బైరాంగఢ్‌కు వెళ్ళే రహదారిలో వున్న పుల్లివాయ గ్రామం కా. పార్వతిది. చిన్నప్పటినుండి కష్టపడేతత్వం వున్న పార్వతి గ్రామంలో మహిళా సంఘంలో పనిచేస్తూ క్రమంగా రేంజ్ కమిటీ స్థాయి కెదిగింది. 2005 సంవత్సరం మన పార్టీని అణచటానికి వేరే మార్గం లేక ప్రభుత్వం 'సల్వాజుడుం' ఆయుధాన్ని ఉపయోగిస్తూ ఊర్లకు ఊర్లు వల్లకాడు చేస్తూ, పంటలను ధ్వంసం చేస్తూ, యువతులపై అత్యాచారాలు చేయటం మాములుగా మారిన సమయంలో ఈ సమస్యలన్నిటికీ తుపాకీ పట్టటమే పరిష్కారమని భావించి పూర్తికాలం పార్టీలోకి రావటానికి సిద్ధపడింది. అలా పశ్చిమబస్తర్ నుండి ఉత్తరబస్తర్ పయనం సాగించింది. అక్కడి భాషకు, ఇక్కడి భాషకు తారతమ్యాలున్నప్పటికీ ఇక్కడి 'యాసను' నేర్చుకొంటూ ప్రజల్లో కలిసిపోయింది. ఉత్తర బస్తర్ నుండి తూర్పు బస్తర్‌కు బదిలీ అయ్యి కేసకల్ ఏరియాలోని 17వ ప్లాటూన్ సభ్యురాలిగా వుంటూ మిలటరీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేది. అర, ముల్లేలలో పోలీసులపై చేసిన ఫైరింగ్స్‌లో పాల్గొంది. ఫైరింగ్ సమయంలో ఏ మాత్రం ముందు వెనుక పడేది కాదు. తర్వాత తనకున్న అనారోగ్య కారణాల్లోంచి మిలటరీ నుంచి తీసి మహిళారంగంలో 2007 సంవత్సరంలో పెట్టడమైంది. అప్పటి నుంచి అమరత్వం చెందేవరకు బార్సా ఏరియాలో వుంటూ మహిళా సంఘాల నిర్మాణానికి కృషి చేసింది. ఆమెతో గడిపిన ఆ కొద్ది రోజులను నెమరవేసుకుంటే.........

ఒక రోజు రాసుకుంటూ వుండగా వచ్చింది. తల పైకెత్తి చూస్తే నవ్వు మొఖం. అప్పటికీ నాకున్న పరిచయం కొన్ని రోజులు మాత్రమే. భాష కూడా సమస్యే. ఏంటన్నట్లు కళ్ళతో మాట్లాడితే సమాధానం చిరునవ్వు. నేను రాస్తున్న పేపరు, పెన్ను పక్కనపెట్టి కూర్చోవటానికి చోటిచ్చాను. చెప్పటం మొదలుపెట్టింది.. ఆమె మాటల్లోనే......

"ఇంటి దగ్గర వున్నప్పుడు కె.ఎ.ఎం.ఎస్.లోనే పనిచేశాను. కానీ ఇప్పుడు చేయాలంటే..........అంటూ ఆగింది.

"ఊ.........." చెప్పు అంటే,

నవ్వుతూ........... చేస్తాను కానీ ఎవరూ లేకుండా ఎట్లా?

తోడుంటే..."

తన సంశయాన్ని గమనించి సరే! అంటే ఎంతో ఉప్పొంగిపోయి తన మనసును నా ముందు పరిచింది.

'2005 సంవత్సరంలో సల్వాజుడుం మొదలైన సమయంలో మా ఊరు రోడ్డు మీద వుండటం వలన పోలీసులు ఎక్కువగా దాడులు చేయటం, పట్టుకుపోవడాలు, భయపెట్టే మీటింగ్‌లు పెట్టేవాళ్ళు. అప్పటికే నేను రేంజ్ కమిటీలో వున్నాను. ఎవరూ పార్టీకి సహకరించొద్దంటూ రెండుసార్లు ప్రజలందర్నీ పిలిపించి మీటింగ్ పెట్టారు. ప్రజలంతా ఏం చేయాలా? అని అనుకుంటుండగా, మరలా మీటింగ్ పెట్టటానికి మహేంద్రకర్మ సల్వాజుడుం గూండాలు, ఎస్‌పివోలతో వచ్చాడు. ఆ రోజు ఎవరం మీటింగ్‌కు వెళ్ళొద్దనుకున్నాం. అందుకని చాలామంది వెళ్ళలేదు. అయితే ఆరోజు మీటింగ్‌లో మహేంద్రకర్మ జనం అందరిముందు నన్ను వుంచుకుంటనన్నాడంట. మీటింగ్‌కు వెళ్ళిన వాళ్లు వచ్చిన తర్వాత నన్ను కలసి ఈ విషయం చెప్పారు. జనమంతా మీటింగ్‌కు వెళ్ళకపోవటంతో వాడికి ఏం చేయాలో తోచక పిచ్చిపట్టినట్లు వాగాడు....' అంటూ చెప్పుతుంటే ముఖమంతా ఎర్రగామారి ఆవేశం అలలా పొంగుతుంటే... తన ఆవేశాన్ని ఫుల్‌స్టాప్ పెట్టటం ఇష్టంలేక "మరి తర్వాత" అన్నాను.

"ఒక రోజు వాగులో స్నానం చేస్తున్నాను. నా వెనుక వైపున శబ్దం వస్తుంటే వెనక్కి తిరిగి చూస్తే.......ఇంకేముంది పోలీసులు. అప్పటికీ రేంజ్ కమిటీలో పనిచేస్తుండటం, రెండు, మూడు సార్లు సల్వాజుడుం మీటింగ్‌లకు వెళ్ళకపోవటం వలన నా పేరు అంతటాపాకింది. దాంతోటినన్ను పట్టుకోవటానికి ఊరినుంచి కాకుండా ఊరి చివర వున్న వాగు అంచునుంచి ఊర్లోకి వస్తున్నట్టున్నారు. నేను వారిని చూసినదే తడవుగా బట్టలన్నీ అక్కడే పడివేసి అంతే పరుగెత్తాను. మొత్తం రెండు బ్యాచ్‌లయ్యి నావెంట పడ్డారు కానీ అందుకోలేకపోయారు. మధ్యలో రెండు తూటాలు ఫైర్ చేశారు. ఫైరింగ్ శబ్దం వచ్చినప్పుడు అంతే వంగొనే దాన్ని. అట్టా ఒక పెద్ద కొండ వుంటే ఎక్కాను. వాళ్ళు కొద్ది దూరం వచ్చి నేను కనపడకపోయేటప్పటికీ వెనక్కి వెళ్ళిపోయారు. ఆ రోజు కూడా ఊర్లో మీటింగ్ పెట్టారు. నన్ను సరెండర్ కమ్మని లేదంటే మా వాళ్ళను చంపేస్తామని. కానీ నేను భయపడలా. ఊర్లోవుంటే ఏదో ఒకరోజు ఎత్తుకుపోతారు, చంపేస్తారు. అదే పార్టీలో కొస్తే సల్వాజుడుంను ఎదిరించవచ్చు. నాలాంటి ఆడపిల్లలకు అండగా వుండొచ్చని పార్టీలోని వచ్చేశా. నేను వచ్చాక మా కుటుంబం వాళ్ళను ఎస్‌పీవోల్లో భర్తీ చేసుకున్నారు. రాహత్ శిబిరాల్లో చాలామందిని పెట్టారు. మా ఊరికి 5నిమిషాల దూరంలో వున్న మరొక ఊరిలో క్యాంపు పెట్టారు. క్యాంపు పెట్టిన దగ్గర్నుంచి వారి ఆగడాలు ఎక్కువయ్యాయి. ఎప్పుడూ మహిళలపై అత్యాచారాలు, చంపటాలు, పిల్లలగొంతుకోసి చంపటాలు ఒక్కటేంటి? ఎన్ని అకృత్యాలు! ఏ ఆడపిల్ల బలికాదు వాడి కామవాంఛకి వినేదు, వరసలేదు. అందుకే నేను పార్టీలో కొచ్చి కనీసం ఒక్కపోలీసునన్నా చంపాలనుంది". అంటుంటే అట్లే చూస్తుండిపోయాను.

గుండె నిండా అలుముకున్న బాధలు.....

ఉబికివచ్చే కన్నీటి చారికలు.........

అలలా ఎగసిపడే కలిసి...

నిజం మరి! అడవినే నమ్ముకున్న అమాయక ప్రజల నోటికాడ కూడును గద్దల్లా తన్నుకుపోతుంటే ఎవరికి కోపం వుండదు? ఎవరికి కసివుండదు? తమ జీవితాలను భిన్నాభిన్నం చేస్తున్న వ్యవస్థపై ఎవరికి తిరుగుబాటు చేయాలనుండదు? హాయిగా, స్వేచ్ఛగా విహరించాలని ప్రతి ఆడపిల్ల కోరుకుంటుంది. కానీ విహరించాల్సిన తమ రెక్కలను మధ్యలోనే విరిచేస్తుంటే ఏ ఆడపిల్ల చూస్తూ ఊరుకుంటుంది? ఒకటా, రెండా! పదులు, వందలు రెక్కలు అలా తెగిపడుతుంటే... అందుకే తమ రెక్కలను విరిచేస్తున్న వారిపై కోపం. నోటికాడ కూడును తన్నుకుపోతున్న గద్దలపై కసి. ఆ కసిని తీర్చుకోవటానికి పార్వతి ఎంచుకున్న మార్గం పార్టీ. ఒక్క పోలీసునన్నా చంపాలనుంది అని పార్వతి ఆశపడిందంటే ఎంత కసి వుంటే ఆ మాటన్నదో అర్థం చేసుకోవచ్చు. అందుకే పార్వతి కన్న కలలను, కోరికలను నెరవేర్చాల్సిన బాధ్యత మనందరిపై వుంది. ఆ బాటలో ముందుకు పయనిస్తూ........

ఎర్రపూల వనంలోన పువ్వై పూసిన మా పార్వతి!

అందుకో మందారాల పూదండను!

(మార్చి 10న ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో నిరాయుధంగా, సివిల్‌లో వున్న కా. పార్వతిని పట్టుకుని కాల్చి చంపారు పోలీసులు. ఆమె విడిచివెళ్ళిన గుర్తులను తడుముకుంటూ.)

❖

**నివాళి**

◆ **యామిని**

# చిరునవ్వుల సూర్యమన్నకు...

అవి జిల్లా ప్లీనానికి సన్నాహాలు జరుగుతున్న రోజులు. అప్పటికయిా రెండు రోజుల క్రిందట రాష్ట్ర నాయకత్వం వచ్చి వుంది. అప్పటికీ ముఖపరిచయం వున్న వాళ్ళు, లేనివాళ్ళతో క్యాంపు కలగలసివుంది. ముఖపరిచయం లేని వాళ్ళతో మాట్లాడాలంటే కొంత సంశయించేదాన్ని. అలా ఆ ఏర్పాట్లలో వున్నప్పుడే పిఎల్‌జిఎ డే కూడా వచ్చేసింది. ఒక వైపు ప్లీనం పనులు, మరోవైపు పిఎల్‌జిఎ పనులతో అందరం బిజీగా వున్నాం.

శీతాకాలం కావటంతో సమయం 12గంటలు అయినా ఎండ వేడిమి అస్సలు తగలటం లేదు. వీచే చలిగాలులతో క్యాంపంతా నిండిపోయింది. ఆ చలిగాలుల మధ్యనే పనుల మీద వెళ్తూనే వెళ్తూ, వస్తూ కుదిరిన ఆ కొద్ది సమయంలోనే క్యాంప్‌లో ఉండి అందరితో గడిపేవాళ్ళం. ఒకరోజు పని మీద వెళ్లి వచ్చి కిచెన్ దగ్గర ప్లేట్ కడుక్కొంటుండుగా వెనుకనుంచి వినిపించిందో స్వరం. తల పైకెత్తి చూస్తే... భారీ ఆకారం... భారీ తుపాకీ... వెరసి సూర్యమన్న. అప్పటికే ముఖ పరిచయం వున్నప్పటికీ చూస్తూ, సంకోచిస్తూ ఏంటన్నా? అనడిగాను

'పిఎల్‌జిఎ'డే కదా, అంటే,

ఒకింత నవ్వు, 'అవును కదా!' అన్నాను.

'అన్నం పెట్టుకొని రా! అక్కడ కూర్చుని మాట్లాడుకుందాం'ని అక్కడ కనిపిస్తున్న మొద్దును చూపించాడు.

"ఊ.....అంటూ తను చూపించిన మొద్దును చూసి ముందుకు వెళ్ళుతుంటే పిఎల్‌జిఎడే మదిలో మెదిలింది... అవును పిఎల్‌జిఎ డే అమరుల స్మృతికి చిహ్నంగా, వారి ఆశయాల సాక్షిగా వెలుగొందిన రోజు. ఆధునిక ఆయుధాలతో పార్టీని అణచాలని చూస్తున్న దోపిడీ వర్గాలకు 'సైన్య' నిర్మాణంతో వెన్నులో చలిపుట్టించిన, పుట్టిస్తున్న రోజు. నిద్రలో కూడా కలువరించే విధంగా శత్రువుపై దెబ్బమీద దెబ్బవేస్తూ పిఎల్‌జిఎ యోధుల కర్తవ్యానికి పదునుపెట్టినరోజు. మనప్రియతమ నాయకులు కా.శ్యామ్, మహేష్, మురళిల అమరుల నెత్తుటిబాకీ తీర్చుకుంటామని శపథం చేసినరోజు... అందుకే ఈరోజును ఎలా మరచిపోగలను? ఉదయం రోల్‌కాల్‌లో కా.లత (అమరురాలు సుగుణ) చెప్పనే చెప్పింది. అందరూ 2గంటలకు గ్రౌండ్‌కు రావాలని. అందుకే అవన్నీ గుర్తుతెచ్చుకుంటూనే, ఒక పక్క సూర్యమన్నతో మాట్లాడాలంటే టెన్షన్‌కు గురవుతూ కిచెన్ దగ్గరకు వెళ్ళాను. నా టెన్షన్ గమనించిన కిచెన్ కామ్రేడ్స్ కళ్ళతో 'ఏమిటని' పలుకరించేటప్పటికి వచ్చీరాని నవ్వుతో సమాధానం చెప్పాను. ప్లేటు తీసుకొని అన్న చెప్పిన ఆ మొద్దు దగ్గరకు వెళ్ళి కూర్చున్నాను. మొఖం వైపు చూడాలన్నా భయంగా వుంది. ఏం మాట్లాటతానోనని. తనే అందుకుని,

'టిఫిన్ సమయం నుంచి కనపడలేదు, ఎక్కడికెళ్ళావ్?' అంటే,

'సామాను కోసం వెళ్ళానన్నా'.

'అలాగా! ఉదయం రోల్‌కాల్‌లో విన్నావుగా, మీటింగ్ వుందని, మరి తయారైనావా?'

'దేనికి'?

"దేనికేంటి? అధ్యక్షత వహించాల్సింది నువ్వేగా!"

భయంతో 'అమ్మో, నేనా?

"ఆ... అంత భయపడతావెందుకు? మిలటరీ దళంలో వున్నావు కాబట్టి పిఎల్‌జిఎ ప్రాధాన్యత (అప్పటికీ మన సైన్యరూపం పిజిఎ మీద రెండు ముక్కలు మాట్లాడి తర్వాత ఎవరెవరు మాట్లాడుతారో పిలువు అంతే" అంటూ తేలిగ్గా చెప్పేస్తున్నాడు.



అబ్బో! ఎంత సింపుల్‌గా చెప్పేస్తున్నాడు. దీనికి నాలోవున్న 'న్యూనత' నాకు నవ్వు తెప్పించింది. అసలు మాట్లాడాలంటేనే భయపడే నాకు ఇంత మంచినీళ్ళు తాగినంత సింపుల్‌గా చెప్పేశాడేంటబ్బా అనుకుంటూ ఆలోచించాను. అప్పటికీ నాకున్న స్టేజి ఫీలింగ్‌లో నుంచి, ఏం చేయాలిప్పుడు? ఏదేమైనప్పటికీ భయపడే విధంగా, బరువుగా కాకుండా 'సింపుల్‌గా' ప్రోత్సహించటంతో ఒకింత ఆశ్చర్యానికి గురయ్యాను. ఆ ఆశ్చర్యంలోనుంచే 'నేను ఎప్పుడూ మాట్లాడలేదన్నా. అయినా నాకన్నా సీనియర్స్ వున్నారు కదా!' అని నసుగుతూనే 'మరయితే ఏయే విషయాలు మాట్లాడాలో కొంచెం క్లూ ఇస్తే...' పూర్తిగా పెదవుల మీదకు రాకముందే,

"ఆ... అస్సలు చెప్పను (నిర్మొహమాటంగా) నీవే తయారుచేసుకొచ్చి నాకు చూపించు" అంటూ లేచి ప్లేటు కడుక్కోవటానికి వెళ్తుంటే... అంతే చూస్తూ అప్పటివరకు గబగబ తింటున్న దాన్నల్లా ఒక్కొక్క మెతుకు తింటూ...

ఎంత పెద్ద పనో? ఇప్పడికిప్పుడంటే మాటలా? నావల్ల కాదంటుంటే కూడా. నేనా, అంత రాజకీయాలు ఔపోసన పట్టిన దాన్ని కాను. చెప్పగానే చటుక్కున వెళ్ళి టకటక మాట్లాడటానికి. పోనీ ఎవర్నన్నా అడుగుదామా! అని గబుక్కున ఆలోచన వచ్చింది. అప్పటికీ నాయకత్వం క్యాంపులోనే వుండటంతో. మరలా నువ్వే తయారుచేయాలన్న అన్న మాటలు గుర్తుకు వచ్చి, సలహా అడుగుదామని మదిలో ఎవరెవరో మెదిలి కూడా 'అడుగుదామ'నే తొందరపాటును 'అమాంతం' మింగేశాను. ఎట్లైతే అట్లవుతుందని నా మెదడుకు పనిచెప్పటం ప్రారంభించాను. పెట్టగా, పెట్టగా 'సాన' వచ్చింది. అది పట్టుకొని అన్న దగ్గరకు వెళ్తుండగా తనే ఎదురువచ్చాడు. చూస్తూనే నవ్వుతూ పలకరింపు పేపర్‌పై పెట్టింది చూపిస్తే... ప్రతిస్పందన నవ్వే. నేను కూడా ప్రతిస్పందిస్తూ 'ఇట్లాగేనన్నా' అంటే, చిరునవ్వే సమాధానం.....పేపర్‌ను అలా చూస్తుండగానే విజిల్ కాషన్ వివపడింది. పద!పద! విజిల్ వేస్తున్నారు. తర్వాత మాట్లాడుకుందాంలే! అంటూ పేపర్లన్నీ నా చేతికిచ్చేసి గ్రౌండ్‌వైపు అడుగులు సాగాయి. తన వెనకాలే నా అడుగులు కూడా కదిలాయి.

విజిల్ కాషన్ విని అందరూ వచ్చారు. జెండా వందనం, స్థూపావిష్కరణ, అమరులకు 2నిమిషాల మౌనం పూర్తయ్యాయి. నావంతుగా మాట్లాడే క్షణాలు భయపెట్టేస్తున్నాయి. నా ముఖ కవళికలను గమనించిన అమరురాలు కా. లత (సుగుణ) కళ్ళతోనే ధైర్యం చెప్పింది. సూర్యమన్న కేసి చూస్తే... నవ్వుతూనే ధైర్యాన్నిస్తున్నట్లనిపించింది. ఒకింత సంకోచిస్తూనే ప్రారంభించాను. పిజిఎ ప్రాధాన్యతను మాట్లాడటం.... తర్వాత ఒక్కొక్కరిని పిలవటం, పాటలు.....

చివరిగా సూర్యమన్న ప్రసంగం. ప్రవహంలా సాగుతున్న మాటల ఒరవడి. 'సైన్య' నిర్మాణంలో శత్రువును గుబులు పుట్టించిన తీరు, కొత్త కొత్త ఎత్తుగడలతో ముందుకు పోవాల్సిన అవసరాన్ని, శత్రువు బలహీనతలు వివరిస్తూ... మూడు మహాపర్వతాలను కూల్చాలంటే కా. మావో చెప్పినట్లు 'సాయుధపోరాటం ద్వారానే అధికారాన్ని హస్తగతం చేసుకోవటం, సమస్యను యుద్ధం ద్వారానే పరిష్కరించటం' అనే సూత్రాన్ని ఎప్పుడూ, ఎవరూ మరువరాదంటూ చెపుతుంటే అందరం చెవులురిక్కించి వింటున్నాము. ప్రకృతి కూడా అంతే పరవశించిపోయి నిశ్శబ్దంగా వింటుంది. చివరిగా అమరుడు కా. శ్యామ్ పై వేసిన 'తల్లి వలపోత' స్కిట్ కళ్ళకు కట్టినట్లు చిత్రించటంతో అందరి కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి. ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకుందామని ఎంత ప్రయత్నించినా నావల్ల కాలేదు. అవి తుడుచుకుంటూనే అక్కడ్నుంచి విసవిస వెళ్ళిపోతుంటే,

'ఎక్కడికిపోతున్నావ్' అంత తొందరగా? అంటే, కారుతున్న కన్నీటిని తుడుచుకుంటూనే తల నేల వాలేశాను.

"మంచిగా మాట్లాడావ్, శభాష్" అంటే,

"నిజంగానా"!

"ఊ... నిజంగానే, మాట్లాడమంటే ఎంత భయపడ్డావో చూడు. భయపడితే ఎట్లా? సాధించలేమనేది సాధించితీరాలి" అంటూ మాట్లాడుతుంటే రెప్పార్పకుండా వింటున్నాను. అంత బాధలో తను మాట్లాడుతుంటే మనసుకు ఊరట అనిపించింది. బాధను కూడా మరిపించే విధంగా మాట్లాడుతుంటే మాటలా? ఎంతో నైపుణ్యం వుండాలి. వారి మనసులు అర్థమవ్వాలి. అటువంటి నైపుణ్యం అందరికీ అబ్బదు. కొందరికే అది సొంతం. ఆ కొందరిలో సూర్యమన్న ఒకరు. దానికి సరిగ్గా నవ్వుతాడు కూడా.

నిజమే మరి! మాట్లాడమన్నప్పుడు తనే అన్నీ విషయాలు చెప్పివుంటే కనుక నామెదడుకు పదును వచ్చేది కాదు. నా అంతట నేను ఆలోచించాలనే దానికి ఫుల్‌స్టాప్ పెట్టేదాన్నేమో. కానీ అలా కాకుండా సూర్యమన్న నాలో వున్న భయాన్నీ, స్టేజి ఫీలింగ్‌ను కొంతలో కొంత తొలగించి ప్రోత్సాహం ఇవ్వటం, ప్రతి పనిని బరువుగా అంటే చేయలేమనే కాకుండా చేయగలుగుతామనే విశ్వాసాన్ని కలిగించటమనేది ఎంతో ఉత్తేజకరమైన విషయం. అటువంటి ఉత్తేజకరమైన విశ్వాసాలు, సంఘటనలు మదిలో శాశ్వత చిహ్నాలుగా నిలిచిపోతాయి. అలా సూర్యమన్నలా వెన్నంటి వుండి ఆలోచించగల ప్రోత్సాహం ఇస్తే ఎవరైనా, ఎప్పుడైనా తమలో వున్న సృజనాత్మకతను వెలికి తీసి దాన్ని అభివృద్ధి చేసుకోవటానికి ఎక్కువ దోహదపడుతుంది. అందునా మహిళా కామ్రేడ్స్ విషయంలో ఎక్కువ కృషి చేయాల్సి వుంటుంది.

మొదట్లో తనతో మాట్లాడాలంటే భయమేసేది. తన తుపాకే ప్రత్యేకంగా వున్న లేజర్ కిరణాల లైటు ఎందుకు? అని అనుమానం వచ్చినప్పటికీ ఎదురుపడి ప్రశ్నించాలంటే మొహమాటం. అందుకే అందరిలో భాగంగా అడిగేటప్పటికీ దాని ఉపయోగం చెప్పి దాన్ని అక్కడ చేరినందరి చేత ప్రెస్ చేయించి చూపించాడు. (చదువుకునే రోజుల్లోనుంచే ఆ లైటు గురించి తెలిసినప్పటికీ తుపాకీకీ ఎందుకు అనే అనుమానంతో) అప్పటికీ నాకున్న పరిజ్ఞానంలో నుంచి అమాయకంగా అడిగే ప్రశ్నలకు నవ్వుతూ సమాధానమిచ్చేవాడు. దాంతో 'అన్న'తో ఫ్రీగా మాట్లాడేయవచ్చనిపించింది. ఇందులో నుండి మహిళా కామ్రేడ్స్‌ను ప్రేమించటం, వారిని ఎదిగించుకోవటానికి బాగా తపన పడేవాడని అర్థమైంది. నిజం కూడా. ఎందుకంటే తనతో కలిసి వున్నప్పటి మహిళా కామ్రేడ్స్ కూడా వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఇవే. అందుకే వెన్నెలాంటి చల్లని మనసున్నవాడు కా. సూర్యమన్న.

తను అమరుడయ్యేనాటికి పార్టీ 'ఇంటెలిజెన్స్' బాధ్యతలు చూస్తున్నాడని తెలిసిన తర్వాత, నిజంగా దీనికి అచ్చుగుద్దిన మనిషి కదా! అన్పించింది. ఎందుకంటే, 99వ సంవత్సరంలో రాష్ట్ర కమిటీ మీటింగ్ సందర్భంగా ప్రొటెక్షన్ అవసరాల రీత్యా మా దళం మొత్తం వెళ్ళింది. ఆ మీటింగ్ జరుగుతున్న సమయంలో రోజూ సాయంత్రం టీ సమయంలో రాష్ట్ర కమిటీ మెంబర్స్ ఏదో ఒక విషయం మీద మాట్లాడేవాళ్ళు. అందులో భాగంగా ఒక రోజు సూర్యమన్న వంతు వచ్చింది. విషయం ఇంటెలిజెన్స్ శత్రువు గూఢచార వ్యవస్థను వివరించే క్రమంలో... పక్షుల అరుపులను ఏ విధంగా అర్థం చేసుకోవాలనే దాంట్లో భాగంగా... తీతువు పిట్ట గురించి చెపుతూ... 'తీతువు పిట్ట అరిచిందంటే దానికి ఒక కారణం వుంటుంది. ఆ చుట్టుపక్కల జంతువులు గానీ, మనుషులుగానీ వున్నారని అర్థం. అది ఏ కదలికలు లేకుండా అరవదు. అంటే అది అరిచిన చోట జంతువులో? శత్రువో పొంచి వున్నాడా? అని చెక్ చేసుకోవాలనే అర్థం' అంటూ చెప్పుకుపోతుంటే... ఎంత నిశితదృష్టి, ఎంత సమగ్ర పరిశీలన ఎంతో మమేకమై అధ్యయనం చేస్తేనే కదా! ఇంత సమాచారం దొరికేది. దానిక్కూడా అంటే ఒక విషయం మీద పట్టు సంపాదించాలంటే ఎంత కుస్తీ పట్టాలో అంత పట్టి దాన్ని మొత్తంగా గ్రహించటమంటే మామూలు విషయం కాదు. అలా కా. సూర్యమన్న ప్రతి విషయాన్ని లోతుగా అర్థం చేసుకోవటం, విషయాలపై చాలా త్వరగా స్పందించటం. స్థాయి వయసు తారతమ్యం లేకుండా అందరితో కలివిడిగా వుంటూ అందరి మన్ననలు పొందటమనేవి తన వ్యక్తిత్వానికి నిదర్శనాలు. అందుకే తనతో గడిపింది కొన్ని రోజులే అయినప్పటికీ ఎప్పటికీ మరచిపోలేని తీపి గుర్తులుగా నిలిచిపోతాయి.

మిలటరీ విషయంలో కూడా శత్రువుపై వ్యూహరచన చేసి దెబ్బకొట్టడంలో అందెవేసిన చేయి. మన ప్రియతమ నాయకులు కామ్రేడ్స్‌శ్యామ్, మహేష్, మురళిలను పాశవికంగా హత్యచేసి విర్రవీగుతున్న అప్పటి హోంమంత్రి మాధవరెడ్డిని, నెత్తుటి మాంసం రుచిమరిగిన హైదరాబాదు ఎస్.పి. ఉమేష్ చంద్రను, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన, నరమాంస భక్షకుడు నారాచంద్రబాబునాయుడిపై ఘటనలకు వ్యూహరచన చేసి, దాన్ని అమలు చేయించటంతో, శత్రువును ముప్పుతిప్పలుపెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించటంతో వాడు గంగవెర్రులెత్తిపోయాడు. ఈ ఘటనలు రాజకీయంగా మంచి ప్రభావమేసి, విప్లవప్రజల్లో ఉత్సాహాన్ని వెల్లువెత్తించింది. అందుకే తానే అన్నట్లు "సాధించలేమనుకునే దాన్ని సాధించి తీరాలనేది" అక్షరాల నిజం. ఇలాంటి సుగుణాలు ఎన్నో, ఎన్నెన్నో. అందుకే అన్ని సుగుణాలు కలిగిన నిండైన సూర్యమన్నను కోల్పోవటం పురోగమిస్తున్న మనపార్టీకి తీరని నష్టం, మరింత బాధాకరమైన విషయం. ఆ నష్టాన్ని పూడ్చుకుంటూనే, ఆ బాధను దిగమింగుకుంటూనే తను నమ్మిన సిద్ధాంతాల, ఆశయాల పల్లకీని మోయాల్సిన బాధ్యత మనందరిపై వుంది. అందుకే అమరుల జ్ఞాపకాలను స్మరించుకొంటూ కన్నీళ్ళను కత్తులుగా మార్చుకొనే సమయం ఆసన్నమైంది. అందుకే...

నిరంతరం వెలుగునందించే చిరునవ్వుల మా సూర్యమన్న!
మీ నెత్తుటి బాకీ తీర్చుకుంటామని
కళింగనగర్ కదంతొక్కింది
నల్లమల్ల నగారా మోగింది.
లాల్‌గఢ్ లాల్ ప్రవాహమైంది.
దండకారణ్యం దండై కదిలింది.

(మే 29న వరంగల్ జిల్లా లవ్వాల అడవుల్లో నేలకొరిగిన కా. సూర్యమన్న (పటేల్ సుధాకరరెడ్డి) మహిళా కామ్రేడ్స్ ఎదుగుదలకు బాగా తపనపడేవాడు. తనతో గడిపిన ఆ కొన్ని రోజులను స్మరించుకొంటూ...)

సమీక్ష

◆ కాశీం

# అనుభవాల 'మా తొవ్వ'

"ఎతలు ఎల్లిపారుతూ మనసు కుతకుత ఉడికితే....
జాలు వారిన సెమట సుక్కల పంట...
ఈల వేస్తూ కంటితో అందుకున్న రూపాయి నోటు
నొసటితో ఏరుకున్న ఆటాన బిల్ల...
ఊల్లెకు పోతే కంపు వాసన కొట్టె లంద బతుకులు
దుమ్ము దులుపుతం ఎద్దు కొమ్ముల మిగ్గుదీస్తం" (పుట 26)

"ఒక రచయితకు రచనా సామర్థ్యం లేకపోయినా సరిచేయవచ్చుగాని, జీవితం తెలియకపోతే సరి చెయ్యటం ఎవరి వల్ల కాదని" కొకు చెప్పినట్లు 'మా తొవ్వ' కవితా పుస్తకాన్ని తెచ్చిన సిద్దెంకి యాదగిరికి విశాల మైన జీవితం ఉంది. ఈ జీవితం కళాత్మకమైనది. కనుక ఈ కవి జీవితాన్ని కవిత్వం చేశాడు. వేల సంవత్సరాల చరిత్రను, అనుభవాలను ఈ కవిత్వంలో రికార్డు చేసే ప్రయత్నం చేశాడు.

ఈ కవిత్వాన్ని నాలుగు రకాలుగా విభజించవచ్చు

1. భూమి కడుపులో కళ్లు పెట్టి విప్పారిన జీవితం
2. చిర్రా చిటికెన పుల్లతో చిందేసిన కవిత్వం
3. గ్లోబల్ సంతలో తప్పిపోయిన బతుకు
4. పల్లెవాసనల జ్ఞాపకాలు


మట్టే బతుకైన చోట మన్ను కోసం దేవులాట. మట్టిని పేరు పెట్టి పిలిచిన మనిషి కోసం ఆరాటం. మట్టికి జీవం అద్దిన మనుషులను ఎవరని అడిగితే? 'మేం భూ సంబందీకుల'మని అంటాడీ కవి. 'మేం భూ సంబందీకులం' అని కవితను ఎత్తుకోవటంలో మంచి నైపుణ్యం ఉంది. ఎత్తుగడ కవితకు దర్వాజ లాంటిది. 'నేను ఆమెను చూశాను' అనే కవితలో శివసాగర్ పాఠకుడిలో ఉత్కంఠ రేపినట్లుగానే ఈ కవిత ఉంది. కాని సిద్దెంకి అదే ఊపులో కవితను నడిపించలేకపోయాడు. మధ్యలో ఉన్న పాదాలను వాచ్యం చేశాడు. మరో కవితలో

"గాలికి ఊగే వరిసేను
శిరసొంచి దండం పెడ్తుంది" (పుట 5) అంటే సరిపోతుంది. ఆమెకు అనే సర్వనామం అవసరం లేదు. ఈ కవిత టేకాఫ్ తీసుకోకపోయినా ముగింపు చాలా బాగుంది. 'పానం బోయేనాడన్న తెల్సుకోక పోతడా / గీ మట్టి విలువేందో' అనటం ఔచిత్యంగా ఉంది.

ప్రపంచీకరణ మంచే చేసిందంటున్నారు కొందరు మతిలేని దళిత మేధావులు. భూమితో పేగు బంధం లేని వాళ్లు. మట్టి వాసన తెలియనివాళ్లు. విమానాలలో విదేశాలు తిరిగొచ్చేవాళ్లు. ప్రపంచీకరణ ఫలితాలను అందుకొని, అమెరికా కళ్లద్దాలు పెట్టుకున్న వారికి గ్లోబలైజేషన్‌లో గొప్పే కనిపిస్తుంది. కాని ఈ కవి తన ముని వేళ్లతో మట్టిని ముద్దాడినవాడు. మట్టిలో ఆడుకున్న సంటిపోరడు. మట్టిని దోసిట్లోకి తీసుకొని అక్షరాలను దిద్దాడు. మట్టి తాలూకు అనుభూతులు, ఆత్మీయతను కలిపి రాసిన కవితలను వాకిట్లో పోసినవాడు. కనుక ప్రపంచీకరణ చేసిన ధ్వంసాన్ని అనుభవంలో చూశాడు.

'మొండిదైన కత్తి / మొనబోయిన ఆరే
మోగని డప్పు / పాడైన మాదిగ బతుకు" (పుట.37)కు కారణం ప్రపంచీకరణనే అనే స్పష్టత ఇతనికి వుంది. ఈ క్రమంలో ఒక్క మాదిగ బతుకు మాత్రమే ఛిద్రం కాలేదని కూడా ఈ కవికి ఎరుక ఉంది. ఉత్పత్తి కులాలన్నీ కునారిల్లాయి. గోరేటి ఎంకన్న 'పల్లె కన్నీరు'ను గానం చేసినట్లే, అంతకంటే భిన్నంగా

"వడ్ల బాడిసె చెక్కుతున్న శమట జల్లు
కిందపడి పొక్కలైన ఆకలిని తడిపేది" (పుట.48) లాంటి ఊహా చిత్రాలను కవిత్వంలోకి తెచ్చాడు. ఊపిరితిత్తులు గాలి ఊదితే మండే కొలిమిని మన కళ్ల ముందు చిత్రించాడు. 80వ దశకం తర్వాత కవులు సాధించిన గొప్పతనం దృశ్య చిత్రీకరణ. చిన్న సంఘటనను ఎన్ను కుంటున్నారు. దాని సూక్ష్మ కోణాలను కవితలో ఆవిష్కరిస్తున్నారు. సిద్దెంకి ఈ వరసలోని వాడేనని పై కవిత చదివాక చెప్పకుండా ఉండలేము.




90వ దశకానికి పూర్వం రైతులు పంటలో మేలురకం కంకులను వేరు చేసి పంటకు విత్తనాలుగా వాడేవారు. కనుక విత్తనాల కోసం మార్కెట్‌పై ఆధారపడే అవసరం రైతుకు ఉండేది కాదు. కాని ప్రపంచీకరణ ప్రవేశించాక బహుళజాతి కంపెనీలు తయారు చేసిన విత్తనం బస్తాలు గ్రామంలోకి ప్రవేశించాయి. పాలకులు కూడా రైతును వాటినే కొనాలని ప్రోత్సహిస్తున్నారు. ఫలితంగా రైతులందరు విత్తనాల కోసం మార్కెట్‌లో షాపుల ముందు 'క్యూ' కట్టాల్సిన దుస్థితి వచ్చింది. అందరికి సరిపోయే విత్తనాలను వ్యాపారులు సప్లయ్ చేయలేరు. కొన్ని విత్తనాలు భూమిలోనే మురిగిపోతున్నాయి. రైతులు ఉద్యమించకుండా ఉండలేని అనివార్యత ఏర్పడింది.

"మొన్న కాల్దారి కాల్పులు
నిన్న చిన్న గంజాం ఉప్పు రైతులు
ఇయ్యల్ల సేవెల్ల రైతులు" (పుట. 23) పోలీసుల తూటాలకు బలయ్యారు. రైతులు చస్తే ఉద్యమాలు ఆగిపోవనే చారిత్రక సత్యాన్ని ఈ కవి "బక్క రైతు సస్తే వంద మంది పుట్టరు గాని /ఉద్యమం పుడ్తది జాగర్త" (అదే) అని పాలకులను హెచ్చరించాడు. ఈ పాదాలు చదవగానే మనకు 'ఒక వీరుడు మరణిస్తే ప్రభవింతురు వేల కొలద'నే సోమసుందర్ కవిత గుర్తుకొస్తుంది. కాని భావం అదే అయినా సిదెంకి చెప్పిన తీరు భిన్నంగా ఉంది. గతంలో యుద్ధాలు కరువును సృష్టించేవి. ఇప్పుడు ప్రపంచీకరణ కూడా కరువుకు కారణమవుతున్నది. వ్యవసాయపు ఖర్చులు ఎక్కువయ్యాయి. చివరికి రైతులు అప్పుల పాలవుతున్నారు. కనీసం పశువులకు మేత కూడా తేలని దీనస్థితి రైతుకు వచ్చింది. మెతుకు దొరకని మెదక్‌లో పుట్టిన కవికి ఎద్దు ఏడిసిన ఎవుసం గుర్తుకొస్తే తట్టుకోలేడు. "కవిత్వం నిశ్శబ్దంగా పలకాలి. లోలోపలి ప్రపంచాన్ని అల్లుకుపోవాలి" అని గుడిపాటి చెప్పిన మాటలు సిద్దెంకి విషయంలో అక్షర సత్యాలు. రైతులో లోపలి నిశ్శబ్దాన్ని కళ్లు తెరిచి చూస్తే

"మిత్తికి తెచ్చిన అప్పు రైతు కుతికె మీద గడికోసారి మెరుస్తుంది" (పుట. 28) కనుక "ఎద్దు ఏడిసిన ఎవుసం / రైతుసురు తలిగిన దేశం సర్వనాశనం" (అదే) అంటూ శాపనార్థాలు పెట్టాడు. చివరి పాదంలో 'తలిగిన'కు బదులు 'తగిలిన' అనిరాస్తే బాగుండేది.

ఈ కవి రైతు బాధలను చెప్పటంతోటే ఆగిపోలేదు. ఆ బాధలకు కారణాలను అన్వేషించి, పరిష్కారం కోసం పోరాడాలనే గతితార్కిక సూత్రాన్ని చెప్పాడు. పోరాట మార్గాన్ని చూయించకపోతే 'సోకాల్డు కవుల' వరసలో చేరిపోయేవాడు.

"గుండెల్ల కెలికే అప్పుల బాధ ఎతల వానగా మారి
కంటి కొలుకుల్ల నుంచి మొకమ్మీద కురుస్తది
..............................................................
తెల్లటి కండ్లల్ల ఎర్రడాలు మొగుదిలైతది" (పుట.24) రెండో పాదంలో 'కనుకొలుకుల్ల' అని రాస్తే కవితా వ్యక్తీకరణలా ఉంటుంది. అప్పుల బాధను ఎతల వానగా ఊహించటం బాగుంది. 'ఎర్రడాలు' అనే వ్యక్తీకరణతో కవితకు సంపూర్ణత వచ్చింది. పోరాటాన్ని ధ్వన్యాత్మకంగా చెప్పటంలోనే కవి పరిణతి తెలుస్తుంది. అప్పులు తిట్ల దండకాలు చదువు తావిలాంటి పోలికలు కవితను చిక్కగా చేశాయి.

బహుశ! సాహిత్య ప్రపంచంలో తల్లి గురించి కవిత రాయని కవి ఉండకపోవచ్చు. 'రామునికి అయినా రాక్షసికైనా / కన్నతల్లి చనుబాల రుణమెట్ల

విశ్లేషణ ◆ కాశీం

# కవిత్వ నిర్మాణం - కొన్ని ఆలోచనలు

కవిత్వం గురించి రాయాలంటే కొద్దిగా కష్టమే. ఎందుకంటే ఏడాది కిందట తెలుగు కవిత్వంలో పేరున్న రచయిత్రిని మీ కవిత్వ నిర్మాణం గురించి చెప్పండని అడిగాను. కవిత్వమైతే రాశాను కాని, నిర్మాణం గురించి చెప్పలేనన్నది. ఇది ఆమె సమస్య మాత్రమే కాదు. కవిత్వ నిర్మాణంలో ఉండే సమస్య. అకడమిక్ పద్ధతిలో నిర్మాణం గురించి చెప్పలేని వాళ్లు మంచి కవులు కాదని అనలేం. కథ, నవల, వ్యాసం, విమర్శ ఎలా రాస్తారంటే సమాధానం చెప్పినట్లుగా కవిత్వం గురించి వివరించడం కష్టమేనని అనుభవాలు చెబుతున్నాయి. అట్లని కవిత్వం గురించి ఆలోచించటం, తలెత్తే ప్రశ్నలకు సమాధానం వెతుక్కోవటం వదిలివేయలేం. కవిత్వాన్ని విశ్లేషించటం వలన కవిత్వంలో సృజనాత్మకత పెరుగుతుంది. కొత్తగా కవిత్వం రాసే వారికి మేలు జరుగుతుంది. కవి మనసులో పుట్టిన ఆలోచనలు అక్షర రూపం దాల్చి పాఠకుల వద్దకు రావటానికి మధ్య కవిత్వ నిర్మాణంలో చాలా ప్రాసెస్ ఉంటుంది. కవి ఒక దృశ్యాన్ని చూసిన వెంటనే స్పందించకపోవచ్చు. కాని ఆ సంఘటన వెంటాడుతూనే ఉంటుంది. దానికి కవితా రూపం ఇవ్వకపోతే ప్రశాంతంగా ఉండలేరు. అట్లా కవితాగ్నిలో దగ్ధమయ్యే స్థితి నుంచే మంచి కవిత్వం వస్తుంది. కవిత్వం రాయటమంటే ప్రసవ వేదనలా భావించినవారే చిక్కటి కవిత్వం సృష్టించగలరు. సాధారణ మనుషుల ఆలోచనలను తాకని విషయాలు కవి హృదయాన్ని కల్లోలం చేస్తాయి. అప్పుడు అసంకల్పితంగా వ్యక్తమయ్యే భావాల సముదాయం కవిత్వంగా బయటికొస్తుంది.

కవిచేత సృజన పొందిన కవిత్వ నిర్మాణంలో వస్తువు, రూపం, శిల్పం అంతర్ భాగాలుగా ఉంటాయి. మొదట వస్తువు (Contant) గురించి చూద్దాం. "వాస్తవికతకి సంబంధించిన భావన (Concept) ని వస్తువు అంటారని" త్రిపురనేని మధుసూదనరావు చెప్పారు. మనిషి ప్రకృతితో పోరాడుతూ జీవిక కోసం పడిన ఘర్షణ సాహిత్యంలో వస్తువు అయింది. ఇట్లా కవిత్వంలో కవి చెప్పదలుచుకున్న ఆశయం కవితా వస్తువుగా మారింది. అంటే రచయిత చెప్పే విషయం. కథ, కవిత, వాదన, రచయిత తాత్విక దృక్పథం, మానవ సంబంధాలు, చరిత్ర, రాజకీయాలు, ఆర్థిక సిద్ధాంతాలు మొదలైనవి కవితా వస్తువు. మన కళ్ల ముందు కనిపించేదల్లా 'కాదేదీ కవితకు అనర్హం' అని శ్రీశ్రీ మాటను దృష్టిలో ఉంచుకుంటే కవిత్వంలో వస్తువు వైవిధ్యానికి తావుంటుంది. కవి తన పరిసరాల నుంచి ఉపమానాలను, జీవితం నుంచి వస్తువును తీసుకుంటాడు. కవి చుట్టూ ఉండే ఉత్పత్తి సంబంధాలే కవితా వస్తువును నిర్ణయిస్తాయి. అయితే ఈ ఉత్పత్తి సంబంధాలు పునాది అంశం. సాహిత్యం, కళలు ఉపరితల అంశాలు, పునాదిలో జరిగే మార్పుల ప్రభావం ఉపరితలంపై ఉంటుంది. కనుక సాహిత్య వస్తువు మారుతుంది. ఈ మార్పులో భాగంగానే పదాలకుండే అర్థం కూడా మారుతుంది. భాషలో వచ్చిన మార్పులకు అనుగుణంగానే పదబంధాలు, నుడికారాలు మారుతాయి. సాహిత్యం, కళలు శ్రమలో నుంచి పుట్టాయి. ఆ శ్రమజీవితమే కవిత్వానికి వస్తువును, భాషను ఇస్తుంది. కొందరు కవులకు శ్రమజీవితం లేకపోయినా అట్లాంటి కవిత్వాన్ని అనుసరించటం వలన శ్రమజీవితపు భాష అలవడుతుంది. కవిత్వంలో వస్తువే శిల్పాన్ని ఎన్నుకున్నప్పుడు అభివ్యక్తిలో నవ్యత ఉంటుంది. ఏ కవి అయినా సమాజం ఇచ్చిన జ్ఞానంతోనే కవిత్వం రాస్తాడు. కవిత్వం రాసే శక్తిని, నైపుణ్యాన్ని, జ్ఞానాన్ని శ్రమజీవుల నుంచి పొందాలి.

ఇక రెండోది రూపం. ఇంగ్లీష్‌లో Form సమానార్థకంగా తెలుగులో రూపం అంటున్నాం. ఒక రచన అంతర్గత సమీకరణ, నిర్మాణాన్ని సాహిత్య రూపం అనవచ్చు. ఇది అభివ్యక్తికి సంబంధించినది. ప్రక్రియ, నుడికారం, పదబంధాలు, ప్రతీకలు, ప్రయోగాలు, అలంకారాలు సాహిత్య రూపంలోకి వస్తాయి. వస్తువు, రూపం పరస్పర ప్రేరకాలు. ఒకదానిని విడిచి మరొక దానికి ఉనికి ఉండదు. వస్తువు వ్యక్తమయ్యే పద్ధతే రూపం. కవితా నిర్మాణంలో

---

తీరు / కనిపెంచినా తల్లి మమతెట్లు తీరు" అని గద్దర్ రాసింది ఔచిత్యంగా ఉంది. సిద్దెంకి కూడా తన తల్లి గురించి తలపోతను పలవరించాడు. చదువుకోసం బయలెల్లిన కొడుకు యెడబాటును కొనకొంగుతో ఆపుతున్న అవ్వా! "నీ కండ్ల నిండా / మత్తడి దుంకుతున్న దుఃఖాన్ని.... ఎగతట్టి ఏడిసినా కన్నీళ్లు రావాయె" (పుట 12) గంజి మెతుకుల తండ్లాటలో పెంచిన తల్లి గురించి కొడుకు తపన, మత్తడి, ఎగతట్టి లాంటి పదాల ప్రయోగం సహజంగా వుంది. కన్నీళ్లు ఇంకిపోయినా తల్లి మూగభాష బిడ్డకు మాత్రమే అర్థమవుతుంది. అది కవిత్వంలోనే బలంగా వ్యక్తమవుతుంది. "కవిత్వ భాషే వచనం కాదు. అది శ్రమజీవులు మాట్లాడుకొనే జీవభాష శ్రమ నుండి పుట్టి శ్రమ జీవికి అతని చుట్టూ ఉన్న భౌతిక ప్రపంచానికి మధ్యగల సంబంధం నుండి వికసించిన ఉత్కృష్టమైన అభివ్యక్తి" (జె.సి. కవిత్వం - గతితార్కికత) కనుక "తూట్లు పడ్డ బసు టికెట్టె జేబులోంచి రాలినపుడు సేను సేనుకు రాల్చిన నీ సెమట సుక్కలు.... యాది కొచ్చె" (అదే) లాంటి ప్రయోగాలు సహజంగా కవిత్వమవుతాయి.

సిద్దెంకి కవిత్వంలో సూక్తి నిధిత్వం అధికం. "నా రుచిరార్థ సూక్తి నిధి నన్నయభట్టు' అంటారే కాని, ప్రతి మనిషి జీవితంలో సూక్తి నిధిత్వం ఉంటుంది. ఇవన్నీ కవితా నిర్మాణ విషయాలు కూడా. ఇట్లాంటి శ్రామిక జీవితం ఈ కవికి ఉండటం వలన జీవభాష అబ్బింది. అయ్య, అవ్వ, నాయనమ్మ, తాత పట్నం పోతున్న పోరగాడికి జాగ్రత్తలు చెప్పే సందర్భాన్ని సంభాషణ పద్ధతిలో రాసిన 'పయిలం' కవిత ఈ సంకలనంలో భిన్నమైనది. నుడికారాలే కవిత్వంగా మారాయి.

"బతికినన్ని రోజులు మంచిగ బతుకాలి
ఆడోళ్ల జోలికి పోకు మెడకు ఉరివెడ్తరు
..........................................................
ఎర్రగ బుర్రగ వున్నవని ఎదురొస్తరు" (పుట. 52) స్త్రీల విషయంలో ఇది అర్థ సత్యమే. ఎందుకంటే వురి బిగిస్తున్నది. వేటకొడవళ్లతో చంపుతున్నది, యాసిడ్ పోస్తున్నది మగమహారాజులే. ఇట్లాంటి భూస్వామ్య భావజాలం ఉత్పత్తి కులాలలో కూడా ఉంటుంది. వీటిని కవిత్వం చేస్తున్నపుడు జాగ్రత్త వహిస్తే మంచిది. ఈ కవితలో మైమరిపించే శిల్ప సౌందర్యం ఏమీ లేదు. కనీసం గొప్ప పోలికలు కూడా లేవు. కొత్త పదబంధం కూడా లేదు. కాని కవి ఎన్నుకున్న సంభాషణ పద్ధతే దాని శిల్పం. వ్యక్తీకరణలో ఉండే కొత్తదనమే కవితకు అలంకారికతను చేకూర్చింది.

జాలువారుతున్న నెత్తుటి కాల్వ /నింగికెగిసిన జనం ఘోష జాలువారే భావాల ఊట, ఆత్మీయుల కన్నీటి వర్షం, తలవండిన జ్ఞానం గోడకువేలాడుతూ, సెమట చుక్కల పంట, నొసటితో ఏరుకున్న ఆటాన బిల్ల లాంటి వెంటాడే కవితా పాదాలు 'మా తొవ్వ'లో ఉన్నాయి. అట్లే చాలా పాదాలు వాచ్యంగా ఉన్నాయి. వాటిలో సాధించిన కవిత్వమేం లేదు. వాచ్యాన్ని రాకుండా చూసుకుంటే చాలా పాదాలు కవిత్వం అయ్యేవి. "కవి తను చెప్పదల్చుకున్న విషయానికి ఒక పోలిక డిస్కవర్ చేస్తాడు. అది పద్యమై పోతుందని" చేరా చెప్పిన మాటలను సిద్దెంకి గమనంలోకి తీసుకుంటే అతని కలం నుంచే మరింతా చిక్కని కవిత్వం జాలువారుతుంది.

ఇక చివరి మాట. పుస్తకం పాఠకుల చేతులోకి పోయే ముందు జాగ్రత్తగా ఎడిట్ చేసుకోవాలి. ఈ సంకలనంలో కొన్ని అక్షర దోషాలను సరిచేసుకుంటే బాగుండేది. నిజమైనది (నిజమైన), నలుముకుంట (నములుకుంట), కండపోత (కుండపోత) మరిసనా (మరిసినా), గుటికి (గూటికి) లాంటివి మచ్చుకు కొన్ని. కవితల వరుస క్రమాన్ని పాటిస్తే బాగుండేది. చదివే వారికి విషయం సులభంగా అర్థమవుతుంది. ఇతివృత్త పరంగానైనా, కాలపరంగా అయినా ఎంపిక చేస్తే మంచిగా ఉండేది. మొత్తం మీద ఎడిటింగ్ దోషాలు కొన్ని ఉన్నాయి. ఇవి మినహాయిస్తే జీవితం, చెమట చుక్కలు, నెత్తురు, కన్నీళ్లు, ప్రేమ నిండిన కవిత్వాన్ని మనకు అందించిన సిద్దెంకికి ధన్యవాదాలతో ప్రజల 'తొవ్వ'కు స్వాగతం.

❖

మూడోది శిల్పం. దీనిని ఇంగ్లీష్‌లో (Technique) అని వాడుతున్నాం. వస్తువు అభివ్యక్తమయ్యే రూపాన్ని శిల్పం అంటారు. భావ ప్రతిమలు, ప్రతీకలు భాష శిల్పంలో ప్రధాన అంగాలు. ఇంకా శిల్పంలో అలంకారాలు, శైలీ, సంవిధానం కూడా ఇమిడి ఉంటాయి. వస్తువు, రూపం, శిల్పం అర్థం కాకపోతే కవితా నిర్మాణం తెలియదు. ఈనిర్మాణం తెలిస్తే కవిత్వాన్ని మరింత పదునుగా రాయవచ్చు. వస్తువు తర్వాత కవితా నిర్మాణంలో ప్రధాన అంగాలు రూపం, శిల్పం. ఈ రెండింటిని కలిపి కవితా రూపంగా వ్యవహరించవచ్చు. "కావ్యంలో పాత్రోచితమైన మాటలను ప్రయోగించి విషయానికి తగినట్లుగా సొగసైన వర్ణనలను చేసి వృత్తాలు సాక్షాత్తుగా ఎదుట కనులకు కట్టినట్లు చేయటమే అన్నిటికి మించిన కవితా లక్షణమని" కట్టమంచి రామలింగారెడ్డి చెప్పారు. కవితా సంవిధానం మీద పాఠకుడి దృష్టిని మళ్లించి తెలిసిన విషయాన్నే అపరిచితంగా కళ్లముందుకు తీసుకరావటమే సాహిత్య శిల్పం. అట్లే పాఠకుడు ఊహించని భాషా ప్రయోగం కూడా శిల్పంలో ప్రధానం. సహజమైన భాషా వ్యూహంతో శిల్పాన్ని ఉపయోగించి అభివ్యక్తీకరించటమే కవిత్వం. కవిత్వంలో ఉండే వక్రత పాఠకుడ్ని ఇట్టే ఆకట్టుకుంటుంది. సహజమైన భాషకు భిన్నంగా భాషను ...కోవడమే వక్రత. ఈ వక్రతనే పాఠకుడి గుండెలోకి వెళ్తుంది. తద్వారా కవితా సౌందర్యాన్ని పెంచుతుంది. ఈ క్రమంలోనే కవిత్వంలోకి సంకేతాలు వస్తాయి. కనుక చదువరి ఆలోచనలను సంకేతం వైపు తీసుకెళ్లటమే కవిత్వ లక్షణాలు.

ఏ కవి అయినా మొదట తనకు తెలిసిన భాషలోనే కవిత్వం రాస్తాడు. అయితే అందరికి తెలిసిన భాషలోనే వ్యూహాత్మకంగా పదాలు వాడటంలోను కవిత్వానికి విలక్షణత వస్తుంది. కవిభావాలు ఏ రూపంలో ప్రయాణిస్తే ఆ పద్ధతిలోనే కవితా రూపాన్ని ఎన్నుకోవటానికి కవికే స్వేచ్ఛ ఉంటుంది. కొన్ని కవితలు కథనాత్మకంగా సాగి పోరాటాన్ని ఆహ్వానిస్తూ ముగుస్తాయి. ఇంకొన్ని నినాదంతో మొదలై సందేశాన్ని ఇస్తాయి. మరికొన్ని వర్ణనాత్మకంగా మొదలై తిరుగుబాటుతో ముగుస్తాయి. ఇది కవులు ఎన్నుకున్న రూపాన్ని బట్టి ఉంటుంది. కవిత్వ నిర్మాణంలో ప్రతీకల పాత్ర విస్మరించలేనిది. కవి చెప్పదల్చుకున్న విషయాన్ని వాచ్యంగా ప్రకటన వలె కాక ప్రతీకలను ఉపయోగించి సూచనగా చెబితే దాన్ని ప్రతీకాత్మకంగాచెప్పారనవచ్చు. ప్రతీకలు భావాలను స్పష్టంగా అనుభవయోగ్యం చేయడానికి ఉపయోగపడతాయి. ఇంద్రియాలకు అందని సూక్ష్మ అనుభవాన్ని అనుభూతం చేస్తాయి.

ఇక రూపంలో భావచిత్రానికి ప్రధాన పాత్ర ఉంటుంది. భావం అంటే మనో వికారాలైన కామం క్రోధం, ప్రేమ, దుఃఖం మొదలైనవి. కవిత్వంలో వస్తువు ఏదైనా దానిని అభివ్యక్తం చేయడానికి భావచిత్రాలు తోడ్పడుతాయి. "రచయిత చిత్రించదల్చుకున్న సమస్యను శక్తివంతంగా సంగ్రహంగా ధ్వనిమయంగా చెప్పటానికి తోడ్పడే శిల్ప సాధనం భావ చిత్రమని" జీవీయస్ అన్నారు. విషయాన్ని పాఠకుని మనసులో ప్రతిబింబించేటట్లు, ప్రత్యక్షమయ్యేటట్లు చేసే సామర్థ్యాన్నే భావనాశక్తి అంటారు.

ఈ కవితావరణంలో జూన్, 2009 నిజాంసాగర్‌లో జరిగిన విరసం పొయిట్రీ వర్క్‌షాప్ అనుభవాలను విశ్లేషించుకుంటే, కవిత్వ నిర్మాణం గురించి కొన్ని విషయాలు తెలుసుకోవచ్చు. వర్క్‌షాప్‌కు హాజరైన 20 మంది కవులు కవిత్వంతో తమ పరిచయాన్ని తడిగా పంచుకున్నారు. చాలామంది ప్రారంభంలో సీనియర్ కవులను అనుకరించి తర్వాత సొంత గొంతుక విన్పించామని చెప్పారు. కవిత్వ నిర్మాణ లోపాలు, కవిత్వంలో అస్పష్టత - సంక్లిష్టత, స్వీయాత్మకత - వస్తుగతంపై విస్తృత చర్చ జరిగింది. స్పొంటేనిటి నుంచి వచ్చేది మంచి కవిత్వం కాకపోవటం వలన, ఉత్పన్నతకు, సృజనకు అగాధం ఏర్పడుతుంది. కొన్నిసార్లు మార్మిక భాష ఉపయోగించటం వలన వచనం కూడా కవిత్వంగా మారుతుంది. కనుక ఉత్పన్నతను సృజనగా మార్చటానికి మామూలు పదాలను సంయోజనం చెందించే పనిలో కవి ఉండాలనే అభిప్రాయం వ్యక్తమయింది. ఇక కవి శ్రోతలను, పాఠకులను దృష్టిలో ఉంచుకొని కవిత్వం నిర్మించకపోవటం వలన అస్పష్టత, సంక్లిష్టత ఏర్పడుతుంది. దీనిని అధిగమించలేని కవులు కవిత్వానికి మేలు చేయలేరు. ఒక రసాయన క్రియగా ఉండే కవిత్వంలో వస్తువు, శిల్పపరంగా కూడా సంక్లిష్టత ఏర్పడుతుంది. సమాజాన్ని దగ్గరగా పరిశీలించటం ద్వారానే ఏ కవి అయినా దీని నుంచి బయట పడతారు. కొన్ని సార్లు పరిమితమైన జీవద్భాష వాడటం వలన కూడా అస్పష్టతను అధిగమించవచ్చు. కవిత్వం రాయడానికి కవులు ప్రసవ వేదన పడాలే కాని, పాఠకులు కాదనే సూచనలు వచ్చాయి.

వర్క్‌షాప్‌లో చంద్రయ్య 'రియాల్టీ షో'పై మంచి కవితను చదివాడు. వారి నవ్వు, కదలికలు, సంస్కృతి "తలదిండులో / ఊపిరాడక తన్నుక చస్తాయని" సమ్మిళిత భావోద్వేగాలను కళ్లకు కట్టాడు. "వారి మధ్య జాతి వివక్షతలు/ రాజ్యమేలుతాయి" లాంటి పాదాలు వాచ్యమయ్యాయని అందరూ చెప్పారు. 'అని, బడు' ప్రయోగాలు కవిత్వంలో ఉండకూడదని సూచనలు వచ్చాయి. "కళ్లలో దీనత్వం/ ఒంట్లో సత్తువలేదు" అంటూ తిరుపతి 'మాయలోడు' కవితను చదివాడు. కవిత కథనాత్మకంగా ఎత్తుకోవటం వలన మంచి తూగు వచ్చింది. శ్రీశ్రీ 'భిక్షువర్షీయసీ'ని తలపించింది. తల్లిని ఉద్దేశించి 'కళ్ల మహాపాపిష్టిని' అని రాశాడు. 'పాపిష్టి' పదం నెగిటివ్ సెన్స్‌లో వాడాలి. కాని ఈ కవితలో పాజిటివ్ అర్థంలో వాడటం వలన అప్రయోగమయింది. మొత్తంగా భావాన్ని అందించే శక్తితో పాటు ఈ కవిత దృశ్యాన్ని కూడా కమ్యూనికేట్ చేసింది. వస్తువు గాఢతను పొంది సాంద్రమైన రీతిలో అభివ్యక్తమై కవిత్వమయింది. కొందరు కవులు కవిత్వ నిర్మాణంలో జానపదుల వాగ్రూప పద్ధతిని ఎన్నుకొని రాశారు. మరికొందరు సంభాషణ పద్ధతిలో రాసారు. మొదటి రకానికి చెందిన కవితనే పొన్నాల బలయ్యరాసిన "చెప్పుదెబ్బ" వేప మానుకింద ఎండిన తోలు సీరుక ' లాగా కవిత్వాన్ని ప్రారంభించి బూటుతో బుష్‌ను ఉరితీసినట్లు భావించటం వలన కవిత పఠితను ఆకట్టుకున్నది. కాని అన్వయ క్లిష్టత ఉంది. చెప్పదల్చుకున్న విషయానికి వాస్తవాల నుంచి శబ్దాన్ని గ్రహించి భావనీకరించకపోవటం వలన అన్వయ క్లిష్టత వచ్చింది. వస్తువు రూపం రీత్యా అపారమైన విస్తృతి, నూతనత్వం, యవ్వనం వర్క్‌షాప్‌కు హాజరైన కొత్త కవుల్లో కనిపించింది. సైన్సు లాగే కవిత్వం కూడా సత్యాన్ని దర్శించే పనిచేస్తుందని 'ఆకలి యుగం' కవితలో రవి స్పష్టం చేశాడు. 'బిచ్చగాళ్లు' కవితావస్తువుగా చాలామందే కవిత్వం రాశారు. కాని ఈ కవి వాళ్లను దర్శించిన పద్ధతి భిన్నంగా ఉంది. "ఆకర్షించని భూమికి/ ఆదరించని ఆకాశానికి మధ్య" గాలితో కడుపు నింపుకునే దీనత్వం కనిపిస్తుంది. 'అనే' పదాన్ని పాదాల కలయిక కోసం ఉపయోగించిన తీరు ఔచిత్యంగా లేదు.

ప్రజలకు, ఉద్యమానికి ఉపయోగపడే సమయంలో విప్లవ కవులు కొత్త రచనా వ్యక్తీకరణకు పునాదులు వేస్తారు. లోపలి దుఃఖాన్ని అల్లుకొని నిశ్శబ్దంగా పలికే లక్షణం కవిత్వానికి ఉండడం వలన 'తెగిపడిన కన్నకలలు' ప్రపంచపు ప్రశ్నల వాకిలిలో వెచ్చగా ఉదయిస్తాయని సమురాయ్ శత్రువును 'నోర్మూయ్'మన్నాడు. కవిత మొత్తం ఒక ఫ్లోలో సాగింది. కనుక నాలుగోవ పంక్తి వద్ద ఆగిపోతే బాగుండది. ఐదోపంక్తి వాచ్యమయ్యింది. కవిత టేకాఫ్ తీసుకున్న తర్వాత అనవసరంగా పొడిగించి నట్లయింది.పదాల కూర్పు వలన పదచిత్రాలు ఏర్పడుతాయి. భావాల కూర్పు వలన భావచిత్రాలు ఏర్పడుతాయి. ఉద్వేగం ఒకే స్థాయిలో కొనసాగితే కవితకు సాంద్రత ఏర్పడుతుంది. అట్లాంటి సాంద్రమైన 'కొలిమి' కవితను తైదల అంజయ్య విన్పించాడు. కాకపోతే చివరి మూడుపాదాలు కవితలో వాచ్యం కావడం వలన అనవసరమనిపించింది. ఇక కొందరు కవులు కొత్త డిక్షన్‌తో, పరిణతితో కవిత్వం రాస్తున్నామని అనుకుంటారు. కాని వెంటాడే వాక్యాలు ఒకటి కూడా ఉండవు. లయకు, ప్రాసకు ఇచ్చిన ప్రాధాన్యం గాఢతకు ఇవ్వకపోవటం వలన రాజయ్య 'సంక్షోభ సైరన్' కవిత కవిత్వం కాలేకపోయింది. వచనాన్ని పరిగెత్తించే శక్తిలేక పోవటం వలన కవిత నిస్సారంగా మారింది. సూర్యుడు, అడవి, సముద్రం లాంటి పత్రీకలకు భిన్నమైన ప్రతీకలు ఈ కవులలో ఉన్నాయి. వీరిలో కొందరిది వాడి ఉన్న కవిత్వం. ఇంకొందరిది తడి ఉన్న కవిత్వం. ఉపమానాలు భావచిత్రాలు వస్తువుకు అధీనమై ఉండటం ఈ కవులు సాధించిన శిల్ప పరిణతి.

**విశ్లేషణ**

◆ కాశీం

# 'కవిసభ' కవిత్వం గురించి

ఒకరోజు ఎంఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సాహిత్య విమర్శ పాఠంలో ధ్వని గురించి చెప్తాను. ఆనంద వర్ధనుడు రాసిన ధ్వన్యాలోకంలో ధ్వని సిద్ధాంతం ఉంది. పాఠం మధ్యలో ఒక విద్యార్థి లేసి కవిత్వంలో ధ్వని ఉందని గుర్తించేదెలా? అన్నాడు. అంటే నేను చెప్పే పాఠం అర్థం కానిదని నాకర్థమయింది. ధ్వని సిద్ధాంతాన్ని ఇన్నాళ్లు సంస్కృత శ్లోకానికి అర్థంగా చెప్పారే కాని, సామాజిక జీవితానికి అప్లై చేయలేకపోయారు. ఈ కృత్రిమ బోధన వలన డిగ్రీలో అలంకార శాస్త్రాన్ని చదివిన విద్యార్థి కవిత్వంలో ధ్వనిని అర్థం చేసుకోలేకపోయాడు.

మరుసటి రోజు క్లాసులో "మీకు డిఎస్సీలో ఉద్యోగం వచ్చిన విషయాన్ని మీ అమ్మా నాన్నలకు చెప్పారు. వెంటనే మీ అమ్మ 'ఇక నా కొడుకు పెళ్లి చేసుకుంటాడని' అనుకున్నది. మీ నాన్న 'నేను చేసిన అప్పులన్నీ తీరిపోతాయని అనుకున్నాడు'. పెళ్లి మాట కాని అప్పులు తీర్చుతానని కాని మీరు మీ వాళ్లకు చెప్పలేదు. కాని మీరు చెప్పిన ఒక సందర్భం వారికి రెండు విధాలుగా ధ్వనించింది" అని చెప్పాను. దీనినే ధ్వని అంటారని అన్నాను. కళాత్మకంగా పొందిన శబ్దాల ద్వారా సౌందర్యాన్ని వ్యక్తం చేసే క్రమంలో ధ్వని ప్రధాన పాత్ర వహిస్తుంది. సూటిగా చెప్పిన దానికంటే సూచనగా వ్యక్తమయ్యేదే హృదయానికి తగులుతుంది. రెండు రోజుల తర్వాత ప్రశ్న అడిగిన ఆ విద్యార్థి మంచి ధ్వన్యాత్మకమైన కవిత రాసుకొచ్చి విన్పించాడు.

ఇట్లా కవిత్వం గురించి ఆలోచిస్తే చాలా విషయాలు మనసుకు తట్టాయి. రసాత్మకమైన ఒక వాక్యమే కావ్యమవుతుందని చెప్పింది భరతుడని తెలియకుండానే చాలామందిర సాత్మకమైన, ధ్వనాత్మకమైన కవిత్వం రాస్తున్నారు. అంటే కవిత్వ సిద్ధాంతాలు సమాజ గమనం నుంచి పుట్టాయే కాని, వాటికి సమాజేతర ఉనికి లేదని అర్థమవుతుంది. కవిత్వమంటే ఉద్వేగం, ఆనందం మాత్రమే కాదు. దానికొక సామాజిక ప్రయోజనం ఉంది. కవిత్వం భాష, భావాలు, ఉద్వేగం, ఆనందమే కాకుండా సామాజిక ఘర్షణను ప్రతిఫలిస్తుంది. వీచేగాలి, చందమామ, నక్షత్రాలతోపాటు కన్నీళ్లు, చెమట, నెత్తుటి కాల్వలు కూడా మన చిత్తాన్ని కవిత్వానికి వస్తువుగా మారుతాయని గడిచిన చరిత్ర రుజువు చేసింది. మసకగా ఉండే స్వప్నం గుండె గొంతులో కొట్లాడుతుంటే దానికి నిర్దిష్ట రూపాన్ని ఇచ్చే పని కవిత్వం చేయాలి. అస్తిత్వంలో ఉన్న దేనినైనా మార్పు చేసి స్వతంత్రంగా ఒక నిర్దిష్ట రూపాన్ని ఆపాదిస్తున్న క్రమంలో కవి అంతర్ బహిర్ ఘర్షణలకు లోనవుతాడు. అంతిమంగా ప్రజారాసుల వెంట పరుగెత్తక తప్పదు. కవి చూసిన సాధారణ విషయాలకు సృజన జత చేరి కళగా మారుతాయి. ఈ 'కళాత్మకమైన వ్యక్తీకరణే కవిత్వం' అని షెల్లీ ఈ అర్థంలోనే చెప్పాడు. అభివ్యక్తిలో ఉండే తారతమ్యాలే కవికి, కవిత్వానికి ఒక స్థానాన్ని ఇచ్చాయి.

ఇక కవిత్వంలో రూపానికి విస్మరించలేని పాత్ర ఉంది. వస్తు వ్యక్తీకరణ సాధనాలైన కళాత్మక భాష, వర్ణనలు, భావ శబ్దచిత్రాలు, ప్రతీకలు మొదలైన కవితా నిర్మాణ విషయాలు కవితా రూపమవుతాయి. వెయ్యేళ్ల తెలుగు శిష్ట కవిత్వంలో రూపవాదులు ఎక్కువగా ఉన్నారు. నిజానికి సారం రూపం వేర్వేరు కాదు. వీటి మధ్య ఐక్యత గతితార్కికమైనది. కనుక "Form is of no value unless it is the form its contant" అని మార్క్స్ వస్తువును ఆశ్రయించుకొని రూపం ఉంటుందని చెప్పాడు.

ఈ అవగాహనతో జనవరి 2009 తెనాలి విరసం సాహిత్య పాఠశాలలో చదివిన కవి సభలో చదివిన కొన్ని కవితలపై కొన్ని ఆలోచనలను పంచుకోవడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం. ఇది ఇటీవల రాస్తున్న విరసం సభ్యుల రచనలపై స్పందన ఉండటం లేదనే ఒక వాస్తవాన్ని పూడ్చే చిన్న ప్రయత్నం కూడా. 'కన్నీళ్లు' కవితలో సమురాయ్ (కవిపేరు) బరువైన భావాలు వ్యక్తం చేశాడు. హృదయం మౌనంగా ఉంటే విషాదం ఆవరించినట్లే. దుఃఖం స్థాయి భావంగా అభివ్యక్తమవుతుంది. విషాదగీతాలు కన్నీళ్లను ఆలపిస్తాయి. 'ఆ గీతాలకు స్వరాలు ఎక్కిళ్లు'గా భావించే చోట మళ్లీ 'నిశ్శబ్ద ఉత్తరాలు కన్నీళ్లు'. కన్నీళ్లు చీకటి జల్లులుగా కూడ ఉండగలవని సమురాయ్ ప్రతీకలలో పరిణతి సాధించాడు. నెత్తుటి కాల్వలలో నడుస్తున్న ఈ కవికి 'ప్రపంచమంతా శూన్యంగా' కనిపించటమే బాగలేదు.

విప్లవ కథలో బలమైన ముద్రవేసి 'తాయమ్మ' కరుణ ప్రసన్న కథా కవితార్థ యుక్తి (కథనాత్మకమైన కవిత)లో 'ఓదార్పు' కవిత విన్పించింది. తన సహచరుడు 'మంజీరా' జ్ఞాపకాలలో తడిసి ముద్దై సహృదయ పాఠకులలో కూడా కన్నీళ్లు తెప్పించగల అభివ్యక్తి ఆశ్చర్యం గొలిపింది. కాని కవిత అసాంతం నిరాశలోంచి.... రాసింది. 'కలలే మనకు మిగిలిపోవు కలిమి చివరకు కలలూ లేవు కలిమీ లేదు. 'కలిమి' అనే పదాన్ని శబ్దాడంబరానికి వాడినట్లు వుంది. ఈ కవితలో ఆ పదం పొసగలేదు. మొదటి పాదంలో కలలతోపాటు కలిమి (సంపద) ఉందని రాసింది. చివరి పాదంలో కలలు లేవు కలిమి లేదని రాసింది. వాక్యాల మధ్య అర్థ నిర్మాణం పొసగలేదు. ఉజ్వలమైన గతమూ నమ్మకమైన వర్తమానమున్న కరుణ 'గతమూ లేదు. వర్తమానమూ లేదు' అని రాయటమే ఆశ్చర్యంగా ఉంది.

ఇరాక్ ఇపుడొక గాయాల చెట్టు. ఇసుక మైదానంలో రాలిన ఖర్జూరాల కోసం తల్లుల దేవులాట. తలెత్తి నిలబడినవారికి బూటు కూడా ఆయుధమవుతున్న వేళ గడ్డిపరకతో విప్లవం సాధ్యమే మరి. 'బూటు బాయినెట్' అని చంద్రయ్య రాయటం కూడా ఈ సందర్భంలోనే కవితకు ప్రతీకాత్మక శీర్షిక పెట్టడంలోనే కవి ఔచిత్యం పాటించాడు. "అతనిపుడు.....ఓ ఖైదీ" అని ఉత్కంఠ ఎత్తుగడ ఎంచుకున్నాడు. నామవాచకానికి బదులు సర్వనామం వాడటం కవితా శిల్పం. 'ఇరాక్ చితాభస్మంలో అతన్ని చిరునవ్వుల మొలక'గా ఊహించటం అద్భుతంగా ఉంది. చచ్చిన గొడ్డు పోరాడే బూటుగా మారుతానని పోరుపెట్టటం బాగుంది. అయితే ' నలుగుతున్న ప్రమిద' అనటం కంటే 'ఆరిపోతున్న' అని రాస్తే బాగుంటుంది. 'వాకిటిలో' కంటే వాకిట అంటే సరిపోతుంది. 'మెర్క్యురీ మనిషి'లో మనిషి అవసరం లేదు. 'ముఖ విత్తనం' ప్రయోగం బాగలేదు.

సూర్యజ్వాలకు ఎన్నో ముఖాలు. ఒక ముఖం మరణిస్తే సహ ముఖాలకు విషాదం. ఈ విషాదాన్ని తిరుపతయ్య 'జ్వాల' వెలవెలబోయినట్టు ఊహించాడు. 'అక్షరాల విల్లును ధరించి'న జ్వాలాముఖి మరణాన్ని ఆ కంచు కంఠం విన్నవారెవ్వరు జీర్ణించుకోలేకపోయారు. 'సూర్యస్నానం' లాంటి మంచి ప్రయోగాలతో కవితను నడిపిన తీరు చక్కగా ఉంది. ఇంకొంత భావుకతను పెంచితే కవిత మరింత చిక్కగా మారేది. చివరి మూడు పాదాలు అనవసరం.

ఉజ్వల్ డాలర్ కుక్కల దొంగనీతిని బట్టబయలు చేస్తూ 'సమస్త శక్తుల్ని కూడదీసుకొని' పోరాటానికి సిద్ధం కమ్మన్నాడు. దేశాలపై పెత్తనం కోసం సామ్రాజ్యవాదులు ప్రయత్నించటం ఈ కాలపు నీతి. శీర్షిక సంక్షిప్తంగా ఉంటే బాగుండేది. 'దేశాలపై' అని బహువచనం ప్రయోగించాక 'పెత్తనాలు' అవసరం లేదు. పెత్తనం అంటే సరిపోతుంది. 'బకాసురులు' ప్రయోగం భావజాల పరంగా మంచిది కాదు. బకాసురుడు దళిత, గిరిజనులకు ప్రతీక. కనుక వారిని అవమానించినట్లు అవుతుంది. మేకపిల్ల గాయాలకు బదులు నెత్తురు అని ప్రయోగిస్తే సరిపోతుంది. ఆశల ఇత్తులు, చెమటరాసులు లాంటి ఫోక్‌లోర్ ప్రయోగాలు చేసిన ఈ కవి కవితను ఎక్కువ భాగం వాచ్యం చేయకుంటే బాగుండేది. "సేద్యం చేయడమంటే/ యుద్ధం చేయడమనే" ముగింపు కవితను పతాకస్థాయికి తీసుకెళ్లింది. గాయాల చరిత్రలో మాయని మచ్చలేన్నో. 'వటోలి' అనే మచ్చను 'దేశపు గుండె మీద అతికించాలని పిస్తుందని' నాగభైరవ కోటేశ్వర్‌రావులా ఉదయమిత్ర పేగు తెగిన వటోలి దుఃఖాన్ని మనతో పంచుకున్నాడు. ఆర్ధ్రత నిండిన కవితను గానం చేశాడు. కథాశిల్పం, అక్షర రమ్యత కలగలిపి చిక్కని కవితగా మార్చాడు. ప్రకృతిలోని సహజమైన గాలి, నీరు, పక్షి, జాబిలి లాంటి ప్రతీకలు కవితకు అదనపు సొగసును తెచ్చాయి. మూడో పాదంలో 'చంద్రుడివైపు జూస్తోంటే' అని ఉంది. చంద్రుడిని చూస్తోంటే అని రాస్తే వ్యక్తీకరణ బాగుంటుంది. 'ఒకే ఒక్క దృశ్యం ప్రతిఫలిస్తోంది'లో అనే పదం అనవసరం. ఒకే ఒక్క దృశ్యమంటే సరిపోతుంది. అయినా ఈ పదాన్ని కవిత్వంలో పాజిటివ్ సెన్స్‌లో మాత్రమే ప్రయోగిస్తాం.

'ఉద్యమం' కవితలో శత్రువు భ్రమల్ని ఛిద్రం చేశాడు. అభావం చెందే గతితార్కిక నియమాన్ని ఈ కవితలో చెప్పాడు. విత్తనాలు "పంటను వాగ్దానం చేస్తాయి' లాంటి శివసాగర్ చేసిన ప్రయోగాలను కొత్త అర్థంలో ఉపయోగించాడు. ❖

# తెనాలి కవిసభ కవితలు

## కన్నీళ్లు

- సమురాయ్

ఆవేదన మౌనమైన వేళలో
ఉచ్ఛ్వాస నిశ్వాసలు పోట్లాడే సమయంలో

ప్రపంచమంతా శూన్యమై
నిర్మానుష్యం గాలై వీస్తున్నవేళ
హృదయగొంతుక వినిపించే
విషాద గీతికలు కన్నీళ్ళు
ఆ గీతాలకు స్వరాలు ఎక్కిళ్ళు

ఆప్తులందరూ అదృశ్యమై
ప్రేమలన్నీ గత జ్ఞాపకాలై
బాధలన్ని జోరీగలై
రొద పెట్టేవేళ
చెక్కిలికి మనసురాసే
నిశ్శబ్ద ఉత్తరాలు కన్నీళ్లు

యుద్ధవీరుడు సూరీడు
పడమటి ఒడిలో రాలినప్పుడు
భూమాత గుండె రాల్చిన
చీకటి జల్లులు కన్నీళ్లు

ఒక్కసారి......
వాటి హృదయవీణను మీటండి
వేలకొద్ది నెత్తుటి కాల్వల గలగలలు
పొంగిన లావా గుసగుసలు
వెచ్చగా వినిపిస్తాయి
నిట్టూర్పులు కురిపిస్తాయి.

## ఓదార్పు

- తాయమ్మ కరుణ

'కునుకు తీస్తె మనసు కాస్త కుదుటపడ్తది
కుదుటపడ్డ మనసుకాస్త తీపి కలలు కంటది
కలలె మనకు మిగిలిపోవు కలిమి చివరకు...'

తను లేదు
కలలూ లేవు కలిమీ లేదు

ఇంకొద్ది క్షణాల్లో
ఈ రోజు రేపవుతుంది
కునుకు పట్టడం లేదు
గతమూ లేదు వర్తమానమూ లేదు
పక్క గదిలో అమ్మాయి
పొగిలి పొగిలి ఏడుస్తోంది
కాసింత
దుఃఖాన్ని గుండెల్లో దాచుకొమ్మని
ఓదార్పాలన్పించింది
అమ్మాయినా?
నన్నా?

## బూటు బయొనెట్

యస్. చంద్రయ్య

అతనిప్పుడు
గుప్పెడు మంది కంటికి ఓ ఖైదీ
సైనిక పద ఘట్టనలలో
నలుగుతున్న ప్రమిదలకు చమురు
తన బూటు బాయినెట్‌తో
విశ్వవాకిటిలో ముగ్గై మెరిసిన
మెర్క్యూరీ మనిషి
ఊరితీస్తున్న మర్రి ఊడల క్రింద
తన ముఖ విత్తనంలో
చిరునవ్వుల మొలక
ఆధిపత్యపు జ్వాలపై
ఆవిరవ్వని నీటి బిందువు
గాలి సుడులు తిరుగుతూ
ఇరాక్‌కు పయనమయ్యింది
ఆ వీరుని నిశ్వాసను
శ్వాసిద్దామని
మా యింటి గొడ్డు
చచ్చి అట్లాంటి బూటనపుతానని
పోరుపెడుతుంది.

## "జ్వాల"

ఎం. తిరుపతయ్య

ఆరోజు ఆదివారం
సూర్యోదయాన్ని చూశాను
సూర్యునిలో ఎప్పుడూ ఉండే జ్వాల
వెల వెలబోయినట్టు అనిపించింది

అక్షరాల విల్లుని ధరించి
అణచివేతలపై బాణాన్ని వదిలినవాడు
సమాజ శరీరంపై ఉన్న
దోపిడీ, పీడనల మలినాన్ని వదలగొట్టాలను
కున్నాడు

స్వార్థం మొలలు కుచ్చుకొని
సెప్టిక్ అయిన భాగాలను కట్‌చేసి
సూర్యస్నానం చేయించిన వాడు
దిగంబరంతో ముందుకొచ్చి
విప్లవ భావాలతో దేశానికి పట్టిన
చీడల్ని దులిపి వేసినవాడు

మానవ సంబంధాలకు అడ్డుకట్టవేసే
తన జంధ్యాన్ని తెంపి
ప్రజల సౌఖ్యమే మన లక్ష్యమని
యువతలో జ్వాలలు రేపుతూ
కష్టజీవుల ముద్దుబిడ్డడయ్యాడు
అసమానతలు లేని
నవ సమాజాన్ని నిర్మించాలంటే
ఈ జ్వాలలాగే ఎన్నో జ్వాలలు పుట్టాలి.

## సమస్త శక్తుల్ని కూడదీసుకుని

- ఉజ్వల్

ప్రాంతాలేవైనా......
దేశాలపై పెత్తనాలకోసం
ఆరాట పడేటోళ్ళు మీరు-

చిరునామాలేవైనా........
ఏకంగా
భూగోళాన్నే దిగమింగాలనే
బకాసురులు మీరు-

ఆకలి గురించి మీకేం తెలుస్తుంది?
కన్నీళ్ళ గురించి మీకేం తెలుస్తుంది??

చారెడు నేలను
అనువైన మళ్ళు జేసి
ఆశల విత్తులు నాటి
జోపానం జేసి జోలపాడి
తీరొక్క పంట దీసెటోళ్ళం మేం -

భూమ్మీద బతికెటోళ్ళందరికీ
బుక్కెడు బువ్వపెట్టాలని తపించెటోళ్ళం

పులి పంజా గాయాలతో
గూటి కొచ్చిన మేక పిల్ల గాయాల్ని తుడిచి
నెత్తురు
గుండెలో దాచుకునేటోళ్ళం
ఇక్కడ మేం
రైతులం కూలీలం
అన్నీవుండి అనాథలం

మీరేమో..........
ఎల్లకాలం మామీద
కొరడాలు ఝుళిపే రాజులూ రారాజులూ!!!

నాగలి......గుంటిక.....పలుగొర్రు
ఎడ్లు.........ఎనుములు......దున్నలు
ఇవే గదా మా బలగం!
ఇవే గదా మా బలం!!

మా సమస్త బలాల్ని కూడదీసుకొని
రాసుల పంటలు దీసి
చెప్పులోని ముల్లైన
అప్పులోని బాధలేగలేక
అయిన కాడి కమ్ముకుందమని వస్తే.....
వాడోటి...వీడోటి......
నమిలేది నమిలి..........వలిచేది వలిచి
పరికి పరికి సూసి
"బారా"..........."పంద్రా"..........."పచ్చీసు"........"పచాసు"లుగా
మా చెమట రాసులకు
హర్రాజు పాటలు పాడే దుడ్ల దొరలు మీరు.

కనుపాపల్లా కాపాడుకొని
పోతం జేసుకొచ్చిన మా పంటను
పుచ్చుదనీ........తాలుదనీ.......
పరాశికాలతో పంచనామా జేస్తుంటే........
ఏమి బతుకిదాని
గుట గుటా మా కన్నీళ్ళు మేమే తాగినాం!
మీ కండ కావరాన్నెలా దించాలని
పట పటా మా పళ్ళు మేమే కొరుక్కున్నాం!!

దశాబ్దాల మార్కెట్ మాయాజాలానికి బలైనంక
ప్రపంచీకరణకు పరుగులు తీస్తున్న
మీ ప్రజాస్వామ్యం తేలిపోయాక
మాకర్థమయ్యిందిప్పుడు
మా సమాధులపై
సుందర భవంతుల స్వప్నాలు కంటున్న మీరంతా
డాలర్ కుక్కలని!
మా పసిడి పంటల బతుకులపై
వాలిన చీడలని!!

మాకు మరీ బాగా అర్థమయ్యింది
సేద్యం చెయ్యడమంటే
యుద్ధం చేయడమేనని!!
అందుకే...
మా సమస్త శక్తుల్ని కూడదీసుకుని
యుద్ధానికి మేం సిద్ధమౌతున్నాం!!!

# వటోలి

- ఉదయమిత్ర

దేశమంతా
రాకెట్టుకన్నుతో
చంద్రుడి వైపు జూస్తోంటే
నాకంటి రెటీనా మీద
ఒకే ఒక్క దృశ్యం ప్రతిఫలిస్తోంది
అది....వటోలీ........

ఎన్ని పండుగలెన్ని జాతర్లు జరిపినా
ఎన్ని దేవుళ్ళకెన్ని అర్చనలు జేసినా
సమస్త సంస్కృతుల్ని వెంటబెట్టుకు
ఒకే ఒక్కచోటుకు నడిపించాలనిపిస్తోంది.
అది........వటోలీ......

రాజ్యాంగంలో
'సెక్యులరిజం' ఎంత ధగ ధగలాడినా
దేశ విదేశాల్లో
మన ప్రజాస్వామ్యాన్ని ఎంతగ తలకెత్తుకున్నా
నాకు ఒకే ఒక్క సూచికను గుర్తుచేయాలన్పిస్తోంది
అది.......వటోలీ...........

❖ ❖ ❖

వటోలీ..ఒక పేగు తెగిన దుఃఖం
వటోలీ.........మానని గాయానికి మౌనసాక్షి
వటోలీ........అర్ధరాత్రి నిద్రలేపే పీడకల
వటోలీ.......నాగరికతకు ఒక లిట్మస్‌టెస్ట్
వటోలీ........ఒక ప్రశ్న, ఒక నిష్కారం, ఒక బడబాగ్ని

మట్టీ గాలీ నీరూ
మతంలో కలగల్సి
మనిషి విధ్వంసమౌతోన్న దృశ్యం...
చెట్టును నమ్మిన పక్షి
చెట్టు మొదళ్ల పెట్టిన మంటలకు
మాడి మసి అవుతోన్న దృశ్యం...
శాస్త్రజ్ఞుడు
జాబిల్లిని కానుకగా ఇస్తోంటే
మత ఛాందసులు
'వటోలీ' ని కానుకగా ఇస్తోన్న విషాదం

❖ ❖ ❖

దుఃఖం
కటిక చీకటిలా గమ్ముకుంటుంది

కాలి బూడిదైన ఇంట్లో
మొండి గోడల మధ్యనే
నా మనసు తచ్చాడుతోంది
గాలిలో లేచిన బూడిద పొరల కింద
ఎన్ని కలలు ఎన్ని విలువలు విధ్వంసమయ్యాయో
తల్చుకుంటేనే ఒళ్లు జలదరిస్తోంది..

❖ ❖ ❖

బతుకంతా దుస్తులు దుస్తులుగా కత్తిరించుకుని
ఊరందరికీ తోడుగైనవాడు
మందులు, గోలీలు ఇచ్చి
మమతలు పంచి ఇచ్చిన వాడు..
అగ్నికి ఆహుతవుతోంటే
ఊరంతా ఉత్త దిష్టి బొమ్మయి చూస్తోంటే

"బచావో, బచావో!" అంటూ
గిలగిలకొట్టుకుంటున్నప్పుడు
వాళ్లకళ్లల్లో కదలాడిన
భయదవిహ్వల దృశ్యాల్ని
కరపత్రం జేసి
గడప గడపకూ పంచాలనిపిస్తోంది
దేశపు గుండెమీద అతకించాలనిపిస్తోంది

నిజం చెప్పొద్దూ.....

నాకీ ప్రజాస్వామ్యమంటే భయమేస్తోంది....
కాదు...కాదు....అసహ్యమేస్తోంది....

## ఉద్యమం

వాడు
నల్లని ఆకాశాన్ని చూసి
ప్రపంచమే
చీకటిగా మారిపోయిందని
భ్రమపడుతున్నాడు
కానీ
నల్లటి చీకట్లను చీల్చుకుంటూ
ఎర్రని సూర్యకిరణాలు
ఉదయిస్తాయనే
'సత్యం' వాడికి తెలియదు

వాడు
పంటచేను చెరిపివేసానని
తెగ సంతోషపడుతున్నాడు
కానీ
భూమిలో వున్న వేళ్ళను
పెకిలించగలడా?
అవి మళ్ళీ మొలకెత్తుతాయి
మహావృక్షాలై
పంటను వాగ్దానం చేస్తాయి

వాడు
శిశిరాన్ని చూసి
నల్లమల రాలిపోయిందని
అనుకుంటున్నాడు
కానీ
గ్రీష్మంలో
దండకారణ్యం
విముక్తి అవుతున్నది కదా!

❖

కవిత్వం

# పరిమళ్ కవిత :

## నేలమీద నడిచిన ఆకాశం

వెన్నెల హృదయంతో నవ్వడం
చెట్టునీడన
కాలం పసిపాపలా ఆడటం
మట్టిచేతుల్లో
జీవితం పుష్పమై విప్పారడం
ఈకలకి చుట్టుకున్న చీకటిపై
యుద్ధమై మెరిశావ్

రెక్కలెక్కడ కూలినా
నెత్తుటిచుక్కలెక్కడ రాలినా
ఏ గొంతులో దుఃఖం పొంగినా
వేటగాడిని వేటాడే
ప్రజావిలుకాడివైనావ్

సముద్రాల అవతలి నుండి
మనిషిని మింగడానికి
ఏ రూపంలో వచ్చినా
కొండచిలువను కలంతో
స్పష్టంగా రూపుకట్టించావ్

పచ్చని అడవిలో
చిగురించాల్సిన మనిషి కోసం
హక్కులబాట మండించావ్
వాడలో నలిగిన మనిషి
శిఖరమై లేచేందుకు
కొత్తపోరుకు రెక్కలిచ్చావ్

పండగనాటి అత్తరుదాటి
లోన మెతుకుల్లేని నెలవంకలు
చందమామలయ్యేందుకు
తడితడిగా హృదయం విప్పావ్

నీ అడుగుల్లోంచి ఎగసి
ఎక్కడెక్కడో పులియై ఉరుకుతున్న
పీడిత గుండెల్లో భూకంపాలు దూకేవి

నేలమీద నడిచిన ఆకాశమా!
మాటల్ని ఊదేసి
చీకట్లు తుడుస్తూ

బతుకులో పొద్దు ఆవిష్కరణకై
కదిలిన నీ జీవితం
మా రక్తంలో కరిగిపోయింది

మట్టిని శ్వాసించిన జనం పుష్పమా
రూపంలో ఎగిరే జెండాలు
చెద అంటని పోరాటం శ్వాసించిన
నీ బతుకుసారం
కళ్ళకద్దుకోవాల్సి ఉంది.

## ఉదయమిత్ర కవిత :

### పోటెత్తిన పాదాలు

ఎన్నో పాదాల్ని చూశా....
ముందుకు నడుస్తున్నట్టే నటించి
వెనక్కి నడిచే పాదాలు
ఏ అడుగులు ఎటు వెయ్యాల్నో తెలీక
తమకుతామే అడ్డుపడే గజిబిజి పాదాలు.....

ఎన్నో పాదాల్ని చూశా
మట్టిస్పర్శకు దూరమైన పాదాలు
బూట్లచప్పుళ్లకింద
పల్లెల వణికించిన పాదాలు
సముద్రాల్తో కడిగినా
రక్తపు మరకలు చెరగని పాదాలు

ఎన్నో పాదాల్ని చూశా....
కాసిన్ని కాసులకు లొంగి
గజ్జెల్ని విసిరేసే పాదాలు
దెబ్బకు ఝుడిసి
వెనక్కె పల్టీలు గొట్టేపాదాలు.....
ఎడారిలో శిథిలపాషాణాలై
పెళ్లలు పెళ్లలుగా ఊడిపడ్డపాదాలు......

❖ ❖ ❖

భగ్గుమన్నభూమ్మీద
అడుగుపెట్టినప్పుడే
నేనాపాదాలవైపు చూశా.....
అవి అందంగా లేవు......నునుపు దేరలేదు
అవి దూరాల్ని నడిచినట్లు
ఎడారుల్ని దాటినట్లు
దుమ్ముగొట్టుకొని ఉన్నాయ్
మురికిగా ఉన్నాయ్
అయితేనేం?

అవి స్థిరమైన పాదాలు
మడమతిప్పని బలమైన పాదాలు
జీవితపు అగ్నిగుండాల్నిదాటి, బొబ్బలు 'గట్టి
అట్టలు గట్టిన పాదాలు
దారులు చీలిన ఇసుక తుఫానులో
పాదాలు చీరుకుపోతున్నా
ఆర్తుని కేక దిక్సూచిగా
తీరాలవైపు నడిచిన పాదాలు
ఎదుర్రొమ్ముమీద తుపాకీ గురిపెట్టినా
చావుగడప దాంక నడిచివెళ్లినా
చావునే ధిక్కరించి
ముందుకు నడిచిన పాదాలు.

❖ ❖ ❖

అవి తాకని చోటులేదు
నడవని దిక్కులేదు
నీరూ -గాలీ -మైదానమూ - అడవీ
నిన్న - నేడు - రేపు అన్యాక్రాంతమైనప్పుడు
టైగర్ ప్రాజెక్టునుండి ఓపెన్ కాస్ట్ దాంక
వాకపల్లి నుండి పోలేపల్లి దాంక
ముంపు ప్రాంతాలనుండి మూసీదాంక

ఇంద్రవెల్లి నుండిదా ఉత్తరాంధ్ర దాంక
గాయాలకు చేతులు మొలిచి
చేతుల చివర ఎడారులు మొలుస్తూ ఉంటే
పిడికిళ్లయి బిగుస్తూ ఉంటే
ఎక్కడికి పిలిస్తే అక్కడికి దారితీశాయి
హక్కులకు రెక్కలు తొడగడానికి
దిక్కులన్నీ తానే అయి తిరిగాయి.....

తుపాకీ మోతల కింద
గావుకేకలు గాల్లోకల్సినచోట
చివరిశ్వాసలోని చెరగని సంతకం కోసం
ఒంటరిగానయినా, గాడాంధకారంలోనయినా
సాహసంగా నడిచి వెళ్లాయి......
కల్లోల కాలానికి కావలికాశాయి

❖ ❖ ❖

పక్షయినా ఇంత అలిసిపోయి
కొమ్మను వాలుతుందేమోగాని
నదయినా సముద్రం చేరేసరికి
అలిసి, పాయలుగ చీలి
పడమటికేసి వాలిపోతుందేమో గాని
సముద్రమయినా అలిసి
అలలమాటున ఇంత రెక్కలల్లారుస్తుందేమోగాని
ఆ పాదాలకు అలసటలేదు

బొబ్బలెక్కినా, గాయాలయినా
ముళ్లదారులవెంట నడక ఆగింది లేదు......

దూరాల సముద్రాలు చీలి
అలసటలేని ఆపాదాలకు
వినమ్రంగా ఒదిగి దారులిచ్చాయి....

విశాల భారతావని
ఆ పాదాల తాకిడికి
చిన్నబోయింది......
చిన్నదయ్యింది.....

❖ ❖ ❖

ఇవ్వాళ
వేళ్లు కొంకర్లుపోయి
నిప్పుల నడకకు విశ్రాంతినిచ్చి
అవి నిశ్చలంగా పడి ఉండడం.......
నేనిప్పుడే చూశా...
అయితేనేం?
నడిచొచ్చిన ఆ పాదాల వెనుక
విడిచొచ్చిన సందేశాల్ని మోసుకుంటూ
వేలాది పాదాలు పోటెత్తడం..
భయాల్ని విడిచి భరోసాలివ్వడం
మరణాన్ని తుడిచి జననాన్ని వాగ్దానం చెయ్యడం
నేనక్కడే చూశా...
నినాదాలు నిప్పురవ్వలై
మనుష్యులు మంటలవ్వడం....
నేనా చితిమంటల పక్కనే చూశా..
ఏదీ ఒంటరి దుఃఖంగాదు....
ప్రజలకోసం వేసే ఏ అడుగూ వృథా పోదు

**(బాలగోపాల్ గార్కి పొగడ్తలంటే ఇష్టముండదు. కాని ఏంచెయ్యను? నేను ఇట్లా తప్పితే మరోలా రాయలేని అశక్తుణ్ణి)**

## తంగెళ్ళ సుదర్శనం పాటలు నాలుగు :

### జోహార్లు బాలగోపాల్

జోహార్లు జోహార్లయ్యో ఓ బాలగోపాల్
పేద ప్రజల జోహార్లందుకో ఓ బాలగోపాల్

ఓరుగల్లు కొచ్చినావు ప్రజా పోరు చదివినావు
ప్రజా ఉద్యమాలకు నువ్వు బాసటగా నిలిచినావు
పౌరహక్కుల పోరుకు నీవు ఓ బాలగోపాల్
వేగుచుక్కవైనావయ్యో ఓ బాలగోపాల్ జోహార్లు
పల్లె పల్లె తిరిగినావు ప్రజలను నువ్వు కలిసినావు
ఇల్లు ఇల్లు తిరిగినావు ఇబ్బందులు జూసినావు
నోరు లేని పేదోళ్ళకు ఓ బాలగోపాల్
నీవే గొంతువయ్యినావయ్యో ఓ బాలగోపాల్ జోహార్లు

ఎన్‌కౌంటర్ అయిందంటే ఎంత పెద్ద అడవైన
ఆకలి దప్పులు మరిచి కాలినడక వెళ్లినావు
అది ఎన్‌కౌంటర్ కాదనంటివో ఓ బాలగోపాల్
ఎత్తుకొచ్చి కాల్చిరంటివో ఓ బాలగోపాల్ జోహార్లు

ఎన్‌కౌంటర్ జేసినోళ్ళ హత్యానేరము కిందా
అరెస్ట్ జేయాలన్నావు కేసుబెట్టాలన్నావు
చట్టాన్ని గుర్తుజేస్తివో ఓ బాలగోపాల్
అమలుకు డిమాండ్ జేస్తివో ఓ బాలగోపాల్ జోహార్లు

ఖమ్మం జిల్లాలలో నీ కండ్లు గప్పి పోలీసోల్లు
ప్రజాబంధు పేరుతో వచ్చి నిన్నూ బందీని చేసి
సచ్చే దెబ్బలు నిన్ను కొట్టినా ఓ బాలగోపాల్
కొన ఊపిరితో కొట్లాడితివో ఓ బాలగోపాల్ జోహార్లు

సాహిత్యంలో సవ్యసాచి గణితములో ఘనతనీది
వకీలు కోర్సు చదివినావు హైకోర్టు కెళ్ళినావు
బీదసాద వకీలువయ్యో ఓ బాలగోపాల్
పేదోళ్ళకు చూపు నీవయ్యో ఓ బాలగోపాల్ జోహార్లు

ఆస్తి పాస్తి కోరలేదు అంతస్తులు కోరలేదు
కాలినడక మరువలేదు కార్లల్లో తిరుగలేదు
సీద సాదా బతుకు నీదయ్యో ఓ బాలగోపాల్
ఆచరణకు మారు పేరయ్యో ఓ బాలగోపాల్ జోహార్లు

నిర్బంధాలెన్నొచ్చిన ఎదిరించి నిలిచినావు
గళము ఆపలేదు నీవు కలము ఆపలేదు నీవు
మానవ హక్కుల యోధుడివయ్యో ఓ బాలగోపాల్
ప్రజలకు నువ్వు ఆప్తుడివయ్యో ఓ బాలగోపాల్ జోహార్లు

కాశ్మీరు నుండి నువ్వు కన్యాకుమారి వరకు
మొక్కవోని ధైర్యముతో హక్కుల పోరైనావు
అన్యాయము నెదిరించితివో ఓ బాలగోపాల్
న్యాయానికి గుర్తునీవయ్యో ఓ బాలగోపాల్

**(చిప్పిరి చిప్పిరి వెంట్రుకలు దువ్వరాదు ముడవరాదు అనే పాట బాణిలో పాడుకోవాలి)**

### వరదల గాయం

వానలు విసురుగ కురిసినై - వాగులు వంకలు పొంగినై
నదులే నాట్యం జేసినై - ఊళ్ళకు గాయం జేసినై..... వానలు....

ప్రజల గూడులు చెదిరినై - ప్రాణాలాగం అయ్యినై
ఈదిన ప్రాణం బతికెను - ఈదని ప్రాణం బోయెను.... వానలు...

గూటిలో దూరిన పిట్టలు - ఏటికే ఎదురీదినై
దొడ్లో చేరిన పశువులు - అసువులు బాసిపోయినై వానలు....

వరదలు చుట్టు ముట్టినై - కట్టు బట్టలే మిగిలినై
నిందు పొద్దుల తల్లులూ - గొల్లు గొల్లున గోసరిల్లెను వానలు....

మెతుకులు దొరకని బతుకులు బోరున విలపిస్తున్నవి
నీళ్ళే దొరకని జీవులూ - కన్నీళ్ళనె మింగుతున్నవి వానలు......

పాలక వర్గం పుణ్యమే ప్రజలకు చేసెను పాపము
తుంగభద్ర కృష్ణమ్మలూ ఉగ్రరూపమేదాల్చెరా..... వానలు.....

సాయంకోసం అరుపులు - ఊతం కోసం ఉరకలు
ప్రాణం బోసే నదులురా మన ప్రాణాలె తీసెదిరా... వానలు....

ఓట్లకు పుట్టిన దోపిడి కుక్కలు సీట్లలో పాతుకు పోయినై
మన తావులు తనువులు బోయినా వాళ్ళ గద్దెలకె తన్నులాటరా వానలు

(ఆగదు ఆగదు ఆగదు అనే పాటి బాణీలో పాడుకోవాలి)

## కంపెని మాయ

పల్లవి: మన బతుకుదెరువులో మన్ను బోసింద్రో ఈ కంపినోళ్ళు
మన కడుపులల్లో మట్టి గొట్టింద్రో ఈ కంపినోళ్ళు మన

కంపచెట్లు కొట్టివేసి రాలిన ముండ్లేరిపోసి
చెట్టు పుట్ట తవ్విపోసి రాళ్ళు రప్పలు తీసివేసి
సంకలల్లో సంటిపిల్లలు నెత్తిమీద తట్టలెత్తి
పొదలు గొట్టి అచ్చుగట్టి పొతం జేసుకున్న భూమిలో
-గద్దలెక్క వచ్చివాలిండో ఈ కంపినోడు
రాబందువోలె తన్నుకెళ్తుండో ఈ కంపినోడు మన

పచ్చని పైరూలతోని ఆదుకొనెడి సిరులతల్లి
పచ్చ చీరగట్టినట్లు మెరిసిపోయె భూతల్లి
చెరువు గుండెల్లో రోడ్లుపోసి చెరువు నెండాగొట్టినారు
చేతికందె పైరులల్లో మట్టిపోసి తొక్కినారు.
- బీడు భూములంటున్నాడో ఆ కంపినోడు
బీద బిక్కి నోరు నొక్కిండో ఈ కంపినోడు మన

పట్ట భూమున్నోళ్ళకు ఐదు లచ్చలిస్తున్నారు
లావాణి భూములోళ్ళకు పైసలెగ గొట్టినారు
ఏండ్ల తరబడి చేసినెవసం ఏటిలో కలిపేసినారు
ఎదురు తిరిగి నిలబడితె ఎన్‌కౌంటర్ జేస్తమన్నారు
పోలీసు బలగం దింపినారయ్యో ఈ కంపినోళ్ళు
రజకార్లనే మరిపించినారయ్యో ఈ కంపినోళ్ళు మన
నోట్లో నాలుక లేనివాళ్ళం కడుపుల పేగులు మాడినోళ్ళం
సదువు సంధ్యలు లేనివాళ్ళం మోసాలు తెలియనోళ్ళం
రెక్కల కష్టం నమ్మిన నోళ్ళం గోసిగాళ్ళం గొంగడోళ్ళం
రాజులు రాకాసులెవ్వలో గుర్తుబట్టని ఎడ్డివాళ్ళం
మన గొంతులిషము బోస్తున్నారో ఈ కంపినోళ్ళు
మన పొనాలను తీస్తున్నారో ఈ కంపినోళ్ళు మన

మనకె భూమి లేకపోతె పిల్లల గతి ఎట్లగాను
బతుకుదెరువు లేకపోతె బాధలెట్ల బాసిపోవును
కూలినాలి పేదజనము రైతులంత ఏకమైనం
కూడు గూడు గుడ్డకొరకు పానాలను అడ్డుపెడతం
మా బొందిలో పానాలుండగరో ఓ కంపినోడా
భూతల్లిని వొదిలిపెట్టమురో ఓ కంపినోడా మన

(౧ ౮-2009న కాళ్ళకల్ మండలం తుఫాన్ జిల్లా మెదక్ ప్రాంతంలో సెజ్‌ను సందర్శించిన తర్వాత రాసిన ఈపాట)

## కరువు కాలం

పల్లవి: భూగోళమే అగ్నిగోళమోలె మండుతుండె
రాలదాయె వాన చినుకు రాలిపోయె రైతు బతుకు భూగోళమే...

చెర్లు కుంటలు ఎండిపాయె గడ్డిపోచలు మాడిపాయె
నీరు గాసం లేకపాయె గొడ్లు గోదలు బతుకవాయె... భూగోళమే..

లోతులోకి బోరువేసిన నీటిధార లేకపాయె
ఎండిన పంటలను జూసి రైతు గుండె ఆగిపాయె భూగోళమే

పెరిగిపాయె పెట్టుబడులు ఎక్కువాయె పాత అప్పులు
కొత్త అప్పులు దొరుకవాయె దినము దినమోగండమాయె...
భూగోళమే....

బిడ్డలు పెండ్లిళ్ళకెదిగె పిల్లల చదువాగిపాయె
కాలమేమో కాకపాయె కట్నమేమో పెరిగిపాయె.... భూగోళమే....

పండుగెనుక పండుగొచ్చె పండుగ పేరుతో అల్లుడొచ్చె
ఇంట్ల దమ్మిడి లేకపాయె ఇజ్జత బోయె రోజులొచ్చె భూగోళమే....

కూలినాలి జేసేటోళ్ళు కూడు దొరుకే జాడలేక
పొట్ట చేత బట్టుకొని పట్నమెల్లిపోయినారె భూగోళమే....

## కెక్యూబ్ వర్మ కవితలు నాలుగు :

## స్థూపం మీది పేర్లు

వాటిని చదువుతుంటే
మీరూపు కనులముందు కదలాడుతోంది

అవి మీ పేర్లు మాత్రమేనా
వెయ్యేళ్ళ యుద్ధ నావను నడిపిన
సరంగుల ఆనవాళ్ళు
జనం గుండెల్లో గూడుకట్టుకున్న
పోరాట రూపాలు
ప్రవహించే ఉత్తేజపు అలల సవ్వడి
వినబడుతోంది
మా నరాలలో లావా ఉరకలెత్తుతోంది
మా దేహం సంధించిన బాణమయ్యింది

తెగిపడిన మీ కంఠనాళాలలోంచి
కదంతొక్కుతూ పదం పాడుతూ
పదండి ముందుకు అంటూసాగిన
విముక్తి గీతాలాపన హోరు...
పచ్చని పైరు మీదుగా వీచిన గాలి తిమ్మెర
ఏదో చల్లని కబురు చెవిలో చెప్పిన అనుభూతి
మీ నవ్వుల హరివిల్లులు నలుదిశలా
పరచుకున్న ఆనందహేల...

కొన్ని విజయాలు మాత్రమేనా...
శతాబ్దాల బానిస సంకెళ్ళు తెగిపడిన
జయజయధ్వానాలు

మీ పేర్లు స్థూపం మీదేనా?
కాదు.....
ఈ జాతి విముక్తి పోరాట చరిత్ర పుటల్లో
నెత్తురంటిన పేజీల నిండుగా...

మీ అమరత్వం రేపటి
సూర్యోదయానికి అరుణిమను
పూసింది...

**(ప్రజల పక్షాన దేశ బానిస సంకెళ్ళు తెగ్గొట్టే ప్రజాయుద్ధ పోరులో అమరులైన వారిస్మృతిలో)**

## స్వప్న మేఘం

ఒక స్వప్న మేఘం కరిగిపోతూ
అందరి హృదయాలలో
కన్నీటిని వర్షించింది

స్వప్న పథికుడు మరెవరికీ
అందనంత దూరం
వడివడిగా
నడుచుకుంటూ పోయాడు!
శోధన నాళికలోంచి
స్వప్నలోకాల పయనమయ్యాడు!
శిరస్సుతెగిన దీపపు
స్తంభానికి తన జీవన నౌక
లంగరు వేయగా
పెద్ద పెద్ద అంగలు
వేసుకుంటూ పోయాడు!

కానీ......
పైకి చూడు నీ మనో నేత్రంతో
ఆయన వేలి చివరల నుండి రాలిన
వెన్నెలాకాశంలో
మంచుశిల్పాలు!!

## ఏవి తల్లీ...

ఏవి తల్లీ నిరుడు మొరిగిన
మూర తుపాకులు?

రాని వసంతకాలానికి ముందే
చర్చల కూత కూసిన
తెల్ల కోయిలల రాగాలకు
వంత పాడిన వాళ్ళ గొంతులు
శాశ్వతంగా మూగబోయినాయి

ఎందరో నూనూగు మీసగాళ్ళు
ధారపోసిన వృధా క్రొన్నెత్తురుతో
రాజేసిన రావణకాష్టంలో నేడు
పేలాలు ఏరుకొని నీటుగా చలువ
గదులలో సేద తీరుతున్న వృద్ధ
జంబూకాల నామాలను
బయటపెట్టే వాడెవ్వడు?

రాజమార్తాండుల వారి మూడు చక్రాల
బండికి ముందు సైకిలు చైనై
తిరుగాడు తున్నవాడి
పళ్లూడగొట్టే వాడెవ్వడు?

మొండి చెయ్యి తోలు బొమ్మలాటకు
నీడలా వెన్నంటి దీపపు సమ్మై
వెలుగుతున్న వాడిని కాలరుపట్టి
తెరముందుకు లాగేవాడెవ్వడు?

భ్రమల శ్లేష్మంలో చిక్కుకుని
రెక్కలాడక ఊపిరాడక
అమరుడైన వాడి స్థూపానికి
ఇటుక మోసేవాడెవ్వడు?

## ఎర్ర కాలువ

నిటారుగా నిలబడి గుండెల నిండుగా
ఊపిరి పీల్చుకొని
కాళ్లు రెండూ నేలపై బలంగా అదిమి
మీకళ్లలో కళ్లు పెట్టి చూడాలన్న
నా కోరిక ఈ తరానికి సాధ్యమా?

తరతరాలుగా నా భూమిని
నా సర్వాన్ని నీ హక్కు భుక్తం చేసుకొని
కోటి పడగల నా గుబాములై
భూ మండలాన్ని చుట్టేసుకున్నావు!

అనాదిగా బానిసత్వపు సంకెళ్లను
వేసి నన్ను పాతాళంలోకి నెట్టివేసి
అధికారాన్ని అనుభవిస్తున్నావు......
కానీ........
అణచబడ్డ నాతరం అంతరంగ సునామీలోంచి
ఉద్భవిందే పెనుతుఫాను తాకిడికి
నీ అధికార పీఠం తలకిందులవుతుంది....
అవమానాల ఊబిలోంచి
ఎర్రకలువ పూస్తుంది.........

## కరిగిన స్వప్నం

[illegible]వ్వైరపోయాను
[illegible]ష్టుడనయ్యాను
ఇం[illegible] సున్నిత మనస్కున్ని కోల్పోవడం
ఈపా[illegible]లోకపు ప్రార్థం

నిన్న మొన్నటి వరకు మనం కలిసి
[illegible]సిన సభలు సమా[illegible]
[illegible]ముకున్న జ్ఞాపకాలూ తీపిగురుతులూ
వేదనలూ సంఘర్షణలూ
ఇప్పటికీ కనులముందు కదలాడ[illegible]యి.

ప్రతిసారీ నీవు చెప్పిన గుండెలిం[illegible]ం
న[illegible] ఇలా మింగేస్తుందని ఊహించలేకపోయాను

మేము ఒరిగిన ప్రతిసారీ [illegible]గా నిలిచి
వెన్నుచరిచి ము[illegible]దుకు తీసుకు[illegible]యిన
నీ ధైర్యాన్ని మి[illegible]గిన [illegible]
తెలియక మూగగా రోదిస్తున్నాము

నీ నవ్వుల వరికంకులు లేని
ఈ శరత్కాలపు వెన్నెల మసకబారిపోయి
నాగావళి ఇసుకలో ముఖం దాచుకుంది

రాబోయే యుద్ధకాలానికి
నీ పదునెక్కిన కలంతో
మమ్మల్ని కవాతు చేయిస్తావని కన్నకలల్ని
యిలా జ్ఞాపకాల కన్నీటి వరద మధ్య
చుక్కాని లేని నావలో
ఒంటరిగా చేసిపోవడం
భావ్యమా?

(మిత్రుడు, సహచరుడు, గైడ్ పడాల జోగారావు గారి అకాల మరణం కల్పించిన వెలితితో)

## జోస్ మారియో కవితలు మూడు:

తెలుగు : బాల్‌రెడ్డి

## గెరిల్లా

నేను పసిపాప మొఖాన విరిసిన నవ్వును
ఎడబాటు వేళ వధువు చెక్కిట కన్నీటి చుక్కను
రాలిన ఆకుల జాడన చివురులు తొడిగే ఆశను
వలపున పిలిచే వసంత కోకిల మధుగీతిని
సాగే కరిమబ్బులిసిరే తొలకరి స్వాతి చినుకును
మనసొప్పక, విధితప్పక మది విదిల్చే నిట్టూర్పును
నేను అమాయకపు పసిమనస్సు వేసే ఆకలి కేకను
అగాధమెంతో తెలియని అనంత జలసాగరాన్ని
మదిని హృదిని కలిపి నిలిపే ఉద్వేగపు వెల్లువను
వెనుదిరగక రణభూమిన చూపిన సాహస ఫలమును
శ్రమ జీవుల ఒడలు కురిసే స్వేదపు సెలయేటి సిరిని
నేను గుసగుసల గుండె గొంతు పెదాల విరిసే పాటను
వెచ్చటి చెమటన పెరిగిన రైతుల పచ్చని పొలాన్ని
వినువీధంచుల తాకే విశ్వాసపు కేతనాన్ని
వడగాడ్పులు, సుడిగాలుల కొరగని నీ నమ్మకాన్ని
నివురున దాగని నిజాన్ని, దిక్కుల దాటే దృక్కును
త్యాగములో మొలచిన జీవన వనఛాయనీడ
వెలిసిన విశ్వపు జాతి సౌహార్ద్రానుబంధాన్ని
సమబావన పంచి పెంచె సంతోషపు సిరినవ్వును
పెనుదుఃఖం, ఆనందం ఎల్లలు చెరిపెగిసినపుడు
దారపు పురి దండెదైన సంఘం ఏకీకృత శక్తిని
నిశ్చల నిశ్శబ్ద తటిన హృదయపు తంత్రులు మీటే
తుదనేది లేనె లేని మానవతా గీతాన్ని

## ప్రజా మిలిషియా గీతం

తెలుగు : హసన్ నసీర్

నేస్తమా! నీవింటివా మన మైదానాల మీద ఎగురుతున్న కాకుల మందల చప్పుడు?
నేస్తమా! నీ వింటివా బంధనాల్లో మగ్గిపోతూ ఏకాదాటిగేడుస్తున్న మన దేశపు దుఃఖాన్ని?
ఓయోయ్ నానేస్తమా! మన రైతులు, కార్మికులు మోగించెడి ప్రమాద ఘంటికలిప్పుడు?
ఈరాతిరి చీకటిలో కారే కన్నీటిధార మరిగే మన నెత్తురులో పొటెత్తెను పెనుమంటై!
ఓ కామ్రేడ్స్! నా మిత్రులారా వెలికిరండి గనుల నుండి అడవులలో మీరున్న రహస్య స్థావరాల నుండి
నేటి దాక దాచుకున్న మీ ఆయుధాలనందుకొండి, మీ చేతి గ్రేనేడులు, మందుగుండు వెలికి తెండి
ఓహో ఇటు చూడు నీవు! విధ్వంసక దళ సోదర భద్రం సుమా నీ మందుగుండు బరువుతోని
నాలుగు గోడల నడుమ బందైన సోదరులను బయటకు తీసుకురాను

బద్దలు కొడతాం జైలును
అవమానాలు, ఆకలి రేపిన మంట, ముప్పిరి గొన్న బాధలు ఒక్కటి చేసేను మమ్ము
ఇతర చోట్ల ఎవరున్నారో ఇది బాధలే తెలియనోళ్ళు కమ్మటి కలలోన మునిగి గురక నిద్ర పోయేవాళ్ళు
కవాతుకయినం సిద్ధం ఆగము మేమిపుడిక్కడ సాగుతాం, చంపుతాము పోలికల కెరటమయ్యి
ఈ నేలన ప్రతి ఒక్కడు తానెరుగును తానేమిటో అవరమనది ఏదో ఎంపిక తెలుసును మాకు
ఓ నేస్తమా గోడవాలు నీడ కింద నీవారిగే నీతావున నేనే నిలుస్తా నా తదుపరి మరి ఒకడు
వీధిలో పారిన నెత్తురు రేపటి సూర్యోదయాన ఎండలోన ఎండిపోయి నేలనింకి నల్లబడును
అయినా సహచరులందరు గొంతెత్తి ఆలపించే స్వేచ్ఛా గీతపు ధ్వని మా వీనులకవును ఎందు
నేస్తమా! నీవింటివా మన మైదానల మీద కాకుల మందలు ఎగురుతున్న చప్పుడు?
నేస్తమా! నీ వింటివా బంధనాల్లో మగ్గిపోతూ ఏకాదాటిగేడుస్తున్న మన దేశపు దుఃఖాన్ని?

రచనాకాలం:15 జూన్ 1978

## గెరిల్లా కవే

రచనాకాలం: 1968
అనువాదం: హసన్‌నసీర్

గెరిల్లా కూడా కవిలాగే
రాలే ఎండుటాకుల సవ్వడి
విరిగే చెట్ల రెమ్మల చప్పుడు
నది ప్రవాహపు గలగలలు
కానలలో రేగిన కార్చిచ్చు వాసన
కాలి మిగిలిన బూడిద కుప్ప
ఏది ఆ తీక్షణ దృష్టిని దాటిపోదు

గెరిల్లా కూడా కవిలాగే

చెట్లలో కలగలిసిపోతాడు
పొదల్లో, రాళ్ళలో అస్పష్టంగానే
కాని చక్కగా అమిరిపోతాడు
గతిశాస్త్రానికి చక్కని సంకేతమైన
అతడు అనేక రూపాల అధిపతి
గెరిల్లా ఒక కవిలాగే
ప్రకృతి లయకారుడై సాగిపోతాడు
ఆకుపచ్చని రంగులో అమిరిపోయి
లోనావరించిన నిశ్శబ్దం, బయటికి
వ్యక్తమయ్యే అమాయకత్వంతో
చేతిలోని హుందాయైన ఉక్కుములికితో
శత్రువును వలలేసుకుంటాడు

గెరిల్లా కూడా కవిలాగే
ఆకుపచ్చ, గోధుమ వర్ణం
అలల వెల్లువై సాగిపోతాడు
పొదలో విరిసిన అగ్నిపూలను
తురాయిలా ధరించి మురిసిపోతాడు
నేల మీద వరదెత్తే సమూహమై
స్థావరం వైపు ఆగకుండా సాగుతాడు
దీర్ఘకాలం యుద్ధం పై అంచంచల విశ్వాసి
అతడొక అంతులేని ఉద్యమోద్భృత శక్తి
ప్రజా ఇతిహాసం, ప్రజా యుద్ధం విశ్వాసం

## జునైద్ ఆలం కవిత :

### బాగ్దాద్ కొడుకులు కూతుళ్ళు

తెలుగు : బాల్‌రెడ్డి

బాగ్దాద్ కొడుకులూ, కూతుల్లారా!!
బాగ్దాద్ కొడుకులూ, కూతుల్లారా!!
మీ విముక్తి ఘడియ సమీపించింది
కృంగ దీస్తున్న భుజాల మీద బరువుతో బలంగా
దిగ్భ్రమలో భయభీతితో నిలబడండి
బాగ్దాద్ కొడుకులూ, ఒకూతుళ్లారా!!

మీ విముక్తి ఘడియలు సమీపించాయి
కాలిపోతున్న ఇళ్ళను, కూలిపోతున్న భవనాలను చూడండి
మీ చుట్టున్న భూమి కంపిస్తుంది, వెన్ను వంచండి వెనక్కుతగ్గండి
మీ కిటికీలు బద్దలై గాలికెగిరి పోయేంతగా ఏడ్చిమొత్తుకోండి
మా సాయుధ కవచ దళాలు కూడేంతలో పరిగెత్తి పారిపోండి
బాగ్దాద్ కొడుకులూ, కూతుళ్లారా!!

మీ విముక్తి ఘడియలు సమీపించాయి
మీ విముక్తి సంకేతాల కోసం ఆకాశం కేసి చూడండి
క్రూయిజ్ మిస్సైల్స్
విద్యుత్ షాక్‌లు,
లేసర్ చాలిత, రాడార్ మార్గదర్శక
21,000 పౌండ్ల మైక్రోవేవ్ బాంబులు
దైవ ప్రసాదిత మందుగుండు
మీ ప్రజాస్వామ్యాన్ని ఫలవంతం చేస్తాయి
బాగ్దాద్ కొడుకులూ, కూతుళ్లారా!!

మీ విముక్తి ఘడియలు సమీపించాయి
అందుకే మీ కోసం మా శ్వేతస్తాన్ని చాచాం
ఇండియా, ఆఫ్రికా, వియాత్నాం

వారి ఎర్రటి నెత్తురుతో శుద్ధి చేశాం
బాగ్దాద్ కొడుకులూ, కూతుళ్లారా!!

మీ విముక్తి ఘడియలు సమీపించాయి
ఆస్పత్రులకు క్యాన్సర్ వార్డులకు
ఈ ఆనంద వార్తను చేరవేయండి
నిన్నటికి మీతో ఉన్న 500.000 మంది
చిన్ని శవపేటికల్లో నిశ్శబ్దంగా నిద్రిస్తున్నారు
త్వరలో మీరు వారిని కోరి చేరుకోవచ్చు

బాగ్దాద్ కొడుకులూ, కూతుళ్లారా!!

మీ విముక్తి ఘడియలు సమీపించాయి
పునరావిర్భావ విశ్వాసులు సృష్టించిన
యుద్ధటాంక్‌లు, దురాక్రమణలు, బుల్డోజర్లు
ఆకలి, చిత్రహింసలు, కర్ఫ్యూలు
ఆక్రమణలు, జాత్యహంకార, జాతినిర్మూలనలతో
మీ విశ్రాంతికి హామీ, మీ భవితవ్యం భద్రం
1948నాడు, 1492లోనూ
పాలస్తీనా విమోచనా సంకల్పానికీ ఇదే స్ఫూర్తి

బాగ్దాద్ కొడుకులూ, కూతుళ్లారా!!

భీభత్సం, భయం ఇక్కడున్నాయి
మీ స్తుతి వాక్యాలను, సమాధిపై
శిలా ఫలకపు వ్యాఖ్యలను సిద్ధం చేసుకోండి
మీ విముక్తి ఘడియలు సమీపించాయి.

మహ్మద్ జునైద్ ఆలం ఈశాన్య విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్రం డిగ్రీ విద్యార్థి.
విశ్వవిద్యాలయ యుద్ధం జాతి దురహంకార వ్యతిరేకోద్యమ సభ్యుడు.

రచనాకాలం: మార్చి 23, 2003

## చలసాని ప్రసాద్ కవిత :

### ఆర్తగీతం

నిజంగానే, నిజంగానే
రోళ్ళు పగిలే రోహిణీ కార్తెలో
మండు వేసవిలో, మిట్ట మధ్యాహ్నం
సూర్యుడు అస్తమించడాన్ని
నేను చూశాను, నేను చూశాను

నిజంగానే, నిజంగానే
పండు వెన్నెల చిందించే
నిండు చంద మామ
ఆదాటుగా ఆరి పోవడాన్ని
నేను చూశాను, నేను చూశాను

నిజంగానే, నిజంగానే
అనాదినించీ అచంచలంగా ఉన్న
మన హిమాలయం
నేలవాలి పోవడాన్ని
నేను చూశాను, నేను చూశాను

నిజంగానే, నిజంగానే
యుగయుగాలుగా
ఉరకలెత్తే గంగాభవాని
ఘనీభవించడాన్ని
నేను చూశాను, నేను చూశాను

నిజంగానే, నిజంగానే
ఆదివాసుల, మూలవాసుల
ఆర్తత్రాణ పరాయణుని
గళం మూగపోవడాన్ని
నేను చూశాను, నేను చూశాను

నిజంగానే, నిజంగానే
అంటరాని వారి, సెంటులేనివారి
ఆత్మబంధువు పరివాదిని
ఏలలేకపోవడాన్ని
నేను చూశాను, నేను చూశాను

నిజంగానే, నిజంగానే
అధోజగత్సహోదరుల కోసం
పూరించిన మౌనశంఖం
మాటమణిగిపోవడాన్ని
నేను చూశాను, నేను చూశాను

నిజంగానే, నిజంగానే
నవ్వని పువ్వు ముసిముసి నవ్వులు
వాడిపోయి, వీడిపోయి
విరితావిని విరజిమ్మక పోవడాన్ని
నేను చూశాను, నేను చూశాను

అతను అస్తమానమూ అతనుడు
ఎల్లకాలం దేహరహితుడు
మనసుతోనే మనుగడ సాగించే
మానవీయ మహనీయుడి
మేరుసమాన ధీరుడు

**శ్రీశ్రీ, తిలక్‌లకు క్షమాపణలతో...**

**కరపత్రం**

# వై.యస్.ఆర్. నుండి మన కడపను కాపాడుకుందాం

కడపజిల్లాను వై.యస్.రాజశేఖరరెడ్డి జిల్లాగా పేరు మార్చాలని ప్రభుత్వం నిర్ణయించడంతో కడపజిల్లా సంస్కృతికి, చరిత్రకు అతిపెద్ద ప్రమాదం వచ్చిపడింది. జిల్లా కేంద్రంగా కడప ఏర్పడి 200 సంవత్సరాలైందని గత ఏడాదే ద్విశత వార్షికోత్సవాలు వైభవంగా జరిగాయి. ఒక పరిపాలనా కేంద్రంగా కడపకు 200 ఏండ్ల గుర్తింపు ఉన్నా నిజానికి చరిత్రలో కడప అనే పేరు శతాబ్దాల నుండి ఉనికిలో వుంది. ఇక్కడి ప్రజల విశ్వాసాల ప్రకారం, మెకంజీ కైఫీయత్తుల ప్రకారం కడప అంటే వెంకటేశ్వరుని గడప. ఖచ్చితమైన చారిత్రక ఆధారం ప్రకారం క్రీ. శ. 971 నాటికే 'కడప' ప్రాదేశిక విభాగంగా ఉనికిలోవున్నట్లు వైదుంబ రాజువంశానికి చెందిన భువన త్రినేత్ర అనే రాజు అత్తిరాలలో వేయించిన రాగిశాసనం ద్వారా తెలుస్తోంది. కడపజిల్లా ఒకప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని రాయలసీమలో అతిపెద్ద ప్రాంతం. బళ్ళారి సరిహద్దులనుండి ఇప్పటి అనంతపురం. చిత్తూరు, కర్నూలు, ప్రకాశంజిల్లాల్లో చాలా ప్రాంతాలు ఒకప్పుడు కడపజిల్లాలో భాగమే. ఇక్కడ సకల వెనుకబాటుతనాలతోపాటు గొప్ప దేశీయ సంప్రదాయాలు ఉన్నాయి. నాచన సోమనాథుడు, అల్లసాని పెద్దన, సూరనకవి, ఈశ్వరీదేవిల సాహిత్య వారసత్వముంది. పండిత లోగిళ్ళనుండి ప్రజల ముంగిటికి సాహిత్యాన్ని ప్రవహింపజేసిన తాళ్ళపాక అన్నమయ్య, తేనెపలుకుల పదాల్లో ఆధిపత్య సమాజపు పోకడల్ని నిరసించిన ప్రజాకవి వేమన, బ్రాహ్మణీయ సంస్కృతిని నిలదీసిన వీరబ్రహ్మం ఈ ప్రాంతానికి చెందినవారే. పోతులూరు వీరబ్రహ్మం కాలజ్ఞానం ఈ నేలలోనే ఉంది. తెలుగు సినిమా స్వర్ణయుగంనాటి కళాకారులు బి.యన్.రెడ్డి, బి. నాగిరెడ్డి, శాంతకుమారిలు కపడజిల్లావారే. పుట్టపర్తి నారాయణాచార్యులు మొదలుకొని ఆధునిక సాహిత్యానికి కొత్తవొరవడినందించిన రాచమల్లు రామచంద్రారెడ్డి, ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ పత్రిక సంపాదకుడు ఎ.యస్. రామన్‌వంటి రచయితలు, మేధావులు ఈ ప్రాంత చరిత్రలో భాగమయ్యారు. 1857 నాటి మొదటి భారత స్వాతంత్ర్యపోరాటానికి ముందే వలసపాలనపై తిరుగుబాటు చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఒకప్పటి కడప ప్రాంతంవాడే (ఇప్పుడుదీ కర్నూలుజిల్లాల్లో భాగమైన ఉయ్యాలవాడ అప్పటికడప ప్రాంతంలోనిది). ఈ ప్రాంతం నుండి జాతీయోద్యమంలో తమ సర్వస్వాన్ని త్యాగం చేసినవారున్నారు. ఇవన్నీ 'కడప' అనే మూడక్షరాల పేరుతో ముడిపడివున్నవి. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ప్రాంతానికి సంబంధించిన వేయి సంవత్సరాలు పైబడిన చరిత్ర, సంస్కృతి, పోరాటాల సారం 'కడప' అన్న అక్షరాల్లో వ్యక్తమవుతుంటుంది.

ఇంతటి అస్తిత్వంగల పేరును ఇప్పుడు మార్చవలసిన అవసరం ఏమిటి? కొత్తగా ఏర్పడే ప్రాంతాలకైతే ప్రజల మనోభావాల్లో గూడుకట్టుకున్న మనుషుల పేర్లు పెట్టవచ్చునేమోగాని ఉన్న పేరుమార్చి మనిషి పేరు పెట్టడం ఎంత ఉచితం? రంగారెడ్డి, ప్రకాశం జిల్లాలకు కొత్తగా ఏర్పడినప్పుడు పెట్టినవే ఆయాపేర్లు. నెల్లూరుజిల్లాకు పొట్టిశ్రీరాములు పేరుపెట్టినా, పొట్టి శ్రీరాములుకు, ఆధిపత్యరాజకీయాల్లో ఒక్కొక్క మెట్టూ ఎక్కేక్రమంలో లెక్కలేనన్ని అక్రమాలు చేసిన రాజశేఖరరెడ్డికి పోలికెక్కడ తేగలం? రాజారెడ్డి హయాం నుండి వై.యస్. కుటుంబం రాష్ట్రంలో బలమైన శక్తిగా ఎట్లా ఎదుగుతూ వచ్చిందో జిల్లాలో అందరికీ తెలిసిన చరిత్రే. వై.యస్. రాజారెడ్డి 1964లో వెంకటనర్సయ్య అనే ముగ్గురాళ్ళ వ్యాపారికి భాగస్తునిగా మంగం పేట బైరైటీస్ గనులలోకి ప్రవేశించటం, 1975లో వెంకటనర్సయ్య హత్య తర్వాత ఆ కుటుంబం గనుల్లో కోట్ల డబ్బుకూడబెట్టి 1978లో ఆ డబ్బులు రాజకీయాల్లోకి తెచ్చి జిల్లా రాజకీయాల రూపమే మార్చివేయటం జిల్లావాసుల అనుభవంలోనివే. 1989లో వై.యస్. కుటుంబానికి చెందిన విజయలక్ష్మి

బైరైటీస్ గనుల తవ్వకాల్లో అక్రమాలు జరిగాయని కె.వి. నటరాజన్ కమిషన్ తన విచారణలో నిర్ధారణచేస్తే ఈ విషయాన్ని పరిశీలించడానికి రాష్ట్ర అసెంబ్లీ నియమించిన సభాకమిటీ యాభైలక్షరూపాయల జరిమానా విధించింది (వాళ్ళు ఆ సొమ్ము ఇప్పటికీ చెల్లించలేదన్నది గమవార్హం). ముగ్గురాళ్ళ డబ్బును, కడపజిల్లాలోని ముఠాకక్షల సంస్కృతిని చాలా చాకచక్యంగా వాడుకుని రాజశేఖరరెడ్డిజిల్లాలో జవాబులేని నాయకునిగా ఎదుగుతూ మరోవైపు రాయలసీమలోని ఫ్యాక్షన్ లీడర్లకుమల్లే కాకుండ పెద్దమనిషి ఇమేజ్‌ను పూర్తిగా చెరిగిపోకుండా కాపాడుకోగలిగాడు. పత్రికలు సైతం అతని గురించి చెడు ఎక్కువగా రాయవు. అతనివల్ల జరిగే హింసాకాండ పత్రికలకెక్కినా అతని పేరుమీద ఎక్కదు. అతను స్వయంగా ఎన్నికల్లో రిగ్గింగ్ చేసినా, హత్యలు చేయించినా తన ప్రాబల్యం పెంచుకోడానికి ప్రత్యర్థులను మట్టుబెట్టడానికి రౌడీలను, హంతకులను, బందిపోట్లను, మట్కా ఆడించేవాళ్ళను, దొంగసారా అమ్మేవాళ్ళను చేరదీసి పోషించినా అతనిని ఒక దౌర్జన్యకారునిగాకాక ప్రజానాయకునిగానే పత్రికలు చూపిస్తాయి. అట్లా జిల్లాలో దాదాపు ఏకైక నాయకుడిగా ఎదిగి ఆపైన జిల్లాబయట కూడా తమ మనుషుల్ని తయారుచేసుకున్నాడు. అందుకోసం ఈయన ఒక్క కాంగ్రెస్‌పార్టీలోనే కాదు, తెలుగుదేశంపార్టీలో కూడా తన మనుషుల్ని తయారుచేసుకున్నాడు. తనకు పోటీగా వచ్చే సొంతపార్టీ వాళ్ళను తొక్కేయడానికి ప్రతిపక్ష పార్టీ మెంబర్లను ఎన్నికల్లో గెలిపించాడు. ఎక్కడ అగ్గిరాజుకున్నా తనకు అనుకూలమనిపిస్తే దానిని పెంచి దావానలం చేశాడు. 1991లో ముఖ్యమంత్రి పీఠంకోసం రాజేసిన హైదరాబాద్ [illegible] మంటల్ని పాతబస్తీవాళ్ళు కలలో కూడ మర్చిపోలేరు.

ఇక్కడ ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక సంస్కృతి, అంతకంతకూ అధోగతి పాలుకావటానికి అతి ఎక్కువ దోహదం చేసింది. వై.యస్. కుటుంబం అన్న విషయం జిల్లావాసులందరికి తెలుసు. వై.యస్. రాజశేఖరరెడ్డి మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు మానవహక్కుల ఉద్యమకారుడు బాలగోపాల్ రాసింది అక్షరాలా నిజం. "సమాజాన్ని పీడిస్తున్న రుగ్మతలను నయం చేయడానికి వచ్చిన మంచి డాక్టరుగా మీడియా వై.యస్‌ను ప్రశంసిస్తోంది. నిజానికి ఆయనకు అధికార ప్రాభవం రాష్ట్రంలో మరే రాజకీయవేత్తకంటే కూడా రక్తపాతంతో కూడుకుని ఉంది". అట్లాగే ఆయన ఐదేళ్ళ పాలనలో కూడా లెక్కలేనంత రక్తం పారింది. అధికారంలో లేనప్పుడు నక్సలైట్లది సామాజిక సమస్య అని, శాంతి చర్చలకు హామీ ఇచ్చి, అధికారంలోకొచ్చాక కొద్దికాలానికే చర్చల నాటకానికి తెరదించి ప్రజల ఆకాంక్షలను హేళన చేస్తూ నల్లమలను రక్తపుటేర్లలో ముంచాడు. నిలువ నీడకోసం రోడ్డెక్కినవాళ్ళను ముదిగొండలో, గంగవరంలో కాల్చి చంపాడు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలో ఉన్నప్పుడు మరోమాట అనే అవకాశవాద రాజకీయ సూత్రాన్ని చాలా సమర్థవంతంగా ఆచరించాడు. నల్గొండలో యురేనియం ప్రాజెక్టు ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించి, ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలతో కలిసి ఉద్యమంలో పాల్గొని, ముఖ్యమంత్రి అయ్యాక ప్రాణాంతకమైన అదే ప్రాజెక్టును పులివెందులలో అయితే తనకు ఎదురుండదని తెచ్చిపెట్టాడు. జనార్దనరెడ్డి హయాంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల అక్రమ అనుమతులను నిరసించిన వై.యస్, జనార్దనరెడ్డి కంటే కొన్ని పదులరెట్లు కాలేజీలకు అనుమతులివ్వడమేకాక ఫీజు రీఎంబర్స్‌మెంట్ పేరుతో కార్పొరేట్ కాలేజీల వ్యాపారాన్ని, లాభాలను స్థిరీకరించాడు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్పొరేట్ కంపెనీలకు చిరుచవకగా భూములు కట్టబెట్టిన చంద్రబాబు ప్రభుత్వాన్ని దుయ్యబట్టిన ఈయన, అధికారంలోకొచ్చాక సెజ్‌ల పేరుతో ఏకంగా రాష్ట్రాన్నే ముక్కలు, ముక్కలుగా బడా కంపెనీలకు,రియలెస్టేట్ వ్యాపారులకు పంచిఇచ్చాడు. చంద్రబాబును ప్రపంచబ్యాంకు జీతగాడని

**లేఖ**

విప్లవ రచయితల సంఘం
మానవ హక్కుల వేదిక
ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
కడప జిల్లా.

జిల్లా కలెక్టర్ గారికి
కడప

## విషయం : కడపజిల్లా పేరును వై.యస్. రాజశేఖర రెడ్డి జిల్లాగా మార్చటం పట్ల అభ్యంతరం

కడప జిల్లాను వై.యస్. రాజశేఖరరెడ్డి జిల్లాగా పేరు మార్చాలని ప్రభుత్వం నిర్ణయించడంతో కడపజిల్లా సంస్కృతికీ, చరిత్రకూ అతి పెద్ద ప్రమాదం వచ్చి పడింది. జిల్లా కేంద్రంగా కడప ఏర్పడి 200 సంవత్సరాలైందని గత ఏడాదే ద్విశత వార్షికోత్సవాలు వైభవంగా జరిగాయి. ఒక పరిపాలనా కేంద్రంగా కడపకు 200 ఏండ్ల గుర్తింపు ఉన్నా నిజానికి చరిత్రలో కడప అనే పేరు శతాబ్దాల నుండి ఉనికిలో వుంది. ఇక్కడి స్థలపురాణం ప్రకారం చంద్రవంశపురాజు జనమేజయుడు తిరుపతి వెంకటేశ్వరుని దర్శించుకున్న రాత్రి దేవుడు కలలోకొచ్చి ఆజ్ఞాపించిన మేరకు తిరుమలకు ఉత్తరద్వారాన ఆలయం కట్టించి కడప వెంకటేశ్వర్లు అని నామకరణం చేశారని, అలా ఈ ప్రాంతానికి దేవుని కడప అని పేరు వచ్చిందని చెప్తారు. దీనికి ఉత్తర భాగాన కడప అనే గ్రామం వుండేదని, చోళరాజుల కాలంలో ఆ గ్రామానికి దక్షిణాన చెరువు నిర్మించి బుగ్గవంక నీళ్ళు అందులోకి వచ్చే ఏర్పాటు చేశారని మెకంజీ కైఫీయత్తులు చెప్తాయి. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంవారు ప్రచురించిన మెకంజి కైఫీయత్తులు - కడప జిల్లా నాలుగో భాగంలో కడప శహరు యొక్క పుట్టుపూర్వోత్తరము అనే అధ్యాయంలో ఈ వివరాల్ని పొందుపరిచారు. పురాణాల మాట ఎలా ఉన్నా ఖచ్చితమైన చారిత్రక ఆధారం ప్రకారం శాలివాహన శకం 893, అంటే క్రీ.శ. 971 నాటికే 'కడప' ప్రాదేశిక విభాగంగా ఉనికిలో వుంది. వైదుంబ రాజవంశానికి చెందిన భువన త్రినేత్ర అనే రాజు అత్తిరాలలోని లోకేశ్వరుని ఆలయానికి కడప పన్నెండింటిలోని (అంటే 12 ఊర్లలో) కాటి చెరువును ఇచ్చినట్లు రాగి శాసనం ద్వారా తెలిసింది (ఆ శాసనం ఇప్పుడు చెన్నై మ్యూజియంలో ఉంది). క్రీ.శ. రెండవ శతాబ్దానికి చెందిన గ్రీకు శాస్త్రవేత్త టాలెమి 'కరిగే' లేదా 'కరిసె' అని పిలిచిన ప్రాంతం కడప కావచ్చునని చరిత్రకారులు భావిస్తున్నారు. కడప తెలుగు భాషంత ప్రాచీనమైనది. తెలుగులో ఇప్పటి వరకు లభించిన శాసనాల్లో రేనాటి చోళరాజు ధనుంజయుడు వేయించిన కలమళ శాసనం మొట్టమొదటిది. అంటే తెలుగు భాష తొలిసారి అక్షరాలు దిద్దింది కడపజిల్లాలోనే కావచ్చు. ధనుంజయుడిదే ఇంకొక శాసనం ఎర్రగుడిపాడులో లభించింది. ఈ శాసనాలు కీ.శ. 575 ప్రాంతానికి చెందినవిగా శాస్త్రీయంగా నిర్ధారించబడ్డాయి. కడపజిల్లాల్లో 800 పైగా శిలాశాసనాలున్నాయి. వీటిలో అధిక సంఖ్యలో తెలుగు శాసనాలతోపాటు నూటికి పైగా తమిళ శాసనాలు, దాదాపు నూరు కన్నడ శాసనాలు, కొన్ని సంస్కృత శాసనాలు, రెండు బ్రహ్మిలిపిలో ఉన్న ప్రాకృత శాసనాలు, ఒక మరాఠీ శాసనం ఉన్నాయి. ఇతర ప్రాంతాలలో ఎక్కడా కనిపించని విషయ వైవిధ్యం ఈ ప్రాంతంలోని శాసనాల్లో ఉందని శాసన పరిశోధకులంటారు. ఈ వివరాలన్నీ ఇన్స్‌క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, కడప డిస్ట్రిక్ట్ వాల్యూమ్స్ 1,2,3 (ఏపి. స్టేట్ ఆర్కియాలజి డిపార్ట్‌మెంట్ ప్రచురణ, సంపాదకులు -

---

విమర్శించి, తాను అంతకంటే ఎక్కువ సాగిలపడి ప్రపంచబ్యాంకు విధానాలను కొనసాగించాడు. అభినవ కాటన్‌గా గొప్పలకు పోయిన జలయజ్ఞంలో రైతుల పొలాల్లో పారిన నీళ్ళు గోరంతైతే, కాంట్రాక్టర్ల జేబుల్లోకి పారిన నిధులు కొండంత. ఇడుపులపాయలో, కోడూరులో ఎన్నో ఏళ్ళుగా అనుభవిస్తున్న పేదల భూమిని (ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నా పెడచెవిన పెట్టి) ముఖ్యమంత్రి అయ్యాక ఉన్నట్లుండి జ్ఞానోదయమైనట్లు ఆ భూముల్ని తిరిగి ఇచ్చేస్తూ అభినవ వినోభాబావేగా తన భజనపరులతో కీర్తించుకోగలగడం ఒక్క రాజశేఖరరెడ్డికే సాధ్యం. ఇంతటి అవకాశవాద రాజకీయాలో మునిగి తేలిన వ్యక్తిని ఏ విలువల కోసం జిల్లాకు ప్రతీకగా నిలచోబెడదాం? కడప అంటే బాంబులజిల్లా కాదని, దానికి ఎంతో సాంస్కృతిక చరిత్ర ఉందని అనేక సందర్భాల్లో సినిమాలు, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా గీస్తున్న వక్రచిత్రాన్ని నిరసిస్తూ వస్తున్నాము. ఇకపై కడపజిల్లా వై.యస్.ఆర్. జిల్లాగా సరికొత్త నామం ధరిస్తే వై.యస్.ఆర్. అంటే గుర్తొచ్చే ఫాక్షన్ హత్యలు 1991 హైదరాబాద్ మతకలహాలు, ప్రముఖుల బహిరంగసభల్లో విసిరిన చెప్పులు మన జిల్లాకు ప్రతిరూపం అయిపోతాయి. ఇదే ఇక్కడి సంస్కృతికి, చరిత్రకు దాపురించిన అతిపెద్ద ప్రమాదం.

రాజ్యాలు, రాజులు పోయినా రాజ భక్తికి మించిన బానిసత్వంతో వై.యస్. రాజశేఖరరెడ్డి 30 ఏళ్ళ నేరచరిత్రను ఆయన విషాదమరణం చుట్టూ అల్లుకున్న సానుభూతితో చెరిపేద్దామా? వై.యస్.రాజశేఖరరెడ్డి పులివెందులకు, కడపజిల్లాకు ఎంతో మేలు చేశాడని, రాష్ట్రవ్యాప్తంగా ఏవేవో సంక్షేమపథకాల్ని ప్రవేశపెట్టాడని వాదన తెస్తున్నారు. ప్రజలకు ఏదో చేస్తున్నట్లు భ్రమలు కల్పిస్తూనే కార్పొరేట్ కంపెనీలకు, రియలెస్టేట్ వ్యాపారులకు, ఆయన బంధుమిత్రులకు, వందిమాగధులకు ఎంత దోచిపెట్టాడో ప్రజలకు ఇప్పుడు అర్థం కాకపోవచ్చు. అర్థం చేసుకున్ననాడు ఈ ప్రతిష్ఠంతా ఏమైపోతుంది? అట్లా కాకున్నా వాదనకోసం ఆయన మహాద్భుతంగా జిల్లానూ, రాష్ట్రాన్ని అభివృద్ధి చేశాడని, ఆయన ఏ పాపం ఎరగడని, సాధుజీవిఅని, లోక కళ్యాణం కోసం ఆయన, ఆయన కుటుంబం పాటుపడిందని అంగీకరించినా ఆయనను గౌరవించడానికి జిల్లాకు పేరుపెట్టడం, అదీ ఉన్నపేరు తీసేసి పెట్టడం ఒక మార్గమవుతుందా? అలా గౌరవించదలచుకుంటే ఆయన కృషితో ఏర్పడిన సంస్థలకు, నిర్మాణాలకు ఆయన పేరుపెడితే పెట్టండి. ఇప్పటిదాకా ఉన్న సంప్రదాయం అదేకదా. దేశనాయకులైన ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, ఎన్.టి.రామారావు వంటివారిపట్ల ఎంత గౌరవాభిమానాలున్నా వాడలకు, సంస్థలకు వారిపేర్లు పెట్టారుగాని ఏ జిల్లాకు వారిపేరు పెట్టలేదు. ఇప్పుడు వై.యస్.రాజశేఖరరెడ్డి పేరు జిల్లాకు పెట్టి ఈకొత్త సంప్రదాయానికి తెరలేపితే జిల్లాలు మిగలవు. ప్రాంతాల చారిత్రక, సాంస్కృతిక విశేషాలు అట్టడుగున పడిపోతాయి. అవశేషాలుగానే మిగులుతాయి.

ఒక వ్యక్తి అది ఎంతటివాడైనా సరే, వేల ఏళ్ళ చరిత్రను మించి గొప్పవాడైపోతాడా? జిల్లా పేరుతో ముడిపడివున్న చరిత్ర, సంస్కృతి ఇక్కడి ఎందరో మహనీయుల జీవితాలు అన్నింటినీ కాదని ఒక్క రాజశేఖరరెడ్డి పేరునే ముందుకు తీసుకురావడం ఎంతవరకు సమంజసం? ఏవ్యక్తి అయినా ఫలానా ప్రాంతంవాడని చెప్పుకుంటాడు. తన జీవితాచరణతో ప్రాంతం పేరును ఇనుమడింపజేస్తాడు. కాని ఇప్పుడు ఒక వ్యక్తి పేరుతో మన ప్రాంతానికి ఉన్న పేరును, చరిత్రను, సంస్కృతిని, పిడికెడుమంది నాయకులు కలిసి చెరిపేయాలనుకుంటున్నారు.

వై.యస్.కుటుంబం అంటే భయమో లేక అవకాశవాద ప్రయోజనాలో కొందరి నోళ్ళు కుట్టేసివుండొచ్చు. ఈ గొడవలో లబ్ధిపొందేదేమి ఉండదు. కాబట్టి ఇంకొందరు కలుగజేసుకోకపోవచ్చు. కారణమేదైనా ఈ ధోరణి ప్రజాస్వామ్యాన్ని నిలువునా పాతరవేస్తుంది. కాబట్టి కడపను వై.యస్.రాజశేఖరరెడ్డిజిల్లాగా పేరుమార్చాలని రాష్ట్ర కాబినెట్ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మన రాజకీయ నాయకుల అవకాశవాదాన్ని నిలదీద్దాం.

ప్రజలు, ప్రజాస్వామికవాదులు, రచయిత్రులు, విద్యార్థులు, మేధావులు కలసిరండి. మన కడపను కాపాడుకుందాం.

**విప్లవ రచయితల సంఘం**
మానవ హక్కుల వేదిక
ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, కడపజిల్లా.

పి.వి.పర(బహ్మశా(స్త్రి) ఎపి(గాఫికా ఇండికా వాల్యూమ్ - 27 (ఆర్కియాలజి సర్వే ఆఫ్ ఇండియా ప్రచురణ) పుస్తకాల్లో వున్నాయి. కల్నల్ విల్కిసన్ చెప్పినట్లు ఇక్కడ ప్రతి కొండకు చెప్పటానికి ఒక కథ, ప్రతి నదికి పాడడానికి ఒక పాటా ఉన్నాయి.

కడప జిల్లా ఒకప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని రాయలసీమలో అతిపెద్ద ప్రాంతం. బళ్ళారి సరిహద్దుల నుండి ఇప్పటి అనంతపురం, చిత్తూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో చాలా ప్రాంతాలు ఒకప్పుడు కడపజిల్లాలో భాగమే. ఇదంతా కేవలం భూభాగం విస్తీర్ణమే సూచించదు. వలస పాలనకు పూర్వం స్థానిక సమాజంలోని వైవిధ్యమంతా కడప అనే పేరులోని అస్తిత్వం వెనుక దాగివుంది. ప్రథమాంధ్ర రాజులైన శాతవాహనులు మొదలుకొని కీ.శ.2వ శతాబ్దం నుండి 4వ శతాబ్దం వరకు పల్లవులు, ఇక్ష్వాకులు, చాళుక్యులు, 8వ శతాబ్దం నుండి రేనాటి చోళులు, రాష్ట్ర కూటులు, క్రీ.శ. 13వ శతాబ్దంలో కాకతీయులు, 14-17 శతాబ్దంలో విజయనగరరాజులు ఈ ప్రాంతాన్ని పాలించారు. ఆ తరువాత గోల్కొండ నవాబులు, టిప్పుసుల్తాను, నైజాము నవాబుల పాలనలో కూడా ఉండిన ఈ ప్రాంతం అనేకానేక చారిత్రక దశల్ని తనలో నిక్షిప్తం చేసుకుంది. ఆంధ్రదేశాన్ని దీర్ఘకాలం పాలించి ఆంధ్ర చరిత్రలో కొత్త అధ్యాయాలకు కారకులైన చాళుక్యుల జన్మస్థలం కడపజిల్లా అని పరిశోధకులంటారు. కీ.శ. 3వ శతాబ్దంలో నివసించిన చాళుక్యులు మహారాష్ట్ర ప్రాంతానికి ప్రవాసులై వెళ్ళి కీ.శ. 5వ శతాబ్దం నాటికి రాజ్యం స్థాపించి 7వ శతాబ్దం నాటికి ఆంధ్రదేశాన్ని జయించారు. ఇదంతా చరిత్ర.

ఇక్కడ సకల వెనకబాటుతనాలతోపాటు మహాద్భుతమైన దేశీయ సంప్రదాయాలు ఉన్నాయి. నాచన సోమనాథుడు, అల్లసాని పెద్దన, సూరనకవి, ఈశ్వరీదేవిల సాహిత్య వారసత్వముంది. పండితుల లోగిళ్ళ నుండి ప్రజల ముంగిటికి సాహిత్యాన్ని ప్రవహింప చేసిన తాళ్ళపాక అన్నమయ్య జన్మస్థానం ఈ ప్రాంతం, ఆయన రచించిన వేలకీర్తనల్లో కడప వెంకటేశ్వరుని కీర్తించినవి కొన్ని వందల వరకు వున్నాయి.

"కప్పురమందుకొంటి గడపరాయ నీకు
గప్పము నూజవ్వవము కడపరాయ...."
"కాదనకు నా మాట కడపరాయ నీకు
గాదె బోసే వలపులు కడపరాయ...."

అంటూ అన్నమయ్య గానం చేసిన పాటలను తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రచురించిన కడప చరిత్ర (సంగ్రహము) 1968లో పొందు పరిచారు. తేనెపలుకుల పదాల్లో ఆధిపత్య సమాజపు పోకడల్ని నిరసించిన ప్రజాకవి వేమన, బ్రాహ్మణీయ సంస్కృతిని నిలదీసిన వీరబ్రహ్మం ఈ ప్రాంతానికి చెందినవాళ్లే. పోతులూరి వీరబ్రహ్మం కాలజ్ఞానం ఈ నేలలోనే ఉంది. తెలుగు సినిమా స్వర్ణయుగంనాటి కళాకారులు బి.యన్.రెడ్డి, బి. నాగిరెడ్డి, శాంత కుమారిలు కడపజిల్లావారే. ఆధునిక సాహిత్యానికి కొత్త వొరవడినందించిన రాచమల్లు రామచంద్రా రెడ్డి, ఇల్లస్ ట్రేటెడ్ వీక్లీ పత్రిక సంపాదకుడు ఎ.యస్.రామన్, గణిత బ్రహ్మ సంజీవరాయ శర్మ వంటి మేధావులు ఈ ప్రాంత చరిత్రలో భాగమయ్యారు. కడపజిల్లా ద్విశతాబ్ద సందర్భంలో స్వయంగా వై.ఎస్. రాజశేఖరరెడ్డి చెప్పినట్లు "కడపజిల్లా తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు పెట్టింది పేరుగా నిలుస్తూ అలనాడు పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమయ్య మొదలుకొని, అలతి అలతి సరళ పదజాలంతో సంఘాన్ని మార్చేయగలిగిన వేమన వరకు, మరో వంక దిగ్దంతుడైన ప్రతిభామూర్తి పుట్టపర్తి నారాయణాచార్యుల వంటి కోవిదుల వరకు ఎంతో మంది సంగీతకారులను, సాహితీ వేత్తలను ప్రపంచానికి అందించింది.

ఇంతమాత్రమే కాదు 1857 నాటి మొదటి భారత స్వాతంత్ర్య పోరాటానికి వలసపాలనపై తిరుగుబాటు చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఒకప్పటి కడప జిల్లా ప్రాంతంవాడే (ఇప్పుడు కర్నూలు జిల్లాలో భాగమైన ఉయ్యాలవాడ అప్పటి కడప ప్రాంతంలోనిది). ఈ ప్రాంతం నుండి జాతీయోద్యమంలో తమ సర్వస్వాన్ని త్యాగం చేసినవారున్నారు. 1997 ఆగష్టులో కడపజిల్లా స్వాతంత్ర్య సమర యోధుల సంఘం ప్రచురించిన "త్యాగమూర్తులు - కడప జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంస్మరణ" సంచికలో జాతీయోద్యమంలో పాల్గొన్న ఎద్దుల ఈశ్వర రెడ్డి, కె.కోటిరెడ్డి, బి.రామశాస్త్రి, టేకూరు సుబ్బారావు, షేక్ పీర్‌షా, చందన వెంకోబరావు వంటి సుమారు 200 మందిని గురించిన వివరం వుంది. కడపజిల్లా ద్విశతాబ్ది ఉత్సవాల ప్రత్యేక సంచికలోనూ ఇవి పొందు పరిచారు. ఇవన్నీ 'కడప' అనే మూడక్షరాల పేరుతో ముడిపడి వున్నవి. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ప్రాంతానికి సంబంధించిన వేయి సంవత్సరాలు పైబడిన చరిత్ర, సంస్కృతి, పోరాటాల సారం 'కడప' అన్న అక్షరాల్లో వ్యక్తమవుతుంటుంది.

ఇంతటి అస్తిత్వం గల పేరును ఇప్పుడు మార్చవలసిన అవసరం ఏమిటి? కొత్తగా ఏర్పడే ప్రాంతాలకైతే ప్రజల మనోభావాల్లో గూడు కట్టుకున్న మనుషుల పేర్లు పెట్టవచ్చునేమోగాని ఉన్న పేరు మార్చి మనిషి పేరు పెట్టడం ఎంత ఉచితం? రంగారెడ్డి, ప్రకాశం జిల్లాలకు కొత్తగా ఏర్పడినప్పుడు పెట్టినవే ఆయా పేర్లు, నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు పేరు పెట్టినా, పొట్టి శ్రీరాములుకు, వై.యస్.ఆర్‌కు పోలికేముంది? తెలుగువారికి ఒక రాష్ట్రం కావాలన్న ఆయన ప్రాణత్యాగంలో నెల్లూరు ప్రజల, రాష్ట్ర ప్రజల (తెలంగాణ మినహా) ఆకాంక్ష ఉంది. వై.యస్.ఆర్‌కు అటువంటి అర్హత ఉందా? రాజారెడ్డి హయాం నుండి వైయస్ కుటుంబం రాష్ట్రంలో బలమైన శక్తిగా ఎట్లా ఎదుగుతూ వచ్చిందో జిల్లాలో అందరికీ తెలసిన చరిత్రే. వై.యస్. రాజారెడ్డి 1964లో వెంకట నర్సయ్య అనే ముగ్గురాళ్ళ వ్యాపారికి భాగస్తునిగా మంగంపేట బైరైటీస్ గనులలోకి ప్రవేశించటం, 1975లో రాజశేఖరరెడ్డి వెంకటనర్సయ్యను చంపించి ఆ పైన గనుల్లో కోట్ల డబ్బు కూడ బెట్టి 1978లో ఆ డబ్బులు రాజకీయాల్లోకి తెచ్చి జిల్లా రాజకీయాల రూపమే మార్చివేయటం జిల్లా వాసుల అనుభవంలోనివే. 1989లో మంగంపేట బైరైటీస్ గనుల తవ్వకాల్లో అక్రమాలు జరిగాయని కె.వి. నటరాజన్ కమీషన్ తన విచారణలో తేలిస్తే ఈ విషయాన్ని పరిశీలించటానికి రాష్ట్ర అసెంబ్లీ నియమించిన సబ్‌కమిటి యాభై లక్షల రూపాయల జరిమానా విధించింది. ముగ్గురాళ్ళ డబ్బునూ, కడపజిల్లాలోని ముఠాకక్షల సంస్కృతినీ చాలా చాకచక్యంగా వాడుకుని రాజశేఖరరెడ్డి జిల్లాలో జవాబులేని నాయకునిగా ఎదుగుతూ మరో వైపు రాయలసీమలోని ఫ్యాక్షన్ లీడర్లకుమల్లే కాకుండ పెద్ద మనిషి ఇమేజ్‌ను పూర్తిగా చెరిగిపోకుండా కాపాడుకోగలిగారు. పత్రికలు సైతం అతని గురించి చెడు ఎక్కువగా రాయవు. అతని వల్ల జరిగే హింసాకాండ పత్రికలకెక్కినా అతని పేరుమీద ఎక్కదు, అతను స్వయంగా ఎన్నికల్లో రిగ్గింగ్ చేసినా, హత్యలు చేయించినా తన ప్రాబల్యం పెంచుకోవడానికి ప్రత్యర్థులను మట్టుబెట్టడానికి రౌడీలను, హంతకులను, బందిపోట్లను, మట్కా ఆడించేవాళ్ళను, దొంగసారా అమ్మేవాళ్ళను చేరదీసి పోషించినా అతనిని ఒక దౌర్జన్యకారునిగాకాక ప్రజానాయకునిగానే పత్రికలు చూపిస్తాయి. అట్లా జిల్లాలో దాదాపు ఏకైక నాయకుడిగా ఎదిగి ఆ పైన జిల్లా బయట కూడా తన మనుషుల్ని తయారు చేసుకున్నాడు. అందుకోసం ఈయన ఒక్క కాంగ్రెస్ పార్టీలోనే కాదు. తెలుగు దేశం పార్టీలో కూడ తన మనుషుల్ని తయారు చేసుకున్నాడు. తనకు పోటీగా వచ్చే సొంత పార్టీవాళ్ళను తొక్కేయటానికి ప్రతిపక్షపార్టీ మెంబర్లను ఎన్నికల్లో గెలిపించాడు. ఎక్కడ అగ్గి రాజుకున్నా తనకు అనుకూలమనిపిస్తే దానిని పెంచి దావానలం చేశాడు. 1991 హైదరాబాద్ మతకలహాల మంటల్ని పాతబస్తీవాళ్ళు కలలో కూడా మర్చిపోలేరు. ఈ క్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడైన ఈయన రేపోమాపో రాష్ట్రానికి ముఖ్యమంత్రి కూడా అయ్యేటట్టున్నాడని పదేళ్ళక్రితమే ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం తన నివేదికల్లో హెచ్చరించింది.

ఫ్యాక్షన్ కొట్లాటల్లో ప్రాణాలు, ఆస్తులు పోగొట్టుకున్న కుటుంబాలు ఒక వైపైతే ఈ వాతావరణంలో ప్రజా జీవితంలో ప్రజాస్వామిక వాతావరణం పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఇక్కడ ప్రజాస్వామిక సంస్కృతి, ప్రజాస్వామిక

**నివాళి** ◆ కెక్యూబ్ వర్మ

# ప్రశ్నల జోగారావు మరి లేరు...

శ్రీకాకుళంలోని కథానిలయంకు వచ్చే సాహితీ మిత్రులందరికీ తన ఆత్మీయ ఆతిథ్యంతో సుపరిచితులైన పడాల జోగారావుగారు అక్టోబరు 10 సాయంకాలం ఆత్మహత్య చేసుకొన్నారు. ఆయన మరణానికి ఇదీ అని కారణంగా ఏమీ పంచుకోకుండానే వెళ్ళిపోయారు. ప్రతి వారిని వారి వారి అభిరుచులు, అభినివేశాలు, తను గెర్తెరిగిన నేపథ్యాలతో నిరంతరం ప్రశ్నిస్తూ విషయాలను గ్రహించే జోగారావు గారు తన మరణాన్ని మనకో పెద్ద ప్రశ్నగా మిగిల్చారు. నాకున్న పరిచయం మేరకు ఆయన నిరంతరం నైతిక విలువల పట్ల మధన పడుతుండేవారు. వ్యవస్థలో సూత్రీకరింపబడ్డ నైతిక విలువలను ఈ సందర్భంగా మనం ప్రశ్నించుకోవాలి. కట్టుబాట్లు, నీతిసూత్రాలు మన అవసరాల మేరకు మనం కల్పించుకొన్నవే. కానీ అని ఒక్కో మనిషిని ఒక్కోలా ప్రభావితం చేస్తున్నాయి. దాట వేసే ధోరణితో అంతా తప్పుకుపోతున్నాం. కాని జోగారావుగారి మనస్తత్వం తెలిసున్న వారికి ఆయన మూగ రోదన అర్థమవుతుంది.

అందరితోనూ విరివిగా కలం స్నేహం కొనసాగిస్తూ తన ఆలోచనలను, ఆవేదనలను పంచుకోవడం ఆయనకున్న అలవాటు. ఇది ఆయనకు కొంతమందిని శత్రువులను చేసింది. ఆయనను ఒక సైకిక్ పేషెంటుగా చిత్రించడానికి కూడా వెనుకాడ లేదొక మిత్రుడు ఆ కసితో. నిజానికి తను నమ్మిన విలువలు కనుమరుగై, తను మోసానికి గురయ్యాననే బాధను దిగమింగుకొనలేని నిస్సహాయతతో విషాన్ని మింగడం ఆయన చేతకాని తనమా లేక కళ్ళు మూసి పాలుతాగే పిల్లి లాంటి మన సిగ్గులేనితనమా?

గత ముప్పై ఏళ్ళుగా తను రాసిన సమీక్షలు, విమర్శలు, కవితలు, కథా రచనలతోనే కాకుండా తను అనేకమంది సాహితీ దిగ్గజాలతో నెరపిన ఉత్తర ప్రత్యుత్తరాలు చూస్తే ఆయనకున్న సాహిత్యాభిమానం మనకు తెలుస్తుంది. రంగనాయకమ్మగారితోనూ, చేరా గారితోనూ ఉత్తరాలద్వారా ఆయన చాలా విషయాలు చర్చించేవారు. యిటీవల శ్రీకాకుళ సాహితి వారు ప్రచురించిన జంఝావతి కథా సంకలనంలో రాసినది తన చివరి కథ. సాహిత్య విమర్శ పట్ల ఆయనకు మంచి ఆసక్తి వుండేది. తనతో మాట్లాడినప్పుడు తను వ్యక్తపరిచే అభిప్రాయాలను కాగితంపై పెడితే ఆయనో మంచి విమర్శకుడిగా అందరికీ పరిచయం కాబడేవారు. కానీ రాయండి సార్ అనగానే మౌనం వహించేవారు. ఎప్పుడూ తన గుండెలపై ఏదో మంచు పర్వతం వున్నట్లుగా బాధగా వుండేవారు.

భూషణం మాస్టారిపై తను రాసిన శ్రీకాకుళ భూషణం వ్యాసం ఆంధ్రజ్యోతిలో అచ్చయింది. అది భూషణం మాస్టారి పై వచ్చిన సమగ్ర విశ్లేషణగా చెప్పుకోవచ్చు. ఆయనతో స్వయంగా మాట్లాడి తన ప్రశ్నలతో మాస్టారి హృదయాన్ని ఆవిష్కరించారు.

ఉద్యోగ నిర్వహణలో కూడా తాను నమ్మిన ఆదర్శాలను పాటించి రైతులకు అండగా వుండి రాజకీయనాయకుల కన్నెర్రకు గురయ్యేవారు. తను అప్పుల పాలైనా వృత్తి ధర్మాన్ని వీడలేదు.

చివరిగా తను విరసం సభ్యత్వానికి కొద్ది కాలం దూరంగా వుంటానని రాసిన సుదీర్ఘ లేఖలో విరసం పట్ల తనకున్న అభిమానమే తెలియజేస్తుంది. తను కథానిలయంలో జరిగే చర్చలలో పాల్గొనేటప్పుడు కూడా తాను విరసం సభ్యుడిగానే చెప్పుకునేవారు. కానీ బ్రతుకీడుస్తున్న అనేకమంది కంటే తాను నమ్మిన విలువల కొరకు తనను తాను బలిగావించుకున్న జోగారావుపై మిత్రులం ఎరుపు వస్త్రం కప్పి జోహార్లర్పించాం. ❖

---

విలువలు అంతకంతకూ అధోగతి పాలుకావటానికి అతి ఎక్కువ దోహదం చేసింది వైయస్. కుటుంబం అన్న విషయం జిల్లా వాసులందరికి తెలుసు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం 1996లో ప్రచురించిన 'కడపజిల్లాలో పాలెగాళ్ళ రాజ్యం' 1998లో ప్రచురించిన 'కరువు జిల్లాలో కొత్త పాలెగాళ్ళు - అనంతపురం ఫ్యాక్షన్లపై నివేదిక' పుస్తకంలో ఈ వివరాలన్నీ ఉన్నాయి. వైయస్ రాజశేఖర రెడ్డి మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు మానవ హక్కుల ఉద్యమకారుడు బాలగోపాల్ ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ జూన్ 12 - జూన్ 18 సంచికలో రాసింది అక్షరాలా నిజం. 'సమాజాన్ని పీడిస్తున్న రుగ్మతలను నయం చేయడానికి వచ్చిన మంచి డాక్టరుగా మీడియా వైయస్‌ను ప్రశంశిస్తోంది. నిజానికి ఆయనదీ అధికార ప్రాభవం రాష్ట్రంలో మరే రాజకీయ నేత్తకంటే కూడా రక్తపాతంతో కూడుకుని ఉంది". కడప అంటే బాంబుల జిల్లా కాదని దానికి ఎంతో సాంస్కృతిక చరిత్ర ఉందని అనేక సందర్భాల్లో సినిమాలు, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా గీస్తున్న వక్ర చిత్రాన్ని నిరసిస్తూ వస్తున్నాము. ఇకపై కడప జిల్లా వైయస్.ఆర్. జిల్లాగా సరికొత్త నామం ధరిస్తే వైయస్.ఆర్ అంటే గుర్తొచ్చే ఫ్యాక్షన్ హత్యలు, 1991 హైదరాబాద్ మతకలహాలు, ప్రముఖుల బహిరంగసభల్లో విసిరిన చెప్పులు మా జిల్లాకు ప్రతి రూపం అయిపోతాయి. ఇదే ఇక్కడి సంస్కృతికి, చరిత్రకు దాపురించిన అతి పెద్ద ప్రమాదం.

మరోవైపు వైయస్. రాజశేఖరరెడ్డి పులివెందులకు, కడపజిల్లాకు ఎంతో మేలు చేశాడని, రాష్ట్రవ్యాప్తంగా ఏవేవో సంక్షేమ పథకాల్ని ప్రవేశపెట్టాడని వాదన తెస్తున్నారు. ప్రజలకు ఏదో చేస్తున్నట్టు భ్రమలు కల్పిస్తూనే కార్పోరేట్ కంపెనీలకు,రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, ఆయన వంది మాగధులకు ఎంత దోచి పెట్టాడో ప్రజలకు ఇప్పుడు అర్థం కాకపోవచ్చు. అర్థం చేసుకున్నవాడు ఈ ప్రతిష్టంతా ఏమైపోతుంది? అట్లా కాకున్నా వాదనకోసం ఆయన మహాద్భుతంగా జిల్లాను, రాష్ట్రాన్ని అభివృద్ధి చేశాడని, ఆయన ఏ పాపం ఎరగడని, సాధుజీవి అని, లోకకళ్యాణం కోసమే ఆయన, ఆయన కుటుంబం పాటుపడిందని అంగీకరించినా ఆయనను గౌరవించడానికి జిల్లాకు పేరు పెట్టడం, అదీ ఉన్న పేరు తీసేసి పెట్టడం ఒక మార్గమవుతుందా? అలా గౌరవించదలుచుకుంటే మరి లక్షలాది మంది కడపజిల్లా ప్రజల మనోభావాల సంగతి ఏమిటి? జిల్లా పేరుతో ముడిపడివున్న చరిత్ర, సంస్కృతి, ఇక్కడి ఎందరో మహనీయుల జీవితాలు అన్నింటినీ కాదని ఒక్క రాజశేఖరరెడ్డి పేరును (అతడు ఎంత గొప్పవాడనుకున్నా) ముందుకు తీసుకురావడం ఎంత వరకు సమంజసం? ఒక వ్యక్తి అది ఎంతటి వాడైనా సరే, వేల ఏళ్ళ చరిత్రను మించి గొప్పవాడైపోతాడా? వైయస్. రాజశేఖరరెడ్డి విషాద మరణానికి నివాళి ఇలానే ఘటించాల్నా? కడప పేరు మార్చితే ఆయన ఆత్మ శాంతిస్తుందా? బ్రిటీష్ వాళ్ళు మన ప్రాంతాల పేర్లను వాళ్ళ ఉచ్చారణ కోసం మార్చి అపభ్రంశం చేస్తే ప్రజలు దీర్ఘకాలం పోరాడి 'బాంబే'ని 'ముంబై'గా 'మెడ్రాస్'ను చెన్నైగా 'కల్‌కటా'ని 'కోల్‌కతా'గా మళ్ళీ మార్చుకోగలిగారు. కడప ఇంగ్లీష్ స్పెల్లింగును కూడా ఇటీవల రాజశేఖరరెడ్డి హయాంలోనే KADAPA గా మార్చుకుని సరిదిద్దుకున్నాము.

దేశనాయకులైన ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, ఎన్.టి.రామారావు పట్ల ఎంత గౌరవాభిమానాలున్నా ఏ జిల్లాలకు వారి పేరు పెట్టలేదు. ఇప్పుడు వైయస్. రాజశేఖరరెడ్డి పేరు జిల్లాకు పెట్టి ఈ కొత్త సంప్రదాయానికి తెరలేపితే జిల్లాలు మిగలవు. ప్రాంతాల చారిత్రక, సాంస్కృతిక విశేషాలు అట్టడుగున పడిపోతాయి. అవశేషాలుగానే మిగులుతాయి. ఇట్లా చేస్తే ఇప్పటికి వైయస్. కుటుంబం పట్ల ఉన్న భయభక్తులతో మేధావులు, రాజకీయ పార్టీలు, సంస్థలు మిన్నుకుండి పోతే పోవచ్చుగాని చరిత్ర మనల్ని క్షమించదు.

ఈ పత్రానికి జతపరిచినవి :

కడప జిల్లాలో పాలెగాళ్ళ రాజ్యం - ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ప్రచురణ - 1996)

కరువు జిల్లాలో పాలెగాళ్ళు - అనంతపురం ఫ్యాక్షన్లపై నివేదిక - ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ప్రచురణ - 1998) ❖

## కోర్ట్ స్టేట్‌మెంట్

### గౌరవనీయులైన న్యాయమూర్తి గారికి,

ఈ కేసు గురించి న్యాయస్థానం దృష్టికి కొన్ని విషయాలు తేవాలనుకుంటున్నాం. వీటిని రెండు భాగాలుగా వివరిస్తాం. ఒకటి : మాపై పోలీసులు మోపిన ఈ కేసులోని వాస్తవాలు. రెండు : ఇలాంటి విషయాలపై మా అభిప్రాయాలు. ఎ3 (పిన్నిక శ్రీనివాస్), ఎ4 (జి.పినాకపాణి అలియాస్ ధరణి, దివాకర్) అయిన మేము విరసం సభ్యులం, విప్లవ రచయితలం. అందువల్ల కూడా ఈ కేసు గురించి, ఈ కేసు ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధకచట్టం కావడం వల్ల దానికి సంబంధించిన సామాజిక విషయాల గురించి ఈ సందర్భంలో చెప్పాలనుకుంటున్నాం. కొంచెం సుదీర్ఘంగా ఉన్నా ఓపికతో పరిశీలించాలని మనవి.

పోలీసులు మాపై ఆరోపించిన ఈ కేసు అబద్ధం అని మొదటగా చెప్పదలుచుకున్నాం. ఆరేళ్ల కిందట ఎ1, ఎ2లతో కలిసి మేం చెరువుగూడెం వెళ్లి ఉడుముల ఎర్రక్క అనే చెంచు మహిళను నానా దుర్భాషలాడామని, తెగపేరుతో అవమానించామని, చంపుతామని ఆయుధాలతో బెదిరించామని, పోలీసులు తన భర్తను చెట్టుకు కట్టేసి, తనను సామూహికంగా అత్యాచారం చేశారని పోలీసులపై కేసుపెట్టమని బెదిరించామని మాపై ఆరోపణ. బాధితురాలు ఎర్రక్క చెంచు యువతి కావడం వల్ల ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని మోపారు. ఆయుధాల కేసును పెట్టారు.

ఇది పూర్తిగా కట్టుకథ. ప్రజల జీవితాల్లోని వాస్తవికత ఆధారంగా కథలు, నవలలు, కవిత్వం రాసే రచయితలుగా మేం అసలు కథ ఏమిటో మీ దృష్టికి తేవాలి. యిది మా పైన మోపిన కేసు అబద్ధం అని చెప్పడానికే కాదు. ఉడుముల ఎర్రక్క జీవితంలో ఏం జరిగిందో, నేరస్తులు ఎవరో చెప్పడం మా అసలు బాధ్యత. నిజానికి విప్లవ రచయితలుగా అలాంటి పని చేసినందుకే ఇన్నేళ్లుగా ఈ కేసును భరించాల్సి వచ్చింది. జెయిళ్లలో ఉండాల్సి వచ్చింది. కోర్టు చుట్టూ తిరుగుతూ మా కాలాన్ని , డబ్బును వెచ్చించాల్సి వచ్చింది. మేమూ, మా మిత్రులు అనవసరమైన ఆందోళన, వొత్తిడి అనుభవించాల్సి వచ్చింది.

యింతకూ అసలు కథ యిది. అయిదేళ్ల కిందట విప్లవోద్యమాన్ని అణచివేయడంలో భాగంగా గ్రేహౌండ్స్ పోలీసులు నల్లమల కూంబింగ్‌కు వెళ్లి ఎర్రక్క మీద అత్యాచారం చేశారని తెలుగు దినపత్రికల్లో ప్రముఖంగా ఒక వార్త వచ్చింది. చెంచుల మధ్యనే జీవిస్తున్న నక్సలైట్లు కూడా ఈ దురాగతాన్ని బైటి ప్రపంచానికి తీసుకొనివచ్చారు. ఈ ఘటనలో నిజానిజాలు తెలుసుకోవడం కోసం మా సోదర ప్రజాసంఘాల సభ్యులతోపాటు, మేమూ చెరువుగూడెం వెళ్లి వాస్తవాలు సేకరించాం. ఒంగోలులో పత్రికా సమావేశం నిర్వహించి వాస్తవాలు బైటపెట్టాం. నక్సలైట్ల ఏరివేత అనే రాజ్యాంగ విరుద్ధమైన చర్య కేవలం విప్లవోద్యమ్నా దెబ్బతీసే బూటకపు ఎన్‌కౌంటర్లతోనే ముగిసిపోవడం లేదని, అమాయకమైన ఆదివాసీ జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నదని, నోరులేని ఆదివాసీ మహిళలపై అత్యాచారాలకు గ్రేహౌండ్స్ మూకలు పాల్పడుతున్నాయనీ వివరించాం.

పోలీసులకిది కంటగింపయింది. అప్పటికే ప్రకాశం జిల్లాలో పోలీసులు కొనసాగిస్తున్న విచ్చలవిడి బూటకపు ఎన్‌కౌంటర్ల గురించి మేం చాలాసార్లు నిరసన తెలిపినందువల్ల పోలీసు వ్యవస్థ ప్రజాసంఘాలపై కోపం పెంచుకున్నది. ముఖ్యంగా చారుసిన్హా జిల్లా ఎస్పీగా ఉన్న రోజుల్లో ప్రకాశం జిల్లా నల్లమల అటవీ ప్రాంతంలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లలో మహిళలు చాలా మంది చనిపోయారు. ఒక మహిళ ఎస్పీగా ఉంటూ గ్రామీణ దళిత, వెనుకబడిన కులాల మహిళలను చంపేయడం, చెంచుమహిళపై అత్యాచారం చేయడం ఏమిటని ఖండించినందువల్ల మాపై ఈ తప్పుడు కేసు ఆరోపించారు. ఎస్సీ ఎస్టీ కేసు కావడం వల్ల బాధితురాలే కేసు పెట్టాలి కాబట్టి, మాపై కేసు పెట్టమని ఆమెను వొత్తిడి చేసినట్టు కూడా తెలిసింది. ఇలాంటి ఘటన జరిగే అవకాశం ఉన్నదా? అనే సందేహపడనవసరం లేకుండా ఆ తర్వాత వాకపల్లి మహిళలపై గ్రేహౌండ్స్ అత్యాచారం లోకానికి పోలీసువ్యవస్థ గురించి కళ్లు తెరిపించింది. ఇటీవల ఒరిస్సాలో కూడా నక్సలైట్ల ఏరివేతకు వెళ్ళిన పోలీసులు ఆదివాసీ స్త్రీలపై అత్యాచారం చేసినట్లు వార్తలు వచ్చాయి. నల్లమల అయినా విశాఖ ఏజెన్సీ అయినా, ఒరిస్సా అడవులయినా విప్లవోద్యమం ఎక్కడ ఏ నోరులేని ప్రజల్లో పని చేస్తున్నదో అక్కడల్లా ఆదివాసీ స్త్రీలపై పోలీసుల అత్యాచారాలు జరుగుతున్నాయి. కాకపోతే ఈ ఘటనలో పోలీసుల దురాగతాన్ని బైటపెట్టిన వాళ్ల మీద ప్రతీకారంగా నేరస్తులే ఎదురు కేసు పెట్టారు. తాము చేసిన నేరాన్ని దాచి పెట్టుకోడానికి పోలీసులు అనుసరించిన పద్ధతి చాలా విచిత్రమైనది. తరచి చూస్తే చాలా లోతైనది. పోలీసులు అత్యాచారానికి పాల్పడ్డట్టు కేసుపెట్టమని బాధితులతో మేం అనుచితంగా వ్యవహరించి నేరానికి పాల్పడ్డామని మా మీద పెట్టించిన ఎదురు కేసు ఇది.

గ్రేహౌండ్స్ వ్యవస్థ రాజ్యాంగ విరుద్ధమైనదని, నక్సలైట్ల ఏరివేత జీవించే హక్కును కాలరాచే అణచివేత ప్రక్రియ అని మేం మొదటి నుండి చెప్తున్నాం. ఈ మాట మేమంటే పోలీసులు మాపై నక్సలైట్ మద్దతుదారులనే ఆరోపణ చేయడం కూడా పరిపాటయింది. విప్లవ రచయితలుగా సిద్ధాంత రీత్యా నక్సలైట్ల సమర్ధకులమని మేమే చాటి చెప్పుకుంటాం. యిందులో దాపరికం లేదు. రాజ్యాంగంలోని భావప్రకటనా స్వేచ్ఛకు లోబడిన విషయమే ఇది. కానీ ప్రభుత్వం, పోలీసులు చేసే రాజ్యాంగ వ్యతిరేక , మానవ వ్యతిరేక చర్యలను ఖండించినప్పుడల్లా మాపై ఈ ఆరోపణ చేసి కేసులు పెడుతున్నారు. తద్వారా మా విశ్వాసాలను, వాదనలను ఓడించాలని చూస్తున్నారు. వేము విప్లవోద్యమాన్ని సమర్థిస్తాం కాబట్టి తమ చర్యలను ఖండించే అర్హతలేదని పోలీసులు విఫల ప్రచారం చేస్తుంటారు. ఈ కేసు దానికి ఉదాహరణ. కాకపోతే ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని మాపై ప్రయోగించడంలో ఆ విఫలయత్నానికి కొత్త అర్థాలున్నాయి. పోలీసులు విప్లవ రచయితలపై భారత శిక్షాస్మృతిలోని కేసులెన్నిటినో పెట్టారు. అవేవీ రుజువుకాలేదు. ఈ కేసులో ఎ3, ఎ4లమైన మామీదనే గతంలో అనేక కేసులు పెట్టారు. కానీ ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక కేసు ఎన్నడూ పెట్టలేదు. నలభై ఏళ్ల విప్లవ రచయితల సంఘం ఇప్పుడు ఈ కేసు మోయడం చాలా విచిత్రమైన అనుభవం. అత్యంత విషాదకరమైన అనుభవం. ఇది కేవలం చట్టపరిధిలో సాక్ష్యాధారాలకు, విచారణకు సంబంధించిందేకాదు. ఈ కేసు మాపై మోపడం కేవలం పోలీసుల ఆకతాయి స్వభావాన్నీ, దుందుడుకు స్వభావాన్నీ మాత్రమే సూచించడం లేదు. మాపై కక్ష తీర్చుకోవడమే ఉద్దేశ్యమైతే గతంలో వలే మరేదో కేసు పెట్టవచ్చు. మా సామాజిక దృక్పథ ఆవరణలోనే పోలీసులు మాపై తలపడదలిచారనే అంతరార్థం యిందులో ఉన్నది. దృక్పథపరంగా మమ్మల్ని అన్ పాపులర్ చేసే ఉద్దేశ్యం ఉన్నది. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ఏ సామాజిక కారణాలవల్ల, అవసరాల వల్ల రూపొందిందో ఈ ప్రత్యేక న్యాయస్థానానికి తెలిసిందే. తరతరాలుగా అంటరానితనానికి వివక్షకు గురైన దళితుల, ఆదివాసుల ఆత్మగౌరవ పరిరక్షణ కోసం వచ్చిన ఈ చట్టానికిశిక్షా స్మృతిలో ఉన్న ప్రత్యేకత ఏమిటో, నిరంతరం ఈ చట్టం ప్రతిధ్వనించే

సామాజిక వ్యాఖ్యానం ఏమిటో న్యాయస్థానానికి చెప్పనవసరం లేదు. ఈ నిండైన సామాజిక అర్థానికి వ్యతిరేకులుగా మమ్మల్ని పోలీసులు నిలబెట్టదల్చుకున్నారు.

ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక చట్టమేగాదు, ప్రజానుకూల చట్టాలేవీ యాదృశ్చికంగా రాలేదు. ప్రభుత్వం దయామయి కాబట్టి వీటిని రూపొందించలేదు. నిర్దిష్టంగా ఈ చట్టం గురించే చెప్పలంటే 'స్వతంత్ర్య' భారతదేశంలో అంటరానితనం అమానుషమనీ, నేరమనీ రాజ్యాంగం ప్రవచించడానికీ, ఇటీవల ఈ చట్టం1998లో తయారు కావడానికి వెనుక సుదీర్ఘ సామాజిక ఉద్యమాల చరిత్ర ఉన్నది. కనీసం ఆధునిక యుగం ప్రారంభమైనప్పటి నుండీ దళితులు, వెనుకబడిన కులాలులు, ఆదివాసులు చేసిన అవిశ్రాంత పోరాటాల ప్రత్యక్ష పరోక్ష వొత్తిడి ఉన్నది. దళిత బహుజన సమాజంలో ఆధునికతా ప్రవర్తకుడు జ్యోతిరావు పూలే లాంటి మహనీయుల మొదలు అనేక మంది కృషి చరిత్ర ద్వారా ఈ చట్టం వెనుక పని చేసింది. నేటికీ అంటరానితనం బతికి ఉన్న ఈ సమాజంలో ఉద్యమాల వల్లనే కులవ్యవస్థ అమానుషం అనే సామాజిక విలువ కూడా నిలదొక్కుకొని ఉన్నది. అదొక సామాజిక విలువగా రూపొందిన తర్వాతే పాలకులు విధిలేక దానికి ఒక చట్టరూపాన్నిచ్చారు.

ఈ చట్టానికి ప్రేరణ అయిన సామాజిక ఉద్యమాలపట్ల విప్లవ రచయితలకు అపారమైన గౌరవం ఉన్నది. ఆ ఉద్యమాల దృక్పథాన్ని వర్గపోరాట దృక్పథంతో ముందు తీసుకెళ్ళాలనే ఆశయాన్ని ప్రకటించుకున్నారు. ఆచరిస్తున్నారు. దాన్నే సాహిత్యంగా రచిస్తున్నారు. విప్లవ రచయితల సంఘమే మన నల్లమల చెంచుల వంటి ఆదివాసుల నక్సల్బరీలో, శ్రీకాకుళంలో చేసిన పోరాటాల నుండి పుట్టింది. మాల మాదిగల పోరాటాలనే గుర్తింపు పొందిన మార్క్సిస్టు లెనినిస్టు ఉద్యమాల ప్రేరణతో కొనసాగుతున్నది. అంటే ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని రాజ్యం తయారు చేయడానికి వెనుక ఏ ఆదివాసుల, దళితుల పోరాటాలు పని చేశామో వాటిని ఆ సామాజిక శ్రేణులు యిప్పుడు అంతకంటే అత్యున్నత రూపంలో కొనసాగిస్తున్నారు. సాంఘిక విముక్తితోపాటు వర్గ విముక్తిని కాంక్షించే దృక్పథంతో ఉద్యమిస్తున్నారు. అనేక సంఘాల్లో , విప్లవ పార్టీల్లో భాగమై పురోగమిస్తున్నారు.

విప్లవ రచయితలుగా మేం ఆ దృక్పథాన్ని స్వీకరించిన వాళ్లం. ఆ వెలుగుల్లో సాహిత్యం రాస్తున్న వాళ్లం. సామాజిక రాజకీయ విశ్లేషణ చేస్తున్నవాళ్లం. ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధకచట్టాన్ని ప్రయోగించడంలో పోలీసులు మాపై ఎలాంటి విజయం సాధించాలనుకున్నారో న్యాయస్థానానికి ఇప్పుడు అర్థమై ఉండాలి. నాన్‌బెయిలబుల్ కేసు కింద మమ్మల్ని జెయిళ్లలో బంధించాలనీ, ఏళ్ళతరబడి కోర్టుల చుట్టూ తిప్పాలనే ఉద్దేశ్యం మాత్రమే పోలీసులకు లేదని, దృక్పథపరంగా మాతో తలపడి మా ప్రతిష్ట దిగజార్చాలనుకున్నారని అర్థమవుతుంది. ఈ పని ఇతరేతరరూపాల్లో కాకుండా చట్టం ఆధారంగానే చేయడం ఆధునిక రాజ్య స్వభావానికి ఒక నిదర్శనం.

సుదీర్ఘంగా సాగిన ఈ కేసు విచారణలో ఏ సాక్షాధారాలు లేవు కాబట్టి ఇదొక తప్పుడు కేసుగా నిర్ధారణ కావచ్చు. న్యాయ పరిభాష అంతటితో ముగిసిపోతుంది. కానీ దాన్ని సామాజిక పరిభాషలోకి తర్జుమా చేసి కొనసాగించవలసి ఉన్నది. ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం దుర్వినియోగం గురించి సమాజంలో చాలా మంది మాట్లాడుతుంటారు. ఇదీ అట్లాంటి దుర్వినియోగం కాదు. ఈ కేసులో ముద్దాయిలుగా ఉన్న మా అభిప్రాయం ఏమంటే - ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అసలు వినియోగమవుతున్నది ఎంత? నిత్యం పల్లెల్లో పదుల, వందల మంది దళితులు కులం పేరుతో అవమానాలపాలవుతుంటే ఎన్ని న్యాయస్థానం దాకా వస్తున్నాయి? వినియోగమేగాని చట్టం దుర్వినియోగమవుతున్నదని ఆడిపోసుకోవడం ఎంతవరకు సబబు? మా విషయంలోనైతే ఈ కేసు దుర్వినియోగమైందన డానికి కూడా లేదని, సరికొత్త అంతరార్థాలతో పోలీసులు దీన్ని ఈ సందర్భంలో వినియోగించారని మేం చెప్పదలిచాం. నేరపరిశోధనా ప్రక్రియలో ఏ ఒక్క సాక్ష్యమూ దొరకని ఈ నేరారోపణ వెనుక పోలీసులకు స్పష్టమైన ఉద్దేశ్యం ఉన్నది. అట్లా ఈ కేసు వినియోగమైన తీరు మాకు చాలా నొప్పి కలిగించింది. అయితే రాజ్యం తన దగ్గరున్న పనిముట్లను భావజాల అర్థంలో ఎంతగా వినియోగించుకుంటుందో మరోసారి అర్థమయిరిది. దళితుల, ఆదివాసుల సాంఘిక, వర్గవిముక్తి దృక్పథమే కంటి చూపుగా స్వీకరించిన మాపై ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని ప్రయోగింప చేయడం వెనుక ప్రభుత్వానికి ఈ స్పృహ ఉన్నది. దీని ద్వారా ప్రభుత్వానికి భావజాలం పాత్ర బాగా తెలుసని అర్థమవుతున్నది. అందు వల్ల ఈ విషయాలపై మా అభిప్రాయాలను కూడా తప్పక కోర్టు దృష్టికి తేవాలనుకుంటున్నాం.

2. ఇందులో ఆదివాసుల గురించి, ముఖ్యంగా మన నల్లమలలోని చెంచుల గురించి వివరిస్తాం. శ్రీకాకుళ పోరాటానికి పూర్వం సమాజంలో , ప్రభుత్వ యంత్రాంగంలో ఆదివాసుల గురించి పట్టింపే ఉండేదికాదు. నక్సలైట్ ఉద్యమం వల్లనే ప్రభుత్వం ఐటీడీఏను ఏర్పాటు చేసింది. ఆదివాసుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంమేగాక ఈ దేశ విప్లవంలో ఆదివాసుల పాత్రను విప్లవోద్యమం గుర్తించితే దీనికి పోటీగా పాలకులు ఐటీడీఏ అభివృద్ధి వ్యూహంతో బయల్దేరారు. ఐటీడీఏ రాష్ట్రంలో ఏఏ ఆదివాసీ ప్రాంతాల్లో ఎలా అమలైందో తెలియదుగాని నల్లమల చెంచుల సంక్షేమాన్ని మొట్టమొదట ఉద్యమస్థాయిలో చేపట్టింది నక్సలైట్లే. చెంచుల సమస్యలను వాళ్లు లోకానికి చాటి చెప్పారు. అంతదాకా చెంచుల గురించి నిర్లక్ష్యంగా , బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న ఐటీడీఏ అధికారుల్లో కదలిక తెచ్చింది విప్లవకారులే. అయినా బ్యూరాక్రసీ సహజాతమైన అవినీతి నోరులేని చెంచుల సంక్షేమ నిధులను కాజేయడానికి వెనుకాడలేదు.

1988 ప్రాంతం నుంచి పాలమూరులో ఆ తర్వాత ప్రకాశం , కర్నూలు జిల్లాల్లో నక్సలైట్లు చెంచుల సంక్షేమ కార్యక్రమాలను ఎక్కడి నుంచి ప్రారంభించారో చెప్తే మీరు ఆశ్చర్యపోతారు. పోషక విలువలు వృథా కాకుండా వండుకోవాలని, జబ్బుచేస్తే మందులు వాడాలని, సారాయి తాగొద్దనే అతి చిన్న విషయాల దగ్గర ప్రారంభించారు. ప్రచారం చేశారు. ఇవి చెంచు సమాజంలోని మౌలిక సమస్యలనే వాళ్ల అవగాహన చాలా కీలకమైనది. ప్రచారమంటే మన ప్రభుత్వ కార్యక్రమాల్లా కాదు. చెప్పి వప్పించడానికి, కొత్త అలవాట్లు నేర్పించడానికి ఏళ్ల తరబడి కష్టించాల్సి వచ్చింది. పశుపోషణ, వ్యవసాయం నేర్పించడానికి విప్లవకారులు చేసిన ప్రయత్నాలు చాలా విలువైనవి. ఒక్కమాటలో చెప్పాలంటే ఆధునిక సోషలిస్టు వ్యవస్థ స్థాపించాలనే విప్లవ కారులు ఆదిమ దశలో మిగిలిపోయిన చెంచు సమాజంలో చేపట్టిన అపురూపమైన సామాజిక ప్రయోగమది. చెంచులను ఆధునికతలో భాగం చేసే సామాజిక ప్రయోగమది. సరిగ్గా ఐటీడీఏ ఆశయం కూడా అదే. కాకపోతే వీరిద్దరి ఆధునికత ఒక్కటికాదు. ఆదివాసుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను విప్లవకారులు వ్యతిరేకించినప్పుడల్లా ఒక విమర్శవినిపిస్తుంది. చెంచోళ్లు ఎప్పటికీ ఆడవిలో అట్లాగే ఉండిపోవాలా? నక్సలైట్లు చెంచుల అభివృద్ధిని అడ్డుకుంటున్నారనేవిమర్శ అది. ఈ మాట ప్రభుత్వమే గాక చాలామంది అంటుంటారు. చెంచుల అభివృద్ధి ప్రయోగంలోనే మావోయిస్టులకు, ప్రభుత్వానికి మౌలిక తేడా ఉన్నది. ఐటీడీఏ అభివృద్ధి మహా అయితే చెంచులను కూడా మార్కెట్‌లో భాగం చేయగలదేమో.. వస్తు

వినియోగదారులుగా, వస్తు ప్రేమికులుగా చేయగలదేమోగాని సామాజిక అభివృద్ధి అనేదాన్ని తీసుకరాలేదు. ఇదీ ఒక ఆధునిక మార్గమే. మావోయిస్టుల ఆధునికత ఇదైతే కాదు. అందుకే వాళ్లు చెంచుల జీవన మూలాల పట్ల చాలా శ్రద్ధ కనబరిచేవారు. వాళ్లని చారిత్రకంగా, సామాజికంగా కట్టి పడేసిన బంధనాలేమో తెలుసుకొని అక్కడి నుండి ఆధునిక క్రమంలో భాగం చేయాలి. అది ఇప్పటికే మన ముందున్న ఆధునిక నమూనా కానవసరం లేదు. అదేమిటో మావోయిస్టులకు సొంతం తెలుసనుకోలేంగాని దానికి సంబంధించిన దృష్టి ఉన్నదని మాత్రమే చెప్పగలం.

సారాయి తాగొద్దని చెప్పడమేగాక వాళ్లని వ్యవసాయంలోకి తేవడానికి మొట్టమొదట ప్రయత్నించిన విప్లవకారులకు సారాయి చెంచుల ఆహారపు అలవాటనే ఎరుక ఉన్నది. అందు వల్లే నచ్చచెప్పడమేగాక ఒకదశలో పర్యావరణ సమస్యల వల్ల అడవిలో విప్పపూత దొరకనప్పుడు, బైటి సారాయి తెచ్చుకోవడం అలవాటయినప్పుడు బైటి కల్తీసారా తాగితే చచ్చిపోతారని ఎప్పటికప్పుడు సొంతంగా కాచుకున్నదే తాగమని చెప్పాల్సి వచ్చింది. మన ఎక్సైజ్ అధికారుల్లాగా దాడులు చేసి సారా బట్టీలు పగలకొట్టి ఇకిలిస్తూ పత్రికలకు ఫోజులిచ్చి నిలబడలేదు.

ఆదిమ దశలో మిగిలిపోయిన ఒక తెగతో ఎలా వ్యవహరించాలో గుర్తెరిగి విప్లవకారులు ఈ సంస్కరణ చేపట్టారు. ఒక్కమాటలో చెప్పాలంటే చెంచులను కన్నబిడ్డల్లాగా చూసుకున్నారు. చెంచులు తమ దళాల్లోకి వస్తారా లేదా అనే దానితో నిమిత్తం లేకుండా సేవా కార్యక్రమంగా కొనసాగించారు. అయితే బైటి నుండి సమయానుకూలంగా సేవాకార్యక్రమాలు నిర్వహించే వాళ్లకూ విప్లవకారులకూ తేడా ఏమంటే తామొక సామాజిక ప్రయోగం చేస్తున్నామని వాళ్లకు తెలిసి ఉండటం. అందుకే 1995లో ప్రకాశం, కర్నూలు జిల్లాల విప్లవోద్యమం ఒక ఉమ్మడి నిర్మాణం కిందికి వచ్చిన సందర్భంలోనే చెంచుల్లో పని చేయడానికి ప్రత్యేక చెంచు దళాలను ఏర్పాటు చేసి సామాజికంగానే వాళ్లను ముందుకు తేవడానికి సంబంధించిన ప్రణాళిక తయారు చేసుకున్నారు. ఐటీడీఏ కార్యక్రమాలతో విప్లవకారులకు ఈ ప్రణాళిక విషయంలోనే పేచీ ఉండేది. అధికారుల కార్యక్రమాలు సక్రమంగా అమలు కావాలని ఒత్తిడి చేస్తూనే , వాళ్ల అవినీతిని ఎండగడుతూనే విమర్శించేవారు. చెంచులను ఉద్యమంలోకి తీసుకొచ్చారు. ప్రముఖ ఆధునికానంతర తత్వవేత్త , సున్నిత భావుకుడు , రచయిత అయిన వాడ్రేవు చినవీరభద్రుడు ఐటీడీఏ అధికారిగా ఉన్న రోజుల్లో చెంచులకు జరిగిన అన్యాయాల గురించి , అవినీతి గురించి మూడు జిల్లాల చెంచులు వందల మంది శ్రీశైలం కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఇలాంటి ఎన్నో ఆందోళనల ఫలితమే ఐటీడీఏ కొంచెం పని చేయడం మొదలైంది.

ఇదంతా న్యాయస్థానానికి చెప్పడం కేవలం పనిలో పనిగా విప్లవకారులు ప్రచారం చేసి పెట్టినట్లనిపిస్తోందేమోగాని ప్రస్తుత కేసుకు ఈ మొత్తంతో సంబంధం ఉన్నది. గత ఆరేడేళ్లలలో నక్సలైట్ల ఏరివేత పేరుతో ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక హంతక ముఠా అయిన గ్రేహౌండ్స్ చర్యల్లో నల్లమలలో వందల ఎన్‌కౌంటర్లు జరగడం, కుడుముల ఎర్రక్క జీవితం బలైపోవడం మాత్రమేగాదు, పైన చెప్పిన ఒక మంచి సామాజిక ప్రయోగం నెత్తుటి మడుగులో అర్థాంతరంగా ఆగిపోయింది. ఎర్రక్కకు జరిగిన అన్యాయాన్ని కేవలం మదమెక్కిన మగ మృగాలు చేసిన దుశ్చర్యగా చూస్తే ఆదివాసీ మహిళ జీవితంలోని గాయాన్ని పూర్తిగా అర్థం చేసుకోనట్టే. ఆ గాయమైన సందర్భాన్ని విస్మరించినట్లే. ఆ సందర్భం ఎంత రక్తం చిలికిన కాలమైనప్పటికీ నల్లమలలో మావోయిస్టుల ఆచరణను బైటి సమాజం , ముఖ్యంగా చెంచుల గురించి ఆసక్తిఉన్న వాళ్లం శ్రద్ధగా గమనించేవాళ్లం. ఎందుకంటే నక్సలైట్ల సుదీర్ఘ ఆదివాసీ ఉద్యమ అనుభవంలో చెంచుల మధ్య పని చేయడం చాలా వైవిధ్యమైనది. బహుశా చెంచుల వంటి తెగ మధ్య వాళ్లింతవరకు మరెక్కడా పని చేసి ఉండరు. వాళ్ల రాజకీయ దార్శనికతకు, అభివృద్ధి విధానానికి, ముఖ్యంగా ఆధునికత పట్లవైఖరికి ఇదొక ప్రయోగశాల వంటిదని అనుకొనే వాళ్లం. ఇరవై ఏళ్లకు పైగా చెంచుల మధ్యనే జీవించిన మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి మాధవ్ , 1992 నుంచి చెంచుల్లో బతికిన ఈ జిల్లాకే చెందిన శేషప్రసాద్, కర్నూలు జిల్లాలో పని చేసిన లింగమూర్తి లాంటి నాయకుల ఆధ్వర్యంలో సాగిన ఈ ప్రయోగం అర్థాంతరంగా ముగిసి పోవడం మన సామాజిక అధ్యయనాలకు, పరిశోధనలకు పెద్ద వెలితి.
మావోయిస్టు ఉద్యమానికి జరిగిన నష్టం కంటే ఇది చాలా తీవ్రమైనదని గమనించాలి.

ప్రభుత్వం ఇంతటితో సరిపెట్టుకోలేదు. నల్లమలకూ చెంచులకూ ఉన్న సంబంధాన్ని తెంచివేయాలని చూసింది. 2004 ఎన్నికల సమయంలో పాతిక వేల మంది చెంచులను, కృష్ణా..గోదావరి జిల్లాల నుంచి దశాబ్దాల కిందట వచ్చి కృష్ణా నదీ తీరంలో బతుకుతున్నవి మత్స్యకారులను అడవినుంచి బైటికి తరలించారు. ఇది చెంచుల జీవితంలో చాలా విపత్కర పరిణామాలకు దారి తీసింది. ఈ దుర్మార్గాన్ని వైఎస్ ప్రభుత్వం ఇంకా ముందుకు తీసుకపోయి నక్సలైట్ల ఏరివేతకు అనుబంధంగా అడవి నుండి చెంచులను పునరావాసం పేరుతో మైదాన ప్రాంతాలకు తరలించే పనికి పూనుకున్నది. ఆ సమయంలో పత్రికల్లో ఒక వార్త వచ్చింది. నల్లమలలోని సహజ సంపదను కొల్లగొట్టే ప్రయత్నంలో భాగంగా సర్వేలు జరుగుతున్నాయని, చెంచుల తరలింపు వెనుక ఈ వ్యూహం ఉన్నదని పత్రికల్లో రాశారు. పునరావాసం పేరిట ముఖ్యంగా పాలమూరు జిల్లా అప్పాపూర్‌కు తరలించిన చెంచుల్లో చాలా మంది తిండిలేక, రోగాలబారిన పడి అకాల మరణాలపాలయ్యారు. ప్రభుత్వలెక్కలప్రకారం 43 వేల దాకా ఉన్న చెంచు జనాభా క్రమంగా తగ్గిపోవడం వాస్తవం . ప్రభుత్వ అభివృద్ధి విధానాలే దీనికి కారణం. నల్లమలలో ఏఏ గూడెం ఎక్కడుండేదీ, ఏ గూడెంలో, ఏ పెంటలో ఎంత మంది ఉండేది నాలుక మీదే ఉండే మావోయిస్టు మాధవ్ అసలు ప్రభుత్వ లెక్కలను ఆ రోజుల్లోనే కొట్టిపడేసేవాడు. ఈ పునరావాసంతో చెంచుల సంఖ్యను మరింత పడిపోయే ప్రమాదమున్నది.

సుమారు పదేళ్లుగా నల్లమలలో ప్రభుత్వం చేసిన హింసాకాండకు ఒక విషాదకరమైన వ్యక్తీకరణే కుడుముల ఎర్రక్కపై అత్యాచారం. అందుకే కేసు తాలూకు వాస్తవాలను మాత్రమే చెప్పి సరిపెట్టుకోలేకపోయాం. ఈ విస్తృత దృశ్యాన్ని మీ ముందుంచాల్సి వచ్చింది. ఈ కేసులో మేం నిరపరాధులమని చెప్పి కేవలం మేమూ న్యాయపరిభాషకు పరిమితం కాదలుచుకోలేదు. ఇదొక లోతయిన సామాజిక భాషలో చర్చించుకోవడం అవసరం. అందుకోసమే ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక కేసు మోపిన మేము ఇలాంటి విషయాల్లో మా అభిప్రాయాలను, విశ్వాసాలను చెప్పడానికి మేం గౌరవించే విప్లవోద్యమ అనుభవాలను కాస్త ఎక్కువగానే ప్రస్తావించవలసి వచ్చింది. మెరుపు మెరిస్తే, వాన కురిస్తే అది తమ కోసమే అని కూడా అనుకోలేని చెంచుల కేసుల్లో న్యాయస్థానం వారికిన్యాయం చేయడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుందేమో అనే ఆశతో కూడా ఇదంతా రాస్తున్నాం.

(పాణి, పిన్నిక శ్రీనివాస్ అక్టోబర్ 2009, 5వ తేది ఒంగోలు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక న్యాయస్థానంలో యిచ్చిన స్టేట్ మెంట్)

**వ్యాసం** ◆ **పాణి**

# వైయస్ జిల్లా పేరు వెనుక...

'చనిపోయిన వాడి కళ్లు చారెడు' అనే సామెత వైఎస్ రాజశేఖరరెడ్డి విషయంలో ప్రచారమైనంత మరెప్పుడూ కాలేదు. ఆయన హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయి కారణజన్ముడయ్యాడు. ఇది సంస్కృతికి తారసిల్లిన అతిపెద్ద ప్రమాదం. దీన్ని విడమర్చి చెప్పేలోగా ప్రభుత్వం కడపజిల్లాను ఆయన పేరుమీద మార్చేస్తూ నిర్ణయం తీసేసుకున్నది. విమానాశ్రయాలకు, సంక్షేమ పథకాలకు సమయానుకూలంగా పేర్లు మార్చడం ప్రభుత్వాలకు అలవాటే. ఎప్పుడు దేనికి ఏ పేరు పెడితే ఏం లాభిస్తుందో ప్రభుత్వాలకు బాగా తెలుసు. రాజకీయాలతో సంబంధంలేని ఉత్తి సెంటిమెంట్ కాదిది. కొత్త పేర్ల వల్ల కొత్త లాభాలను ఆర్జించేందుకే ఈ పని చేస్తుంటారు.

ఆ లాభాల్లో వాటాలేని ప్రతిపక్షాలు ఈ పనిని విమర్శిస్తుంటాయి. కానీ కడపజిల్లా పేరు మార్పు మీద ఎవ్వరూ నోరెత్తి మాట్లాడకపోవడం విచిత్రం. రాజశేఖరరెడ్డి బతికి ఉన్నంతకాలం ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడాలంటే ప్రత్యర్థులకు భయం కలిగేది. కడపజిల్లాలో, పులివెందులలో అదెంత నిజమో లెక్కలేనన్ని ఉదంతాలు చెప్పవచ్చు. కానీ ఆయన చనిపోయి విగ్రహంగా మారాక రాష్ట్రమంతా భక్తి వ్యాపించింది. భయం వల్ల ఒక రకంగా నష్టం జరిగితే భక్తితో ఇంకోరకంగా నష్టం జరుగుతోంది. ఇప్పుడు భక్తి రాజకీయపార్టీలను, ప్రజలను లొంగదీసుకుంటున్నది. జిల్లా పేరు మార్పిడి పట్ల తెలుగుదేశం, వామపక్షాల నంగివంగి మాటలే దీనికి నిదర్శనం. వైఎస్ అంటే మాకు చాలా గౌరవం.... అని జిల్లా తెలుగుదేశం నేతలు అంటే, వైఎస్ కడప అని పెడితే అభ్యంతరమేమీ లేదని వామపక్షాలు అంటున్నాయి. మామూలుగా అన్ని విషయాల్లో ప్రజాతంత్రవాదులుగా కనిపించే వాళ్లకు యిది పట్టనేలేదు. ప్రొద్దుటూరులో పుట్టపర్తి నారాయణాచార్యుల విగ్రహాన్ని తొలగించినప్పుడు నిరసించిన వాళ్ళెవరికీ ఇప్పుడు చీమకుట్టినట్టు కూడా అనిపించడం లేదు.

మనుషులు దేవుళ్లు కావడం ఫ్యూడల్ సమాజంలో సహజమేగాని రాజకీయాలనే కాక జిల్లాలో ప్రజాజీవితాన్నీ నేరమయం చేసిన ముఠానాయకుడు సైతం దేవుడైపోయాడు. కడప అనే పేరు తిరుపతి కొండకు దేవుని గడప కావడం వల్లే వచ్చిందని గొప్పగా చెప్పుకొనే చరిత్ర కూడా ఈ దేవుని వల్ల గల్లంతయిపోతున్నది. కడప అనేది కేవలం ఒకానొక పేరు మాత్రమే కాదు. భౌగోళిక విశేషం . పాలకులు చరిత్రనూ, భూగోళాన్నీ తుడిచేసే పనికి పూనుకున్నారు. దీని మీద పాలక రాజకీయపార్టీల మౌనాన్ని అర్థం చేసుకోవచ్చు. సాధారణ ప్రజల మౌనాంగీకారాన్ని క్షమించవచ్చు. కాని ఎందుకిలా జరుగుతుందో వివరించుకోవాలి.

ఈ మధ్యే కడపజిల్లా ద్విశత వార్షికోత్సవాలు ఆర్భాటంగా జరిగాయి. వైఎస్ ముఖ్యమంత్రి కాకుంటే అట్లా జరిగేవా? అనే విమర్శ బైటి ప్రాంతాల్లో వచ్చింది. పనిలోపనిగా కడపజిల్లా గొప్ప పెంచడానికి అధికారులు, కొందరు పెద్ద మనుషులు పోతన కడపజిల్లా వాడనే సాహిత్య, చారిత్రక వివాదం లేవదీశారు. అప్పటికే తెలంగాణ నీళ్ళు పోతిరెడ్డిపాడు ద్వారా కడపకు తరలించుకుపోతున్నారని ఆందోళన చేస్తున్న తెలంగాణ వాదులకు సహజంగానే ఇది ఆగ్రహం తెప్పించింది.

కడపజిల్లా వాళ్ళు పోతనను ఎందుకు తమవాడిగా చెప్పుకోదలిచారు? చరిత్ర ఒప్పదని తెలిసినా పోతన ద్వారా కలిగే గుర్తింపు కడపకు కావాలనే తహతహ తప్ప మరేమీలేదు. దీనికి చరిత్రతో పనిలేదు. ఆధారాల అవసరమే లేదు. చారిత్రక , సాంస్కృతిక గుర్తింపు కోసం దొడ్డిదోవలో ఆరాటపడ్డ వాళ్లకి ఇప్పుడు జిల్లా గుర్తింపు వైఎస్ పేరు మీదికి మారిపోతుంటే మాత్రం ఏ బాధా లేదు. అందుకే చరిత్ర, సంస్కృతి, గుర్తింపు అనే ప్రజా సంబంధమైన కోణాల్లోనే వైఎస్ పేరు పెట్టడాన్ని నిరసించాలి. ఆయన ముఠానాయకుడు, హత్యలు చేయించిన వాడు, ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేసినవాడు అనే విమర్శ మాత్రమే సరిపోదు. రాజకీయాలంటే ఇవన్నీ చేయడమే అనే అంగీకారంతోనే ఈ నాయకులను భరిస్తున్న సమాజం మనది.

చరిత్రలో కడప అనే పేరు ఎప్పుడు ఎలా వచ్చిందో పరిశోధకులకు వదిలేసినా కడపజిల్లాగా 200 ఏళ్ల గుర్తింపు ఉన్నమాటయితే నిజంగదా. బళ్ళారి సరిహద్దుల నుండి ఇప్పటి అనంతపూర్, చిత్తూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో చాలా ప్రాంతాలు ఒకప్పుడు కడపజిల్లాలో భాగమే. యిదంతా కేవలం భూభాగం విస్తీర్ణమే సూచించదు. వలస పాలన ప్రారంభమై కడప జిల్లా ఏర్పడ్డానికి పూర్వం స్థానిక సమాజంలోని వైవిధ్యమంతా కడప అన పేరులోని అస్తిత్వం వెనుక దాగి ఉన్నది. రాజకీయార్థిక పాలనా సాంస్కృతిక విశేషాల్లోని ప్రత్యేకత్వం ఉన్నది. వెనుకబాటుతనం, ఫ్యాక్షనిజం అనే వెనుకబాటుతనాలు. కరువనే ప్రబల సమస్య ఉన్నప్పటికీ గొప్పగా, గర్వంగా చెప్పుకొనే సామాజిక సాంస్కృతిక చరిత్ర కడపకున్నాయి. భూస్వామ్యానికి, వలసపాలనకు, బ్రాహ్మణీయ సంస్కృతికి వ్యతిరేకంగా పెల్లుబికిన ఆలోచనలు, ఉద్యమ వారవడులు ఉన్నాయి. సంస్కృతీ సాహిత్యాల్లో శాసనబొట్లలో కడప పేరుతో ప్రాధాన్యం చెంద చారిత్రక విశేషాలుఅనేకం ఉన్నాయి. ఇవేవీ సెంటిమెంట్లు కావు. ఇప్పుడు వైఎస్ జిల్లాగా మార్చినంత మాత్రాన అడుగంటి పోయేవీకాదు. కానీ ఈ విస్తృతమైన స్థానీయ గుర్తింపుకు వైఎస్ అనే వ్యక్తి పేరు సరిసమానం అవుతుందా? వైఎస్ జిల్లాగా మార్చడం గిట్టనివాళ్ళు ఒక ఫ్యాక్షనిస్టు గుర్తింపు మాత్రమే అందులో ఉందని నిరసిస్తే, గిట్టినవాళ్లు అయిదేళ్ళు పవి చేసిన ఒక ముఖ్యమంత్రి గుర్తింపు గురించే చెప్పగలరు. అంతకంటే ఏం చెప్పగలరు? వైఎస్ మంచి చెడ్డల ప్రాతిపదికల మీద దీన్ని ఆలోచించవచ్చుగాని అంతకంటే లోతైన సమస్య ఇది.వైఎస్ చెడ్డ గురించి కడపలోనైనా రాష్ట్రంలోనైనా కొత్తగా చెప్పవలసిందేమీ లేదు. ఆయన ముఖ్యమంత్రి కావడానికి చేసినవీ, ముఖ్యమంత్రిగా చేసినవీ ఆ స్థానంలో ఉన్నవాళ్లందరూ చేసినవే. బహుశా వైఎస్ ఇంకా చాలా ఎక్కువ చేసి ఉంటాడు.

నిజానికిప్పుడు పరిస్థితి ఎలా దాపురించిందంటే ఫలానా రాజకీయ నాయకుడుగాని, ఫలానా వ్యవస్థగాని ప్రజలకు ఏం నష్టం చేసింది అని చర్చించడం చాలా తేలిక వ్యవహారమైపోయింది, పెద్దగా అవసరంలేని విషయమైపోయింది. ఆ వ్యక్తిగాని, ఆ వ్యవస్థగాని ప్రజలకు చేసిన చేస్తున్న 'మంచి' చాలా ప్రమాదకరంగా తయారైపోయింది. అదే వివరించలేని విషయంగా, వివరించి ఒప్పించలేని విషయంగా మారిపోయింది.వ్యవస్థలో ఉండే 'మంచి' వ్యవస్థను కాపాడటానికి ప్రయత్నిస్తుంటుంది కాబట్టి అది విమర్శనీయమని సరళంగా ప్రారంభించి- ముగించడానికి వీల్లేని స్థితి ఇది. కేవలం ప్రజలకు నచ్చచెప్పడంలో, విమర్శా పద్ధతిలోని ఎత్తుగడల సమస్యగా చూస్తే ఎన్నటికీ దీన్ని ఛేదించలేం. బహుశా ఆధునిక రాజ్యం చాలా నైపుణ్యంగా విస్తరించి, అశేష పీడిత ప్రజలను తన కైనాగం కిందికి తీసుకొని పోయే దాని పనితీరు మనకు అర్థం కాలెదని ఒప్పుకున్నట్టవుతుంది. అదొక ఓటమిగా మారి ముందుకు పోవడానికి అవరోధమవుతుంది. వైఎస్ మీది భ్రాంతిని వివరించడం తెలంకెగాన వైఎస్ నమూనాను వివరించడం కష్టం.వైఎస్ పేరుతో జిల్లా పేరు మార్చేస్తామని ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం వెనుక ఇది గొప్ప బలంగా పనిచేసింది. వైఎస్ పేరుమీద జిల్లాను మార్చేస్తే అభ్యంతరం ఎందుకు వస్తుంది? ఇది చేయవలసిన పనే అని ప్రభుత్వం అనుకోడానికి అదే కారణం. పాలకులు ఏ పనైనా అట్లాగే చేస్తారుగాని అట్లా చేయడానికి ప్రత్యేకంగా కారణమైనవాటిని ప్రత్యేకంగానే చూడాలి. ఇక్కడ ప్రభుత్వం అనుకున్నట్టు జిల్లాలోగాని, రాష్ట్రంలోగాని ఏమాత్రం అభ్యంతరం రాకపోవడం గమనించాల్సిన విషయం.

చంద్రబాబు కూడా రెండుసార్లు ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయ్యాడుగాని వైఎస్ లాంటి జనరంజకనాయకుడిగా పేరు తెచ్చుకోలేకపోయాడు. చంద్రబాబుకు మధ్యతరగతిలో, మీడియాలో గొప్ప ఇమేజ్ ఉన్నదని, అది అమెరికా దాకా పాకిందని అప్పట్లో అనుకొనే వాళ్లం.దీని మీద బోలెడు ఆసక్తికరమైన విశ్లేషణలు వచ్చాయి. ఇప్పుడు వైఎస్ దాన్ని మించి పోయాడు. మమూలుగానైతే పాలకవర్గాల్లో ఈ తేడా గురించి మనకు అనవసరం. కానీ తెలుగు సమాజం వైఎస్‌ను స్వీకరించిన తీరే వేరు. అది వైఎస్ పంచెకట్టు నుండో, అమ్మా..అన్నా అనే ఫ్యూడల్ పలకరింపుల నుంచో, హావభావాల నుంచో వచ్చాయనుకోవడం కొంచెం మాత్రమే నిజం .పాలక వర్గం ఈ సమాజాన్ని తాననుకున్నట్లు తీర్చిదిద్దే ప్రక్రియలో చంద్రబాబు కంటే వైఎస్ చాలా తాజా కృషి చేశాడు. వైఎస్‌ను తెలుగు సమాజం స్వీకరించినతీరు అంటే తెలుగు సమాజాన్ని వైఎస్ తీర్చిదిద్దిన తీరు అనే అంతరార్థం కూడా అందులో ఉన్నది.

వైఎస్ పేరును ఒక జిల్లాకు పెట్టాలనే ఆలోచన రావడం, దాన్ని ఏ రకంగానూ చర్చించనవసరం లేకుండా నిర్ణయం ప్రకటించడం వెనుక ప్రభుత్వాన్ని నడిపిన శక్తి ఇదే. ఇది ఈ ఒక్క విషయంలోనే బైటపడలేదు. సమాజమంతా అనేక రూపాల్లో పరివ్యాప్తమై ఉన్నది. వైఎస్ అనే వ్యక్తి రూపంలోని ఈ వ్యవహారాన్నంతా బూర్జువా రాజ్యానికి అన్వయించుకొని ఎలా చూడాలి ? అనేదే మనకు మిగిలిపోయిన ప్రశ్న.

అదలా ఉంచి, ఇప్పటికైతే కడప జిల్లా పేరు దగ్గరికి వస్తే ఆయనకు ఆ అర్హత ఉన్నదా? అని చాలా మామూలు ప్రశ్న వేయాల్సి ఉన్నది. ఆయన ఏవేవో పథకాలు ప్రవేశపెట్టి జిల్లాకు, రాష్ట్రానికి చాలా చేశాడని అంటారు. వాదన కోసం ఇవన్నీ నిజమనే అనుకుందాం. అయినంత మాత్రాన కడప చుట్టూ ఉన్న చారిత్రక, సాంస్కృతిక గుర్తింపుకు వైఎస్ సరితూగగలడా? ద్విశత వార్షికోత్సవాల్లో చాటుకున్న గొప్పల్లో ప్రజానుకూలమైన ఏ ఒక్క గుర్తింపుకు వైఎస్ వ్యక్తిత్వం సరిపోలుతుందా?

నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు పేరు మీదికి మార్చడం పోటీ తేవచ్చు. పొట్టిశ్రీరాములకు వైఎస్‌కు పోలికేముంది? శ్రీరాములును తెలంగాణ వాళ్లు ఒప్పుకోకపోవచ్చుగాని తెలుగువారికి ఒక రాష్ట్రం కావాలన్న ఆయన ప్రాణత్యాగంలో నెల్లూరి ప్రజల ఆకాంక్ష కూడా ఉన్నది. ఉమ్మడి రాష్ట్రం నుండి బైటికి వచ్చిన తెలుగువారి చరిత్రలో ఆయనకు చోటు ఉన్నది. ఏఏ సామాజిక వర్గాల ఒత్తిళ్ల వల్ల నెల్లూరు జిల్లా పేరు మారిందనేది వేరే విషయం. పొట్టి శ్రీరాములను ఎంత విమర్శనాత్మకంగా చూచినా ఆయన దరిదాపులోకి కూడా వైఎస్ రాలేడు.

ప్రభుత్వం, రాజకీయ పార్టీలు సరే ఇంతకూ ప్రజలు దీని గురించి ఏమనుకుంటున్నారు? అనేది ముఖ్యం. వైఎస్ మరణం మీద మిగతా ప్రాంతాలకంటే సహజంగానే కడపజిల్లాలో ఎక్కువ ప్రతిస్పందన వచ్చింది. ఇన్నేళ్లపాటు నేరమయ రాజకీయాలు నడిపిన వ్యక్తి వల్ల ఎవరికైనా కష్టం, నష్టం కలగాలి గదా. వాళ్ళ అసమ్మతి బయట పడాలిగదా? అనుకోవచ్చు. కడప జిల్లాలో అలాంటివేమీ కనిపించవు. అందుకే వైఎస్ మరణం పట్ల కడపజిల్లా ఎక్కువ శోకించడం టీవీల్లో, పత్రికల్లో కనిపించింది.ఇప్పుడు జిల్లా పేరు మార్చేస్తే హర్షాతిరేకాలే ఉన్నాయిగాని అసమ్మతి ఉండదు. ఉన్నా బైటికి రాదు.

ఇదే వైఎస్ తరహా రాజకీయ తంత్రం. రాజారెడ్డి హయాం నుండి వైఎస్ కుటుంబం బలమైన శక్తిగా ఎదిగే క్రమంలో అసమ్మతి పూర్తిగా తుడిచిపెట్టుకపోయింది. ఉన్నా అణిగిమణిగి ఉంటుంది. వైఎస్ తన ఫ్యాక్షనిజాన్ని ప్రజల మధ్య, ప్రజలతో శక్తివంతంగా నిర్వహించాడు. మూకుమ్మడి సమ్మతి కూడగట్టుకోవడంలో వైఎస్ ఆరితేరిన రాజకీయవేత్త. దాన్ని భయంతో ఎలా సాధించాలో బాగా తెలుసు. భయాన్ని ఒక స్థాయికి తీసికెళ్ళాక ఫ్యూడల్ దాతృత్వం, ఉదార స్వభావం మంత్రంలా పనిచేస్తాయి. తర్వాత్తర్వాత రాయలసీమ ఫ్యాక్షనిస్టులందరూ ఆచరించిన ఈ సూత్రాన్ని వైఎస్ పూర్తిస్థాయిలో అమలు చేశాడు. అందుకే ఫ్యాక్షనిజంలోని అన్ని పోకడలతో సహా ఇదీ కడప నమూనాగా పేరు మోసింది. వైఎస్ స్టైల్ రాయలసీమ ఇతర జిల్లాల కాంగ్రెస్ ఫ్యాక్షనిస్టుల్లో చాలా ఆదరణ పొందింది.

వైఎస్ ఫ్యాక్షనిజానికి ఫ్యూడల్ విలువలు మాత్రమే ఆసరా కాలేదు. బూర్జువా పద్ధతులను సైతం ఆయన ఆశ్రయించినందు వల్ల నికార్సయిన ఆధునిక ఫ్యాక్షనిస్టుకు మంచి నమూనా అయ్యాడు. ఆయన మరణానంత స్పందన కేవలం మరణించిన తీరు వల్ల వచ్చిందేకాదు. ఫ్యూడల్ ఆరాధన వల్ల పెట్టుబికిందే కాదు. అవీ ఉండవచ్చుకానీ ఆయనకు ముఖ్యమంత్రి పీఠం మీద మనసు పుట్టాక తండ్రి నుంచి సంక్రమించిన పాత ఫ్యూడల్ పద్ధతుల్లో వీలైనన్ని, అవసరమైనన్ని వదిలించుకున్నాడు. భయపెట్టి సాధించుకునే దానికి తోడు సమ్మతి పొందడానికి కావలసిన కొత్త పద్ధతులు ఆశ్రయించాడు. ఎందుకంటే రాజశేఖరరెడ్డి కోరుకున్న, ఆయనకు అంది వచ్చిన ఆదాయ మార్గాలు కొత్తవి. ఆయన కావాలనుకున్న అధికార రూపమూ కొత్తదే. అందు వల్ల వైఎస్‌కు ఫ్యూడల్ ఉదారానికి తోడు బూర్జువా పద్ధతులూ అవసరమయ్యాయి. అందువల్ల వైఎస్ పరిణామం ఒక వ్యక్తిలోనిది కాదు. వ్యక్తిగా వైఎస్ ఏమిటి ? అనే విషయం ఎవరికి తెలిసినా తెలియకపోయినా కడప జిల్లా ప్రజలకు మాత్రం బాగా తెలుసు. వాళ్లు బైటికి చెప్పకపోయినా వారి మనోప్రపంచంలో భాగమై సామాజిక చరిత్రలో నిక్షిప్తమైన వాస్తవమది. అందు వల్ల కూడా వైఎస్ పరిణామం సీమ సామాజిక వ్యవస్థల్లో వచ్చిన పరిణామంగా, మొత్తంగా మన బూర్జువా వ్యవస్థ పనితీరులో వచ్చిన మార్పుగా చూస్తే గాని వైఎస్ అనే నమూనాకు ఉన్న పునాది అర్థం కాదు. రాయలసీమ నుంచి ఎందరో విద్యాధికులు, పండితులు పైకెదిగి ప్రముఖులయ్యారు. నిజానికి వారెవరూ సీమ సామాజిక వ్యవస్థలకు ప్రతినిధులు కారు. రాయలసీమ నేపథ్యం వల్ల వాళ్ల పరిణామంలో తక్కువే. కాకపోతే రాయలసీమలోని ఆధునికత క్రమాన్ని, అందులోని ప్రత్యేకత్వాన్ని వాళ్లలో చూడవచ్చు. అది పూర్తిగా వేరే చర్చ. వారితో పోల్చితే వైఎస్ రాయలసీమ సమాజ పరిణామానికి ప్రతినిధి. ఆయన అక్కడి నుండి మన రాష్ట్ర పాలక వర్గాలు తెలుగు సమాజాన్ని తీర్చిదిద్దుతున్న తీరుకు మంచి బూర్జువావర్గ ప్రతినిధిగా ఎదిగాడు.

ఈ పులివెందుల రాజకీయాలకు ముఖ్యమంత్రి పదవి దక్కడంతో కడప జిల్లాలో వైఎస్ ఫ్యాక్షన్ వల్ల లబ్ధిపొందే వాళ్ల సంఖ్య బాగా పెరిగింది. అవి పాత కాలపు ప్రయోజనాలకంటే భిన్నమైనవి. అసలు ప్రజలను లబ్ధిదారులుగా మార్చే చంద్రబాబు విధానాలను వైఎస్ చాలా ముందుకు తీసికెళ్లాడు. గాలి జనార్ధనరెడ్డి లాంటి వాళ్లు లబ్ధిపొందడం కన్నా యిది సమాజానికి చాలా చెరుపు చేసింది. మారుమూల ప్రజలందరూ రాజ్యం సంబంధంలోకి వెళ్లి రాజ్యం యిచ్చేవాటి కోసం క్యూ కట్టడం అన్నమాట. అవన్నీ ప్రజలకు అవసరమైనవే కావచ్చు. మేలు చేసేవే కావచ్చు. ప్రజలు అనే భావన స్థానంలో లబ్ధిదారులు అనే భావన తేవడంలో ఆధునిక రాజ్యం గొప్ప విజయం సాధించింది. వైఎస్ విజయ పరంపరగా, ఆయన చుట్టూ తిరిగే కాంతి వలయం సారాంశమిది. మామూలుగా ఆధునిక రాజ్యానికి వ్యక్తిని గుర్తించడం అనే సుగుణం ఉన్నది. అది వ్యక్తికి కొన్ని హక్కులు అందించింది. ఓటు హక్కు యిచ్చి ప్రజలను ఓటర్లుగా మార్చుకున్నది. సంక్షేమ రాజ్య భావన ద్వారా లబ్ధిదారులను చేసుకున్నది. ఇవన్నీ చరిత్రలో పురోగామి అంశాలే. ప్రజా పోరాటాల వల్ల అమల్లోకి వచ్చినవే. కానీ ఇప్పుడు ప్రజలు ఓటర్లుగా, లబ్ధిదారులుగా మాత్రమే మిగిలిపోయారు. రకరకాల కార్డుల ద్వారా లబ్ధిపొందడానికి ప్రజలుపడే యాతన అంతా ఇంతా కాదు.

తెలుగు ప్రజలందరినీ లబ్ధిదారులుగా మార్చివేసిన ఘనత నిస్సందేహంగా వైఎస్‌దే. అది ప్రజల రోజువారీ జీవన తలానికి సంబంధించిన సమస్యగానే మిగిలిపోదు. ఆలోచనల్లో, విలువల్లో మార్పు తీసుకొని వస్తుంది. మూడు దశాబ్దాల పైబడిన పులివెందుల ఫ్యాక్షన్ రాజకీయాలకు, అందులో

నవల సీరియల్ ◆ పాణి

# గుమ్మెటమోత

(5)

(గత సంచిక తరువాయి....)

ఊళ్లు తరలిపోతున్నాయి.

అనేకదారులు ఉండే ఊరిప్పుడు వలుదారుల గుండా మాయమవుతున్నది. కొందరు కర్నూలుకు, నందికొట్కూరుకు, ఆత్మకూరుకు వెళ్లిపోతున్నారు. మరికొందరు కొత్త ఊళ్లకు చేరుకున్నారు.

జంబులు ఉన్మత్త హృదయ సంచారి వలె ఆబగా పల్లెలన్నీ తిరుగుతున్నాడు. మశమ్మను పిల్లలను వదిలేసి ఊళ్ల దారులన్నీ తొక్కుతున్నాడు. వందల ఏళ్ళ జీవితం గల పల్లెలు మౌనంగా చిన్నపాటి కల్లోలంతో వెళ్లిపోతున్నాయి. ప్రతి ఊళ్లో మాదిగపేట నుండి అయ్యగారి దాకా ఎవరెవరు ఎట్లా, ఎక్కడికి వెళ్లిపోతున్నదీ తెలుసుకుంటున్నాడు.

రంగారెడ్డి అప్పుడప్పుడే చేతికి అందిస్తున్న కొడుకు దగ్గరికి కర్నూలుకు రడీ అయ్యాడు.

"ఒరే జంబులా! యిట్లాంటి దినమొగటి వస్తుందని కలగంటిమా ఏమి? మంచులు ఎట్లయిపోయినారురా? చేనుకెంతిస్తరు, చెట్టుకెంతిస్తరు? యిండ్లకేసిన గరండాలకెంతిస్తరని లెక్కలేస్తా ఉంటే కడుపులో దేనినట్లయితుండది. ఒక్కోదానిలో యిన్ని దుడ్లుండాయని యాపొద్దయినా అనుకొంటిమా? ఊరు గంగపాలయి మంచిని డబ్బుతో ముంచినట్టుండాదిరా య్వారం...." అని ఒకటే ఎదారు పడ్డాడు.

జంబులు అంతా విన్నాడేగాని ఒక్కమాటనలేదు

మాదిగ్గేర్లో కూడా ముసలోల్లు యిట్లా మాట్లాడుకోవడం విన్నాడు. 'నియ్యక్క.... యిల్లూ వాకిలీ పోతాయని , సేను సెలకపోతాయని తెలుసుగాని ఊర్లకే ఊర్లే పోతాయని ఎప్పుడన్నా వింటిమా? ఊరు లేకుండపోవడమేంది? ఎంత నచ్చచెప్పుకున్నా మింగుడు పడటం లా....' ఉండూరు గంగలో మునిగిపోతున్నప్పుడు కొత్త ఊరికోసం దారులు వెతుక్కుంటున్న తీరు చూస్తుంటే జంబులు కెక్కడో తానే ఒక పోలిక అనిపించింది.

అంతలోనే 'వాల్లకేమి? రయితులు! యాడున్నా మారాజులే....' అని సర్ది చెప్పుకున్నాడు.

ఊర్లు మునిగిపోతాయన్న తొలిరోజుల్లో జంబులు ఒక భయద సన్నివేశాన్ని ఊహించాడు. తాను చెప్పే కథల్లోని విలయాన్నీ, జల ప్రళయాన్నీ తలపోసుకొనేవాడు. ఊర్లు మునగడం గురించి ఆయన ఊహించగల పోలికలు అలాంటివే. మనుషులు అనుభవించేదంతా అనుభవించాక, చేతికి వచ్చిందంతా మంచో చెడ్డో చేశాక, కాలం పెట్టే పరీక్షలకు ఓడీ, గెలిచీ కడాకు ఏమయిందీ అర్థంగాకపోయాక, మనిషి యిక తనకు తానే బరువైపోయాక...నిట్టనిలువునా లోకమంతా మునిగిపోతుంది. అట్లా మునిగి పోవడం అనేది మనిషికి మొదలు, చివర ఉండే ఘట్టాలు. ఆ తర్వాత యిక ఏమీ ఉండదు. ఏమీ మిగలదు అని మాత్రమే అనుకోగలడు. 'మల్లీ ఊర్లు కట్టిస్తారట' అనే మాటను జంబులు బొత్తిగా విశ్వసించలేదు. అది చెయ్యరని కాదు, చెయ్యలేరని అనుకొనేవాడు. ఇళ్లు కడతారు. గుళ్లు కడతారు, కానీ ఊరికి ఊరు కట్టమేంది? అయ్యేదా పొయ్యేదా? ఊరు ఏర్పడుతుంది కాని కట్టడమేమిటి? అనే సందేహం ఆయన్ను వెన్నాడింది.

జంబులు ఊహకు భిన్నంగా ఊర్లు ఖాళీ అవుతున్నాయి, కొత్త ఊళ్లు కడుతున్నారు.

ఊరూరూ తిరుగుతుంటే జంబులుకు తన కథా స్థావరాలు తలపుకొచ్చాయి. తానెక్కడ నిలబడి కథ చెప్పిందీ తడిమి తడిమి చూసుకొనేవాడు. తన కథలోకి, గానంలోకి ప్రవహించిన పరిసరాలను కడచూపు వలె చూచి దుఃఖితుడయ్యేవాడు. ఇవన్నీ మునిగిపోవడమంటే తన కథలకు, పాటలకు తరతరాలుగా ఉండిన ఆలంబన తుడిచిపెట్టుకపోవడమనే భావన కలిగేది. ఇవన్నీ పోయాక కథలు ఎట్లా ఉంటాయి? కథల్లోని స్థలాలు, మనుషులు, మాటలు ఎట్లా నిలిచి ఉంటాయి? ఒక్కసారి గొంతు సవరించుకొని తంబుర ఎత్తుకున్నాడంటే తనలోకి, తన కథలోకి దూసుకెళ్లి గొంతులోంచి వ్యక్తమయ్యే వాటి గురించి తెలిసినంతగా, ఆయనకీ నిర్మూలన తెలియడం లేదు. దాని గురించిన వగపు తప్ప అదెవ్వరికీ చెప్పలేకపోతున్నాడు. మాటలకు కొదువలేని మనిషికిప్పుడు మాటలు కరువయ్యాయి. ఈ వ్యథ లోపలి సంగతిగానే మిగిలిపోతున్నది తప్ప బైటికి చెప్పజాలకున్నాడు. ఎవరికీ పంచలేక పోతున్నాడు.

'ఒరే జంబులా! యిళ్లూ ఊళ్లూ కొట్టుకపోయి పెండ్లాం బిడ్డలతోని మేమే దేశం బట్టిపోతా ఉంటే నువ్వొచ్చినా వేందిరా! ఇట్లాంటప్పుడు నీకత యాడింటమబ్బా! నీకేంపెడతం చెప్పు!' అని కొందరు అసాములన్నారు.

జంబులకుకు ఏమనాలో తోచు బడికాలేదు.

ఒకటా రెండా?

ఏటికీవల్ల ఎన్ని పల్లెలు! తానిక్కడ కథల్లో, పాటల్లో కళ్లు తెరుచుకున్నాడు.వాటితోనే ఈ ప్రాంతం తనలో భాగమైపోయింది. కథలతో లోకం గురించి తెలుసుకున్నాడు. తానెరిగిన లోకమిదే! ఊళ్లిట్లా లేకుండా కథ చెప్పడం అయ్యేదేనా? కడ చూపుకు వచ్చినట్టుంది. ఇప్పుడీ ఊళ్లు పోవడం , ఊళ్లతోపాటు యింకా అనేకం తుడిచిపెట్టుకపోవడం తన పాలిట శాపం వలె భావించాడు. తన శరీరంలోని ఒక ముఖ్యమైన భాగం విడిపోతున్నట్టనిపించింది. యక్షులు, కింపురుషులు శాపమిస్తే, నిండు ఇల్లాలు కోపిస్తే - కన్నీరు కారిస్తే వల్లకాడైపోయిన ఊళ్ల గురించి కథల్లో చెప్పాడు. ఊరు కళకళలాడేదని తాను చెప్పే ఊళ్లివే. సంసారాలు చల్లగుండేవని తాను చెప్పే సంసారాలివే. చెరువులు నిండాయని, వాగులు వంకలు పారాయని,

---

వచ్చిన మార్పులకు ఈ లబ్ధిదారుల సూత్రం తోడైంది. రకరకాల పథకాలకు ఆవల వైఎస్ తన వర్గానికి, ఆ వర్గాన్ని పెంచుకోడానికి చిన్నా చితక సాయాలు బాగానే చేసి ఉండొచ్చు. అందుకే జిల్లాలో ఎవర్ని కదిలించినా ఆయన వల్ల మేలు జరిగిందని చెప్తుంటారు. అట్లా మేలు పొందిన వాళ్ల ప్రశంసలు మిగితా వాళ్ల మీద వేసే ప్రభావం అంతా ఇంత కాదు. అందుకే మొదట్లోనే అన్నది- ఈ 'మంచి' గురించి మాట్లాడటం చాలా కష్టమని. వైఎస్ సెజ్‌ల పేరుతో వేల ఎకరాలు పెట్టుబడిదారులకు అప్పగించి ఉండొచ్చు. దీని వల్ల లక్షల మంది నిర్వాసితులై ఉండొచ్చు. వందలాది మందిని ఎన్‌కౌంటర్ల పేరుతో చంపేసి ఉండొచ్చు. ఇలాంటి చెడు ఎంత జరిగినా ఆయన చేసిన 'మంచి'ముందు అంతా బలాదూరే అయినది.

ఆ మంచి రాయలసీమ వ్యాపార ముఠానాయకులుకు ఆదర్శ ప్రాయమైనది. మొత్తంగా మన బూర్జువా వర్గానికి నమూనా అయినది.అట్లాంటి ఒక నమూనాను తయారుచేసుకొనే స్థాయికి మన బూర్జువా వ్యవస్థ ఎదిగింది. అదీ తెలుగు సమాజంలో యింకా భూస్వామ్య సంస్కృతి ప్రబలంగా మిగిలి ఉన్న రాయలసీమ నుండి అలాంటి నాయకుని తయారు చేసుకున్నది. అదీ దాని శక్తి సామర్థ్యాలు, దానిలోని క్లిష్టత. లేకుంటే బాగా అభివృద్ధి పొందిన కోస్తా ప్రాంతం నుండి ఇలాంటి నాయకుడు వచ్చి ఉంటే మన బూర్జువా వ్యవస్థ దాని సంక్లిష్ట స్వభావాన్ని వెల్లడి చేసుకొని ఉండేది కాదు. రాయలసీమ నుండి తన తాజా ప్రతినిధిని తయారు చేసుకోవడమే దాని విశేష లక్షణం.

❖

తిరనాళ్లు జరిగాయని తాను చెప్పిన పల్లెలన్నీ యివే. ఈ ఊర్లు యిట్లా ఉన్నాయి కాబట్టే తానట్లా వర్ణించి చెప్పాడు. మాట తప్పితే, ధర్మాన్ని కాలదంతే ఇళ్లలో జిల్లెళ్లు పూశాయని చెప్పాడుగాని అట్లాంటి ఇళ్లను, ఊర్లను కళ్లతో చూసిందైతే లేదు. ఇప్పుడిట్లా చూడాల్సి వస్తున్నది.

'ఊరు పొమ్మందని చెప్పుకుంటాంగాని ఊరేపోవడమేంది రెడ్డీ....!' అని రంగారెడ్డితో అన్నాడు - ఉండబట్టలేక.

'లెక్క నాయాల.... నీకు నేను చెప్పాల్నారా....' అన్నాడు ఏమనాలో తెలియక రంగారెడ్డి.

ఒక క్షణమాగి ఆయనే....!

'మంచులు చేసే మాయరా ఇది. నీకూ నాకూ దేవుడే మాయచేస్తాడని తెలుసు. ఇది మనిషి చేస్తున్న మాయరా... మనిషి మాయ...' గేనికో ఆయన గొంతు బొంగురు పోయింది. వారం దినాల నుండి రంగారెడ్డి కొడుకు విశ్వనాథరెడ్డి వచ్చి ఊళ్లోనే ఉంటున్నాడు. ఊర్లో పొలాలకు, కళ్లాలకు, యిళ్లకు ఆయన లెక్కలు వేయించడంలో ముమ్మరంగా ఉన్నాడు. కర్నూల్లో ఒక కాలు, ఊర్లో ఒక కాలు పెట్టి తిరుగుతున్నాడు. సొంతానిదే కాదు, ఇప్పుడాయన ఊళ్ళో చాలా మందివి లెక్కలు వేయించే పనిలో ఉన్నాడు.నేల గుణాన్నిబట్టి ఎకరాకి ఇంత అని, నాణ్యాన్నిబట్టి యింటికింత అని లెక్కలు వేస్తున్నారు. ఎప్పుడూ ఇంటి నిండా జనమే. లాయరు కావడాన ఆఫీసర్లు ఊరు మొత్తం గురించి ఆయనతోనే మాట్లాడుతున్నారు. రంగారెడ్డి కూడా ఆ పనుల్లో కొంచెం తలదూర్చాడు. కొడుకు ఊర్లో లేనప్పుడు జనాలు ఆయనతోనే మాట్లాడేది. ఊరికి ప్రభుత్వానికి మధ్య కొడుకుంటే, కొడుక్కి ఊరికి నడుమ తానున్నాడు.

ఆయనకు బెంగ కూడా ఉన్నది.

జంబులు వచ్చి కదిలిస్తే తన్నుకొచ్చింది. 'హారే జంబులా! మీ వోల్లంతా యాడికి పోయినార్రా...' అని మాట మార్చాడు.

'మాకేమి సామీ... యాడ ముద్ద దొరికితే ఆడికి పోతాం....' అన్నాడు బింకంగా.

ఇప్పుడాయన బాధ ముద్ద గురించి కాదు
బువ్వ ఎక్కడ దొరికితే అక్కడికి పోవాలనీ లేదు. కానీ ముద్ద మీద నెపం పెట్టాడు.

రంగారెడ్డి అర్థం చేసుకున్నాడు.

'నువు గూడ పోక, నీకీ తనకలాట ఎందుకురా?' అన్నాడు.

కూచున్న చోటి నుండి జంబులు చివాలున లేచాడు. రంగారెడ్డి మాటతో కోపించి, కించపడి లేయలేదు. ఆ సంగతి రంగారెడ్డికే తెలుస్తున్నది. జంబులు కథ చెప్పడానికిగాని. పొద్దటి పూట పస్సం అనుపానానికిగాని వచ్చినప్పుడుగాని కళ్లల్లో తేలయాడే తేటదనం యిప్పుడు కనిపించడం లేదు. అదంతా కరిగిపోయినట్టుంది. సగమై పోయిన ఊరివలె ఉన్నాడిప్పుడు జంబులు. వారం దినాల కిందే మాదిగ్గేరి ఖాళీ అయిందని తెలిసి చూసొద్దామని వెళ్లాడు రంగారెడ్డి మనుషులుండగా ఏనాడూ ఆ వైపు పోలేదు. వాళ్ళకేమైనా పాలమా పుత్రా.

'మాదిగనాయాల్లు ముందే దుస బీకినారు....' అని ఎవరో అంటే తెలిసింది.

ఆ రోజు సంచెపూట చేనుమీదికె పెల్లి కందిదోవ గుండా తిరిగి వస్తూ మాదిగ్గేరిలోకి వెళ్లాడు.

జంబులు కనుచూపు ఇప్పుడావీధివలె ఉన్నది.

రంగారెడ్డికి అది స్ఫురించి కలుక్కుమన్నది.

మనుషులున్నప్పుడు, సంసారాలున్నప్పుడు మాదిగ్గేరి ఎలా ఉండేదో రంగారెడ్డికి తెలియదు. కానీ ఇప్పుడు నిర్జనంగా, నిర్జీవంగా ఉన్నది. రంగారెడ్డికి చూడగానే భయం కలిగింది. ఆందోళన కలిగింది. అరే... ఏంది యిట్లయిపాయె. రేప్పొద్దున ఊరంతా ఇట్లేగదా. నీళ్లొచ్చేదంక ఇట్లా ఉండి...ఉండి కడాకు నీళ్లలో మునిగిపోతుంది గదా.... అనిపించింది. అప్పటి నుండి మనిషి మనిషిలో లేడు. ఇప్పుడు జంబులను చూడగానే మళ్లీ అదే మాదిగ్గేరి గుర్తుకొచ్చింది.

'ఒరే... అందరం తాత ముత్తాతల్నుంచి ఒకే తాన బతికినోల్లం గదా. కొట్టుకున్నామో, తిట్లుకున్నామో ఒగతల్లి పిల్లలెక్క బతికినాం. యింగ రేపట్నుంచి ఎవరిదావ వాల్లదే గదా. మల్లా ఒకరికొకరు కనిపిస్తరో లేదో....' అన్నాడు రంగారెడ్డి.

జంబులు నిలబడ్డచోట నిలబడలేకపోయాడు. ఇద్దరి మనఃస్థితి ఒక్కటైపోయింది. పరస్పరం బరువు పెంచింది. డెబ్బై ఎకరాల ఆసామికి, జోలెపట్టుకొని ఊర్లు తిరిగే వాడికి ఆ క్షణాన మాత్రం ఒక విషాదం, నిర్వేదం ఉమ్మడి ఉద్వేగమైంది.

అంతే, జంబులు చిరచిర వసార మెట్లు దిగి ఎదురుగ ఉండే కోమటిగేరిలో పడి అయ్యగారిండ్ల మీది నుండి చేలదోవ పట్టాడు.

ఆయన రంగారెడ్డి దగ్గరికి ఒక చిన్న ఓదార్పు కోసం వెళ్లాడు. కానీ అంతులేని భారాన్ని గుండెలపై మోపుకున్నట్లయింది. దాన్ని బాపుకోడానికా అన్నట్లు కాళ్లలో సత్తువ కొద్దీ నడుస్తున్నాడు.

ఆ నడక... లోన పోటెత్తే ఆలోచనలకంటే , వ్యథా సాగర కల్లోలాల కంటే వేగంగా సాగాలనే ఆదిమ సమరకాంక్షలా జంబులులో వ్యక్తమవుతున్నది.

ఎప్పటి నుండో ముంపు గురించి మాట్లాడుకున్నా ఇప్పుడా సన్నివేశం నలుదెశలా అలుముకున్నది. అందుకే జంబులుకు తనది కడచూపు అనే భావన కలిగింది. అది అతలాకుతలం చేస్తున్నది. నదికి ఈ వైపున మరి కనిపించవని చెప్పుకుంటున్న పల్లెలన్నీ కలియతిరుగుతున్నాడు. అంతకముందే, ఏటవతలికి వెళ్లి వచ్చాడు. మశమ్మ, పిల్లలు ఈ వైపే ఉన్నారు. ఇప్పుడు మశమ్మకు చంకలోకి పిల్ల వచ్చింది. కొడుకులిద్దరు పెద్దవాళ్ళవుతున్నాడు. రేపోమాపో ఊళ్లు పోతాయి. పొలాలు నీటి గర్భానికి అట్టడుగు తలమవుతుంది. దాంతో మళ్లీ జంబులు పూర్వస్థితికి చేరుకున్నాడు. యిప్పటికే ఒకసారి ఏటవతల పల్లెలు తిరిగి వచ్చాడు. నది దాటుతున్నప్పుడు జంబులు ఎన్నడూ లేని విధంగా భయకంపితుడయ్యాడు. పుట్టి బుద్ధి ఎరిగినప్పటి నుండి నదిని ఎన్ని వందలసార్లు దాటాడో! నేల మీద ఒకదారి నుండి మరోదారిలోకి మళ్లినంత సులువుగా భూమి మీది నుండి నదిపై పుట్టిలో దాటి ఉంటాడు. ఎర్రమటం, చిన్న గుమ్మడాపురం, పెద్ద గుమ్మడాపురం మొదలైన పల్లెల మీద పాలమూరులోని సోమేశ్వరానికి రాకపోకలుండేవి. నదికి ఈ వైపు సిద్దేశ్వరం, కపిలేశ్వరం, సంగమేశ్వరం ఆవైపు సోమేశ్వరం, మల్లేశ్వరం... జంబులు గుమ్మెట తాంబూరలతో పెళ్లాం పిల్లలతో తానే పుట్టి వేసుకొని అటు ఇటూ దాటి ఉంటాడో!

నది ఎన్నడూ ప్రశాంత చిత్తంతో కనిపించేది. నది దాటడం దినచర్యవలె ఉండేది. కానీ నదిపై కడుతున్న ప్రాజెక్టు ఊళ్లను ముంచెత్త బోతోందని తెలిశాక నది జంబులుకు ప్రమాద సంకేతమైంది. నది దాటుతూ సగంలోకి వచ్చాక తల తిప్పి చూస్తే నీలి సాగరం వలె నది పైకి ఉబికి వచ్చి ముంచేస్తుందేమో అనే భయం కలిగింది. నదీ గర్భంలోకి జారిపోతున్నట్టనిపించింది. చల్లని తల్లివలె భావించిన నది ఉన్మత్తశక్తిగా కబళించి వేస్తుందనిపించింది. యిక నది దాటడం ఇదే కడసారి కావచ్చు.

దాటడానికి నది నదివలె మిగిలి ఉండాలి గదా, ఈ దిక్కున నది దాటే స్థావరాలుంటాయా? అయినా నది దాటుకొని వెళ్లి అవతల ఏం చూడాలని? అక్కడ ఏం మిగిలి ఉంటుందని? తుపాకి రాముడు తిరిగే పల్లెలన్నీ నీట మునిగిపోతాయి. వాడు ఏమైపోతాడు? వాడి చతుర్లు వినగలిగే వారెవరైనా ఉంటే గదా వాడి కడుపు నిండటానికి.

నది వెంటాడి తరిమినట్లు ఊర్లోకి వచ్చిన జంబులు తిరిగి అట్లే వెనుదిరిగిపోతున్నాడు. అప్పుడు పుట్టి దిగాక తాను చూడాల్సిన ఊరొకటి గమ్యంగా ఉండి ఇటుపడి వచ్చాడు. కానీ రంగారెడ్డితో ఏదో వెంటాడుతున్నట్లే నడుస్తున్నాడు.

❖ ❖ ❖

జంబులుకు ఆ రోజులు ఎన్నటికీ స్మృతి నుండి ఆవిరి కాలేదు. ఒకవైపు ఊర్లకు ఊర్లు మాయమైపోవడం.... యింకోపక్క ఒక్కొక్కరు ఒక్కరీతిలో తమను తాము పెకలించుకొని బైటపడి చెల్లాచెదరైపోవడం.... జంబులు ప్రత్యక్షసాక్షి. ఆ రోజుల్లో జంబులు తాంబూర మీటింది లేదు. గొంతెత్తి గానం చేసింది లేదు. తాను చెప్పే కథలు, పాడే పాటలు మనసు పొరలోకి జారిపోయినట్టు, వాటిపై మరేదో మోయలేని భారం వచ్చిపడ్డట్లు అనిపించేది.

మశమ్మను, పిల్లలను తీసుకొని ఊరూరు తిరుగుతూ జూపాడుబంగ్లాకు వచ్చి చేరాడు. ఏటికి అటు ఇటూ తోచిన చోటల్లా తిరిగాక ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలి? అనే ప్రశ్న ఎదురైంది. ఏ ఊరైతేనేమి? అనుకున్నాడు గాని ఇప్పుడు ఎక్కడికి పోవాలి? జంబులు ఒక్కడే కాదు. ఎక్కడెక్కడో కలుస్తూ, విడిపోతూ కలిసిన చోట గుడారాలు వేసుకొనే తోటి వాళ్ళందరికీ అదే ప్రశ్న. బంగ్లాకు పెళ్లాం పిల్లలతో జంబులు చేరుకున్నాడు. ఊరిబైట చేలగట్ల మీద కెసి కెనాలు పక్కన గుడారాలు వేసుకున్నారు. ఆ తర్వాత మెల్లగా మరికొన్ని కుటుంబాలు కలిశాయి.

జంబులు - మశమ్మ ముద్ద తినడానికి వెరచిన కాలమది. ఈ పూట దొరికింది ఇప్పుడే తింటే రేపొద్దున పిల్లల కెట్లా? అనే దిగులు. మునిగిపోతున్న ఊర్ల నుండి రకరకాల యాచకులందరూ బైటి పల్లెలను ఆశ్రయించారు. యాచన లేదు. చేసినా జోలె నిండదు. పాటలు లేవు, పనుల్లేవు....

జంబులుకు ఒక్కసారిగా తన పాటల నుండి, గుమ్మెట తంబూర సవ్వడి నుండి మరో కొత్త లోకానికి జారిపోయినట్టనిపించింది. ఎక్కడికి పోయినా 'జంబులా.... ఎన్ని దినాలకొస్తివి.... రేత్రికి కత చెప్పరాదూ' అనే వాళ్లెవరూ తారసపడలేదు. 'యాడికి పాయినవురా.... ఈ నడమ కనబడ్డం లేదే... పెండ్లాం పిల్లలు బాగుండరా' అని మందలించే తెలిసిన ముఖాలు లేవు.

ఈ ఊర్లకు ఈ ఊర్లు ఎంతదూరం? పక్కనే. కానీ జంబులికిది కొత్త లోకం.ఇక్కడ తన పాటలు తెలిసిన మనుషులు లేరని మెల్లగా తెలియసాగింది. అరెరె..ఇన్ని దినాలు జంజులుగాడేంది..ఈ చుట్టుపక్కల నాలుగు పరగణాల్లో నా అంతటోడు ఎవడున్నడు? జంబులగానిలెక్క కత చెప్పే మొనగాడు యాడున్నాడు? జంబులు పాట కోసరం, కత కోసరం జనాలు కాచుకోని ఉంటారు....అని ఎంతగా అనుకునేవాడు!

జంబులుకిప్పుడు తను గురించి తానే మనుకుంటుండేదీ స్ఫురణకు వస్తేచాలు విచారం, అవమానం కలగలసి దాడి చేస్తున్నాయి. అదంతా ఉత్తదేనన్నమాట..తన గురించి ఎవరైనా ఇట్లా అంటే తానూ అదే నిజమనుకున్నాడో, లేక తానే ఇట్లా అనుకొని దాన్నే నిజమని నమ్ముతూ వచ్చాడోగాని ఇప్పుడు తను పరాయిసీమలో పరాయి బతుకు బతుకుతున్నానని మాత్రం అనిపించసాగింది. తన పాట మీద గురి ఉన్న జనంతో బతకలేకపోవడం కన్నా వెలితి ఏముంటుంది?

ఇది తన ప్రపంచం కాదనుకోవడానికి జంబులుకు మొదటిసారిగా తాను పాడితే ఇక్కడి జనాలు వింటారా? తన కతలు వీళ్ల మనసుకు చేరుతాయా? అనే సందేహమే కారణమైంది. ఆయన ఇన్నేళ్లలో ఎన్నడూ గురి కాని మనఃస్థితి ఇది. ఊర్లు మునుగుతాయని తెలిసినప్పటి నుండి స్పష్టాస్పష్టంగా కలిగిన భయాలన్నీ ఇప్పుడు ఒక్కొక్కటి నిజమే అని ఇప్పుడు తేలుతున్నది.

మశమ్మకూ అది ఎరుకవుతున్నది.

'ఇందుకా ఈ మంచి అంత ఎదారుపన్నది?' అనుకున్నది. ఒకనాడు ఎందుకోమరి 'ఊర్లో తిరిగిరాపో...' అన్నాడు. మశమ్మ అలవాటు కొద్దీ గుమ్మెట తీసుకోబోయి కూడా వెనక్కి తగ్గింది. అందువల్ల ఇప్పుడామెకు భర్త మనోవ్యథ పొరలు విచ్చుకుంటున్నాయి.

అప్పటికి పెద్దోడికి పద్నాలుగేళ్లు దాటాయి. నీళ్ల ఎక్కడుంటే అక్కడికి తమ్ముణ్ణి వెంటేసుకొని చేపలకు, యండ్రకాయలకు పొయివస్తున్నాడు. నలుగురితో కలిసి తుప్పల్లోకి వెళ్లి వలవేసి కుందేళ్లు పట్టుకొస్తున్నాడు.

ఎదిగే పిల్లల్ను చూస్తే కడుపు నిండుతున్నది. నిజానికి జంబులుకిప్పుడు అదొక లోపలి శక్తి. కానీ రానురానూ కొడుకులకు విద్య రావడం లేదే అనే దిగులు మొదలైంది జంబులుకు. ఎందుకిట్లయిందో తెలియడం లేదు.

ఆ వయసుకల్లా తాను బాలనాగమ్మకత, చెంచులక్ష్మి కత చెప్పేవాడు. తండ్రి వీపెంట తిరుగుతూ ఉంటే అవే వచ్చేశాయి. రెండేళ్ల కిందటి దాకా 'తన కతలు పిల్లోల్లకు రాకుండా యాడికి పోతాయి' అనుకున్నాడు. ఇప్పుడు తానే గొంతెత్తడం లేదు. సర్వేంద్రియాలు అల్లల్లాడేటట్లు లోపలి శక్తినంతా ఒక్కచోటికి చేర్చి మేఘాలు ఉరిమినట్లు, పిడుగులు రాలినట్లు, గాలి వీచినట్లు... తెరలు తెరలుగా కథ చెప్పక నోటి నిండా పాడక ఎన్ని దినాలాయె. మనిషంటే నెత్తురు మాంసమేగదా? ఆ రెండూ ఉండే మనిషిలో సకల ఉత్సాహాలు, ఉద్వేగాలు, రోషాలు, సంతృప్తులు కలగడానికి పాటలో పదాలో పాడాలి, చెవులారా వినాలి. ఇవి రెండూ లేకుండా మనిషి యాడి నుండి వస్తాడు? పాడకుండ కూడా ఇట్లా బతకవచ్చని ఎన్నడూ అనుకోలేదు. దానెమ్మ... పెండ్లాం గుమ్మెట కొట్టి ఉరికిస్తాండేది.... దాన్నందుకోవాలని తను, తననందుకోవాలని అదీ ఒక్కో చోట చెమట్లు పట్టేవి.... ప్చ్.... ఆ రోజులు మల్లా వస్తయా? నా కతే ఇట్లుంటే యింగ పొట్టిగాల్లు కత చెప్పడం లేదని ఎదారుపడ్డం దేనికి?' అని సర్ది చెప్పుకుంటాడు. కానీ అది తీరేది కాదు. సెగ మాదిరి లోపల కాల్చుకతినేది.

కానీ జంబులు పిల్లల్ను ఏనాడూ కూచోబెట్టి కత చెప్పలేదు. తాంబూర యిట్ల పట్టుకోవాలి, యిట్ల రాగందీసి పాడాలి అని చెప్పలేదు. అట్లా చెప్పాలనీ ఆయనకు తెలియదు. తాను నేర్చుకుంటేగదా నేర్పించడానికి? నేర్చుకోవడం - నేర్పించడం గురించి తెలియని సహజమానవుని తీరని కోర్కె అది.

తండ్రి కూడా అంతే. ఏపొద్దూ కూచోబెట్టి పదం చెప్పలేదు.

తన కళ్ళెదుటే పాటలు పాడకుండా, కథలు చెప్పకుండా పెరిగి పెద్దవాళ్ళవుతున్న కొడుకుల్ని చూసి జంబులుకు విచారపడటం, విస్మయపోవడం మాత్రమే మిగిలింది.

బంగ్లలో ఒక్కోసారి గుడారాలు పెరిగేవి. ఎక్కడి వాళ్లటు వెళ్లిపోతే రెండో మూడో మిగిలేవి. జంబులు మాత్రం గుడారం ఎత్తలేదు. ఏడాదిపాటు అక్కడే ఉన్నారు.

ఆ తర్వాత కోడుమూరు చేరుకున్నారు. అక్కడ పది గుడారాలున్నాయి. తిండికి కొదువలేదు. కానీ కత చెప్పమనే వాళ్లు అక్కడా లేరు. జంబులు కదే పెద్ద దిగులు. గుట్టల్లోకి వేటకు పోతే కుందేళ్లు, జంగిపిల్లులు బాగా దొరికేవి. పిల్లల్లు వేటలో ఆరితేరారు. చేపలకు పోతే గుడారాల్లో అందరికి సరిపోయినన్ని తెచ్చేవాళ్లు.

మశమ్మకి కూడా బాగానే ఉంది.

జంబులకు చిన్నోడి దిగులు పట్టుకుంది.

పెద్దోడికి పాటలు రాకపోతేమాయె..చేతనైన పని చేస్తున్నాడు. కానీ చిన్నోడే అంకెకురావడం లేదు.

'ఈడెక్కన్నాకొడుకే...! ఒకమాటినడు, లెక్కాశారం మీద ఉండడు. దినాం ఏదో ఒక పీకులాట....' అని బెంగటిల్లేవాడు.

'వాడెట్లపోతే నీకెందుకంట? కాల్లల్లో తిరిగే పిల్లోడా ఏమి? నీ అంతయినాడు. అందరు నీ లెక్క ఉండాలంటే యాడుంటారు' అని మశమ్మ మొగుని మీదకి లేచేది.

'నియ్యమ్మ.... నువ్వే సూడి... ఆ నాకొడుకును ఎగదోసేది. కులం తలం లేకుండా ఎట్టికి తిరిగితే సూస్తా ఊకుంటారా. పెద్ద మంచులంటే లెక్క జమా ల్యాకపాయె....' అని అంతకంటే పెద్దగా అరుస్తాడు.

'పోన్లే సామీ! వాడి దావన వాన్ని. నువ్వుగిన అన్నింటికి ఇట్ల చేసినావంటే

కొట్టుకొనేదాంక పోతది.... అదే నా బయ్యం...' అని మొగిన్ని బెదిరిస్తూ, నచ్చ చెబుతూ ఆమె చేసే ప్రయత్నాలన్నీ అప్పటికి సర్దుబాటే గాని తండ్రీ కొడుకుల మధ్య రాజుకుంటూనే ఉండేది.

జంబులుకు చిన్న కొడుకు బిచ్చావతి పెద్ద సవాలయ్యాడు.

'గిమ గిమ.... ఈ నాకొడుకు అర్తంగాడే....' అని పదేపదే తన నిస్సహాయతను తలచుకొనేవాడు. నిస్సహాయతలోని వ్యథ ఆయన్ను వెంటాడుతూనే ఉండేది. కొడుక్కి కులం పట్ల, కులాచారాల పట్ల గౌరవం లేదని తెలిసి వచ్చే కొద్దీ ఆయనలోని బాధ భయంగా పరిణమించింది.

జంబులుకు అదొక వైపరీత్యమనిపించేది. ఊహించని వైపు నుండి ఉపద్రవం వచ్చిపడ్డట్లు విలవిల్లాడేవాడు. నలుగురేమను కుంటారు? యితరుల ఫిర్యాదులకేం చెప్పాలి? అనే వెరపు కాదు. ఆయనకే ఆ పోకడ గిట్టలేదు. అసలా తీరు ఏమిటి? అనే ప్రశ్నలు ఆయన్ను భయకుహరంలోకి తీసివేసేవి.

తండ్రీ కొడుకులకు పొసిగే మాట ఒక్కటి కూడా లేకుండా పోయింది. దాన్ని అంగీకరించి మౌనంగా ఉండటం జంబులుకు వల్ల కాలేదు. తన నిమిత్తం లేకుండానే నిరసన, అసమ్మతి వ్యక్తమయ్యేవి. భార్య సర్దుబాట్లు ఏవీ పనిచేసేవి కావు.

బిచ్చావతికి ఇరవై ఏళ్ల దాటాయి.

కులవిద్య రాలేదనేగాని జంబులుకు పెద్దోడు ఆసరా అయ్యాడు, వాడి గురించి నిశ్చింతే. వేటకు పోయిరావడమేగాక కోడుమూరులో ఈడు పిల్లలతో కలసి పాత గుడ్డల వ్యాపారం అలవాటు చేసుకున్నాడు. తెల్లారి చేస్తే గుడారాల్లో ఉండేది తక్కువే. ఊర్లోకి పోయేవాడు. కులస్తులతో కలసి చుట్టుపక్కల పల్లెలు తిరిగేవాడు. ఇతర కులాల వాళ్లతో నేస్తం కడుతున్నాడు. కర్నూలుకు పోయిరావడం అలవాటయింది.

మశమ్మకు యిది సంతోషాన్నిచ్చింది.

'ఇద్దరు పొట్టెగాల్లుంటే ఒక్కడు గూడ తాంబురపట్టకపాయె....' అని జంబులు విచారపడ్డప్పుడు మశమ్మ కొంచెం తీవ్రస్వరంతో ఎత్తుకొనేది.

'తాంబూర పట్టుకొంటే బువ్వ దొరికే తట్టుండదా? అబ్బకు అమ్మకు ముద్దపెట్టలేని విద్దెలు ఎందుకంట? అనేది.

ఆ మాట జంబులుకు వాడిగా తగులుతుంది.

'తానిప్పుడు ఒకరి ముద్ద కోసం ఎదురు చూస్తున్నాననేగదా దీని అర్థం? యిది యాడిదనక పోయింది...' అనుకునేవాడు.

నిజమే.... ఈ నడమ పెద్దోడు అవీ ఇవీ చేసి నాలుగు రూపాయలు తీసుకవస్తున్నాడు. తెల్లారి లేచి గుమ్మెట తాంబూర తీసుకొని ఊర్లోకి పోతే పొద్దున మధ్యాహ్నానికి సరిపడ బువ్వ దొరకడం గగనమైపోయింది. పెద్దోడు పని చెయ్యకపోతే కడుపు నిండేది కష్టమే.

జంబులుకు ఇది తెలుస్తునే ఉన్నది.

కానీ అంతటితో సరిపెట్టుకోలేదు.

నిజమేగదా అని నిజాన్ని స్వీకరించలేదు.

'అంటే... ఏందేనువ్వనేది...? నా పాటలు కతలు బువ్వ పెట్టనీక పనికిరావనా?' అని ఎదురాడుతాడు.

ఆ మాట బింకంగా అంటున్నాడని మశమ్మకు తెలుస్తూనే ఉంటుంది. అంతకు మించి లోతయిన గాయం నుండి అంటున్నాడని కూడా తెలుస్తుంటుంది.

జంబులు స్వరంలో అప్పుడు ఓటమి పాలవుతూ కూడా జయధ్వానం చేయాలనే ఆరాటం వినిపించేది.

కానీ ఆయన అశక్తత తెలియవచ్చేది.

సరిగ్గా ఈ సమయంలోనే బిజినవేముల వెళ్లడానికి నాలుగు కుటుంబాలు ప్రయాణమై కోడుమూరు గుడారాలు చేరుకున్నాయి.

బంగ్లా వదిలేసి వచ్చాక జంబులుకు మళ్లీ తన పూర్వ స్థావరం గురించిన వార్తలు తెలియడం యిదే. ముంపులో బిజినవేముల కూడా పోయింది. ఆ ఊరి నుండి ఎటు వెళ్లేవాళ్లు అటు పోయాక మిగిలిన వాళ్లు నందికొట్కూరు పక్కన గడ్డకు ఊరు పొందించుకున్నారు.

కులం వాళ్లు ఆ పక్కనే గుడారులు వేసుకున్నారు.

ఇప్పుడక్కడకు వెళ్లాలని మనసులాగుతోంది.

బిజినవేముల పంచాయితీలకు ప్రసిద్ధి. ఆ చుట్టుపక్కల ఒన్నటికీ తెగని పంచాయితీలు బిజినవేముల వస్తాయి. కులంకట్టుబాటు పూరా ధిక్కరించిన వాళ్ల విషయంలో, లేదా అక్కడున్న పెద్దమనుషులకు అంతుతెలియని కొట్లాటలయినా బిజినవేములకు వస్తాయి. ఊళ్లో జరిగిన పంచా యితీలో తనకు అన్యాయం జరిగిందని అనుకుంటే బిజినవేముల పెద్దమనుషుల దగ్గరకి పోవచ్చు. అక్కడ పంచాయితీ అంటే కులంలో ఇంక అన్యాయం జరిగిందని ఎవ్వరూ అనుకోరు. అక్కడ చెప్పిన తీర్పు కాదని ఎవ్వరూ గీత దాటరు. అక్కడ కులాచారాలు, కట్టుబాట్లు బాగా తెలిసి న్యాయంగా, ధర్మంగా తీర్పు చెప్తారని ప్రతీతి.

అక్కడికి పోవాలని జంబులుకు బలంగా కలిగింది.

భార్యతో ప్రయాణమయ్యాడు

పెద్దోడు మొదట ఒప్పుకోలేదు. వాళ్లతోపాటు కలిసి బయల్దేరలేదు. ఆ టయంలో బిచ్చావతి ఊళ్ళోలేడు.

జంబులికిప్పుడు మళ్లీ తన వైభవోజ్వల గతంలోకి వెళ్తున్నట్టనిపించింది. భార్యతో కలిసి వెళ్తుంటే తన స్వస్థానంలోకి అత్యంత సహజంగా వెళ్తున్నట్టనిపించింది.

కొన్ని రోజులకు పెద్దోడూ అక్కడికే వచ్చాడు. యిక్కడ చేసే పనులన్నీ అక్కడ చేస్తున్నాడు. ఇప్పుడిప్పుడే అక్కడ కొందరు బిందెల యాపారంలో దిగుతున్నారు. పెద్దోడికి అది బాగా నచ్చింది. అది కొంచెం లాభసాటిది అని తెలియవచ్చింది. నాలుగు రూపాయలు కళ్ల చూస్తున్నాడు.

'జంబులా! పొట్టెగాడు రెక్కలకడ్డం వచ్చినట్టుందే...' అని ఎవరైనా అంటే సంబరంగా ఉండేది. కానీ 'తాంబుర పట్టలేదే....' అనే కొడుతు లేకపోలేదు. అదొక వ్యథగా రగలకపోలేదు.

'మనలెక్కనే మన పిల్లోల్లు గూడ బతకాలంటే యాడైయితది సామీ.... రోజులు మారుతున్నా....?" అనేది మశమ్మ.

దానికి జంబులు ఏమనేవాడు కాదు.

కానీ తన కతలు ఏమైపోతాయి? అనే రంధి పట్టుకుంది అంతదాకా 'యాడికి పోతాయి? ఒకరు పట్టుకుంటే నిలబడి, ఒకరు కాదంటే పొయ్యేయా ఏమి?' అనే భరోసాతో ఉండేవాడు. అది సడలిపోతున్నది. తన కళ్ళెదుటే ఒక మహావెల్లువ తర్వాత రూపుదిద్దుకుంటున్న దృశ్యాన్ని చూచి ప్రేక్షకపాత్ర వహించడం జంబులుకు అనుభవంలోకి వస్తున్నది.

జంబులుకిది కొత్త ప్రపంచంలోని పురాతన మానవ సంచార మైంది. ఆ ఎరుకలేని మశమ్మకు అంతా యథాలాపమే. జరుగుతున్నది జరగవలసిందే. అసలు ఇలా జరగడం ఏమిటో, ఎందుకో ఆమె ఎన్నడూ చింతించలేదు.

జంబులు నిత్యం తాంబుర ఎత్తుకొనేవాడు.

పొద్దంతా కథ చెప్పినా చెప్పకపోయినా పెండ్లాన్ని తీసుకొని ఊరూరు తిరిగి వచ్చేవాడు. ఇంటింటి దగ్గర తనలోని శక్తులన్నీ విప్పారేలా పాడేవాడు. ఎక్కడికక్కడ చెదిరి పోతున్న వాటిని తన గాత్రంలో కూడగట్టాలనుకొనే చిట్టచివరి ఆరాటం ఆయనది. తన పాటమీద ఎనలేని గురి పెరిగింది. ఆయన వర్తమానమంతా ఆ గురిమీద ఆధారపడి మనుగడ తీస్తున్నది.

❖


నాన్‌పిక్ ను వెంటనే రద్దు చేయాలి
ప్రతి మనిషికీ
ఒకే విలువ కోసం...
మానవ హక్కుల వేదిక (HRF)
మూడవ రాష్ట్ర మహాసభలు
2-3, అక్టోబర్ 2009, అనంతపురం
జలాలను కొటాల, బెజ్జూర్, దైగ్యాం, కాగజ్‌నగర్,
మండలాల గ్రామాలకు సాగునీరు, త్రాగునీరు ఇవ్వాలి

